SUPREME AUDIT INSTITUTION OF INDIA
लोकहितार्थ सत्यनिष्ठा
Dedicated to Truth in Public Interest

# పోలవరం నీటిపారుదల ప్రాజెక్టుపై భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ పనితీరు ఆడిట్ నివేదిక

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

2025లో 4వ నివేదిక

(పనితీరు ఆడిట్ – సివిల్)

# పోలవరం నీటిపారుదల ప్రాజెక్టుపై
# భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్
# పనితీరు ఆడిట్ నివేదిక

2023 మార్చి తో ముగిసిన సంవత్సరానికి

(జల వనరుల శాఖ)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

2025లో 4వ నివేదిక

(పనితీరు ఆడిట్ – సివిల్)

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ప్రాంతం



# విషయసూచిక


| వివరం | సందర్భం | |
|---|---|---|
| | పేరా సంఖ్య | పేజీ సంఖ్య |
| **ముందుమాట** | | ix |
| **కార్య సంగ్రహము** | | xi |
| 1వ అధ్యాయం: పరిచయం | | |
| **ప్రాజెక్టు నేపథ్యం** | 1 | 1 |
| జాతీయ ప్రాజెక్టుగా ప్రకటన | 1.1 | 3 |
| సంస్థాగత ఏర్పాటు | 1.2 | 4 |
| ఆడిట్ లక్ష్యాలు | 1.3 | 5 |
| ఆడిట్ ప్రమాణాలు | 1.4 | 5 |
| ఆడిట్ పరిధి, ప్రక్రియ | 1.5 | 6 |
| కృతజ్ఞతలు | 1.6 | 7 |
| 2వ అధ్యాయం: ఆర్థిక నిర్వహణ, పర్యావరణ అంశాలు | | |
| **ఆర్థిక నిర్వహణ** | 2.1 | 9 |
| బడ్జెట్ కేటాయింపు, వ్యయం | 2.1.1 | 9 |
| బిల్లులు అపరిష్కృతంగా ఉండడం | 2.1.2 | 13 |
| ప్రాజెక్టుకు కేంద్ర సహాయం | 2.1.3 | 15 |
| పోలవరం ప్రాజెక్టు అథారిటీకి అవసరమైన పత్రాల సమర్పణలో ఆలస్యం | 2.1.3.1 | 16 |
| పెట్టుబడి అనుమతిలో ఆలస్యం | 2.1.3.2 | 17 |
| **ప్రాజెక్టు స్థితి** | 2.2 | 18 |
| సివిల్ పనుల స్థితి | 2.2.1 | 19 |
| భూసేకరణ స్థితి | 2.2.2 | 21 |
| పునరావాసం, పునరుపాధి కల్పన స్థితి | 2.2.3 | 22 |
| **పర్యావరణ అంశాలు** | 2.3 | 22 |
| పర్యావరణ & అటవీ మంత్రిత్వ శాఖ నిర్దేశించిన నిబంధనలను పాటించకపోవడం | 2.3.1 | 22 |
| పొరుగు రాష్ట్రాలలో రక్షణ కరకట్టల నిర్మాణం | 2.3.2 | 23 |
| చట్టబద్ధమైన ఆమోదం లేకుండా ఎత్తిపోతల పథకాల అమలు | 2.3.3 | 25 |
| పర్యావరణ, జీవావరణ సమతుల్యతను సంరక్షించకపోవడం | 2.3.4 | 27 |
| 3వ అధ్యాయం: హెడ్ వర్క్స్, పవర్ హౌస్ నిర్మాణం | | |
| **హెడ్ వర్క్స్ నిర్మాణం** | 3.1 | 30 |
| ప్రణాళిక ప్రక్రియ | 3.1.1 | 31 |
| ప్రాజెక్టును సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రణాళికా సాధనాలను అవలంబించకపోవడం | 3.1.1.1 | 31 |
| ప్రణాళికాబద్ధమైన నిర్మాణ షెడ్యూల్ కు కట్టుబడి ఉండకపోవడం వల్ల దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ | 3.1.1.2 | 32 |
| అధీకృత అధికారుల ముందస్తు అనుమతి లేకుండా పనులను ప్రారంభం | 3.1.1.3 | 35 |

| | | |
|---|---|---|
| ఎడమ అనుసంధానిక అమలుకు స్పష్టమైన హక్కుతో భూమిని అప్పగించకపోవడం | 3.1.1.4 | 36 |
| పనులను అప్పగించడం | 3.1.2 | 38 |
| నిపుణుల కమిటీ పరిధిలోకి రాని జాతీయ ప్రాజెక్టులో పనిని, వారి సిఫారసు మేరకు ముందస్తుగా ముగించడం | 3.1.2.1 | 38 |
| గుత్తేదారు సంస్థ ఎంపికలో ఏకపక్షం, ఫలితంగా అనుచిత ప్రయోజనం | 3.1.2.2 | 39 |
| పనుల అమలు | 3.1.3 | 43 |
| పనుల అప్పగింతలో జాప్యం | 3.1.3.1 | 44 |
| గుత్తేదారు సంస్థలకు అనుచిత ఆర్థిక సహాయం | 3.1.3.2 | 46 |
| కూలిపోయిన సొరంగం బాగుచేయడానికి చేసిన నివారించదగిన ఖర్చు | 3.1.3.3 | 50 |
| దిద్దుబాటు పనులపై నివారించదగిన ఖర్చు | 3.1.3.4 | 51 |
| నాణ్యతా నియంత్రణ | 3.1.4 | 52 |
| నాణ్యతా నియంత్రణ ధృవపత్రాల జారీ | 3.1.4.1 | 52 |
| **పవర్ హౌస్ నిర్మాణం** | 3.2 | 53 |
| మొదటి గుత్తేదారు సంస్థ ద్వారా పనుల అమలు | 3.2.1 | 55 |
| ఒప్పందంలో వడ్డీ లేని ముందస్తు చెల్లింపుకు సంబంధించిన నిబంధనను తప్పుగా చేర్చడం | 3.2.1.1 | 55 |
| తక్కువ చెల్లుబాటు వ్యవధితో బ్యాంకు పూచీకత్తులను అంగీకరించడం | 3.2.1.2 | 56 |
| చెల్లించిన వస్తు, సేవా పన్నును క్లెయిమ్ చేయడంలో జాప్యం | 3.2.1.3 | 57 |
| రెండవ గుత్తేదారు సంస్థ ద్వారా పనుల అమలు | 3.2.2 | 58 |
| వడ్డీ లేని అడ్వాన్స్ మంజూరు | 3.2.2.1 | 58 |
| ఎలక్ట్రో-మెకానికల్ భాగాల ముందస్తు కొనుగోలు | 3.2.3 | 59 |
| **4వ అధ్యాయం: కాలువల నిర్మాణం** | | |
| **పరిచయం** | 4.1 | 61 |
| **కుడి ప్రధాన కాలువ నిర్మాణం** | 4.2 | 62 |
| కుడి ప్రధాన కాలువ పనుల అమలు | 4.2.1 | 63 |
| పనులు అప్పగించిన తర్వాత కాలువ అలైనమెంట్ లో మార్పు | 4.2.1.1 | 63 |
| యూనిట్ రేటును తప్పుగా తీసుకోవడం | 4.2.1.2 | 64 |
| **ఎడమ ప్రధాన కాలువ నిర్మాణం** | 4.3 | 65 |
| ఎడమ ప్రధాన కాలువ నిర్మాణానికి ప్రణాళిక | 4.3.1 | 66 |
| సవరించిన పరిమాణాలను సరిగ్గా మదింపు చేయకపోవడం వల్ల ఆమోదం లభించక పనులు ఆగిపోవడం | 4.3.1.1 | 66 |
| భూసేకరణ, ఆర్&ఆర్ పనులు పూర్తి కాకపోవడం వల్ల కాలువ పనులు ఆగిపోవడం | 4.3.1.2 | 67 |
| పనుల అప్పగింతలో ఆలస్యంగా నిర్ణయం తీసుకోవడం | 4.3.1.3 | 68 |
| ఎడమ ప్రధాన కాలువ అమలు | 4.3.2 | 69 |
| అదనపు కట్టడాలకు తప్పుగా మంజూరు చేయడం | 4.3.2.1 | 69 |
| గుత్తేదారు సంస్థల పద్దులను పరిష్కరించకపోవడం | 4.3.2.2 | 70 |
| **కుడి, ఎడమ ప్రధాన కాలువలకు సంబంధించిన సమస్యలు** | 4.4 | 71 |
| పంపిణీ వ్యవస్థ కోసం వివరణాత్మక ప్రాజెక్టు నివేదికల తయారీలో జాప్యం | 4.4.1 | 71 |
| తవ్వితీసిన మట్టికి జవాబుదారీతనం, అమ్మకం | 4.4.2 | 71 |
| తవ్వి తీసిన మట్టిని అమ్మకపోవడం | 4.4.2.1 | 71 |
| దొంగిలించబడిన తవ్వితీసిన మట్టి | 4.4.2.2 | 72 |

| | | |
|---|---|---|
| మిగిలిన పనులు పూర్తి చేయడానికి మొదటి గుత్తేదారు సంస్థ నుంచి అదనపు వ్యయాన్ని వసూలు చేయకపోవడం | 4.4.3 | 73 |
| గృహ నిర్మాణ పథకం కోసం ప్రాజెక్టు భూమి మళ్ళింపు | 4.4.4 | 74 |
| గుత్తేదారు సంస్థల నుండి బకాయిలు వసూలు చేయకపోవడం | 4.4.5 | 75 |
| 5వ అధ్యాయం: భూసేకరణ | | |
| **పరిచయం** | 5.1 | 77 |
| భూసేకరణ ప్రక్రియ | 5.1.1 | 78 |
| భూసేకరణ స్థితి | 5.1.2 | 79 |
| **భూసేకరణకు ప్రణాళికా ప్రక్రియ** | 5.2 | 80 |
| భూసేకరణలో మందకొడి పురోగతి | 5.2.1 | 80 |
| భూమి నిర్ధారణలో నిలకడ లేకపోవడం | 5.2.2 | 82 |
| సేకరించవలసిన ప్రభుత్వ, అటవీ భూముల విస్తీర్ణం తగ్గుదల | 5.2.3 | 85 |
| భూ మదింపు సమాచారంలో వైరుధ్యం | 5.2.4 | 87 |
| ప్రిలిమినరీ నోటిఫికేషన్ ను ప్రచురించడంలోనూ, ప్రభుత్వ వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయడంలోనూ విపరీతమైన జాప్యం | 5.2.5 | 88 |
| **భూసేకరణ అవార్డుల ప్రకటన, ఆమోదం** | 5.3 | 89 |
| సరైన యాజమాన్య రికార్డులు లేకుండానే భూసేకరణ అవార్డుల ఆమోదం | 5.3.1 | 89 |
| **అవార్డు పరిహారం చెల్లింపు** | 5.4 | 90 |
| చట్టం నిబంధనలను తప్పుగా వ్యాఖ్యానించడం వల్ల అధికంగా నిర్ణయించబడిన భూ పరిహారం | 5.4.1 | 91 |
| పరిహార మొత్తాన్ని అథారిటీ ఖాతాలో జమ చేయడం | 5.4.2 | 92 |
| అథారిటీ పద్దుల రికార్డులను నిర్వహించకపోవడం | 5.4.2.1 | 92 |
| వివాదాస్పద మొత్తాలను అనర్హులైన భూ యజమానులకు చెల్లించడం | 5.4.2.2 | 93 |
| అనర్హమైన భూమికి భూసేకరణ పరిహారం చెల్లింపు | 5.4.3 | 94 |
| ఖల్సా భూమికి భూసేకరణ అవార్డు పరిహారం చెల్లింపు | 5.4.3.1 | 94 |
| అవార్డుల జారీలో జాప్యం కారణంగా నివారించదగ్గ ఆర్థిక భారం | 5.4.4 | 95 |
| వ్యవసాయ భూమితో పాటు గ్రామ కంఠం అవార్డులను ఆమోదించడంలో జాప్యం | 5.4.4.1 | 95 |
| కోర్టు కేసుల పరిష్కారం తర్వాత అవార్డుల జారీలో విపరీతమైన జాప్యం | 5.4.4.2 | 96 |
| అసైన్డ్ భూముల సేకరణలో జాప్యం | 5.4.4.3 | 98 |
| ధ్రువీకరించకుండానే భూ పరిహారం చెల్లింపు | 5.4.5 | 99 |
| క్లెయిమ్ చేయని భూమికి పరిహారం చెల్లింపు | 5.4.5.1 | 99 |
| యాజమాన్య రికార్డులు లేకుండా పరిహారం చెల్లింపు | 5.4.5.2 | 99 |
| నిర్ణీత పరిమితికి మించి 'భూమికి-భూమి' కేటాయింపులు జరిగాయి | 5.4.6 | 100 |
| 6వ అధ్యాయం: పునరావాసం, పునరుపాధి కల్పన అమలు | | |
| **పరిచయం** | 6.1 | 104 |
| పునరావాసం & పునరుపాధి కల్పన ప్రక్రియ | 6.1.1 | 104 |
| పునరావాసం & పునరుపాధి కల్పన స్థితి | 6.1.2 | 105 |
| **ప్రాజెక్టు ప్రభావిత ఆవాస ప్రాంతాలు, నిర్వాసిత కుటుంబాల గుర్తింపు** | 6.2 | 109 |
| కాంటూర్ల మధ్య ఆవాస ప్రాంతాలను తప్పుగా గుర్తించడం | 6.2.1 | 109 |
| ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల మధ్య సమాచారంలో వైరుధ్యం | 6.2.2 | 111 |

| | | |
|---|---|---|
| ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత జనాభా గణన పూర్తి చేయడంలో జాప్యం | 6.2.3 | 112 |
| ఆర్&ఆర్ పథకం అమలు, వెబ్ ఆధారిత వర్క్ ఫ్లో రూపొందించటానికి కాలపరిమితులు | 6.2.4 | 113 |
| కాలపరిమితి లేకుండా ఆర్&ఆర్ పథకాల అమలు | 6.2.4.1 | 113 |
| ఆర్&ఆర్ కార్యకలాపాల కొరకు వెబ్ ఆధారిత వర్క్ ఫ్లో రూపొందించడం | 6.2.4.2 | 114 |
| ఆర్&ఆర్ పథకంలో ప్రాథమిక సమాచారాన్ని చేర్చకపోవడం | 6.2.5 | 114 |
| **పునరావాసం & పునరుపాధి కల్పన ప్రయోజనాల అమలు** | 6.3 | 115 |
| ఆర్&ఆర్ కార్యకలాపాల కోసం భూసేకరణ | 6.3.1 | 116 |
| ఆర్&ఆర్ కాలనీల కోసం ఇంకా చేయవల్సిన భూమి సేకరణ | 6.3.1.1 | 116 |
| సాగుకు పనికిరాని భూమి సేకరణ | 6.3.1.2 | 117 |
| ఆర్&ఆర్ కాలనీలకు సౌకర్యాలు కల్పించకపోవడం | 6.3.1.3 | 118 |
| 'భూమికి-భూమి' కొరకు భూసేకరణ | 6.3.2 | 119 |
| 'భూమికి-భూమి' పథకం క్రింద భూమి కేటాయింపు | 6.3.2.1 | 120 |
| అనర్హులైన లబ్ధిదారులకు 'భూమికి-భూమి' కేటాయింపు | 6.3.2.2 | 121 |
| అనుమతించబడిన పరిమితికి మించి భూ కేటాయింపు | 6.3.2.3 | 122 |
| పునరావాసం & పునరుపాధి కల్పన నగదు ప్రయోజనాల అమలు | 6.3.3 | 123 |
| నగదు ప్రయోజనాల చెల్లింపు | 6.3.3.1 | 123 |
| ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు అదనపు ఆర్&ఆర్ ప్యాకేజీ చెల్లించకపోవడం | 6.3.3.2 | 124 |
| గృహ నిర్మాణ యూనిట్ల ఏర్పాటు | 6.3.4 | 125 |
| కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఖాళీగా ఉన్న ఇళ్ళు | 6.3.4.1 | 125 |
| అదనపు ఉమ్మడి సౌకర్యాలు కల్పించకపోవడం | 6.3.4.2 | 127 |
| ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల నిరుపయోగమైన ఖర్చు | 6.3.5 | 128 |
| **పర్యవేక్షణ యంత్రాంగం, ఇతర సమస్యలు** | 6.4 | 130 |
| ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కార్యాలయం ఏర్పాటులో జాప్యం | 6.4.1 | 130 |
| అరకొర సిబ్బందితో ఆర్&ఆర్ యూనిట్ల నిర్వహణ | 6.4.2 | 130 |
| ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి సమర్థవంతమైన యంత్రాంగం లేకపోవడం | 6.4.3 | 131 |
| ఆర్&ఆర్ కాలనీలలో సామాజిక తనిఖీలు నిర్వహించకపోవడం | 6.4.4 | 132 |
| 7వ అధ్యాయం: లబ్ధిదారులు, వసతుల సర్వే | | |
| **పరిచయం** | 7.1 | 133 |
| సమాచార సేకరణ, నమూనా | 7.1.1 | 134 |
| సర్వే విధానం, నిర్వహణ | 7.1.2 | 135 |
| **లబ్ధిదారుల సర్వే పరిశీలనలు** | 7.2 | 136 |
| భూమి అవార్డు పరిహారం | 7.2.1 | 136 |
| పునరావాసం, పునరుపాధి కల్పన నగదు పరిహారం | 7.2.2 | 137 |
| గృహ యూనిట్ల ఏర్పాటు, నిర్మాణ నాణ్యత | 7.2.3 | 138 |
| కేటాయించిన భూమి లేదా ఇంటికి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుము | 7.2.4 | 139 |
| 'భూమికి-భూమి' కేటాయింపు, నీటిపారుదల సౌకర్యాలు | 7.2.5 | 140 |
| ఫిర్యాదుల పరిష్కారం | 7.2.6 | 140 |
| షెడ్యూల్డ్ కులం, గిరిజన యువత కోసం నైపుణ్యాభివృద్ధి ప్రణాళిక | 7.2.7 | 141 |
| **వసతుల సర్వే ఫలితాలు** | 7.3 | 141 |
| తగిన రవాణా సౌకర్యంతో రహదారులను ఏర్పాటు చేయడం | 7.3.1 | 142 |

| | | |
|---|---|---|
| పిల్లలకు పాఠశాల సదుపాయం | 7.3.2 | 143 |
| పిల్లల కోసం ఆట స్థలం | 7.3.3 | 143 |
| అంగన్‌వాడీ కేంద్రం, అనుబంధ పోషక సేవల లభ్యత | 7.3.4 | 144 |
| ప్రాథమిక ఆరోగ్య, ఉప–ఆరోగ్య కేంద్రం | 7.3.5 | 144 |
| సురక్షితమైన త్రాగునీటిని అందించడం | 7.3.6 | 145 |
| మురుగునీటిపారుదల వ్యవస్థను ఏర్పాటు చేయడం | 7.3.7 | 146 |
| వ్యక్తిగత మరుగుదొడ్లకు కుళాయి కనెక్షన్లను అందించడం | 7.3.8 | 146 |
| నీటిపారుదల సౌకర్యం కల్పించడం | 7.3.9 | 147 |
| ఆర్&ఆర్ కాలనీలలో మేత కోసం భూమిని అందించడం | 7.3.10 | 147 |
| పశువులకు తాగునీటి సదుపాయం | 7.3.11 | 148 |
| పశువైద్య సేవా కేంద్ర లభ్యత | 7.3.12 | 148 |
| అటవీ హక్కులు | 7.3.13 | 148 |
| సాంప్రదాయ గిరిజన సంస్థలకు కేటాయించిన ప్రత్యేక భూమి | 7.3.14 | 149 |
| శ్మశానవాటిక లేదా దహన సంస్కార స్థలాల ఏర్పాటు | 7.3.15 | 149 |
| సామాజిక కేంద్రాల లభ్యత | 7.3.16 | 150 |
| ప్రార్థనా స్థలాలు, చౌపాల్/రచ్చబండ | 7.3.17 | 150 |
| చౌక ధరల దుకాణాల లభ్యత | 7.3.18 | 150 |
| పంచాయతీ కార్యాలయాల స్థాపన | 7.3.19 | 151 |
| తపాలా కార్యాలయాల ఏర్పాటు | 7.3.20 | 151 |
| విత్తనాలు, ఎరువులు నిల్వచేయు సౌకర్యం | 7.3.21 | 152 |
| గృహ విద్యుత్ కనెక్షన్ | 7.3.22 | 152 |
| భద్రతా ఏర్పాట్లు | 7.3.23 | 153 |
| **సర్వే పరిధిని దాటి ఇతర పరిశీలనలు** | 7.4 | 153 |
| నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా లేని అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం | 7.4.1 | 153 |
| పునరావాసం పొందిన పీడీఎఫ్‌లకు జీవనోపాధి భద్రత కల్పించడం | 7.4.2 | 154 |
| సంబంధిత స్థానిక సంస్థలకు ఆర్&ఆర్ కాలనీలను అప్పగించడం | 7.4.3 | 154 |
| **అనుబంధాలు** | | 157 |
| **పదకోశం** | | 208 |
| **సాంకేతిక పదాల పదకోశం** | | 211 |

# అనుబంధాలు


| అనుబంధం సంఖ్య | విషయం | సందర్భం | |
|---|---|---|---|
| | | పేరా సంఖ్య | పేజీ సంఖ్య |
| 1.1 | ప్రాజెక్టు ఉద్దేశ్యం, ప్రయోజనాలను చూపే పట్టిక | 1.1 | 157 |
| 1.2 | ప్రాజెక్టు యొక్క వివిధ అంశాలను చూపే పట్టిక | 1.1 | 158 |
| 2.1 (అ) | హెడ్‌వర్క్స్ అమలులో పాల్గొన్న వివిధ గుత్తేదారు సంస్థలను చూపే పట్టిక | 2.2.1 | 160 |
| 2.1 (ఆ) | కాలువల నిర్మాణంలో పాల్గొన్న వివిధ గుత్తేదారు సంస్థలను చూపే పట్టిక | 2.2.1 | 162 |
| 3.1 | చెల్లించిన ప్రత్యేక ఇంప్రెస్ట్, వసూళ్ళు, విధించాల్సిన వడ్డీ వివరాలు | 3.1.3.2 (అ) | 174 |
| 3.2 | ప్రత్యేక రివాల్వింగ్ ఫండ్ ద్వారా చెల్లించే మొత్తంపై (11 శాతం చొప్పున) వసూలు చేయాల్సిన వడ్డీ | 3.1.3.2 (ఆ) | 175 |
| 3.3 | మెస్సర్స్ ట్రాన్స్‌స్ట్రాయ్-జేఎస్‌సీ ఈసీ యూఈఎస్ (జేవీ) హైదరాబాద్ ఆస్తులు, అప్పుల వివరాలు | 3.1.3.2 (ఇ) | 176 |
| 3.4 | నిర్మాణ విభాగాల నుండి పెండింగ్‌లో ఉన్న తనిఖీ నోట్ లకు అమలు నివేదికలు | 3.1.4.1 | 176 |
| 3.5 | స్టీల్ సేకరణ కోసం మంజూరు చేసిన వడ్డీ లేని అడ్వాన్సుల మొత్తాన్ని చూపే పట్టిక | 3.2.2.1 | 178 |
| 3.6 | ఈ&ఎమ్ పరికరాలు/భాగాల కొనుగోలు తేదీ, నిర్మాణ సమయంలో వడ్డీ (ఐడీసీ) చెల్లింపు చూపే పట్టిక | 3.2.3 | 179 |
| 4.1 | ఇపీసీ మోడ్‌లో ఇవ్వబడిన ఆర్ఎమ్‌సీలోని అన్ని ప్యాకేజీల స్థితి | 4.2 | 180 |
| 4.2 | పూర్తి చేసిన మట్టి కి చెల్లింపుల శాతం వివరాలను చూపే పట్టిక | 4.2.1.1 | 181 |
| 4.3 | ఈపీసీ విధానం పై ఇవ్వబడిన ఎల్ఎమ్‌సీలోని అన్ని ప్యాకేజీల స్థితి | 4.3 | 181 |
| 4.4 | జాతీయ రహదారి క్రాసింగ్‌ల (వంతెనలు) అప్పగించడంలో ఆలస్యం కారణంగా ఖర్చు పెరుగుదల | 4.3.1.3 | 182 |
| 4.5 | ఏపీడీఎస్ఎస్ నిబంధన 60(సి) క్రింద తొలగించబడిన పనులను కొత్త గుత్తేదారు సంస్థలకు అప్పగించడం వల్ల అమలు ఖర్చులో వ్యత్యాసంగా అసలు గుత్తేదారు సంస్థల నుండి వసూలు చేయవలసిన మొత్తాలను చూపే పట్టిక | 4.4.3 | 183 |
| 4.6 | శాఖ చేయని రికవరీల వివరాలను చూపే పట్టిక | 4.4.5 | 184 |
| 5.1 | భూ సేకరణ విధానం | 5.1.1 | 184 |
| 5.2 (అ) | డబ్ల్యూఆర్‌డీ, రెవెన్యూ శాఖల ప్రకారం పట్టా భూమి విస్తీర్ణంలో వైవిధ్యాన్ని చూపే పట్టిక | 5.2.4 (i) | 186 |
| 5.2 (ఆ) | డబ్ల్యూఆర్‌డీ, రెవెన్యూ శాఖల ప్రకారం ప్రభుత్వ భూమి విస్తీర్ణంలో వ్యత్యాసాన్ని చూపే పట్టిక | 5.2.4 (ii) | 186 |
| 5.2 (ఇ) | డబ్ల్యూఆర్‌డీ, రెవెన్యూ శాఖల ప్రకారం డి-పట్టా భూమి విస్తీర్ణంలో వైవిధ్యాన్ని చూపే పట్టిక | 5.2.4 (iii) | 187 |
| 5.3 | ఎల్‌పీ షెడ్యూల్ అందిన తర్వాత ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీలో సమయ అంతరాన్ని చూపే పట్టిక | 5.2.5 (i) | 188 |

| అనుబంధం సంఖ్య | విషయం | సందర్భం | |
|---|---|---|---|
| | | పేరా సంఖ్య | పేజీ సంఖ్య |
| 5.4 | రెవెన్యూ రికార్డులలో సరైన యాజమాన్య హక్కు లేని వ్యక్తులకు భూమి అప్పగింతలను చూపే పట్టిక | 5.3.1 | 189 |
| 5.5 | సరుగుడులో లబ్ధిదారులకు అదనపు భూమికి – భూమిని ఇచ్చిన కేసులు | 5.4.6 | 191 |
| 5.6 | యర్రవరంలో లబ్ధిదారునికి అదనపు భూమికి – భూమిని ఇచ్చిన కేసులు | 5.4.6 | 191 |
| 5.7 | తెల్లదిబ్బలులో లబ్ధిదారునికి అదనపు భూమికి – భూమిని ఇచ్చిన కేసుల వివరాలు | 5.4.6 | 192 |
| 5.8 | శివగిరిలో లబ్ధిదారునికి అదనపు భూమికి – భూమిని ఇచ్చిన కేసుల వివరాలు | 5.4.6 | 193 |
| 5.9 | దండంగిలో లబ్ధిదారునికి అదనపు భూమికి – భూమిని ఇచ్చిన కేసులు | 5.4.6 | 194 |
| 6.1 | పీఎన్ ప్రచురణ తేదీ, ఎస్ఈఎస్ పూర్తి తేదీ మధ్య ఆలస్యాన్ని చూపే పట్టిక | 6.2.3 | 194 |
| 6.2 | పీడీఎఫ్‌ల నుండి పొందిన దానికంటే ఎక్కువ భూమికి – భూమిని కేటాయింపుకు సంబంధించిన కేసులు | 6.3.2.1 (i) | 195 |
| 6.3 | పీడీఎఫ్‌ల నుండి సేకరించిన భూమి కంటే తక్కువ విస్తీర్ణంలో భూమికి – భూమిని కేటాయించిన కేసులు | 6.3.2.1 (ii) | 196 |
| 6.4 | ఎల్ఏ అవార్డులలో పేర్లు లేని వ్యక్తులకు భూమికి – భూమి కేటాయింపు కేసులు | 6.3.2.2 | 197 |
| 6.5 | అనుమతించదగిన పరిమితి కంటే ఎక్కువగా భూమికి — భూమి కేటాయింపు కేసులు | 6.3.2.3 | 201 |
| 6.6 | ఆర్&ఆర్ నగదు ప్రయోజనాల చెల్లింపు లేకుండా బదిలీ చేయబడిన పీడీఎఫ్‌ల వివరాలు | 6.3.3.1 | 203 |
| 6.7 | ఆర్&ఆర్ కాలనీల నిర్మాణంలో పురోగతి | 6.3.4.1 | 204 |
| 7.1 | నమూనా ఎంపిక కోసం అనుసరించిన పద్ధతిని చూపే పట్టిక | 7.1.1 (అ) (ఆ) | 205 |
| 7.2 | ఆర్&ఆర్ కాలనీలలో అందిచాల్సిన మౌళిక సదుపాయాలు, ప్రాథమిక సౌకర్యాలను చూపే పట్టిక | 7.3 | 206 |
| 7.3 | ఆర్&ఆర్ కాలనీల నమూనా వివరాలను చూపే పట్టిక | 7.3 | 206 |
| 7.4 | ఆర్&ఆర్ కాలనీలలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం | 7.4.1 | 207 |


.

# ముందుమాట

*భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ వారి ఈ నివేదికను భారత రాజ్యాంగంలోని 151వ అధికరణాన్ని అనుసరించి రాష్ట్ర శాసనసభ ముందు ఉంచడం కోసం ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌కు సమర్పించడానికి రూపొందించడమైంది. భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ యొక్క ఆడిట్, అకౌంట్స్‌పై నిబంధనలు, 2007 (2020 ఆగస్టులో సవరించబడింది), పనితీరు ఆడిట్ మార్గదర్శకాలు, 2014 ప్రకారం ఆడిట్ నిర్వహించడమైంది.*

*ఈ నివేదికలో 2017-18 నుండి 2022-23 వరకు 'పోలవరం నీటిపారుదల వ్యవస్థ'పై పనితీరు ఆడిట్ యొక్క ముఖ్యమైన ఫలితాలను పొందుపరచడమైనది.*

*ఈ నివేదికలో ప్రస్తావించబడిన సందర్భాలు మచ్చు తనిఖీ సమయంలో దృష్టికి వచ్చిన వాటిలో ఉన్నాయి.*

*పనితీరు ఆడిట్ కోసం జలవనరుల శాఖ, ప్రాజెక్టు నిర్వాహకులు, ప్రత్యేక కలెక్టర్ (భూ సేకరణ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్, అధికారులు, సిబ్బంది అందించిన సహాయ, సహకారాలకు ఆడిట్ కృతజ్ఞతలు తెలియజేస్తోంది.*

*ఈ తెలుగు నివేదిక, మూల ఆంగ్ల నివేదికకు యదార్థ అనువాదం మాత్రమే. దీనిలో ఏవైనా సందేహాలు ఉంటే మూలాధారమైన ఆంగ్ల నివేదికను అధికారికంగా తీసుకోగలరు.*

# కార్య సంగ్రహము

## నేపథ్యం

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు గోదావరి నదిపై సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీకి 42 కి.మీ ఎగువన పోలవరం మండలం రామయ్యపేట గ్రామం సమీపంలో ఉన్న ఒక బహుళార్థసాధక ప్రాజెక్టు, ఇక్కడ నది తూర్పు కనుమల చివరి శ్రేణి నుండి ఉద్భవించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాలోని మైదానాలలోకి ప్రవేశిస్తుంది. ఇది ఒక ఆనకట్ట కట్టడం ద్వారా 2.91 లక్షల హెక్టార్లకు నీటిపారుదల సామర్థ్యాన్ని సృష్టించడానికి ఉద్దేశించబడింది. ఈ ప్రాజెక్టు 960 మెగా వాట్ల జల విద్యుత్ ఉత్పత్తి, 540 గ్రామాలలో 28.50 లక్షల జనాభాకు తాగునీటి సరఫరా, 80 శతకోటి ఘనపుటడుగుల (టీఎంసీ) నీటిని కృష్ణా నదీ పరీవాహక ప్రాంతానికి మళ్లించడానికి ఉద్దేశించబడింది. ఒక విధంగా, ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా విస్తృత శ్రేణి అభివృద్ధి కార్యకలాపాలకు నాంది పలుకుతుంది.

ప్రారంభంలో, 2004-05లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిధులతో ఈ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమైంది. తదనంతరం, 2014 లో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 లోని సెక్షన్ 90 పార్ట్ IX ప్రకారం దీనిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. ఈ చట్టం ప్రకారం ప్రాజెక్టు అమలుకు అవసరమైన పర్యావరణ, అటవీ, పునరావాసం & పునరుపాధి కల్పన నిబంధనలతో సహా అవసరమైన అన్ని అనుమతులను పొంది, ప్రాజెక్టును పూర్తి చేయాలని భారత ప్రభుత్వాన్ని నిర్దేశించింది. ఈ చట్టం ప్రకారం, భారత ప్రభుత్వం, జల వనరుల మంత్రిత్వ శాఖ లేదా జలశక్తి మంత్రిత్వ శాఖ ద్వారా పోలవరం ప్రాజెక్టు అథారిటీకి ఒక పాలక మండలిని ఏర్పాటు చేసింది. భారత ప్రభుత్వం తరపున, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని జలవనరుల శాఖ పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు అమలు చేస్తున్నది. ప్రాజెక్టు యొక్క అన్ని భాగాల సివిల్ పనుల అమలు, భూసేకరణ, పునరావాస & పునరుపాధి కల్పన కార్యకలాపాలు, జలవనరుల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే నిర్వహించబడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన బడ్జెట్ వనరుల ద్వారా చేసిన ఖర్చును భారత ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. అయితే, పోలవరం జల విద్యుచ్ఛక్తి ప్రాజెక్టు (పీహెచ్ఈపీ) ఖర్చును పూర్తిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే భరిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు అమలును, 2006 ఏప్రిల్ నుండి 2010 మార్చి వరకు నివేదించిన జలయజ్ఞం నివేదిక (2012లో 2వ నివేదిక) లో భాగంగానూ, 2012, ఏప్రిల్ నుండి 2017, మార్చి వరకు జారీ చేసిన 2017 సంవత్సరం నివేదిక (2018లో 4వ నివేదిక)లో భాగంగానూ, భారత కంప్ట్రోలర్ & ఆడిటర్ జనరల్ సమీక్షించారు. జలయజ్ఞం నివేదికను ప్రజా పద్దుల సంఘము పాక్షికంగా చర్చించింది, అయితే, ఎటువంటి సిఫార్సులు చేయలేదు. 2018లో 4వ నివేదికను ఇంకా ప్రజా పద్దుల సంఘము చర్చించాల్సి ఉంది.

ప్రస్తుత పనితీరు ఆడిట్ 2022 జూన్ నుండి 2023 జూన్ మధ్యలో 2017-18 నుండి 2022-23 వరకు సంబంధించిన కాలానికి జరిగింది. ఈ నివేదికలో మునుపటి ఆడిట్ నివేదికలలో చర్చించబడి, సమకాలీన ప్రాముఖ్యత కలిగి ఉన్న అంశాలను నవీనీకరించడమైనది. మునుపటి కాలంలో జరిగిన, కానీ మునుపటి ఆడిట్ నివేదికలో నివేదించబడని సంఘటనలను కూడా చర్చించడమైనది.

పారిశ్రామిక అవసరాలు, నీటిపారుదల, తాగునీటి అవసరాలను తీర్చడానికి అవసరమైన ఆయకట్టు చివరివరకూ సంధానతలతో కూడిన హెడ్‌వర్క్స్ (అవసరమైన నీటి నిల్వ కోసం), పవర్‌హౌస్ (విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం), కుడి, ఎడమ ప్రధాన కాలువల ప్రణాళిక, అమలుతీరులో ప్రభావాన్ని అంచనా వేయడమే లక్ష్యంగా పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు యొక్క పనితీరు ఆడిట్ జరిగింది. ప్రాజెక్టు అవసరాలతో ప్రజా ప్రయోజనాలను, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు సామాజిక-ఆర్థిక ప్రయోజనాల కోసం పునరావాస & పునరుపాధి కల్పన కార్యకలాపాలను సమతుల్యం చేయడం ద్వారా భూమిని స్వాధీనం చేసుకోవడంలో పారదర్శకత, న్యాయబద్ధత, సామర్థ్యాన్ని అంచనా వేయడం కూడా ఆడిట్ లక్ష్యాలలో ఉంది. 2013 భూసేకరణ, పునరావాస & పునరుపాధి కల్పన, న్యాయ పరిహారం, పారదర్శకత హక్కు, చట్టంలో నిర్దేశించిన విధంగా భూ పరిహారం, పునరావాస & పునరుపాధి కల్పన ప్రయోజనాలను ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు అందించారా లేదా అని అంచనా వేయడానికి లబ్ధిదారు, సౌకర్యాల సర్వే కూడా ఆడిట్‌లో నిర్వహించడమైనది.

## ప్రాజెక్టు ప్రస్తుత స్థితి

2023 మార్చి నాటికి, ₹7,422.69 కోట్ల విలువైన హెడ్‌వర్క్స్/ప్రధాన ఆనకట్ట పనులను మంజూరు చేయగా, ₹5,757.48 కోట్ల వ్యయం జరిగింది. 17 సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా, హెడ్‌వర్క్స్ అసంపూర్ణంగానే ఉన్నాయి. ఎడమ ప్రధాన కాలువ, కుడి ప్రధాన కాలువ పనుల మొత్తం భౌతిక, ఆర్థిక పురోగతులు వరుసగా 76.05 & 72.62 శాతం, 96.14 & 92.75 శాతంగా ఉంది. పోలవరం జల విద్యుత్ ప్రాజెక్టు భౌతిక, ఆర్థిక పురోగతులు వరుసగా 12, 17 శాతం మాత్రమే.

ప్రాజెక్టు కోసం 1,79,770 ఎకరాల భూమి అవసరం కాగా, 1,67,765 ఎకరాలకు అభ్యర్థనలు దాఖలు చేయబడి, 1,13,119 ఎకరాలు, అంటే 67.43 శాతం భూమిని సేకరించడం జరిగింది.

ఈ ప్రాజెక్టులో 222 రెవెన్యూ గ్రామాల్లోని 373 నివాస ప్రాంతాలు మునిగిపోతాయి. దీని వలన 1,06,006 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు ప్రభావితమవుతాయి. ₹13,262 కోట్ల అంచనా వ్యయంతో మొత్తం 213 పునరావాస & పునరుపాధి కల్పన కాలనీలను తలపెట్టడం జరిగింది. 2023 మార్చి నాటికి, మొత్తం 26 పునరావాస & పునరుపాధి కల్పన కాలనీలు పూర్తవగా, 49 కాలనీలు పురోగతిలో ఉన్నాయి, 11,677 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను పునరావాస & పునరుపాధి కల్పన కాలనీలకు తరలించడమైనది.

పనితీరు ఆడిట్ యొక్క ప్రధాన ఫలితాలు ఈ క్రింద ఇవ్వబడ్డాయి:

## అ. ఆర్థిక నిర్వహణ, పర్యావరణ అంశాలు

2018-19తో పోలిస్తే 2019-23లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు బడ్జెట్ మద్దతును గణనీయంగా తగ్గించింది. 2017-23లో అందించిన బడ్జెట్ ప్రతిగా వినియోగం శాతం 21 నుండి 66 మధ్య ఉంది. చేసిన ఖర్చు ఎక్కువగా పనులపై కేంద్రీకృతమై ఉండి, భూసేకరణ, పునరావాస & పునరుపాధి కల్పన కార్యకలాపాలకు తక్కువ ప్రాధాన్యత ఇచ్చింది. ***రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ద్వారా తగినంత మద్దతును కల్పించాలని, ప్రాజెక్ట్‌ను సకాలంలో పూర్తి చేయడానికి కేటాయించిన నిధులను గరిష్టంగా వినియోగించేలా శాఖను నిర్దేశించాలని సిఫార్సు చేయడమైనది.***

సామాజిక-ఆర్థిక సర్వే పూర్తి చేయడంలో జాప్యం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ/సెంట్రల్ వాటర్ కమిషన్ ద్వారా కాలువల వ్యవస్థ యొక్క వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక ఆమోదం పొందడంలో జాప్యం కారణంగా, 2017-18 ధరల స్థాయికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన సవరించిన వ్యయ అంచనా భారత ప్రభుత్వం ద్వారా ఆమోదించబడలేదు. ***ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి భారత ప్రభుత్వం ద్వారా ఆర్ సీఈ ఆమోదం పొందేందుకు వీలుగా, రాష్ట్ర ప్రభుత్వం సామాజిక-ఆర్థిక సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని, కేంద్ర జల సంఘం ద్వారా పంపిణీ వ్యవస్థల యొక్క వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక ఆమోదం పొందాలని సిఫార్సు చేయడమైంది.***

పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని ముంపు గ్రామాలకు రక్షణ కట్టల నిర్మాణం 2014-15 నాటికి పూర్తి కావాల్సి ఉంది, అయితే సంబంధిత రాష్ట్రాలు ప్రజా విచారణ నిర్వహించనందున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంకా ఆయా రక్షణ కట్టల నిర్మాణం ప్రారంభించలేదు. ***రాష్ట్ర ప్రభుత్వం, పోలవరం ప్రాజెక్టు అథారిటీతో సంప్రదించి, సంబంధిత రాష్ట్రాలతో ముంపు సమస్యలను పరిష్కరించుకోవాలి, ఆ రాష్ట్రాలలో ముంపును నివారించడానికి రక్షణ కరకట్టలను సకాలంలో నిర్మించేలా చూడాలని సిఫార్సు చేయడమైనది.***

కేంద్ర జల సంఘం, జాతీయ హరిత ట్రిబ్యునల్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఆమోదం లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకపక్షంగా రెండు ఎత్తిపోతల పథకాలను అమలు చేసింది, అందువల్ల జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు పర్యావరణ పరిహారం చెల్లించాల్సి వచ్చింది. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం, త్రవ్విన మట్టిని శాస్త్రీయంగా చదును వేయడానికి అదనపు ఖర్చు అవసరం అయ్యింది, ఇది గతంలో ఒప్పంద నిబంధనలకు అనుగుణంగా చేయలేదు. ***రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ చట్టాలను ఉల్లంఘించకుండా అప్రమత్తంగా ఉండాలి, పని ప్రారంభించే ముందు ప్రాజెక్టులకు అవసరమయ్యే అన్ని తప్పనిసరి పర్యావరణ, జీవావరణ అనుమతులను పొందాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయడమైనది.***

## ఆ. హెడ్ వర్క్స్, కాలువల ప్రణాళిక, అమలు

వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక ప్రకారం, ముందుగా కాఫర్ డ్యామ్‌లు, తదుపరి డీ-వాల్ నిర్మాణాన్ని ప్రారంభించే ముందు, నదీ ప్రవాహాన్ని స్పిల్ వే, స్పిల్ ఛానల్ ద్వారా మళ్లించాలి. ప్రణాళికాబద్ధమైన నిర్మాణ కాలపట్టికకు కట్టుబడని కారణంగానూ, వరద పరిస్థితిని తగ్గించడానికి గుత్తేదారు సంస్థ లేకపోవడం వల్లనూ, వరద నీరు దాని సాధారణ మార్గంలో ప్రవహించకుండా నిరోధించబడింది. స్పిల్ వే, స్పిల్ ఛానల్ నిర్మాణం పూర్తికాకపోవడంతో వరదనీటి మళ్లింపు సాధ్యం కాలేదు. దీని ఫలితంగా, కాఫర్‌డ్యామ్ లో ఉన్న ఖాళీల గుండా వరద నీరు ప్రవహించి, పాక్షికంగా నిర్మించిన కాఫర్ డ్యామ్‌లు, డీ-వాల్‌కు నష్టం వాటిల్లింది. 2023 మార్చి నాటికి, డీ-వాల్ యొక్క దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు. ***ప్రధాన ఆనకట్ట పనులు సజావుగా జరిగేందుకు, దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న డి-వాల్ దిద్దుబాటు పనులను ఖరారు చేయడానికి రూపొందించిన నిర్మాణ షెడ్యూల్ కు కట్టుబడి ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చూడాలని సిఫార్సు చేయడమైనది.***

నిబంధనలను ఉల్లంఘించి అంచనాలను సవరించి, నామినేషన్ ప్రాతిపదికన పనులను అప్పగించడం, టెండర్ నిబంధనలు, నియమాలను ఎంపిక చేసి మార్చడం ద్వారా గుత్తేదారు సంస్థని ఖరారు చేయడం, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒకే గుత్తేదారుతో రివర్స్ టెండరింగ్ ప్రక్రియను పూర్తిచేసి పనులను అప్పగించడం వంటి సందర్భాలు ఉన్నాయి. ***పోటీ బిడ్డింగ్‌ను కలిగియుండటానికి/ప్రోత్సహించడానికి, నిర్ణీత నిబంధనలు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం నిష్పాక్షిక, పారదర్శకమైన టెండర్ల ప్రక్రియను అభివృద్ధి చేయాలని సిఫార్సు చేయడమైనది.***

నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా పనుల అమలు సమయంలో గుత్తేదారు సంస్థలకు వడ్డీ రహిత ప్రత్యేక రివాల్వింగ్ ఫండ్, ప్రత్యేక ఇంప్రెస్ట్ మంజూరు చేయబడ్డాయి. దీని వలన శాఖ వడ్డీని కోల్పోవడం, గుత్తేదారు సంస్థలకు లబ్ధి చేకూర్చడం జరిగింది. పోలవరం జల విద్యుత్ ప్రాజెక్టు (పీహెచ్‌ఈపీ) అమలులో, శాఖ వడ్డీ లేని అడ్వాన్సులను ఇచ్చింది, దీనివల్ల శాఖకు వడ్డీ నష్టం జరిగింది. గుత్తేదారు సంస్థ సమర్పించిన బ్యాంక్ పూచీకత్తులు (బీజీలు) మొత్తం కాంట్రాక్ట్ వ్యవధిని కవర్ చేయలేదు, ఒప్పందం రద్దుచేసేనాటికి వాటిని నగదుగా మార్చుకోలేదు. ***ప్రస్తుత నియమ నిబంధనలకు అనుగుణంగా గుత్తేదారు సంస్థలకు అడ్వాన్సులు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం చూడాలి. గుత్తేదారు సంస్థలకు అందించే ఏదైనా ఆర్థిక సహాయం సహేతుకమైన వడ్డీ భాగాన్ని కలిగి ఉండాలి, అడ్వాన్సుగా ఇచ్చిన మొత్తానికి బ్యాంకు పూచీకత్తుల ను తీసుకోవాలని సిఫార్సు చేయడమైనది.***

తక్షణ అవసరం లేకపోయినా ఎలక్ట్రోమెకానికల్ (ఈ&ఎం) మెటీరియల్/పరికరాలను ముందస్తుగా కొనుగోలు చేయడం వల్ల వాటిని వినియోగించుకొనకపోవడమే కాకుండా, పీహెచ్‌ఈపీ నిర్మాణం కోసం గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ లిమిటెడ్ నుండి తీసుకున్న ఋణంపై నివారించదగ్గ వడ్డీ చెల్లింపు కూడా జరిగింది. ***పీహెచ్‌ఈపీ నిర్మాణానికి వడ్డీతో కూడిన ఋణం ద్వారా నిధులు సమకూరుస్తున్నందున, పని అమలుకు అనుగుణంగా, వాస్తవ అవసరానికి అనుగుణంగా ఎలక్ట్రో మెకానికల్ మెటీరియల్‌ను కొనుగోలు చేయాలని సిఫార్సు చేయబడింది.***

పని చేపట్టిన తర్వాత కుడి ప్రధాన కాలువ అలైన్‌మెంట్‌లో మార్పు కారణంగా అప్పటికే పూర్తిచేసిన మట్టి పని తవ్వకానికి వృధా ఖర్చు అయింది. కుడి ప్రధాన కాలువ ప్యాకేజీ-6 యొక్క అంతర్గత బెంచ్‌మార్క్ (ఐబీఎమ్)లో మట్టి పని తవ్వకానికి యూనిట్ రేటును పెంచి చూపడం వలన అదనపు ఆర్థిక భారం ఏర్పడింది. ***ప్రాజెక్టు అమలులో మార్పులను తగ్గించడానికి ప్రభుత్వం పటిష్ఠమైన రూపకల్పన ప్రణాళికను నిర్ధారించాలి, అనవసరమైన చెల్లింపులను నివారించడానికి అంచనాలను జాగ్రత్తగా తయారు చేయాలని సిఫార్సు చేయబడింది.***

భూసేకరణలో జాప్యం, శాఖ తయారుచేసిన అంచనాలలో కచ్చితత్వం లోపించడం వల్ల ఎడమ ప్రధాన కాలువలో అమలు చేయాల్సిన పరిమాణాలు గణనీయంగా పెరిగడాని దారితీశాయి. పనులను అప్పగించిన తర్వాత శాఖ సమర్థవంతంగా పర్యవేక్షించకపోవడం వల్ల అసలు గుత్తేదారు సంస్థలు వాటి అమలులో జాప్యం చేసిన ఫలితంగా ఎనిమిది ప్యాకేజీలలో నాలుగు ప్యాకేజీల పనులు ఆగిపోయాయి. ఈ నాలుగు ప్యాకేజీలలో మిగిలిన పనిని పూర్తి చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సమర్పించిన ప్రతిపాదనలకు (2020 అక్టోబర్, 2021 నవంబర్ మధ్య) ప్రభుత్వం ఆమోదం తెలపాల్సి ఉంది.

ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) కాంట్రాక్ట్ పద్ధతి ప్రకారం, ఐబీఎమ్‌లో పొందుపరచబడిన నిర్మాణాల సంఖ్యతో సంబంధం లేకుండా మొత్తం పనిని గుత్తేదారు పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రాథమిక ప్రాజెక్టు పారామితులలో

మార్పులు ఉంటేనే నిర్మాణాల సంఖ్య పెరుగుదలను పరిగణించవచ్చు. ప్రాథమిక పారామితులలో ఎటువంటి మార్పు లేనప్పటికీ, ఎడమ ప్రధాన కాలువ యొక్క ప్యాకేజీ-7లోని అదనపు నిర్మాణాలకు చెల్లింపుకు అనుమతి ఇవ్వబడింది, దీని ఫలితంగా గుత్తేదారు సంస్థకు ₹15.74 కోట్ల అనవసర ప్రయోజనం లభించింది. ***పరిమాణాలు/కట్టడాల సంఖ్యలో వ్యత్యాసం కారణంగా గుత్తేదారులకు అనుచిత ప్రయోజనం, ఖజానాకు నష్టం వాటిల్లకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈపీసీ కాంట్రాక్టులకు సంబంధించిన ప్రక్రియలను, నిర్వర్తించవలసినవి, పరిధి, నిర్దేశాల (స్పెసిఫికేషన్స్) తో సహా క్రమబద్ధీకరించాలని సిఫార్సు చేయబడింది.***

నిర్దేశించిన రిజిస్టర్/ఫారమ్‌లో సరైన లెక్కలు చూపకుండా రెండు కాలువల వెంబడి పనుల స్థలంలో పెద్ద మొత్తంలో త్రవ్విన మట్టి పేరుకుపోయింది. అలాగే, మట్టి దొంగతనం జరిగినా శాఖ ఎటువంటి చర్యలు తీసుకోని సందర్భాలు కూడా ఉన్నాయి. మట్టికి సంబంధించి సరైన లెక్కలు, సరియైన రక్షణ, అమ్మకం కోసం శాఖ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ***తవ్వితీసిన మట్టిని సక్రమంగా లెక్కలలోకి తీసుకోవాలని, ఎలాంటి దొంగతనాలు జరగకుండా భద్రతా చర్యలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత శాఖను ఆదేశించాలని సిఫార్సు చేయబడింది.***

## ఇ. భూసేకరణ, పునరావాసం, పునరుపాధి కల్పన

అవసరమైన మొత్తం భూమిలో, ప్రాజెక్టు ప్రారంభమైననాటి నుంచి శాఖ 67.43 శాతం భూమిని సేకరించగలిగింది. భూమి అవసరం, మునిగిపోతున్న గ్రామాలు/ఆవాసాల సంఖ్య, పునరావాసం కల్పించాల్సిన పీడీఎఫ్‌ల సంఖ్య మొదలైన వాటికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్), సంబంధిత సంవత్సరాల సవరించిన వ్యయ అంచనా (ఆర్ సీఈ) లో చూపిన గణాంకాల మధ్య వ్యత్యాసం ఉంది. సర్వే నివేదికలు లేదా రెవెన్యూ రికార్డుల భూమి అవార్డులతో పోలిస్తే, శాఖ కోరిన భూమి విస్తీర్ణం, వర్గీకరణలో వ్యత్యాసాలు గుర్తించబడ్డాయి. అదనంగా, సరైన యాజమాన్య రికార్డులను ధృవీకరించకుండానే భూమి అవార్డులు జారీ చేయబడ్డాయి. ***రెవెన్యూ రికార్డుల ప్రకారం ముంపుకు గురయ్యే భూ విస్తీర్ణాన్ని, ప్రభావితమైన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను, ఆర్&ఆర్ కార్యకలాపాలకు అవసరమైన భూములను రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి, సవరించిన వ్యయ అంచనాను సత్వర ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి వివరణాత్మక నివేదికను సమర్పించాలని సిఫార్సు చేయబడింది.***

2010-11 నుండి 2017-18 ఆర్ సీఈ వరకు సేకరించాల్సిన ప్రభుత్వ, అటవీ భూముల విస్తీర్ణంలో భారీ తగ్గుదల కనిపించింది, దీనికి అనుగుణంగా అసైన్డ్/ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు గణనీయంగా పెరిగి, భూమి ధరల పరంగా అదనపు ఆర్థిక భారానికి కారణమైంది. ఆక్రమణలను నివారించడానికి, ఆక్రమణదారులను తొలగించడానికి శాఖ సకాలంలో చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. ఇది, చెల్లించాల్సిన పరిహారం రూపంలో ₹619.83 కోట్ల నివారించదగిన ఆర్థిక భారమవడమే కాకుండా ప్రాజెక్టు పనులలో జాప్యానికి దారితీసింది. అంతేకాకుండా, భూములను కేటాయించిన వెంటనే రెవెన్యూ రికార్డులను నవీకరించలేదు, ఫలితంగా వర్గీకరణ వారీగా భూమి విస్తీర్ణం తప్పుగా నివేదించబడింది. ***రాష్ట్ర ప్రభుత్వం తన భూమిని ఆక్రమణల నుండి రక్షించుకోవడానికి సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, 'ముంపుకు గురయ్యే ప్రాంతం' అని ప్రకటించిన తర్వాత అదే భూమిని తిరిగి సేకరించినందుకు పరిహారం చెల్లించకుండా ఉండటానికి భూమి లేనివారికి ఆ భూమిని కేటాయించకుండా ఉండాలని సిఫార్సు చేయబడింది.***

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టులో 1,06,006 పీడీఎఫ్‌ల పునరావాసం ఇమిడి ఉంది. 2014 మార్చి నాటికి (జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించడానికి ముందు), మొత్తం పీడీఎఫ్‌లలో 0.67 శాతం మందికి మాత్రమే పునరావాసం కల్పించబడింది. 17 సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా, 11 శాతం పీడీఎఫ్‌లను మాత్రమే ఆర్&ఆర్ కాలనీలకు తరలించారు. 213 ప్రతిపాదిత ఆర్&ఆర్ కాలనీలలో, 138 ఆర్&ఆర్ కాలనీలలో ఇంకా పనులు ప్రారంభించాల్సి ఉంది. 213 ఆర్&ఆర్ కాలనీల నిర్మాణానికి మొత్తం 8,581.05 ఎకరాల భూమి అవసరం కాగా, 2,756.72 ఎకరాల భూమిని మాత్రమే సేకరించారు. లక్ష్యంగా పెట్టుకున్న పీడీఎఫ్‌ల పునరావాసం పూర్తి చేయడంలో జాప్యం కారణంగా, ఆర్ఎఫ్ సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 ప్రవేశపెట్టిన తర్వాత ఆర్&ఆర్ పరిహార వ్యయం పెరగడం వల్ల అంచనా వ్యయం ₹19,346.49 కోట్ల మేర పెరగడానికి దారితీసింది.

1,06,006 పీడీఎఫ్‌లకు ఆర్&ఆర్ నగదు ప్రయోజనాల చెల్లింపు కోసం ₹7,270.41 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా, 14,500 పీడీఎఫ్‌లకు ₹841.34 కోట్లు మాత్రమే చెల్లించబడ్డాయి. 49 కాలనీలలో మంజూరు చేయబడిన 13,938 హౌసింగ్

యూనిట్లలో, 11,507 యూనిట్లు పూర్తవ్వగా, 6,216 పీడీఎఫ్‌లు మాత్రమే పూర్తయిన యూనిట్లకు మార్చబడ్డారు. పూర్తయిన యూనిట్లలో చాలా వాటిలో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ కనెక్షన్లు వంటి ప్రాథమిక సౌకర్యాలు లేవు. భూమికి–భూమి కేటాయింపు క్రింద, అనుమతించిన పరిమితికి మించి కేటాయింపుతో సహా తక్కువ/అదనపు భూమి కేటాయింపు జరిగిన సందర్భాలు ఉన్నాయి. ***రాష్ట్ర ప్రభుత్వం ఆర్&ఆర్ కార్యకలాపాల కోసం భూసేకరణను వేగవంతం చేయాలి, జలాశయంలో నీటిని నిల్వ చేయడానికి ముందే ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను తరలించడానికి ఆర్&ఆర్ కార్యకలాపాలను వేగవంతం చేయాలని, సిఫార్సు చేయబడింది.***

## ఈ. లబ్ధిదారు, వసతుల సర్వే

12 ఆర్&ఆర్ కాలనీలలో 418 పీడీఎఫ్‌లు, ఆరు ఆవాస ప్రాంతాలలోని 313 పీడీఎఫ్‌లపై లబ్ధిదారుల సర్వే నిర్వహించగా, సుమారు 40, 24 శాతం పీడీఎఫ్‌లకు వరుసగా భూమి అవార్డు, ఆర్&ఆర్ నగదు పరిహారం అందలేదని తేలింది. గోడలపై పగుళ్లు, పైకప్పులో చెమ్మ, ఫ్లోరింగ్ సమస్యలు మొదలైన వాటి కారణంగా దాదాపు 31 శాతం పిడిఎఫ్‌లు గృహ యూనిట్ల నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పీడీఎఫ్‌లకు ఇచ్చిన గృహ యూనిట్లు పీడీఎఫ్‌ల పేర్లపై నమోదు చేయబడలేదు. అర్హత ఉన్నప్పటికీ 36 శాతం పీడీఎఫ్‌లకు భూమికి–భూమి కేటాయింపు జరగలేదు. అర్హత కలిగిన (95 శాతం) షెడ్యూల్డ్ కులాలు, తెగల యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించలేదు.

12 ఆర్&ఆర్ కాలనీలలో చేసిన వసతుల సర్వేలో, కాలనీలకు సరైన అంతర్గత లేదా బాహ్య రహదారులు లేవని, 42 శాతం ఆర్&ఆర్ కాలనీలలో పాఠశాలలు లేవని, స్థాపించబడిన చోట అవి పనిచేయడం లేదని తేలింది; 83 శాతం ఆర్&ఆర్ కాలనీలలో పిల్లల కోసం ఆట స్థలం సమకూర్చలేదు. 83 శాతం ఆర్&ఆర్ కాలనీలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు/ఉప-ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయబడలేదు, స్థాపించబడినవి పనిచేయటం లేదు, 58 శాతం ఆర్&ఆర్ కాలనీలలో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయలేదు, దాదాపు అన్ని ఆర్&ఆర్ కాలనీలలో పశువైద్య సేవా కేంద్రం ఏర్పాటు చేయలేదు, 92 శాతం ఆర్&ఆర్ కాలనీలలో ఓపెన్ డ్రైనేజీ వ్యవస్థ ఉంది, అన్ని ఆర్&ఆర్ కాలనీలలో మరుగుదొడ్లకు కుళాయి కనెక్షన్లు ఏర్పాటుచేయలేదు. 67 శాతం ఆర్&ఆర్ కాలనీలలో పిడిఎఫ్‌లకు ఉచిత రేషన్ అందించడానికి చౌక ధరల దుకాణాలు అందుబాటులో లేవు. ***రాష్ట్ర ప్రభుత్వం పీడీఎఫ్ ల శ్రేయస్సు కోసం అవసరమైన మౌలిక వసతులు సమకూర్చే ప్రక్రియను వేగవంతం చేయాలి.***

# పరిచయం

# 1వ అధ్యాయం

# పరిచయం

## 1 ప్రాజెక్టు నేపథ్యం

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి నదిపై, ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీకి 42 కిమీ ఎగువన, పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా, పోలవరం మండలం, రామయ్యపేట గ్రామానికి సమీపాన, ఒక బహుళార్థసాధక ప్రాజెక్టుగా ఉద్దేశించబడింది.

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కోసం పూర్వపు మద్రాస్ ప్రెసిడెన్సీలో మొదటి భావనాత్మక ప్రతిపాదన, సర్వే (1941 జూలై) చేయబడి, "రామపాద సాగర్ ప్రాజెక్టు" అని పిలువబడింది. అయితే, అధిక వ్యయం, పొరుగు రాష్ట్రాల మధ్య ముంపు అంశాలపై అంగీకారం కుదరకపోవడం మొదలైన కారణాల వల్ల ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చలేదు.

దఫదఫాల చర్చల తర్వాత, పూర్వపు ఆంధ్రప్రదేశ్, పూర్వపు మధ్యప్రదేశ్[1], మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలు 1980లో పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ముంపు అంశాలను పరిష్కరించడానికి ఒక ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ ఒప్పందం, గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) యొక్క తుది ఉత్తర్వు (నిబంధన VI) లో భాగంగా ఉంది. (+) 150 అడుగుల పూర్తి జలాశయ స్థాయి (ఎఫ్ఆర్ఎల్) కోసం కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నుండి పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కోసం అనుమతి పొందాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని నిర్దేశిస్తూ ట్రిబ్యునల్ తుది ఉత్తర్వులు జారీ చేసింది.

తదనంతరం, జీడబ్ల్యూడీటీ యొక్క తుది తీర్పు ఆధారంగా, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టుపై నివేదికలను హెడ్‌వర్క్స్, ఎడమ ప్రధాన కాలువతో కూడిన మొదటి దశ (1982), రెండవ దశ (1984), అనగా కుడి ప్రధాన కాలువల కోసం ₹2,665 కోట్ల అంచనా వ్యయంతో (ప్రామాణిక ధరల జాబితా (ఎస్ఎస్ఆర్) 1985-86 ప్రకారం) కేంద్ర జల సంఘానికి సమర్పించారు. భారత ప్రభుత్వపు కేంద్ర జల సంఘం, జలసంబంధ అంశాలపై మరిన్ని వ్యాఖ్యలను తెలియజేస్తూ[2], సవరించి, నవీకరించబడిన ప్రాజెక్టు నివేదికను సమర్పించమని అభ్యర్థించింది (1989 జూలై). ప్రాజెక్టు నివేదికను ఎప్పటికప్పుడు నవీకరించి, కేంద్ర జల సంఘం సూచించిన విధంగా సమగ్రంగా సవరించిన ప్రాజెక్టు నివేదికను తయారు చేశారు. తదనుగుణంగా ప్రాజెక్టు వ్యయం ₹10,151.05 కోట్లకు[3] చేరుకుంది/ అంచనా వేయబడింది.

ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు జిల్లాల్లో[4] 2.91 లక్షల హెక్టార్లకు[5] (7.20 లక్షల ఎకరాలు) సాగునీరు అందించడంతో పాటు, 960 మెగా వాట్ల (12 టర్బైన్లు X 80 మెగా వాట్లు) జల విద్యుత్ ఉత్పత్తి, కృష్ణా నదీ పరీవాహక ప్రాంతానికి 80 శతకోటి ఘనపుటడుగుల (టీఎమ్‌సీ) నీటి బదిలీ, విశాఖపట్నం నగరానికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటిని సరఫరా చేయడానికి రూపొందించబడింది. ఈ ప్రాజెక్టులో ఎక్కువ భాగం ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాలలో విస్తరించి ఉంది. పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు యొక్క సూచీపటం ***చిత్రం-1.1*** లో చూపబడింది.

---

1 ఇప్పుడు ఈ ఒప్పందంలో తెలంగాణ (పూర్వపు ఆంధ్రప్రదేశ్ నుండి వేరుచేయబడినది) తో పాటు ఛత్తీస్‌గఢ్ కూడా భాగస్వామి

2 లేఖ సంఖ్య 6/125/87-పీపీ (ఎస్)/866 తేదీ 27.07.1989

3 2003-04 నుండి 2005-06 వరకు ప్రామాణిక ధరల జాబితా ఆధారంగా

4 పూర్వపు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, విశాఖపట్నం జిల్లాలు

5 ఒక హెక్టారు = 2.47105 ఎకరాలు

**చిత్రం 1.1: పోలవరం ప్రాజెక్టు సూచీపటం**




*మూలం: పోలవరం ప్రాజెక్టు అథారిటీ (ppa.gov.in)*

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2004లో పోలవరం నీటిపారుదల ప్రాజెక్టును ప్రారంభించింది, ఇందులో హెడ్‌వర్క్స్‌తో పాటు ఎడమ, కుడి అనుసంధానికలు ఎడమ ప్రధాన కాలువ[6], కుడి ప్రధాన కాలువలు[7] ఉన్నాయి. హెడ్‌వర్క్స్ కోసం, 2,454 మీటర్ల పొడవైన మట్టి, రాతితో కూడిన ఆనకట్ట (ఈసీఆర్ఎఫ్), కుడి ప్రక్క సాడిల్‌పై (+) 42.62 మీటర్ల ఎగువ ప్రవాహపు వరద విడుదల స్థాయిలో, 36 లక్షల క్యూసెక్కుల వరద నీటి విడుదలను నియంత్రించడానికి ఒక స్పిల్‌వే[8], ఉద్దేశించబడ్డాయి. ఈ విధంగా ఏర్పడిన జలాశయం, జలాశయపు పూర్తి స్థాయి (+) 45.72 మీటర్ల వద్ద 75.20 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో 601 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని ముంచెత్తుతుంది. 960 మెగా వాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో పవర్‌హౌస్‌ను మట్టి, రాతితో కూడిన ఆనకట్టకు ఎడమ వైపున 'డీ' కొండ వాలు వద్ద నిర్మించనున్నారు.

ఎడమ ప్రధాన కాలువ, లైన్డ్ కెనాల్‌గా ప్రతిపాదించబడి, 211.27 కి.మీ.[9] పొడవుతో, 496.21 క్యూమెక్‌ల విడుదల సామర్థ్యంతో ప్రణాళిక చేయబడి ఎడమ సంధానిక నుండి ప్రారంభమౌతుంది. కుడి ప్రధాన కాలువ, లైన్డ్ కెనాల్‌గా ప్రతిపాదించబడి, 178.81 కి.మీ పొడవుతో, 497.77 క్యూమెక్‌ల విడుదల సామర్థ్యంతో రూపొందించబడి, ప్రణాళిక చేయబడిన కుడి సంధానిక నుండి ప్రారంభమౌతుంది. కుడి ప్రధాన కాలువ బుడమేరు నదిలో చేరి చివరికి బుడమేరు మళ్ళింపు కాలువ ద్వారా కృష్ణా నదిలోకి ప్రవేశించేలా ప్రతిపాదించబడింది.

---

6 ఇందులో లీడింగ్ ఛానల్, ఆఫ్-టేక్ రెగ్యులేటర్, హెడ్ రెగ్యులేటర్, నావిగేషన్ లాక్, నావిగేషన్ ఛానల్, నావిగేషన్ టన్నెల్, ఇరిగేషన్ టన్నెల్, సాడిల్ డ్యామ్ కేవిల్, హెడ్ లాక్‌లు మొదలైనవి ఉంటాయి

7 ఇందులో హెడ్ రెగ్యులేటర్, ఆఫ్-టేక్ రెగ్యులేటర్, సాడిల్ డ్యామ్స్ ఈ & ఎఫ్, రెండు ఆనకట్టలు, ఎంట్రీ, ఎగ్జిట్ ఛానల్స్‌తో కూడిన రెండు ట్విన్ టన్నెల్స్ మొదలైనవి ఉంటాయి

8 1,128.40 మీటర్ల పొడవు, (+) 25.72 మీటర్ల ఎత్తు, 48 రేడియల్ గేట్లు (ఒక్కొక్కటి 16 మీటర్లు (వెడల్పు) x 20 మీటర్లు (ఎత్తు))

9 ప్రధాన కాలువ: 177.81 కి.మీ. + ప్రస్తుత నీటి సరఫరా ఛానల్: 22.61 కి.మీ. + కొత్త నీటి సరఫరా ఛానల్: 10.85 కి.మీ.

అమలు సౌలభ్యం కోసం, ప్రాజెక్టు పనులను 22 ప్యాకేజీలు (హెడ్‌వర్క్స్: ఒక ప్యాకేజీ; నావిగేషన్ ఛానల్‌తో సహా ఎడమ సంధానికలు: మూడు ప్యాకేజీలు; కుడి సంధానికలు: మూడు ప్యాకేజీలు; ఎడమ ప్రధాన కాలువ: ఎనిమిది ప్యాకేజీలు; కుడి ప్రధాన కాలువ: ఏడు ప్యాకేజీలు) గా విభజించారు.

భారత ప్రభుత్వం, జల వనరుల మంత్రిత్వ శాఖ (ఎమ్ఓడబ్ల్యూఆర్) యొక్క సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) ద్వారా 2003-04 నుండి 2005-06 ధర స్థాయి (పీఎల్) ఆధారంగా ₹10,151.05 కోట్ల అంచనా వ్యయంతో పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఆమోదం పొంది (2009 జనవరి), 12 సంవత్సరాలలో పూర్తి చేయడానికి ప్రణాళిక చేయబడింది. 2011లో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాజెక్టు యొక్క వ్యయ అంచనాను (1వ ఆర్‌సీఈ) 2010-11 ధర స్థాయి (పీఎల్) ఆధారంగా ₹16,010.45 కోట్లకు సవరించింది, దీనిని జల వనరుల మంత్రిత్వ శాఖ (ఎమ్ఓడబ్ల్యూఆర్) యొక్క సాంకేతిక సలహా కమిటీ ఆమోదించింది[10] (2011 జనవరి). 2014 మార్చి నాటికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై చేసిన మొత్తం వ్యయం ₹4,730.71 కోట్లు (యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్ ప్రోగ్రామ్ క్రింద కేంద్ర సహాయంగా ₹562.47 కోట్లు అందుకుంది) కాగా, ఖర్చుచేయాల్సిన అంచనా వ్యయం ₹11,279.74 కోట్లు. మొదటి సవరణ అంచనా వ్యయం ₹16,010.45 కోట్లకు పెట్టుబడి అనుమతి మంజూరు చేస్తూ (2017 ఫిబ్రవరి), ప్రాజెక్టు పూర్తిచేయుటకు గడువు 2018 డిసెంబర్‌గా సవరించబడింది.

## 1.1 జాతీయ ప్రాజెక్టుగా ప్రకటన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సందర్భంగా, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 లోని సెక్షన్ 90 క్రింద జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు (2014 మార్చి). ఈ చట్టంలోని నిబంధనల ప్రకారం, 2014 ఏప్రిల్ నుండి నీటిపారుదల భాగానికి[11] అయ్యే వ్యయానికి భారత ప్రభుత్వం నిధులు అందిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భారత ప్రభుత్వం మధ్య ప్రస్తుత ఏర్పాటు ప్రకారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును భారత ప్రభుత్వం తరపున అమలు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన బడ్జెట్ వనరుల ద్వారా చేసిన ఖర్చును భారత ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. ప్రాజెక్టు ప్రతిపాదకులు, అనగా, చీఫ్ ఇంజనీర్, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, ప్రతి నెలా పోలవరం ప్రాజెక్టు అథారిటీ[12] (పీపీఏ)కి బిల్లులను తయారు చేసి సమర్పిస్తారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఆ బిల్లులను పరిశీలించి, చెల్లింపు కోసం భారత ప్రభుత్వంలోని జలశక్తి[13] మంత్రిత్వ శాఖ (ఎమ్ఓజేఎస్)కి సిఫార్సు చేస్తుంది.

జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత, ఈ ప్రాజెక్టు వ్యయ అంచనాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ₹55,548.87 కోట్లకు (2017-18 పీఎల్ వద్ద) మరలా సవరించగా (2వ ఆర్‌సీఈ), దానిని భారత ప్రభుత్వం యొక్క సాంకేతిక సలహా కమిటీ ఆమోదించింది (2019 ఫిబ్రవరి). పోలవరం నీటిపారుదల ఖర్చు పెరుగుదలను పరిశీలించడానికి జలశక్తి మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి & ఆర్థిక సలహాదారు, డీఓడబ్ల్యూఆర్, ఆర్‌డీ & జీఆర్[14] అధ్యక్షతన వ్యయ సవరణ కమిటీ (ఆర్‌సీసీ)ని భారత ప్రభుత్వం ఏర్పాటు చేసింది (2019 ఏప్రిల్). వ్యయ సవరణ కమిటీ, 2017-18 ధర స్థాయి వద్ద ₹47,725.74 కోట్లకు 2వ సవరించిన వ్యయ అంచనాని సిఫార్సు చేసింది (2020 మార్చి). ఈ సిఫార్సును భారత ప్రభుత్వం ఇంకా ఆమోదించలేదు (2023 మార్చి నాటికి).

అంచనా వ్యయం పెరుగుదలకు, అనుకున్న సమయంలో పనులు జరగకపోవడం, డిజైన్లలో మార్పు, తరచుగా గుత్తేదారుల మార్పుల కారణంగా ఆలస్యం, పరిమాణాలలో పెరుగుదల, కొత్త భూసేకరణ, పునరావాసం, పునరుపాధి

---

[10] 04.01.2011న జరిగిన టీఏసీ 108వ సమావేశంలో

[11] ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన సొంత వనరుల ద్వారా అమలుచేస్తున్న విద్యుత్ ఉత్పత్తి భాగం తప్ప

[12] గెజిట్ నోటిఫికేషన్ సంఖ్య 129 తేదీ 28.5.2014 ద్వారా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టు, 2014 లోని సెక్షన్ 90 లోని సబ్-సెక్షన్ 4 ప్రకారం భారత ప్రభుత్వం ద్వారా స్థాపించబడింది

[13] గతంలో జల వనరుల మంత్రిత్వ శాఖగా ఉండి 2019 మే నుండి జలశక్తి మంత్రిత్వ శాఖగా మార్చబడింది

[14] జల వనరులు, నదీ అభివృద్ధి, గంగా పునరుజ్జీవన విభాగం

కల్పనలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు (ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్) చట్టం, 2013 ప్రకారం పరిహారం మొత్తంలో పెరుగుదల ప్రధాన కారణాలుగా ఉన్నాయి.

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు పూర్తయిన తర్వాత పొందే ప్రయోజనాలు[15] ***అనుబంధం 1.1***లో పేర్కొనబడ్డాయి. ఇంజనీరింగ్ పనులు, భూసేకరణ, పునరావాసం & పునరుపాధి కల్పన (ఆర్&ఆర్)తో కూడిన పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు యొక్క ప్రధాన భాగాలు ***అనుబంధం 1.2*** లో వివరించబడ్డాయి.

## 1.2 సంస్థాగత ఏర్పాటు

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టులో పాల్గొన్న వివిధ విభాగాలు/అధికారుల సంస్థాగత ఏర్పాటు ఈ క్రింద వివరించబడింది.

### (అ) పోలవరం ప్రాజెక్టు అథారిటీ పాలకమండలి

భూమిని సేకరించడానికి పర్యావరణ, అటవీ సహా అవసరమైన అన్ని అనుమతులను పోలవరం ప్రాజెక్టు అథారిటీ పాలకమండలి పొందాలి. పోలవరం ప్రాజెక్టు అథారిటీ పనితీరును పర్యవేక్షించే బాధ్యత దీనిదే. ఎనిమిది మంది సభ్యులు[16], సభ్య కార్యదర్శితో కూడిన పాలకమండలికి చైర్మన్ (జల వనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి, భారత ప్రభుత్వం) నేతృత్వం వహిస్తారు.

పోలవరం ప్రాజెక్టు అథారిటీ, ఈ ప్రాజెక్టును సంబంధిత రాష్ట్ర విభాగాలు మరియు/లేదా ఏదైనా ఇతర నిపుణుల సంస్థ ద్వారా అమలు చేస్తుంది, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు యొక్క నియంత్రణ, అభివృద్ధికి బాధ్యత వహిస్తుంది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ యొక్క కూర్పు ***పటం 1.1***లో చూపబడింది.

**పటం1.1: పోలవరం ప్రాజెక్టు అథారిటీ కూర్పు**




*మూలం: పోలవరం ప్రాజెక్టు అథారిటీ ppa.gov.in*

[15] గృహ నీటి సరఫరా, నదుల అనుసంధానం, పారిశ్రామిక నీటి సరఫరా, పర్యాటకం మొదలైనవి

[16] ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి; తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి; పర్యావరణ, భారత ప్రభుత్వ అటవీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి; భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ (వ్యయ విభాగం) కార్యదర్శి; భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి, భారత ప్రభుత్వ గిరిజన సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి (లేదా సంయుక్త కార్యదర్శి హోదా కంటే తక్కువ కాని వారి నామినీలు); పోలవరం ప్రాజెక్టు అథారిటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి, నీతి ఆయోగ్ నుండి ప్రతినిధి (సంయుక్త కార్యదర్శి కంటే తక్కువ హోదా కాని వారు)

(ఆ) **జల వనరుల శాఖ**

భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య ప్రస్తుత ఏర్పాటు ప్రకారం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ తరపున ప్రాజెక్టు అమలుకు ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జల వనరుల శాఖ బాధ్యత వహిస్తుంది. ఇంజనీరింగ్ పనుల అమలుకు చీఫ్ ఇంజనీర్, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు బాధ్యత వహిస్తారు, పవర్‌హౌస్ నిర్మాణాన్ని చీఫ్ ఇంజనీర్, ఆంధ్రప్రదేశ్ జెన్కో[17] పర్యవేక్షిస్తారు. భూసేకరణ, పునరావాసం, పునరుపాధి కల్పన అమలుకు కమీషనర్ (ఆర్&ఆర్), ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ (ఆర్&ఆర్) బాధ్యత వహిస్తారు.

## 1.3 ఆడిట్ లక్ష్యాలు

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు పనితీరు ఆడిట్‌ను ఈ క్రింది లక్ష్యాలను అంచనా వేయడానికి చేపట్టడమైంది:

- అవసరమైన నీటి నిల్వ, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కోసం పవర్ హౌస్‌తో సహా హెడ్‌వర్క్‌లను ప్రణాళిక చేసి, రూపొందించి, ఆర్థికంగా, సమర్థవంతంగా అమలు చేశారా;
- పారిశ్రామిక, నీటిపారుదల, తాగునీటి అవసరాలను తీర్చడానికి అవసరమైన చివరి మైలు అనుసంధానికల వరకూ కాలువలు (ఎడమ, కుడి ప్రధాన కాల్వల పనులు) ప్రణాళిక చేయబడి ఆర్థికంగా, సమర్థవంతంగా అమలు చేయబడ్డాయా లేదా;
- ప్రజా ప్రయోజనాలను, ప్రాజెక్టు అవసరాలను సమతూకం చేయడం ద్వారా భూసేకరణ న్యాయంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా జరిగిందా;
- ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల (పీడీఎఫ్‌లు) సామాజిక-ఆర్థిక ప్రయోజనాల కోసం ఉద్దేశించిన పునరావాసం & పునరుపాధి కల్పన ప్రభావవంతంగా అంచనా వేయబడి, సమర్థవంతంగా సాధించబడ్డాయా లేదా.

## 1.4 ఆడిట్ ప్రమాణాలు

**ఆడిట్** ఫలితాలను ఈ క్రింది పత్రాల నుండి సేకరించిన ప్రమాణాలకు అనుగుణంగా ప్రమాణీకరించడమైంది:

- నీటిపారుదల ప్రాజెక్టులపై జల శక్తి మంత్రిత్వ శాఖ/కేంద్ర జల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, సర్క్యులర్లు/ సూచనలు;
- భారత ప్రభుత్వం జారీ చేసిన జాతీయ ప్రాజెక్టు మార్గదర్శకాలు;
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ నిర్మాణ కాంట్రాక్టులకు సంబంధించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మార్గదర్శకాలు, కాలానుగుణంగా జారీ చేయబడిన ప్రభుత్వ ఉత్తర్వులు/ సర్క్యులర్లు/ మెమోలు;
- వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలు, సాధ్యాసాధ్యాల అధ్యయనాలు, అంతర్గత ప్రమాణాలు/అంచనాలు;
- పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కోసం ఇచ్చిన అనుమతులలో పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్దేశించిన షరతులు;
- ఆంధ్రప్రదేశ్ ఆర్థిక కోడ్, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ వర్క్ డిపార్ట్‌మెంట్ కోడ్, ఆంధ్రప్రదేశ్ వివరణాత్మక ప్రామాణిక వివరణలు;
- భూసేకరణ చట్టం 1894, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పునరావాసం, పునరుపాధి కల్పన విధానం 2005, భూసేకరణ, పునరావాసం, పునరుపాధి కల్పనలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు

[17] ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్

(ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్) చట్టం, 2013, ఆంధ్రప్రదేశ్ భూసేకరణ, పునరావాసం, పునరుపాధి కల్పనలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు నియమాలు, 2014;

- గుత్తేదారు సంస్థలతో శాఖ కుదుర్చుకున్న పనుల ఒప్పందాల నిబంధనలు, షరతులు;
- ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి సంస్థ జారీ చేసిన గ్రామ రెవెన్యూ పరిపాలన మార్గదర్శకాలు.

## 1.5 ఆడిట్ పరిధి, ప్రక్రియ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంబంధించిన 2006 ఏప్రిల్ నుండి 2010 మార్చి వరకు జలయజ్ఞం నివేదిక (2012లో 2వ నివేదిక) లో భాగంగా, 2012 ఏప్రిల్ నుండి 2017 మార్చి వరకు 2017 సంవత్సరంలో జారీ చేసిన (2018లో 4వ నివేదిక) నివేదికలో భాగంగా పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు అమలును భారత కంప్ట్రోలర్ & ఆడిటర్ జనరల్ సమీక్షించారు. జలయజ్ఞం నివేదికను ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) పాక్షికంగా చర్చించింది, అయితే, ఎటువంటి సిఫార్సులు చేయలేదు. 2018లో 4వ నివేదికను ప్రజా పద్దుల కమిటీ ఇంకా చర్చించాల్సి ఉంది.

2022 జూన్ నుండి 2023 జూన్ వరకు నిర్వహించిన ప్రస్తుత పనితీరు తనిఖీ, 2017-18 నుండి 2022-23 వరకు ప్రాజెక్టు అమలును సమీక్షించింది, ఇందులో భూసేకరణ, పునరావాసం & పునరుపాధి కల్పన (ఆర్&ఆర్) తో సహా ప్రాజెక్టు అమలును సవివరంగా పొందుపరచడమైంది. ఈ నివేదికలో మునుపటి ఆడిట్ నివేదికలలో పొందుపరచిన అంశాలలో సమకాలీన ప్రాముఖ్యత కలిగిన చోట, వాటి యొక్క నవీకరణలు కూడా ఉన్నాయి. ఈ నివేదికలో మునుపటి కాలంలో జరిగి, మునుపటి ఆడిట్ నివేదికలో పొందుపరచని సంఘటనలను కూడా పొందుపరచడమైంది.

క్షేత్ర స్థాయిలో తనిఖీ కోసం జలవనరుల శాఖ ప్రధాన కార్యదర్శి కార్యాలయం, చీఫ్ ఇంజనీర్, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కార్యాలయాలను, ప్రాజెక్టు అమలులో పాల్గొన్న ఐదు పర్యవేక్షక ఇంజనీర్ కార్యాలయాలలో[18] మూడింటిని, 19 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయాలలో[19] ఎనిమిదింటిని, ఐదు భూసేకరణ కార్యాలయాలలో[20] మూడింటిని, ఆరు ఆర్&ఆర్ కార్యాలయాలలో[21] మూడింటిని, మూడు నాణ్యత నియంత్రణ విభాగాలలో రెండింటిని[22] నమూనాగా (పునరావృత రహిత సాధారణ యాదృచ్ఛిక[23] నమూనా పద్ధతిలో) ఎంపిక చేయడమైంది. ఇంకా, చీఫ్ ఇంజనీర్, ఏపీ జెన్కో, విజయవాడ; పర్యవేక్షక ఇంజనీర్, ఏపీ జెన్కో, ధవళేశ్వరం; పర్యవేక్షక ఇంజనీర్, ఏపీ ట్రాన్స్కో[24], విశాఖపట్నం కార్యాలయాలను కూడా ఇదే సమయంలో తనిఖీ చేయడమైంది.

తనిఖీ ప్రక్రియలో భాగంగా, శాఖ స్థాయిలో నిర్ణయాలు/ప్రకటనలు, విధానాలు, సర్క్యులర్లు, బడ్జెట్ కేటాయింపులు, ప్రాజెక్టు యొక్క సర్కిళ్ళు/డివిజన్లలో అంచనాలు, టెండరింగ్, చెల్లింపులు, నాణ్యత నియంత్రణ, మొదలైన వాటికి సంబంధించిన పత్రాల పరిశీలన, ఉమ్మడి తనిఖీలు మొదలైనవి ఉన్నాయి. భూసేకరణ, పునరావాసం, పునరుపాధి

---

18 ఎస్.ఈ., పోలవరం నీటి పారుదల ప్రాజెక్టు ప్రధాన పనులు, ధవళేశ్వరం; ఎస్.ఈ., పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ, తుని; ఎస్.ఈ., పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ, ఏలూరు

19 ఈఈ, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు హెచ్ డబ్ల్యూ డివిజన్ 1, పోలవరం; ఈ.ఈ., పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు హెచ్ డబ్ల్యూ డివిజన్ 3, పోలవరం; ఈ.ఈ., పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు హెచ్ డబ్ల్యూ డివిజన్ 5, సీతానగరం; ఈ.ఈ., పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు హెచ్ డబ్ల్యూ డివిజన్ 6, పురుషోత్తపట్నం; ఈ.ఈ., పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ డివిజన్ 1, రాజమహేంద్రవరం,;ఈ.ఈ., పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ డివిజన్ 3, జగ్గం పేట; ఈ.ఈ., పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఆర్ఎమ్‌సీ డివిజన్ 4, ఏలూరు, ఈ.ఈ., పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఆర్ఎమ్‌సీ డివిజన్ 5, విజయవాడ

20 ఎస్‌డీసీ పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం; ఎస్‌డీసీ, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఆర్ఎమ్‌సీ యూనిట్, కొవ్వూరు; పీఓ ఐటీడీఏ, కేఆర్ పురం

21 సబ్ కలెక్టరు, రంపచోడవరం; ఆర్‌డీఓ జంగారెడ్డిగూడెం;, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, కేఆర్ పురం

22 నాణ్యత నియంత్రణ (క్యూసీ) డివిజన్ మైలవరం వద్ద పోలవరం; క్యూసీ డివిజన్, ధవళేశ్వరం

23 భర్తీ లేకుండా యాదృచ్ఛిక నమూనా

24 ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్ మిషన్ కార్పొరేషన్

కల్పనల విషయంలో, తనిఖీ ప్రక్రియలో పత్రాల పరిశీలనతో పాటు ఉమ్మడి తనిఖీలు కూడా చేయడం జరిగింది. వివిధ స్థాయిలలో శాఖాపరమైన అధికారులతో చర్చలు జరిగాయి, ప్రశ్నాపత్రాలు జారీ చేయబడ్డాయి, అవసరమైన చోట ఛాయాచిత్ర ఆధారాలను పొందడం జరిగింది.

ఈ ప్రాజెక్టులో 1.06 లక్షల ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు (పీడీఎఫ్‌లు) స్థానభ్రంశం చేయబడతాయి. అయితే, ప్రాజెక్టు ప్రారంభమైనప్పటి నుండి పీడీఎఫ్‌ల పునరావాసం, పునరుపాధి కల్పనలో (భౌతికంగా, ఆర్థికంగా) స్వల్ప పురోగతి నమోదైంది. పీడీఎఫ్‌ల కష్టాలు ప్రసార మాధ్యమాల నుండి కూడా విస్తృత దృష్టిని ఆకర్షించాయి. అందువల్ల, పీడీఎఫ్‌లకు అందించిన సామాజిక-ఆర్థిక ప్రయోజనాలను అంచనా వేయడానికి లబ్ధిదారుల, సౌకర్యాల సర్వేను ఆడిట్ చేపట్టింది. పునరావాసం, పునరుపాధి కల్పన కార్యకలాపాలను రెండు దశలుగా విభజించారు, అంటే (+) 41.15 మీటర్ల ఎత్తు స్థాయి (ఈఎల్) వరకు మొదటి దశ, (+) 41.15 మీటర్ల పైన రెండవ దశ. మొదటి దశ క్రింద, 20,946 పీడీఎఫ్‌లను, రెండవ దశ క్రింద, 85,060 పీడీఎఫ్‌లను పునరావాసం చేయడానికి గుర్తించారు. సర్వే యొక్క సాధ్యాసాధ్యాల కోసం, మొదటి దశ క్రింద పీడీఎఫ్‌లను ఆడిట్ రెండు వర్గాలుగా వర్గీకరించింది:

- కేటగిరీ-I: ఆర్&ఆర్ కాలనీలలో పునరావాసం కల్పించబడిన పీడీఎఫ్‌లు.
- కేటగిరీ-II: ఇంకా పునరావాసం కల్పించబడని పీడీఎఫ్‌ల ఆవాస ప్రాంతాలు.

సర్వే కోసం పైన పేర్కొన్న వర్గాలను సరిగ్గా కవర్ చేస్తూ శాఖ నుండి పొందిన సమాచారాన్ని నమూనాగా (పునరావృత రహిత సాధారణ యాదృచ్ఛిక నమూనా పద్ధతి) తీసుకోవడమైంది.

ప్రారంభ సమావేశం 2022 మేలో జరిగింది, దీనిలో ఆడిట్ లక్ష్యాలు, పరిధి, ప్రక్రియ, ప్రమాణాలు మొదలైన వాటిని జలవనరుల శాఖ, ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చించడమైంది. ప్రభుత్వంతో ముగింపు సమావేశం, 2024 నవంబర్‌లో జరిగింది, దీనిలో ప్రధాన ఆడిట్ ఫలితాలను చర్చించడమైంది. ప్రభుత్వం ఇచ్చిన సమాధానాలు, ముగింపు సమావేశం సమయంలో ఇచ్చిన ప్రతిస్పందనలను ఈ నివేదికలో తగిన ప్రదేశాలలో సముచితంగా చేర్చడమైంది. ఆడిట్ చేసిన సిఫార్సులను ముగింపు సమావేశం సమయంలో చర్చించడమైంది. ప్రభుత్వం వాటిని అంగీకరించింది (2024 నవంబర్).

## 1.6 కృతజ్ఞతలు

ఈ తనిఖీ నిర్వహణలో జలవనరుల శాఖ, ఇంజనీర్-ఇన్-చీఫ్, చీఫ్ ఇంజనీర్, పర్యవేక్షక ఇంజనీర్, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఇంజనీరింగ్ డివిజన్ల అధికారులు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్, స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్, వారి అధికారులు అందించిన సహకారానికి ఆడిట్ కృతజ్ఞతలు తెలియజేస్తోంది.

# 2వ అధ్యాయం

## ఆర్థిక నిర్వహణ, పర్యావరణ అంశాలు

పేజీలు 9 – 28

# 2వ అధ్యాయం

# ఆర్థిక నిర్వహణ, పర్యావరణ అంశాలు

2018-19 సంవత్సరంతో పోలిస్తే 2019-23 కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు కేటాయించిన బడ్జెట్లో భారీ తగ్గుదల కనిపించింది. 2017-23 కాలంలో సమకూర్చిన బడ్జెట్ వినియోగం 21 నుండి 66 శాతం మధ్య ఉంది. దీనికి ప్రధానంగా పనుల పురోగతి సరిగా లేకపోవడం, దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను సరిదిద్దడంలో అనిశ్చితి, మట్టి-రాతి ఆనకట్ట నిర్మాణం జరగకపోవడం వంటి కారణాలు ఉన్నాయి. చేసిన వ్యయం ఎక్కువగా పనుల అంశంపై కేంద్రీకృతమై, భూ సేకరణ, పునరావాసం, పునరుపాధి కల్పన కార్యకలాపాలకు తక్కువ ప్రాధాన్యత ఇచ్చింది.

2014-23 కాలంలో ఈ ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం ₹16,089.79 కోట్లకు గాను, భారత ప్రభుత్వం ₹14,290 కోట్లను తిరిగి చెల్లించింది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి అవసరమైన పత్రాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించకపోవడం/ఆలస్యం చేయడం వల్ల భారత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తిరిగి చెల్లించడంలో తీవ్ర జాప్యం జరిగింది. సామాజిక-ఆర్థిక సర్వేను పూర్తి చేయడంలో, పంపిణీ వ్యవస్థ కోసం వ్యయ అంచనాలను తయారు చేయడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన జాప్యం కారణంగా 2017-18 ధర స్థాయికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన సవరించిన వ్యయ అంచనాను భారత ప్రభుత్వం ఆమోదించలేదు.

పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ నిర్దేశించిన పర్యావరణ నిబంధనలను పాటించని సందర్భాలు ఉన్నాయి. పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని ముంపు గ్రామాలకు 2014-15 నాటికి పూర్తి కావాల్సి ఉన్న రక్షణ కట్టల నిర్మాణం, సంబంధిత రాష్ట్రాలు ప్రజా విచారణ జరపకపోవడంతో ఇంకా ప్రారంభం కాలేదు. కేంద్ర జల సంఘం, జాతీయ హరిత ట్రిబ్యునల్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఆమోదం లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకపక్షంగా రెండు ఎత్తిపోతల పథకాలను అమలు చేసింది, దీని వలన జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు పర్యావరణ పరిహారం చెల్లించాల్సి వచ్చింది. గతంలో ఒప్పంద నిబంధనలకు అనుగుణంగా చేయని కారణంగా జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం తొలగించిన మట్టిని శాస్త్రీయంగా చదును చేయడానికి అదనపు ఖర్చు అవసరమైంది.

## 2.1 ఆర్థిక నిర్వహణ

### 2.1.1 బడ్జెట్ కేటాయింపు, వ్యయం

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు (పీఐపీ) అమలు కోసం భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య ఉన్న ఏర్పాటు ప్రకారం, ప్రారంభంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన బడ్జెట్ వనరుల ద్వారా ఖర్చును భరిస్తుంది. తదనంతరం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సిఫార్సుల ప్రకారం, ఖర్చును భారత ప్రభుత్వ జల శక్తి మంత్రిత్వ శాఖ (ఎమ్ఓజేఎస్) తిరిగి చెల్లిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా 'గుత్తేదారు సంస్థలకు బిల్లుల చెల్లింపు ప్రక్రియ', 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ఖర్చు భారత ప్రభుత్వంచే తిరిగి చెల్లించబడడం' అనే ప్రక్రియ వరుసగా ***పటం 1, పటం 2*** లో ఇవ్వబడ్డాయి.

**పటం 1: గుత్తేదారు సంస్థలకు బిల్లుల చెల్లింపు ప్రక్రియ**




**పటం 2: భారత ప్రభుత్వంచే నిధుల తిరిగి చెల్లింపు ప్రక్రియ**




పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ముఖ్య ఇంజనీరు నివేదించిన ప్రకారం, 2017-18 నుండి 2022-23 వరకు ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్, చేసిన వ్యయం ***పటం 2.1*** లో చూపబడింది.

**పటం 2.1: కేటాయింపు, వ్యయం & మిగులు (₹ కోట్లలో)**




*మూలం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు ఆర్థిక & అప్రాప్రియేషన్ ఖాతాలు, జలవనరుల శాఖ రికార్డులు*

పైన పేర్కొన్న దాని నుండి క్రింది విషయాలను గమనించడమైంది:

- 2018-19తో పోలిస్తే 2019-20 సంవత్సరం నుండి బడ్జెట్ కేటాయింపు, చేసిన వ్యయం (2021-22 సంవత్సరం తప్ప) గణనీయంగా తగ్గింది. పనుల పురోగతి సరిగా లేకపోవడం, దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ ను సరిచేయడంలో అనిశ్చితి, మట్టి-రాతి (ఈసీఆర్ఎఫ్) ఆనకట్ట నిర్మాణం జరగకపోవడం వల్ల 2019-21, 2022-23 సంవత్సరాల్లో బడ్జెట్ కేటాయింపులో దాదాపు 50 శాతం తగ్గుదల కనిపించింది.
- 2017-23 కాలానికి కేటాయించిన బడ్జెట్ ఏ సంవత్సరంలోనూ పూర్తిగా వినియోగించబడలేదు. ***పటం 2.2*** లో చూపిన విధంగా 2017-23 కాలంలో కేటాయించిన బడ్జెట్ వినియోగం 21 నుండి 66 శాతం మధ్య ఉంది.




*మూలం: శాఖ అందించిన సమాచారం ఆధారంగా సంకలనం చేయబడింది*

అందువల్ల, బడ్జెట్ లభ్యత ఉన్నప్పటికీ, నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోలేకపోయారు, తద్వారా ప్రాజెక్టు పురోగతి ఆశించిన లక్ష్యాలను చేరుకోలేకపోయింది.

- 2017-23లో పోలవరం నీటిపారుదల ప్రాజెక్టుపై అంశాల వారీగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ఖర్చు ***పటం 2.3*** లో చూపబడింది.




*మూలం: శాఖ అందించిన సమాచారం ఆధారంగా సంకలనం చేయబడింది*

*గమనిక: సంవత్సరం వారీగా ఖర్చు, భాగాల వారీగా ఖర్చు గణాంకాలు మారవచ్చు, ఎందుకంటే సంవత్సరం వారీ ఖర్చులో ఇతర సంస్థాగత ఖర్చు*[25] *కూడా కలిపి ఉంటుంది.*

[25] జీతాలు, ఆకస్మిక ఖర్చులు, వాహన అద్దె ఛార్జీలు, సంస్థాగత వ్యయం మొదలైనవి

పైన పేర్కొన్నదాని నుండి క్రింది విషయాలను భావించవచ్చు:

- ఖర్చు ఎక్కువగా పనుల అంశంపైనే కేంద్రీకృతమై, భూసేకరణ. పునరావాసం, పునరుపాధి కల్పన (ఆర్&ఆర్) కార్యకలాపాలకు తక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది. హెడ్‌వర్క్స్, కాలువలు పూర్తయినప్పటికీ, ఆర్&ఆర్ కార్యకలాపాలకు భూసేకరణ, ముంపు ప్రాంతాలలో అంటే కంటూర్ (+) 41.15 మీటర్ల వరకు పీడీఎఫ్ ల పునరావాసం పూర్తి చేయకపోతే రిజర్వాయర్ నింపబడదు.
- ఆర్&ఆర్ కార్యకలాపాలు, ముంపు ప్రాంతం కోసం 54,248 ఎకరాల భూమిని (పేరా 2.2.2 చూడండి) సేకరించాల్సిన అవసరం ఉన్నప్పటికీ (2023 మార్చి నాటికి), ఆడిట్ కాలంలో భూసేకరణ అంశంపై ఖర్చు తగ్గుతున్న ధోరణిలో ఉంది.
- 2017-18 నుండి (2021-22 మినహా) ఆర్&ఆర్ పై వ్యయం ప్రతి సంవత్సరం పెరిగినప్పటికీ, మొత్తం ₹1,806 కోట్ల (2017-18 నుండి 2022-23 వరకు) ఆర్&ఆర్ వ్యయం (2వ ఆర్ సీఈ ప్రకారం) అంచనా వేసిన (₹ 24,120 కోట్లు) వ్యయంతో పోలిస్తే చాలా తక్కువగా ఉంది (***పటం 2.4*** చూడండి).

బడ్జెట్ కేటాయించినప్పటికీ, ఊహించని అడ్డంకులు, అనగా భూసేకరణ సమస్యలు, కోర్టు కేసులు, ఒప్పంద సమస్యలు, ప్రకృతి వైపరీత్యాలు, కోవిడ్-19 మహమ్మారి, కేంద్ర జల సంఘం ఆకృతుల ఆమోదంలో జాప్యం మొదలైన వాటి కారణంగా దానిని ఖర్చు చేయలేకపోయామని ఆ శాఖ సమాధానం ఇచ్చింది (2023 మే).

కేటాయింపులు, వ్యయంలో తగ్గుదల ఉందని ప్రభుత్వం అంగీకరించింది (2024 నవంబర్), వివరణాత్మక సమాధానం సమర్పిస్తామని పేర్కొంది.

- పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నివేదించిన ప్రాజెక్టుపై చేసిన ఖర్చును ఆమోదించబడిన ఆర్థిక ఖాతాల ప్రకారం బుక్ చేయబడిన వ్యయంతో, పోలవరం ప్రాజెక్టు అథారిటీ నివేదించిన వ్యయంతో పోలిక, ***పట్టిక 2.1*** లో ఇవ్వడమైంది.

**పట్టిక 2.1: ఆర్థిక ఖాతాలు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రకారం, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నివేదించిన ఖర్చుల పోలిక**

**(₹ కోట్లలో)**

| సంవత్సరం | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నివేదించిన ఖర్చులు | ఆర్థిక ఖాతాల క్రింద బుక్ చేయబడిన ఖర్చులు | వ్యత్యాసము (+/-) | పోలవరం ప్రాజెక్టు అథారిటీ నివేదించిన ఖర్చులు |
|---|---|---|---|---|
| 2017-18 | 4,669.65 | 4,668.86 | (+)0.79 | 3,669.02 |
| 2018-19 | 3,051.19 | 3,061.68 | (-)10.49 | 2,962.60 |
| 2019-20 | 1,178.60 | 98.39 | (+)1,080.21 | 875.29 |
| 2020-21 | 1,305.98 | 1,302.03 | (+)3.95 | 1,089.28 |
| 2021-22 | 3,053.05 | 2,645.82 | (+)407.23 | 2,635.29 |
| 2022-23 | 941.19 | 930.42 | (+)10.77 | 905.81 |
| **మొత్తం** | **14,199.66** | **12,707.20** | **1,492.46** | **12,137.29** |

*మూలం: శాఖ అందించిన సమాచారం, ఆర్థిక పద్దుల నుండి సంకలనం చేయబడింది*

పై పట్టిక నుండి క్రింది విషయాలను చూడవచ్చు:

- పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నివేదించిన వ్యయం ఆర్థిక పద్దులలో బుక్ చేసిన దాని కంటే ఎక్కువగా ఉంది, ముఖ్యంగా 2019-20లో బుక్ చేసిన వ్యయం కంటే ₹1,080.21 కోట్లు ఎక్కువగా ఉంది. ఆడిట్‌కు సమర్పించిన రికార్డుల నుండి అధిక వ్యయం నివేదించడానికి గల కారణాలు వెల్లడికాలేదు.

- పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్, 2017-23 మధ్య ఈ ప్రాజెక్ట్‌పై చేసిన మొత్తం ఖర్చును ₹1,492.46 కోట్లు అధికంగా నివేదించారు.
- 2017-23లో పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఖాతాతో పోల్చినప్పుడు ఆర్థిక పద్దుల క్రింద బుక్ చేసిన ప్రాజెక్ట్ వ్యయంలో ₹569.91 కోట్ల వ్యత్యాసం ఉంది.

అందువల్ల, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ నివేదించిన వ్యయ గణాంకాలు, ఆర్థిక పద్దుల క్రింద బుక్ చేయబడిన ఖర్చుల మధ్య అసమతుల్యత ఉంది. ఈ అసమతుల్యతను సమన్వయం చేయాల్సిన అవసరం ఉంది.

***సిఫార్సు 2.1: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ద్వారా తగినంత మద్దతును కల్పించాలని, ప్రాజెక్ట్‌ను సకాలంలో పూర్తి చేయడానికి కేటాయించిన నిధులను గరిష్ఠంగా వినియోగించుకునేలా ఆ శాఖను నిర్దేశించాలి.***

### 2.1.2 బిల్లులు అపరిష్కృతంగా ఉండడం

2020-21 నుండి 2022-23 వరకు బడ్జెట్, వ్యయాల రికార్డులను పరిశీలించినప్పుడు, పనులు, భూసేకరణ, ఆర్&ఆర్ లకు సంబంధించిన బిల్లులకు చెల్లింపు చేయాల్సి ఉన్నప్పటికీ, కేటాయించిన బడ్జెట్‌ను వినియోగించలేదని వెల్లడైంది. 2023 మార్చి నాటికి, బడ్జెట్ అందుబాటులో ఉన్నప్పటికీ 2020-23 కాలానికి సంబంధించిన ₹2,097 కోట్ల విలువైన బిల్లులు ***పట్టిక 2.2*** లో చూపించినట్లుగా చెల్లింపు కోసం పెండింగ్‌లో ఉన్నా, బడ్జెట్ లో మిగులు చూపించారు.

**పట్టిక 2.2: బడ్జెట్ లభ్యత ఉన్నప్పటికీ చెల్లింపు కోసం పెండింగ్‌లో ఉన్న మొత్తాలు**

(₹ కోట్లలో)

| సంవత్సరం | మిగులు | చెల్లింపు కోసం పెండింగ్ లో ఉన్న మొత్తం | | | మొత్తం |
|---|---|---|---|---|---|
| | | పనులు | పునరావాసం & పునరుపాధి కల్పన | భూసేకరణ | |
| 2020-21 | 3,163 | 422 | 0 | 0 | 422 |
| 2021-22 | 3,015 | 209 | 0 | 0 | 209 |
| 2022-23 | 3,572 | 1,207 | 65 | 194 | 1,466 |
| **మొత్తం** | **9,750** | **1,838** | **65** | **194** | **2,097** |

*మూలం: శాఖ అందించిన సమాచారం ఆధారంగా సంకలనం చేయబడింది*

*గమనిక: 2017-2020 కాలంలో పెండింగ్ బిల్లులు లేవు*

ప్రభుత్వ స్థాయిలో ₹193.80 కోట్ల విలువైన భూసేకరణ బిల్లులు చెల్లింపుల కోసం పెండింగ్‌లో ఉన్నాయని, ***పట్టిక 2.3*** లో వివరించిన విధంగా 2023 మార్చి చివరి వరకు లబ్ధిదారులకు చెల్లింపు కోసం ₹83.17 కోట్ల బిల్లులు ఆమోదించాల్సి ఉందని ఆడిట్ గమనించడమైంది.

**పట్టిక 2.3: యూనిట్ వారీగా బిల్లుల అపరిష్కృత స్థితి**

**(₹ కోట్లలో)**

| క్రమ సంఖ్య | యూనిట్ పేరు | బిల్లులు దాఖలుచేసి చెల్లింపు కానివి | భూమి అవార్డు ఆమోదించబడి బిల్లులు దాఖలుచేయాల్సినవి |
|---|---|---|---|
| 1. | స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, భూసేకరణ, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ-1, రాజమహేంద్రవరం | 75.91 | 6.32 |
| 2. | స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, కూనవరం | 14.74 | 0.54 |
| 3. | స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), చింటూరు | 11.44 | -- |
| 4. | స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, ఏటపాక | 0.93 | 3.27 |
| 5. | స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-I, కొవ్వూరు | 20.03 | 7.03 |
| 6. | స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్ -II, ఏలూరు | 70.75 | 66.01 |
| మొత్తం | | **193.80** | **83.17** |

*మూలం: శాఖ అందించిన సమాచారం ఆధారంగా సంకలనం చేయబడింది*

బిల్లులు చెల్లించకపోవడం వల్ల గుత్తేదారు సంస్థలకు నిధుల అందుబాటు తగ్గిపోయి పనుల పురోగతిపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. పీడీఎఫ్ లకు భూసేకరణ, ఆర్&ఆర్ ప్రయోజనాలను చెల్లించకపోవడం వలన ఆర్ఎఫ్ సిటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 ప్రకారం పీడీఎఫ్ ల హక్కులను కోల్పోవడం/ఆలస్యంగా పొందడం జరుగుతుంది.

బడ్జెట్ విడుదలైన వెంటనే బిల్లులను సకాలంలో అప్‌లోడ్/ప్రాసెస్ చేశామని, అయితే, ఆర్థిక సంవత్సరాల చివరిలో నిధులు విడుదల కావడంతో వాటిని చెల్లించలేదని, శాఖ సమాధానం ఇచ్చింది (2022 డిసెంబర్). భూసేకరణ, ఆర్&ఆర్ గురించి, బిల్లులు చెల్లింపు కోసం సకాలంలో మళ్ళీ సమర్పించబడతాయని సమాధానం ఇచ్చారు.

సీఎఫ్ఎమ్ఎస్ లో[26], బిల్లులు అప్‌లోడ్ చేయబడిన తర్వాత, బడ్జెట్ కేటాయింపు, ఆర్థిక శాఖ అధికారమివ్వటం ఆధారంగా చెల్లింపులు జరుగుతాయి కావున సమాధానం ఆమోదయోగ్యం కాదు.

బడ్జెట్ కేటాయింపులు ఉన్నప్పటికీ, బిల్లులు చెల్లించడానికి నిధులను విడుదల చేయలేకపోయామని అంగీకరిస్తూనే, సంక్షేమ పథకాల ప్రాధాన్యత మౌళిక సదుపాయాల ప్రాజెక్టులపై ప్రభావం చూపిందని ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్). ప్రతి నెలా బిల్లులను పోలవరం ప్రాజెక్టు అథారిటీకి సమర్పించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం బిల్లుల రీయింబర్స్‌మెంట్‌ను ఆలస్యం చేసిందని, పరిహారం వారీగా పరిమితి, అంచనాలు అందుబాటులో లేకపోవడం మొదలైన సాకులతో కొన్ని ఖర్చులను తిరస్కరించిందని కూడా సమాధానం ఇచ్చారు.

బడ్జెట్ కేటాయింపులు అందుబాటులో ఉన్నప్పటికీ, గుత్తేదారు సంస్థలకు నిధుల లభ్యత తగ్గించబడింది, ఇది చివరికి పనుల పురోగతిని/పూర్తిచేయడాన్ని ప్రభావితం చేసింది, పీడీఎఫ్ లకు వారి చట్టబద్ధమైన హక్కులను పొందకుండా చేసింది కనుక సమాధానం ఆమోదయోగ్యం కాదు.

26 సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ అనేది రాష్ట్ర ప్రభుత్వం వారి ఆర్థిక వ్యవహారాలను మరింత పటిష్టంగా, సమర్థవంతంగా నిర్వహించడానికి అభివృద్ధి చేసిన ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్ వ్యవస్థ. ఈ వ్యవస్థలు సాధారణంగా బడ్జెట్, అకౌంటింగ్, రిపోర్టింగ్, విశ్లేషణలు వంటి లక్షణాలను కలిగి ఉంటాయి

### 2.1.3 ప్రాజెక్టుకు కేంద్ర సహాయం

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత, 2014 ఏప్రిల్ నుండి మిగిలిన నీటిపారుదల భాగం (పనులు, భూసేకరణ, ఆర్&ఆర్) ఖర్చుకు 100 శాతం నిధులను భారత ప్రభుత్వం భరించాలి. దీని ప్రకారం, మొత్తం ప్రాజెక్టు ప్రణాళిక రచించడానికి, అమలు చేయడానికి, పర్యవేక్షించడానికి భారత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఏ) అనే ప్రత్యేక ప్రయోజన సంస్థను ఏర్పాటు చేసింది (2014). పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు అమలు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ఖర్చును భారత ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది.

మొత్తం అంచనా వ్యయం ₹16,010.45 కోట్లలో, 2014 మార్చి నాటికి ₹4,730.71 కోట్లు ఖర్చు అయింది. 2014 ఏప్రిల్ నుండి 2023 మార్చి వరకు జరిగిన మొత్తం ఖర్చు ₹16,089.79 కోట్లు. పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ రికార్డుల ప్రకారం, ఇందులో ₹14,290 కోట్ల మొత్తాన్ని భారత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తిరిగి చెల్లించింది. 2014 ఏప్రిల్ నుండి 2023 మార్చి వరకు సంవత్సరం వారీగా ఆర్థిక పద్దులలో బుక్ చేసిన జమలు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నివేదించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ఖర్చు యొక్క తిరిగి చెల్లింపు ***పట్టిక 2.4***లో చూపడమైంది.

**పట్టిక 2.4: 2014-23లో భారత ప్రభుత్వం ద్వారా తిరిగి చెల్లింపు**

**(₹ కోట్లలో)**

| సంవత్సరం | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నివేదించిన ఖర్చు | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నివేదించిన తిరిగి చెల్లింపు | ఆర్థిక పద్దుల క్రింద బుక్ చేయబడిన తిరిగి చెల్లింపు | పోలవరం ప్రాజెక్టు అథారిటీ వెబ్‌సైట్ ప్రకారం తిరిగి చెల్లింపు |
|---|---|---|---|---|
| 2014-15 | 439.47 | 245.00 | 0.00 | 250.00 |
| 2015-16 | 1,867.94 | 590.00 | 635.00 | 600.00 |
| 2016-17 | 1,645.07 | 2,515.00 | 2,281.54 | 2,514.16 |
| 2017-18 | 3,669.03 | 1,993.00 | 2,425.72 | 2,000.00 |
| 2018-19 | 2,962.61 | 1,385.00 | 1,385.00 | 1,400.00 |
| 2019-20 | 875.30 | 1,780.00 | 1,780.00 | 1,850.00 |
| 2020-21 | 1,089.27 | 2,234.00 | 2,234.20 | 2,234.20 |
| 2021-22 | 2,635.30 | 1,877.00 | 1,897.70 | 1,898.80 |
| 2022-23 | 905.80 | 1,671.00 | 1,671.23 | 1,671.24 |
| **మొత్తం** | **16,089.79** | **14,290.00** | **14,310.39** | **14,418.40** |

*మూలం: శాఖ అందించిన సమాచారం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ వెబ్‌సైట్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యొక్క ఆర్థిక పద్దులు*

పైన పేర్కొన్న దాని నుండి చూస్తే, నివేదించబడిన తిరిగి చెల్లింపులు, ఆర్థిక పద్దుల క్రింద బుక్ చేయబడిన జమల మధ్య ₹20.39 కోట్ల వ్యత్యాసం ఉంది. ఇంకా, పోలవరం ప్రాజెక్టు అథారిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నదానికి, నివేదించబడిన తిరిగి చెల్లింపుల మధ్య ₹128.40 కోట్ల వ్యత్యాసం ఉంది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ 2022-23 సంవత్సరపు వార్షిక నివేదిక ప్రకారం, సంస్థాగత వ్యయం క్రింద పోలవరం ప్రాజెక్టు అథారిటీ చేసిన ఖర్చు ₹129.00 కోట్లు.

2017-18 నుండి 2022-23 వరకు అంశాల వారీగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ఖర్చు, భారత ప్రభుత్వం తిరిగి చెల్లించిన మొత్తం ***పట్టిక 2.5*** లో చూపబడింది.

**పట్టిక 2.5: 2017–23 కాలంలో అంశాల వారీ ఖర్చు, తిరిగి చెల్లింపు**

**(₹ కోట్లలో)**

| క్రమ సంఖ్య | అంశం పేరు | ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ఖర్చు | భారత ప్రభుత్వం తిరిగి చెల్లించిన మొత్తం | భారత ప్రభుత్వం తిరిగి చెల్లించాల్సిన మొత్తం |
|---|---|---|---|---|
| 1. | హెడ్ వర్క్స్ | 5,149.02 | 4,825.75 | 323.27 |
| 2. | కాలువలు | 1,722.26 | 1,204.45 | 517.81 |
| 3. | భూసేకరణ | 2,847.80 | 2,797.89 | 49.91 |
| 4. | పునరావాసం & పునరుపాధి కల్పన | 1,806.41 | 1,795.56 | 10.85 |
| 5. | పాలనా ఛార్జీలు | 611.81 | 484.56 | 127.25 |
| **మొత్తం** | | **12,137.30** | **11,108.21** | **1,029.09** |

*మూలం: విభాగం అందించిన సమాచారం*

### 2.1.3.1 పోలవరం ప్రాజెక్టు అథారిటీకి అవసరమైన పత్రాల సమర్పణలో ఆలస్యం

జలశక్తి మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు అథారిటీకి సమర్పించిన బిల్లుల పరిశీలన, తిరిగి చెల్లింపులో 10 నుండి 449 రోజుల వరకు అపరిమితమైన జాప్యం జరిగిందని ఆడిట్ గమనించడమైంది[27].

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి అవసరమైన అన్ని పత్రాలు[28] అందకపోవడంతో బిల్లులను జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపించలేకపోయామని, అందువల్ల బిల్లులను జలశక్తి మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేయడంలో, పంపించడంలో వారి వైపు నుండి ఎటువంటి ఆలస్యం జరగలేదని పోలవరం ప్రాజెక్టు అథారిటీ బదులిచ్చింది (2022 జూలై). పోలవరం నీటిపారుదల ప్రాజెక్టుకు నిధులను అదనపు బడ్జెట్ వనరుల ద్వారా, అంటే నాబార్డు[29] ద్వారా అందిస్తున్నామని, దీనికి అవసరమైన నిధులను ఏర్పాటు చేయడానికి రెండు నుండి మూడు వారాల సమయం పడుతుందని కూడా తెలిపింది.

అందువల్ల, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ద్వారా బిల్లుల ప్రక్రియలో జాప్యం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవసరమైన పత్రాలను సమర్పించకపోవడం వల్ల జరిగిందని, పోలవరం ప్రాజెక్టు అథారిటీ పేర్కొన్న విధంగా అంశం/నెల/బిల్లు వారీగా జరిగిన ఖర్చుకు సంబంధించిన వివరాలను అందించడంలో స్పష్టత లేకపోవడం వల్ల జరిగిందని పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఇచ్చిన సమాధానం నుండి స్పష్టమవుతోంది.

పోలవరం ప్రాజెక్టు అథారిటీ సూచించిన విధంగా నోడల్ అధికారులను నియమించిన తర్వాత (2020 డిసెంబర్) బిల్లింగ్ ప్రక్రియ, తిరిగి చెల్లింపు విధానాన్ని ఇప్పుడు క్రమబద్ధీకరించామని, పోలవరం ప్రాజెక్టు అథారిటీ కోరుకున్న విధంగా అవసరమైన పత్రాలను సకాలంలో సమర్పించడం జరుగుతుందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 నవంబర్). నోడల్ అధికారులను నియమించినప్పటికీ (2020 డిసెంబర్), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా పోలవరం ప్రాజెక్టు అథారిటీకి బిల్లులు సమర్పించడం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ జలశక్తి మంత్రిత్వ శాఖకు తదుపరి సిఫార్సు చేయడం మధ్య 10 నుండి 70 రోజుల వరకు జాప్యం జరిగినందువల్ల సమాధానం ఆమోదయోగ్యం కాదు.

ఆడిట్ కాలంలో బిల్లులతో పాటు అవసరమైన అన్ని పత్రాలను పోలవరం ప్రాజెక్టు అథారిటీకి సకాలంలో సమర్పించడం వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు అథారిటీకి బిల్లులను సమర్పించడం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ద్వారా భారత ప్రభుత్వానికి తిరిగి చెల్లింపును సిఫార్సు చేయడం మధ్య సమయం తగ్గేది.

---

27 పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్, ధవళేశ్వరం అందించిన సమాచారం ప్రకారం

28 చేసిన ఖర్చులకు సంబంధించిన ఆడిట్ సర్టిఫికెట్లు, భూ సేకరణ, ఆర్&ఆర్ మొదలైన వాటి నెల వారీగా, బిల్లుల వారీగా ఖర్చు వివరాలు

29 జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు

### 2.1.3.2 పెట్టుబడి అనుమతిలో ఆలస్యం

ఈ ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తయారుచేసిన ₹10,151.05 కోట్ల అసలు వ్యయ అంచనాకు (2005-06 ధరల స్థాయి) ప్రణాళికా సంఘం పెట్టుబడి అనుమతిని మంజూరు చేసింది (2009). తదనంతరం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాజెక్టు వ్యయాన్ని (1వ ఆర్ సీఈ) 2010-11 ధరల స్థాయితో ₹16,010.45 కోట్లకు సవరించింది, దీనికి భారత ప్రభుత్వం పెట్టుబడి అనుమతిని మంజూరు చేసింది (2017 ఫిబ్రవరి).
తదనంతరం, ప్రాజెక్టు వ్యయాన్ని (2వ సవరించిన వ్యయ అంచనా) ₹55,548.87 కోట్లకు (2017-18 ధరల స్థాయి వద్ద) సవరించారు. దీనిని 2019లో భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖ పరిగణించి, ఖర్చు పెరుగుదలకు గల కారణాలను పరిశీలించాలని ఆర్ సీసీ[30]కి సూచించింది. ఆర్ఎఫ్ సిటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 ప్రకారం మెరుగైన పరిహారం చెల్లించడం, మునుపటి అంచనాలలో అవసరానికి[31] తగినంత భూమిని పొందుపరచకపోవడం వల్ల ప్రాజెక్టు వ్యయంలో ₹39,538.42 కోట్ల ప్రతిపాదిత పెరుగుదల జరిగింది. ఆర్ సీసీ (2020 మార్చి) ప్రతిపాదిత మొత్తానికి బదులుగా సవరించిన వ్యయాన్ని ₹47,725.74 కోట్లకు పెంచుతూ, భూసేకరణ[32], ఆర్&ఆర్[33], కాలువల[34] వ్యయ భాగాన్ని పరిమితం చేస్తూ, వాటిలోని లోపాలను ఎత్తి చూపింది. 2023 మార్చి నాటికి, 2వ ఆర్ సీఈని భారత ప్రభుత్వం ఇంకా ఆమోదించలేదు.

పోలవరం ప్రాజెక్టు అథారిటీ ద్వారా 2వ ఆర్ సీఈలో గుర్తించిన లోపాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివరణలను సమర్పించింది (2021 జూన్). అయితే, పాక్షిక సమ్మతి మాత్రమే నివేదించబడింది (2021 జూన్, నవంబర్), సవరించవలసిన లోపాలలో ఈ క్రింది అంశాలు ఉన్నాయి.:

- పంపిణీ వ్యవస్థ/ఆయకట్టు అభివృద్ధిని ప్రాజెక్ట్‌లోని ఇతర అంశాలతో పాటే అమలు చేయాలి. అయితే, పంపిణీ వ్యవస్థ యొక్క వివరణాత్మక ప్రాజెక్టు నివేదికను పీపీఏ/సీడబ్ల్యూసీ ఇంకా ఆమోదించలేదు, ఇది పెట్టుబడి ప్రతిపాదనను ఆమోదించడానికి ముందస్తు అవసరం.

- పెట్టుబడి ప్రతిపాదనలను ఆమోదించడానికి తరలించవలసిన పీడీఎఫ్ లకు సంబంధించిన నిర్దిష్ట ఆర్&ఆర్ వివరాలు తప్పనిసరి. ఈఎల్ (+) 41.15 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో ఉన్న పీడీఎఫ్ ల సామాజిక ఆర్థిక సర్వే (ఎస్ఈఎస్) పూర్తయిన తర్వాత మాత్రమే వారి నిర్దిష్ట వివరాలు తెలుస్తాయి. సామాజిక, ఆర్థిక సర్వే పూర్తి కానందున, దీనికి సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జలవనరుల శాఖ పోలవరం ప్రాజెక్టు అథారిటీకి సమర్పించలేదు.

పైన పేర్కొన్న దాని ప్రకారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా సామాజిక ఆర్థిక సర్వే పూర్తి చేయడంలో, పంపిణీ వ్యవస్థ యొక్క వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక ఆమోదించడంలో జాప్యం ఫలితంగా, భారత ప్రభుత్వం పెట్టుబడి అనుమతి ఇవ్వడంలో జాప్యం జరిగిందని స్పష్టమవుతోంది.

భారత ప్రభుత్వ నిధుల నిబద్ధతతో ముడిపడి ఉన్న ముసాయిదా ఆర్&ఆర్ పథకాన్ని ఆమోదించిన తర్వాతే సామాజిక ఆర్థిక సర్వేను ఖరారు చేయగలమని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 జూన్). ఇంకా, పంపిణీ వ్యవస్థను పూర్తి చేయడం అనేది భారీ మొత్తంలో పనిని కలిగి ఉన్న నిరంతర ప్రక్రియ అని తెలిపింది.

---

30 జేఎస్ & ఎఫ్ఏ, ఎమ్ఓడబ్ల్యూఆర్, ఆర్ డీ&జీఆర్ నేతృత్వంలో

31 పని, ముంపు, ఆర్&ఆర్ కార్యకలాపాల కోసం

32 ఎ) మొదటి ఆర్‌సిఇలో ఆమోదించబడిన భూమి అవసరాన్ని అలాగే ఉంచారు (బి) ఎకరానికి భూమి పరిహారం రేటును ₹11.52 లక్షల నుండి ₹10.91 లక్షలకు తగ్గించడం

33 (ఎ) ఒక్కో ఇంటికి పరిహారం ₹3.15 లక్షల నుండి ₹2.85 లక్షలకు తగ్గింపు (బి) ఒక్కో పీడీఎఫ్ కు మౌలిక సదుపాయాలు/సౌకర్యాల ఖర్చు ₹7.00 లక్షల నుండి ₹6.52 లక్షలకు తగ్గింపు

34 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల సామర్థ్యాలను సవరణ కారణంగా ఖర్చు పెరగడం వలన ఈ పని అంశాల ధర 2013-14 ధర స్థాయిలో స్తంభింపజేయబడింది

పైన పేర్కొన్న (+) 41.15 మీటర్ల కంటూర్ వరకు సామాజిక ఆర్థిక సర్వే 2022 లో పూర్తయిందని శాఖ నివేదించింది, అయితే, ఆర్&ఆర్ పథకం ఇంకా ఖరారు కాలేదు. ఇంకా, పంపిణీ వ్యవస్థల కోసం సర్వే, లెవలింగ్ కార్యకలాపాలు, ప్రాజెక్టు పనులు ప్రారంభించినప్పటి నుండి 14 సంవత్సరాల ఆలస్యంగా అంటే 2019 నవంబర్/డిసెంబర్ లో మాత్రమే చేపట్టబడ్డాయి. ఎడమ ప్రధాన కాలువ, కుడి ప్రధాన కాలువ రెండింటికీ కాలువ అమరికను ఖరారు చేసిన వెంటనే పంపిణీ వ్యవస్థ కోసం వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక తయారీని చేపట్టి ఉంటే, పెట్టుబడి అనుమతిలో జాప్యం నివారించబడి ఉండేది, కావున ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు.

***సిఫార్సు 2.2: ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి భారత ప్రభుత్వం ద్వారా ఆర్ సీఈ ఆమోదం పొందేందుకు వీలుగా, రాష్ట్ర ప్రభుత్వం సామాజిక-ఆర్థిక సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని, కేంద్ర జల సంఘం ద్వారా పంపిణీ వ్యవస్థల యొక్క వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక ఆమోదం పొందాలి.***

## 2.2 ప్రాజెక్టు స్థితి

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు యొక్క అంశాలలో సివిల్ పనులు[35], భూసేకరణ, ఆర్&ఆర్ ఉన్నాయి. అంశాల వారీగా అసలు వ్యయ అంచనాలు, పనుల కోసం ₹8,258 కోట్లు, భూసేకరణ కోసం ₹1,149 కోట్లు, ఆర్&ఆర్ కోసం ఎస్ఎస్ఆర్ 2005-06 ప్రకారం ₹745 కోట్లు, పవర్‌హౌస్ కోసం ₹5,339 కోట్లు. అంశాల వారీగా వ్యయ అంచనాలు పెంచబడి, 2వ ఆర్ సీఈ (2017-18 ధరల స్థాయి వద్ద ₹55,548.87 కోట్లు) ప్రకారం అంశాల వారీగా వ్యయ అంచనా ***పటం 2.4*** లో చూపడమైంది.

**పటం 2.4: 2వ ఆర్‌సీఈ ప్రకారం అంశాల వారీ ఖర్చు**

**(₹ కోట్లలో)**




*మూలం: 2వ సవరించిన వ్యయ అంచనా నివేదిక, శాఖ రికార్డులు*

*★ సవరించిన ఖర్చు (2016-17) కేంద్ర విద్యుత్ అథారిటీకి సమర్పించబడింది, ఇది ఆర్ సీఈలో భాగం కాదు*

గుత్తేదారులు, గుత్త పద్ధతిలో తరచుగా మార్పులు, ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్స్ట్రక్షన్ (ఈపీసీ) నుండి గంపగుత్త/రివర్స్ టెండరింగ్‌కు[36] మారడం, పనుల కేటాయింపులో జాప్యం (3వ అధ్యాయంలో వివరంగా చర్చించడమైంది), పని అంశాల ఆకృతులలో మార్పు, కాలువల విడుదల సామర్థ్యం పెరుగుదల, ధరల పెరుగుదల, ఆర్ఎఫ్ సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 ను అనుసరించడం వల్ల భూసేకరణ, ఆర్&ఆర్ ఖర్చు పెరుగుదల మొదలైన వాటి కారణంగా ప్రతి అంశం ఖర్చు అనేక రెట్లు[37] పెరిగింది.

---

35 కాలువలు, డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్‌తో పాటు ప్రధాన ఆనకట్ట

36 రివర్స్ టెండరింగ్ అనేది ఒక సేకరణ పద్ధతి, దీనిలో కొనుగోలుదారుడు లక్ష్యంగా చేసుకున్న బిడ్డర్లను (సాధారణ బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొన్నవారు) పనిని పూర్తి చేసే ధరను (టెండరర్ ధర కంటే తక్కువ) అందించడానికి / కోట్ చేయడానికి ఆహ్వానిస్తాడు

37 పనులు 171 శాతం, భూ సేకరణ 687 శాతం, ఆర్&ఆర్ 3,138 శాతం

ప్రాజెక్టు వ్యయం పెరిగినప్పటికీ, తగినంత పురోగతి లేక, 2023 మార్చి నాటికి ప్రాజెక్టు మొత్తం అసంపూర్ణంగానే ఉంది. 2023 మార్చి నాటికి ప్రాజెక్టు యొక్క భౌతిక, ఆర్థిక పురోగతి శాతం ***పటం 2.5*** లో చూపబడింది.

**పటం 2.5: ప్రాజెక్టు స్థితి (శాతంలో)**




*మూలం: శాఖ రికార్డులు*

ఇంకా, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కోసం ఖర్చు చేయాల్సిన ₹47,725.74 కోట్లలో (ఆర్ సీసీ సిఫార్సు చేసిన విధంగా), 2014-23 కాలంలో 2023 మార్చి నాటికి ₹16,089.79 కోట్లు ఖర్చు చేయబడ్డాయి. ప్రాజెక్టు యొక్క ప్రతి అంశం యొక్క స్థితిని తదుపరి పేరాల్లో చర్చించడమైంది.

ముగింపు సమావేశం సందర్భంగా, ఇప్పుడు భారత ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు రెండు దశల్లో నిధులు సమకూర్చాలని నిర్ణయించిందని, మొదటి దశను 2026 మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని, ఒక సంవత్సరం పొడిగింపుకు అవకాశం ఉందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 నవంబర్).

### 2.2.1 సివిల్ పనుల స్థితి

పనులను 22 ప్యాకేజీలుగా విభజించి, మొదట ఈపీసీ విధానంలో అప్పగించారు. పనుల అంశం (పవర్‌హౌస్ అంశం మినహా) మొత్తం ఒప్పంద విలువ ₹11,794.24 కోట్లలో, ప్రాజెక్టు ప్రారంభం నుండి 79.24 శాతం ఆర్థిక పురోగతి నమోదుతో ₹9,345.34 కోట్లు ఖర్చు అయింది (2023 మార్చి నాటికి). ప్రతి ప్యాకేజీ యొక్క ఒప్పంద విలువ, అందులో ఉన్న అనుబంధ ఒప్పందాలు, నిమగ్నమైన గుత్తేదారులు, గుత్త పద్ధతి, ***అనుబంధం 2.1 (అ) (హెడ్‌వర్క్స్), అనుబంధం 2.1 (ఆ) (కాలువలు)*** లో వివరించడమైంది. 2023 మార్చి నాటికి పనుల స్థితి క్రింద చర్చించడమైంది:

#### (అ) హెడ్‌వర్క్స్

అనుసంధానికలతో (ఎడమ & కుడి రెండూ) సహా హెడ్‌వర్క్స్ లేదా ప్రధాన ఆనకట్టను ఏడు ప్యాకేజీలుగా విభజించి, ప్రారంభంలో (2005 మార్చి, 2006 ఆగస్టు) ఈపీసీ పద్ధతిలో మంజూరు చేయబడింది. 2023 మార్చి నాటికి, మంజూరైన ₹7,422.69 కోట్ల విలువైన పనులకు గాను, ₹5,757.48 కోట్లు ఖర్చు చేశారు. 17 సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా, హెడ్‌వర్క్స్ ఇంకా పూర్తి కాలేదు. 2023 మార్చి నాటికి, ప్యాకేజీ వారీగా పనుల భౌతిక, ఆర్థిక పురోగతి ***పటం 2.6*** లో చూపడమైంది.

పటం 2.6: హెడ్ వర్క్స్ పురోగతి (శాతంలో)




*మూలం: శాఖ రికార్డులు*

గుత్తేదారు సంస్థలను తరచుగా మార్చడం, ఆకృతులలో మార్పులు, ఆర్&ఆర్ పూర్తి చేయకపోవడం వల్ల పనుల అమలులో జాప్యం జరిగిందని ఆడిట్ గమనించింది. చాలా ప్యాకేజీలలో, ఈ క్రింది సందర్భాలలో తప్ప (ఈ అంశాలపై 3వ అధ్యాయంలో వివరణాత్మక చర్చ ఉంది) పని పూర్తి కాకపోవడానికి పని నెమ్మదిగా జరగడం కారణమని చెప్పవచ్చు:

- ప్రతిపాదిత రాతి-మట్టి ఆనకట్ట (ఈసీఆర్ఎఫ్ ఆనకట్ట-ప్రధాన ఆనకట్ట ప్యాకేజీ) క్రింద ₹399.77 కోట్ల వ్యయంతో నిర్మించిన డయాఫ్రమ్ వాల్, సమగ్ర ప్రాజెక్టు నివేదిక ప్రకారం ప్రణాళికాబద్ధమైన నిర్మాణ క్రమాన్ని పాటించకపోవడం, కట్టడాలపై వరద ప్రభావాన్ని తగ్గించడానికి గుత్తేదారు సంస్థ లేకపోవడం వల్ల దెబ్బతింది. ఫలితంగా, ప్రధాన రాతి-మట్టి ఆనకట్ట నిర్మాణం ప్రారంభించబడలేదు. డయాఫ్రమ్ వాల్ యొక్క దెబ్బతిన్న భాగాన్ని సరిదిద్దే పని పురోగతిలో ఉంది (2023 మార్చి).
- కుడి అనుసంధానికల (ప్యాకేజీ-64) విషయానికొస్తే, బలహీనమైన రాతి ప్రాంతంలో పనులు చేపట్టడం వల్ల కుడి ప్రధాన కాలువకు నీరు వెళ్ళే సొరంగం కూలిపోయింది (3వ అధ్యాయంలో వివరంగా చర్చించబడింది). అందువల్ల, కూలిపోయిన సొరంగం సరిదిద్దే పనిని శాఖ ఇంకా చేపట్టకపోవడంతో, ₹70.89 కోట్ల వ్యయం చేసిన తర్వాత కూడా ప్యాకేజీ అసంపూర్ణంగా ఉంది.
- ఎడమ అనుసంధానికల (ప్యాకేజీ-67) పనిలో ఎక్కువ భాగం పూర్తయినప్పటికీ (నౌకాయాన కాలువ, సంబంధిత పనులు తప్ప), ఇన్-ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యుఏఐ) ఆకృతులను[38] ఖరారు చేయకపోవడంతో, ₹74.77 కోట్లు ఖర్చు చేసిన తర్వాత, ప్రభుత్వం ఆ పనిని ముందుగానే మూసివేసింది (2020 జూలై).

భూసేకరణ సమస్యల కారణంగా గుత్తేదారు సంస్థలకు భూమిని అప్పగించడంలో జాప్యం జరిగిందని శాఖ సమాధానం ఇచ్చింది (2022 ఆగస్టు). అయితే, ఈ సమస్యలను రెవెన్యూ అధికారులు 2015 సంవత్సరంలో మాత్రమే పరిష్కరించారు. దీని ఫలితంగా ఎస్ఎస్ఆర్ 2015-16తో రేట్ల సవరణ జరిగగా, దానిని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ఇంకా, గుత్తేదారు సంస్థలు పనిలో పురోగతిని చూపకపోవడంతో, మిగిలిన పనులను రద్దుచేసి, గంపగుత్త (ఎల్ఎస్) పద్ధతి క్రింద మరొక గుత్తేదారు సంస్థకు అప్పగించారు. గుత్తేదారు సంస్థలను మార్చాలనే నిర్ణయం అధీకృత అధికారుల ఆదేశాల ప్రకారం, స్థల పరిస్థితుల ప్రకారం జరిగిందని కూడా సమాధానం ఇవ్వబడింది. గుత్తేదారు సంస్థలు మారినప్పటికీ పనులలో గణనీయమైన పురోగతి లేదు, పైన పేర్కొన్న ప్యాకేజీలలో పనులు నిలిచిపోయాయి. అంతే కాకుండా, పని యొక్క సమయపాలనకు కట్టుబడి ఉండని సంస్థలపై ఒప్పంద నిబంధనలను అమలు చేయడంలో శాఖ విఫలమైనందున సమాధానం ఆమోదయోగ్యం కాదు.

ప్రభుత్వం నుండి సమాధానం రావలసి ఉంది (2024 నవంబర్).

---

38 నౌకాయాన కాలువ/సొరంగాన్ని ఏర్పాటుచేయాల్సిన ప్రదేశం

### (ఆ) కాలువల వ్యవస్థ

కుడి ప్రధాన కాలువ, ఎడమ ప్రధాన కాలువ పనులను 15 ప్యాకేజీలుగా విభజించారు (కుడి ప్రధాన కాలువ: ఏడు ప్యాకేజీలు, ఎడమ ప్రధాన కాలువ: ఎనిమిది ప్యాకేజీలు). కాలువల పనులను 2005 సంవత్సరంలో 24 నెలల్లో, అంటే 2007 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో చేపట్టారు. 17 సంవత్సరాలు గడిచినా, కుడి ప్రధాన కాలువ[39], ఎడమ ప్రధాన కాలువ పనులు ఇంకా పూర్తి కాలేదు.

ఎడమ ప్రధాన కాలువ విషయానికొస్తే, మొత్తం ఒప్పంద విలువ ₹2,317.90 కోట్లలో, 2023 మార్చి నాటికి ₹1,683.17 కోట్లు ఖర్చు చేశారు. ఎడమ ప్రధాన కాలువ పనుల మొత్తం భౌతిక, ఆర్థిక పురోగతి వరుసగా 76.05, 72.62 శాతంగా ఉన్నాయి. ఎడమ ప్రధాన కాలువలో పని నెమ్మదిగా జరగడానికి భూసేకరణ ప్రక్రియ పూర్తి కాకపోవడం కారణమని చెప్పవచ్చు.

కుడి ప్రధాన కాలువ విషయానికొస్తే, మొత్తం ఒప్పంద విలువ ₹2,053.65 కోట్లలో, 2023 మార్చి నాటికి ₹1,904.69 కోట్లు ఖర్చు చేశారు. కుడి ప్రధాన కాలువ పనుల మొత్తం భౌతిక, ఆర్థిక పురోగతి వరుసగా 96.14, 92.75 శాతంగా ఉన్నాయి. అయితే, డిజైన్లు, వ్యయ అంచనాలు ఇంకా ఖరారు కానందున, పంపిణీ వ్యవస్థ, మైనర్లు (ఫీల్డ్ ఛానెల్‌లు) ఇంకా చేపట్టలేదు.

### (ఇ) పోలవరం జల విద్యుత్ ప్రాజెక్టు

ఏపీజెన్కో ₹3,013.68 కోట్ల మొత్తానికి సాంకేతిక-ఆర్థిక సమ్మతి (టీఈసీ) పొంది[40] (2012 ఫిబ్రవరి), 2018 మార్చి నాటికి విద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఖర్చు ₹3,013.68 కోట్ల నుండి ₹5,338.95 కోట్లకు (2016-17) సవరించగా, ఈ ప్రాజెక్టుపై ఇప్పటి వరకు చేసిన మొత్తం ఖర్చు ₹ 884.89 కోట్లు. భౌతిక, ఆర్థిక పురోగతి వరుసగా 12, 17 శాతంగా ఉన్నాయి. ప్రాజెక్టును ప్రారంభించడానికి సవరించిన లక్ష్యం 2026 జనవరి గా నిర్ణయించారు.

## 2.2.2 భూసేకరణ స్థితి

కేంద్ర జల సంఘానికి సమర్పించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (2010-11 ధరల స్థాయి) ప్రకారం, ఈ ప్రాజెక్టు కోసం సేకరించాల్సిన భూమిని మొదట 1,35,043 ఎకరాలుగా[41] అంచనా వేశారు. అయితే, 2వ ఆర్ సీఈ (2017-18 ధరల స్థాయి) సమయంలో, దానిని 1,79,770 ఎకరాలకు[42] పెంచారు. 2వ ఆర్ సీసీ నివేదిక ప్రకారం, భూసేకరణ అంచనా వ్యయం 2005-06 ధరల స్థాయి వద్ద ₹1,153.78 కోట్ల నుండి 2017-18 ధరల స్థాయి వద్ద ₹13,077.15 కోట్లకు పెరిగింది.

భూసేకరణ ఖర్చు పెరగడానికి ప్రధాన కారణం, ఆర్ఎఫ్ సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 ప్రవేశపెట్టడం, పంపిణీ వ్యవస్థ కోసం అవసరమైన 6,158 ఎకరాల భూమిని మొదటి ఆర్ సీఈలో చేర్చకపోవడం, ఆర్ఎఫ్ సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 ప్రకారం ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి, అసైన్డ్ భూములకు అందించాల్సిన 'భూమికి-భూమి' యొక్క విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడం. మొత్తం అవసరమైన 1,79,770 ఎకరాల భూమిలో 1,67,765 ఎకరాల[43] కోసం భూసేకరణ అధికారులకు (ఎల్ఏఓలు) అభ్యర్థనలు దాఖలు చేయగా 1,13,119 ఎకరాలను ₹5,457 కోట్ల వ్యయంతో సేకరించారు. మిగిలిన 54,248.45 ఎకరాల భూమిని ₹6,639.55 కోట్ల వ్యయంతో సేకరించాల్సి ఉంది. ఇంకా, భూసేకరణలో జాప్యం వల్ల ఖజానాపై ఆర్థిక భారం పెరుగుతుంది (భూసేకరణపై వివరణాత్మక చర్చ 5వ అధ్యాయంలో ఉంది).

---

[39] కుడి ప్రధాన కాలువ పనులలో 12.95 కి.మీ. కాలువ లైనింగ్, 41 నిర్మాణాలు తప్ప మిగిలిన అన్ని పనులు పూర్తయ్యాయి

[40] కేంద్ర విద్యుత్ సంస్థ నుండి

[41] పట్టా భూమి: 95,971.54 ఎకరాలు; అటవీ భూమి: 9,219.60 ఎకరాలు, పోరంబోకు భూమి: 29,852 ఎకరాలు

[42] పట్టా భూమి (ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి, డీ-పట్టా, పట్టాతో సహా): 1,55,464.85 ఎకరాలు; అటవీ భూమి: 8,727.27 ఎకరాలు, పోరంబోకు (ప్రభుత్వ) భూమి: 15,578 ఎకరాలు

[43] 388.77 ఎకరాల (54,646.06 ఎకరాలు – 54,257.29 ఎకరాలు) వ్యత్యాసాన్ని భూ సేకరణ అధికారులు ఇంజనీరింగ్ విభాగంతో సమన్వయం చేసుకోవాలి

### 2.2.3 పునరావాసం, పునరుపాధి కల్పన స్థితి

పునరావాసం & పునరుపాధి కల్పన (ఆర్&ఆర్) ఖర్చులో పీడీఎఫ్ లకు ఇళ్ల నిర్మాణం, మునిగిపోయిన ఇళ్లకు పరిహారం, ఆర్&ఆర్ ప్రయోజనాలు, ఆర్&ఆర్ కాలనీలలో మౌళిక సదుపాయాల అభివృద్ధి వంటి వివిధ అంశాలు ఉన్నాయి. అసలు అంచనా (2005-06) ప్రకారం, ₹744.60 కోట్ల అంచనా వ్యయంతో 44,574 పీడీఎఫ్ లకు తిరిగి నివాసం ఏర్పాటు చేయాల్సి ఉంది, దీనిని 1,06,006 పీడీఎఫ్ లకు (ఇందులో గిరిజన కుటుంబాలు 56,495) ₹20,091.09 కోట్లకు (2017-18 ఆర్ సీఈ) పెంచారు. అయితే, 2023 మార్చి నాటికి, మొత్తం 11,677 పీడీఎఫ్ లకు (మొత్తం పీడీఎఫ్ లలో 11 శాతం) మాత్రమే పునరావాసం కల్పించబడింది.

పీడీఎఫ్ లలో పెరుగుదల, ప్రధానంగా పూర్తి జలాశయ స్థాయికి క్రింద ఉన్న అదనపు[44] ఆవాస ప్రాంతాలను గుర్తించడం వల్ల జరిగింది. పీడీఎఫ్ ల సంఖ్యలో పెరుగుదల, ఆర్&ఆర్ కాలనీలకు, సేకరించిన వ్యవసాయ భూమికి 'భూమికి-భూమి' క్రింద బదిలీలకు భూసేకరణలో జాప్యం, ఆర్&ఆర్ నగదు పరిహారం చెల్లింపులో జాప్యం వంటి వివిధ అంశాలు ప్రాజెక్టు వ్యయంలో పెరుగుదలకు దారితీశాయి (ఆర్&ఆర్ పై వివరణాత్మక చర్చ 6వ అధ్యాయంలో చేయబడింది).

## 2.3 పర్యావరణ అంశాలు

ఏదైనా నీటిపారుదల ప్రాజెక్టు అమలు చేసినప్పుడు, అది ఆ ప్రాంతంలో సాధారణంగా సుసంపన్నతను పెంపొందించడంలో సహాయపడుతుంది. అయితే, కొన్ని ప్రతికూల పర్యావరణ, జీవావరణ ప్రభావాలు తప్పనిసరిగా ఉంటాయి, వీటిని తగిన పరిష్కార చర్యల ద్వారా తగ్గించాలి. పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గించడానికి, ఎదురయ్యే ప్రతికూల ప్రభావాలను అంచనా వేయడానికి సరైన పర్యావరణ నిర్వహణ ప్రణాళికను రూపొందించుకోవాలి. ప్రాజెక్టు నుండి గరిష్ట ప్రయోజనాలను పొందడానికి, ప్రాజెక్టు ప్రణాళిక దశ నుండి వివిధ అభివృద్ధి దశల వరకు ప్రతికూల ప్రభావాలపై తగిన నియంత్రణ చర్యలను చేపట్టడానికి ఇది సహాయపడుతుంది.

### 2.3.1 పర్యావరణ & అటవీ మంత్రిత్వ శాఖ నిర్దేశించిన నిబంధనలను పాటించకపోవడం

భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ (ఎమ్ఓఈఎఫ్) 3,731.07 హెక్టార్ల అటవీ భూమిని పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు అమలు కోసం మళ్లించడానికి ఆమోదం తెలిపేటప్పుడు (2010 జూలై) 32 నిబంధనలను[45] పాటించాలని నిర్దేశించింది. 32 నిబంధనలలో, క్రింది రెండు నిబంధనలు ఆడిట్‌లో పరిశీలించబడ్డాయి.

అ) యూజర్ ఏజెన్సీ నాలుగు అడుగుల ఎత్తు గల రీఇన్ఫోర్స్డ్ సిమెంట్ కాంక్రీట్ స్తంభాలను ఉపయోగించి ప్రాజెక్టు ఖర్చుతో మళ్లించబడిన అటవీ ప్రాంతాన్ని భూమిపై సరిహద్దులను గుర్తించాలి, ప్రతి స్తంభంపై క్రమ సంఖ్య, ముందు, వెనుకలకు చిహ్నము, పక్క పక్కన ఉన్న రెండు స్తంభాల మధ్య దూరం చెక్కబడి ఉండాలి.

ఆ) జలాశయాలు, కాలువల వెంట ఖాళీగా ఉన్న భూమిలో స్థానిక చెట్ల జాతులను నాటడం చేపట్టాలి.

ఆడిట్ గమనించిన దాని ప్రకారం, ఎస్ఎస్ఆర్ 2010-11 ఆధారంగా, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ క్రింద రీఇన్ఫోర్స్డ్ సిమెంట్ కాంక్రీట్ స్తంభాల నిర్మాణం కోసం ₹45.30 లక్షల మొత్తానికి సాంకేతిక అనుమతి పొందినట్లు వెల్లడైంది. అయితే, ఆ పనిని చేపట్టలేదు. తదనంతరం, "అటవీ సరిహద్దులను గుర్తించడానికి ప్రీ-కాస్ట్ రీఇన్ఫోర్స్డ్ సిమెంట్ కాంక్రీట్ స్తంభాల సరఫరా, అమర్చడం" కోసం ₹85.20 లక్షలకు[46] ఎస్ఎస్ఆర్ 2021-22 ఆధారంగా సవరించిన అంచనాను రూపొందించారు (2021 ఏప్రిల్).

---

44 2005 సమగ్ర ప్రాజెక్టు నివేదికలో పేర్కొన్న 268 ఆవాసాలు 2023 మార్చి నాటికి 373 ఆవాసాలకు పెరిగాయి

45 పరిహార అటవీకరణ కోసం అటవీయేతర భూమిని గుర్తించడం, రీఇన్ఫోర్స్డ్ సిమెంట్ కాంక్రీట్ స్తంభాలతో అటవీ ప్రాంతాన్ని గుర్తించడం మొదలైన వాటి కోసం పరీవాహక ప్రాంత పరిచర్య ప్రణాళిక అమలు

46 హెడ్‌వర్క్స్ కోసం ఉపయోగించే అటవీ భూమిని గుర్తించడానికి: ₹78.86 లక్షలు, ఎడమ ప్రధాన కాలువ: ₹4.93 లక్షలు, కుడి ప్రధాన కాలువ: ₹5.90 లక్షలు

ఎడమ ప్రధాన కాలువ పనులకు సంబంధించి, 168 రీఇన్ఫోర్స్డ్ సిమెంట్ కాంక్రీట్ స్తంభాలకు అంచనా (₹4.93 లక్షలు) సిద్ధం చేసినప్పటికీ, ఆ పనిని శాఖ ఇంకా చేపట్టలేదు. ₹5.90 లక్షల వ్యయంతో చేపట్టిన కుడి ప్రధాన కాలువ పనులలో, 104 రీఇన్ఫోర్స్డ్ సిమెంట్ కాంక్రీట్ స్తంభాలలో, శాఖ ఇప్పటివరకు 29 రీఇన్ఫోర్స్డ్ సిమెంట్ కాంక్రీట్ స్తంభాలను మాత్రమే స్థాపించగా, మిగిలిన 75 రీఇన్ఫోర్స్డ్ సిమెంట్ కాంక్రీట్ స్తంభాలను ఇంకా స్థాపించాల్సి ఉంది. అయితే, హెడ్‌వర్క్స్ ప్రాంతంలో అటవీ భూమి సరిహద్దులను గుర్తించినట్లు చూపించడానికి ఎటువంటి రికార్డులు లేవు. ఇంకా, ఆ శాఖ లక్ష్యంగా పెట్టుకున్న 73,788 మొక్కలలో (ఎడమ ప్రధాన కాలువ: 39,397, కుడి ప్రధాన కాలువ: 34,391) 19,981 మొక్కలను (ఎడమ ప్రధాన కాలువ: 4,388, కుడి ప్రధాన కాలువ: 15,593) నాటింది.

పర్యావరణ & అటవీ మంత్రిత్వ శాఖ నిర్దేశించిన నిబంధనలను పాటించకపోవడం వలన జరిమానా విధించబడవచ్చు లేదా పనులు నిలిపివేయబడవచ్చు, అది కాలువ పనులు పూర్తి చేయడంలో ఆలస్యానికి దారితీస్తుంది.

ప్రాజెక్టులో ఉపయోగించిన అటవీ భూమిని గుర్తించడానికి, స్థానిక చెట్ల జాతులను నాటడానికి పర్యావరణ & అటవీ మంత్రిత్వ శాఖ నిర్దేశించిన నిబంధనలకు తగిన ప్రాముఖ్యత ఇవ్వబడుతుందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 జూన్).

ఎడమ ప్రధాన కాలువలోని కొన్ని ప్రాంతాలు మినహా, కాలువల తవ్వకం చాలా వరకు పూర్తయినందున, ఆ శాఖ, పర్యావరణ & అటవీ మంత్రిత్వ శాఖ నిర్దేశించిన మార్గదర్శకాలకు తగిన ప్రాముఖ్యత ఇచ్చి, అటవీ భూమిని గుర్తించడం, స్థానిక జాతులతో మొక్కలను నాటడం వేగవంతం చేసి ఉండాలి.

### 2.3.2 పొరుగు రాష్ట్రాలలో రక్షణ కరకట్టల నిర్మాణం

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు పూర్తయిన తర్వాత, జలాశయం యొక్క బ్యాక్ వాటర్స్ తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాలకు కూడా విస్తరిస్తాయి. ఎటువంటి ఉపశమన చర్యలు తీసుకోకపోతే, ఈ ప్రాజెక్టు యొక్క బ్యాక్ వాటర్స్ కారణంగా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలలో 12 గ్రామాలు మునిగిపోయి[47], 3,337 ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలు (పీఏఎఫ్ లు) నిర్వాసితులవుతాయి.

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ముంపు అంశాలను పరిష్కరించడానికి ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ (గతంలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో భాగం), ఒడిశా రాష్ట్రాలు ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి (1980 ఏప్రిల్). ఒప్పందంలోని నిబంధనల ప్రకారం, భూములు ముంపునకు గురికాకుండా ఉండటానికి, గిరిజన ప్రజల ప్రయోజనాలను కాపాడటానికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2005-06 సమగ్ర ప్రాజెక్టు నివేదికలో ₹278.40 కోట్ల (2017-18 ధరల స్థాయి లో ₹710.99 కోట్లు) ఖర్చుతో ఒడిశాలోని సీలేరు, శబరి నదుల వెంబడి 30 కి.మీ. పొడవునా, ఛత్తీస్‌గఢ్‌లోని శబరి నది వెంబడి 29.12 కి.మీ. పొడవునా అవసరమైన డ్రైనేజీ స్లూయిస్‌లతో కూడిన రక్షణ కరకట్టలను ప్రతిపాదించింది (1978[48]/1980[49]).

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు మొదటి దశకు పర్యావరణ అనుమతి ఇవ్వాలన్న పర్యావరణ & అటవీ మంత్రిత్వ శాఖ నిర్ణయంతో అసంతృప్తి వహిస్తూ, ఒడిశా ప్రభుత్వం సుప్రీంకోర్టులో 'ఒరిజినల్ సూట్' (2007 లో ఓఎస్ సంఖ్య 4) దాఖలు చేసింది. పర్యావరణ & అటవీ మంత్రిత్వ శాఖ యొక్క నిపుణుల అంచనా కమిటీ (ఈఏసీ), ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో ప్రజా విచారణ నిర్వహించడానికి చర్యలు ప్రారంభించాలని, కమిటీకి తిరిగి నివేదించాలని ప్రాజెక్టు ప్రతిపాదకులను ఆదేశించింది (2009 మార్చి). ప్రాజెక్టు ప్రతిపాదకులు పర్యావరణ అనుమతి కోరుతూ (2005లో)

---

47 ఛత్తీస్‌గఢ్: నాలుగు గ్రామాలు 11,766 మందిని కలిగి ఉన్న 2,335 ప్రాజెక్ట్ ప్రభావిత కుటుంబాలు నిర్వాసితమయ్యాయి; ఒడిశా: ఎనిమిది గ్రామాలు 6,316 మందిని కలిగి ఉన్న 1,002 ప్రాజెక్ట్ ప్రభావిత కుటుంబాలు నిర్వాసితమయ్యాయి

48 పూర్వపు ఆంధ్రప్రదేశ్ & మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల మధ్య త్రైపాక్షిక ఒప్పందం

49 జీడబ్ల్యూడీటీ అవార్డు యొక్క నిబంధన VI లో సూచించిన విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించింది

ప్రతిపాదించిన (2010 నవంబర్) మార్పులను నదీ లోయ, జల విద్యుత్ ప్రాజెక్టుల నిపుణుల అంచనా కమిటీ సమీక్షిస్తుందని పర్యావరణ & అటవీ మంత్రిత్వ శాఖ పేర్కొంది[50] (2011 ఫిబ్రవరి). ఈ విషయం సమీక్షించబడే వరకు, 'పనిని నిలిపివేయాలని' పర్యావరణ & అటవీ మంత్రిత్వ శాఖ ఆదేశించింది (2011 ఫిబ్రవరి). ఇంకా, ఛత్తీస్‌గఢ్ (2011 లో ఓఎస్ సంఖ్య 3), తెలంగాణ (2019లో ఓఎస్ సంఖ్య 1) ప్రభుత్వాలు కూడా ప్రాజెక్టు యొక్క పర్యావరణ అంశాలు, ముంపు అంశాలపై గౌరవ సుప్రీం కోర్టులో కేసులు దాఖలు చేశాయి.

పర్యావరణ & అటవీ మంత్రిత్వ శాఖ ద్వారా పర్యావరణ అనుమతి పొందిన (2005) పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు పరిధిలో ఎటువంటి మార్పు చేయలేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (ప్రాజెక్టులు) పర్యావరణ & అటవీ మంత్రిత్వ శాఖకు సమాధానం ఇచ్చారు[51] (2011 మార్చి). ఆయా రాష్ట్రాల్లో ముంపును నివారించడానికి శబరి, సీలేరు నదులపై రక్షిత కరకట్టల నిర్మాణం కోసం ప్రజా విచారణలు నిర్వహించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో అధీకృత అధికారులను సంప్రదించిందని కూడా పేర్కొన్నారు. అయితే, రెండు రాష్ట్రాల కాలుష్య నియంత్రణ బోర్డులు ప్రజా విచారణలు నిర్వహించలేదు.

పనిని నిలిపివేయమన్న ఆదేశం, ప్రారంభంలో పర్యావరణ & అటవీ మంత్రిత్వ శాఖ ద్వారా ఆరు నెలల పాటు నిలిపివేయబడి[52] (2013 ఫిబ్రవరి) తర్వాత 2023 జూలై వరకు (2022 ఫిబ్రవరి నాటి ఆదేశం) కొనసాగించబడింది. మూడు ప్రభావిత రాష్ట్రాలు దాఖలు చేసిన కోర్టు కేసులు ఇప్పటికీ గౌరవ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి.

తాజా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (2017) లో ఇచ్చిన నిర్మాణ కార్యక్రమం ప్రకారం, రక్షణ కరకట్టల నిర్మాణం 8వ సంవత్సరం నుండి (అంటే, 2004లో పనులు ప్రారంభమయ్యాయి కనుక 2011-12 నుండి) ప్రారంభించబడి 11వ సంవత్సరం (2014-15) నాటికి పూర్తి చేయాలని ఆడిట్ గమనించింది. అయితే, రక్షణ కరకట్ట నిర్మాణం శాఖ ఇంకా ప్రారంభించలేదు.

కేంద్ర జల సంఘం సమక్షంలో ఈ సమస్యను రెండు రాష్ట్రాలతో చర్చించామని, అయితే, ఎటువంటి స్పందన రాలేదని, రాష్ట్రాలు మునుపటి ఒప్పందాలను, జీడబ్ల్యూడీటీ అవార్డును గౌరవించడం లేదని ముగింపు సమావేశంలో ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్). ఈ ప్రాజెక్టుకు రెండు దశల్లో నిధులు సమకూర్చాలని భారత ప్రభుత్వం యోచిస్తున్నందున, (+) 41.15 మీ. (మొదటి దశ స్థాయి) వరకు నీటిని నిలుపుకోవడానికి ఎటువంటి ముంపు సమస్య ఉండదు. మొదటి దశ పూర్తయ్యేలోపు సమస్యను పరిష్కరించగలమని ప్రభుత్వం ఆశిస్తున్నట్లు కూడా సమాధానం ఇచ్చారు.

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు 2026 మార్చి నాటికి పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ (మొదటి దశ కోసం భారత ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్య తేదీ), పర్యావరణ అనుమతి, ముంపు అంశాలకు సంబంధించిన అంశం గౌరవ సుప్రీం కోర్టులో ఇంకా ఒక కొలిక్కి రాకపోవడంతో కట్ట నిర్మాణంలో ఎటువంటి పురోగతి లేదు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలు ప్రజా విచారణ చేపట్టకపోతే, కట్ట పనులు ప్రారంభించబడవు, ఫలితంగా ప్రాజెక్ట్‌ను దాని పూర్తి సామర్థ్యంతో ఉపయోగించలేము.

***సిఫార్సు 2.3: రాష్ట్ర ప్రభుత్వం, పోలవరం ప్రాజెక్టు అథారిటీతో సంప్రదించి, సంబంధిత రాష్ట్రాలతో ముంపు సమస్యలను పరిష్కరించుకోవాలి, ఆ రాష్ట్రాలలో ముంపును నివారించడానికి రక్షణ కరకట్టలను సకాలంలో నిర్మించేలా చూడాలి.***

50 లేఖ సంఖ్య. జే-12011/8/09-ఐఎ-1 తేదీ 08.02.2011

51 లేఖ సంఖ్య 31267/ఎమ్ఏఐ. ఐఆర్ఆర్.I(2)/2006 తేదీ 04.03.2011

52 డీ.ఓ. సంఖ్య. జే-12011/8/2009-ఐఏ-1 తేదీ 27.02.2013

### 2.3.3 చట్టబద్ధమైన ఆమోదం లేకుండా ఎత్తిపోతల పథకాల అమలు

అంతర్రాష్ట్ర సంబంధం ఉన్న ఏదైనా ప్రాజెక్టుకు సంబంధించి, నీటిపారుదల, బహుళార్థసాధక ప్రాజెక్టుల సమర్పణ, అంచనా, అనుమతి కోసం కేంద్ర జల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, మూల్యాంకనం కోసం కేంద్ర జల సంఘానికి ప్రాథమిక నివేదికను పంపాలి. ప్రాజెక్టు సాధ్యమని తేలితే, వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక తయారీకి కేంద్ర జల సంఘం 'సూత్రప్రాయంగా' సమ్మతిని తెలియజేస్తుంది. ఇంకా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లోని సెక్షన్ 84 (3) (ii) ప్రకారం కృష్ణా లేదా గోదావరి నదులపై ఏదైనా కొత్త ప్రాజెక్టును చేపట్టే ముందు, కేంద్ర జల సంఘం ఆమోదం పొందాలి. ఇంకా, పర్యావరణ ప్రభావ అంచనా (ఈఐఏ) నియమాలు, 2006 ప్రకారం, కొత్త నీటిపారుదల ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతి పొందాలి.

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు పూర్తి చేయడంలో జాప్యాన్ని అంచనా వేస్తూ, కుడి ప్రధాన కాలువ, ఎడమ ప్రధాన కాలువల ద్వారా గోదావరి నది వరద నీటి ముందస్తు ప్రయోజనాలను ఉపయోగించుకోవడానికి, ఎత్తిపోతల పథకాలు, అంటే పట్టిసీమ ఎత్తిపోతల పథకం (కుడి ప్రధాన కాలువ కోసం), పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం (ఎడమ ప్రధాన కాలువ కోసం) లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2015 జనవరిలో ప్రతిపాదించింది.

పశ్చిమ గోదావరి జిల్లా, పోలవరం మండలం, బంగారంపేట గ్రామం సమీపంలో ₹1,300.00 కోట్ల వ్యయంతో పట్టిసీమ ఎత్తిపోతల పథకం (పీఎల్ఐఎస్) ప్రతిపాదించబడింది (2015 జనవరిలో పరిపాలనా అనుమతి[53] ఇవ్వబడింది). ఈ పథకం పనులు 2015 మార్చిలో మొదలుపెట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిధుల నుండి ₹2,079.94 కోట్ల వ్యయంతో 2016 మార్చిలో ప్రారంభించబడింది.

అదేవిధంగా, తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం, పురుషోత్తపట్నం గ్రామం సమీపంలో ₹1,638.00 కోట్ల వ్యయంతో 'పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం' (పీయూఎల్ఐఎస్) ప్రతిపాదించబడింది (2016 అక్టోబర్ లో పరిపాలనా అనుమతి ఇవ్వబడింది). పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ[54] నుండి ఏలేరు జలాశయానికి 140 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి, ఏలేరు జలాశయం క్రింద ఉన్న ఆయకట్టుకు నీటిని అందించడం, అదనంగా వాటర్ గ్రిడ్‌లో భాగంగా గృహ, పారిశ్రామిక వినియోగానికి నీటిని అందించడం ఈ పథకం లక్ష్యం. ఈ పని, 2017 జనవరిలో ప్రారంభించబడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిధుల నుండి ₹1,189.23 కోట్ల ఖర్చుతో 2018 జూలై నాటికి పూర్తయింది.

ఈ క్రింది విషయాలను ఆడిట్ గమనించడమైంది:

- గోదావరి, కృష్ణా అంతర్రాష్ట్ర నదులు కాబట్టి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 లోని సెక్షన్ 84 (3) (ii) ప్రకారం కొత్త ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం అనుమతి పొందడం తప్పనిసరి. అయితే, రెండు ఎత్తిపోతల పథకాలకు పర్యావరణ అనుమతితో పాటు కేంద్ర జల సంఘం ఆమోదం పొందలేదు, ఈ ప్రాజెక్టులను చేర్చుతూ పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు యొక్క పర్యావరణ అనుమతిని కూడా సవరించలేదు.
- గౌరవ జాతీయ హరిత ట్రిబ్యునల్[55] (ఎన్జీటీ), రెండు ఎత్తిపోతల పథకాలకు పర్యావరణ అనుమతి అవసరమని అభిప్రాయపడింది (2018), అధీకృత అధికారుల నుండి ముందస్తు అనుమతి పొందకపోవడం పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్, 2006, దానికి చేసిన సవరణలను ఉల్లంఘించడమేనని పేర్కొంది. అంతే కాకుండా, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ), ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ), రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా అథారిటీ, జిల్లా మేజిస్ట్రేట్‌లను, ఆరు నెలల్లోపు ఎంత మేర నష్టం జరిగింది, బాధిత వ్యక్తులకు చెల్లించాల్సిన పరిహారం మొత్తాన్ని నిర్ణయించే నివేదికను సమర్పించాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశించింది.

---

[53] జీ.ఓ.ఎమ్.ఎస్ సంఖ్య 1, నీటిపారుదల, సీఏడీ (ప్రాజ్. I. ఎ2) విభాగం, తేదీ 01.01.2015

[54] పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ

[55] ఓఏ సంఖ్య 175/2018, ఓఏ సంఖ్య 350/2018 లో జమ్ముల చౌదరయ్య దరఖాస్తు ఆధారంగా

ఈ విషయంలో, పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్, 2006 ఉల్లంఘన, ప్రాజెక్టు నిర్మాణంలో చేసిన సవరణలను ఎత్తిచూపుతూ ఎమ్ఓఈఎఫ్&సిసి[56] రాష్ట్ర ప్రభుత్వానికి సంజాయిషీ నోటీసు జారీ చేసింది (2019 జూలై). అంతేకాకుండా, పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన అన్ని కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది (2019 జూలై). జాతీయ హరిత ట్రిబ్యునల్ ఇచ్చిన ఆక్షేపణ ఉత్తర్వులో జోక్యం చేసుకోవడానికి ఎటువంటి కారణం లేదని గౌరవ సుప్రీం కోర్టు పేర్కొంటూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జల వనరుల శాఖ దాఖలు చేసిన సివిల్ అప్పీల్‌ను[57] తోసిపుచ్చింది (2020 మార్చి).

గౌరవ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఏర్పాటుచేసిన కమిటీ ఈ పథకాలను సందర్శించి (2020 డిసెంబర్), సిఫార్సులతో కూడిన వివరణాత్మక నివేదికను సమర్పించింది. సిఫార్సుల ప్రకారం, ప్రాజెక్టు ప్రతిపాదకులు తీవ్రంగా చట్టవిరుద్ధంగా, పర్యావరణ చట్టాలను పూర్తిగా విస్మరించారని గౌరవ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశించింది (2021 డిసెంబర్). పట్టిసీమ ఎత్తిపోతల పథకం, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం యొక్క ప్రాజెక్టు ప్రతిపాదకులు పర్యావరణ నష్టాల కోసం వరుసగా ₹24.90 కోట్లు, ₹24.56 కోట్లు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలికి పర్యావరణ పరిహారం చెల్లించాలని కూడా ఆదేశించబడింది. పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు యొక్క ప్రతిపాదకులు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలికి ₹120.08 కోట్ల మొత్తాన్ని చెల్లించాలని గౌరవ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశించింది. గౌరవ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గౌరవ సుప్రీం కోర్టులో సివిల్ అప్పీల్ దాఖలు చేసింది. గౌరవ సుప్రీం కోర్టు మధ్యంతర ఆదేశాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాతీయ హరిత ట్రిబ్యునల్ ఏర్పాటుచేసిన కమిటీ సూచించిన విధంగా పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి సంబంధించి ₹2.48 కోట్లు, పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి సంబంధించి ₹1.90 కోట్లను పర్యావరణ పరిహారంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలికి జమ చేసింది (2023 మార్చి).

ముగింపు సమావేశంలో, ఈ పథకాలు ప్రధానంగా తాగునీటి ప్రయోజనం కోసం మాత్రమే ప్రణాళిక చేయబడ్డాయని, ప్రతిపాదనను కేంద్ర జల సంఘానికి పంపించామని ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్). తాగునీరు కేంద్ర జల సంఘం పరిధిలో లేనందున కేంద్ర జల సంఘం ఈ ప్రతిపాదనను పరిగణించలేదు. అందుబాటులో ఉన్న కాలువలను ఉపయోగించడం ద్వారా పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు యొక్క ముందస్తు ప్రయోజనాలను పొందేందుకు వీటిని పరిగణించారు, రెండు పథకాలలో నీటిపారుదల అంశం లేదు. జాతీయ హరిత ట్రిబ్యునల్ రెండు పథకాలను పోలవరం నీటిపారుదల ప్రాజెక్టులో భాగంగా భావించి భారీ జరిమానా విధించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గౌరవ సుప్రీం కోర్టును ఆశ్రయించగా (2022 మార్చి), తీర్పు రావలసి ఉంది. ఇంతలో, జాతీయ హరిత ట్రిబ్యునల్ ఏర్పాటుచేసిన కమిటీ ఆమోదించిన జరిమానా చెల్లించబడింది.

ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు. ఎందుకంటే జాతీయ హరిత ట్రిబ్యునల్ జరిమానా విధిస్తూ రెండు పథకాలను పోలవరం నీటిపారుదల ప్రాజెక్టులో భాగంగా కాకుండా కొత్తవిగా పరిగణించింది. ఇంకా, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన పరిపాలనా ఆమోదం స్పష్టంగా ఈ పథకాన్ని నీటిపారుదల ప్రయోజనం కోసం ఉద్దేశించబడిందని పేర్కొంది. అందువల్ల, అధీకృత అధికారుల నుండి ముందస్తు అనుమతులు పొందకపోవడం, పర్యావరణ నిబంధనలను విస్మరించడం వలన, ప్రభుత్వం పర్యావరణ పరిహారం చెల్లించవలసి వచ్చింది.

***సిఫార్సు 2.4: రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ చట్టాలను ఉల్లంఘించకుండా అప్రమత్తంగా ఉండాలి, పని ప్రారంభించే ముందు ప్రాజెక్టులకు అవసరమయ్యే అన్ని తప్పనిసరి పర్యావరణ, జీవావరణ అనుమతులను పొందాలి.***

---

56 పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ

57 డైరీ సంఖ్యలు 25965/2020, 28292/2020 ద్వారా ఓఏ సంఖ్య 175/2018, ఓఏ సంఖ్య 350/2018

### 2.3.4 పర్యావరణ, జీవావరణ సమతుల్యతను సంరక్షించకపోవడం

ప్రధాన ఆనకట్ట, జల విద్యుత్ పవర్ హౌస్ కేంద్రాల పనుల నిర్వహణ కోసం గుత్తేదారు సంస్థలతో[58] కుదుర్చుకున్న ఒప్పందాల నిబంధనల[59] ప్రకారం, గుత్తేదారు సంస్థలు పర్యావరణ జీవావరణ సమతుల్యతను వారి స్వంత ఖర్చుతో సంరక్షించడానికి బాధ్యత వహిస్తాయని, అటువంటి ఖర్చులన్నీ కాంట్రాక్ట్‌లో చేర్చబడిన యూనిట్ రేట్లు, ధరలలో చేర్చబడినట్లు పరిగణించబడతాయని నిర్దేశిస్తున్నాయి. గుత్తేదారు సంస్థలు పనికి సమీపంలోని ప్రకృతిని నాశనం చేయడం, పరిసరాలను మార్చడం లేదా చెరిపివేయడం వంటి వాటిని నిరోధించే విధంగా నిర్మాణం, కార్యకలాపాలను రూపొందించాలి. ఇంకా, గుత్తేదారు సంస్థలు పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడంలో ఏవైనా లోపాలను సరిదిద్దడం/సరిచేయడం కోసం ఇంజనీర్-ఇన్-చార్జ్ నిర్వహించే ఏ కార్యకలాపాలైనా గుత్తేదారు సంస్థల ఖర్చుతో చేయాలని ఒప్పంద నిబంధనలు స్పష్టంగా నిర్దేశిస్తున్నాయి.

మూల లంక గ్రామంలోని నివాస ప్రాంతాల దగ్గర పెద్ద ఎత్తున తవ్విన మట్టిని కుప్పలు వేయడాన్ని నిరసిస్తూ ఒక వ్యక్తి[60] జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో కోర్టు కేసు (ఓఏ 309/2015) దాఖలు చేసినట్లు రికార్డుల పరిశీలనలో వెల్లడైంది. పర్యావరణ, జీవావరణ ప్రయోజనాల దృష్ట్యా ఉమ్మడి తనిఖీ నిర్వహించి తగిన ఆదేశాలు జారీ చేయాలని గౌరవ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పోలవరం ప్రాజెక్టు అథారిటీలను ఆదేశించింది (2015 ఆగస్టు). అయితే, గౌరవ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఎటువంటి చర్యా తీసుకోలేదు. ఇంతలో, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు నిర్మాణ కార్యకలాపాల కారణంగా ఉత్పన్నమయ్యే వ్యర్థాలు, మట్టిని వేయడానికి మూల లంక గ్రామంలో 203.74 ఎకరాల భూమిని జల వనరుల శాఖ సేకరించింది (2016 జూలై).

మునుపటి రిట్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్య తీసుకోకపోవడం పట్ల బాధపడ్డ ఆ వ్యక్తి మళ్ళీ (ఓఏ 66/2017) జాతీయ హరిత ట్రిబ్యునల్ ని సంప్రదించగా, గౌరవ జాతీయ హరిత ట్రిబ్యునల్ (2017 మార్చి) ఎమ్ఓఈఎఫ్&సీసీ, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రతినిధితో కూడిన సంయుక్త తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేసి, ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించి వివరణాత్మక నివేదికను సమర్పించాలని ఆదేశించింది. తత్ఫలితంగా, ఉమ్మడి తనిఖీ బృందం స్థల సందర్శనను నిర్వహించి (2017 ఏప్రిల్), పోలవరం ప్రాజెక్టు అధికారులతో చర్చలు జరిపి (2017 ఏప్రిల్/మే) అఫిడవిట్‌తో పాటు నివేదికను సమర్పించింది (2017 మే). దరఖాస్తుదారుడి వాదన విన్న తర్వాత మొత్తం సమస్యను పరిశీలించి తగిన ఉత్తర్వు జారీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎమ్ఓఈఎఫ్&సీసీ ప్రతినిధిని జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశించింది.

సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని దరఖాస్తుదారుడు మళ్ళీ జాతీయ హరిత ట్రిబ్యునల్ వద్ద ఫిర్యాదు చేశారు (2018 అక్టోబర్). గౌరవ జాతీయ హరిత ట్రిబ్యునల్ నలుగురు సభ్యుల కమిటీని[61] ఏర్పాటు చేసింది. కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగా, గౌరవ జాతీయ హరిత ట్రిబ్యునల్, పోలవరం ప్రాజెక్టు అథారిటీని అవసరమైన చర్యలు తీసుకోవాలని, నోడల్ ఏజెన్సీ అంటే ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ద్వారా నియమపాలన నివేదికను సమర్పించాలని ఆదేశించింది.

గౌరవ జాతీయ హరిత ట్రిబ్యునల్ చేసిన సూచనలకు అనుగుణంగా, జల వనరుల శాఖ 2021 సెప్టెంబర్ లో మట్టిని చదును చేయడానికి దిద్దుబాటు చర్యలు ప్రారంభించి, ₹13.93 కోట్లకు ప్రస్తుత గుత్తేదారు సంస్థకు[62] (2019

---

58 మొదటి కాంట్రాక్ట్ ఏజెన్సీ (2013 మార్చి లో పని ఇవ్వబడింది): మెస్సర్స్ ట్రాన్స్ ట్రాయ్-జేవిస్ సీ ఈసీ యూఈఎస్ (జేవీ), రెండవ కాంట్రాక్ట్ ఏజెన్సీ (2018 ఫిబ్రవరిలో పని ఇవ్వబడింది): మెస్సర్స్ నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్, మూడవ కాంట్రాక్ట్ ఏజెన్సీ (2019 నవంబర్ లో పని ఇవ్వబడింది): మెస్సర్స్ మేఘ ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్

59 ఒప్పందం సంఖ్య 01/2012-13 లోని 89 & 90 షరతులు, ఒప్పందం సంఖ్య 01/2017-18 లోని 63 & 64 షరతులు

60 డాక్టర్ పెంటపాటి పుల్లారావు

61 (ఎ) సిపిసిబి ప్రతినిధి; (బి) అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్; (సి) ఏపిపిసిబి, (డి) జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్

62 మెస్సర్స్ మేఘ ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్

నవంబర్ లో అప్పగించబడిన ప్రధాన ఆనకట్ట పని) పనిని అప్పగించింది[63]. మొత్తం పని పూర్తయి గుత్తేదారు సంస్థకు తుది చెల్లింపు[64] జరిగింది (2022 జూలై).

మొదటి, రెండవ గుత్తేదారు సంస్థలు మట్టిని అక్కడ వేసినట్లు ఆడిట్ గమనించింది, మట్టిని సరిగ్గా చదును చేయడం/పొరలుగా వేయడం అనే పనిని మూడవ గుత్తేదారు సంస్థ అదనపు ఖర్చుతో చేసింది. ఒప్పంద నిబంధనల ప్రకారం, మొదటి, రెండవ గుత్తేదారు సంస్థలు వారి ఖర్చుతో చెదరిన మట్టిని తొలగించాల్సి ఉంటుంది.

పర్యావరణ, జీవావరణ సమతుల్యతను కాపాడని మునుపటి గుత్తేదారు సంస్థలపై ఒప్పంద నిబంధనలను అమలు చేయకపోవడం వలన, వాటిని సరిదిద్దే పనుల కోసం ₹13.93 కోట్ల నివారించదగిన అదనపు ఖర్చు చేయాల్సి వచ్చింది.

ఇంకా, గోదావరి నదిలోకి నీరు స్వేచ్ఛగా ప్రవహించేలా, మూలలంక గ్రామంలోని భూములు ముంపునకు గురికాకుండా ఉండటానికి, మూలలంక డంపింగ్ యార్డ్‌లోని కడెం స్లూయిస్ డ్రెయిన్‌లోకి జారిన మట్టిని తొలగించాలని కార్యనిర్వాహక ఇంజనీర్ (ఈఈ) రెండవ గుత్తేదారు సంస్థని[65] కోరిన సందర్భాన్ని (2018 ఆగస్టులో) కూడా ఆడిట్ గమనించింది. అంతే కాకుండా, ప్రస్తుతం ఉన్న వాగులు, కాలువలు, రహదారులు మొదలైన వాటి రక్షణకు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని గుత్తేదారు సంస్థని కార్యనిర్వాహక ఇంజనీర్ ఆదేశించారు. అయితే, గుత్తేదారు సంస్థ ఎటువంటి చర్య తీసుకోలేదు.

అందుబాటులో ఉన్న పరిమిత డంప్ ప్రాంతాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవడం కోసం తవ్విన మట్టిని ప్రస్తుత నేల స్థాయి నుండి 25 మీటర్ల నుండి 30 మీటర్ల ఎత్తులో వేస్తున్నట్లు ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 జూన్). ఎక్కువ పరిమాణంలో ఉన్న తవ్విన వ్యర్థాలలో 317.03 లక్షల ఘనపు మీటర్ల మట్టి, 389.88 లక్షల ఘనపు మీటర్ల రాయి ఉంది, దీనికి చాలా భూమి అవసరం. భూమిని సేకరించడం చాలా పెద్ద పని కాబట్టి, గౌరవ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఏర్పాటు చేసిన కమిటీ చేసిన సూచనలను, ఆరుగురు సభ్యుల కమిటీ సిఫార్సులను సక్రమంగా పాటిస్తూ, పొరలుగా విస్తరించి, ఆ ప్రాంతంలో యంత్రాలను ఉపయోగించి ప్రతి పొరలో చదును చేయడం ద్వారా మట్టిని డంప్ చేశారు.

ముగింపు సమావేశంలో, కాంట్రాక్ట్ నిబంధనల ప్రకారం మూలలంక డంపింగ్ గ్రౌండ్‌లో మునుపటి గుత్తేదారు మట్టిని వేశాడని, వేసిన మట్టిని వాలుగా వేయడం కాంట్రాక్ట్ పరిధిలో లేదని ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్). గౌరవ జాతీయ హరిత ట్రిబ్యునల్ నియమించిన నిపుణుల కమిటీ ఆదేశాల ప్రకారం, చదునుచేయబడిన మట్టిని వాలుగా వేయడం, నీరు పెట్టడం జరిగింది. అలాగే, డంపింగ్ గ్రౌండ్‌ను చదును చేయడం/ స్థిరీకరించడం కోసం చేసిన ఖర్చును తిరిగి చెల్లించడానికి భారత ప్రభుత్వం లాంఛనప్రాయంగా అంగీకరించింది.

జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం పైన పేర్కొన్న పనికి అదనపు ఖర్చు అవసరమైంది, ఇది గతంలో ఒప్పంద నిబంధనలకు అనుగుణంగా మునుపటి గుత్తేదారు సంస్థలు చేయలేదు. ఒప్పంద నిబంధనలను పాటించడంలో విఫలమైన గుత్తేదారు సంస్థల[66] నుండి ఆ మొత్తాన్ని తిరిగి పొందలేదు కనుక సమాధానం ఆమోదయోగ్యం కాదు

63 గౌరవనీయ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా సామాగ్రి, యంత్రాలు, శ్రామికుల ఖర్చు, పొరలుగా పరచడం వంటి అన్ని కార్యకలాపాలతో సహా పొరలలో డంపింగ్ సైట్ వద్ద తవ్విన దాన్ని డోజింగ్, పరచడం, సమం చేయడం

64 బిల్లు సంఖ్య ఎల్ ఎస్ 24వ & భాగం తేదీ 20.07.2022

65 మెస్సర్స్ నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్

66 మొదటి గుత్తేదారు సంస్థ: మెస్సర్స్ ట్రాన్స్ ట్రాయ్-జేఎస్ సీ ఈసీ యూఈఎస్ (జేవీ), రెండవ గుత్తేదారు సంస్థ: మెస్సర్స్ నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్

# హెడ్ వర్క్స్, పవర్ హౌస్ నిర్మాణం




INDIRA SAGAR
POLAVARAM Project
INDEX MAP OF HEAD WORKS

# 3వ అధ్యాయం

# హెడ్ వర్క్స్, పవర్ హౌస్ నిర్మాణం

ప్రాజెక్టును సమర్థవంతంగా అమలు చేయడానికి ఉపయోగించే ప్లానింగ్ టూల్స్ అండ్ ప్రాజెక్టు మానిటరింగ్ సిస్టం (పీఆర్ఐఎంఏవీఈఆర్ఏ) ను శాఖ కొనుగోలు చేసినప్పటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. ప్రణాళికాబద్ధమైన నిర్మాణ షెడ్యూల్ పాటించకపోవడం వల్ల డయాఫ్రమ్ వాల్ (డి-వాల్) దెబ్బతినడంతో పాటు దాని నిర్మాణానికి చేసిన ఖర్చు వృథా అయింది. 2023 మార్చి నాటికి డి-వాల్ దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు. అంచనాను సవరిస్తూ నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగించడం, టెండర్ షరతులు, నిబంధనలను అవసరానుసారంగా మార్చి కాంట్రాక్టు ఏజెన్సీని ఖరారు చేయడం, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రివర్స్ టెండరింగ్ ప్రక్రియలో పాల్గొన్న ఒక్క గుత్తేదారకు పనులు అప్పగించిన సందర్భాలు ఉన్నాయి.

పీపీఏ, సీడబ్ల్యూసీల ముందస్తు అనుమతి తీసుకోకుండా కుడి అనుసంధానికలలో జంట సొరంగాల విడుదల సామర్థ్యాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకపక్షంగా పెంచింది. ఎడమ అనుసంధానికల అమలుకు స్పష్టమైన భూమి హక్కుని అప్పగించకపోవడం వల్ల ప్రాజెక్టు ప్రారంభమై 17 సంవత్సరాలు గడిచినా ఎడమ అనుసంధానికల అమలు అసంపూర్తిగా ఉంది.

నిబంధనలకు విరుద్ధంగా గుత్తేదారు సంస్థలకు వడ్డీ లేని ప్రత్యేక రివాల్వింగ్ ఫండ్, ప్రత్యేక ఇంప్రెస్ట్ మంజూరు చేయడం ద్వారా రావలసిన వడ్డీని కోల్పోయారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రాతి పొరలు పేలవంగా ఉన్నయని, బలహీనంగా ఉన్న రాతి ప్రాంతాలను బలోపేతం చేయాలని సూచించినప్పటికీ, అట్టి చర్యలు చేపట్టకుండా జంట సొరంగాల తవ్వకాలు జరిగడం వల్ల, అది సొరంగం కూలిపోవడానికి దారితీసింది మరియు ఖర్చు వృథా అయ్యింది. ప్రస్తుతం ఉన్న గుత్తేదారుతో కుదుర్చుకున్న ఒప్పందం ముగిచడంతో నీటి తొలగింపు, పూడిక తొలగింపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అదనపు ఖర్చు చేయాల్సి వచ్చింది. నాణ్యత నియంత్రణ (క్యూసీ) విభాగం జారీ చేసిన తనిఖీ నోట్స్ లో పేర్కొన్న లోపాలను సరిచేయనప్పటికీ బిల్లుల సౌలభ్యం కోసం గుత్తేదార్లకు నాణ్యత నియంత్రణ (క్యూసీ) ధ్రువపత్రాలను జారీ చేస్తున్నారు.

పోలవరం జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణంలో శాఖ వడ్డీలేని అడ్వాన్సులు ఇవ్వడం వల్ల ఖజానాకు నష్టం వాటిల్లింది. గుత్తేదారు సంస్థ సమర్పించిన బ్యాంకు పూచీకత్తులు కాంట్రాక్ట్ వ్యవధిని కవర్ చేయలేదు మరియు కాంట్రాక్ట్ రద్దుకు ముందే గడువు ముగిసింది. వస్తు, సేవల పన్ను క్లెయిమ్ ను నిర్ణీత గడువు ముగిసిన తర్వాత ఆలస్యంగా చేసారు. తక్షణ అవసరం లేకపోయినా ఎలక్ట్రోమెకానికల్ వస్తువులను ముందస్తుగా కొనడం వల్ల అవి వ్యర్థంగా పడి ఉండటానికి దారితీసింది. గుత్తేదారు సంస్థ చెల్లించాల్సిన మూడవ పక్షం నాణ్యత హామీ సంస్థ ఖర్చును శాఖ భరించింది.

## 3.1 హెడ్ వర్క్స్ నిర్మాణం

హెడ్ వర్క్స్ యొక్క పని పరిధిలో నది యొక్క ప్రధాన ప్రవాహ మార్గంలో గరిష్టంగా 45.08 మీటర్ల ఎత్తుతో 2,454 మీటర్ల పొడవైన మట్టి-రాతి (ఈసీఆర్ఎఫ్) ఆనకట్ట[67] (గ్యాప్-I, II & గ్యాప్-III లో) నిర్మాణం, కుడి వైపున స్పిల్ వే, ఎడమ వైపున 'డి' కొండ దిగువ వాలులో పవర్ హౌస్ ఉన్నాయి. మట్టి-రాతి ఆనకట్ట క్రింద నదీ జలాల సీపేజ్ ను నిరోధించడానికి, రెండు మీటర్ల దూరంలో 0.60 మీటర్ల మందం గల రెండు ప్లాస్టిక్ కాంక్రీట్[68] డయాఫ్రమ్ వాల్ లను ప్రతిపాదించారు. ప్యానెల్ నిర్మాణ పద్ధతిని[69] ఉపయోగించి డయాఫ్రమ్ వాల్ ను ప్లాస్టిక్ కాంక్రీట్ తో నిర్మించాల్సి ఉంది. మట్టి-రాతి ఆనకట్ట నిర్మాణానికి వీలుగా కాఫర్ డ్యాంలు నిర్మించి నదీ ప్రవాహాన్ని అడ్డుకోవాలని,[70] స్పిల్ వే ద్వారా ప్రవాహాన్ని మళ్లించాలని ప్రతిపాదించారు. అలా ఏర్పడిన జలాశయం యొక్క ప్రతిపాదిత స్థూల నిల్వ సామర్థ్యం (+) 45.72 మీటర్ల వద్ద పూర్తి జలాశయ స్థాయి (ఎఫ్ఆర్ఎల్) 194.60 శతకోటి ఘనపుటడుగులుగా (టీఎంసీ), 75.20 టీఎంసీల లైవ్ స్టోరేజ్ గా ప్రతిపాదించారు.



చిత్రం 3.1: స్పిల్ వే నిర్మాణం యొక్క ప్రస్తుత స్థితి

కుడి ఒడ్డున ఉన్న స్పిల్ వే (+) 25.72 మీటర్ల ఎలివేటెడ్ లెవల్ (ఈఎల్) తో, గరిష్టంగా 36 లక్షల క్యూసెక్కుల వరదను విడుదల చేసేలా, 50 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునేలా రూపొందించారు. ప్రతిపాదిత స్పిల్ వే పొడవు 1,054.40 మీటర్లు నీరు పారే విధంగా, దానికి ఇరు వైపులా 37 మీటర్లు, నీరు పారని విధంగా, మొత్తం పొడవు 1,128.40 మీటర్లు. స్పిల్ వేలో 16 మీటర్ల వెడల్పు, 20 మీటర్ల ఎత్తు కలిగిన 48 రేడియల్ గేట్లు ఉంటాయి. స్పిల్ వే ఎగువ భాగంలో అప్రోచ్ ఛానల్ (2,310 మీటర్ల పొడవు), దిగువన స్పిల్ ఛానల్ (2,764 మీటర్ల పొడవు), పైలట్ ఛానల్ ఏర్పాటు చేస్తారు. శక్తిని తగ్గించడానికి స్పిల్ వే దిగువన ఈఎల్ (+) 9.25 మీటర్ల ఎత్తులో స్టిలింగ్ బేసిన్ (110 మీటర్ల పొడవు, 1,043.40 మీటర్ల వెడల్పు) నిర్మించాలి.

ఈసీఆర్ఎఫ్ ఆనకట్టను కాలువలతో అనుసంధానం చేయడానికి, ఆనకట్టకు ఇరువైపులా కుడి, ఎడమ అనుసంధానికలను ప్రతిపాదించారు. కుడి, ఎడమ వైపు అనుసంధానికలలో హెడ్ రెగ్యులేటర్ల నిర్మాణం, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, సొరంగాల తవ్వకం, శాడిల్ ఆనకట్టలు, నీటిపారుదల సొరంగం, నావిగేషన్ కెనాల్ మొదలైనవి ఉన్నాయి. సొరంగాలతో అనుసంధానించబడిన అనుబంధ జలాశయాలను ఏర్పాటు చేయడానికి 'ఇ' అండ్ 'ఎఫ్' శాడిల్స్ వద్ద తగిన మట్టి కట్టలను ప్రతిపాదించారు. హెడ్ వర్క్ ల లేఅవుట్ ను చూపే రేఖా చిత్రం క్రింద ఇవ్వబడింది:

---

67 ఈ ప్రాజెక్టులో నది ఎడమ ఒడ్డు వైపున గ్యాప్-I లో 564 మీటర్ల పొడవు, 25.32 మీటర్ల ఎత్తైన మట్టి-రాతి ఆనకట్ట; గ్యాప్-II లో అనగా నది మధ్యలో 1,750 మీటర్ల పొడవు, 45.08 మీటర్ల ఎత్తుతో; కుడి ఒడ్డున గ్యాప్-III లో 140 మీటర్ల పొడవు, 15.32 మీటర్ల ఎత్తుతో కాంక్రీట్ ఆనకట్ట నిర్మించారు

68 ఈసీఆర్ఎఫ్ ఆనకట్ట క్రింద స్థిర, భూకంప ఒత్తిళ్లను తట్టుకునేంత బలాన్ని కలిగి, సీపేజ్ కట్-ఆఫ్ గోడ తయారీకి ప్లాస్టిక్ కాంక్రీట్ ఉపయోగించబడుతుంది, ఇది చుట్టుపక్కల నేలలతో భూకంప ఒత్తిళ్ళను తట్టుకునేదుకు అనువుగా ఉంటుంది

69 ప్యానెల్ నిర్మాణ పద్ధతిలో గైడ్ వాల్ నిర్మాణం, కందకం ఏర్పడటానికి తవ్వకం, ఉపబలం, కాంక్రీట్ వేయడం ఉంటాయి

70 ఎగువ ఎత్తు (+)42.50 మీటర్లు, దిగువ ఎత్తు (+)30.50 మీటర్లు

**చిత్రం 3.2: హెడ్ వర్క్స్ యొక్క లే అవుట్ ప్రణాళికను చూపే రేఖా చిత్రం**




## 3.1.1 ప్రణాళిక ప్రక్రియ

### 3.1.1.1 ప్రాజెక్టును సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రణాళికా సాధనాలను అవలంబించకపోవడం

జలవనరుల మంత్రిత్వ శాఖ జారీ చేసిన (2010) నీటిపారుదల, బహుళార్థసాధక ప్రాజెక్టుల వివరణాత్మక ప్రాజెక్టు నివేదికల తయారీకి మార్గదర్శకాలు అన్ని నీటిపారుదల ప్రాజెక్టులలో మైలురాళ్లను సమర్థవంతంగా పర్యవేక్షించడానికి, సకాలంలో నివారణ చర్యలు తీసుకోవడానికి ప్రాజెక్టు ఎవాల్యుయేషన్ అండ్ రివ్యూ టెక్నిక్ (పీఈఆర్ టీ) చార్టులు లేదా క్రిటికల్ పాత్ మెథడ్ (సీపీఎమ్) రేఖా చిత్రాలను (నిర్మాణ కార్యక్రమాన్ని తయారు చేసేటప్పుడు) రూపొందించాలని నొక్కిచెప్పాయి. నదీ లోయ ప్రాజెక్టుల్లో ఆనకట్టలు, ఇతర హైడ్రాలిక్ నిర్మాణాల భద్రత, సరైన పనితీరును అంచనా వేయడానికి పీఈఆర్ టీ/సీపీఎమ్ సహాయపడుతుంది. నీటిపారుదల, బహుళార్థసాధక ప్రాజెక్టుల వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదించాలి. ప్రాజెక్టు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రైమావెరా (పీఆర్ఐఎమ్ఏవీఈఆర్ఏ) సాఫ్ట్ వేర్ కన్సల్టింగ్ ఏజెన్సీ సేవలను వినియోగించుకోవాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సూచించింది (2019 జూలై).

సవరించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలను (2017-18) తయారుచేసి కేంద్ర జల సంఘం ద్వారా ఆమోదం పొందినప్పటికీ (2019 ఫిబ్రవరి) ప్రాజెక్టు వ్యయాన్ని, ప్రాజెక్టు పూర్తి చేయడానికి అంచనా సమయాన్ని ఖరారు చేసేటప్పుడు మైలురాళ్లను సమర్థవంతంగా పర్యవేక్షించడానికి, సకాలంలో నివారణ చర్యలు తీసుకోవడానికి శాఖ పీఈఆర్ టీ/ సీపీఎమ్ రేఖాచిత్రాలను తయారు చేయలేదని ఆడిట్ గుర్తించింది.

ప్రైమావెరా సాఫ్ట్ వేర్ ను కొనుగోలుచేసి ఐదు చోట్ల ఇన్స్టాల్ చేసినట్లు ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 జూన్). ముగింపు సమావేశం సందర్భంగా, ప్రభుత్వం ప్రైమావెరా కోసం హార్డ్ వేర్, సాఫ్ట్ వేర్ ను ఐదు ప్రదేశాలలో ఇన్స్టాల్ చేసినట్లు పేర్కొంది (2024 నవంబర్). డేటా నిర్వహణ/నవీకరణలో శాఖకు నైపుణ్యం లేనందున, దీనిని వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ కు అప్పగిస్తున్నామని, ఇది మూడు నెలల్లో అమల్లోకి వస్తుందని తెలిపింది.

పీఈఆర్ టీ/సీపీఎమ్ రేఖాచిత్రాలను తయారు చేయకపోవడానికి గల కారణాలను ప్రభుత్వం తెలియజేయలేదు.

దీంతో హార్డ్ వేర్, సాఫ్ట్ వేర్ ల ఇన్స్టాలేషన్ పూర్తయినా సాఫ్ట్ వేర్ ను వినియోగంలోకి తీసుకురాలేదని స్పష్టం అవుతోంది. ఎక్కువ శాతం పనులు (అంటే 82 *శాతం* హెడ్ వర్క్స్) పూర్తయిన తర్వాత కూడా ప్రాజెక్టు పర్యవేక్షణ వ్యవస్థ అమలుకు నోచుకోలేదు. వర్షాకాలం/వరదల సీజన్ మొదలగు వాటి ప్రారంభానికి ముందు కీలకమైన పనులను అంచనా వేయడంలో శాఖ విఫలమైందని, (*తదుపరి పేరాగ్రాఫ్ లో చర్చించినట్లుగా*) ప్రణాళికలో కీలక వైఫల్యాలు ఉన్నాయని, తద్వారా ప్రాజెక్టు పూర్తి కావడంలో జాప్యం జరిగిందని, ఇప్పటికే పూర్తయిన పనుల్లో కొన్ని భాగాలు దెబ్బతిన్నాయని గుర్తించడమైంది.

### 3.1.1.2 ప్రణాళికాబద్ధమైన నిర్మాణ షెడ్యూల్ కు కట్టుబడి ఉండకపోవడం వల్ల దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్

2010-11, 2017-18 వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లలో పేర్కొన్న నిర్మాణ షెడ్యూల్ / కార్యక్రమంలో పనులు ప్రారంభించిన తేదీ నుంచి 12 ఏళ్ల వరకు డ్యామ్, హెడ్ వర్క్స్ నిర్మాణ కార్యక్రమానికి ప్రణాళిక సిద్ధం చేశారు. నిర్మాణ షెడ్యూల్ ప్రకారం పైలట్ ఛానల్ తవ్వకంతో ప్రాజెక్టును ప్రారంభించి, పనులు ప్రారంభించిన రెండో ఏడాదిలోగా పూర్తి చేయాలి. స్పిల్ వే, స్పిల్ ఛానల్ పునాది తవ్వకం రెండో సంవత్సరంలో ప్రారంభమై నిర్మాణ కార్యక్రమం ఐదో సంవత్సరం వరకు కొనసాగుతుంది. ఐదవ సంవత్సరంలో, ప్రధాన మట్టి ఆనకట్ట కోసం డయాఫ్రమ్ వాల్ (డి-వాల్) నిర్మాణాన్ని ప్రారంభించి నదీ గర్భ భాగంలో మినహా పాక్షికంగా పూర్తి చేయటంతో పాటు ఎడమ వైపున స్పిల్ వే నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది.

నిర్మాణ షెడ్యూలులో మొదటి ఆరేళ్లలో వరద నీరు ప్రధాన నదీ మార్గం గుండా వెళ్తుంది. స్పిల్ ఛానల్ ను పూర్తి డిజైన్ విభాగం వరకు, నదీ గర్భ భాగంలో మినహా మిగిలిన డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని ఆరో సంవత్సరం నాటికి పూర్తి చెయ్యాలి. ఆరో సంవత్సరంలో చేపట్టిన అప్రోచ్ ఛానల్ ను పూర్తి చేసి, మట్టి-రాతి ఆనకట్టలో కాఫర్ డ్యామ్ ను ఏర్పాటు చేసి, నదీ గర్భ భాగంలో మిగిలిన డయాఫ్రమ్ వాల్ పనులను ఏడో సంవత్సరం నాటికి పూర్తి చేయాలి. నిర్మాణం జరిగే ఎనిమిదో సంవత్సరం నాటికి స్పిల్ వే ద్వారా నదీ జలాలు ప్రవహిస్తాయి. అసంపూర్తిగా ఉన్న మట్టి-రాతి ఆనకట్ట నిర్మాణాన్ని చేపట్టి కాఫర్ డ్యామ్ స్థాయి వరకు పూర్తి చెయ్యాలి.

ఆ విధంగా, నిర్మాణ షెడ్యూలు ప్రకారం, నదీ గర్భ భాగంలో డయాఫ్రమ్ వాల్, కాఫర్ డ్యాంల నిర్మాణానికి ముందే స్పిల్ వే ద్వారా నదీ ప్రవాహాన్ని మళ్లించడం అనివార్యం.

#### (అ) నిర్మాణ షెడ్యూల్ ను సక్రమంగా అమలుచేయకపోవడం

పై నిర్మాణ షెడ్యూలుకు భిన్నంగా 2017 ఫిబ్రవరిలో ₹399.77 కోట్లతో డీ-వాల్[71] పనులు చేపట్టి 2018 జూన్ నాటికి పూర్తి చేసినట్లు ఆడిట్ గుర్తించింది. అయితే 2005 జూలైలో ప్రారంభమైన స్పిల్ వే, స్పిల్ ఛానల్ పనులు 2018 జూన్ నాటికి అసంపూర్తిగా ఉన్నాయి. చివరికి 2022 సెప్టెంబరులో స్పిల్ వే పూర్తయింది, స్పిల్ ఛానల్ నిర్మాణం 2023 మార్చి నాటికి ఇంకా పురోగతిలో ఉంది. స్పిల్ వే, స్పిల్ చానళ్ళను నిర్ణీత స్థాయికి పూర్తి చేసి, నది మళ్లింపుకు ముందే, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ ల పనులను 2019 వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలనే లక్ష్యంతో చేపట్టారు (2018 నవంబర్).



**చిత్రం 3.3: 2019 ఆగస్టు లో స్పిల్ వే యొక్క స్థితి**

71 పొడవు 1,396.60 మీటర్లు, గరిష్ట లోతు 93.50 మీటర్లు

ఆర్&ఆర్ పనులు నిర్ణీత గడువు కంటే చాలా వెనుకబడి ఉండటంతో అందుబాటులో ఉన్న సమయంలో అంటే 2019 వర్షాకాలం ప్రారంభానికి ముందే కాఫర్ డ్యామ్ ల నిర్మాణం పూర్తి చేయలేకపోయారు. 2019 వర్షాకాలం ప్రారంభానికి ముందు, ఎగువ కాఫర్ డ్యామ్ యొక్క రెండు వైపులా నీటి ప్రవాహం కోసం మొత్తం 600 మీటర్ల పొడవు ఖాళీ వదిలివేసి ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ ల పనులు జరిగాయి.

ఇంతలో, పనిని నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశిస్తూ (2019 జూలై) అప్పటికి ఉన్న గుత్తేదారు సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ముందే ముగించింది (2019 ఆగస్టు). మరో గుత్తేదారు సంస్థకు పనులు అప్పగించకుండా ముందుగానే ఒప్పందాన్ని ముగించారు. అందువలన, అప్పటికే చేపట్టిన పనులను సంరక్షించడానికి అవసరమైన చర్యలు/జాగ్రత్తలు చేపట్టడానికి ఏ కాంట్రాక్ట్ పరిధిలోకి రాలేదు, ఎందుకంటే ఇది ముందే ముగించబడింది.



చిత్రం 3.4: దెబ్బతిన్న ఎగువ ప్రవాహ కాఫర్ డ్యామ్

వర్షాకాలంలో, 2019 ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు, 2020 అక్టోబర్, నవంబర్ నెలల్లో, గోదావరిలో వరుసగా 14.90 లక్షల క్యూసెక్కులు, 24 లక్షల క్యూసెక్కుల గరిష్ట విడుదలతో వరదలు వచ్చాయి. కాఫర్ డ్యాంల నిర్మాణం జరుగుతుండటం వలన ప్రధాన నదీ మార్గంలో నీరు వెళ్లలేకపోయింది, అలాగే స్పిల్ వే నిర్మాణం పూర్తి కాకపోవడంతో వరద నీటిని స్పిల్ వే గుండా పంపలేకపోయారు.

ఫలితంగా, ప్రాజెక్టు వద్ద 2,400 మీటర్ల వెడల్పు గల వరద ప్రవాహాన్ని ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద అందుబాటులో ఉన్న 600 మీటర్ల వెడల్పు గుండా వెళ్లేందుకు మాత్రమే వీలుంది. సామర్థ్యానికి మించి వరద ప్రవాహం రావడంతో పాక్షికంగా నిర్మించిన కాఫర్ డ్యామ్ దెబ్బతినడమే కాకుండా డి-వాల్ కు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే, మట్టి-రాతి ఆనకట్ట గ్యాప్-II భాగంలోని నదీ గర్భం డీ-వాల్ కు ఎగువ, దిగువ భాగాలలో తీవ్రంగా కోతకు గురైంది.

వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలో అనుకున్న నిర్మాణ షెడ్యూల్ పాటించకపోవడం, పరిస్థితిని చక్కదిద్దేందుకు గుత్తేదారు సంస్థ లేకపోవడం వలన వరద నీరు సాధారణ నదీ ప్రవాహం గుండా వెళ్లకుండా అడ్డుకోవడం, స్పిల్ వే, స్పిల్ ఛానల్ పూర్తి కాకపోవడంతో మళ్లింపుకు అవకాశం లేకుండా పోయింది. దీనికి బదులుగా వరద నీరు మొత్తం ఎగువ కాఫర్ డ్యాం ఖాళీల గుండా ప్రవహించడంతో కాఫర్ డ్యామ్ పనులకు, డి-వాల్ కు నష్టం వాటిల్లింది. అందువల్ల డీ-వాల్ నిర్మాణానికి చేసిన ₹399.77 కోట్లు ఖర్చు వృథా అయ్యింది.

### (ఆ) డయాఫ్రమ్ వాల్ కు దిద్దుబాటు పనులు

డబ్ల్యూఆర్ డీ అభ్యర్థన (2022 మే) మేరకు, నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్ హెచ్ పీసీ), ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించి, భౌగోళిక-భౌతిక అధ్యయనాలు, ఇతర అవసరమైన పరీక్షలను నిర్వహించి పరిశీలనలను (2023 మార్చి) డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానెల్ (డీడీఆర్ పీ) కు సమర్పించింది. ప్రస్తుతం ఉన్న చెక్కుచెదరని డి-వాల్ కు సరైన అనుసంధానంతో తాజా రాతి మట్టం వరకు కొత్త డి-వాల్ ను సమాంతరంగా నిర్మించడానికి డీడీఆర్ పీ సభ్యులు అంగీకరించారు, చైనేజ్ 363 మీటర్ల నుండి 1,035 మీటర్ల వరకు పై 5 మీటర్ల వరకు క్షీణించిన డి-వాల్ ను తొలగించాలని కూడా సూచించారు. దీని ప్రకారం, ₹2,020.05 కోట్లతో డి-వాల్ దిద్దుబాటు పనులకు

ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇచ్చింది (2023 ఏప్రిల్)[72].

ఈ విధంగా, నష్టం యొక్క పరిధిని అంచనా వేయడానికి, దెబ్బతిన్న డి-వాల్ ను సరిచేసి ప్రత్యామ్నాయాలను ఖరారు చేయడానికి నాలుగు సంవత్సరాలు (2019 నుండి) పట్టింది, ఈ కారణంగా మట్టి-రాతి ఆనకట్ట నిర్మాణం ప్రారంభం కాలేదు.

### (ఇ) దిద్దుబాటు పనులకు చేసిన ఖర్చు

ఇప్పటికే నిర్మించిన నిర్మాణాలను పరిరక్షించడానికి లేదా దెబ్బతిన్న కాఫర్ డ్యామ్ లను సరిచేయడానికి, ***పట్టిక 3.1*** లో వివరించిన విధంగా కాఫర్ డ్యామ్ రక్షణ పనుల కోసం శాఖ ₹143.50 కోట్లు అదనంగా ఖర్చు చేసినట్లు ఆడిట్ గుర్తించింది.

**పట్టిక 3.1: చేపట్టిన దిద్దుబాటు పనులు**

| క్రమ సంఖ్య | పని పేరు | చేసిన ఖర్చు (₹ కోట్లలో) |
|---|---|---|
| 1. | కాఫర్ డ్యాంల అడుగు భాగాన్ని ఇసుకతో నింపటం | 109.54 |
| 2. | పాక్షికంగా పూర్తయిన ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ లు, డయాఫ్రమ్ వాల్ కు రక్షణ పనులు | 20.77 |
| 3. | రీచ్ III లోని ఎగువ ప్రవాహపు కాఫర్ డ్యామ్ క్రింద రింగ్ బండ్, పైప్ కల్వర్టుల తాత్కాలిక పనులు | 10.34 |
| 4. | కాఫర్ డ్యాంలలో శిథిలావస్థకు చేరిన భాగాన్ని సరిదిద్దడానికి ఇసుక ఫిల్టర్లు | 2.85 |
| మొత్తం | | **143.50** |

*మూలం: శాఖ అందించిన సమాచారం*

ప్రణాళికాబద్ధమైన నిర్మాణ షెడ్యూలును అమలుచేయకపోవడం వల్ల దిద్దుబాటు పనుల ద్వారా ఖజానాపై అదనపు భారం పడింది.

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు 'జాతీయ ప్రాజెక్టు' కాబట్టి, అనేక సంస్థలు[73] ప్రాజెక్టు నిర్మాణంలో పాల్గొంటున్నాయని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 జూన్/2024 నవంబర్). ఎప్పటికప్పుడు ఆయా సంస్థల నిర్ణయాలు, సిఫార్సులు/సూచనల ఆధారంగా పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రాజెక్టు పనులను శాఖ అస్తవ్యస్తంగా చేపట్టే అవకాశం లేదు. దిద్దుబాటు పనులకు సంబంధించి అత్యవసర పరిస్థితుల దృష్ట్యా, డీడీఆర్ పీ ఆదేశాల మేరకు పాక్షికంగా పూర్తయిన కాఫర్ డ్యాంలకు రక్షణ పనులు చేపట్టామని సమాధానం ఇచ్చింది (2024 జూన్/నవంబర్).

ముగింపు సమావేశం సందర్భంగా ఈ ప్రాజెక్టులో చాలా సంక్లిష్టమైన భౌగోళిక సాంకేతిక అంశాలు ఉన్నాయని ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్). వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక తయారీ సమయంలో ఏడేళ్లలో ఆనకట్ట నిర్మించాలని భావించారు. అయితే, అమలు ప్రక్రియలో ఎదురైన అనేక సవాళ్ల కారణంగా, వాస్తవ అమలు ఆలస్యమైందని, వివిధ సంస్థలు విస్తృతంగా చర్చించిన తరువాత, సమయాన్ని ఆదా చేయడానికి ఆనకట్ట పనులు, డీ-వాల్ తో పాటు కాఫర్ డ్యాంల పనులను సమాంతరంగా నిర్వహించాలని నిర్ణయించారు. పోలవరం నీటిపారుదల ప్రాజెక్టులో చేపట్టిన పనులన్నింటినీ వివిధ సంస్థలు ప్రణాళికాబద్ధంగా పర్యవేక్షించాయి. ప్రస్తుతం ఉన్న డి-వాల్ కు సమాంతరంగా ₹990 కోట్ల అంచనా వ్యయంతో కొత్త డి-వాల్ ను నిర్మించాలని యోచిస్తున్నారు.

---

72 జి.ఓ. ఆర్.టి. నెం.138 డబ్ల్యూఆర్ డీ, తేదీ 10.04.2023

73 కేంద్ర జలవనరులు, నదుల అభివృద్ధి, గంగా పునరుజ్జీవన మంత్రిత్వ శాఖ(ఎంవోడబ్ల్యూఆర్), డీడీఆర్పీ, సీడబ్ల్యూసీ, పీపీఏ, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్(సీఎస్ఎంఆర్ఎస్), సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్(సీడబ్ల్యూపీఆర్ఎస్), వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్(వ్యాప్కోస్), ఏపీ రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు

నిర్మాణ కార్యక్రమం ప్రకారం క్రమపద్ధతిలో పనులు చేపట్టడంలో డబ్ల్యూఆర్‌డీ, పీపీఏలు విఫలమైనందున ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు. అలాగే, రెండో గుత్తేదారు సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని మరో గుత్తేదారు సంస్థకు అప్పగించడానికి ముందే ప్రభుత్వం ముగించింది. దీంతో ఆప్పటికే చేపట్టిన పనులకు నష్టం వాటిల్లడంతో ₹399.77 కోట్లు వృథా కావడంతో పాటు దెబ్బతిన్న డీ-వాల్ మరమ్మతులు/దిద్దుబాటు పనుల కోసం ₹2,020.05 కోట్లు, కాఫర్ డ్యాంల రక్షణ పనుల కోసం ₹143.50 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చింది.

***సిఫార్సు 3.1: ప్రధాన ఆనకట్ట పనులు సజావుగా జరిగేందుకు, దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న డి-వాల్ దిద్దుబాటు పనులను ఖరారు చేయడానికి రూపొందించిన నిర్మాణ షెడ్యూల్ కు కట్టుబడి ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చూడాలి.***

### 3.1.1.3 అధీకృత అధికారుల ముందస్తు అనుమతి లేకుండా పనుల ప్రారంభం

భారత ప్రభుత్వం ప్రచురించిన నోటిఫికేషన్ (2014 మే) లోని నంబర్ 9 (6), (8) సెక్షన్ లు పీపీఏ యొక్క అధికారాలు, విధులను వివరించింది. పోలవరం జలాశయంలో నిల్వ చేయాల్సిన నీటి పరిమాణం, జలాశయానికి వచ్చే, జలాశయం నుండి బయటకు వెళ్లే నీటి పరిమాణం, ప్రతి మెయిన్ లేదా బ్రాంచ్ హెడ్ వర్క్స్ ద్వారా వినియోగించే నీటి పరిమాణం, ఒక నీటి సంవత్సరంలో (ప్రతి ఏడాది జూన్ 1 నుంచి మరుసటి ఏడాది మే 31 వరకు) రోజువారీ ఆవిరయ్యే నీటిని, లీకేజీ నష్టాలను పీపీఏ నిర్ణయిస్తుంది. గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా పోలవరం జలాశయం నుంచి నీటిని తీసుకునే విధానం, వివరాలతో సహా నీటి సరైన నిర్వహణపై అథారిటీ నిర్ణయం తీసుకుంటుంది.

పీపీఏ అనుమతి అవసరమైనా కానీ వారి అనుమతి లేకుండానే పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోయడానికి ఒక ఎత్తిపోతల పథకం, సొరంగాల విడుదల సామర్థ్యాన్ని పెంచడం వంటి పనులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిపాలనా అనుమతులు (2021 ఏప్రిల్/సెప్టెంబర్) ఇచ్చినట్లు ఆడిట్ గుర్తించింది. ***పట్టిక 3.2*** లో చూపిన విధంగా గుత్తేదారు సంస్థలకు పనులు అప్పగించారు.

**పట్టిక 3.2: పీపీఏ అనుమతి లేకుండా చేపట్టిన పనుల వివరాలు**

(₹ కోట్లలో)

| పని పేరు | ఒప్పంద విలువ | పనికి అనుమతిచ్చిన తేదీ | పూర్తి చేయడానికి ఉద్దేశించిన తేదీ | 2023 మార్చి నాటికి చేసిన ఖర్చు | స్థితి |
|---|---|---|---|---|---|
| పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోయడానికి[74] పోలవరం ఎత్తిపోతల పథకం[75]. | 765.94 | 28.10.2021 | 27.10.2023 | శూన్యం | పని పురోగతిలో ఉంది |
| ప్యాకేజీ-63 పనులకు (కుడి అనుసంధానిక) సంబంధించి జంట సొరంగాల విడుదల సామర్థ్యాన్ని 20,000 క్యూసెక్కుల నుంచి 40,000 క్యూసెక్కులకు పెంచడం[76]. | 104.87 | 07.09.2021 | 14.12.2023 | శూన్యం | |
| ప్యాకేజీ-64 పనులకు (కుడి అనుసంధానిక) సంబంధించి జంట సొరంగాల విడుదల సామర్థ్యాన్ని 20,000 క్యూసెక్కుల నుంచి 40,000 క్యూసెక్కులకు పెంచడం[77]. | 116.87 | 07.09.2021 | 14.12.2023 | 2.07 | 1.78 శాతం పని పూర్తయ్యింది |

*మూలం: శాఖ అందించిన డేటా ఆధారంగా సంకలనం చేయబడింది*

74 పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల కరువు ప్రాంతాలకు తాగునీటి సౌకర్యం కల్పించడం

75 జీవో సంఖ్య 134 తేది 19.04.2021

76 జీఓ ఆర్ టీ సంఖ్య 335, తేదీ 07.09.2021 (ప్యాకేజీ 63) – సుమారు 900 మీటర్ల పొడవైన సొరంగం నిర్మాణం

77 జీఓ ఆర్ టీ సంఖ్య 336 తేదీ 07.09.2021 (ప్యాకేజీ-64) – సుమారు 880 మీటర్ల పొడవున సొరంగం నిర్మాణం

పైన పేర్కొన్న పనుల స్వభావం వల్ల ఆనకట్ట నిల్వ, కాలువల విడుదల సామర్థ్యాలలో మార్పులు చేయడానికి, నీటిని తీసుకోవడానికి పీపీఏ యొక్క ముందస్తు అనుమతి అవసరం. అయితే, పైన పేర్కొన్న పనులను చేపట్టడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పీపీఏ నుండి ఎటువంటి ముందస్తు అనుమతి తీసుకోలేదు.

సమీక్షా సమావేశంలో (2021 జూన్) జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఈ పథకం సాంకేతికంగా-ఆర్థికంగా ఆచరణీయమని తేలిన తర్వాత మాత్రమే ఈ పథకం అమలు చేపట్టాలని, ప్రతిపాదిత కొత్త పథకంపై ఎటువంటి తొందరపాటు చర్యలకు దిగవద్దని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సూచించారు. అనుమతి లేని పనులన్నింటినీ నిలిపివేయాలని సమీక్షా సమావేశంలో జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆదేశించారు. అయితే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాంకేతిక-ఆర్థిక సాధ్యతను, సరైన ప్రక్రియలను నిర్ధారించకుండానే ₹987.68 కోట్ల వ్యయంతో పనులను ప్రారంభించి (2021 సెప్టెంబర్, అక్టోబర్) 2023 మార్చి నాటికి ₹2.07 కోట్లు ఖర్చు చేసింది.

పై మూడు పనులకు సంబంధించి అధీకృత అధికారుల నుంచి అనుమతి పొందే ప్రక్రియ పురోగతిలో ఉందని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2023 ఫిబ్రవరి). భవిష్యత్తులో నదుల అనుసంధానాన్ని దృష్టిలో ఉంచుకుని విడుదల సామర్థ్యాన్ని 20,000 క్యూసెక్కుల నుంచి 40,000 క్యూసెక్కులకు పెంచే పనులు చేపట్టినట్లు ముగింపు సమావేశం సందర్భంగా ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్).

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు నుండి నీటిని తీసుకోవడానికి అనుమతించడానికి పీపీఏ చట్టపరమైన అధికారం కలిగిన అథారిటీ, పనులు ప్రారంభించడానికి ముందే నీటిని తీసుకోవడానికి పీపీఏ నుంచి అనుమతి పొందాలి కాబట్టి, ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు. అనుమతులు లేకుండా పనులు చేపట్టడం వల్ల పనులు మధ్యలోనే ఆగిపోవడం, వివాదాలు మొదలైనవి జరిగి, సంబంధిత అథారిటీ నుంచి అనుమతి రాకపోతే చేసిన ఖర్చు వృథా అవుతుంది. అంతేకాక, కుడి ప్రధాన కాలువ యొక్క విడుదల సామర్థ్యాన్ని 496.21 క్యూమెక్స్ (17,523 క్యూసెక్కులు) కోసం రూపొందించినందున, జంట సొరంగాల విడుదల సామర్థ్యాన్ని 40,000 క్యూసెక్కులకు పెంచవలసిన అవసరం లేదు.

### 3.1.1.4 ఎడమ అనుసంధానిక అమలుకు స్పష్టమైన హక్కుతో భూమిని అప్పగించకపోవడం

'919 మీటర్ల సొరంగం ఎడమ అనుసంధానిక (ప్యాకేజీ 65)' పనులను ₹90.99 కోట్లకు ఈపీసీ గుత్త విధానంలో గుత్తేదారు సంస్థకు[78] అప్పగించారు (2005 మార్చి). అదనపు పనుల కొరకు ₹12.92 కోట్లకు అనుబంధ ఒప్పందం కుదిరింది (2006 జూన్)[79]. అదనపు అంశాలను చేర్చిన తరువాత పనుల మొత్తం ఒప్పంద విలువ ₹103.91 కోట్లు, ఇంకా 24 నెలల్లో (2008 జూన్) పని పూర్తి చేయాలని అప్పగించారు. అయితే భూసేకరణకు సంబంధించిన సమస్యల కారణంగా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయలేకపోయారు.

రికార్డుల పరిశీలనలో, ₹15.02 కోట్ల విలువైన పనులు పూర్తయిన తర్వాత గుత్తేదారు సంస్థ దివాళా తీసినట్లు గౌరవ ముంబై హై కోర్టు ప్రకటించడం (2017 జూన్) వలన ఆంధ్రప్రదేశ్ వివరణాత్మక స్టాండర్డ్ స్పెసిఫికేషన్ కు చెందిన ప్రిలిమినరీ స్పెసిఫికేషన్స్ (పీఎస్ ఏపీడీఎస్ఎస్) నిబంధన 72[80] క్రింద కాంట్రాక్టును రద్దు చేసినట్లు (2018 నవంబర్) వెల్లడైంది.

మిగిలిన ₹88.89 కోట్ల పనులకు పరిపాలనాపరంగా ₹276.80 కోట్లకు ఆమోదం లభించగా, సవరించిన ప్రామాణిక ధరల షెడ్యూలు (ఎస్ఎస్ఆర్)తో టెండర్లు పిలిచి ₹290 కోట్లకు, 18 నెలల్లో పనులు పూర్తి చేయాలనే షరతుతో,

[78] మెసర్స్ యూనిటీ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్, ముంబై

[79] ఒప్పందం నెం.1/2006-07 తేది 21.06.2006

[80] కాంట్రాక్టరు మరణించినప్పుడు లేదా మతిస్థిమితం కోల్పోయినప్పుడు లేదా దివాలా లేదా జైలు శిక్ష విధించినప్పుడు లేదా కాంట్రాక్టర్ భాగస్వామ్యం లేదా సంస్థగా రద్దు చేయబడినప్పుడు లేదా కార్పొరేషన్ గా ఉన్నప్పుడు, స్వచ్ఛందంగా లేదా ఇతరత్రా, కాంట్రాక్ట్ రద్దు చేయబడవచ్చు, కార్యనిర్వాహక ఇంజనీర్ యొక్క ఎంపిక మేరకు, కాంట్రాక్ట్ రద్దు చేయబడుతుంది

మరో సంస్థకు[81] అప్పగించారు (2019 మార్చి). ఒప్పందంలోని నిబంధన 7.3[82] ప్రకారం పనులు ముందస్తు ముగింపుకు (2019 డిసెంబర్లో చెల్లించిన తుది బిల్లు) ముందే గుత్తేధారు సంస్థ ₹1.81 కోట్ల విలువైన పనులను పూర్తి చేసింది. తర్వాత ఆ పనులను రివర్స్ టెండరింగ్ విధానంలో ₹231.47 కోట్లకు, 18 నెలల కాలపరిమితితో (అంటే 2021 మే నాటికి), అదే సంస్థకు అప్పగించారు (2019 నవంబర్). ఇందులో ₹126.29 కోట్లు గుత్తేదారు సంస్థకు ఎల్ఎస్ XXVIII & పాక్షిక బిల్లు వరకు చెల్లించారు (2023 జూన్).

అయితే, అప్రోచ్ ఛానల్–II కు అవసరమైన భూమికి అటవీ హక్కుల గుర్తింపు క్రింద జిల్లా అటవీ అధికారి పట్టాలు జారీ చేశారని పేర్కొంటూ గ్రామస్థులు (దేవీపట్నం మండలం పి.గొండూరు గ్రామం) అభ్యంతరం వ్యక్తం చేయడం వలన పనులు ముందుకు సాగలేదు. చివరకు 2020 జూన్ లో సమస్య పరిష్కారమైంది.

ఆడిట్ ఈ క్రింది విషయాలను గమనించడమైంది:

- మొదటి గుత్తేదారు సంస్థకు పని ప్రాంతాన్ని వివాదరహితంగా (2011 జనవరి వరకు అటవీ భూమితో సహా) అప్పగించకుండానే శాఖ పనులను అప్పగించింది, దీని కారణంగా పనులు పురోగతి లేకున్నా అనేక సార్లు (చివరిగా 2018 నవంబర్ లో) సంస్థకు కాలపరిమితి పొడిగించారు. ఫలితంగా అప్రోచ్ ఛానల్, టన్నెల్, హెడ్ రెగ్యులేటర్, నావిగేషన్ లాక్ వంటి పనులు పురోగతి లేకుండా నిలిచిపోయాయి.
- గుత్తేదారు సంస్థలు, గుత్త విధానంలో వచ్చిన మార్పులు రేట్ల సవరణకు దారితీయడంతో కాంట్రాక్ట్ విలువ పెరిగింది.

పైన పేర్కొన్న వాటి కారణంగా ₹88.89 కోట్లు విలువైన మిగిలిన పనిని ₹231.47 కోట్లకు 2018–19 ఎస్ఎస్ఆర్ లో అప్పగించారు ఫలితంగా ₹143.12 కోట్ల వ్యయం పెరగడమే గాక పనులు అప్పగించిన తేదీ నుంచి 17 ఏళ్లకు మించి కాలం గడిచిపోయింది. ₹143.12 కోట్లు (₹15.02 కోట్లు + ₹1.81 కోట్లు + ₹126.29 కోట్లు) ఖర్చు చేసినా పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి.

ఒడిశా ప్రభుత్వం లేవనెత్తిన అభ్యంతరాల కారణంగా గౌరవ సుప్రీం కోర్టు 2006లో పనిని ఆపివేయాలనే ఆదేశాలను జారీ చేసిందని, 2006 మే నుంచి 2007 ఏప్రిల్ వరకు మొదటి గుత్తేదారు సంస్థ పనులు నిలిపివేసిందని ప్రభుత్వం బదులిచ్చింది (2024 జూన్). అప్రోచ్ ఛానల్ పనులను అటవీయేతర ప్రాంతంలో ఏజెన్సీ తిరిగి ప్రారంభించింది (2007 ఏప్రిల్), అవసరమైన భూములను భూసేకరణ అధికారులు సేకరించకపోవడం వలన, పట్టా భూములకు తక్షణమే భూ పరిహారం ఇవ్వాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేయడం వలన మళ్లీ పనులను నిలిపివేసింది. 2011 జనవరి వరకు అటవీ భూమిని సేకరించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత రెండో గుత్తేదారు సంస్థకు పనులు అప్పగించి, ముందుగానే కాంట్రాక్టును ముగించి, రివర్స్ టెండరింగ్ విధానంలో అదే ఏజెన్సీకి కాంట్రాక్ట్ అప్పగించారు (2019 నవంబర్). గ్రామస్తుల అభ్యంతరాలు, ప్రభుత్వం విధించిన కొవిడ్–19 ఆంక్షల కారణంగా జాప్యం, ఆకృతుల సవరణ, గుత్తేదారు సంస్థకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ముందుకు సాగలేదు.

దీంతో సేకరించని భూమిలో పనులు అప్పగించారని, అటవీ భూమికి సంబంధించి అటవీశాఖ నుంచి అనుమతులు రాకపోవడం వివాదానికి దారితీసిందని సమాధానం ద్వారా స్పష్టమవుతోంది. భూ సమస్యలను సత్వరమే పరిష్కరించడంలో ఆ శాఖ అలసత్వం వహించడం వల్ల సమయం వృధా అయ్యి, వ్యయం పెరిగి ఖజానాపై అదనపు భారం పడింది.

[81] మెస్సర్స్ మ్యాక్స్ ఇన్ఫ్రా (ఐ) లిమిటెడ్, హైదరాబాద్

[82] సౌలభ్యం కొరకు కార్యనిర్వాహక ఇంజనీర్ కాంట్రాక్ట్ ను రద్దు చేయవచ్చు

### 3.1.2 పనులను అప్పగించడం

అనుసంధానికలతో (ఎడమ, కుడి రెండూ) సహా హెడ్ వర్క్స్ ఏడు ప్యాకేజీలుగా విభజించబడ్డాయి. "దర్యాప్తు, సర్వే, డిజైన్ల తయారీ, ఆకృతులు, మట్టి-రాతి ఆనకట్ట, స్పిల్ వే, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్ మొదలైన భాగాలతో హెడ్ వర్క్స్ నిర్మాణం (ప్రధాన ఆనకట్ట ప్యాకేజీ)" పనులను మొదట ఈపీసీ పద్ధతిలో ₹4,054 కోట్లకు 60 నెలల్లో అనగా 2018 మార్చి నాటికి పూర్తిచేయాలని గుత్తేదారు సంస్థకు[83] అప్పగించారు (2013 మార్చి). ఆ తర్వాత పనుల నిర్వహణ సమయంలో కాంట్రాక్ట్ పద్ధతిని, గుత్తేదారు సంస్థలను వివిధ కారణాలతో మార్చివేశారు.

2023 మార్చి నాటికి ₹7,422.69 కోట్లు విలువ గల హెడ్ వర్క్స్ పనులను అప్పగించగా, ₹5,757.48 కోట్లు ఖర్చు చేసి, ₹1,665.21 కోట్ల విలువైన మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయి.

#### 3.1.2.1 నిపుణుల కమిటీ పరిధిలోకి రాని జాతీయ ప్రాజెక్టులో పనిని, వారి సిఫారసు మేరకు ముందస్తుగా ముగించడం

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక నియమావళి వాల్యూమ్-I లోని నిబంధన 51 ప్రకారం వస్తు సరఫరా లేదా పనుల నిర్వహణ కాంట్రాక్టులను టెండర్ ప్రాతిపదికన ఇవ్వాలి. అయితే, ఆంధ్రప్రదేశ్ ప్రజా పనుల శాఖ 'డి' కోడ్ లోని పేరా 154 ప్రకారం నామినేషన్ ప్రాతిపదికన (టెండర్ల ద్వారా కాకుండా) అప్పగించాల్సిన పనులను అంచనా రేట్లకే అప్పగించాలి. అత్యవసర పరిస్థితుల్లో లేదా అప్పగించబడిన అధికారాల పరిధి ప్రకారం కారణాలు నమోదు చేసి మాత్రమే ఈ విధానాన్ని అనుసరించవచ్చు.

"ప్రధాన ఆనకట్ట ప్యాకేజీ" పనులకు సంబంధించిన మొదటి గుత్తేదారు సంస్థ కేవలం 30.90 శాతం (2018 జనవరి) ఆర్థిక పురోగతి (₹1,755.05 కోట్లు) మాత్రమే సాధించడంతో, పనుల పురోగతిని మెరుగుపరచడానికి గంపగుత్త (ఎల్ ఎస్) విధానంలో నామినేషన్ ప్రాతిపదికన మిగిలిన పనులను రెండో గుత్తేదారు సంస్థకు[84] అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది[85] (2018 ఫిబ్రవరి).

రెండో గుత్తేదారు సంస్థకు, 18 నెలల్లో పనులు పూర్తి చేయాలన్న షరతుతో, ₹2,019.67 కోట్లకు[86] పనులు అప్పగించారు (2018 ఫిబ్రవరి). ₹1,579.49 కోట్లు ఖర్చు చేసిన తర్వాత, నిపుణుల కమిటీ[87] చేసిన సిఫార్సుల మేరకు (2019 మే) నామినేషన్ ప్రాతిపదికన పనులు అప్పగించడం సరికాదనే కారణం చూపుతూ పనులను ముందస్తుగా ఆపివేయాలని పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్, ధవళేశ్వరం రెండో ఏజెన్సీకి రద్దు నోటీసు[88] (2019 జూలై) జారీచేశారు.

రెండో ఏజెన్సీ చేపట్టాల్సిన మిగిలిన ₹440.18 కోట్ల పనులను రివర్స్ టెండరింగ్ విధానంలో ₹1,548.13 కోట్లకు (అంచనా వేసిన కాంట్రాక్టు విలువ ₹1,771.31 కోట్ల కంటే 12.60 శాతం తక్కువ) 24 నెలల్లో (2021 నవంబర్) పూర్తి చేయాలనే షరతుతో మూడో ఏజెన్సీకి[89] అప్పగించారు (2019 నవంబర్). అప్పగించిన మొత్తంలో, 2023 మార్చి నెలాఖరు నాటికి ₹ 1,194.41 కోట్లు గుత్తేదారు సంస్థకు చెల్లించారు, పని పురోగతిలో ఉంది.

ఆడిట్ గమనించినవి:

---

83 మెస్సర్స్ ట్రాన్స్ స్ట్రాయ్-జేవిఎస్ సీ-ఈసీ-యూఈఎస్ (జేవీ) 14.06 శాతం ఇంటర్నల్ బెంచ్ మార్క్ (ఐబీఎమ్) కంటే తక్కువతో
84 మెస్సర్స్ నవయుగ ఇంజనీరింగ్ అండ్ కన్స్ట్రక్షన్స్ లిమిటెడ్
85 మెమో సంఖ్య ఐసీడీ01-19052/40/2018-ప్రాజెక్టు-I-డబ్ల్యూఆర్ డీ, తేది 17.02.2018
86 ప్రధాన ఆనకట్ట ప్యాకేజీ యొక్క మిగిలిన పనుల అమలు కొరకు ఎస్ఎస్ఆర్ 2015-16 ప్రకారం సవరించిన అంచనాలు
87 జీఓఆర్టీ సంఖ్య 295 తేది 14.05.2019 ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఏర్పాటు చేయబడింది
88 కాంట్రాక్ట్ యొక్క సాధారణ షరతుల యొక్క క్లాజ్ 83.3
89 మెస్సర్స్ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్

(అ) అమలులో ఉన్న టెండర్లను ముందుగానే ముగించడం గాని, పనులను రీటెండరింగ్ చేయాల్సిన అవసరం గాని లేదని పోలవరం ప్రాజెక్టు అథారిటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) (2019 ఆగస్టు) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి పేర్కొన్నారు. ఇలాంటి చర్య ఊహించని పరిణామాలకు దారితీస్తుందని, ప్రాజెక్టును అనిశ్చితిలోకి నెట్టివేస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ఆలస్యమవడమే కాకుండా, ప్రతికూల సామాజిక– ఆర్థిక ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది, అలాగే ప్రాజెక్టు నుండి ప్రయోజనాలను పొందడంలో జాప్యంతో పాటు ప్రాజెక్టు వ్యయం పెరిగే అవకాశం ఉందని, ప్రాజెక్టు ప్రయోజనాల దృష్ట్యా ముందస్తు ముగింపు, రీటెండరింగ్ ఆలోచనను విరమించుకోవాలని, లేదా కనీసం కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు నిలిపివేయాలని సూచించారు.

అయితే, పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈఓ సలహాను పట్టించుకోకుండా రెండో గుత్తేదారు సంస్థతో (2019 ఆగస్టు) కుదుర్చుకున్న ఒప్పందాన్ని ముందుగానే ముగించి, మిగిలిన పనులను రీటెండరింగ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు వెళ్లింది.

(ఆ) కారణాలు నమోదు చేయకుండా, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక నియమావళికి విరుద్ధంగా నామినేషన్ ప్రాతిపదికన[90] రెండో గుత్తేదారు సంస్థకు పనిని అప్పగించారు. నామినేషన్ ప్రాతిపదిక పనిని అప్పగించినప్పటికీ, అసలు అంచనా రేట్లకు బదులు ఎస్ఎస్ఆర్ 2015–16తో సవరించిన రేట్ల ప్రకారం పనులు అప్పగించారు, అంతేగాక కాంట్రాక్ట్ వ్యవస్థను ఈపీసీ నుండి ఎల్ఎస్ కు మార్చారు. దీంతో కాంట్రాక్ట్ రద్దయి పనులు పూర్తికావడంలో జాప్యం జరిగింది.

(ఇ) కేంద్ర ప్రాయోజిత పథకం (సీఎస్ఎస్), ఎక్స్టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టులు (ఈఏపీ), యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్స్ ప్రోగ్రామ్ (ఏఐబీపీ)/ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (పీఎమ్ కేఎస్ వై), జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డు) క్రింద చేపట్టిన ప్రాజెక్టులు/పనులు తప్ప మిగిలిన పనులు మాత్రమే నిపుణుల కమిటీ పరిధిలోకి వస్తాయి. పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టు కాబట్టి ఇది రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ పరిధిలోకి రాదు. నిపుణుల కమిటీ పరిధిలోకిరాని జాతీయ ప్రాజెక్టుకు వారు చేసిన సిఫారసు ఫలితంగా ₹1,107.95 కోట్లు (₹1,548.13 కోట్లు – ₹440.18 కోట్లు) అదనపు వ్యయం అయింది.

అందువలన 2018 మార్చి నాటికి పూర్తి చేయాల్సిన పనులు 2023 మార్చి నాటికి కూడా అసంపూర్తిగానే ఉండిపోయాయి, ఇంకా ₹4,528.95 కోట్లు (₹1,755.05 కోట్లు + ₹1,579.49 కోట్లు + ₹1,194.41 కోట్లు) ఖర్చు చేసినా ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు.

ప్రభుత్వం నుంచి సమాధానం రావాల్సి ఉంది (2024 నవంబర్).

### 3.1.2.2 గుత్తేదారు సంస్థ ఎంపికలో ఏకపక్షం, ఫలితంగా అనుచిత ప్రయోజనం

పై పేరాలో పేర్కొన్నట్లుగా, పవర్ హౌస్ నిర్మాణంతో పాటు ప్రధాన ఆనకట్ట ప్యాకేజీ పనులను రివర్స్ టెండరింగ్ పద్ధతిలో ₹4,359.11 కోట్లకు మూడవ గుత్తేదారు సంస్థకు[91] (ఏకైక టెండరర్ కావటం వలన) అప్పగించారు (2019 నవంబర్). హెడ్ వర్క్స్ పూర్తి చేయడానికి ఒప్పంద వ్యవధి 24 నెలలుగా, పవర్ హౌస్ కు 58 నెలలుగా నిర్ణయించారు. మూడో గుత్తేదారు సంస్థకు టెండర్లు, పనులు అప్పగించడానికి సంబంధించిన రికార్డుల పరిశీలనలో ఈ కింది విషయాలు వెల్లడయ్యాయి:

[90] ఏపీడీఎస్ఎస్యు పీఎస్ క్లాజ్ 60(పి) ప్రకారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) ఒరిజినల్ కాంట్రాక్టర్ ఒప్పందం ప్రకారం మిగిలిన పనులను పూర్తి చేసుకోవచ్చు. అయితే, ఒరిజినల్ ఒప్పందం రేటు వద్ద మిగిలిన పని నిర్వహించడానికి ఈ.ఈ., ఒక కాంట్రాక్టర్ ని కనుగొనలేకపోతే, ఈ.ఈ., స్వల్ప నోటీసుతో టెండర్లను పిలవాలి, వాస్తవిక రేట్లను పొందాలి

[91] మెస్సర్స్ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్

### (అ) తగిన బిడ్డింగ్ సమయం ఇవ్వకపోవడం వల్ల ఎక్కువ మంది పాల్గొనలేకపోవడం

ప్రభుత్వ మెమో[92] (2019 ఆగస్టు) ప్రకారం, ప్రధాన ఆనకట్ట, జలవిద్యుత్ ప్రాజెక్టుల మిగిలిన పనులకు పిలిచిన బిడ్లకు కనీసం 21 రోజుల ప్రతిస్పందన సమయాన్ని, బిడ్లను సమర్పించటానికి గడువును నిర్దేశించింది. అయితే, 2019 ఆగస్టులో ప్రచురించిన టెండర్ నోటీసులో స్పందన, బిడ్లను సమర్పించటానికి శాఖ 16 రోజుల[93] గడువు విధించింది.

ప్రీ-బిడ్ సమావేశంలో పాల్గొన్న (2019 సెప్టెంబర్) బిడ్డర్లలో ఎక్కువ మంది (14 మంది బిడ్డర్లు) బిడ్లను సిద్ధం చేసుకోవడానికి సమయాన్ని పొడిగించాలని అభ్యర్థించారని ఆడిట్ గుర్తించింది. అయితే బిడ్ ల సమర్పణ గడువును పొడిగించకపోవడంతో టెండర్ ప్రక్రియలో ఎక్కువ మంది బిడ్డర్లు పాల్గొనలేక తుది బిడ్డింగ్ లో ఒక్క బిడ్డర్ మాత్రమే పాల్గొన్నారు.

తొలుత బిడ్ డాక్యుమెంట్ లభ్యత తేదీని 29 రోజుల కాలానికి నిర్ణయించినట్లు ప్రభుత్వం (2024 జూన్) సమాధానమిచ్చింది. అయితే ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌లో సాంకేతిక సమస్యల కారణంగా ప్రతిపాదిత షెడ్యూల్ ప్రకారం టెండర్ డాక్యుమెంట్‌ను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయలేకపోయారు. ఆ తర్వాత బిడ్ లభ్యత సమయాన్ని 16 రోజులకు మారుస్తూ సవరణ జారీ చేసింది (2019 సెప్టెంబర్). కానీ, సవరణ ఆమోద ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉందని బదులిచ్చారు. ముగింపు సమావేశం సందర్భంగా, జారీ చేసిన ఉత్తర్వుల్లో 21 రోజుల గడువు ఉందని, అయితే అప్ లోడింగ్, టెండర్ షెడ్యూల్ సిద్ధం చేయడంలో సాంకేతిక సమస్యల కారణంగా బిడ్డింగ్ సమయాన్ని తగ్గించినట్లు ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్).

ఇ-ప్రొక్యూర్‌మెంట్‌లో సాంకేతిక లోపానికి ఋజువుగా చూపే పత్రాలను ఆడిట్ కు అందుబాటులో ఉంచనందున సమాధానం ఆమోదయోగ్యం కాదు. అంతేకాకుండా సాంకేతిక లోపం తలెత్తినప్పుడు బిడ్ సమయాన్ని పొడిగించడం సముచితం. కనీస బిడ్ వ్యవధిని నిరాకరించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం, తద్వారా టెండర్ ప్రక్రియలో ఎక్కువ మంది పాల్గొనడానికి, పోటీతత్వానికి అవకాశం లేకుండా పోయింది.

### (ఆ) టెండర్ షరతుల మార్పు

ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం[94] (2019 ఆగస్టు), టెండర్లు పిలిచేటప్పుడు ప్రీ క్వాలిఫికేషన్ ప్రమాణాలను 2003 జూలైలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల[95]లో నిర్దేశించిన ప్రామాణిక మార్గదర్శకాల ప్రకారం తగిన విధంగా సవరించవచ్చు. ***పట్టిక 3.3*** లో చూపించిన విధంగా ప్రధాన ఆనకట్ట, జలవిద్యుత్ ప్రాజెక్టు యొక్క మిగిలిన పనుల కొరకు శాఖ ఈ క్రింది అదనపు షరతులను టెండర్ డాక్యుమెంట్ లో చేర్చింది.

---

[92] మెమో సంఖ్య ఐసీడీ01-ఎమ్ జేవిఆర్01సి28(డబ్ల్యూటీఈఎన్)/1/2019-ఎమ్ఎల్ఓ-II తేదీ 17.08.2019 ఈపీసీపై పోలవరం జలవిద్యుత్ ప్రాజెక్టు కోసం

[93] 05.09.2019 నుండి 20.09.2019 వరకు

[94] జీవోఎమ్ఎస్ సంఖ్య 67 యొక్క కాలమ్ 2 (iv) తేదీ 16.08.2019

[95] జీవోఎమ్ఎస్ సంఖ్య 94, ఐ&సీఏడీ (పీడబ్ల్యూ కోడ్) శాఖ, తేదీ 01.07.2003

**పట్టిక 3.3: టెండర్ డాక్యుమెంట్ లో నిర్దేశించిన అదనపు షరతులను చూపడం**

| టెండర్ డాక్యుమెంట్ లో పొందుపరిచిన షరతులు | జీవోఎంఎస్ సంఖ్య 94 ప్రకారం షరతు | టెండర్ డాక్యుమెంట్లో నిబంధన సంఖ్య | వ్యాఖ్యలు |
|---|---|---|---|
| గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో (2013-14 నుంచి 2017-18 వరకు) కార్పొరేట్ ఋణ పునర్నిర్మాణం లేదా పారిశ్రామిక, ఆర్థిక పునర్నిర్మాణ బోర్డు లేదా వ్యూహాత్మక ఋణ పునర్నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న బిడ్డర్/జేవీ సభ్యులు ఈ బిడ్లో పాల్గొనడానికి అర్హులు కాదు. దీనికి సంబంధించి చట్టబద్ధమైన ఆడిటర్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని బిడ్ తో పాటు సమర్పించాలి. | ప్రభుత్వ ఉత్తర్వులో లేదు. | 9 డి (సి) | అదనపు క్లాజు చేర్చబడింది |
| గుత్తేదారు సంస్థకు ఆకృతుల ఆఫీస్ బ్యాకప్, ఫీల్డ్ బ్యాకప్ సామర్థ్యం ఉండాలి, స్పిల్ వే, రాతి-మట్టి ఆనకట్ట, డయాఫ్రమ్ వాల్ మొదలైన వాటి కొరకు స్ట్రక్చరల్, హైడ్రాలిక్ డిజైన్ పై అనుభవం ఉండాలి లేదా అటువంటి అనుభవం ఉన్న సంస్థతో అవగాహన ఒప్పందం కలిగి ఉండాలి. | ప్రభుత్వ ఉత్తర్వులో లేదు. | 9 బి (1) | అదనపు క్లాజు చేర్చబడింది |
| ₹265.72 కోట్లకు లిక్విడ్ అసెట్స్ లేదా భారత జాతీయ లేదా షెడ్యూల్డ్ బ్యాంకుల నుంచి క్రెడిట్ ఫెసిలిటీస్ లేదా సాల్వెన్సీ సర్టిఫికేట్ | ప్రభుత్వ ఉత్తర్వులో లేదు. | 9 సి (4)(ఎ) | అదనపు క్లాజు చేర్చబడింది |
| ఇలాంటి పనులను సంతృప్తికరంగా (కాంట్రాక్ట్ విలువలో 90 శాతానికి తగ్గకుండా) పూర్తిచేయడం. | ఇలాంటి పనులను సంతృప్తికరంగా పూర్తి చేయడం (కాంట్రాక్ట్ విలువలో 50 శాతానికి తగ్గకుండా) | 9 సి (1)(ఎ) | పోటీని అరికట్టడానికి పరిమితిని పెంచింది. |
| గత ఐదు సంవత్సరాలలో కనీసం మూడు ఆర్థిక సంవత్సరాల్లో నికర లాభం ఆర్జించగా అందులో ఒక సంవత్సరం బిడ్ దాఖలుకు ముందు సంవత్సరానిదై ఉండాలి, ఆ మేరకు ధ్రువీకరణ పత్రం చట్టబద్ధమైన ఆడిటర్ ధ్రువీకరించినదై ఉండాలి. | ప్రభుత్వ ఉత్తర్వులో లేదు. | 9 సి (3) | అదనపు క్లాజు చేర్చబడింది |
| గత 10 సంవత్సరాలలో ఏదైనా ఒక సంవత్సరంలో సివిల్ ఇంజినీరింగ్, హైడ్రో మెకానికల్ పనుల్లో కనీస వార్షిక ఆర్థిక టర్నోవర్ ₹442.86 కోట్లు ఉండాలి. | | 9 సి (1) | |
| భారతదేశం వెలుపల చేపట్టిన పనులకు సంబంధించి, ప్రభుత్వ శాఖలో పొందిన అనుభభం పరిగణనలోకి తీసుకోబడుతుంది. | | 13 (24) | |

*మూలం: డబ్ల్యూఆర్డీ అందించిన సమాచారం*

ఆడిట్ ఈ క్రింది విషయాలు గమనించడమైంది:

- సంబంధిత పని కోసం టెండర్ డాక్యుమెంట్ లో ప్రీ-క్వాలిఫికేషన్ ప్రమాణాల సవరణలు 2003 జూలైలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా లేవు.
- ఇంజినీర్-ఇన్-చీఫ్ (ఈఎన్ సీలు)/సీఈలు/కమీషనర్ ఆఫ్ టెండర్స్ (సీవోటీ) అందరూ 2003 జూలైలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను పాటించాలని, ఏవైనా వ్యత్యాసాలు/ప్రత్యేక షరతులు అవసరం అయితే ముందస్తు

అనుమతి పొందాలని ఆదేశించినప్పటికీ[96] (2018 డిసెంబర్), ప్రభుత్వం నుండి ముందస్తు అనుమతి తీసుకోలేదు.

- సీఓటీ, బిడ్ ను ఆమోదించే సంధర్భంలో, బిడ్ డాక్యుమెంట్ లోని పై నిబంధనలు 2003 జూలైలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా లేవని కూడా పేర్కొన్నారు (2019 అక్టోబర్).
- బిడ్డర్లలో ఒకరు[97] జలవనరుల శాఖను సంప్రదించి (2019 సెప్టెంబర్), టెండర్ డాక్యుమెంట్ లో ఉన్న షరతులు మొత్తం దేశంలో ఒకటి లేదా రెండు సంస్థలకు అనుగుణంగా మాత్రమే ఉన్నందున ప్రీ-క్వాలిఫికేషన్ ప్రమాణాలలో కొన్ని షరతులను సవరించాలని, ఎక్కువ మంది పాల్గొనే అవకాశాలు తగ్గిపోతాయని అభ్యర్థించారు. అయితే ఈ విషయంలో ఎటువంటి చర్యా తీసుకోలేదు.

ఆడిట్ గమనించిన దాని ప్రకారం, ప్రవేశపెట్టిన సవరణ వలన బిడ్డింగ్ లో ఎక్కువ మంది పాల్గొనాలనే 01 జూలై 2003 నాటి ప్రభుత్వ ఉత్తర్వులోని ఉద్దేశించిన లక్ష్యం నెరవేరకపోగా, సవరించిన షరతులను నెరవేర్చగల ఒకే బిడ్డర్ టెండర్‌లో పాల్గొన్నాడు.

నిబంధనల ప్రకారమే టెండర్ షరతులు ఉన్నాయని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 జూన్). ప్రాజెక్టు కొరకు గతంలో కుదుర్చుకున్న ఒప్పందాల్లో ఎదురైన అడ్డంకులను తప్పించి పనులను విజయవంతంగా పూర్తి చేసేందుకు మాత్రమే ఇతర షరతులు విధించిన్నట్లు కూడా తెలిపింది.

ముగింపు సమావేశం సందర్భంగా ప్రభుత్వ ప్రయోజనాల దృష్ట్యా షరతులను సవరించినట్లు ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్). బలహీనమైన కాంట్రాక్టర్లకు బదులు సమర్థులైన కాంట్రాక్టర్లు పాల్గొనేలా రూపొందించిన టెండర్ షరతులు బాగున్నాయని, సింగిల్ బిడ్డర్ పాల్గొనడానికి ఇవి మాత్రమే కారణాలు కావని పేర్కొంది.

2003 జూలైలో జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా అదనపు కఠినమైన టెండర్ షరతులు, బిడ్డింగ్ సమయాన్ని తగ్గించడం ఇతర బిడ్డర్ల భాగస్వామ్యాన్ని పరిమితం చేసింది, దీని ఫలితంగా సింగిల్ బిడ్డర్ తో ఒప్పందం ఖరారు చేయబడింది కాబట్టి సమాధానం ఆమోదయోగ్యం కాదు. సకాలంలో పనులు పూర్తి చేయాలనే స్ఫూర్తితో శాఖ కొన్ని అదనపు షరతులను చేర్చినప్పటికీ, చేర్చబడిన ఆర్థిక ప్రమాణాలు అవసరంలేనివి, ఆ ప్రమాణాలు రూపొందించడానికి ఆధారమైన ప్రామాణికాలను ఆడిట్ కు అందుబాటులో ఉంచలేదు. అంతే కాకుండా టెండర్ డాక్యుమెంట్ లో ప్రత్యేక షరతులను పొందుపర్చడానికి ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకోలేదు.

### (ఇ) ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా సింగిల్ బిడ్డర్ తో రివర్స్ టెండర్ ప్రక్రియ ఖరారు

రివర్స్ టెండరింగ్ నిర్వహించాలంటే కనీసం ఇద్దరు బిడ్డర్లు అవసరమని ప్రభుత్వ ఉత్తర్వు (2019 ఆగస్టు) పేరా 2 (xv) పేర్కొంది. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టుల అమలు కోసం కాంపిటీటివ్ బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ప్రభుత్వం సరసమైన ధరను కనుగొనాలనుకుంటున్న కాంట్రాక్టులకు ఈ మార్గదర్శకాలు వర్తిస్తాయి.

ఆడిట్ ఈ క్రింది విషయాలను గమనించడమైంది:

- పై ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా జలవనరుల శాఖ (పార్ట్ ఎ), ఏపీజెన్కో (పార్ట్ బి) ప్రధాన ఆనకట్ట, పోలవరం జలవిద్యుత్ ప్రాజెక్టు (పీహెచ్ఈపీ) మిగిలిన పనులకు (₹4,987.55 కోట్లు) రివర్స్ టెండర్ ప్రక్రియను (2019 సెప్టెంబర్) నిర్వహించి, తాజాగా బిడ్లను పిలవకుండా ఒకే బిడ్డర్ తో టెండర్లు ఖరారు చేశాయి, దీని వలన ప్రభుత్వానికి పోటీ బిడ్ ధర వచ్చి ఉండకపోవచ్చు.

---

[96] మెమో సంఖ్య ఐసీడీఓ1-సీఓఓఆర్ఓఎమ్ఐఎస్ సీ/20/2018-సంస్కరణలు తేది 14.12.2018 ప్రకారం

[97] మెస్సర్స్ ఎస్ఈడబ్ల్యూ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్

- ఒప్పంద షరతుల్లోని 38వ నిబంధన ప్రకారం[98] ప్రధాన పనికి అనుబంధంగా ఉండే అదనపు పనులను ఒప్పంద ధరల ప్రకారం గుత్తేదారు చేపట్టాల్సి ఉంటుంది. ప్రధాన పనికి అనుబంధంగా ఉండే అదనపు పనులను[99] ఒప్పంద రేట్ల ప్రకారం అప్పగించడానికి బదులుగా, శాఖ ప్రస్తుత ఎస్ఎస్ఆర్ 2020-21 తో అంచనాలను రూపొందించి టెండర్ ప్రక్రియ ద్వారా అదే గుత్తేదారు సంస్థకు ₹669.48 కోట్లకు పనిని అప్పగించింది.

అదనపు పనులను ఒప్పంద ధరలకే గుత్తేదారుకు అప్పగించి ఉంటే ఒప్పంద విలువ ₹436.22 కోట్లుగా ఉండేది. దీంతో గుత్తేదారుకు అనుచిత లాభం చేకూరడమే గాక ఖజానాపై ₹233.26 కోట్ల (₹669.48 కోట్లు – ₹436.22 కోట్లు) అదనపు భారం పడింది. ₹669.48 కోట్లలో ₹551.37 కోట్లు ఇప్పటికే (2023 మార్చి) గుత్తేదారు సంస్థకు చెల్లించారు.

రివర్స్ టెండరింగ్‌లో ఒకే బిడ్డర్ పాల్గొన్నప్పటికీ, బిడ్డర్ ప్రతిపాదించిన బిడ్ మొత్తం అంచనా వేసిన కాంట్రాక్టు విలువ (ఈసీవీ) కంటే 12.60 శాతం తక్కువగా ఉండటం, ఖజానాకు ₹628.43 కోట్లు[100] ఆదా కావడం వలన మూడో ఏజెన్సీకి[101] పనులు అప్పగించినట్లు ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 జూన్). పీహెచ్ఈపీ గురించి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు, సీఓటీ ఆమోదం మేరకు ఒకే బిడ్డర్ను పరిగణనలోకి తీసుకున్నట్లు ఏపీజెన్కో సమాధానమిచ్చింది (2023 జనవరి).

ముగింపు సమావేశం సందర్భంగా, ప్రభుత్వం ఆడిట్ పరిశీలనను అంగీకరించింది (2024 నవంబర్), అయితే టెండర్ షరతులలో ఎంపిక చేసిన సవరణ కారణంగా ఒక బిడ్డర్ మాత్రమే పాల్గొన్నారని తెలిపింది.

ప్రభుత్వ ఉత్తర్వులో ఉన్న విధివిధానాలు రివర్స్ టెండరింగ్ ప్రక్రియను నిర్వహించడానికి కనీసం ఇద్దరు బిడ్డర్లు పాల్గొనడాన్ని నిర్దేశిస్తాయి. ఒకే బిడ్డర్ తో రివర్స్ టెండర్ ప్రక్రియను ప్రారంభించడం అనేది ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంమే కాక పోటీ ధరను కోల్పోయింది, కనుక సమాధానం ఆమోదయోగ్యం కాదు. ఎస్ఎస్ఆర్ 2015-16కు బదులుగా ఎస్ఎస్ఆర్ 2020-21 రేట్లతో ప్రధాన పనికి అనుబంధంగా ఉన్న అదనపు పనులను అప్పగించినందున ఈసీవీ కంటే 12.60 శాతం తక్కువ అని ప్రభుత్వం చెప్పడం సరికాదు.

***సిఫార్సు 3.2: పోటీ బిడ్డింగ్‌ను కలిగియుండటానికి/ప్రోత్సహించడానికి, నిర్ణీత నిబంధనలు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం నిష్పాక్షిక, పారదర్శకమైన టెండర్ల ప్రక్రియను అభివృద్ధి చేయాలి.***

### 3.1.3 పనుల అమలు

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టులో హెడ్ వర్క్స్ లో వివిధ భాగాలను[102] చేపట్టవలసి ఉంటుంది. హెడ్ వర్క్స్ యొక్క భాగాలు వివిధ ప్యాకేజీలుగా విభజించబడి మొదట ఈపీసీ కాంట్రాక్ట్ పద్ధతి క్రింద వివిధ గుత్తేదారు సంస్థలకు అప్పగించబడ్డాయి. తదనంతరం, పనుల పురోగతి నెమ్మదిగా ఉండడం వలన మిగిలిన పనుల్లో కొంత భాగాన్ని మొదటి గుత్తేదారు సంస్థల పరిధి నుంచి తొలగించి గంప గుత్త విధానంలో ఇతర ఏజెన్సీలకు అప్పగించారు. గుత్తేదారు సంస్థలు మారినప్పటికీ 2023 మార్చి నాటికి పనులు పూర్తి కాలేదు.

---

98 ప్రధాన పనికి అనుబంధంగా ఉన్న అదనపు పనిని అప్పగించడం అనేది పనులను పూర్తిచేయడానికి ఇవ్వబడిన నిర్ణీత ఆర్థిక పరిమితులకు లోబడి అధికారులకు అధికారం ఇవ్వబడింది. ఒప్పందం యొక్క పరిమాణాల బిల్లు/షెడ్యూలు-ఎ లో చూపించిన పరిమాణాలకు మించిన అన్ని ఐటమ్ లకు, అటువంటి ఐటమ్ లకు చెల్లించాల్సిన రేటు అంచనా రేట్లపై గుత్తేదారు ద్వారా ఆమోదించబడ్డ (-) లేదా (+) టెండర్ శాతం ప్రకారంగా ఉండాలి

99 ఎ) స్పిల్ ఛానల్ కొరకు రీఇన్ఫోర్స్డ్ సిమెంట్ కాంక్రీట్ డయాఫ్రమ్ వాల్ ఎండ్ కటాఫ్ నిర్మాణం; బి) గ్యాప్-II లో వైబ్రో-స్టోన్ స్తంభాలు, లోతైన మట్టి కలవడం; సి) గ్యాప్-I లో మట్టి-రాతి ఆనకట్ట నిర్మాణంతో పాటు కాంక్రీట్ ఆనకట్ట, గ్యాప్-III లో కాంక్రీట్ ఆనకట్ట, వైబ్రో రాతి స్తంభాలు, లోతైన మట్టి కలపడం; డి) స్పిల్ వే, స్పిల్ ఛానల్ కు ఇరువైపులా స్లోప్ ప్రొటెక్షన్ పనులు

100 ₹4,987.55 కోట్ల ఈసీవీ – మెసర్స్ ఎంఈఐఎల్ బిడ్ విలువ, ₹4,359.12 కోట్లు

101 మెస్సర్స్ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (మెస్సర్స్ ఎంఈఐఎల్)

102 గ్యాప్-I, గ్యాప్-II లో ఈసీఆర్ఎఫ్ ఆనకట్ట, గ్యాప్-III వద్ద కాంక్రీట్ ఆనకట్ట, రేడియల్ గేట్లతో స్పిల్వే, కుడి, ఎడమ వైపు అనుసంధానాల పనులు, నావిగేషన్ ఛానల్

వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (2005) లో పేర్కొన్న నిర్మాణ కార్యక్రమం ప్రకారం, 2017 డిసెంబర్ చివరి నాటికి హెడ్‌వర్క్‌లను పూర్తి చేయాల్సి ఉంది. 2023 మార్చి నాటికి హెడ్‌వర్క్‌ల భౌతిక, ఆర్థిక పురోగతి వరుసగా 82 శాతం, 78 శాతంగా ఉండగా, మొత్తం వ్యయం ₹5,757.48 కోట్లుగా ఉంది.

అంతేగాక, అప్రోచ్, స్పిల్ ఛానళ్ళ తవ్వకాలతో పాటు డయాఫ్రమ్ వాల్ లో దెబ్బతిన్న భాగం యొక్క ట్రీట్ మెంట్ ప్రక్రియ ఖరారు చేయడం సరిదిద్దడం చేసిన తర్వాతే రాతి-మట్టి ఆనకట్ట నిర్మాణం చేపట్టే అవకాశం ఉన్నది.

### 3.1.3.1 పనుల అప్పగింతలో జాప్యం

#### (అ) ఉన్న బెడ్ లైనింగ్, స్టీల్ సపోర్టులను కూల్చివేయడానికి వృథా ఖర్చు



చిత్రం 3.5: కుడి అనుసంధానంలో సొరంగం నిర్మాణం

"కుడి వైపు అనుసంధానాలలో (ప్యాకేజీ-64) 20,000 క్యూసెక్కుల విడుదల సామర్థ్యంతో 880 మీటర్ల పొడవైన సొరంగం నిర్మాణం" పనులను ₹73.90 కోట్లకు ఒక గుత్తేదారు సంస్థకు[103] అప్పగించారు (2005 మార్చి). ఆ తర్వాత గోదావరి-కృష్ణా నదుల అనుసంధానాన్ని పేర్కొంటూ విడుదల సామర్థ్యాన్ని 40,000 క్యూసెక్కులకు పెంచేందుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతిని ఇచ్చింది[104] (2021 సెప్టెంబర్). ఈపీసీ విధానంలో ₹246.83 కోట్ల (అదనపు పనులతో కలిపి) వ్యయంతో ప్రస్తుత గుత్తేదారు సంస్థకు[105] నామినేషన్ ప్రాతిపదికన ఈ పనిని అప్పగించారు (2021 డిసెంబర్). ఇంకా, పర్యవేక్షక ఇంజనీర్ (పీఐపీ హెడ్ వర్క్స్ సర్కిల్) చీఫ్ ఇంజనీర్ (పీఐపీ)కి రాసిన లేఖలో (2022 జనవరి) 20,000 క్యూసెక్కుల విడుదల సామర్థ్యంతో తవ్విన జంట సొరంగాలకు లైనింగ్ చేపట్టలేదని తెలిపారు.

పీపీఏ అనుమతి లేకుండా విడుదల సామర్థ్యాన్ని 20,000 క్యూసెక్కుల నుంచి 40,000 క్యూసెక్కులకు పెంచినట్లు ఆడిట్ గుర్తించింది. విస్తరణ పనులు చేపట్టడానికి గుత్తేదారు సంస్థ ఇప్పటికే నిర్మించిన ₹13.65 కోట్ల[106] విలువైన 'ప్లెయిన్ సిమెంట్ కాంక్రీట్' బెడ్ లైనింగ్ (75 శాతం పని పూర్తయింది) ను తీసివేయాల్సి వచ్చింది, అందుకు అంచనాల్లో ₹1.46 కోట్లు కేటాయించారు. ఇంకా, 20,000 క్యూసెక్కుల విడుదల సామర్థ్యం కొరకు తవ్విన జంట సొరంగాలకు లైనింగ్ చేపట్టలేదని తప్పుగా సమాచారం ఇవ్వబడింది. ఫలితంగా ₹15.11 కోట్లు (₹13.65 కోట్లు + ₹1.46 కోట్లు) ఖర్చు వృథా అయింది.

గోదావరి నది నుండి వచ్చే మిగులు జలాలను సద్వినియోగం చేసుకోవడానికి, రాష్ట్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 జూన్). సొరంగం విస్తరణ పనిని అమలుచేయడానికి ఇప్పటికే వేసిన బెడ్ లైనింగ్ పనిని తొలగించాల్సిన అవసరం ఉందని కూడా పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా ఈ అంశాన్ని సొరంగం విస్తరణ అంచనాలలో పొందుపరిచారు.

---

103 మెస్సర్స్ యూఎస్ మ్యాక్స్ ఇన్ ఫ్రా లిమిటెడ్

104 జీఓఆర్‌టీ సంఖ్య 336 తేది 07.09.2021

105 మెస్సర్స్ మ్యాక్స్-ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ (ఇంతకు ముందు మెసర్స్ యుఎస్మాక్స్-ఇన్ఫ్రా లిమిటెడ్)

106 బెడ్ లైనింగ్ కు ₹11.49 కోట్లు + స్టీల్ సపోర్ట్ కు ₹2.16 కోట్లు

ముగింపు సమావేశం సందర్భంగా ప్రభుత్వం (2024 నవంబర్) ఈ ఆలోచన తరువాత చేసినట్లు పేర్కొంది. ప్రణాళిక సమయంలో దీనిని అంచనా వేయలేకపోయామని, ఇది భవిష్యత్తు దృక్పథంతో చేసిన పునరాలోచనగా తెలిపింది.

అసలు పని ప్రారంభించి 16 సంవత్సరాలు గడిచిన తర్వాత, ఇప్పటికే పూర్తయిన పనిని కూల్చివేసి విడుదల సామర్థ్యాన్ని పెంచే పనిని చేపట్టాలనే నిర్ణయం తీసుకోవడంలో జాప్యం సమర్థనీయం కాదు. ఈ అనాలోచిత నిర్ణయం వలన ₹15.11 కోట్ల వృథా ఖర్చు అయింది. అంతేకాకుండా, పోలవరం ప్రాజెక్టు అథారిటీ /కేంద్ర జల సంఘం (డిజైన్ల ఆమోదం కోసం నోడల్ ఏజెన్సీ కావున) నుంచి విస్తరణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ముందస్తు అనుమతి తీసుకోలేదు.

### (ఆ) స్పిల్ వే వాలు రక్షణ పనుల అప్పగింతలో జాప్యం

స్పిల్ వే, స్పిల్ ఛానల్ యొక్క ఎడమ, కుడి ఒడ్డున తవ్వకాల కారణంగా వాలులు దెబ్బతినకుండా భద్రతకు అవసరమైన చర్యలను ప్రతిపాదించాలని డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానెల్ (డీడీఆర్ పీ) జలవనరుల శాఖను ఆదేశించింది (2017 జూన్).

ప్రధాన ఆనకట్ట పనుల ప్రధాన అంచనాల్లో (2019 ఆగస్టు) వాలు రక్షణ పనులు పొందుపరచనందున, అదనపు అంశంగా హిల్-1, హిల్-2 కోసం వాలు రక్షణ పనులకు గుత్తేదారు సంస్థ[107] ప్రతిపాదనలు సమర్పించింది (2020 ఫిబ్రవరి). దీని ప్రకారం, స్పిల్ వే వాలు రక్షణ పనులతో పాటు స్పిల్ ఛానల్ రక్షణ పనులకు ఎస్ఓఆర్ 2015-16 తో ₹129.33 కోట్లకు సమగ్ర అంచనాను రూపొందించారు (2021 జూన్).

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ అభ్యర్థన మేరకు, ప్రధాన పనికి సంబంధించిన అదనపు అంశాలను ఎస్ఎస్ఆర్ 2020-21 తో వేరొక ప్రత్యేక పనిగా ప్రభుత్వం ఆమోదించింది[108] (2020 డిసెంబర్). ₹134.21 కోట్లకు సాంకేతిక అనుమతులు ఇచ్చి (2021 జూన్) గుత్తేదారు సంస్థతో ఒప్పందం[109] (2021 ఆగస్టు) కుదుర్చుకున్నారు. తదనంతరం, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ₹16.67 కోట్ల మొత్తానికి అదనపు అంశాల కొరకు డీవియేషన్ (చేరుకోలేని ప్రాంతాల్లో షాట్ క్రెటింగ్[110]) (2022 జూన్) ఆమోదించారు. ఈ విధంగా, వాలు రక్షణ పనుల అమలుకు ₹150.88 కోట్లు (₹134.21 కోట్లు + ₹16.67 కోట్లు) ఖర్చు కానున్నది.

2017 జూన్ లోనే ఈ పనిని చేపట్టాలని డీడీఆర్ పీ శాఖకు చెప్పినప్పటికీ, దీనిని రెండవ గుత్తేదారు సంస్థ[111] యొక్క ఎల్ఎస్ ఒప్పందంలో (2018 మార్చి లో ఇవ్వబడింది) లేదా మూడవ గుత్తేదారు సంస్థ[112] యొక్క ప్రధాన ఒప్పందంలో (2019 ఆగస్టులో ఇవ్వబడింది) చేర్చలేదని ఆడిట్ గుర్తించింది. ప్రస్తుత ఎస్ఎస్ఆర్ 2020-21 ప్రకారం అదనపు అంశంగా పనులను మూడో గుత్తేదారు సంస్థకు శాఖ అప్పగించింది (2021 ఆగస్టులో).

శాఖ సత్వర చర్యలు తీసుకుని ఎస్ఎస్ఆర్ 2015-16 ధరలతో ఆనకట్ట పనులతో పాటు వాలు రక్షణ పనులను గుత్తేదారు సంస్థకు అప్పగించి ఉంటే ₹4.88 కోట్లు (₹134.21[113] కోట్లు - ₹129.33 కోట్లు) అదనపు వ్యయాన్ని నివారించగలిగి ఉండేది.

---

[107] మెస్సర్స్ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్

[108] ప్రభుత్వ మెమో సంఖ్య ఐపీడీ01/-ఎమ్ జేబిఆర్01C28/207/2020-ప్రాజెక్ట్స్-1 తేది 25.12.2020

[109] ఒప్పందం సంఖ్య 02/2021-22 తేది 27.08.2021, ఐటమ్ IV

[110] నిలువు ఉపరితలంపై అధిక వేగంతో కాంక్రీటును పూసే పద్ధతి

[111] మెస్సర్స్ నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్

[112] మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్

[113] 2015-16 ఎస్ వోఆర్ ను ఉపయోగించి శాఖ తయారు చేసిన ₹16.67 కోట్ల అంచనాలో, చేరుకోలేని ప్రాంతంలో, షాట్ క్రెటింగ్ ను అదనపు అంశాంగా చేర్చలేదు

డీడీఆర్ పీ సూచనల మేరకు, స్పిల్ వే, స్పిల్ ఛానల్ (అంటే (-) 200 మీటర్ల ఎగువ నుంచి (+) 356 మీటర్ల దిగువకు) స్థిరత్వ విశ్లేషణ నివేదికను సమర్పించిన మొదటి గుత్తేదారు సంస్థకు పనులు అప్పగించినట్లు ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 జూన్). అయితే పనులు చేపట్టకముందే కాంట్రాక్టు రద్దు చేయబడింది. మొదటి గుత్తేదారు సంస్థ సమర్పించిన నివేదిక ఆధారంగా రెండో గుత్తేదారు సంస్థ డిజైన్లు/డ్రాయింగ్‌లను తయారు చేసి ఆమోదం కోసం కేంద్ర జల సంఘంకు సమర్పించింది. ఈ లోగా రెండో ఏజెన్సీతో కుదుర్చుకున్న ఒప్పందం కూడా రద్దు చేయబడింది. కొత్త సంస్థ, స్థల పరిస్థితుల ఆధారంగా, పనుల అమలులో ఇబ్బందులను పేర్కొంటూ, సవరించిన ఆకృతులను సమర్పించింది, వాటిని 2021 ఫిబ్రవరిలో మాత్రమే కేంద్ర జల సంఘం ఆమోదించింది. స్పిల్ వే, మొత్తం స్పిల్ ఛానల్ (అంటే ఎగువ (-)200 మీటర్ల నుండి దిగువక (+)990 మీటర్ల) రెండింటికీ ఆమోదించబడిన ఆకృతులను సిద్ధం చేయడంతో, అమలు చేయాల్సిన పరిమాణాలు పెరిగి ₹134.21 కోట్లకు ఎస్ఎస్ఆర్ 2020-21 తో అంచనాలు తయారు చేయబడ్డాయి. ఇంకా, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ₹16.67 కోట్ల (2022 జూన్) వ్యత్యాసాలకు ఆమోదం తెలిపారు. ఈ విధంగా, ఈ పనికి మొత్తం ₹150.88 కోట్లు ఖర్చు అయ్యింది.

ఆకృతుల ఖరారులో జాప్యం కారణంగా రక్షణ పనులను మునుపటి గుత్తేదారు సంస్థలకు అప్పగించలేదని ముగింపు సమావేశం సందర్భంగా ప్రభుత్వం తెలిపింది (2024 నవంబర్).

మొదటి గుత్తేదారు సంస్థకు పనిని అప్పగించినట్లు లేదా అనుబంధ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు శాఖ ఎటువంటి ఋజువులను సమర్పించలేదు కనుక ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు. అయితే, అసలు గుత్తేదారు సంస్థకు అప్పగించబడిన వాలు రక్షణ పనిని మూడవ గుత్తేదారు సంస్థకు అప్పగించేటప్పుడు ప్రధాన ఆనకట్ట పని పరిధిలో దీనిని ఎందుకు భాగం చేయలేదనే దానిపై సమాధానం ఇవ్వలేదు.

అందువల్ల, ప్రధాన పనికి సంబంధించిన వాలు రక్షణ పనిని, 2015-16 ఎస్ఓఆర్ రేట్ల ప్రకారం ₹129.33 కోట్లకు బదులు ఎస్ఎస్ఆర్ 2020-21 రేట్లతో ₹134.21 కోట్లకు గుత్తేదారు సంస్థకు అప్పగించడం వలన ₹4.88 కోట్ల ఖర్చు పెరిగింది.

### 3.1.3.2 గుత్తేదారు సంస్థలకు అనుచిత ఆర్థిక సహాయం

"ప్రధాన ఆనకట్ట, పవర్ హౌస్ నిర్మాణం" పనిని 2018 మార్చి నాటికి పూర్తి చేయాలనే షరతుతో ₹4,054 కోట్ల వ్యయంతో గుత్తేదారు సంస్థతో ఒప్పందం (2013 మార్చి) కుదుర్చుకున్నారు. రికార్డుల పరిశీలనలో ఈ కింది విషయాలు వెల్లడయ్యాయి:

### (అ) గుత్తేదారు సంస్థకు ప్రత్యేక ఇంప్రెస్ట్ కల్పించడం

ఒప్పందంలోని ప్రత్యేక షరతులలో నిబంధన 25 ప్రకారం, పనులు సక్రమంగా నిర్వహించడానికి అవసరమైన సామాగ్రి, ప్లాంట్, టూల్స్, ఉపకరణాలు, పనిముట్లను గుత్తేదారు సంస్థ[114] తన సొంత ఖర్చుతో సరఫరా చేయాలి. సామాగ్రి కొనుగోళ్లు, ఇతర ఖర్చుల కోసం గుత్తేదారు సంస్థకు చెల్లింపులు జరిపేందుకు, ధవళేశ్వరం పీఐపీ హెడ్ వర్క్స్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్‌కు ₹170 కోట్ల ప్రత్యేక ఇంప్రెస్ట్ మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంజూరు చేసింది (2017 మే నుండి 2018 మే వరకు).

ఏజెన్సీ యొక్క తదుపరి రన్నింగ్ అకౌంట్ బిల్లుల నుండి అడ్వాన్స్ గా చెల్లించిన మొత్తాలను రికవరీ చేయాలనే షరతుకు లోబడి, అదే ప్రయోజనం కోసం చెల్లించిన మొబిలైజేషన్ అడ్వాన్స్ కు ఇది అదనంగా చెల్లించారు. రికవరీ చేసిన మొత్తాలను తదుపరి ఉపయోగం కోసం ఇంప్రెస్ట్ నిధికి తిరిగి చెల్లించాలి. ప్రత్యేక ఇంప్రెస్ట్ ను మంజూరు చేస్తున్నప్పుడు ప్రభుత్వం ఈ నిధి 'నిర్వహణకు మార్గదర్శకాలను' రూపొందించాలని ఆదేశించింది.

114 మెసర్స్ ట్రాన్స్ స్ట్రాయ్ -జేవీఎస్ సీ-ఈసీ-యూఈఎస్(జేవీ)

ఆడిట్ ఈ క్రింది విషయాలను గమనించడమైంది:

- 2017 ఆగస్టు నుంచి 2018 నవంబర్ వరకు మొత్తం ₹170 కోట్ల ప్రత్యేక నిధుల్లో సంచితంగా ₹446.32 కోట్లను గుత్తేదారు సంస్థకు చెల్లించగా, దానిలో ₹302.10 కోట్లు వసూలు చేశారు. సంస్థకు విడుదల చేసిన స్పెషల్ ఇంప్రెస్ట్ మొత్తాన్ని పూర్తిగా వసూలు చేయక ₹144.22 కోట్లు (2018 నవంబర్ నాటికి) వసూలు చేయాల్సి ఉంది.
- వసూలు చేయాల్సిన ₹144.22 కోట్లలో ₹123.07 కోట్లు (మార్చి 2019) బ్యాంకు పూచీకత్తులను నగదుగా మార్చుకోవడం ద్వారా వసూలు చేయగా, మిగిలిన ₹21.15 కోట్లు 2023 మార్చి నాటికి వసూలు చేయాల్సి ఉంది.
- స్పెషల్ ఇంప్రెస్ట్ ఫండ్ నిర్వహణకు మార్గదర్శకాలను శాఖ రూపొందించలేదు.
- ఇంప్రెస్ట్ ద్వారా అడ్వాన్స్ గా ఇచ్చిన మొత్తంపై వడ్డీ విధించే విషయంలో ప్రభుత్వ ఆదేశం మౌనంగా ఉంది. ఒప్పంద నిబంధన 49.4[115] ప్రకారం విధించాల్సిన వడ్డీ రేటు (11 శాతం) ఆధారంగా, ***పట్టిక 3.4*** లో వివరించిన విధంగా ఎప్పటికప్పుడు సంస్థకు విడుదల చేసిన మొత్తాలపై వడ్డీ ₹30.61 కోట్లు (మార్చి 2023 వరకు) ఉంటుంది. అడ్వాన్స్ గా ఇచ్చిన ఇంప్రెస్ట్, చేసిన వసూళ్ళు, అడ్వాన్స్ గా ఇచ్చిన మొత్తంపై వడ్డీ లెక్కింపు వివరాలు ***అనుబంధం 3.1 లో*** **ఇవ్వబడ్డాయి**.

**పట్టిక 3.4: విధించాల్సిన మొత్తం వడ్డీ**

| క్రమ సంఖ్య | వివరాలు | | మొత్తం (₹ కోట్లలో) |
|---|---|---|---|
| 1. | ఇంప్రెస్ట్ | గుత్తేదారు సంస్థకు అడ్వాన్స్ గా ఇచ్చిన మొత్తం | 446.32 |
| 2. | | వసూలుచేసిన మొత్తం | 302.10 |
| 3. | | బ్యాంకు పూచీకత్తులను నగదుగా మార్చుకోవడం ద్వారా వసూలుచేసిన మొత్తం (29.03.2019) | 123.07 |
| 4. | | గుత్తేదారు సంస్థ నుంచి వసూలుచేయాల్సిన మొత్తం | 21.15 |
| 5. | ఇంప్రెస్ట్ పై వడ్డీ | వడ్డీ రేటు (*శాతంలో*) | 11 |
| 6. | | మొత్తంపై వడ్డీ (2018 నవంబర్ వరకు) | 16.05 |
| 7. | | వసూలుచేసిన మొత్తంపై వడ్డీ అనగా ₹123.07 కోట్లపై (2018 డిసెంబర్ నుంచి 2019 మార్చి వరకు) | 5.25 |
| 8. | | ₹21.15 కోట్ల బకాయి మొత్తంపై వడ్డీ (2019 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు) | 9.31 |
| 9. | | **చెల్లించాల్సిన మొత్తం వడ్డీ (2023 మార్చి నాటికి)** | **30.61** |

*మూలం: జలవనరుల శాఖ రికార్డుల ఆధారంగా ఆడిట్ ద్వారా సంకలనం చేయబడింది*

ప్రాజెక్టు పనుల కొనసాగింపును సులభతరం చేయడానికి, గుత్తేదారు సంస్థ ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యల వల్ల తలెత్తే జాప్యాన్ని నివారించడానికి ప్రత్యేక ఇంప్రెస్ట్ మంజూరు చేయడం జరిగిందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 జూన్).

పని ప్రయోజనాల దృష్ట్యా కాంట్రాక్టర్లకు ఆర్థిక సహాయం అందించినట్లు ముగింపు సమావేశ సమయంలో ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్). ప్రాజెక్టు కీలక దశలో ఉండటం, గుత్తేదారు ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో గుత్తేదారుకు ఆర్థికంగా మద్దతు ఇవ్వాలని భావించారు. ఆ సమయంలో పనులు నిలిపివేస్తే కొత్తగా టెండర్లు పిలవాల్సి

[115] 01/2012-13 తేది 02.03.2013 మెస్సర్స్ ట్రాన్స్ స్ట్రాయ్ (ప్రధాన ఆనకట్ట ఒప్పందం)

ఉంటుంది, ఫలితంగా కొత్త ఎస్ఎస్ఆర్ వర్తింపచేయడం వలన ప్రాజెక్టు వ్యయం పెరుగుతుంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని గుత్తేదారుకు ప్రత్యేక ఇంప్రెస్ట్ లేదా అడ్వాన్స్ రూపంలో ఆర్థిక సహాయం అందించబడింది.

ఒప్పందంలోని నిబంధనల ప్రకారం ఆర్థిక, సామాగ్రి సమీకరణ గుత్తేదారు సంస్థ బాధ్యత. ప్రత్యేక ఇంప్రెస్ట్ ద్వారా నిధులు కేటాయించినప్పటికీ గుత్తేదారు సంస్థ పనులను వేగవంతం చేయకపోవడంతో కాంట్రాక్టును రద్దు చేసి, ఆ తర్వాత మరో సంస్థకు పనులు అప్పగించడం జరిగింది. అందువల్ల, మొబిలైజేషన్ అడ్వాన్స్ మాదిరిగానే 'వడ్డీ రహిత ఇంప్రెస్ట్' సమకూర్చడం వలన, అది కూడా వసూలు ఎటువంటి సురక్షితమైన మార్గాలను ఏర్పాటు చేయకుండా, గుత్తేదారు సంస్థకు వడ్డీ రూపంలో ₹30.61 కోట్ల అనుచితమైన ప్రయోజనం కలిగింది. సమాధానం ఆమోదయోగ్యం కాదు.

### (ఆ) ఒక సంస్థకు రివాల్వింగ్ ఫండ్ అందించడం

"ప్రధాన ఆనకట్ట నిర్మాణం ప్యాకేజీ" పనుల కోసం, 2019 ఆగస్టు నాటికి పనులు పూర్తి చేయాలనే షరతుతో రెండవ గుత్తేదారు సంస్థతో[116] ₹1,244.36 కోట్లకు ఒప్పందం కుదిరింది (2018 ఫిబ్రవరి). ఒప్పందంలోని ప్రత్యేక నిబంధనలు (బిల్ ఆఫ్ క్వాంటిటీస్ లోని క్రమ సంఖ్య 15) ప్రకారం గుత్తేదారు సంస్థే స్టీల్, సిమెంట్, బిటుమెన్, పేలుడు పదార్థాలు, ఇసుక, లోహాలు, మట్టి మొదలైన వాటిని ముందుగానే సేకరించుకోవాలి. రవాణాతో పాటు సామాగ్రి ఖర్చును కాంట్రాక్ట్ సంస్థ భరించాల్సి ఉంటుంది.

పైన పేర్కొన్న ఒప్పంద షరతుకు విరుద్ధంగా, గుత్తేదారు సంస్థకు చెల్లించే తదుపరి రన్నింగ్ అకౌంట్ బిల్లు నుండి చెల్లించిన మొత్తాన్ని ఏకమొత్తంగా వసూలు చేయాలనే షరతుతో, డీజిల్ సేకరణ కొరకు ప్రభుత్వం ₹20.00 కోట్ల ప్రత్యేక రివాల్వింగ్ ఫండ్[117] మంజూరు చేసిందని (2018 మార్చి), ఆ తరువాత దానిని ₹50.00 కోట్లకు[118] పెంచబడిందని (2018 నవంబర్) ఆడిట్ గమనించింది. అయితే స్పెషల్ రివాల్వింగ్ ఫండ్ ద్వారా ఇచ్చిన మొత్తంపై వడ్డీ విధించడం గురించి పై ఉత్తర్వు మౌనంగా ఉంది.

గుత్తేదారు సంస్థ ఫండ్ నుండి ₹26 కోట్ల మొత్తాన్ని ఉపయోగించుకోగా (2019 జూలై), బిల్లుల నుండి అంతే మొత్తం వసూలు చేయబడింది. మొబిలైజేషన్ అడ్వాన్స్‌పై వర్తించే వడ్డీ రేటు (11 *శాతం*) ఆధారంగా గుత్తేదారు సంస్థకు విడుదల చేసిన మొత్తాలపై వడ్డీ చివరి చెల్లింపు తేదీ (2019 జూలై) నాటికి ₹2.84 కోట్లుగా (***అనుబంధం 3.2*** లో వివరణాత్మక గణన) లెక్కించబడింది.

నగదు లభ్యతా నిర్వహణ, పనుల నిరంతర పురోగతిలో గుత్తేదారు సంస్థకు మద్దతు ఇవ్వడానికి రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు చేయబడిందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 జూన్). అంతేకాకుండా, అటువంటి అడ్వాన్సులపై తప్పనిసరిగా వడ్డీని విధించాలని ప్రభుత్వ మార్గదర్శకాలు లేదా ఆదేశాలలో లేవని సమాధానం ఇచ్చింది.

సమాధానం ఆమోదయోగ్యం కాదు. ఒప్పందంలోని షరతుల ప్రకారం సొంత ఖర్చుతో సామాగ్రిని కొనుగోలు చేయాల్సిన బాధ్యత కాంట్రాక్ట్ సంస్థదేనని నిర్దేశించబడింది. అందువలన మొబిలైజేషన్ అడ్వాన్స్ తరహాలోనే 'వడ్డీ లేని రివాల్వింగ్ ఫండ్' ను ఏజెన్సీకి ఇవ్వడం వలన గుత్తేదారు సంస్థకు ₹2.84 కోట్ల మేర అనుచిత లబ్ధి చేకూరింది.

***సిఫార్సు 3.3: ప్రస్తుత నియమ నిబంధనలకు అనుగుణంగా గుత్తేదారు సంస్థలకు అడ్వాన్సులు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం చూడాలి. గుత్తేదారు సంస్థలకు అందించే ఏదైనా ఆర్థిక సహాయం సహేతుకమైన వడ్డీ భాగాన్ని కలిగి ఉండాలి, అడ్వాన్సుగా ఇచ్చిన మొత్తానికి బ్యాంకు పూచీకత్తులను తీసుకోవాలి.***

---

116 మెస్సర్స్ నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్

117 మెమో సంఖ్య 985324/ప్రాజెక్ట్ I/2018-3 తేది 22.03.2018

118 మెమో సంఖ్య ఐసీడీ01-ఎంజేఐఆర్ఓపీ 28/30/2018-ప్రాజెక్టులు-I-డబ్ల్యూఆర్ డీ తేది 19.11.2018

### (ఇ) ఆస్తుల కన్నా అధికంగా ఉన్న అప్పులు

ఒప్పందంలోని కాంట్రాక్ట్ నిబంధనలు (నిబంధన 42.2.3) ప్రకారం, కాంట్రాక్ట్ నిబంధనలను పాటించకపోతే, ప్రభుత్వం/శాఖ సూచించిన ఏదైనా వసూలు లేదా వసూళ్ళను కాంట్రాక్ట్ సంస్థ యొక్క ఏదైనా బిల్లు లేదా డిపాజిట్ల నుండి వసూలు చేయాల్సి ఉంటుంది.

అనేక నోటీసులు జారీ చేసినప్పటికీ కాంట్రాక్టు సంస్థ పనులు (₹1,755.05 కోట్లు ఖర్చు చేసిన తర్వాత) పూర్తి చేయలేకపోవడంతో ఒప్పందంలోని 55వ[119] నిబంధన, ఆంధ్రప్రదేశ్ వివరణాత్మక స్టాండర్డ్ స్పెసిఫికేషన్ కు చెందిన ప్రిలిమినరీ స్పెసిఫికేషన్స్ 61వ[120] నిబంధన క్రింద ఒప్పందాన్ని శాఖ రద్దు చేసింది[121] (2019 అక్టోబర్).

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి[122] కాంట్రాక్ట్ సంస్థ ఖాతాలను పరిష్కరించడంపై వివరణాత్మక నివేదికను సమర్పించారు (2020 డిసెంబర్). నివేదిక ప్రకారం, గుత్తేదారు సంస్థకు సంబంధించిన ఆస్తులు (నగదుగా మార్చబడిన బ్యాంక్ పూచీకత్తులు, నిలుపుదల డబ్బు, చెల్లింపు కోసం పెండింగ్‌లో ఉన్న బిల్లులు మొదలైనవి), గుత్తేదారు సంస్థకు సంబంధించిన అప్పులు[123], ***అనుబంధం 3.3*** లో వివరించిన విధంగా వరుసగా ₹842.03 కోట్లు, ₹848.01 కోట్లుగా ఉన్నాయి. ప్రభుత్వానికి గుత్తేదారు సంస్థ నికర అప్పు ₹5.98 కోట్లు.

పైన పేర్కొన్నవి కాకుండా, ఆంధ్రప్రదేశ్ వివరణాత్మక స్టాండర్డ్ స్పెసిఫికేషన్ కు చెందిన ప్రిలిమినరీ స్పెసిఫికేషన్స్ 60(పి) నిబంధన ప్రకారం, ₹269.29 కోట్ల జరిమానా విధించాలని (₹5,385.91 కోట్ల కాంట్రాక్టు విలువపై ఐదు శాతానికి పరిమితం చేస్తూ), కాంట్రాక్ట్ సంస్థ ₹26.02 కోట్లు ఆంధ్రప్రదేశ్ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ కు చెల్లించాలని, ప్రత్యేక ఇంప్రెస్ట్ పై వడ్డీగా ₹30.61 కోట్లు (పేరా 3.1.3.2 (ఎ)లో వ్యాఖ్యానించబడింది) తిరిగి వసూలు చేయాలని శాఖ ప్రతిపాదించింది. పైన పేర్కొన్న విషయాలను సంగ్రహంగా చెప్పాలంటే, గుత్తేదారు సంస్థ నుండి వసూలు చేయకపోతే, శాఖ ₹331.90 కోట్లు (₹5.98 కోట్లు + ₹269.29 కోట్లు + ₹26.02 కోట్లు + ₹30.61 కోట్లు) నష్టపోతుంది.

గుత్తేదారు సంస్థ భాగస్వామిపై[124] కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియను ప్రారంభించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్ సీఎల్ టీ) హైదరాబాద్ బెంచ్‌లో కెనరా బ్యాంక్ దివాలా పిటిషన్ దాఖలు చేసిందని[125] (2018 అక్టోబర్) ఇక్కడ పేర్కొనడం సముచితం. ఎన్ సీఎల్ టీ లో తగిన దావా వేసి, బకాయి ఉన్న మొత్తాన్ని తిరిగి వసూలు చేయాలని కూడా శాఖ ప్రతిపాదించింది. అయితే గుత్తేదారు సంస్థ నుండి బకాయి ఉన్న ₹331.90 కోట్ల మొత్తాన్ని తిరిగి వసూలుచేయనూ లేదు, ఎన్ సీఎల్ టీ లో ఎటువంటి దావా కూడా వేయలేదు.

విక్రేతలకు చెల్లించాల్సిన బకాయిలు వాస్తవ బకాయిలు కావని, అంచనా వేసిన అప్పులని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 జూన్). అలాగే, ప్రభుత్వ ఉత్తర్వు (జీఓఆర్ టీ 253 తేది 29.05.2017) లో ఇంప్రెస్ట్ పై వడ్డీని వసూలు చేసే నిబంధన ఏదీ లేదని, ఈ రెండు అంశాలను తీసివేసిన తర్వాత ఆస్తులు, అప్పుల మధ్య వ్యత్యాసం స్వల్పంగా ఉంటుందని పేర్కొంది. స్టాండర్డ్ స్పెసిఫికేషన్ కు చెందిన ప్రిలిమినరీ స్పెసిఫికేషన్స్ 60(పి) నిబంధన

---

119 రద్దును ఎపిడిఎస్ఎస్ కు పిఎస్ నిర్వహించాలి

120 ఏపీడీఎస్ఎస్ కు పీఎస్ నిబంధన 61 ప్రకారం: కాంట్రాక్టర్ పనులను నిలిపివేయడం/సబ్-లెట్ చేస్తే కాంట్రాక్ట్ నిబంధనలకు అనుగుణంగా పనులు కొనసాగించాలని కాంట్రాక్టరుకు లిఖితపూర్వకంగా నోటీసు ఇచ్చే అధికారం ఈఈకి ఉంటుంది. ఒకవేళ కాంట్రాక్టరు విఫలమైతే, అటువంటి నోటీసు ఇవ్వబడిన 14 రోజుల లోపు, పనిని పూర్తి చేయడం కొరకు, పనులు, స్థలం, దానిపై ఉన్న అన్ని ప్లాంట్, సామాగ్రిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు

121 లేఖ సంఖ్య సీఈ/పీపీహెచ్ డబ్ల్యూ యూనిట్/పోలవరం/డీసీఈ-II/ఓటీ-I/ఏఈఈ-1/529ఎమ్ తేది 30.10.2019

122 లేఖ సంఖ్య సీఈ/పీపీ/డీసీఈ/ ఓటీ-3/ఏఈఈ-1/ఎఫ్20, సంపుటి.14 తేది 29.12.2020

123 ఇంప్రెస్ట్ మొత్తం, ఏజెన్సీ చెల్లించాల్సిన విద్యుత్ ఛార్జీలు, ఇతర ఏజెన్సీలకు అప్పులు మొదలైనవి

124 మెస్సర్స్ ట్రాన్స్ స్ట్రాయ్

125 దివాలా చట్టం, 2016 లోని సెక్షన్ 7 ప్రకారం

ప్రకారం, కాంట్రాక్టు విలువలో ఐదు శాతం జరిమానాను సడలించే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని కూడా సమాధానం ఇచ్చింది.

స్టాండర్డ్ స్పెసిఫికేషన్ కు చెందిన ప్రిలిమినరీ స్పెసిఫికేషన్స్ నిబంధన 60(సి) ప్రకారం విధించాల్సిన జరిమానాను సడలించడం, వడ్డీ లేని ఆర్థిక సహాయం అందించడం అన్ని గుత్తేదారు సంస్థలకు అనవసరమైన ప్రాధాన్యత ఇచ్చినట్లవుతుంది, ఇది రాష్ట్రంలో పురోగతిలో ఉన్న పనులపై తీవ్ర ప్రభావం చూపుతుంది కనుక సమాధానం ఆమోదయోగ్యం కాదు.

### 3.1.3.3 కూలిపోయిన సొరంగం బాగుచేయడానికి చేసిన నివారించదగిన ఖర్చు

"కుడి వైపు అనుసంధానాల నిర్మాణం (ప్యాకేజీ 64: 880 మీటర్ల పొడవు గల సొరంగం)" పనిని 2023 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలనే షరతుతో ₹116.86 కోట్ల వ్యయంతో ఒక గుత్తేదారు సంస్థకు[126] అప్పగించారు (2005 మార్చి/ 2021 డిసెంబర్). రికార్డుల పరిశీలనలో ఈ క్రింది విషయాలు వెల్లడయ్యాయి:

కుడి అనుసంధానిక నుండి జంట సొరంగాల నిర్మాణ దశలో, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) (2010) భౌగోళిక సాంకేతిక పరిశోధన నివేదికలో ఎడమ, కుడి[127] సొరంగం యొక్క వివిధ భాగాలలో 'రాతి తరగతి'[128] నాణ్యతను 'పేలవమైనది' గా ప్రకటించింది. ఇంకా, జీఎస్ఐ నివేదిక ఈ క్రింద వివరించిన విధంగా కొన్ని సిఫార్సులను చేసింది:

- ➢ అధిక ఒత్తిడి వలన నష్టం వాటిల్లకుండా, సొరంగం ఉపరితలం యొక్క మొత్తం చుట్టుకొలత అంతటా ఒత్తిడిని తట్టుకునే విధంగా సొరంగం బలపరచటానికి తగిన రూపకల్పనను నిర్ణయించాలని సిఫార్సు చేయడమైంది.
- ➢ షియర్ జోన్ల (రాతి ద్రవ్యరాశి తక్కువ ఉన్న) కోసం, వదులుగా ఉన్న/నలిగిన రాయి, మృదువైన గోజ్ పదార్థాలను తొలగించి, తిరిగి అక్కడ కాంక్రీటుతో నింపాలని సిఫార్సు చేయడమైంది. తదనంతరం, షాట్‌క్రీట్, వంపు తిరిగిన బోల్టింగ్‌తో స్టీల్ మెష్‌ను అమర్చాలి.

పైన పేర్కొన్న విభాగాల వద్ద సొరంగం యొక్క బలాన్ని సుస్థిరం చేయడానికి అటువంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేదని ఆడిట్ గమనించింది. ఫలితంగా, ఎడమ సొరంగంలో 70 మీటర్ల నుండి 90 మీటర్ల మధ్య సొరంగం కూలిపోయింది (2021 జూన్), దీనిని జీఎస్ఐ ముందే బలహీనమైన జోన్‌గా వర్గీకరించింది. "జంట సొరంగాల వెడల్పు" పని అంచనాలలో కూలిన సొరంగం బాగుచేయటం కొరకు ₹63.18 లక్షలు కేటాయించారు (2021 సెప్టెంబర్).

పనిని చేపట్టే ముందు లేదా చేపట్టిన సమయంలో జీఎస్ఐ సూచించిన విధంగా బలహీనమైన ప్రాంతాలను బలోపేతం చేయడానికి శాఖ తగిన చర్యలు తీసుకొని ఉంటే, కూలిపోవడాన్ని నివారించగలిగి ఉండేది. శాఖ ఎటువంటి చర్య తీసుకోకపోవడం వల్ల నివారించదగిన అదనపు భారం పడింది. 2023 మార్చి నాటికి కూలిపోయిన సొరంగం బాగుచేయటానికి ఎటువంటి ఖర్చు చేయలేదు.

సొరంగం కూలిపోయిన విషయాన్ని ధ్రువీకరిస్తూ అంచనాలలో ఇచ్చిన ₹63.18 లక్షల మొత్తం కూలిపోయిన భాగాన్ని బాగుచేయడానికి కాదని, సొరంగం యొక్క ప్రధాన భాగంలో వదులుగా ఉన్న భాగాలను నింపడానికి ఉద్దేశించినదని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 జూన్).

కేటాయించిన మొత్తాన్ని 'కూలిన భాగాలను బాగుచేయడం కోసం' చేర్చినట్లు అంచనాలు స్పష్టంగా పేర్కొన్నందున సమాధానం ఆమోదయోగ్యం కాదు.

---

[126] మెస్సర్స్ మ్యాక్స్ ఇన్ ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్

[127] 66 మీటర్ల నుండి 100 మీటర్లు, 110 మీటర్ల నుండి 124 మీటర్లు, 130 మీటర్ల నుండి 140 మీటర్లు

[128] 18 మీటర్ల నుండి 46 మీటర్లు, 70 మీటర్ల నుండి 90 మీటర్లు, 424 మీటర్ల నుండి 444 మీటర్లు, 470 మీటర్ల నుండి 505 మీటర్లు

### 3.1.3.4 దిద్దుబాటు పనులపై నివారించదగిన ఖర్చు

బిడ్ షరతు 17 ప్రకారం, మొత్తం కాంట్రాక్ట్ విలువ సంతృప్తికరంగా నిర్మాణం, పని పూర్తి చేయడం, పనుల నిర్వహణకు అవసరమైన ఏ రకమైన పని అయినా కలిగి ఉంటుంది. కాంట్రాక్ట్ విలువలో గుత్తేదారుచే అన్ని సాధారణ షరతులు పాటించడం, అన్ని సామాగ్రి, ప్లాంట్, ఉపకరణాలు, సరైన, తగిన రక్షణ పనుల ఏర్పాటు, మళ్లింపులు మొదలైనవి ఉంటాయి. ఇంకా, షరతు 18 ప్రకారం, 'గుత్తేదారుచే నిర్వహించబడే పనులు గుత్తేదారు బాధ్యతతోనే నిర్వహించబడాలి, కాంట్రాక్ట్ కాలంలో వరదలు, అగ్ని ప్రమాదాలు, ఇతర సాధారణ ప్రమాదాలకు స్వంత భీమాను ఏర్పాటు చేసుకోవాలి'. అందువలన, కాంట్రాక్ట్ కాలంలో అదనపు ఖర్చు లేకుండా, చేపట్టిన పనిని రక్షించుకోవడం కాంట్రాక్టర్ బాధ్యత.

రెండో గుత్తేదారు సంస్థ[129] పనులు ముందస్తుగా మూసివేసిన తర్వాత (2019 జూలై), మిగిలిన ప్రధాన ఆనకట్ట ప్యాకేజీ పనిని 24 నెలల్లో (2021 నవంబర్) పూర్తి చేయాలనే నిబంధనతో రివర్స్ టెండరింగ్ పద్ధతిలో ₹1,548.12 కోట్ల వ్యయంతో మూడో గుత్తేదారు సంస్థకు[130] అప్పగించారు (2019 నవంబర్).

మిగిలిన పనులను అప్పగించడానికి, కొత్త గుత్తేదారు సంస్థ ద్వారా శ్రామిక శక్తిని సమీకరించడం/పనిని ప్రారంభించడానికి మధ్య (2019 ఆగస్టు, 2019 నవంబర్ మధ్య) సమయ అంతరం[131] కారణంగా, కాంట్రాక్టులో భాగం కాని మూడవ సంస్థ ద్వారా పని ప్రదేశంలో ఈ క్రింది నివారించదగిన దిద్దుబాటు పనులు జరిగాయి:

(i) వర్షాకాలంలో (2019 జూలై నుండి 2019 సెప్టెంబర్ వరకు) స్పిల్ వే, స్టిల్లింగ్ బేసిన్ లు నీటితో నిండిపోయాయి. పనిని ప్రారంభించడానికి మూడో గుత్తేదారు సంస్థ 2019 డిసెంబర్/2020 జనవరిలో 'స్టిల్లింగ్ బేసిన్, ఛానల్‌లో నీటిని తొలగించే పనిని చేపట్టింది[132]', అందుకు గుత్తేదారు సంస్థకు ₹8.30 కోట్లు చెల్లించారు (2022 జూలై).

(ii) నీటిని తొలగించిన తరువాత, చాలా కాలం నీరు నిలిచిపోవడం వల్ల పని ప్రాంతం మొత్తం బురద/చిత్తడి నేలతో నిండిపోవడంతో, మూడవ గుత్తేదారు సంస్థ బురదను తొలగించింది[133], దాని నిమిత్తం ఆ సంస్థకు ₹8.98 కోట్లు చెల్లించారు (2022 జూలై).

రాబోవు వర్షాకాలంలో అప్పటికే చేపట్టిన పనులు ముంపునకు గురయ్యే అవకాశం ఉన్నందున వాటి రక్షణకు ఎటువంటి ఏర్పాటు చేయకుండా రెండో గుత్తేదారు సంస్థకు అప్పగించిన పనులను ముందుచూపు లేకుండా మూసివేసినట్లు ఆడిట్ గుర్తించింది. వర్షాకాలం ముగిసే వరకు రెండో గుత్తేదారు సంస్థ కొనసాగి ఉంటే వర్షాకాలంలో నిలిచిపోయిన నీటిని తొలగించడం, పేరుకుపోయిన బురద మట్టిని తొలగించడానికి చేసిన ₹17.28 కోట్ల అదనపు వ్యయాన్ని నివారించగలిగి ఉండేది, ఎందుకంటే కాంట్రాక్ట్ నిబంధన ప్రకారం కాంట్రాక్ట్ సంస్థే దానిని భరించాల్సి ఉంటుంది.

మిగిలిన పనుల నిర్వహణకు నీటి తొలగింపు, బురద తొలగింపు అవసరం కాబట్టి కొత్త గుత్తేదారు సంస్థ ఆ పనులు చేపట్టిందని, చెల్లింపులు చేశామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 జూన్).

---

[129] మెస్సర్స్ నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్

[130] మెస్సర్స్ మేఘా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్

[131] నాలుగు నెలల ఆలస్యం, అది నదికి వరద కాలం

[132] 20 హెచ్ పీ డీజిల్ పంప్ తో సీహెచ్ 356.00 మీ. వరకు, స్పిల్ ఛానల్ సీహెచ్ 356 మీ. నుండి సీహెచ్ 2,920 మీ వరకు ఉంటుంది

[133] 'స్పిల్ ఛానల్, స్పిల్ వే యొక్క స్టిల్లింగ్ బేసిన్ లో తవ్వకం, తొలగింపు 2019 వరదలకు ముందు తవ్విన స్థాయిల కంటే ఎక్కువ నిక్షిప్తం చేయబడింది'

ఆ విధంగా, రెండో గుత్తేదారు సంస్థకు అప్పగించిన పనిని మరొక సంస్థకు అప్పగించే ముందు, అమలు చేయబడిన పనుల రక్షణ బాధ్యత గుత్తేదారు సంస్థదే అనే ఒప్పంద నిబంధనను విస్మరించి వాటిని ముగించివేయాలనే అనాలోచిత నిర్ణయంతో నీటి తొలగింపు, బురద తొలగింపు కోసం ₹17.28 కోట్లు అదనపు ఖర్చు జరిగింది.

### 3.1.4 నాణ్యతా నియంత్రణ

నీటి పారుదల శాఖ యొక్క నాణ్యతా నియంత్రణ మాన్యువల్ ప్రకారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యొక్క నాణ్యతా నియంత్రణ విభాగం క్రమం తప్పకుండా రోజువారీ నాణ్యత నియంత్రణ తనిఖీలను నిర్వహిస్తుంది.

#### 3.1.4.1 నాణ్యతా నియంత్రణ ధ్రువపత్రాల జారీ

నాణ్యతా నియంత్రణ మాన్యువల్ ప్రకారం, నాణ్యతా నియంత్రణ విభాగం నియమిత కాలంలో పనిని తనిఖీ చేయాలి, అవసరమైన పరీక్షలను నిర్వహించాలి. నాణ్యతా నియంత్రణకు సంబంధించి ఏదైనా లోపం కనుగొనబడితే, దానిని సరిదిద్దడం కోసం తనిఖీ నోట్/నివేదిక రూపంలో సంబంధిత గుత్తేదారు సంస్థ, నిర్మాణ విభాగం దృష్టికి తీసుకురావాలి. నాణ్యతా నియంత్రణ విభాగం అందించే సూచనలను పరిశీలించిన తరువాత నిర్మాణ విభాగాలు తనిఖీ నోట్ లకు అమలు నివేదికలను సమర్పించాలి.

***అనుబంధం 3.4*** లో వివరించిన విధంగా నాణ్యతా నియంత్రణ విభాగం జారీ చేసిన 23 తనిఖీ నోట్ లకు[134] (2006 మార్చి నుండి 2022 ఏప్రిల్) నిర్మాణ విభాగాల నుండి అమలు నివేదికలు పెండింగ్ లో ఉన్నాయని ఆడిట్ గమనించింది. అయితే తనిఖీ నోట్స్‌కు అమలు నివేదికలను సమర్పించకున్నా గుత్తేదారులకు బిల్లులు చెల్లించడానికి అనుమతిస్తూ నాణ్యతా నియంత్రణ విభాగం నాణ్యతా నియంత్రణ ధ్రువపత్రాలు జారీ చేసింది.

అదే విధంగా, ఎడమ ప్రధాన కాలువ రికార్డుల పరిశీలనలో నాణ్యతా నియంత్రణ విభాగానికి చెందిన చీఫ్ ఇంజనీర్, పర్యవేక్షక ఇంజనీర్, కార్యనిర్వాహక ఇంజనీర్లు వివిధ సందర్భాల్లో (2018 మార్చి నుండి 2019 ఫిబ్రవరి వరకు) తనిఖీలు నిర్వహించి, నిర్మాణ విభాగాలు అమలుపరచవలసిన తనిఖీ నోట్స్ జారీ చేసినట్లు వెల్లడైంది. అయితే, ***పట్టిక 3.5*** లో వివరించిన విధంగా నాణ్యతా నియంత్రణ విభాగం జారీచేసిన నాలుగు తనిఖీ నోట్ లకు సంబంధించిన అమలు నివేదికలు నిర్మాణ విభాగాల నుండి పెండింగ్ లో ఉన్నాయి.

**పట్టిక 3.5: పెండింగ్ లో ఉన్న నాణ్యతా నియంత్రణ వ్యాఖ్యల వివరాలు**

| క్రమ సంఖ్య | తనిఖీ నోట్స్, తేదీల వివరాలు | నిర్మాణ విభాగం | పని పేరు | స్థితి |
|---|---|---|---|---|
| పర్యవేక్షక ఇంజనీర్, నాణ్యతా నియంత్రణ, నిఘా, అమలు సర్కిల్, ధవళేశ్వరం | | | | |
| 1. | 236ఎమ్, 17.05.2018 | పిఐపిఎల్ఎంసి 2వ డివిజన్, ధవళేశ్వరం | కి.మీ. 33.559 వద్ద జాతీయ రహదారి క్రాసింగ్ | పెండింగ్ లో ఉంది |
| 2. | 65ఎమ్, 06.02.2019 | పిఐపిఎల్ఎంసి 1వ డివిజన్, ధవళేశ్వరం | ప్యాకేజీ-1ఎ | పెండింగ్ లో ఉంది |
| 3. | 108ఎమ్, 16.03.2018 | పిఐపిఎల్ఎంసి 1వ డివిజన్, ధవళేశ్వరం | ప్యాకేజీ-1 | పెండింగ్ లో ఉంది |
| కార్యనిర్వాహక ఇంజనీర్, నాణ్యతా నియంత్రణ డివిజన్, ధవళేశ్వరం | | | | |
| 4. | 41ఎమ్, 18.01.2019 | ఈఈ, పిఐపిఎల్ఎంసి, డివిజన్ నెం.4, తుని | ప్యాకేజీ-4 ఎ | పెండింగ్ లో ఉంది |

*మూలం: శాఖ యొక్క రికార్డులు*

[134] చీఫ్ ఇంజనీర్: 2, పర్యవేక్షక ఇంజనీర్: 11, కార్యనిర్వాహక ఇంజనీర్: 10

తనిఖీ నోట్స్ కు సంబంధించి అమలు నివేదికలు అందకుండా, నిబంధనలకు విరుద్ధంగా, నాణ్యతా నియంత్రణ విభాగం బిల్లుల చెల్లింపు కోసం నాణ్యతా నియంత్రణ ధ్రువపత్రాలను జారీచేసింది. తనిఖీ నోట్స్ అమలుకు సంబంధించి నివేదించకుండానే పనులను కొనసాగించేందుకు నిర్మాణ విభాగాలు అనుమతించాయి.

హెడ్ వర్క్స్ కు సంబంధించిన తనిఖీ నోట్స్ కు అమలు నివేదికలను నాణ్యతా నియంత్రణ విభాగానికి సమర్పించినట్లు ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్).

అమలు నివేదికలను సమర్పించినట్లు ప్రభుత్వం ఋజువులను సమర్పించలేదు, అందువల్ల, అమలు నివేదికల సమర్పణ ఖచ్చితత్వాన్ని ధ్రువీకరించలేము.

## 3.2 పవర్ హౌస్ నిర్మాణం

పోలవరం బహుళార్ధసాధక ప్రాజెక్టులో భాగంగా పోలవరం జలవిద్యుత్ ప్రాజెక్టు (పీహెచ్ఈపీ)ను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా దేవీపట్నం మండలం అంగులూరు గ్రామం వద్ద గోదావరి నదిపై, 960 మెగావాట్ల (80 మెగావాట్ల చొప్పున 12 టర్బైన్లు) విద్యుదుత్పత్తి సామర్థ్యంతో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించింది. భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన కేంద్ర విద్యుత్ అథారిటీ (సీఈఏ) ₹3,013.68 కోట్ల అంచనా వ్యయంతో (2010–11 ధరల స్థాయిలో) పీహెచ్ఈపీ కి సాంకేతిక–ఆర్థిక సమ్మతిని ఇచ్చింది (2012 ఫిబ్రవరి).

పవర్ హౌస్ నిర్మాణంలో విద్యుత్ ఉత్పత్తి, పవర్ గ్రిడ్ కు అనుసంధానం చేయడానికి సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ పనులు ఉంటాయి. సివిల్ పనుల్లో అంచనాల తయారీ, పరిపాలనా, సాంకేతిక అనుమతులు పొందడం, టెండర్లు పిలవడం, పనులను అప్పగించడం, అమలుచేయడం ఉంటాయి. పవర్ హౌస్ సాంకేతిక భాగాన్ని ఏపీజెన్కో అమలుచేస్తోంది.





**చిత్రం 3.6 & 3.7: పోలవరం జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం**

పవర్ హౌస్ యొక్క ముఖ్య లక్షణాలు ***పటం–3.1*** లో వివరించబడ్డాయి.

**పటం 3.1: పవర్ హౌస్ యొక్క ముఖ్య లక్షణాలు**

**(అ) భాగములు**

| | |
|---|---|
| సామర్థ్యము | • 12 x 80 మెగా వాట్స్ = 960 మెగా వాట్స్ |
| టర్బైన్ రకం | • వెర్టికల్ కప్లాన్ అడ్జస్టబుల్ బ్లేడ్ |
| డిజైన్ హెడ్ | • 27 మీ |
| కనిష్ట డ్రా డౌన్ స్థాయి | • 41.15 మీ |
| సాధారణ మొత్తం నీటి మట్టం (12 యూనిట్ల విడుదల) | • 18.20 మీ |
| ఒక్కో యూనిట్ కు విడుదల | • 331 క్యూమెక్స్ |
| ఎలక్ట్రో-మెకానికల్ పనుల విలువ | • ₹ 2,613.36 కోట్లు |
| సివిల్ పనుల విలువ | • ₹ 1,511.28 కోట్లు |
| మొత్తం ప్రాజెక్టు విలువ | • ₹ 4,124.64 కోట్లు (2017-18 ధరల స్థాయి) |
| కార్యాచరణ శక్తి రూపకల్పన | • మొదటి సంవత్సరంలో 2,308.41 మిలియన్ యూనిట్లు (ఎమ్యు), చివరి సంవత్సరం (35వ) లో 431.27 మిలియన్ యూనిట్లు |
| లెవలైజ్డ్ టారిఫ్ | • కిలోవాట్ అవర్ (కెడబ్ల్యూహెచ్) కు 461 పైసలు |

పవర్ హౌస్ యొక్క ప్రధాన భాగాలను ***పట్టిక 3.6*** లో ఇచ్చిన విధంగా సివిల్ నిర్మాణాలు, ఎలక్ట్రో-మెకానికల్ (ఇ&ఎమ్) పనులుగా విభజించారు.

**పట్టిక 3.6: సివిల్, ఎలక్ట్రో-మెకానికల్ పనులు**

| క్రమ సంఖ్య | భాగం | వర్ణన |
|---|---|---|
| I | **సివిల్ నిర్మాణాలు** | |
| 1. | ఇన్‌టేక్ స్ట్రక్చర్ కు అప్రోచ్ ఛానల్ | ఇన్‌టేక్ స్ట్రక్చర్ కు ఎగువన నీటిని ట్రాష్ ర్యాక్, ఇన్‌టేక్ నిర్మాణాలకు తీసుకెళ్లడానికి ఒక ఛానల్. |
| 2. | ట్రాష్ ర్యాక్, ఇన్‌టేక్ గేట్లతో ఇన్‌టేక్ నిర్మాణం | ఈ నిర్మాణాలు 12 హెడ్ రేస్ సొరంగాలకు నీటిని తీసుకువెళ్తాయి. |
| 3. | హెడ్ రేస్ సొరంగాలు | నీటి ప్రవాహం ఇన్‌టేక్ గేట్ల ద్వారా నియంత్రించబడుతుంది. |
| 4. | పవర్ హౌస్ గుంత | 12 ఉత్పాదక యూనిట్లకు స్థానం కల్పించడానికి రూపొందించబడింది. |
| 5. | టెయిల్ రేస్ పూల్, ఛానల్ | నీటిని తిరిగి నది ప్రధాన ప్రవాహానికి చేరవేయడానికి. ఈ చానల్ కు ఎడమ ఒడ్డున ఈఎల్ (+) 45.72 మీటర్ల ఎత్తులో 10 మీటర్ల వెడల్పుతో పవర్ హౌస్ గుంత నుండి స్విచ్ యార్డుకు రాకపోకలకు రోడ్డు ప్రతిపాదించబడింది. |
| II | **ఎలక్ట్రో-మెకానికల్ పనులు** | టర్బైన్లు, జనరేటర్లు, ట్రాన్స్ఫార్మర్లు, స్విచ్ యార్డ్ పరికరాలు. |

*మూలం: శాఖ యొక్క రికార్డులు*

**(ఆ) పోలవరం జలవిద్యుత్ ప్రాజెక్టు స్థితిగతులు**

సిఇఎ నుండి విద్యుత్ విభాగం కోసం ₹3,013.68 కోట్లకు సాంకేతిక-ఆర్థిక సమ్మతి (టిఇసి) లభించగా (2012 ఫిబ్రవరి), విద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించడానికి లక్ష్యం 2018 మార్చి గా నిర్ణయించారు. దీని ప్రకారం, సివిల్ పనుల

కాంట్రాక్టును (2013 మార్చి) ఒక గుత్తేదారు సంస్థకు[135], ఇ&ఎమ్ పనుల కాంట్రాక్టును మరొక గుత్తేదారు సంస్థకు[136] ఇవ్వబడింది (2017 డిసెంబర్). సివిల్ పనుల ఒప్పందాన్ని రద్దు చేసి ఇ&ఎం పనులు చేపట్టిన గుత్తేదారు సంస్థకు అప్పగించబడింది (2018 ఫిబ్రవరి). తదనంతరం సివిల్, ఇ&ఎం పనులకు సంబంధించిన రెండు ఒప్పందాలను రద్దు చేసి (2019 ఆగస్టు) మరో గుత్తేదారు సంస్థకు[137] అప్పగించబడ్డాయి. 2017-18 ధరల స్థాయి ప్రకారం టీఈసీని ₹4,124.64 కోట్లకు సవరించారు. ప్రాజెక్టు వ్యయాన్ని ముందుగా ₹4,956.39 కోట్లకు (2016 నవంబర్), ఆ తర్వాత 2026 జనవరి నాటికి ప్రారంభించాలని సవరించిన లక్ష్యపు తేదీతో ₹5,338.95 కోట్లకు సవరించారు. ఈ ప్రాజెక్టుపై ఇప్పటివరకు (2023 మార్చి) చేసిన మొత్తం వ్యయం ₹884.89 కోట్లు. సివిల్ పనుల భౌతిక, ఆర్థిక పురోగతి వరుసగా 12 శాతం, 17 శాతంగా నమోదైంది.

### 3.2.1 మొదటి గుత్తేదారు సంస్థ ద్వారా పనుల అమలు

పీహెచ్ఈపీ (ఎలక్ట్రో మెకానికల్ కాంపోనెంట్) నిర్మాణాన్ని ఈపీసీ విధానంలో ఒక గుత్తేదారు సంస్థకు[138] ₹3,220.28 కోట్ల కాంట్రాక్ట్ ధరకు అప్పగించారు (2017 డిసెంబర్). ప్రాజెక్టు పూర్తి చేయడానికి గడువు మొదలైననాటి నుండి (2018 జనవరి) నుండి 58 నెలలు అంటే 2023 నవంబర్ వరకు. గుత్తేదారు సంస్థకు ₹643.55 కోట్ల[139] విలువైన బ్యాంకు పూచీకత్తుల (2020 సెప్టెంబర్, 2023 మే మధ్య చెల్లుబాటు) పైన ₹753.47 కోట్ల (వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తో సహా) అడ్వాన్సులుగా చెల్లించబడ్డాయి (2018 జనవరి నుండి 2018 ఆగస్టు వరకు):

- మొబిలైజేషన్ అడ్వాన్స్ (కాంట్రాక్టు విలువలో 10 *శాతం*): ₹380 కోట్లు (₹57.97 కోట్ల జీఎస్టీతో కలిపి);
- వడ్డీ లేని నమూనా పరీక్ష చెల్లింపు (టర్బైన్ ధరలో 10 *శాతం*, మొదలైనవి): ₹145.47 కోట్లు (₹22.19 కోట్ల జీఎస్టీతో కలిపి);
- వడ్డీతో కూడిన మైల్ స్టోన్ అడ్వాన్స్ చెల్లింపులు (కాంట్రాక్టు విలువలో ఆరు శాతం): ₹228 కోట్లు (₹34.78 కోట్ల జీఎస్టీతో కలిపి).

అయితే, 2019 ఆగస్టులో కాంట్రాక్టును రద్దు చేసి కొత్త గుత్తేదారు సంస్థకు[140] పనిని అప్పగించారు (2019 నవంబర్). ముందస్తు చెల్లింపులు విడుదల చేసినప్పటికీ అసలు గుత్తేదారు సంస్థ ₹1.70 కోట్ల విలువైన పనులను[141] మాత్రమే చేసింది.

రికార్డుల పరిశీలనలో ఈ క్రింది విషయాలు వెల్లడయ్యాయి:

#### 3.2.1.1 ఒప్పందంలో వడ్డీ లేని ముందస్తు చెల్లింపుకు సంబంధించిన నిబంధనను తప్పుగా చేర్చడం

గుత్తేదారు సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందంలోని చెల్లింపు నిబంధనలు II (ఇ & ఎం పనులకు చెల్లింపు), నిబంధన 6 (iii) ప్రకారం, నమూనా పరీక్ష విజయవంతంగా పూర్తయి, నమూనా పరీక్ష నివేదికలను ఆమోదించిన తరువాత, ఆమోదించబడిన బిల్లింగ్ బ్రేక్-అప్ ప్రకారం, 'టర్బైన్, జనరేటర్, వాటి అనుబంధ వస్తువుల' ఖర్చులో 10 శాతం, ముందస్తు చెల్లింపు తేదీ నుండి 40 నెలల పాటు చెల్లుబాటు అయ్యే సమాన మొత్తానికి బ్యాంక్ పూచీకత్తు (బీజీ) పై, చెల్లించబడుతుంది.

---

[135] మెస్సర్స్ ట్రాన్స్ స్ట్రాయ్

[136] మెస్సర్స్ నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్

[137] మెస్సర్స్ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్

[138] మెస్సర్స్ నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్

[139] మొబిలైజేషన్ అడ్వాన్స్: ₹322.02 కోట్లు + మైల్ స్టోన్ అడ్వాన్స్: ₹193.22 కోట్లు + నమూనా పరీక్ష: ₹128.30 కోట్లు

[140] మెస్సర్స్ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్

[141] ప్రాజెక్టు స్థలంలో తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు దిశగా

నమూనా పరీక్ష నివేదిక విజయవంతంగా పూర్తిచేసి సమర్పించిన తర్వాత వడ్డీ లేని ముందస్తు చెల్లింపు క్రింద ₹145.47 కోట్లు గుత్తేదారు సంస్థకు చెల్లించబడ్డాయి.

వడ్డీ లేని ముందస్తు చెల్లింపు, ఒప్పందంలో పేర్కొన్న చెల్లింపు నిబంధనలకు విరుద్ధంగా ఉందని ఆడిట్ గమనించింది. ఒప్పంద నిబంధనల్లో ఏదైనా మార్పు చేయాలంటే ఏపీజెన్కో బోర్డు లేదా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అనుమతి అవసరం. అయితే, అలాంటి అనుమతి తీసుకోకపోవడంతో ₹19.14 కోట్ల[142] మేర వడ్డీ నష్టపోవడానికి దారితీసింది.

గుత్తేదారు సంస్థ అభ్యర్థన మేరకు ఏజెన్సీకి నగదు లభ్యత ఉండేలా ముందస్తు చెల్లింపు నిబంధనను చేర్చినట్లు ఏపీ జెన్కో సమాధానమిచ్చింది (2024 జూలై). ప్రీ-బిడ్ సమావేశంలో పాల్గొన్న బిడ్డర్ల అభ్యర్థన మేరకు పొందుపరిచిన ఒప్పంద నిబంధన 6 (చెల్లింపు నిబంధనలు II) ప్రకారం, నమూనా పరీక్షను విజయవంతంగా పూర్తి చేసినందుకు వడ్డీ లేని ముందస్తు చెల్లింపు క్రింద ₹145.47 కోట్లు చెల్లించినట్లు ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్).

నమూనా పరీక్ష విజయవంతంగా పూర్తయిన తర్వాత వడ్డీ లేని ముందస్తు చెల్లింపు చెల్లించే నిబంధనను ఒప్పందంలో చేర్చడం ప్రభుత్వ నిర్దేశిత నిబంధనలకు విరుద్ధం, దానిని బోర్డు కానీ లేదా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కానీ ఆమోదించలేదు, ఫలితంగా గుత్తేదారు సంస్థకు ₹145.47 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది కావున సమాధానం ఆమోదయోగ్యం కాదు.

### 3.2.1.2 తక్కువ చెల్లుబాటు వ్యవధితో బ్యాంకు పూచీకత్తులను అంగీకరించడం

ఏపీజెన్కో, గుత్తేదారు సంస్థ[143] మధ్య జరిగిన ఈపీసీ కాంట్రాక్ట్ ఒప్పందం (2017 డిసెంబర్) నిబంధన 6(V) ప్రకారం, సంస్థ అభ్యర్థిస్తే, అభ్యర్థించిన మొత్తాలకు సమానమైన బ్యాంకు పూచీకత్తులపై రెండు అదనపు మైల్ స్టోన్ అడ్వాన్స్ చెల్లింపులు (వడ్డీ[144] కలిగిన) చేయబడతాయి. ఈ అదనపు మైల్ స్టోన్ అడ్వాన్స్, డిజైన్ & ఇంజనీరింగ్ (కాంట్రాక్ట్ ధరలో ఆరు శాతానికి మించకుండా), ప్రధాన పరికరాలను ఆర్డర్ చేయడం (కాంట్రాక్ట్ ధరలో 10 శాతానికి మించకుండా) కొరకు చెల్లించబడుతుంది.

అడ్వాన్స్, వడ్డీలను దామాషా ప్రాతిపదికన రన్నింగ్ అకౌంట్ బిల్లుల నుంచి తిరిగి వసూలు చేయాలి. కాంట్రాక్ట్ పూర్తయ్యే వరకు లేదా వడ్డీతో సహా పూర్తి అడ్వాన్స్ మొత్తాన్ని తిరిగి వసూలు చేయడం, ఏది ముందు అయితే అది అయ్యే వరకు బ్యాంకు పూచీకత్తులు చెల్లుబాటులో ఉండాలి. అందుకని, బ్యాంకు పూచీకత్తు 2024 మే వరకు చెల్లుబాటులో ఉండాలి (కాంట్రాక్ట్ పూర్తయిన తేదీ నుండి ఆరు నెలల క్లెయిమ్ వ్యవధితో సహా).

2024 మే వరకు చెల్లుబాటు అయ్యే బ్యాంకు పూచీకత్తులను సమర్పించడానికి బదులుగా, గుత్తేదారు సంస్థ, వరుసగా 2021 మార్చి, 2022 ఏప్రిల్ వరకు చెల్లుబాటు అయ్యే ₹193.22 కోట్లు, ₹128.30 కోట్ల విలువైన బ్యాంకు పూచీకత్తులను సమర్పించిందని ఆడిట్ గమనించింది. ఇంతలో, ఈ కాంట్రాక్టును ప్రభుత్వం రద్దు చేసింది (2019 ఆగస్టు), రద్దును వ్యతిరేకిస్తూ గుత్తేదారు సంస్థ గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టును (2019 నవంబర్) ఆశ్రయించింది. ఇరు పక్షాలు సమర్పించిన ఉమ్మడి అవగాహన ఒప్పందం ఆధారంగా గుత్తేదారు సంస్థ పిటిషన్ ను గౌరవ హైకోర్టు మూసివేసింది (2021 జనవరి). అయితే ఏపీజెన్కో నిష్క్రియాపరత్వం కారణంగా ₹321.52 కోట్ల విలువైన బ్యాంకు పూచీకత్తులు క్రమబద్ధీకరించకుండానే వాటి చెల్లుబాట్లు ముగిశాయి.

బ్యాంకు పూచీకత్తుల చెల్లుబాటును పొడిగించాలని ఏపీజెన్కో, బ్యాంకులు ఇంకా సంస్థను అభ్యర్థించిందని (2020 డిసెంబర్/2021 జనవరి) రికార్డుల పరిశీలనలో వెల్లడైంది, అయితే బ్యాంకులు ఆ అభ్యర్థనను గౌరవించలేదు. ఆ

---

[142] 30.06.2018 నుండి 14.08.2019 వరకు ₹ 100 కోట్లకు 12 శాతం వడ్డీ, 01.08.2018 నుండి 14.08.2019 వరకు ₹ 45.47 కోట్లకు 12 శాతం వడ్డీ

[143] మెస్సర్స్ నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్

[144] ఏపీజెన్కో ఋణ రేటు కంటే ఒక శాతం ఎక్కువ వడ్డీ, ప్రస్తుతం అది 11 శాతం

విధంగా ఏపీజెన్కో, బ్యాంకు పూచీకత్తులను నగదుగా మార్చుకోలేకపోవడం లేదా గుత్తేదారు సంస్థ నుంచి ఆ మొత్తాన్ని తిరిగి వసూలు చేయలేకపోవడం వలన ₹321.52 కోట్ల నష్టాన్ని చవిచూసింది.

అనుమతుల నిబంధనల ప్రకారం, బ్యాంకు పూచీకత్తులను 36 నెలలకు మాత్రమే జారీ చేయవచ్చని, ఆ తర్వాత బ్యాంకు పూచీకత్తులను మరో 36 నెలలు పొడిగించవచ్చని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 జూలై). ఇంకా, బ్యాంకు పూచీకత్తులను నగదుగా మార్చుకోకపోవడం గురించి, కాంట్రాక్ట్ రద్దు నిర్ణయం తీసుకున్న తరువాత, వాస్తవ ఒప్పందాన్ని ముగించడానికి ఒక రోజు ముందు, బ్యాంకు పూచీకత్తులను నగదుగా మార్చడం కోసం సమర్పించినట్లు (2019 ఆగస్టు) పేర్కొంది. అయితే విజయవాడ ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి జారీ చేసిన ఉత్తర్వుల కారణంగా బ్యాంకులు ఈ అభ్యర్థనను గౌరవించలేదు. ఏపీజెన్కో చెల్లుబాటు వ్యవధిలోపు క్లెయిమ్ దాఖలు చేసినందున, క్లెయిమ్ ను గౌరవించాల్సిన బాధ్యత బ్యాంకుపై ఉంది. అన్ని వివాదాలను పరిష్కరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించిందని కూడా సమాధానమిచ్చారు. అందువలన, వడ్డీతో సహా మొబిలైజేషన్ అడ్వాన్స్ రిఫండ్ కు సంబంధించిన క్లెయిమ్ ను ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ ముందు సమర్పించారు, తుది తీర్పు రావలసి ఉంది.

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) మార్గదర్శకాల (2007 జూలై 02, నిబంధన 1.1.3) ప్రకారం బ్యాంకు పూచీకత్తులను గరిష్టంగా 10 సంవత్సరాల కాలానికి జారీ చేయవచ్చుని, చెల్లుబాటు వ్యవధి నుంచి 12 నెలల్లో క్లెయిమ్ చేయవచ్చని పేర్కొన్నందున, బ్యాంకు పూచీకత్తులు గరిష్టంగా 36 నెలల చెల్లుబాటు కోసం జారీ చేయబడతాయని పేర్కొన్న సమాధానం ఆమోదయోగ్యం కాదు. ఆ విధంగా, ఆర్బీఐ జారీ చేసిన మార్గదర్శకాలకు సంబంధించి ఏపీజెన్కో అధికారుల అవగాహనారాహిత్యం వల్ల ₹321.52 కోట్ల మేర నిధులు నిర్బంధించబడడంతో పాటు వడ్డీని నష్టపోవడమే కాక ఆ మొత్తాన్ని క్లెయిమ్ చేయడంలో మరిన్ని న్యాయపరమైన వివాదాలకు దారితీసింది.

ముగింపు సమావేశం సమయంలో, ప్రభుత్వం ఆడిట్ పరిశీలనను అంగీకరించింది (2024 నవంబర్), పని ఇంకా లోపాల నిర్వహణ గడువు పూర్తయ్యే వరకు బ్యాంకు పూచీకత్తుల చెల్లుబాటు వ్యవధిని పెంచడానికి గుత్తేదారు సంస్థ అంగీకరించిందని సమాధానం ఇచ్చింది. అయితే, పని పూర్తికావడానికి ముందే కాంట్రాక్టును రద్దు చేయడం వలన చెల్లుబాటు వ్యవధిలోపలే బ్యాంకు పూచీకత్తులను నగదుగా మార్చుకోవడం కోసం బ్యాంకుకు సమర్పించారు. అందువలన, శాఖ అభ్యర్థనను గౌరవించడం బ్యాంకు యొక్క బాధ్యత. ఇందుకు సంబంధించి పెండింగ్ లో ఉన్న ఆర్బిట్రేషన్ ను ఖరారు చేసిన తర్వాత ఒకటి, రెండు నెలల్లో సమస్య పరిష్కరించబడుతుందని పేర్కొంది.

### 3.2.1.3 చెల్లించిన వస్తు, సేవా పన్నును క్లెయిమ్ చేయడంలో జాప్యం

సీజీఎస్టీ చట్టం, 2017 లోని సెక్షన్ 54(1) ప్రకారం, "చెల్లించిన పన్ను లేదా చెల్లించిన ఏదైనా ఇతర మొత్తంపై చెల్లించిన పన్ను మరియు వడ్డీని తిరిగి చెల్లించమని క్లెయిమ్ చేసే ఏ వ్యక్తి అయినా, సంబంధిత తేదీ (పన్ను చెల్లింపు తేదీ) నుండి రెండు సంవత్సరాల గడువు ముగిసేలోపు సూచించబడిన రూపంలో మరియు పద్ధతిలో దరఖాస్తు చేసుకోవచ్చు".

ఇంకా, సీజీఎస్టీ చట్టం, 2017 లోని సెక్షన్ 54 లోని సబ్-సెక్షన్ 8(c) ప్రకారం, పూర్తిగా లేదా పాక్షికంగా అందించబడని మరియు ఇన్వాయిస్ జారీ చేయబడని సరఫరాపై చెల్లించిన పన్ను వాపసుకు సంబంధించినది అయితే, లేదా రీఫండ్ వోచర్ జారీ చేయబడినప్పుడు, తిరిగి చెల్లించదగిన మొత్తాన్ని నిధికి జమ చేయడానికి బదులుగా దరఖాస్తుదారునికి చెల్లించాలి.

గుత్తేదారు సంస్థకు[145] ₹114.94 కోట్ల[146] జీఎస్టీతో సహా ₹753.47 కోట్ల విలువైన అడ్వాన్సులను ఏపీజెన్కో చెల్లించినట్లు ఆడిట్ గమనించింది. చివరకు 2019 ఆగస్టులో ఈ కాంట్రాక్టు రద్దుచేయబడింది. గుత్తేదారు సంస్థ నుండి సేవలు పొందనందున, సీజీఎస్టీ చట్టం, 2017 నిబంధనల ప్రకారం, జీఎస్టీ చెల్లింపు నుండి రెండు సంవత్సరాల గడువు ముగిసే లోపు ఏజెన్సీ జీఎస్టీ కోసం రిఫండ్ క్లెయిమ్ చేసుకోవచ్చు. అడ్వాన్స్, జీఎస్టీ మొత్తాలకు సంబంధించిన క్రెడిట్ నోట్‌ను తక్షణమే ఏపీజెన్కోకు జారీ చేయాలని గుత్తేదారు సంస్థని ఏపీజెన్కో అభ్యర్థించింది (2019 డిసెంబర్). అయితే, గుత్తేదారు సంస్థ 2023 మార్చి వరకు ₹114.94 కోట్లకు ఏపీజెన్కోకు క్రెడిట్ నోట్ జారీ చేయలేదు. ఇంకా, పన్ను అధికారులకు జీఎస్టీ చెల్లించినట్లు ఋజువును గుత్తేదారు సంస్థ ఏపీజెన్కోకు సమర్పించిందని శాఖ తెలిపింది. అయితే, దానిని ఆడిట్ కు సమర్పించలేదు.

జీఎస్టీ చట్టంలోని సెక్షన్ 54కు వివరణ 2(డి) ప్రకారం, అప్పిలేట్ అథారిటీ తీర్పు/డిక్రీ/ఆర్డర్/ఆదేశాల తేదీ నుండి రెండు సంవత్సరాలలోపు పన్ను రిఫండ్ చేయబడుతుందని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 జూలై). ఈ అంశం ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ ముందు ఉన్నందున, జీఎస్టీతో పాటు అడ్వాన్స్ మొత్తాన్ని తిరిగి చెల్లించడానికి గుత్తేదారు సంస్థ చట్టబద్ధంగా బాధ్యత వహిస్తుంది.

ఏపీజెన్కో చెల్లించిన జీఎస్టీ వాపసు పొందడం కోసం సీజీఎస్టీ అధికారులను సంప్రదించిందని ముగింపు సమావేశంలో ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్). అయితే ఆర్బిట్రేషన్ కారణంగా వాపసు కాలేదు. ఆర్బిట్రేషన్ పూర్తయిన తరువాత, రెండు సంవత్సరాల నిర్దిష్ట వ్యవధిలో వాపసు క్లెయిమ్ సమర్పించబడుతుంది అని కూడా పేర్కొంది.

### 3.2.2 రెండవ గుత్తేదారు సంస్థ ద్వారా పనుల అమలు

రెండవ గుత్తేదారు సంస్థ[147] సివిల్, ఇ&ఎం పనులలో మిగిలిన పనుల సంయుక్త టెండర్ కోసం ₹4,359.12 కోట్లు (₹4,987.55 కోట్ల కాంట్రాక్టు విలువ కంటే 12.60 *శాతం* తక్కువ) కోట్ చేసింది. ఇ&ఎం పనుల విలువ ₹2,810.88 కోట్లు.

#### 3.2.2.1 వడ్డీ లేని అడ్వాన్స్ మంజూరు

కాంట్రాక్ట్ యొక్క సాధారణ షరతులలోని నిబంధన 4.1 ప్రకారం, గుత్తేదారు వస్తువులను సరఫరా చేయాలి మరియు/లేదా పనికి సంబంధించి అవసరమైన అన్ని పనులు, సేవలను నిర్వహించాలి లేదా నిర్వహించేలా చేయాలి. ఒప్పందంలోని పై నిబంధనను సవరణ నెం.2 క్రింద ఏపీజెన్కో సవరించింది (2021 నవంబర్), దీని ప్రకారం సైట్‌కు తీసుకుని వచ్చిన సామాగ్రిపై గుత్తేదారుకు అడ్వాన్స్ చెల్లించడాన్ని సులభతరం చేస్తుంది.

గుత్తేదారు సంస్థకు ఉక్కు (స్ట్రక్చరల్, రీఇన్‌ఫోర్స్డ్) కొనుగోలు కోసం ముందస్తుగా ₹30.86 కోట్లు చెల్లించినట్లు (2021 డిసెంబర్ నుండి 2022 అక్టోబర్ వరకు)ఆడిట్ గమనించింది. గుత్తేదారు సంస్థ 12 శాతం వడ్డీని చెల్లించవలసిన ఎటువంటి మొబిలైజేషన్ అడ్వాన్స్ తీసుకోలేదు. అయితే, ఏపీజెన్కో మెటీరియల్ అడ్వాన్స్ రూపంలో వడ్డీ లేని అడ్వాన్స్ ఇవ్వడం వల్ల గుత్తేదారు సంస్థకు అనుచిత ప్రయోజనం కలిగింది. టెండర్ తర్వాత ఒప్పంద నిబంధనలను సవరించడం ద్వారా పైన పేర్కొన్న ముందస్తు చెల్లింపు కారణంగా ఏపీజెన్కో గుత్తేదారు సంస్థకు అనుకూలంగా వ్యవహరించడమే కాకుండా ***అనుబంధం 3.5*** లో చూపిన విధంగా వడ్డీ రూపంలో ₹1.10 కోట్లు (2021 డిసెంబర్ నుండి 2022 నవంబర్ వరకు) నష్టపోయింది.

కాంట్రాక్ట్ నిబంధనల ప్రకారం, బిల్లుల చెల్లింపు కోసం గుత్తేదారు సంస్థ ధరల విభజన షెడ్యూల్‌ను సమర్పించాల్సి ఉంటుందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). రీన్‌ఫోర్స్‌మెంట్ స్టీల్ కోసం గుత్తేదారు సంస్థ సమర్పించిన ధరల విభజన షెడ్యూల్‌ను రెండు భాగాలుగా విభజించారు, అనగా 'మెటీరియల్ ఖర్చుతో సహా

---

145 మెస్సర్స్ నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్

146 2018 జనవరి: ₹57.97 కోట్లు, 2018 మార్చి: ₹34.78 కోట్లు, 2018 జూన్/ఆగస్టు: ₹22.19 కోట్లు

147 మెస్సర్స్ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్

పూర్తయిన వాటికి బదులుగా ఉక్కు సరఫరా, కటింగ్/వంచడం/ ఉపయోగించడం మొదలైనవి, దీనిని బోర్డు ఆమోదించింది. అందువలన, సైట్ వద్ద సామాగ్రి అందిన తర్వాత గుత్తేదారు సంస్థకు చెల్లింపు జరిగింది.

ముగింపు సమావేశం సమయంలో, పని జరిగే ప్రదేశం వద్ద సామాను అందిన తర్వాత చెల్లింపులు జరిగాయని, ఇది ఒప్పంద నిబంధనల ప్రకారం మాత్రమే జరిగిందని, అందువల్ల ఇది వడ్డీ లేని అడ్వాన్స్ కాదని ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్). ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత ఒప్పంద నిబంధనలలో చేసిన మార్పులకు సంబంధించి (నిర్దేశిత నియమాలకు విరుద్ధంగా), నిధుల సమీకరణ కోసం గుత్తేదారు సంస్థ అభ్యర్థన మేరకు నిబంధనలు చేర్చబడ్డాయని ప్రభుత్వం సమాధానమిచ్చింది.

సమాధానం ఆమోదయోగ్యం కాదు, ఎందుకంటే పూర్తయిన పని అంశాలకు చెల్లింపు చేయాలి, పని జరిగే ప్రదేశానికి తీసుకువచ్చిన మెటీరియల్‌కు కాదు, ఇది మొబిలైజేషన్ అడ్వాన్స్ తో సమానం. గుత్తేదారు సంస్థ పని అంశాలను తగినట్లుగా విభజించి సమర్పించిన ధరల విభజన షెడ్యూల్ (2021 నవంబర్)ను ఏపీజెన్కో ఆమోదించడం సక్రమంగా లేదు. దీని ఫలితంగా గుత్తేదారు సంస్థకు వడ్డీలేని అడ్వాన్స్ రూపంలో అనుచిత లబ్ధి చేకూరింది.

### 3.2.3 ఎలక్ట్రో-మెకానికల్ భాగాల ముందస్తు కొనుగోలు

గుత్తేదారు సంస్థతో[148] ₹2,810.88 కోట్ల కాంట్రాక్ట్ ధరకు కుదుర్చుకున్న ఒప్పంద షరతు నెం.11.1.1(సి) ప్రకారం, ఈ&ఎం మెటీరియల్/ పరికరాల సరఫరా షెడ్యూల్‌ను ఆమోదించిన షెడ్యూల్ ప్రకారం నిర్మాణం కోసం అవసరమైన నాటికి ఆరు నెలల ముందు సైట్‌కు డెలివరీ చేయబడే విధంగా ప్రణాళిక చేయాలి. ఏదైనా మెటీరియల్/పరికరాలు చాలా ముందుగానే సరఫరా చేయబడితే, (అనగా షెడ్యూల్ ప్రకారం దాని అవసరానికి ఆరు నెలల కంటే ముందు) అటువంటి మెటీరియల్/పరికరాల బిల్లుల ప్రక్రియను కొనుగోలుదారు, షెడ్యూల్ ప్రకారం దాని అవసరానికి ఆరు నెలల ముందు మాత్రమే ప్రారంభించాలి.




ఛాయా చిత్రం 3.8: నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రో-మెకానికల్ భాగాలు

₹4,956.39 కోట్ల విలువైన పోలవరం జల విద్యుత్ ప్రాజెక్టు అమలు కోసం ఏపీజెన్కో, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి ఏడాదికి 11 శాతం వడ్డీ రేటుతో ₹3,965.11 కోట్ల టర్మ్ లోన్ పొందింది.

ఆమోదించబడిన పీహెచ్ఈపీ లెవల్ 2 షెడ్యూల్ ప్రకారం (సేకరించాల్సిన వస్తువులు, దశల వారీగా స్థాపనను చూపిస్తుంది), సరఫరాదారుకు చెల్లింపులు చేయడం ద్వారా ఇ&ఎం మెటీరియల్/పరికరాలను కొనుగోలు చేసి నిర్మాణం కోసం సైట్‌కు జారీ చేస్తారు.




ఛాయా చిత్రం 3.9: సైట్ వద్ద నిరుపయోగంగా పడి ఉన్న ఎలక్ట్రో-మెకానికల్ భాగాలు

₹41.26 కోట్ల విలువైన ఈ&ఎం మెటీరియల్/ వస్తువులు/భాగాలను అవసరానికి ఆరు నెలల కంటే ముందే (2022 జూన్ నుండి 2023 జూన్ వరకు)

---

148 మెస్సర్స్ మేఘా ఇంజనీరింగ్ & ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్

సేకరించారని, ఆరు నెలలకు పైగా, అంటే 28 నుండి 428 రోజుల వరకు ఇన్‌స్టాలేషన్ లేకుండా నిరుపయోగంగా పడి ఉన్నాయని ఆడిట్ గమనించింది.

అందువల్ల, ఇతర భాగాలను పూర్తి చేయడానికి అవసరమైన సమయాన్ని అంచనా వేయకుండా వస్తువుల కొనుగోలుకు ప్రణాళిక చేయడం వల్ల ఏపీజెన్కోకు నిధులు నిలిచిపోవడం, ఈ&ఎం భాగాలను నిరుపయోగంగా ఉంచడానికి దారితీసింది. అంతే కాకుండా, సైట్‌కు తీసుకువచ్చిన సామగ్రికి వడ్డీ (2024 ఫిబ్రవరి నాటికి) రూపంలో ₹1.90 కోట్ల అదనపు ఆర్థిక భారానికి (***అనుబంధం 3.6*** లో వివరించిన విధంగా) దారితీసింది.

కాంట్రాక్ట్ ఒప్పందంలోని నిబంధన 8.1, 8.2 ప్రకారం, 1, 2, 3 యూనిట్లను ప్రారంభించడానికి ప్రస్తుతం ఆమోదించిన షెడ్యూల్ 2024 జూలై 31 అని, ఆ తర్వాత ప్రతి యూనిట్‌కు రెండు నెలలు అని, అందువల్ల యూనిట్ 12కు అది 2026 జనవరి 31 అని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). ఒప్పందంలోని నిబంధన 8.4.1 ప్రకారం, యూనిట్ల ప్రారంభానికి అయిన ప్రతి వారం ఆలస్యానికి 0.5 శాతం చొప్పున లిక్విడేటెడ్ డ్యామేజీలు (ఎల్‌డీలు) వర్తిస్తాయని, ఇది పన్నులతో సహా కాంట్రాక్టు విలువలో గరిష్టంగా 10 *శాతం* వరకు ఉంటుందని సమాధానం ఇచ్చింది.




**ఛాయా చిత్రం 3.10: సైట్ వద్ద నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రో-మెకానికల్ సామాగ్రి**

ముగింపు సమావేశం సందర్భంగా, ప్రభుత్వం ఈ పరిశీలనను అంగీకరించి, జలవిద్యుత్ ప్రాజెక్టు డిజైన్లు మార్చబడ్డాయని సమాధానం ఇచ్చింది (2024 నవంబర్). అందువలన భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ కొన్ని పరికరాల/ సామగ్రిని ముందుగానే సరఫరా చేసిందని, టర్బైన్లు ఇంకా సరఫరా చేయాల్సి ఉందని అన్నారు.

సామగ్రిని సేకరించడానికి షెడ్యూల్‌ను, ఎటువంటి పరికరాలూ నిరుపయోగంగా ఉండని విధంగా రూపొందించుకోవాల్సి ఉన్నందున సమాధానం ఆమోదయోగ్యం కాదు. అంతేగాక, వాటిని వాస్తవంగా వినియోగించకోకుండానే కాంట్రాక్టు ఏజెన్సీకి చెల్లింపులు జరిగాయి. దీని ఫలితంగా ఏజెన్సీకి చెల్లించిన మొత్తంపై వడ్డీ రూపంలో ₹1.90 కోట్లు నష్టం వాటిల్లింది.

***సిఫార్సు 3.4: పీహెచ్‌ఈపీ నిర్మాణానికి వడ్డీతో కూడిన ఋణం ద్వారా నిధులు సమకూరుస్తున్నందున, పని అమలుకు అనుగుణంగా, వాస్తవ అవసరానికి అనుగుణంగా ఎలక్ట్రో మెకానికల్ మెటీరియల్‌ను కొనుగోలు చేయాలి.***

# కాలువల నిర్మాణం

పేజీలు 61 – 75


SP @ Km 52.050

# 4వ అధ్యాయం

# కాలువల నిర్మాణం

పనిని అప్పగించిన తర్వాత కుడి ప్రధాన కాలువ అలైన్‌మెంట్‌లో మార్పు కారణంగా అప్పటికే పూర్తచేసిన పనికి వృధా ఖర్చు అయ్యింది. అంతర్గత ప్రామాణిక అంచనాలలో మట్టి తవ్వకం పని కోసం యూనిట్ రేటును పెంచడం వలన అదనపు ఆర్థిక భారం ఏర్పడింది.

పరిమాణాలు/వ్యయం పెరగడం, ఎడమ ప్రధాన కాలువ పనుల అమలులో జాప్యం ఫలితంగా సవరించిన పరిమాణాలను భారత ప్రభుత్వ వ్యయ సవరణ కమిటీ ఆమోదించలేదు, అందుచే అంశాల వారీగా పరిమితి విధించబడింది. గుత్తేదారు సంస్థల ద్వారా పనుల్లో పురోగతి మందకొడిగా సాగడంతో నాలుగు ప్యాకేజీ పనులను శాఖ ముందుగానే ఆపివేసింది.

పనిచేపట్టడానికి అవసరమైన భూమిని ఆలస్యంగా సేకరించినందున ఎడమ ప్రధాన కాలువలో అండర్ టన్నెల్ నిర్మాణం చేపట్టలేకపోయారు. పనులను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు లేదా గుత్తేదారు సంస్థలకు అప్పగించడానికి నిర్ణయం తీసుకోవడంలో శాఖ చేసిన జాప్యం అదనపు ఆర్థిక భారానికి దారితీసింది. ప్రాజెక్టు ప్రాథమిక పారామితులలో మార్పు లేకుండా ఎడమ ప్రధాన కాలువలో పెరిగిన కట్టడాల సంఖ్యకు ప్రభుత్వం అదనపు అనుమతిని మంజూరు చేసింది.

రెండు కాలువల పంపిణీ వ్యవస్థల కోసం వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలను ఇంకా ఖరారు చేయనందున రెండవ సవరించిన వ్యయ అంచనాను కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదు. ప్రస్తుత నిబంధనల ప్రకారం అదనపు ఖర్చుతో మిగిలిన పనిని పూర్తి చేయడానికి మొదటి కాంట్రాక్ట్ ఏజెన్సీ నుండి అదనపు ఖర్చును వసూలు చేయని సందర్భాలు ఉన్నాయి. నిర్దేశిత రిజిస్టర్/ఫారమ్‌లో సరైన లెక్కలు లేకుండా పని ప్రదేశంలో భారీ మొత్తంలో తవ్వితీసినమట్టి పడి ఉంది, దానిని దొంగిలించిన సందర్భాలు ఉన్నాయి. తవ్వితీసిన మట్టిని నిల్వ చేయడానికి ప్రత్యేకంగా కేటాయించిన భూములను జల వనరుల శాఖ అనుమతి లేకుండా తిరిగి తీసుకోవాలన్న రెవెన్యూ అధికారుల ఏకపక్ష నిర్ణయం, దానిని నిల్వ చేసే ప్రక్రియను ప్రభావితం చేస్తుంది. దీని వలన పర్యావరణ సమస్యలు తలెత్తవచ్చు, జాతీయ హరిత ట్రిబ్యునల్ జరిమానాలను విధించవచ్చు.

## 4.1 పరిచయం

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు సివిల్ పనులలో రెండు ప్రధాన కాలువలైన, ఎడమ ప్రధాన కాలువ, కుడి ప్రధాన కాలువల నిర్మాణాలు ఉన్నాయి, ఇవి ఆనకట్టకు ఇరువైపులా ఉన్న అనుసంధానాల నుండి మొదలౌతాయి. గోదావరి నదీ జలాల పంపిణీ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం, నిర్దేశిత జిల్లాల సాగు, తాగునీరు, పారిశ్రామిక నీటి అవసరాలను తీర్చడానికి, కుడి ప్రధాన కాలువ ద్వారా 80 శతకోటి ఘనపుటడుగుల (టీఎంసీ) నీటిని కృష్ణా నదిలోకి మళ్లించడానికి కాలువ వ్యవస్థలను రూపొందించారు. ఎడమ, కుడి ప్రధాన కాలువలలో మట్టి తవ్వకం, లైనింగ్, నిర్మాణాల పనులు ఉన్నాయి.

కుడి ప్రధాన కాలువ స్టిల్లింగ్ బేసిన్‌లోని హెడ్ రెగ్యులేటర్ నుండి బయలుదేరి 178.81 కి.మీ. పొడవునా ఐదు[149] ప్రధాన వాగులను దాటి విజయవాడ నగరానికి సమీపంలోని బుడమేరు వరద మళ్ళింపు కాలువలోకి ప్రవేశించి ప్రకాశం బ్యారేజీకి ఎనిమిది కిలోమీటర్ల ఎగువన కృష్ణా నదిలో కలుస్తుంది. లైన్ డ్ కాలువ అయిన కుడి ప్రధాన కాలువ పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల్లోని 1.29 లక్షల హెక్టార్ల (3.20 లక్షల ఎకరాలు) ఆయకట్టుకు సాగునీరు అందించేలా రూపొందించారు.

ఎడమ ప్రధాన కాలువ నేలకోట అనుబంధ జలాశయం నుంచి బయలుదేరి ఆరు[150] ప్రధాన వాగుల గుండా 211.27 కిలోమీటర్ల పొడవున ప్రవహిస్తుంది. లైన్ డ్ కాలువ అయిన ఎడమ ప్రధాన కాలువ, పూర్వపు తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో 1.62 లక్షల హెక్టార్ల (నాలుగు లక్షల ఎకరాలు) ఆయకట్టుకు సాగునీరు అందించడంతోపాటు విశాఖపట్నం నగరంలోనూ, చుట్టుపక్కల పారిశ్రామిక, తాగునీటి అవసరాలకు 23.44 టీఎంసీల నీటిని సరఫరా చేసే విధంగా రూపొందించారు.

2023 మార్చి నాటికి, ఎడమ, కుడి ప్రధాన కాలువ పనులలో భౌతిక, ఆర్థిక పురోగతి వరుసగా ***పటం 4.1 & 4.2*** లో చూపిన విధంగా ఉన్నాయి.

**పటం–4.1: ఎడమ ప్రధాన కాలువ – పురోగతి**




**పటం–4.2: కుడి ప్రధాన కాలువ – పురోగతి**




*మూలం: శాఖ అందించిన సమాచారం ప్రకారం*

## 4.2 కుడి ప్రధాన కాలువ నిర్మాణం

వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక తయారుచేసే సమయంలోనే మొత్తం 178.81 కిలోమీటర్ల పొడవునా కుడి ప్రధాన కాలువ అలైన్‌మెంట్ కోసం పరిశీలన జరిగింది. ఈ కాలువ అనేక లోయలను దాటుతున్నందున, లోయలను దాటడానికి వీలుగా, స్థల పరిస్థితులను బట్టి అండర్ టన్నెల్స్, సూపర్ పాసేజీలు, అక్విడక్ట్‌లు మొదలైన వివిధ రకాల క్రాస్ డ్రైనేజీ పనులను ప్రతిపాదించారు. ఈ నిర్మాణాలకు సవివరమైన ఆకృతులు, ఖర్చు వివరాలను తయారు చేశారు (2004), అన్ని చిన్న కట్టడాల ఖర్చును నిర్ణయించారు, వీటిని చీఫ్ ఇంజనీర్ (సీఈ), సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ఆమోదించారు.



**ఛాయా చిత్రం 4.1: 50 కిలో మీటర్ల వద్ద కుడి ప్రధాన కాలువ**

[149] కొవ్వాడకాలవ, యర్రకాలవ, గుండేరు, తమ్మిలేరు, రామిలేరు

[150] శారద, మామిడివాక గెడ్డ, వరాహ, తాండవ, యేర్ర, బురదకాలువ

కుడి ప్రధాన కాలువ పనులను 24 నెలల్లో అంటే 2007 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో 2005లో ప్రారంభించారు. కుడి ప్రధాన కాలువ పరిధిలోని పనులను ఏడు ప్యాకేజీలుగా విభజించి మొత్తం ₹1,736.06 కోట్ల ఒప్పందపు విలువతో ఈపీసీ కాంట్రాక్టు విధానం క్రింద వివిధ గుత్తేదారు సంస్థలకు అప్పగించారు (అక్టోబర్ 2004). మొత్తం ఏడు ప్యాకేజీల పనులు (12.95 కి.మీ. కాలువ లైనింగ్, 41 నిర్మాణాలు మినహా) 2016 నాటికి ₹1,730.68 కోట్ల వ్యయంతో (***అనుబంధం 4.1*** లో వివరించిన విధంగా) పూర్తిచేసారు.

### 4.2.1 కుడి ప్రధాన కాలువ పనుల అమలు

కుడి ప్రధాన కాలువ పనులలో మట్టి తవ్వకం, లైనింగ్, కట్టడాల నిర్మాణం ప్రధానమైనవి. కాలువ మొత్తం పొడవుకు (₹646.20 కోట్ల వ్యయంతో) మట్టి తవ్వకం పూర్తయింది. అయితే, కాలువ లైనింగ్ కోసం ₹666.57 కోట్లు ఖర్చు చేసినప్పటికీ, 12.95 కిలోమీటర్ల (176.20[151] – 163.25 కిలోమీటర్లు) పొడవున లైనింగ్ ఇంకా పూర్తి కాలేదు. ప్రతిపాదించిన 255 కట్టడాలలో, 214 కట్టడాలు (₹591.92 కోట్లు) పూర్తికాగా, మిగిలిన 41 కట్టడాలు 2024 మార్చి నాటికి పూర్తి కావాల్సి ఉంది.

#### 4.2.1.1 పనులు అప్పగించిన తర్వాత కాలువ అలైన్మెంట్‌లో మార్పు

పైన పేర్కొన్న పనులలో, మొదట్లో అనుకున్న అలైన్మెంట్ ప్రకారం, కుడి ప్రధాన కాలువ 171.000 నుండి 172.566 కిలో మీటర్ల వరకు 850 ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించే బాలేరావ్ చెరువు భాగం గుండా వెళుతుంది. పనిని ముందస్తుగా ముగించటానికి ముందు, మొదటి గుత్తేదారు సంస్థ 171.000 నుండి 172.566 కిలో మీటర్ల వరకు (***అనుబంధం 4.2*** లో వివరించిన విధంగా) మట్టి తవ్వకాన్ని పూర్తి చేయగా, ₹4.32 కోట్ల (₹180.70 కోట్ల ఒప్పంద విలువలో 2.39 శాతం) చెల్లింపు కూడా జరిగింది.

కాలువ పనులు చేపట్టే సమయంలో, అనుకున్న అలైన్మెంట్ తో కాలువ యొక్క నీటిని తీసుకెళ్ళే సామర్థ్యం తగ్గుతుందని శాఖ గమనించింది. ఈ సమస్యను అధిగమించడానికి, సాంకేతిక నిపుణుల కమిటీ స్థలాన్ని సందర్శించి (2015 సెప్టెంబర్), భూసేకరణ లేకుండా, కాలువ అలైన్మెంట్ ను 170.817 కిలో మీటర్ అవతల చెరువు ముందరి ఒడ్డు ప్రాంతానికి మళ్లించాలని సూచించింది (2016 ఫిబ్రవరి). అందుకని ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్, ఆకృతులు, డ్రాయింగ్‌లు, హైడ్రాలిక్ వివరాల ప్రతిపాదనకు సీఈ, సీడీవో హైదరాబాద్ ఆమోదం తెలపడంతో, చెరువును రెగ్యులేటర్‌లతో పక్కకు మళ్లిస్తూ (ప్రవాహాన్ని మళ్లిస్తూ) బాలెరావ్ చెరువును ఆన్‌లైన్ రిజర్వాయర్‌గా మార్చారు.

మొదటి గుత్తేదారు సంస్థ పనులు నిలిపివేయడంతో మిగిలిన పనిని కొత్త గుత్తేదారు సంస్థకు[152] అప్పగించారు. పనిని[153] చేపట్టేందుకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో (2017 జనవరి) ₹15.48 కోట్లకు నామినేషన్ ప్రాతిపదికన గుత్తేదారు సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని (2017 మార్చి), పని పూర్తి చేసారు.

సరైన ప్రణాళిక లేకపోవడంతో బాలేరావ్ చెరువు గుండా కాలువ పనులు పూర్తయిన తర్వాత, అలైన్‌మెంట్‌లో మార్పు అనివార్యమైందని ఆడిట్ గమనించింది. ఫలితంగా కాలువ అలైన్‌మెంట్ మళ్ళీ మార్చడం, తద్వారా మొదటి ఏజెన్సీ ద్వారా ఇప్పటికే 171.000 నుండి 172.566 కిలో మీటర్ల వరకు చేసిన మట్టి తవ్వకానికి ₹4.32 కోట్ల నివారించదగిన ఖర్చు జరిగింది.

బాలేరావు చెరువు క్రింద ఉన్న ఆయకట్టుదారుల ప్రయోజనాలను కాపాడేందుకు సాంకేతిక నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు కొత్త అలైన్మెంట్ తో బాలేరావు చెరువు క్రిందనుండి కాలువను మళ్లించినట్లు ప్రభుత్వం జవాబిచ్చింది (2024 జూన్).

---

[151] కాలువ పొడవు 178.81 కి.మీ. అయినప్పటికీ, లైనింగ్ 176.20 కి.మీ. మాత్రమే చేపట్టబడింది

[152] మెస్సర్స్ బీఎస్ సీపీఎల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్

[153] 156.500 కి.మీ. నుండి 174.000 కి.మీ. వరకు మట్టి తవ్వకం, కట్ట, సీఎమ్&సీడీ నిర్మాణ పనులు, అలైన్ మెంట్ మార్పుతో సహా బలేరావు చెరువు ఎగువన 170.817 కి.మీ. నుండి 172.975 కి.మీ. వరకు తవ్వకం, కట్ట లైనింగ్, సీఎమ్&సీడీ పనులు

ముగింపు సమావేశంలో ప్రభుత్వం అసలు అలైన్మెంట్ చెరువు దిగువన ఉందని, చెరువు ప్రాంతంలో భారీ నిర్మాణాన్ని నిర్మించాల్సి వస్తుందని పేర్కొంది (2024 నవంబర్), దీనికి గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేసి బాలేరావు చెరువు క్రింద ఉన్న ఆయకట్టుకు దూరంగా తీసుకునివెళ్ళాలని పట్టుబట్టారు. దీనిని టెక్నికల్ కమిటీకి నివేదించగా అలైన్మెంట్ మార్పుకు సిఫారసు చేసింది.

దీంతో పనులు పూర్తయిన తర్వాత అలైన్మెంట్ లో మార్పులు చోటుచేసుకోవడంతో ₹4.32 కోట్లు వృథా అయినట్లు స్పష్టమవుతోంది.

### 4.2.1.2 యూనిట్ రేటును తప్పుగా తీసుకోవడం

ప్యాకేజీ-6 పనుల[154]ను 2006 నాటికి పూర్తి చేయాలనే షరతుతో ₹196.74 కోట్ల (ఈసీవీ: ₹206.77 కోట్లు) ఒప్పంద ధరకు (2004) గుత్తేదారు సంస్థ[155]కి అప్పగించారు.

అక్టోబర్ 2004లో ఆమోదించబడిన సవరించిన సాంకేతిక అనుమతి యొక్క సంక్షిప్త అంచనా (అంతర్గత ప్రామాణిక అంచనాల) ప్రకారం ₹55.46 కోట్ల వ్యయంతో చేయాల్సిన మొత్తం మట్టి పని పరిమాణం 98,78,844 ఘనపు మీటర్లు. ఇందులో, యంత్రాల ద్వారా 3,57,485 ఘనపు మీటర్ల గట్టి కంకర మట్టి ఎస్ఎస్ 20బి తవ్వకానికి వ్యయం (ఘనపు మీటర్‌కు యూనిట్ రేటు ₹16.70) ₹0.60 కోట్లు[156].

అయితే, గుత్తేదారు సంస్థకు పని అప్పగించిన సమయంలో (అక్టోబర్ 2004), ఐబీఎంలో గట్టి కంకర మట్టికి కోసం ₹0.60 కోట్లకు బదులుగా ₹5.96 కోట్లు గా తీసుకున్నారు. ఫలితంగా మట్టి పని కోసం అంచనా ₹5.36 కోట్లు (₹5.96 కోట్లు - ₹0.60 కోట్లు) పెరిగింది. ఫలితంగా, మొత్తం మట్టి పని తవ్వకానికి యూనిట్ రేటు ***పట్టిక 4.1*** లో వివరించిన విధంగా ఘనపు మీటరుకు ₹49.35 బదులుగా ₹54.69గా తీసుకోబడింది, తద్వారా అంచనా పెరిగింది.

**పట్టిక 4.1: యూనిట్ రేటు లెక్కింపు**

| మొత్తం మట్టి పని (ఘనపు మీటర్లలో) | మట్టి పని (ఈడబ్ల్యు) కోసం పరిగణనలోకి తీసుకున్న మొత్తం (₹ కోట్లలో) | గట్టి కంకర మట్టికి కోసం పరిగణనలోకి తీసుకున్న మొత్తం (₹కోట్లలో) | పరిగణనలోకి తీసుకోవలసిన మొత్తం (₹ కోట్లలో) |
|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) = (2)-(3) |
| 98,78,844 | 55.46 | 5.36 | 50.10 |
| కాలువ పనుల సర్వే, పరిశోధనలకు అనులోమానుపాత మొత్తం {₹1.40 కోట్లు X ₹50.10 కోట్లు/ ₹ 206.77 కోట్లు} | | | 0.34 |
| ఇతర పనులకు అనులోమానుపాత మొత్తం {₹3.35 కోట్లు X ₹50.10 కోట్లు/₹ 206.77 కోట్లు} | | | 0.81 |
| అంచనా రేట్ల వద్ద మొత్తం మట్టి పని వ్యయం | | | 51.25 |
| అంచనా రేటు ప్రకారం యూనిట్ రేటు (₹51.25 కోట్లు/ 98,78,844 ఘనపు మీటర్లు) | | | 51.87 |
| 4.85 శాతం టెండర్ రాయితీ | | | 2.52 |
| ప్రతి ఘనపు మీటర్‌కు తీసుకోవలసిన యూనిట్ రేటు (తీసుకోవలసిన యూనిట్ రేటు - టెండర్ డిస్కౌంట్) | | | **49.35** |

*మూలం: శాఖ అందించిన సమాచారం ఆధారంగా ఆడిట్ లెక్కించింది.*

[154] సీఎం & సీడీ పనుల నిర్మాణం, ప్రధాన కాలువ లైనింగ్‌తో సహా, పోలవరం ప్రాజెక్టు 133.800 నుండి 156.500 కిలో మీటర్ల వరకు కుడి ప్రధాన కాలువ పనుల పరిశోధన, రూపకల్పన, హైడ్రాలిక్ వివరాల తయారీ, అంచనాలు, అమలు

[155] మెస్సర్స్ ప్రోగ్రెసివ్ కన్స్ట్రక్షన్స్ లిమిటెడ్, హైదరాబాద్

[156] ఘనపు మీటరుకు ₹16.70 చొప్పున 3,57,485 ఘనపు మీటర్లకు

అంతర్గత ప్రామాణికాల అంచనాలో (ఐబీఎమ్‌లో) మట్టి తవ్వకం కోసం యూనిట్ రేటును పెంచడం వలన తరువాత కుదుర్చుకున్న అనుబంధ ఒప్పందాలలో, ***పట్టిక 4.2*** లో వివరించిన విధంగా, ₹2.62 కోట్ల మేర అదనపు ఆర్థిక భారం పడింది.

**పట్టిక 4.2: యూనిట్ రేటును తప్పుగా తీసుకోవడం వలన పడిన అదనపు ఆర్థిక భారం**

| అనుబంధ ఒప్పంద సంఖ్య | మట్టి పని పరిమాణం (ఘనపు మీటర్లలో) | తీసుకున్న రేటు (ప్రతి ఘనపు మీటర్‌కు ₹ లో) | తీసుకోవలసిన రేటు (ప్రతి ఘనపు మీటర్‌కు ₹ లో) | అధికంగాతీసుకున్న రేటు (ప్రతి ఘనపు మీటర్‌కు ₹ లో) |
|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) = (3)-(4) |
| 5ఎస్ఇ/ 2015-16 తేదీ 24.06.2015 | 9,69,183.37 | | | |
| 19 ఎస్ఇ / 2015-16 తేదీ 29.09.2015 | 39,39,921.44 | 54.69 | 49.35 | 5.34 |
| మొత్తం మట్టి పని పరిమాణం | **49,09,104.81** | | | |
| అనవసర ఆర్థిక భారం= ఘనపు మీటర్‌కు ₹ 5.34 చొప్పున 49,09,104.81 ఘనపు మీటర్ల కు | | | | **2,62,14,620** |

*మూలం: శాఖ అందించిన సమాచారం ఆధారంగా ఆడిట్ లెక్కించింది.*

అందువల్ల ఐబీఎంలో సరైన యూనిట్ రేటును తీసుకోపోవడంవలన ఇప్పటి వరకు చేపట్టిన 49,09,104.81 ఘనపు మీటర్లు మట్టి పనిలో ఖజానాపై ₹2.62 కోట్ల అదనపు ఆర్థిక భారం పడింది. టైపింగులో తప్పిదం కారణంగా ఐబీఎంలో ₹0.60 కోట్లకు బదులు ₹5.96 కోట్లుగా తీసుకున్నారని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 నవంబర్). అందువల్ల, ఐబీఎం లో చేర్చిన పరిమాణాలు, మొత్తాల ఆధారంగా యూనిట్ రేట్లు ఖరారు చేయబడ్డాయి. ఏజెన్సీకి చెల్లించాల్సిన తుది బిల్లులో అధిక చెల్లింపును వసూలుచేస్తామన్నారు.

***సిఫారసు 4.1: ప్రాజెక్టు అమలులో మార్పులను తగ్గించడానికి ప్రభుత్వం పటిష్ఠమైన రూపకల్పన ప్రణాళికను నిర్ధారించాలి, అనవసరమైన చెల్లింపులను నివారించడానికి అంచనాలను జాగ్రత్తగా తయారు చేయాలి.***

## 4.3 ఎడమ ప్రధాన కాలువ నిర్మాణం

ఎడమ ప్రధాన కాలువ పనులను ఎనిమిది ప్యాకేజీలుగా విభజించి 2005వ సంవత్సరంలో ప్రారంభించారు, వీటిని 24 నెలల్లో, అంటే 2007 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పనులను మొత్తం ₹2,233.34 కోట్ల ఒప్పందపు విలువతో ఈపీసీ కాంట్రాక్టు పద్దతి క్రింద వివిధ గుత్తేదారు సంస్థలకు (2005 మార్చి, 2019 ఫిబ్రవరి మధ్య) అప్పగించారు. ₹2,076.10 కోట్లు (***అనుబంధం 4.3*** లో వివరించిన విధంగా) ఖర్చు చేసినప్పటికీ, 17 సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా, 2023 మార్చి నాటికి అన్ని ప్యాకేజీ పనులు (ప్యాకేజీ 2 తప్ప) అసంపూర్ణంగా ఉన్నాయి. భూసేకరణలో జాప్యం, హైవే క్రాసింగుల పనుల అప్పగింతలో జాప్యం, ఆకృతుల ఆమోదంలో జాప్యం, పనులు మందకొడిగా సాగడం వల్ల తరచూ కాంట్రాక్టు ఏజెన్సీలను మార్చడం, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ)లో గుత్తేదారు సంస్థలు దాఖలు చేసిన దివాలా పిటిషన్ల వంటి వివిధ కారణాల వల్ల ఎడమ ప్రధాన కాలువ పనుల అమలులో జాప్యం జరిగింది.

మొత్తం 211.27 కి.మీ. పొడవున్న ఎడమ ప్రధాన కాలువలో, ₹506.57 కోట్ల వ్యయంతో 172.15 కిలోమీటర్లు పొడవున మాత్రమే మట్టి తవ్వకం[157] పూర్తవగా, 39.12 కిలోమీటర్లు మిగిలి ఉంది. ప్రతిపాదించిన 209.99 కిలోమీటర్ల లైనింగ్ లో[158] ₹414.77 కోట్ల వ్యయంతో కేవలం 131.98 కిలోమీటర్ల మేర మాత్రమే పూర్తయింది,

157 ప్రతిపాదిత 1,095.49 లక్షల క్యూ.మీ.లో, 1,006.23 లక్షల క్యూ.మీ. పూర్తయి, 89.26 లక్షల క్యూ.మీ. మిగిలి ఉంది

158 ప్రతిపాదిత 15.07 లక్షల క్యూ.మీ.లో, 10.84 లక్షల క్యూ.మీ. పూర్తయి, 4.23 లక్షల క్యూ.మీ. మిగిలి ఉంది

ఇంకా 78.01 కిలోమీటర్ల మేర మిగిలి ఉంది. ప్రతిపాదించిన 451 కట్టడాలలో ₹761.82 కోట్ల వ్యయంతో 181 కట్టడాలు మాత్రమే పూర్తయ్యాయి, ఇంకా 270 కట్టడాలు మిగిలి ఉన్నాయి. ప్రధాన గుత్తేదారుల పరిధి నుండి తొలగించబడిన ఎడమ ప్రధాన కాలువ (ప్యాకేజీలు 1, 3, 5, 5ఎ & 6ఎ) కు సంబంధించిన మిగిలిన పనులను ఇంకా అప్పగించలేదు, చేపట్టలేదు.

### 4.3.1 ఎడమ ప్రధాన కాలువ నిర్మాణానికి ప్రణాళిక

వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక తయారీ సమయంలో, ఎడమ ప్రధాన కాలువ అలైన్‌మెంట్ కోసం 181.50 కిలోమీటర్ల పొడవున పరిశీలన చేపట్టారు, శాఖ తయారుచేసిన హైడ్రాలిక్ వివరాల (హెచ్‌పి) ప్రకారం బేస్ లైన్‌లో ప్రతి 0.20 కిలోమీటర్లకు క్రాస్ సెక్షన్లు తీసుకుని టోపో షీట్‌లపై కాలువ అలైన్‌మెంట్‌ను గుర్తించారు.

ఈ కాలువ అనేక లోయలను దాటుతున్నందున, ఈ లోయలను దాటడానికి వీలుగా, స్థల పరిస్థితులను బట్టి అండర్ టన్నెళ్ళు, సూపర్ పాసేజీలు, అక్విడక్ట్‌లు మొదలైన వివిధ రకాల క్రాస్ డ్రైనేజీ పనులను ప్రతిపాదించారు. అన్ని ప్రధాన కట్టడాలకు స్థల సర్వేలు నిర్వహించగా, చిన్న కట్టడాలకు సంబంధించి, ప్రతి రకమైన కట్టడానికీ మూడు కట్టడాలకు సర్వే నిర్వహించారు. ఈ నిర్మాణాలకు సవివరమైన ఆకృతులు, ఖర్చు వివరాలను (2004) తయారు చేశారు, అన్ని చిన్న కట్టడాల ఖర్చును నిర్ణయించారు, వీటిని చీఫ్ ఇంజనీర్, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ వారు ఆమోదించారు. కాలువ వ్యవస్థ యొక్క ప్రధాన భాగంవద్ద ఎడమ ప్రధాన కాలువ యొక్క విడుదల సామర్థ్యం 495.00 క్యూసెక్కులు. తదనంతరం కాలువ పొడవును 211.27 కిలోమీటర్లకు పెంచారు. అవసరమైన 10,609.45 ఎకరాల భూమిలో, 10,193.63 ఎకరాల భూమిని సేకరించారు, మిగిలిన 415.82 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది.

#### 4.3.1.1 సవరించిన పరిమాణాలను సరిగ్గా మదింపు చేయకపోవడం వల్ల ఆమోదం లభించక పనులు ఆగిపోవడం

రెండవ సవరించిన వ్యయ అంచనా ప్రకారం, కాలువ పనులలో మట్టి పని, లైనింగ్, కట్టడాల సంఖ్య గణనీయంగా పెరగటం వలన అంచనా ₹2,373.00 కోట్ల నుండి ₹4,202.69 కోట్లకు పెరిగింది. 2013–14 ధరల ప్రకారం కాలువల పరిమాణాలు, వ్యయం ఇప్పటికే పరిమితులను మించిపోయాయని వ్యయ సవరణ కమిటీ (ఆర్ సీసీ) అభిప్రాయపడింది. అందువల్ల, వీటి ధరను ఆమోదించబడిన ఒకటవ సవరించిన వ్యయ అంచనా 2010–11 పరిమాణాల ప్రకారం 2013–14 ధర స్థాయిలో స్తంభింపజేశారు.

అందువల్ల, పరిమాణాలు/వ్యయం పెరగడం, కాలువ పనుల అమలులో జాప్యం ఫలితంగా ఆర్ సీసీ సవరించిన పరిమాణాలను ఆమోదించలేదు, తద్వారా అంశాల వారీగా పరిమితి విధించబడింది. గుత్తేదారు సంస్థల పనుల అమలులో పురోగతి మందకొడిగా సాగడంతో నాలుగు ప్యాకేజీ పనులను శాఖ ముందుగానే ఆపివేసింది. తదనంతరం, ***పట్టిక 4.3*** లో వివరించిన విధంగా, మిగిలిన పనులను మంజూరు చేయడానికి పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్, ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. అయితే, 2023 మార్చి నాటికి, ఈ విషయంలో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు.

**పట్టిక 4.3: ఆమోదం కోసం ప్రభుత్వం వద్ద పెండింగ్ లో ఉన్న పనుల వివరాలు**

| ప్యాకేజీ సంఖ్య | చేయాల్సిన పని యొక్క మిగిలిన విలువ (₹ కోట్లలో) | ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించిన తేదీ | స్థితి |
|---|---|---|---|
| 1 | 69.23 | 2020 నవంబర్ | పనులు ఆగిపోయాయి |
| 3 | 69.09 | 2020 అక్టోబర్ | |
| 5 & 5ఎ | 150.02 | 2020 నవంబర్ | |
| 6ఎ | 413.74 | 2021 అక్టోబర్ | |
| **మొత్తం** | **702.08** | | |

*మూలం: శాఖ రికార్డులు*

ప్రస్తుతం ఉన్న ఎస్ఎస్ఆర్ ప్రకారమే పనులు అప్పగించాల్సి ఉన్నందున మిగిలిన పనులను (మట్టి తవ్వకం, లైనింగ్, కట్టడాలు) మంజూరు చేయడంలో జాప్యం జరిగితే ఖర్చు పెరుగుతుంది, ఇంకా మిగిలిన పనులను చేపట్టకపోతే ఎడమ

ప్రధాన కాలువపై ఇప్పటికే వెచ్చించిన ₹2,076.10 కోట్ల వ్యయం ఫలవంతం కాదు ఎందుకంటే కాలువ ద్వారా నీటిని సరఫరా చేయాలనే ఉద్దేశ్యాన్ని ఈ పనులు పూర్తయ్యే వరకు సాధించలేము.

భారత ప్రభుత్వం ఇప్పుడు కాలువలకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (2010-11 ధర స్థాయి) ఆధారంగా బిల్లులను తిరిగి చెల్లిస్తున్నట్లు ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2023 ఫిబ్రవరి). ప్రస్తుతానికి, ఎడమ ప్రధాన కాలువ వ్యయం అంశాలవారీ గరిష్ట పరిమితిని మించిపోయినందున 2021 ఫిబ్రవరి నుండి ఖర్చును భారత ప్రభుత్వం చెల్లించటం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గరిష్ట పరిమితిని ఎత్తివేయమని భారత ప్రభుత్వాన్ని అభ్యర్థించిందని, దానికి వారు అంగీకరించలేదని కూడా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రెండవ సవరించిన వ్యయ అంచనాని ఆమోదించనందున, తాత్కాలిక గ్రాంట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనను కూడా పరిగణనలోకి తీసుకోనందున ఎడమ ప్రధాన కాలువ పనులను అప్పగించడంలో జాప్యానికి  కేంద్ర ప్రభుత్వమే కారణమంది. పై ప్యాకేజీలకు ఇప్పటికే టెండర్లు పిలిచామని, త్వరలోనే పనులను గుత్తేదారు సంస్థలకు అప్పగిస్తామని బదులిచ్చారు (2024 నవంబర్).

కాలువ నిర్వహణకు అవసరమైన అన్ని అంశాలను సరిగ్గా మదింపు చేయడం, కాలువ పనులకు ఖచ్చితమైన అంచనాలను రూపొందించడం శాఖ బాధ్యత కాబట్టి సమాధానం ఆమోదయోగ్యం కాదు. భూసేకరణలో జాప్యం, శాఖ రూపొందించిన ఖచ్చితత్వం లేని అంచనాల కారణంగా చేపట్టవల్సిన పరిమాణాలు గణనీయంగా పెరిగాయి. పనులను అప్పగించిన తర్వాత శాఖ, పనులను సక్రమంగా పర్యవేక్షించకపోవడంతో గుత్తేదారు సంస్థలు పనులను పూర్తిచేయడంలో జాప్యం జరిగింది. ఇంకా, మిగిలిన ఎడమ ప్రధాన కాలువ పనులను అప్పగించడం, పూర్తి చేయడంలో జాప్యం వల్ల ఉద్దేశించిన ఆయకట్టుకు నీరందించాలన్న లక్ష్యం నెరవేరలేదు.

#### 4.3.1.2 భూసేకరణ, ఆర్&ఆర్ పనులు పూర్తి కాకపోవడంవల్ల కాలువ పనులు ఆగిపోవడం

"సమగ్ర పరిశీలన, హైడ్రాలిక్ వివరాల తయారీ, ఆకృతులు, ఇంజనీరింగ్, అంచనాలు తయారు చేయడం, ప్రధాన కాలువ పూర్తి చేయడం, కాలువ లైనింగ్‌తో సహా గట్ల నిర్మాణం, ఎడమ ప్రధాన కాలువ (ప్యాకేజీ నెం.4) లోని 69.145 నుండి 93.700 కిలో మీటరు వరకు సీఎం&సీడీ పనుల నిర్మాణం" పనిని 2005లో ₹209.70 కోట్లకు గుత్తేదారు సంస్థకు[159] 2007 నాటికి పూర్తిచేయాలనే షరతుతో అప్పగించారు. ఈ పనిలో 73.168 కిలో మీటరువద్ద ఒక అండర్ టన్నెల్ నిర్మాణం కూడా ఉంది.

ఆడిట్ ఈ క్రింది విషయాలను గమనించడమైంది:

- '73.168 కిలో మీటరు వద్ద అండర్ టన్నెల్ నిర్మాణం' పనిని 2005 లోనే అప్పగించినప్పటికీ, అందుకు అవసరమైన 10.75 ఎకరాల భూమిని 2018 ఆగస్టులో ఆలస్యంగా సేకరించినందున, నేటికీ (2023 మార్చి) టన్నెల్ నిర్మాణాన్ని చేపట్టలేకపోయారు.
- రెవెన్యూ అధికారులు ₹91.96 లక్షల వ్యయంతో భూసేకరణ చేసినప్పటికి, రైతులు పనులకు ఆటంకం కలిగిస్తూ, అధిక పరిహారం డిమాండ్ చేస్తూ, ₹91.96 లక్షల నష్టపరిహార మొత్తాన్ని స్వీకరించడానికి నిరాకరిస్తున్నందున భూమిని స్వాధీనం (2023 మార్చి నాటికి)  చేసుకోలేకపోయరు. మొత్తాన్ని భూసేకరణ, పునరుద్ధరణ & పునరావాస అథారిటీ (ఎల్ఏఆర్ఆర్ అథారిటీ) వద్ద జమ చేశారు, ప్రొసీడింగ్స్ పెండింగ్ లో ఉన్నాయి. పై వివాదాన్ని దృష్టిలో ఉంచుకుని పనులకు గడువును 2023 జూన్ వరకు పొడిగించారు.

భూ యజమానులు అధిక పరిహారం డిమాండ్ చేస్తుండటంతో పరిహారం మొత్తాన్ని 2018 డిసెంబరులో విశాఖపట్నంలోని ఎల్ఏఆర్ఆర్ అథారిటీ వద్ద జమ చేసినట్లు ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 జూన్).

[159] మెస్సర్స్ సబీర్ డ్యామ్ కన్స్ట్రక్షన్స్

అందువల్ల, అవసరమైన భూమిని సేకరించడంలో జాప్యం జరిగినప్పటికీ, రైతులతో పరిహారం చెల్లింపు సమస్య పరిష్కారం కాకపోవడంతో పనుల్లో పురోగతి లేదు. దీనివల్ల ఎడమ ప్రధాన కాలువ పనులు పూర్తి కావడంలో జాప్యం జరిగింది. ఈ సమస్యను త్వరగా పరిష్కరించడానికి ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు.

#### 4.3.1.3 పనుల అప్పగింతలో ఆలస్యంగా నిర్ణయం తీసుకోవడం

ఎడమ ప్రధాన కాలువ మార్గ మధ్యంలో 11[160] స్థానాల వద్ద జాతీయ రహదారిని దాటుతుంది. ఎడమ ప్రధాన కాలువలోని ఈ 11 జాతీయ రహదారి క్రాసింగ్ పనులను 2004లో కాలువ పనులతో పాటు వివిధ కాంట్రాక్టర్లకు అప్పగించారు. తదనంతరం, ప్రభుత్వం అన్ని ఇంజనీరింగ్ విభాగాలను, ఈపీసీ కాంట్రాక్టు పరిధి నుండి జాతీయ రహదారి క్రాసింగ్‌లను తొలగించి, వాటిని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కి అప్పగించాలని ఆదేశించింది (2007).

ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ ఆకృతుల ఆమోదంలో జాప్యం, ఎడమ ప్రధాన కాలువకి అసంపూర్ణ భూసేకరణ, ఇతర అనుమతులు వంటి వివిధ కారణాల వల్ల ఈ జాతీయ రహదారి క్రాసింగ్‌ల పనులను ఎన్‌హెచ్ఏఐకి అప్పగించలేదని ఆడిట్ గమనించింది. తదనంతరం, 11 ఏళ్ల తర్వాత, 11 లో ఎనిమిది (₹42.63 కోట్ల అంచనా వ్యయంతో (ఎస్ఎస్ఆర్ 2004-05) చేపట్టబడతాయి) జాతీయ రహదారి క్రాసింగ్‌ల పనులను వివిధ గుత్తేదారు సంస్థలకు ₹156.31 కోట్ల ఒప్పంద విలువతో గంపగుత్త కాంట్రాక్ట్ విధానంలో అప్పగించారు, ఇంకా మిగిలిన మూడు జాతీయ రహదారి క్రాసింగ్‌ల పనులను ఇవ్వాల్సి ఉంది. ఎన్‌హెచ్ఏఐకి బదులుగా గుత్తేదారు సంస్థలకు పనులను అప్పగించాలనే నిర్ణయంలో ఆలస్యం ఫలితంగా తాజా ఎస్ఎస్ఆర్ ప్రకారం ఒప్పంద విలువ పెరుగుదల కారణంగా ₹113.68 కోట్ల (***అనుబంధం 4.4*** లో వివరించిన విధంగా) ఖర్చు పెరిగింది.

ఎన్‌హెచ్ఏఐ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం, గుత్తేదారు సంస్థలు తమ కాంట్రాక్టుల పరిధి నుండి పనిని తొలగించడానికి సమ్మతి లేఖను సమర్పించకపోవడం వల్ల, జాతీయ రహదారి క్రాసింగ్‌లను కొత్త ఏజెన్సీలకు అప్పగించడంలో జాప్యం జరిగిందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 జూన్).

ముగింపు సమావేశంలో అంచనాలు, హైడ్రాలిక్ వివరాల తయారీ సమయంలో నాలుగు వరుసల వంతెనలకు ఆకృతులను సిద్ధం చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్). ఎన్‌హెచ్ఏఐకి ఆకృతులు సమర్పించిన తర్వాత, క్రాసింగ్‌లు/ వంతెనల ఆకృతులను నాలుగు వరుసలకు బదులుగా ఆరు వరుసలుగా మార్చాలని ఎన్‌హెచ్ఏఐ అభ్యర్థించింది. వరుసల పెంపు వలన అవసరమయ్యే భూసేకరణకు అయ్యే అదనపు ఖర్చును భరించడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించకపోవడంతో, ఆ పనిని ఎన్‌హెచ్ఏఐకి అప్పగించాలని నిర్ణయించారు. ఎన్‌హెచ్ఏఐ తీసుకున్న అమలు ప్రమాణాలు/ నిబంధనలు/వైఖరిలో పదేపదే మార్పులు చేయడం వల్ల ఈ జాతీయ రహదారి క్రాసింగ్‌ల అప్పగింత ఆలస్యమైంది.

పనుల పరిధి నుంచి ఎన్‌హెచ్ క్రాసింగ్ ల తొలగింపునకు గుత్తేదారు సంస్థల నుంచి సమ్మతిని పొందడంలో శాఖ ఆలస్యం చేయడం వల్ల సమయం, వ్యయం పెరగడంతో ₹113.68 కోట్ల అదనపు భారం పడింది.

### 4.3.2 ఎడమ ప్రధాన కాలువ అమలు

ఎడమ ప్రధాన కాలువలోని ఎనిమిది ప్యాకేజీలలో, 2023 మార్చి నాటికి, ప్యాకేజీ-2 పనులు మాత్రమే పూర్తయ్యాయి. కాలువ పనులు మందకొడిగా సాగడంతో కొన్ని పనులను పాత గుత్తేదారు సంస్థల పరిధి నుంచి తొలగించి కొత్త ఏజెన్సీలకు అప్పగించారు. 2023 మార్చి నాటికి, ప్యాకేజీలు-1ఎ, 4 & 4ఎ, 7, 8 లకు సంబంధించిన పనులు

[160] ఎన్ హెచ్ -16 క్రాసింగ్ లు కి.మీ. 33.559, కి.మీ. 41.650, కి.మీ. 55.410, కి.మీ. 64.375, కి.మీ. 77.175, కి.మీ. 80.998, కి.మీ. 88.035, కి.మీ. 93.700, కి.మీ. 103.658 వద్ద, కొత్త నీటి సరఫరా కాలువ యొక్క 173.609 కి.మీ. వద్ద ఉన్నాయి

పురోగతిలో ఉండగా, మిగిలిన ప్యాకేజీలు-1, 3, 5 & 5ఎ, 6ఎ పనుల కేటాయింపు ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఆమోదం కోసం నిలచి ఉన్నాయి.

#### 4.3.2.1 అదనపు కట్టడాలకు తప్పుగా మంజూరు చేయడం

ఈపీసీ కాంట్రాక్ట్ నియమనిబంధనల ప్రకారం, అంతర్గత ప్రామాణిక అంచనాలలో పేర్కొన్న కట్టడాల సంఖ్యతో సంబంధం లేకుండా గుత్తేదారు మొత్తం పనిని అమలు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉత్తర్వుల అమలు కోసం ప్రభుత్వం జారీ చేసిన విధివిధానాల[161] ప్రకారం (ఫిబ్రవరి 2015), ప్రాథమిక ప్రాజెక్టు పారామితులలో మార్పులు ఉంటేనే కట్టడాల సంఖ్య పెంపును పరిగణనలోకి తీసుకోవచ్చు. ప్రభుత్వం జారీ చేసిన మెమో[162] (2008 మే), నీటి విడుదల సామర్థ్యం, పూర్తి సరఫరా స్థాయి, బెడ్ లెవల్, పూర్తి చేయాల్సిన ఆయకట్టు ప్రాంతం, కాలువ ప్రారంభ, ముగింపు స్థానాలు, డిస్ట్రిబ్యూటరీలు మొదలైన వాటిని కాలువల ప్రాథమిక పారామితులుగా నిర్దేశించింది.

ఎడమ ప్రధాన కాలువకి చెందిన ప్యాకేజీ-7 పనులను ₹175.00 కోట్లతో గుత్తేదారు సంస్థ[163]కి (2004) అప్పగించారు. అంతర్గత ప్రామాణిక అంచనాల ప్రకారం ప్యాకేజీ-7లో 52 కట్టడాలను ప్రతిపాదించారు. అంతర్గత ప్రామాణిక అంచనాలలో ప్రతిపాదించినదానికంటే అదనంగా ₹15.74 కోట్లతో 20 కట్టడాలను (మొత్తం 72) ప్రభుత్వం మంజూరు చేసింది[164] (2022 మార్చి).

ప్రాథమిక ప్రాజెక్టు పారామితుల[165]లో మార్పు లేనప్పటికీ కట్టడాల సంఖ్యను పెంచడానికి ప్రభుత్వం అదనపు అనుమతి ఇచ్చినట్లు ఆడిట్ గమనించింది. కట్టడాల సంఖ్య 52 నుండి 73కి పెరిగినందున (వాస్తవానికి కట్టడాల సంఖ్య 72కి మాత్రమే పెరిగింది) ప్రాథమిక ప్రాజెక్టు పారామితులు మారుతున్నాయని పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్, ప్రభుత్వానికి నివేదించడం[166] (మే 2021) కూడా గమనించింది.

పైన పేర్కొన్న 2008 మే నాటి ప్రభుత్వ మెమోలోని పేరా 2(బి) ప్రకారం, కాలువకు సంబంధించిన ప్రాజెక్టు పారామితులు, నీటి విడుదల సామర్థ్యం, పూర్తి సరఫరా స్థాయి, బెడ్ వెడల్పు, పూర్తి చేయవలసిన ఆయకట్టు ప్రాంతం, కాలువ ప్రారంభ, ముగింపు స్థానాలు, డిస్ట్రిబ్యూటరీలు మొదలగు వాటి ద్వారా నియంత్రించబడతాయి, కానీ కట్టడాల సంఖ్య/పరిమాణాలలో పెరుగుదల వల్ల కాదు. అందువల్ల, అదనపు కట్టడాలకు తప్పుగా ఇచ్చిన అనుమతి, గుత్తేదారు సంస్థకు అనవసరమైన ప్రయోజనాన్ని అందించడానికి, ఖజానాపై ₹15.74 కోట్ల నివారించదగిన అదనపు భారానికి దారితీసింది.

అంతర్గత ప్రామాణిక అంచనాలలో పొందుపరచని ఆ ప్రదేశపు భౌగోళిక స్థితిలో ఊహించని పరిణామాలు లేదా ప్రాథమిక ప్రాజెక్టు పారామితులలో మార్పులు లేదా స్థానిక అంశాల కారణంగా అలైన్‌మెంట్‌లో మార్పుల మూలంగా ఆకృతులలో మార్పుల వలన పనులు పూర్తి చేయడానికి సవరించిన పరిమాణాలు/ఆకృతులు తప్పనిసరి అని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 జూన్). తదనుగుణంగా ఆ ప్రదేశపు భౌగోళిక స్థితి కారణంగా అదనపు నిర్మాణాలు, పరిమాణాల కోసం గుత్తేదారు ప్రతిపాదనలు సమర్పించారు. తదనంతరం రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ సిఫారసు మేరకు పనులు త్వరితగతిన పూర్తి చేసి అనుకున్న ప్రయోజనాలు షెడ్యూల్ ప్రకారం సాధించాలన్న ఉద్దేశంతో అదనపు కట్టడాలకు అనుమతులు మంజూరు చేశామన్నారు.

క్షేత్ర స్థాయి వాస్తవ పరిస్థితులతో పోలిస్తే అంతర్గత ప్రామాణిక అంచనాలలో అందించిన పరిమాణాలు చాలా తక్కువగా ఉన్నందున, చాలా ఏజెన్సీలు పనులను చేయడానికి సిద్ధంగా లేవని ముగింపు సమావేశంలో ప్రభుత్వం

---

[161] 23.02.2015 నాటి జీఓఎమ్ఎస్ సంఖ్య 22 యొక్క అనుబంధంలోని 7వ పేరా
[162] 07.05.2008 తేదీ నాటి మెమో సంఖ్య 34843/ రిఫార్మ్/2006
[163] మెస్సర్స్ కేసీఎల్-జేసీసీజీ (జేవీ), హైదరాబాద్
[164] జీఓఆర్ టీ సంఖ్య 534, తేదీ 19.03.2022
[165] కాలువ పొడవు వెడల్పులు, నీటిని తీసుకెళ్లే సామర్థ్యం, హైడ్రాలిక్ పరామితులు
[166] సిఈ/పీఐపీ/డీసీఈ2/ఓటీ9/ఏఈఈ2/పీఐపీఎల్ఎంసీ/పీకేజీ-2/నిర్మాణాల వ్యయ వైవిధ్యం తేదీ 29.05.2021

పేర్కొంది (2024 నవంబర్). అందువల్ల త్వరితగతిన పనులు పూర్తి చేయాలనే ఉద్దేశంతో గుత్తేదారు సంస్థలకు పరిమాణంలో నికర వ్యత్యాసాలకు చెల్లింపు చేయాలని నిర్ణయించారు.

ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, అంచనా వేసిన పరిమాణాలు, కట్టడాలలోని అంశాల నుండి పరిమాణాలలో వ్యత్యాసాలు అంటే ప్రాథమిక ప్రాజెక్టు పారామితులలో మార్పులు మరియు/లేదా ఆ ప్రదేశపు భౌగోళిక స్థితిలో ఊహించని పరిణామాలు మరియు/లేదా అలైన్ మెంట్ లో మార్పు ఉంటేనే కట్టడాల సంఖ్యలో పెరుగుదలను పరిగణించవచ్చు కనుక సమాధానం ఆమోదయోగ్యం కాదు. అయితే, ఈ కేసులో, ప్రాథమిక ప్రాజెక్టు పారామితుల/ సైట్ జియాలజీలో మార్పు ఉందనటానికి ప్రభుత్వం ఎటువంటి ఋజువులను అందించలేదు. ఇంకా, ఒప్పందం యొక్క నియమ నిబంధనల ప్రకారం, అంతర్గత ప్రామాణిక అంచనాలలో పొందుపరచిన కట్టడాల సంఖ్యతో సంబంధం లేకుండా, నిర్ణీత/అంగీకరించిన ధరకు పనిని మొత్తంగా పూర్తి చేయడం గుత్తేదారుని బాధ్యత. అందువల్ల, ఒప్పంద నిబంధనల ప్రకారం కట్టడాల/పరిమాణాల పెరుగుదలకు గుత్తేదారు అదనపు చెల్లింపుకు అర్హుడు కాడు. అదనపు కట్టడాలకు తప్పుగా చెల్లింపు మంజూరు చేయడం వల్ల గుత్తేదారు సంస్థకు ₹15.74 కోట్ల అనుచిత ప్రయోజనం కలిగింది.

***సిఫారసు 4.2: పరిమాణాలు/కట్టడాల సంఖ్యలో వ్యత్యాసం కారణంగా గుత్తేదారులకు అనుచిత ప్రయోజనం, ఖజానాకు నష్టం వాటిల్లకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈపీసీ కాంట్రాక్టులకు సంబంధించిన ప్రక్రియలను, నిర్వర్తించవలసినవి, పరిధి, నిర్దేశాల (స్పెసిఫికేషన్స్) తో సహా క్రమబద్ధీకరించాలి.***

#### 4.3.2.2 గుత్తేదారు సంస్థల పద్దులను పరిష్కరించకపోవడం

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువకు చెందిన ప్యాకేజీ-5, ప్యాకేజీ-8 పనులను 2005లోనే కేటాయించారు[167]. పలుమార్లు గడువు పొడిగించినప్పటికీ గుత్తేదారు సంస్థలు పనులు పూర్తి చేయకపోవడంతో పనిలోని కొన్ని భాగాలు పాత సంస్థల వద్ద ఉంచుతూ ప్రభుత్వం కొన్ని భాగాలను తొలగించి[168] (2016 నవంబర్) కొత్త సంస్థలకు అప్పగించింది. తదనంతరం పాత గుత్తేదారు సంస్థ వద్ద ఉన్న పనులను ముందుగానే (2020 జూలై) ముగించాలని నిర్ణయించి, పాత గుత్తేదారు సంస్థల ఖాతాలను పరిష్కరించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

ప్యాకేజీ 5, 8 లకు సంబంధించి కాంట్రాక్టర్ల నుండి వసూలు చేయాల్సిన ₹37.72 కోట్ల[169] విలువైన గుత్తేదారు సంస్థల ఋణాలు, శాఖ వద్ద అందుబాటులో ఉన్న గుత్తేదారుల ఆస్తుల ₹19.72 కోట్ల[170] కంటే ఎక్కువగా ఉన్నాయి, అందువల్ల, ఋణాలు, ఆస్తుల కంటే ₹18.00 కోట్లు ఎక్కువగా ఉన్నాయని ఆడిట్ గమనించింది.

నిబంధన 60 (సి) క్రింద చేపట్టిన పని పూర్తి కానందున అసలు గుత్తేదారు సంస్థలపై విధించాల్సిన జరిమానాను లెక్కించలేకపోవడంతో ఖాతాలు పరిష్కరించబడలేదని, పని పూర్తయిన తర్వాత ఖాతాలు పరిష్కరించబడతాయని, ముగింపు సమావేశంలో ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్).

---

[167] ప్యాకేజీ 5: మెస్సర్స్ సబీర్ డ్యామ్ & వాటర్ వర్క్స్ కన్స్ట్రక్షన్స్, హైదరాబాద్, ప్యాకేజీ 8: మెస్సర్స్ ఐవిఆర్సిఎల్-ఎస్ఇడబ్ల్యు & ప్రసాద్ (జెవి), హైదరాబాద్

[168] ప్యాకేజీ -5లో 5.75 కిలోమీటర్ల ఈడబ్ల్యూఈ, 11.00 కిలోమీటర్ల లైనింగ్, 33 సీఎం, సీడీ పనులను తొలగించి ₹16.82 కోట్ల విలువైన మిగిలిన పనులను మొదటి ఏజెన్సీ వద్ద ఉంచారు. ప్యాకేజీ-8లో ₹68.66 కోట్ల విలువైన పనులు (సీఎన్ఎస్ లైనింగ్ మినహా) తొలగించి ₹15.05 కోట్ల విలువైన పనులను మొదటి ఏజెన్సీ వద్దే ఉంచారు

[169] ప్యాకేజీ 5: ₹9.43 కోట్లు, ప్యాకేజీ 8: ₹18.29 కోట్లు

[170] ప్యాకేజ్ 5: ₹15.64 కోట్లు, ప్యాకేజీ 8: ₹4.08 కోట్లు

## 4.4 కుడి, ఎడమ ప్రధాన కాలువలకు సంబంధించిన సమస్యలు

### 4.4.1 పంపిణీ వ్యవస్థ కోసం వివరణాత్మక ప్రాజెక్టు నివేదికల తయారీలో జాప్యం

పొలాలకు సాగునీరు అందించడానికి ఏదైనా నీటిపారుదల ప్రాజెక్టులో పంపిణీ వ్యవస్థ ఒక ముఖ్యమైన భాగం. పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు 7.20 లక్షల[171] ఎకరాలకు నీటిని అందించే ఉద్దేశ్యంతో ప్రారంభించబడింది.

ఎడమ, కుడి ప్రధాన కాలువల పంపిణీ వ్యవస్థ కోసం సమగ్ర దర్యాప్తు, సర్వే, వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక తయారీ పనులను ₹7.92 కోట్ల (ఎడమ ప్రధాన కాలువ: ₹4.31 కోట్లు, కుడి ప్రధాన కాలువ: ₹3.61 కోట్లు) వ్యయంతో ఆరు నెలల కాలపరిమితితో అంటే ఎడమ ప్రధాన కాలువకు 2020 మే, కుడి ప్రధాన కాలువకు 2020 జూన్ లోగా పూర్తి చేసేటట్లుగా ఒక గుత్తేదారు సంస్థకు [172](2019 నవంబర్ & డిసెంబర్) అప్పగించారు.

గుత్తేదారు సంస్థకు పనులు అప్పగించి మూడేళ్లు గడిచినా 2023 మార్చి నాటికి పనులు అసంపూర్తిగా ఉన్నట్లు ఆడిట్ గమనించింది. వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక తయారీలో భాగంగా సర్వే, లెవలింగ్ కార్యకలాపాలకు గాను ఎడమ ప్రధాన కాలువకు ₹0.95 కోట్లు, కుడి ప్రధాన కాలువకు ₹0.72 కోట్లు ఖర్చు చేశారు.

ముసాయిదా వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలను ఆమోదం కోసం పీపీఏ, సీడబ్ల్యూసీకి సమర్పించామని, వాటిపై కొన్ని వ్యాఖ్యలు తెలియజేయబడ్డాయని (2024 ఏప్రిల్), ఆమోదం పొందిన తర్వాత, పంపిణీ వ్యవస్థ టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 జూన్).

అందువల్ల ఎడమ, కుడి ప్రధాన కాలువల పంపిణీ వ్యవస్థల వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలను ఖరారు కాలేదనేది వాస్తవం, అలాగే రెండో ఆర్‌సీఈకి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపటంలో జాప్యానికి ఇది ఒక కారణం.

### 4.4.2 తవ్వితీసిన మట్టికి జవాబుదారీతనం, అమ్మకం

ఎడమ, కుడి ప్రధాన కాలువల పనుల కొరకు గుత్తేదారు సంస్థలతో కుదుర్చుకున్న ఈపీసీ ఒప్పందాలలోని నిబంధన 61.3 ప్రకారం, తవ్విన మట్టిని శాఖ యొక్క సరైన సమ్మతితో పనిలో ఉపయోగించడం మినహా కాంట్రాక్టర్ అమ్మకూడదు లేదా తొలగించకూడదు. తవ్వితీసిన మట్టి ప్రభుత్వ ఆస్తి అవుతుంది కనుక, దానిని సంరక్షించి, లెక్కలలో[173]కి తీసుకోవాలి.

#### 4.4.2.1 తవ్వి తీసిన మట్టిని అమ్మకపోవడం

ఎడమ, కుడి ప్రధాన కాలువల రెండింటి పని ప్రదేశాలలో ₹1,660.15 కోట్ల (ఘనపు మీటరుకు ₹138 చొప్పున x 12.02 కోట్ల ఘనపు మీటర్ల) విలువైన భారీ మొత్తంలో తవ్వితీసిన మట్టి అందుబాటులో ఉందని ఆడిట్ గమనించింది (2022 జూన్). శాఖ అందించిన సమాచారం యొక్క ఖచ్చితత్వాన్ని ధృవీకరించడానికి అందుబాటులో ఉన్న మట్టి వివరాలను మేజర్/మైనర్ 7 ఎఫ్ రిజిస్టర్‌లోకి నమోదు చేయలేదు. అందుబాటులో ఉన్న మట్టి పరిమాణాలు, విలువ ***పట్టిక 4.4*** లో వివరించబడ్డాయి.

**పట్టిక 4.4: ప్రతి ప్యాకేజీ క్రింద అందుబాటులో ఉన్న తవ్వితీసిన మట్టి, పొందదగిన ఆదాయం**

| ప్యాకేజీ సంఖ్య | సైట్‌లో అందుబాటులో ఉన్న మిగిలిన మట్టి పరిమాణం (కోట్ల ఘనపు మీటర్లలో) | మట్టి విలువ (₹ కోట్లలో) |
|---|---|---|
| ఎడమ ప్రధాన కాలువ | | |
| 1 | 1.52 | 210.01 |
| 2 | 1.80 | 248.92 |

171 ఎడమ ప్రధాన కాలువ: 4.00 లక్షల ఎకరాలు, కుడి ప్రధాన కాలువ: 3.20 లక్షల ఎకరాలు

172 మెస్సర్స్ ఐఐసీ టెక్నాలజీస్ లిమిటెడ్, హైదరాబాద్

173 మేజర్/మైనర్ 7ఎఫ్ ఖాతా రిజిస్టర్‌లో సక్రమంగా నమోదు చేయడం

| | | |
|---|---|---|
| 3 | 0.90 | 123.82 |
| 4 | 0.99 | 137.23 |
| 5 | 0.94 | 129.27 |
| 6 & 7 | 1.58 | 218.45 |
| 8 | 0.17 | 23.88 |
| కుడి ప్రధాన కాలువ | | |
| 4 | 1.94 | 267.45 |
| 5 | 1.17 | 161.01 |
| 6 | 0.43 | 59.58 |
| 7 | 0.58 | 80.53 |
| **మొత్తం** | **12.02** | **1,660.15** |

*మూలం: విభాగం అందించిన సమాచారం*

*గమనిక: యూనిట్ రేట్లు ₹107 నుండి ₹138 వరకు ఉన్నాయి. అయితే 2022 లో చేసిన వ్యాఖ్య ప్రకారం 2021-22 ఎస్ఓఆర్ ప్రకారం ₹138 ఏకరీతి రేటును పరిగణనలోకి తీసుకున్నారు.*

ఉన్న మట్టిని అమ్మకపోవడానికి గల కారణాలు రికార్డులలో లేవు. అందుబాటులో ఉన్న మట్టిని అమ్మకపోవడం వల్ల ఆదాయం రావటంలో జాప్యం కావచ్చు/దొంగతనం వల్ల లేదా సహజంగానే నష్టం కలగవచ్చు.

మేజర్, మైనర్ 7ఎఫ్ రిజిస్టర్‌లలో మట్టి వివరాలు నిర్వహించడం లేదని, సిమెంట్, చమురు కోసం చేసినట్లుగా, వీటిని తాళం వేసి సురక్షితంగా ఉంచలేమని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 జూన్). వివిధ శాఖల అభ్యర్థన మేరకు ఎప్పటికప్పుడు మట్టి తరలింపునకు అనుమతులు ఇస్తున్నామని ప్రభుత్వం సమాధానమిచ్చింది. తవ్వితీసిన మట్టిని అక్కడే అమ్మేందుకు టెండర్లు పిలుస్తామన్నారు.

ముగింపు సమావేశంలో మొత్తం మట్టి కోసం గనులు, భూగర్భ శాఖతో సంయుక్త సర్వే నిర్వహించినట్లు ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్). 200 కిలోమీటర్లు కాలువ పొడవునా ఉన్న తవ్వితీసిన మట్టిని తీసుకోవడానికి గనులు & భూగర్భ శాఖ ముందుకు రాలేదు. దీని సంరక్షణ ఖర్చు (సెక్యూరిటీ గార్డులను నియమించడం) చాలా ఎక్కువగా ఉంటుంది. అయితే, అవసరమైన చోట, వచ్చిన అభ్యర్థనల మేరకు ప్రభుత్వ పనులలో తవ్వితీసిన మట్టిని ఉపయోగిస్తామన్నారు. తాళం వేసి భద్రపరచగలిగే సామాగ్రి మాత్రమే 7ఎఫ్ లో నమోదు చేయబడుతుంది. అందువల్ల మట్టిని 7ఎఫ్ రిజిస్టర్లలోకి తీసుకోలేదు. నిల్వచేయటానికి భారీ విస్తీర్ణంలో స్థలం అవసరం కారణంగా ఏజెన్సీలు మట్టి మొత్తాన్ని ఒకేసారి తీసుకెళ్ళడానికి సిద్ధంగా లేనందున దీనిని అమ్మడం సాధ్యం కాలేదు.

మట్టిని నిల్వ చేయడం, ఉపయోగించడం గురించి సరైన జవాబుదారీతనం కలిగి ఉండటానికి, మేజర్, మైనర్ 7ఎఫ్ రిజిస్టర్ లో వీటి వివరాలను నిర్వహించడం తప్పనిసరి. మట్టిని అమ్మడంలో జాప్యం వల్ల దొంగతనం ద్వారా ఆదాయాన్ని కోల్పోయే అవకాశం ఉంది కనుక సమాధానం ఆమోదయోగ్యం కాదు.

### 4.4.2.2 దొంగిలించబడిన తవ్వితీసిన మట్టి

కుడి ప్రధాన కాలువలోని 4, 5, 6 & 7 ప్యాకేజీలు లలో తవ్వితీసిన మట్టి దొంగిలించబడినట్లు ఆడిట్ గమనించింది. ఎస్ఎస్ఆర్ 2020-21 ప్రకారం శాఖ నివేదించిన దొంగిలించబడిన మట్టి పరిమాణాలు, విలువ ***పట్టిక 4.5*** లో పేర్కొన్న విధంగా ఉన్నాయి.

**పట్టిక 4.5: కుడి ప్రధాన కాలువలో దొంగిలించబడిన తవ్వితీసిన మట్టి వివరాలు**

| ప్యాకేజీలు | దొంగతనం చేయబడిన తవ్వితీసిన మట్టి పరిమాణం (ఘనపు మీటర్లలో) | ఘనపు మీటర్ కు రేటు (₹ లో) | దొంగిలించబడిన తవ్వితీసిన మట్టి విలువ (₹ కోట్లలో) |
|---|---|---|---|
| 4 & 5 | 73,702 | 138 | 1.02 |
| 6 & 7 | 8,45,800 | 138 | 11.67 |
| మొత్తం | **9,19,502** | | **12.69** |

*మూలం: శాఖ రికార్డులు*

దొంగిలించబడిన మట్టి పరిమాణాన్ని, కోల్పోయిన పరిమాణాన్ని రికవరీ చేయడానికి శాఖ తీసుకున్న చర్యలను ధృవీకరించడానికి సంబంధిత రికార్డులను శాఖ సమర్పించలేదు.

దొంగతనాలను గుర్తించిన వెంటనే ఫిర్యాదులు నమోదు చేస్తున్నామని, దొంగిలించిన సొత్తును రికవరీ చేయడంతో పాటు జరిమానాలు విధిస్తున్నామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (జూన్ 2024).

₹12.69 కోట్ల విలువైన మట్టిని స్వాధీనం చేసుకోకపోవడం, మట్టి విలువను వసూలు చేసి జరిమానా విధించడానికి బాధ్యులను గుర్తించలేకపోవడంతో ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు.

***సిఫార్సు 4.3: తవ్వితీసిన మట్టిని సక్రమంగా లెక్కలలోకి తీసుకోవాలని, ఎలాంటి దొంగతనాలు జరగకుండా భద్రతా చర్యలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత శాఖను ఆదేశించాలి.***

### 4.4.3 మిగిలిన పనులు పూర్తి చేయడానికి మొదటి గుత్తేదారు సంస్థ నుంచి అదనపు వ్యయాన్ని వసూలు చేయకపోవడం

ఏపీడీఎస్ఎస్[174] యొక్క పీఎస్ లోని నిబంధన 60 (సి) ప్రకారం, మొదటి గుత్తేదారు సంస్థ ప్రభుత్వం నిర్దేశించిన కాలపరిమితిలో పనులను పూర్తి చేయలేకపోతే, వాటిని కాంట్రాక్ట్ పరిధి నుండి తొలగించి, మిగిలిన పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్న ఇతర గుత్తేదారు సంస్థలకు అప్పగించవచ్చు. ఒకవేళ ఇతర గుత్తేదారు సంస్థ పూర్తి చేసిన మిగిలిన పనికి ఏదైనా అదనపు ఖర్చు అయినట్లైతే, ఆ వ్యత్యాసం మొదటి గుత్తేదారు సంస్థ నుంచి వసూలు చేయబడుతుంది. అటువంటి వసూలు మొత్తం ఒప్పంద విలువలో (పూర్తయిన పని విలువ) ఐదు శాతానికి మించకూడదు.

మొదటి గుత్తేదారు సంస్థలు సకాలంలో పనులు పూర్తి చేయక, కాంట్రాక్ట్ కాలపరిమితిని అందుకోలేకపోవడంతో 10 ప్యాకేజీల్లో[175] ₹462.47 కోట్ల విలువైన పనులను మొదటి గుత్తేదారు సంస్థల పరిధి నుంచి తొలగించి ₹978.38 కోట్లకు కొత్త గుత్తేదారు సంస్థలకు అప్పగించారని ఆడిట్ గమనించింది. ఫలితంగా, కొత్త గుత్తేదారు సంస్థలు మిగిలిన పనులను పూర్తి చేయడానికి ₹515.91 కోట్ల అదనపు ఖర్చు అవుతుంది. పనిని పూర్తి చేయడానికి అయిన అదనపు ఖర్చు, పూర్తయిన పని విలువలో ఐదు శాతానికి పరిమితం చేయగా (10 ప్యాకేజీల అసలు కాంట్రాక్ట్ విలువ: ₹2,376.71 కోట్లు + ₹515.91 కోట్లు = ₹2,892.62 కోట్లు) ₹144.63 కోట్లు (***అనుబంధం 4.5*** లో వివరించిన విధంగా) మొదటి ఏజెన్సీల నుండి వసూలు చేయలేదు, తద్వారా ఆ మేరకు మొదటి గుత్తేదారు సంస్థలకు అనుచిత ప్రయోజనం చేకూరింది.

174 ఆంధ్రప్రదేశ్ వివరణాత్మక ప్రామాణిక వివరణలకు చెందిన ప్రాథమిక వివరణలు (ఆంధ్రప్రదేశ్ డీటేల్డ్ స్టాండర్డ్ స్పెసిఫికేషన్లకు చెందిన ప్రిలిమినరీ స్పెసిఫికేషన్లు)

175 కుడి ప్రధాన కాలువలో ప్యాకేజీ 2, 4, 5, 6 & 7, ఎడమ ప్రధాన కాలువలో ప్యాకేజీ 1, 3, 4, 5 & 6 (మొత్తం ఒప్పంద విలువ ₹2,263.33 కోట్లు)

తొలగించిన, కొత్త గుత్తేదారులు అమలు చేస్తున్న పనుల వ్యయ వ్యత్యాసాన్ని మొదటి గుత్తేదారు సంస్థల బిల్లుల తుది చెల్లింపుల నుంచి రికవరీ చేస్తామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 జూన్).

### 4.4.4 గృహ నిర్మాణ పథకం కోసం ప్రాజెక్టు భూమి మళ్లింపు

రాష్ట్ర ప్రభుత్వం యొక్క ప్రతిష్ఠాత్మక కార్యక్రమం "నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ళు" క్రింద అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను అందించడానికి జలవనరుల శాఖ యొక్క పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువకి చెందిన భూమిని ఉపయోగించుకోవడానికి ఆమోద ఉత్తర్వులను మంజూరు చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ జలవనరుల శాఖను కోరారు (2020 మార్చి)[176]. పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఒక జాతీయ ప్రాజెక్టు అని, ఆస్తులు భారత ప్రభుత్వ పోలవరం ప్రాజెక్టు అథారిటీకి (పీపీఏ) చెందుతాయని, అందువల్ల మంజూరు చేయలేమని జలవనరుల శాఖ ఈ ప్రతిపాదనను తిరస్కరించింది[177] (2020 మార్చి).

అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను అందించడానికి 28.25 ఎకరాల కుడి ప్రధాన కాలువ భూమిని కేటాయించడానికి అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని కోరారు[178] (2020 మార్చి). ఇంకా అవసరమైతే భవిష్యత్తులో ప్రాజెక్టు కోసం ప్రభుత్వేతర భూమిని సేకరిస్తామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. తక్షణమే తదుపరి చర్యలు తీసుకోవడానికి ఈ అంశంపై అభిప్రాయాలను సమర్పించాలని ప్రభుత్వం, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌ను కోరింది[179] (2020 జూన్).

కాలువ విస్తరణ పనులకు 28.25 ఎకరాల భూమి అవసరమని పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్, నివేదించారు[180] (2020 జూలై). జల వనరుల శాఖ అనుమతి లేకుండా రెవెన్యూ అధికారులు పూర్వపు తూర్పు గోదావరి జిల్లాలోని మూడు గ్రామాల్లో 46.89 ఎకరాల ఎడమ ప్రధాన కాలువ భూమిని ఆక్రమించి చదును చేశారని పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్, నివేదించారు. నీటిని నియంత్రించే సమయంలో కాలువకు గండి పడటం, తుఫానులు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కాలువ గట్లను అత్యవసరంగా పునరుద్ధరించడానికి ఎడమ ప్రధాన కాలువ భూములు అవసరమని కూడా నివేదించారు.

భూమి లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ఎడమ ప్రధాన కాలువ భూములను, ముఖ్యంగా తవ్విన మట్టి వేయడం కోసం ఉద్దేశించిన భూమిని, అప్పగించడం అనుమతించబడదని గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించిందని[181] (2019 ఏప్రిల్) పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నివేదించారు. అందువల్ల, ఎడమ, కుడి ప్రధాన కాలువ భూములను "నవరత్నాలు—పేదలందరికీ ఇళ్ళు" కోసం ఇవ్వలేమని సంబంధిత జిల్లా కలెక్టర్లకు[182] తెలియజేయాలని పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు.

అయినప్పటికీ, పూర్వపు తూర్పు గోదావరి జిల్లా రెవెన్యూ అధికారులు, వివిధ గ్రామాల్లో ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం 30.77 ఎకరాల ఎడమ ప్రధాన కాలువ భూమిని, 28.25 ఎకరాల కుడి ప్రధాన కాలువ భూమిని అక్రమంగా ఆక్రమించారు. ఇంకా, జల వనరుల శాఖకు ప్రత్యామ్నాయ భూమి ఇచ్చే ప్రతిపాదన కూడా చేయలేదు.

తవ్వితీసిన మట్టిని నిల్వ చేయడానికి ప్రత్యేకంగా కేటాయించిన భూములను జల వనరుల శాఖ అనుమతి లేకుండా తిరిగి తీసుకోవాలన్న రెవెన్యూ అధికారుల ఏకపక్ష నిర్ణయం మట్టిని నిల్వ చేసే ప్రక్రియను ప్రభావితం చేస్తుంది. దీని వలన పర్యావరణ సమస్యలు తలెత్తవచ్చు, జాతీయ హరిత ట్రిబ్యునల్ జరిమానాలను విధించవచ్చు.

---

176 లేఖ సంఖ్య ఆర్ఓసీ సంఖ్య ఇ4/ఇ-1784822/2020 తేదీ 07.03.2020

177 మెమో సంఖ్య ఐసీడీ01/ఎంజేఐఆర్0ఐపీ28/111/2020-ప్రాజెక్ట్స్-1 తేదీ 14.03.2020

178 డీ.ఓ లేఖ సంఖ్య ఇ4/ఇ-1784822/2020 తేదీ 21.03.2020

179 మెమో సంఖ్య ఐసీడీ01/ఎంజేఐఆర్0ఐపీ28/111/2020- ప్రాజెక్ట్స్-1 తేదీ 29.06.2020

180 లేఖ సంఖ్య సీఈ/పీఐపీ/డీసీఈ/ఓటీ2/ఏఈఈ4/వివిధ, తేదీ 07.07.2020

181 2019 లో డబ్ల్యూపీ (పిల్) సంఖ్య 15, తేది 16.04.2019

182 విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి & కృష్ణా జిల్లాలు

పశ్చిమ గోదావరి జిల్లాలో పేర్కొన్న భూమికి అనుమతి నిరాకరించారని, 30.77 ఎకరాల ఎడమ ప్రధాన కాలువ భూమి, 28.25 ఎకరాల కుడి ప్రధాన కాలువ భూమి జల వనరుల శాఖ ఆధీనంలో ఉందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 నవంబర్). రెవెన్యూ అధికారులు జల వనరుల శాఖకి భూమిని అప్పగించినట్లు చూపించే పత్రాలను తీసుకుంటామని, అన్ని పత్రాలను పరిశీలించిన తర్వాత వివరణాత్మక సమాధానం ఇస్తామని ముగింపు సమావేశంలో ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్).

పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించిన మొత్తం ప్రాజెక్టు భూమి జల వనరుల శాఖ ఆధీనంలో ఉందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, దీనికి సంబంధించి పత్రాలు ఇవ్వలేదు.

### 4.4.5 గుత్తేదారు సంస్థల నుండి బకాయిలు వసూలు చేయకపోవడం

***అనుబంధం 4.6*** లో వివరించిన విధంగా తవ్విన మట్టి తొలగింపు, మొబిలైజేషన్ అడ్వాన్స్ పై వడ్డీతో పాటు అసలు తదితరాల నిమిత్తం గుత్తేదారు సంస్థల రన్నింగ్ అకౌంట్ బిల్లుల నుంచి వసులు చేయవలసిన ₹37.67 కోట్లను శాఖ గుర్తించినట్లు రికార్డుల పరిశీలనలో వెల్లడైంది. అయితే ఎడమ, కుడి ప్రధాన కాలువ పనులకు సంబంధించి గుత్తేదారు సంస్థల నుంచి ఈ మొత్తాలను వసూలు చేయలేదు.

కుడి ప్రధాన కాలువ ప్యాకేజీ 2 పనులకు సంబంధించి, 'హెచ్ పీసీఎల్ & గెయిల్ పైపు లైన్ల' కోసం అంతర్గత ప్రామాణిక అంచనాలలో చేర్చబడిన మొత్తం ₹3.50 లక్షలు అని, 66వ మరియు పార్ట్ బిల్లులో ఆ మొత్తాన్ని వసూలు చేశారని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 జూన్). 'విద్యుత్ లైన్ల తరలింపుకు' సంబంధించి అంతర్గత ప్రామాణిక అంచనాల అంచనాల్లో చేర్చబడిన మొత్తం ₹14.17 లక్షలు కాగా, ఆ మొత్తాన్ని తదుపరి రన్నింగ్ బిల్లుల నుంచి వసూలు చేస్తామన్నారు.

ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు, ఎందుకంటే ఆయా మొత్తాలు ఎనిమిది నుండి 15 సంవత్సరాలుగా గుత్తేదారు సంస్థల వద్ద ఉన్నాయి. ఇంకా, ఒప్పందం ప్రకారం 'విద్యుత్ లైన్ల మార్పు', 'హెచ్‌పీసీఎల్ & గెయిల్ పైప్ లైన్ల' అమలుకు అయ్యే ఖర్చును గుత్తేదారు సంస్థలు భరించాలి. అందువల్ల ఒప్పంద నిబంధనల ప్రకారం ఆయా కార్యనిర్వాహక సంస్థలకు ప్రభుత్వం చెల్లించిన మొత్తాన్ని గుత్తేదారు సంస్థల నుంచి వసూలు చేయాల్సి ఉంటుంది. జల వనరుల శాఖ, గుత్తేదారు సంస్థల నుంచి రావాల్సిన మొత్తాలను వసూలు చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోకుండా వసూలు ప్రక్రియను ఆలస్యం చేసింది.

# భూ సేకరణ



# 5వ అధ్యాయం

## భూసేకరణ

ప్రాజెక్టు ప్రారంభమైనప్పటి నుంచి అవసరమైన మొత్తం భూమిలో 67.43 శాతం భూమిని మాత్రమే శాఖ సేకరించగలిగింది. 2017-18 సంవత్సరానికి సంబంధించి వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక, రెండవ సవరించిన వ్యయ అంచనాల (ఆర్‌సీఈ) మధ్య అవసరమైన భూ విస్తీర్ణంలో వ్యత్యాసం ఉంది. 2010-11 నుంచి 2017-18 సవరించిన వ్యయ అంచనా వరకు గల మధ్య కాలంలో అసైన్డ్ / ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూముల విస్తీర్ణం గణనీయంగా పెరగడంతో సేకరించాల్సిన ప్రభుత్వ, అటవీ భూముల విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఫలితంగా భూ సేకరణకు అదనపు ఆర్థిక భారం పడింది. చట్ట నిబంధనలను తప్పుగా అన్వయించడం అదనపు మార్కెట్ విలువను తప్పుగా లెక్కించడానికి దారితీసింది, ఫలితంగా భూ పరిహారం అధికంగా చెల్లించబడింది. ఆర్ఎఫ్‌సీటీఎల్ ఆర్ఆర్ చట్టం, 2013 నిబంధనలకు విరుద్ధంగా 27 మంది అనర్హ గిరిజనేతరులకు భూ పరిహారాన్ని చెల్లించారు. జల వనరుల శాఖ అభ్యర్థించిన భూమికి మరియు సర్వే నివేదకలు లేదా రెవెన్యూ రికార్డుల ఉన్న భూముల విస్తీర్ణం, వర్గీకరణలో వ్యత్యాసాలు ఉన్నాయి. సరైన యాజమాన్య రికార్డులు లేకుండానే భూ అవార్డులు జారీ చేశారు.

వ్యవసాయ భూములతో పాటు గ్రామ కంఠాల సేకరణకు సంబంధించిన అవార్డుల జారీలో జాప్యం, కోర్టు కేసుల పరిష్కారం తర్వాత కూడ అవార్డుల జారీలో విపరీతమైన జాప్యం, అసైన్డ్ భూముల సేకరణలో జాప్యం కారణంగా ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 ప్రవేశపెట్టడానికి ముందే సేకరించాల్సిన ప్రతిపాదిత భూములను చట్టం ప్రవేశపెట్టిన తర్వాత సేకరించడం వలన ఆర్థిక భారం పడింది. ఖల్సా భూములకు (ప్రభుత్వ భూములు) భూ పరిహారం అనర్హులైన లబ్ధిదారులకు నియమ విరుద్ధంగా చెల్లించడం జరిగింది. యాజమాన్య రికార్డులను పరిశీలించకుండానే క్లెయిమ్ చేయని భూములకు భూ పరిహారం చెల్లింపు జరిగింది. 'భూమికి-భూమి' బదలాయింపు క్రింద అనుమతించిన పరిమితికి బదులుగా సేకరించిన స్థాయిలో భూమికి-భూమి బదలాయింపు జరిగింది, తద్వారా అదనపు భూ బదలాయింపుకి దారితీసింది.

### 5.1 పరిచయం

న్యాయమైన పరిహారం పొందే హక్కు, భూసేకరణ, పునరావాసం, పునరుపాధి కల్పనలో పారదర్శకత (ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్) చట్టం, 2013ను భారత ప్రభుత్వం అమలు చేసే (2014 జనవరి) వరకు ప్రాజెక్టుల కోసం భూసేకరణ, బాధిత ప్రజల పునరావాసం, పునరుపాధి కల్పనకు సంబంధించిన సమస్యలు గతంలో భూసేకరణ (ఎల్ఏ) చట్టం, 1894 ద్వారా నిర్వహించబడేవి. ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013కు అనుగుణంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ నియమాలు, 2014ను రూపొందించింది (2014 నవంబర్).

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 24 ప్రకారం, భూసేకరణ చట్టం, 1894 (1894 యొక్క 1) క్రింద ప్రారంభించిన భూసేకరణ ప్రొసీడింగ్స్ విషయంలో, ఈ చట్టం ప్రారంభం కావడానికి ఐదు సంవత్సరాలు లేదా

అంతకంటే ఎక్కువ సంవత్సరాల ముందు, ఈ చట్టంలోని సెక్షన్ 11 క్రింద అవార్డు ఇవ్వబడినప్పటికీ, భూమిని భౌతికంగా స్వాధీనం చేసుకోకపోయినా లేదా పరిహారం చెల్లించకపోయినా, ఆ ప్రొసీడింగ్స్ ముగిసినట్లు పరిగణించబడతాయి, సంబంధిత ప్రభుత్వం, చట్టం, 2013 నిబంధనలకు అనుగుణంగా అటువంటి భూసేకరణ చర్యలను కొత్తగా ప్రారంభించాలి.

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు యొక్క ప్రభావిత ప్రాంతాలు ప్రధానంగా మూడు వర్గాలుగా ఉంటాయి. అవి, పని జరిగే ప్రాంతం, ముంపుకు గురయ్యే ప్రాంతం, భూసేకరణ అవసరమయ్యే ఆర్&ఆర్ కార్యకలాపాల ప్రాంతం.

**పని జరిగే ప్రాంతం**

ఆనకట్టల నిర్మాణం, స్పిల్ వే, సొరంగాలు, కాలువలు, పిల్ల కాలువలు (డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్) మొదలైన ఇంజనీరింగ్ పనులు జరిగే ప్రాంతం.

**ముంపుకు గురయ్యే ప్రాంతం**

ఆనకట్ట నిర్మాణం మరియు ఆ తరువాత పూర్తి రిజర్వాయర్ స్థాయి వరకు ఆనకట్ట నింపడం వలన ముంపుకు గురయ్యే ప్రాంతం.

**ఆర్ & ఆర్ కార్యకలాపాల ప్రాంతం**

ముంపుకు గురయ్యే ప్రాంతం యొక్క ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను సముచితంగా తరలించడానికి, ఆర్&ఆర్ కాలనీల నిర్మాణం మరియు 'భూమికి-భూమి' పరిహార కేటాయింపు కోసం భూ సేకరణ చేపట్టాలి.

### 5.1.1 భూసేకరణ ప్రక్రియ

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 నిబంధనల ప్రకారం, ప్రాథమిక సర్వే నిర్వహించి, సర్వే[183] సమాచారాన్ని ఉపయోగించి ప్రాజెక్టు నిర్మాణం వల్ల ప్రభావితమయ్యే ప్రాంతం, భూమి అవసరాన్ని అంచనా వేయాలి. ప్రభుత్వం నియమించిన ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్[184] మరియు ఆర్&ఆర్ కమీషనర్, ఆర్&ఆర్ ప్రణాళికల రూపకల్పన, అమలును పర్యవేక్షించడానికి బాధ్యత వహిస్తారు.

ఆర్&ఆర్ అధికారులు[185] (ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క సెక్షన్ 16) సామాజిక ఆర్థిక సర్వే (ఎస్ఈఎస్) నిర్వహించి, ప్రభావిత/ముంపు ప్రాంతంలో ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల (పీడీఎఫ్) గణనను చేపట్టాలి. ముంపు, ఆర్&ఆర్ కార్యకలాపాల కోసం సేకరించాల్సిన వాస్తవిక భూమి అవసరాలను లెక్కించడానికి ప్రతి బాధిత కుటుంబం నుంచి సేకరించే భూమి, స్థిరాస్తుల వివరాలను ఆర్&ఆర్ అధికారులు అంచనా వేయాలి. పేర్కొన్న సర్వే పద్ధతుల ద్వారా పని జరిగే ప్రాంతానికి అవసరమైన భూమి అవసరాలను పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ (సీఈ) అంచనా వేయాలి. అవసరమైన మొత్తం భూమికి సంబంధించిన అభ్యర్థనను సీఈ, ఆర్&ఆర్ అధికారులు, భూసేకరణ అధికారి (ఎల్ఏఓ)కి సమర్పించాలి. ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని నిబంధనలలో సూచించిన విధానాన్ని అనుసరించి సేకరించాల్సిన భూమి యొక్క విస్తీర్ణం, వర్గీకరణ, యాజమాన్య వివరాలను భూసేకరణ అధికారి ధృవీకరిస్తారు.

---

183 సర్వే ఆఫ్ ఇండియా యొక్క టోపో షీట్లను అధ్యయనం చేయడం ద్వారా ప్రాథమిక సర్వే, ఫ్లై లెవలింగ్, డబుల్ చెక్ లెవలింగ్, ప్రిస్మాటిక్ కంపాస్‌తో చైన్ చెక్ సర్వేయింగ్, లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్ (ఎల్ఐడిఎఆర్) సర్వే వంటి వివిధ పద్ధతులను ఉపయోగించి ఫీల్డ్ సర్వే

184 ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం2013 లోని సెక్షన్ 43, సెక్షన్ 44(2) ప్రకారం పీఏ & కమీషనర్, ఆర్&ఆర్

185 ప్రాజెక్టు నిర్వాహకులు, కమీషనర్, ఆర్&ఆర్

భూసేకరణ ప్రక్రియలో అవసరానికి అనుగుణంగా భూమిని అంచనా వేయడం, అవసరమైన భూమిని సేకరించడానికి ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేయడం, సర్వే చేయడం, భూసేకరణ అవార్డులను ప్రకటించడం, ఆమోదించడం, అవార్డు పరిహారం చెల్లింపులు, ఫిర్యాదుల పరిష్కారం వంటివి ఉంటాయి. పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు క్రింద భూమిని సేకరించడంలో అనుసరించే విధానం ***అనుబంధం 5.1*** లో వివరించబడింది.

### 5.1.2 భూసేకరణ స్థితి




ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, రికార్డుల ప్రకారం, ప్రాజెక్టు కోసం పని జరిగే ప్రాంతం, ముంపు ప్రాంతం, ఆర్&ఆర్ కార్యకలాపాల కోసం సేకరించాల్సిన మొత్తం భూమి విస్తీర్ణం 1,79,770 ఎకరాలుగా[186] అంచనా వేయబడింది. అవసరమైన భూమికి గాను 1,67,765 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి భూసేకరణ అధికారులకు అభ్యర్థనలు (కాలక్రమేణా) దాఖలయ్యాయి. అయితే 1,13,119 ఎకరాలు[187], అంటే 67.43 శాతం భూసేకరణ జరగ్గా, మిగిలిన 54,646 ఎకరాలను (2023 మార్చి) సేకరించాల్సి ఉంది.

ప్రారంభంలో, దిగువ నుండి ఎగువ కంటూర్ల[188] వరకు దశలవారీగా పని జరిగే ప్రాంతం, ముంపు ప్రాంతం, ఆర్&ఆర్ కార్యకలాపాలకు అవసరమైన భూములను సేకరించాలని భావించింది.

2021 నవంబర్‌లో, పీపీఏ రెండు దశల్లో అనగా, దశ-I ((+) 41.15 మీ ఎత్తు వరకు), దశ-II ((+) 41.15 మీ పైన) ఆర్&ఆర్ కార్యకలాపాలను అమలు చేయడానికి సమ్మతి[189] తెలిపింది. జల వనరుల శాఖ రికార్డుల ప్రకారం పని జరిగే ప్రాంతం (వర్క్ ఏరియా) కు భూసేకరణ దాదాపు పూర్తయింది. అయితే, ముంపు ప్రాంతానికి, ఆర్&ఆర్ కార్యకలాపాలకు ('భూమికి-భూమి' బదిలీతో సహా) అవసరమైన భూమిని 2023 మార్చి వరకు పూర్తిగా సేకరించలేదు. 2023 మార్చి నాటికి భూసేకరణ యొక్క భౌతిక, ఆర్థిక పురోగతి ***పట్టిక 5.1*** లో వివరించబడింది.

---

[186] ముంపు ప్రాంతం: 1,12,930.11 ఎకరాలు; పని జరిగే ప్రాంతం: 2,462.97 ఎకరాలు; భూమికి భూమి: 26,729.92 ఎకరాలు; ఆర్&ఆర్ కార్యకలాపాల కోసం సేకరించాల్సిన భూమి: 8,581.05 ఎకరాలు; ఎడమ ప్రధాన కాలువ: 14,079.38 ఎకరాలు, కుడి ప్రధాన కాలువ: 14,986.70 ఎకరాలు

[187] భూ సేకరణ చట్టం 1894 కింద 73,207 ఎకరాలు, ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం 2013 క్రింద 39,912 ఎకరాలు సేకరించబడ్డాయి

[188] నిమ్నోన్నత రేఖ (+) 35.50 మీ. వరకు, (+) 35.50 మీ. నుండి (+) 41.15 మీ. వరకు, (+) 41.15 మీ. నుండి (+) 45.72 మీ. వరకు

[189] 10.11.2021న జరిగిన పోలవరం ప్రాజెక్టు అథారిటీ 14వ సమావేశం తీర్మానముల (మినిట్స్) ప్రకారం

**పట్టిక 5.1: భూసేకరణలో వర్గాల వారీగా భౌతిక, ఆర్థిక పురోగతి**

| అంశాలు | భూసేకరణ అధికారికి దాఖలు చేసిన అభ్యర్థన ప్రకారం సేకరించాల్సిన మొత్తం భూమి | | పూర్తయిన భూసేకరణ | | ఇంకా సేకరించాల్సిన భూమి | | |
|---|---|---|---|---|---|---|---|
| | | | | | రెవెన్యూ రికార్డుల ప్రకారం | జలవనరుల శాఖ రికార్డుల ప్రకారం | |
| | భౌతిక (ఎకరాల్లో) | ఆర్థికం (₹ కోట్లలో) | భౌతిక (ఎకరాల్లో) | ఆర్థికం (₹ కోట్లలో) | భౌతిక (ఎకరాల్లో) | భౌతిక (ఎకరాల్లో) | ఆర్థికం (₹ కోట్లలో) |
| పని జరిగే ప్రాంతం | 26,238.23 | 1,589.67 | 24,673.33 | 1,532.32 | 1,564.90 | 71.19 | 57.35 |
| ముంపు ప్రాంతం | 1,04,033.11 | 6,432.68 | 74,695.83 | 2,625.77 | 29,337.28 | 30,415.11 | 3,806.91 |
| ఆర్&ఆర్ కార్యకలాపాలు | 37,493.79 | 4,073.90 | 13,749.91 | 1,298.61 | 23,743.88 | 23,762.15 | 2,775.29 |
| మొత్తం | **1,67,765.13** | **12,096.25** | **1,13,119.07** | **5,456.70** | **54,646.06** | **54,248.45** | **6,639.55** |

*మూలం: రాజమహేంద్రవరంలోని పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ) అందించిన సమాచారం.*

మిగిలిన భూ[190] సేకరణను 2023 మార్చి, 2023 డిసెంబర్ మధ్య పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, మిగిలిన 54,248.45 ఎకరాల (జల వనరుల శాఖ ప్రకారం) భూసేకరణ 2023 మార్చి నాటికి పూర్తి కాలేదు. ఇంకా, పైన పేర్కొన్నదాని ప్రకారం, భూసేకరణ అధికారులు, జల వనరుల శాఖ రికార్డుల మధ్య సేకరించాల్సిన భూమిలో 397.61 ఎకరాల వ్యత్యాసం ఉందని చూడవచ్చు. 2023 మార్చి నాటికి రెండు శాఖలు ఈ వ్యత్యాసాన్ని సమన్వయం చేసుకోలేదు.

## 5.2 భూసేకరణకు ప్రణాళికా ప్రక్రియ

అవసరమైన సంస్థ భూమిని అభ్యర్థించిన తర్వాత, జిల్లా కలెక్టర్, సేకరించాల్సిన భూమి వివరాలనుతో ప్రిలిమినరీ నోటిఫికేషన్ (పిఎన్) జారీచేసి విస్తృతంగా ప్రచారం, ప్రచురణలు చేయాలని ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం 2013, సెక్షన్ 11 నిర్దేశిస్తుంది. ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత జిల్లా కలెక్టర్ రెండు నెలల్లోగా భూ రికార్డుల నవీకరణ జరిగేలా చూడాలి, భూసేకరణకు ప్రతిపాదించిన భూమి యొక్క ప్రాథమిక సర్వే (సెక్షన్ 12) నిర్వహించాలి. ప్రిలిమినరీ నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి 12 నెలల్లో (సెక్షన్ 19) ఆర్&ఆర్ ప్రభావిత కుటుంబాల ప్రయోజనాల కోసం పునరావాస ప్రాంతంగా గుర్తించబడి ప్రకటించిన ప్రాంతాన్ని ప్రచురించాలి. ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి 12 నెలల్లో (సెక్షన్ 25) జిల్లా కలెక్టర్ భూసేకరణ అవార్డును జారీ చేయాలి.

### 5.2.1 భూసేకరణలో మందకొడి పురోగతి

ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం 2013, సెక్షన్ 38(1) నిబంధన ప్రకారం, ప్రజా ప్రయోజనార్థం అమలుచేసే నీటిపారుదల లేదా జల విద్యుత్ ప్రాజెక్టు కోసం సేకరించే భూమి అయితే, సేకరించిన భూములు మునిగిపోవడానికి ఆరు నెలల ముందే ఆర్&ఆర్ పూర్తి చేయాలి. అందువల్ల, మొత్తం ప్రాజెక్టు పని పూర్తి కావడానికి ఆరు నెలల ముందే భూసేకరణ పూర్తి చేయాలి. భారత ప్రభుత్వ జల శక్తి మంత్రిత్వ శాఖ ప్రకారం, మొత్తం ప్రాజెక్టు యొక్క మొదటి దశ పూర్తి కావడానికి గడువును 2026 మార్చిగా నిర్ణయిస్తూ ఒక సంవత్సరం పొడిగింపుకు కూడా అవకాశమిచ్చింది.

ఆడిట్ క్రింది విషయాలను గమనించింది:

[190] (+)35.50 మీటర్ల వరకు: 815.56 ఎకరాలు, (+) 35.50 మీటర్ల నుండి (+) 41.15 మీటర్ల మధ్య: 966.34 ఎకరాలు, (+) 41.15 మీటర్ల నుండి (+) 45.72 మీటర్ల మధ్య: 52,466.55 ఎకరాలు

(i) అభ్యర్థించిన 1,67,765 ఎకరాలకుగాను ప్రాజెక్టు ప్రారంభించినప్పటి నుండి 2023 మార్చి నాటికి శాఖ 1,13,119.07 ఎకరాల భూమిని సేకరించింది. ***పటం 5.1*** లో చూపించిన విధంగా సేకరించాల్సిన మిగతా భూమి యొక్క స్థితి వివిధ దశల్లో ఉంది.

**పటం 5.1: సేకరించాల్సిన మిగతా భూమి యొక్క స్థితి**




సేకరించాల్సిన భూమిలో ఎక్కువ భాగం ప్రిలిమినరీ నోటిఫికేషన్ లేదా ముసాయిదా ప్రకటన దశలో ఉందని పై అంశాలను బట్టి అర్థమవుతోంది. ప్రిలిమినరీ నోటిఫికేషన్ దశలో ఉన్న 23,019.98 ఎకరాల భూమిని, ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 నిబంధనల ప్రకారం మొత్తం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయడానికి కనీసం 24 నెలల సమయం పడుతుంది. ఇంకా, 29,714.31 ఎకరాలకు అవార్డు జారీ చేయడానికి 12 నెలల సమయం అవసరం. పైన పేర్కొన్న వాటితో పాటు, పునరావాసం కల్పించాల్సిన 373 ఆవాస ప్రాంతాలలో మొత్తం 1,06,006 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకుగాను, 38 ఆవాస ప్రాంతాలకు సంబంధించిన 11,677 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించబడింది (2023 మార్చి నాటికి), మిగిలిన 335 ఆవాస ప్రాంతాలలో 94,329 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు (88.99 శాతం) ఇంకా పునరావాసం కల్పించబడలేదు (వివరణాత్మక చర్చ 6వ అధ్యాయంలో). అందువల్ల, మిగతా భూమిని (33 శాతం) తొమ్మిది నెలల (2023 ఏప్రిల్ నుండి డిసెంబర్) తక్కువ సమయంలో సేకరించడం సాధ్యమయ్యేట్టు లేదు.

అంతే కాకుండా, 2004లో ప్రాజెక్టు ప్రారంభమైనప్పటి నుండి భూసేకరణ కొరకు నిర్ణయించిన కాలపరిమితి, సేకరించాల్సిన లక్ష్యిత భూమికి గాను సంవత్సరాలవారీగా సాధించిన పురోగతి, లక్ష్యాలను చేరుకోకపోవడానికి గల కారణాలు ఆడిట్ కు సమర్పించిన రికార్డుల నుంచి లభ్యం కాలేదు. సంబంధిత సమాచారం లేకపోవడంతో భూసేకరణ మందకొడిగా సాగడానికి గల కారణాలను ఆడిట్ అంచనా వేయలేకపోయింది.

మొదటి దశ క్రింద మిగిలిన భూమిని 2025 జనవరి నాటికి, రెండో దశ భూమిని 2025 జూన్ నాటికి సేకరిస్తామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 ఆగస్టు). ఇంకా, కోవిడ్-19 మహమ్మారి, గ్రామాలు/ఆవాస ప్రాంతాలలో తరచూ వరదలు రావడంతో పాటు 1,151.00 ఎకరాలకు సంబంధించి ₹255.65 కోట్ల బిల్లులు బకాయి ఉన్నాయని తెలిపింది. బడ్జెట్ లభ్యతను బట్టి మిగిలిన భూసేకరణ ప్రక్రియ పూర్తవుతుందన్నారు.

ముగింపు సమావేశం సందర్భంగా, భారత ప్రభుత్వం దశల వారీగా నిధులు సమకూర్చాలని నిర్దేశించినందున, మొదటి దశ కోసం అవసరమైన దాదాపు 1,00,099 ఎకరాల భూమిలో 83,659 ఎకరాలు సేకరించబడిందని ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్). మిగిలిన భూమిలో, ఎక్కువ భాగం 'భూమికి-భూమి' మార్పిడి, ఆర్&ఆర్ ప్యాకేజీకి సంబంధించినవి మాత్రమే. మారిన పరిస్థితుల దృష్ట్యా సవరించిన సమాధానాన్ని సమర్పిస్తామని పేర్కొంది.

2023 మార్చి నాటికి సేకరించాల్సిన మిగిలిన 54,645.93 ఎకరాలు, భూసేకరణ, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల పునరావాసంలోనూ పురోగతి మందకొడిగా ఉన్నందున, 2025 జూన్ నాటికి మొత్తం భూసేకరణ పూర్తి కావడం అసాధ్యంగా ఉంది కాబట్టి సమాధానం ఆమోదయోగ్యం కాదు. భూసేకరణ, ఆర్&ఆర్ పనులు పూర్తి కాకుండా

ప్రాజెక్టులో నీటి నిల్వ సాధ్యం కాదు. ఇంకా, భూసేకరణ కార్యకలాపాలను పూర్తి చేయడానికి నిర్దేశించిన కాల పరిమితి, అవి సాధించకపోవడానికి గల కారణాలను ప్రభుత్వం తెలుపలేదు.

(ii) పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు పనులు 2004 సంవత్సరంలో ప్రారంభమైనప్పటికీ, పంపిణీ వ్యవస్థకు అవసరమైన 6,158.25 ఎకరాల భూమికి సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక, భూ ప్రణాళిక షెడ్యూళ్ళను[191] జల వనరుల శాఖ, ప్రత్యేక కలెక్టర్ కు (భూసేకరణ) సమర్పించలేదు. ఫలితంగా, పంపిణీ వ్యవస్థకు అవసరమైన భూసేకరణ కార్యరూపం దాల్చలేదు, దీనివలన పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు పూర్తి కావడం ఆలస్యం అవుతుంది.

భూసేకరణ ప్రక్రియను దశల వారీగా చేపడతామని అంటే మొదటి దశ (+) 41.15 మీటర్ల వరకు, రెండవ దశ (+) 41.15 మీటర్ల నుండి (+) 45.72 మీటర్ల వరకు అని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 నవంబర్). 2019-22 వరదల తరువాత, మొదటి దశ వరకు మునిగిపోయే గ్రామాల సంఖ్యను నిర్ధారించడానికి లైడార్ సర్వే చేపట్టబడింది, ఫలితంగా ముంపుకు గురయ్యే లేదా రాకపోకలు నిలిచిపోయే మరో 32 గ్రామాలు (48 ఆవాసాలు) జోడించబడ్డాయి. అందువల్ల, మొదటి దశలో ఆ 32 గ్రామాలలో భూసేకరణ పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రాజెక్టు యొక్క మొదటి దశ పూర్తి కావడానికి గడువును 2026 మార్చిగా భారత ప్రభుత్వం నిర్ణయిస్తూ ఒక సంవత్సరం పొడిగింపుకు కూడా అవకాశమిచ్చింది. అందువల్ల భూసేకరణ ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేదని పేర్కొంది.

భూసేకరణ ప్రక్రియ ప్రారంభమై 18 ఏళ్లు గడుస్తున్నా మొదటి దశ భూసేకరణ ప్రక్రియ కూడా అసంపూర్తిగానే ఉంది కనుక సమాధానం ఆమోదయోగ్యం కాదు.

### 5.2.2 భూమి నిర్ధారణలో నిలకడ లేకపోవడం

తొలుత 2005-06లో రూపొందించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక ఆధారంగా ప్రాజెక్టుకు అవసరమైన భూమిని అంచనా వేశారు. తదనంతరం, పూర్తి జలాశయ స్థాయి (ఎఫ్ఆర్ఎల్) (+) 45.72 మీటర్లలో ఎటువంటి మార్పు లేకుండా సంబంధిత సంవత్సరాల ధరల స్థాయి అనగా 2010-11, 2017-18 సంవత్సరాల్లో రెండుసార్లు వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలను సవరించారు.

2017-18 లో ఆమోదించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక ఆధారంగా రెండో సవరించిన వ్యయ అంచనాను (ఆర్‌సీఈ) జలవనరుల శాఖ రూపొందించింది. వ్యయ సవరణ కమిటీ (ఆర్‌సీసీ) పోలవరం నీటిపారుదల ప్రాజెక్టుపై సమర్పించిన నివేదిక (2020 మార్చి) లో, భూసేకరణ కోసం కొత్త భూసేకరణ చట్టం, 2013 ను అనుసరించడం వలన, మొదటి ఆర్‌సీఈ తో పోలిస్తే ముంపు ప్రాంతం కోసం సేకరించాల్సిన భూమి విస్తీర్ణం, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల సంఖ్య పెరగడం వల్ల వ్యయ అంచనా (రెండవ ఆర్‌సీఈ) లో పెరుగుదల ఉందని పేర్కొంది. ఆయా సంవత్సరాల వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలు అంటే మొదటి (2010-11 ధరల స్థాయి), రెండవ (2017-18 ధరల స్థాయి) ఆర్‌సీఈ ప్రకారం భూ అవసరాలు, ముంపునకు గురయ్యే గ్రామాలు, గుర్తించిన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల సంఖ్య, వివరాలు ***పట్టిక 5.2*** లో సవివరంగా ఇవ్వడమైంది.

---

[191] గ్రామం, సర్వే నంబర్ వారీగా సేకరించాల్సిన భూమి యొక్క వివరణాత్మక ప్రణాళిక

**పట్టిక 5.2: భూ అవసరాలు, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలలో వ్యత్యాసం**

| వర్గం/ కోవ | 2010-11 ప్రకారం | | | 2017-18 ప్రకారం | | |
|---|---|---|---|---|---|---|
| | డీపీఆర్ | 1వ ఆర్ సీఈ | వ్యత్యాసం | డీపీఆర్ | 2వ ఆర్ సీఈ | వ్యత్యాసం |
| భూమి అవసరం (ఎకరాల్లో) | 95,612 | 1,35,043[192] | 39,431 | 95,612 | 1,79,770[193] | 84,158 |
| ముంపునకు గురైన గ్రామాల సంఖ్య | 276 | 276 | 0 | 276 | 368 | 92 |
| ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల సంఖ్య | 44,574 | 44,574 | 0 | 44,574 | 1,06,006 | 61,432 |

*మూలం: పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు (రెండవ ఆర్‌సీఈ) కోసం వ్యయ సవరణ కమిటీ నివేదిక*

ఆడిట్ క్రింది విషయాలను గమనించడమైంది:

(i) 2017-18లో భూ అవసరాలు, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు సంబంధించి వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలో చూపించిన గణాంకాలకు, సంబంధిత సంవత్సరాల సవరించిన వ్యయ అంచనాలలో చూపిన గణాంకాలకూ మధ్య వ్యత్యాసం ఉంది. జల వనరుల శాఖ 2006 లోనే భూ ప్రణాళిక షెడ్యూళ్ళను భూసేకరణ అధికారులకు సమర్పించినప్పటికీ, అవసరమైన మొత్తం భూమికి ప్రిలిమినరీ నోటిఫికేషన్లు ఇంకా జారీ కాలేదు.

(ii) ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల సంఖ్య అనేది మారే అవకాశం ఉన్నటువంటిది, యుక్త వయస్సుకు వచ్చే వారు, మరణాలను పరిగణనలోకి తీసుకుంటే ప్రతి జన గణనలోనూ మారవచ్చు. అయితే, రెండు సవరించిన వ్యయ అంచనాల మధ్య ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల సంఖ్యలో (44,574) ఎలాంటి మార్పు లేదు. రెండు సవరించిన వ్యయ అంచనాల మధ్య ఏడేళ్ల విరామం ఉన్నా కూడా ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల సంఖ్య అలాగే ఉంది, ఇది రెండు సవరించిన వ్యయ అంచనాల మధ్య కాలంలో జన గణన నిర్వహించకపోవడాన్ని ప్రతిబింబిస్తుంది.

(iii) ఆర్&ఆర్ కార్యకలాపాలకు భూమి (కాలనీల అభివృద్ధి, 'భూమికి-భూమి' బదిలీల కోసం భూమి) ప్రధానంగా ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల సంఖ్య, నిర్మించాల్సిన కాలనీల సంఖ్య, అందించాల్సిన ఆర్&ఆర్ మౌలిక సదుపాయాలపై ఆధారపడి ఉంటుంది. ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013, మునుపటితో పోలిస్తే అదనపు మౌలిక సదుపాయాల నిబంధనను కల్పించింది, దీనికి ప్రతి ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబానికి ఆర్&ఆర్ కార్యకలాపాల కోసం అదనపు భూమి అవసరం అవుతుంది. ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 నిబంధనల ప్రకారం, ఆర్&ఆర్ కాలనీలో 12 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు ఒక ఎకరం భూమిని సేకరించాలి, అందులో 0.60 ఎకరాల భూమిని గృహ యూనిట్ల నిర్మాణానికి, మిగిలిన 0.40 ఎకరాల భూమిని జిల్లా పట్టణ, గ్రామీణ ప్రణాళిక శాఖ నిబంధనల ప్రకారం మౌలిక సదుపాయాలను అందించడానికి ఉపయోగించాలి.

2010-11 సవరించిన వ్యయ అంచనా ప్రకారం గుర్తించిన 44,574 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు 28,637 ఎకరాల భూమిని ఆర్&ఆర్ కార్యకలాపాలకు అవసరమైన భూమిగా చూపించారు. 2017-18 సవరించిన వ్యయ అంచనాలో 1,06,006 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు 35,311 ఎకరాల భూమిని ఆర్&ఆర్ కార్యకలాపాలకు అవసరమైన భూమిగా చూపించారు.

---

192 ముంపు ప్రాంతం: 95,613 ఎకరాలు, పని జరిగే ప్రాంతం: 10,793 ఎకరాలు, పునరావాసం కార్యకలాపాల ప్రాంతం: 28,637 ఎకరాలు

193 ముంపు ప్రాంతం: 1,12,930 ఎకరాలు, పని జరిగే ప్రాంతం: 31,529 ఎకరాలు, పునరావాసం కార్యకలాపాల ప్రాంతం: 35,311 ఎకరాలు

అందువల్ల, పెరిగిన 61,432 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు (1,06,006 – 44,574) 5,119[194] ఎకరాల అదనపు భూమిని సేకరించాల్సి ఉంది. 5,119 ఎకరాల అవసరానికి బదులుగా, రెండవ సవరించిన వ్యయ అంచనాలో అదనపు భూమి అవసరాన్ని 1,555 ఎకరాలు పెంచి అవసరమైన అదనపు భూమిని 6,674 ఎకరాలు (35,311 ఎకరాలు - 28,637 ఎకరాలు) గా చుపించారు. దీనికిగాను ₹169.65 కోట్లు (రెండవ వ్యయ సవరణ కమిటీ అంచనా ఆమోదించిన ప్రకారం ఎకరానికి ₹10.91 లక్షలు) ఖర్చవుతుంది.

(iv) ముంపునకు గురయ్యే ప్రాంతం ప్రధానంగా ప్రాజెక్టు స్థలాకృతి, పూర్తి జలాశయ స్థాయిపై ఆధారపడి ఉంటుంది. ఈ కాలంలో ఈ రెండు పారామితులు మారనప్పటికీ, ముంపునకు గురయ్యే ప్రాంతానికి అవసరమైన భూమి 95,613 ఎకరాలు (2010-11 ధరల స్థాయి) నుండి 1,12,930 ఎకరాలకు (2017-18 ధరల స్థాయి) పెరిగింది.

(v) పని జరిగే ప్రాంతానికి అవసరమైన భూమి ప్రధానంగా ప్రాజెక్టులో ఇమిడి ఉన్న పని భాగాలపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల, చేయవలసిన పని భాగాల ఆధారంగా పని జరిగే ప్రాంతానికి అవసరమని ప్రారంభంలో అంచనా వేయబడిన భూమి మారకూడదు. అయితే, హెడ్‌వర్క్స్ పని జరిగే ప్రాంతానికి సంబంధించి (పంపిణీ వ్యవస్థ, నీటి విడుదల సామర్థ్యం పెరగడం వల్ల పెరిగిన కాలువలకు అవసరమైన 6,158 ఎకరాల కాకుండా) భూమి అవసరం 920 ఎకరాల (2005-06/2013-14 ధరల స్థాయి) నుండి 2,463 ఎకరాల (2017-18 ధరల స్థాయి) కు పెరిగింది. పని జరిగే ప్రాంతానికి సంబంధించి భూమి అవసరం పెరగడానికి గల కారణాలు ఆడిట్ కు సమర్పించిన రికార్డుల నుంచి లభ్యంకాలేదు.

ఆర్&ఆర్ పాలసీ, 2005, ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 ప్రకారం, ఆర్&ఆర్ ప్రయోజనాలను అందించేందుకు ప్రభావిత వ్యక్తుల జాబితాను సిద్ధం చేయడానికి, ముంపు క్రింద భూమిని సేకరించడానికి ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల చేసిన తేదీనే అని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 నవంబర్). భూసేకరణ యూనిట్లు (ప్రాజెక్టు కోసం భూమిని సేకరించడానికి కేవలం ఐదు భూసేకరణ యూనిట్లు మాత్రమే పనిచేస్తున్నాయి), సిబ్బంది కొరత కారణంగా ఈ ప్రక్రియను ఒకే సంవత్సరంలో చేపట్టలేకపోయామన్నారు. ప్రిలిమినరీ నోటిఫికేషన్ల జారీలో జాప్యం, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబ అర్హతకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ తేదీ, గడువు తేదీ కావడంతో, ప్రభావిత ప్రజలందరూ 18 సంవత్సరాలు నిండిన తరువాత చేర్చబడతారు. అందువల్ల ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు పెరిగాయి, పునరావాసం కోసం భూమి అవసరం పెరిగింది. జల వనరుల శాఖ నుంచి అందిన భూ ప్రణాళిక షెడ్యూళ్ల ప్రకారమే భూసేకరణ ప్రక్రియను ప్రారంభించినట్లు బదులిచ్చారు. 2017లో, ఇంజనీర్-ఇన్-చీఫ్ సిఫార్సుల మేరకు 92 అదనపు ఆవాస ప్రాంతాలను ముంపు జాబితాలో చేర్చారు. అంతే కాకుండా హెడ్ వర్క్స్ పని జరిగే ప్రాంతం పెరగడం, పైన పేర్కొన్న 92 ఆవాస ప్రాంతాలను చేర్చడం వల్ల, జల వనరుల శాఖ నుంచి అందిన అభ్యర్థనల మేరకు భూసేకరణ ప్రక్రియను ప్రారంభించినట్లు బదులిచ్చారు.

అదనపు ఆవాసాలను చేర్చడానికి గల కారణాలు, ప్రభావితమైన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల సంఖ్య, ముంపుకు గురయ్యే భూ విస్తీర్ణం, అవసరమైన మొత్తం భూమిని 2017-18 వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలో చేర్చకపోవడానికి గల కారణాలను ప్రభుత్వం అందించలేదు.

***సిఫార్సు 5.1: రెవెన్యూ రికార్డుల ప్రకారం ముంపుకు గురయ్యే భూ విస్తీర్ణాన్ని, ప్రభావితమైన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను, ఆర్&ఆర్ కార్యకలాపాలకు అవసరమైన భూములను రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి, సవరించిన వ్యయ అంచనాను సత్వర ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి వివరణాత్మక నివేదికను సమర్పించాలి.***

[194] 61,432 పిడిఎఫ్‌లు x ఒక ఎకరం/12 పిడిఎఫ్‌లు=5,119 ఎకరాలు

### 5.2.3 సేకరించవలసిన ప్రభుత్వ, అటవీ భూముల విస్తీర్ణం తగ్గుదల

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 మొదటి షెడ్యూలు ప్రకారం అసైన్డ్/డీ-పట్టా[195] భూములను సేకరిస్తే భూ యజమానులకు నష్టపరిహారం చెల్లించాలి, ప్రభుత్వ భూములకు ఎటువంటి పరిహారం చెల్లించబడదు.

ప్రభుత్వ/అటవీ భూమిలో తగ్గుదల వలన సేకరించాల్సిన అసైన్డ్ భూమి/డీ-పట్టా/ఆక్రమిత భూమి పెరిగితే ప్రాజెక్టు వ్యయం పెరుగుతుంది, ఫలితంగా, భూసేకరణ ఖర్చు విషయంలో ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుంది.

రెండవ సవరించిన వ్యయ అంచనాపై వ్యయ సవరణ కమిటీ (ఆర్ సీసీ) నివేదిక (2020 మార్చి)ను పరిశీలించగా, ప్రాజెక్టుకు అవసరమైన వివిధ రకాల భూముల, అంటే పట్టా భూమి/డీ-పట్టా భూమి/ఆక్రమిత ప్రభుత్వ భూమి/ ప్రభుత్వ భూమి/అటవీ భూముల విస్తీర్ణం ***పట్టిక 5.3*** లో వివరించిన విధంగా 2010-11 ధరల స్థాయిలో సవరించిన వ్యయ అంచనా నుంచి 2017-18 ధరల స్థాయిలో సవరించిన వ్యయ అంచనా వరకు గల మధ్య కాలంలో గణనీయమైన మార్పుకు గురైందని తేలింది.

**పట్టిక 5.3: అవసరమైన వివిధ రకాల భూముల విస్తీర్ణం**

| భూమి రకం | 2010-11 | 2017-18 | వ్యత్యాసం |
|---|---|---|---|
| | (ఎకరాలలో) | | |
| పట్టా | 95,971.54 | 1,43,093.10 | 47,121.56 |
| అసైన్డ్(కేటాయించబడిన)/డీ పట్టా | 0 | 5,426.90 | 5,426.90 |
| ఆక్రమిత ప్రభుత్వ భూమి | 0 | 6,944.79 | 6,944.79 |
| ప్రభుత్వ భూమి | 29,852.00 | 15,578.00 | (-)14,274.00 |
| అటవీ భూమి | 9,219.60 | 8,727.27 | (-)492.33 |
| మొత్తం | **1,35,043.14** | **1,79,770.06[196]** | **44,726.92** |

*మూలం: పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు (రెండవ సవరించిన వ్యయ అంచనా) కోసం వ్యయ సవరణ కమిటీ నివేదిక*

ఇంకా, ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ) నివేదిక (2020 ఆగస్టు) పరిశీలనలో ఈ క్రింది విషయాలు వెల్లడయ్యాయి:

(i) 2010-11 నుంచి 2017-18 సవరించిన వ్యయ అంచనా వరకు గల మధ్య కాలంలో సేకరించాల్సిన ప్రభుత్వ భూ విస్తీర్ణం గణనీయంగా 14,274 ఎకరాలు (29,852 ఎకరాలు -15,578 ఎకరాలు), అటవీ భూమి 492.33 ఎకరాలు తగ్గింది. అదే కాలంలో అసైన్డ్/ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు 'సున్నా' నుండి 12,371.69 ఎకరాలకు, పట్టా భూములు 47,121.56 ఎకరాలకు గణనీయంగా పెరిగాయి.

సేకరించాల్సిన ప్రభుత్వ, అటవీ భూముల విస్తీర్ణం తగ్గడానికి, అసైన్డ్/పట్టా భూముల విస్తీర్ణం పెరగడానికి గల కారణాలు ఆడిట్ కు సమర్పించిన రికార్డుల నుంచి లభ్యం కాలేదు.

(ii) పోలవరం నీటిపారుదల ప్రాజెక్టులో పూర్తిగా/పాక్షికంగా ముంపుకు గురయ్యే గ్రామాలకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం 2005 జూలైలో ప్రకటించింది. అందువల్ల, ప్రాజెక్టుకు అవసరమైన/ అందుబాటులో ఉన్న పట్టా భూమి, ప్రభుత్వ, అటవీ భూముల విస్తీర్ణం ప్రభుత్వానికి తెలుసు. ఈ ప్రాంతం పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ప్రాంతం క్రిందకు వస్తుందని తెలిసినప్పటికీ, వీటిని భూమి లేని వారికి, పేద వ్యక్తులకు ఉచితంగా సాగు కోసం కేటాయించారు.

[195] 'డీ-పట్టా' అనేది సంబంధిత కేంద్ర లేదా రాష్ట్ర చట్టాలు లేదా వాటి కింద రూపొందించిన నియమాలు లేదా నిబంధనలలో కేటాయించిన అర్థాన్ని కలిగి ఉంటుంది, అటువంటి కుటుంబాలను కూడా భూ సేకరణ కారణంగా ప్రభావిత కుటుంబాలుగా పరిగణిస్తారు

[196] భూమి విస్తీర్ణంలో డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్ కోసం అంచనా వేసిన భూమి కూడా ఉంటుంది

2010-11లో అసైన్డ్/డి-పట్టా భూమి విస్తీర్ణం సున్నా, అయితే, 2010-11 నుండి 2017-18 మధ్య కాలంలో అది 5,426.90 ఎకరాలకు పెరిగింది.

అందువలన, ప్రభుత్వం 2010-17 మధ్య ప్రభుత్వ భూములకు డి-పట్టాలు జారీ చేయటంతో భూమి ధర చెల్లింపుకు గాను ఖజానాపై అదనపు భారం పడటానికి కారణమైంది.

(iii) ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడాలని, ఆక్రమణల తొలగింపునకు[197] సంబంధించిన విధానాన్ని అనుసరించాలని ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ చట్టం, 1905 నిర్దేశిస్తుంది.

6,944.79 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనప్పటికీ, 2010-11 నుండి 2017-18 వరకు ఆక్రమణదారులపై లేదా వారి తొలగింపుకు సంబంధించి శాఖ తీసుకున్న చర్యలు ఆడిట్ కు సమర్పించిన రికార్డుల నుంచి లభ్యం కాలేదు.

2010-11, 2020-21 మధ్య 8,185.27 ఎకరాల ప్రభుత్వ భూమికి డి-పట్టాలు జారీ చేయబడ్డాయని, 1,838.64 ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించబడిందని, మొత్తం 10,023.91 ఎకరాల భూమికి ₹619.83 కోట్ల[198] పరిహారం చెల్లించబడిందని ఆ శాఖ సమాధానం ఇచ్చింది (2023 మే). మిగిలిన ప్రభుత్వ భూముల సమన్వయ ప్రక్రియ పురోగతిలో ఉందని ఆ శాఖ పేర్కొంది.

1908 నుంచి 1920 మధ్య రూపొందించిన రెవెన్యూ రికార్డుల్లో భూముల వర్గీకరణ ప్రకారం జల వనరుల శాఖ భూ ప్రణాళిక షెడ్యూళ్లను సమర్పించిందని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 నవంబర్). జల వనరుల శాఖ సమర్పించిన భూ ప్రణాళిక షెడ్యూళ్లలో తదుపరి భూమి కేటాయింపులు, ఆక్రమణలు పరిగణనలోకి తీసుకోలేదు. భూమి యొక్క టైటిల్/యాజమాన్య హక్కు ధృవీకరించడానికి భూసేకరణ అధికారులు, సర్వే, సంబంధిత స్థానిక రెవెన్యూ శాఖ సంయుక్తంగా తనిఖీ నిర్వహించారు. భూ వర్గీకరణను నిర్ధారించుకోవడానికి, తుది గణాంకాలను లెక్కించడానికి భూసేకరణ అధికారులు జల వనరుల శాఖతో పాటు సేకరించాల్సిన భూమి కోసం సమన్వయ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. అందువల్ల, అసైన్డ్ భూమి, ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమి యొక్క విస్తీర్ణాన్ని రెండవ సవరించిన వ్యయ అంచనాకి సమర్పించారు (2017). ప్రస్తుత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, భూమి మార్కెట్ విలువకు సమానమైన పరిహారాన్ని భూమి కేటాయించిన వారికీ, ఆక్రమణదారులకూ చెల్లించాలని కూడా పేర్కొన్నారు.

దీనిని బట్టి కేటాయింపు (అసైన్ మెంట్) జరిగిన వెంటనే రెవెన్యూ రికార్డులు నవీకరించబడలేదని స్పష్టంగా తెలుస్తుంది. ఫలితంగా వర్గీకరణ వారీగా గణాంకాలను, వాటి ఖర్చును ఒకటవ సవరించిన వ్యయ అంచనాలలో తప్పుగా నివేదించారు, దీనిని రెండవ సవరించిన వ్యయ అంచనాలో సరిదిద్దారు. ఇంకా, ఆక్రమణలను నిరోధించడంలోనూ, ఆక్రమణదారుల తొలగింపులోనూ శాఖ సకాలంలో చర్యలు తీసుకోవడంలో విఫలమైంది, ఫలితంగా ప్రాజెక్టు పనులకు ఎక్కువ సమయం పట్టడంతో పాటు, చెల్లించాల్సిన పరిహారం రూపంలో ప్రభుత్వంపై ₹619.83 కోట్ల నివారించదగిన ఆర్థిక భారం పడింది.

***సిఫార్సు 5.2: రాష్ట్ర ప్రభుత్వం తన భూమిని ఆక్రమణల నుండి రక్షించుకోవడానికి సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, 'ముంపుకు గురయ్యే ప్రాంతం' అని ప్రకటించిన తర్వాత అదే భూమిని తిరిగి సేకరించినందుకు పరిహారం చెల్లించకుండా ఉండటానికి భూమి లేనివారికి ఆ భూమిని కేటాయించకుండా ఉండాలి.***

---

[197] ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ చట్టం 1905లోని సెక్షన్ 6, 7ఏ ప్రకారం నోటీసులు జారీ చేయడం ద్వారా

[198] డీ పట్టా భూమికి ₹ 619.30 కోట్లు, ఆక్రమణలకు ₹0.53 కోట్లు

### 5.2.4 భూ మదింపు సమాచారంలో వైరుధ్యం

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ నియమాలు, 2014 లోని నియమం 3 ప్రకారం, ప్రభుత్వం కోసం భూసేకరణ జరిగితే, అభ్యర్థనను సంబంధిత శాఖ కార్యదర్శి లేదా అధీకృత వ్యక్తి దాఖలు చేయాలి. అవసరమైన భూసేకరణకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేసిన తరువాత, జిల్లా కలెక్టర్ చేత అధికారం పొందిన అధికారి సేకరణకు ప్రతిపాదించిన భూమి యొక్క ప్రాథమిక సర్వేను నిర్వహిస్తారు. ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి 12 నెలలలో జిల్లా కలెక్టర్ భూసేకరణ అవార్డును జారీ చేయాలి.

పూర్వపు పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లోని 15 ఆవాస ప్రాంతాలు/గ్రామాల భూసేకరణ రికార్డులను పరిశీలించినప్పుడు జల వనరుల శాఖ అభ్యర్థించిన భూమి (అంటే భూ ప్రణాళిక షెడ్యూళ్ళు) ప్రకారం, సర్వే రిపోర్టులు లేదా భూసేకరణ అవార్డు (రెవెన్యూ రికార్డులు)ల ప్రకారం భూమి విస్తీర్ణం, వర్గీకరణలో వ్యత్యాసాలు ఉన్నట్లు తేలింది. గుర్తించిన వ్యత్యాసాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

(i) జల వనరుల శాఖ భూ ప్రణాళిక షెడ్యూళ్ల ప్రకారం, పట్టా భూమి విస్తీర్ణం[199] (***అనుబంధం 5.2 (అ)***లో వివరించిన విధంగా) 10,050.11 ఎకరాలు కాగా, రెవెన్యూ శాఖ సర్వే రికార్డుల ప్రకారం మొత్తం విస్తీర్ణం 9,008.33 ఎకరాలు. ఇంకా, రెవెన్యూ రికార్డులతో పోలిస్తే భూ ప్రణాళిక షెడ్యూళ్ళలో పట్టా భూముల విస్తీర్ణాన్ని 11 గ్రామాల్లో[200] ఎక్కువగా, నాలుగు గ్రామాల్లో[201] తక్కువగా చూపించారు.

(ii) జల వనరుల శాఖ భూ ప్రణాళిక షెడ్యూళ్ల ప్రకారం, ప్రభుత్వ భూమి విస్తీర్ణం (***అనుబంధం 5.2 (ఆ)***లో వివరించిన విధంగా) 3,885.64 ఎకరాలు కాగా, రెవెన్యూ శాఖ[202] సర్వే రికార్డుల ప్రకారం మొత్తం విస్తీర్ణం 3,186.40 ఎకరాలు. ఇంకా, జల వనరుల శాఖ రికార్డులతో పోల్చినప్పుడు ఆరు[203] గ్రామాలకు సంబంధించి సర్వే రికార్డుల్లో ప్రభుత్వ భూమి విస్తీర్ణం 1,306 ఎకరాలు తక్కువగా చూపబడింది, మరో ఆరు[204] గ్రామాల్లో 1,880.40 ఎకరాలు ఎక్కువగా చూపబడింది. మిగిలిన మూడు[205] గ్రామాలకు సంబంధించి ప్రభుత్వ భూముల వివరాలు రెవెన్యూ శాఖ వద్ద అందుబాటులో లేవు.

(iii) జల వనరుల శాఖ భూ ప్రణాళిక షెడ్యూళ్ల ప్రకారం, డి-పట్టా భూమి విస్తీర్ణం (***అనుబంధం 5.2 (ఇ )***లో వివరించిన విధంగా) సున్నా కాగా, రెవెన్యూ శాఖ సర్వే రికార్డుల ప్రకారం మొత్తం విస్తీర్ణం 3,177.29 ఎకరాలుగా చూపబడింది.

అందువల్ల, భూ సమాచారంలోని వ్యత్యాసాల కారణంగా, వ్యక్తులకు పరిహారం తప్పుగా చెల్లించే అవకాశం ఉంది.

జల వనరుల శాఖ, రెవెన్యూ రికార్డుల ప్రకారం భూ ప్రణాళిక షెడ్యూళ్లను సమర్పించిందని, భూమి వర్గీకరణను నిర్ధారించడానికి, తుది గణాంకాలను లెక్కించడానికి స్థానిక రెవెన్యూ, సర్వే విభాగం జల వనరుల శాఖతో కలిసి భూ రికార్డుల సమన్వయ ప్రక్రియను చేపట్టిందని, ఇది పురోగతిలో ఉందని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 ఆగస్టు).

---

[199] ఒక వ్యక్తికి లేదా సంస్థకు ప్రభుత్వం జారీ చేసిన భూమి దస్తావేజు రకం

[200] నార్లవరం, తిరుమలపురం, రేపాకగొమ్ము, గానుగులగొండి, మడిపల్లి, సరుగుడు, కొయిదా, తాట్కూరుగొమ్ము, పూడిపల్లి, ఏనుగులగూడెం, కొండ్రుకోట

[201] యర్రవరం, తెల్ల దిబ్బలు, శివగిరి ఆవాసాలు, చిగురుమామిడి రెవెన్యూ గ్రామం

[202] ప్రభుత్వ భూమికి పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదు కాబట్టి, భూసేకరణ అవార్డులను తయారు చేసేటప్పుడు దానిని పరిగణనలోకి తీసుకోలేదు

[203] నార్లవరం, తిరుమలాపురం, రేపాకగొమ్ము, గానుగులగొండి, మడిపల్లి, ఏనుగులగూడెం

[204] సరుగుడు, యర్రవరం, కొయిదా, చిగురుమామిడి, తాట్కూరుగొమ్ము, పూడిపల్లి

[205] కొండ్రుకోట గ్రామం, తెల్లదిబ్బలు, శివగిరి ఆవాసాలు

ప్రాజెక్టు ప్రకటించిన 18 సంవత్సరాల తరువాత కూడా భూమి వర్గీకరణ పూర్తిగా నవీకరించబడలేదని సమాధానం నుండి స్పష్టంగా తెలుస్తుంది. భూమి వర్గీకరణ అంచనాలో జాప్యం, భూ యజమానులకు పరిహారం చెల్లింపులోనూ, భారత ప్రభుత్వం నుండి భూసేకరణ ఖర్చులను తిరిగి పొందడంలోనూ సమస్యలకు దారితీయవచ్చు.

### 5.2.5 ప్రిలిమినరీ నోటిఫికేషన్ ను ప్రచురించడంలోనూ, ప్రభుత్వ వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయడంలోనూ విపరీతమైన జాప్యం

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 11, భూసేకరణ చట్టం 1894 లోని సెక్షన్ 4ల ప్రకారం, ఏదైనా ప్రజా ప్రయోజనం కోసం ఏదైనా ప్రాంతంలో భూమి అవసరమని లేదా అవసరమయ్యే అవకాశం ఉందని సంబంధిత ప్రభుత్వానికి అనిపించినప్పుడల్లా, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో సేకరించాల్సిన భూమి వివరాలతో పాటు ఆ మేరకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ ప్రభుత్వ అధికారిక వెబ్ సైట్‌లో ప్రచురించాలి. ఇంకా, ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013లోని సెక్షన్ 19 ప్రకారం, ఆ మేరకు ఒక ముసాయిదా ప్రకటనను రూపొందించి దానిని ప్రభుత్వ వెబ్ సైట్‌లో పొందుపరచాలి.

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 4, సెక్షన్ 7ల ప్రకారం, అవసరమైన భూమిని సేకరించడానికి, సామాజిక ప్రభావ అంచనా ప్రారంభమైన ఎనిమిది నెలల్లోపు ప్రిలిమినరీ నోటిఫికేషన్ ను జారీచేయాలి. అయితే, భూసేకరణ కేసులకు సంబంధించి సామాజిక ప్రభావ అంచనా ప్రారంభ తేదీలు అందుబాటులో లేనందున, ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీకి తీసుకున్న సమయాన్ని లెక్కించడానికి భూ ప్రణాళిక షెడ్యూళ్లను అందుకున్న తేదీని తీసుకున్నారు.

ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీకి, ముసాయిదా ప్రకటనను జారీ చేయటానికి సంబంధిత శాఖకు పట్టిన సమయాన్ని ధ్రువీకరించడానికి ప్రాజెక్టు మొదటి దశ క్రింద మునిగిపోయిన 123 ఆవాసాలలో 30 ఆవాసాల (24 శాతం) కు సంబంధించిన భూసేకరణ కేసులను ఆడిట్ పరిశీలించింది[206].

ఆడిట్ ఈ క్రింది విషయాలను గమనించడమైంది:

(i) భూ ప్రణాళిక షెడ్యూళ్ళు అందిన తర్వాత ప్రిలిమినరీ నోటిఫికేషన్ ప్రచురణకు నిర్దిష్ట సమయపాలనలు నిర్దేశించబడలేదు. 2006 సెప్టెంబర్, 2016 ఏప్రిల్ మధ్య కాలంలో 20 ఆవాసాల/గ్రామాల[207] విషయంలో, భూ ప్రణాళిక షెడ్యూళ్ళు అందుకున్న తేదీ నుండి ప్రిలిమినరీ నోటిఫికేషన్ ప్రచురణల మధ్య 13 నుండి 99 నెలల (***అనుబంధం 5.3*** లో వివరించిన విధంగా) కాల వ్యవధి ఉంది. ఇది చివరకు సేకరించిన భూమికి ముసాయిదా ప్రకటన, అవార్డు మంజూరు చేయటంలో జాప్యానికి దారితీసింది.

(ii) ప్రిలిమినరీ నోటిఫికేషన్ నుంచి ముసాయిదా ప్రకటన వరకు మొత్తం భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వ వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఈ చట్టం నిర్దేశిస్తుంది. అయితే ప్రిలిమినరీ నోటిఫికేషన్, ముసాయిదా ప్రకటన, ఆమోదించబడిన భూసేకరణ అవార్డుల వివరాలను ప్రభుత్వ వెబ్ సైట్‌లో పొందుపరచలేదు.

ప్రభుత్వ అధికారిక వెబ్ సైట్‌లో భూసేకరణ వివరాలను పొందుపరచకపోవడం వల్ల ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత లోపిస్తుంది.

2006లోనే రెవెన్యూ శాఖకు భూ ప్రణాళిక షెడ్యూళ్ళు ఇచ్చినప్పటికీ, భూసేకరణ యూనిట్లలో సిబ్బంది కొరత కారణంగా భూసేకరణ ప్రక్రియను మూడు నుండి నాలుగు విడతల్లో చేపట్టామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 నవంబర్). ప్రాజెక్టు మొదటి దశను 2026 మార్చి నాటికి పూర్తి చేయాలని భారత ప్రభుత్వం గడువు విధించిందని ఒక సంవత్సరం పొడిగింపుకు అవకాశం ఉందని కూడా సమాధానమిచ్చింది. ఆర్&ఆర్ కాలనీలకు,

[206] సాధారణ యాదృచ్ఛిక నమూనా పద్ధతి ద్వారా ఎంపిక చేయబడింది

[207] కొవ్వూరు, ఏలూరు, రాజమహేంద్రవరం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ) కార్యాలయాల క్రింద

మొదటి దశ క్రింద 'భూమికి-భూమి' గాను అవసరమైన భూసేకరణ వరుసగా 2025 మే, 2025 డిసెంబర్ నాటికి పూర్తవుతాయి. భూసేకరణ ఆటోమేషన్ ప్రభుత్వ స్థాయిలో పరిశీలనలో ఉంది, ఆన్‌లైన్ మాడ్యూల్ ప్రక్రియ రెండు నెలల్లో పూర్తవుతుంది. ఇంకా, ఆన్‌లైన్ మాడ్యూల్ 'భూసేకరణ, పునరావాసం & పునరుపాధి కల్పన మాడ్యూల్ ఈ-ఎల్ఏఆర్ఆర్ఎం)' పురోగతిలో ఉందని, దీనిని పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని తెలిపింది.

అందువల్ల, ప్రిలిమినరీ నోటిఫికేషన్ ప్రచురణలో విపరీతమైన జాప్యం వలన, భూసేకరణ, ఆర్&ఆర్ ప్రక్రియలో జాప్యం జరిగింది. ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 అమలులోకి వచ్చి దశాబ్దం గడిచినా భూసేకరణ, ఆర్&ఆర్ ఆటోమేషన్ ప్రక్రియ ఇంకా పురోగతిలో ఉంది (2024 నవంబర్ నాటికి). ఫలితంగా ప్రజలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందుకోలేకపోయారు.

## 5.3 భూసేకరణ అవార్డుల ప్రకటన, ఆమోదం

ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ, సర్వే జరిగిన తర్వాత, వాటిపై ఏవైనా అభ్యంతరాలు/ఫిర్యాదులు ఉంటే భూసేకరణ అధికారులు వాటిని పరిష్కరించిన తర్వాత, ప్రిలిమినరీ నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి 12 నెలల లోపు ముసాయిదా ప్రకటనను ప్రచురించాలని ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 నిర్దేశిస్తుంది. అయితే, ఒకవేళ పొడిగించాల్సిన పరిస్థితులు ఉన్నయని భావిస్తే, సంబంధిత ప్రభుత్వం 12 నెలల వ్యవధిని పొడిగించే అధికారం కలిగి ఉంది. భూసేకరణ అవార్డుల ప్రకటన, ఆమోదం యొక్క దశలు క్రింద చూపించబడ్డాయి.

| | |
|---|---|
| తుది ప్రకటన | • ప్రిలిమినరీ నోటిఫికేషన్ తేదీ నుండి 12 నెలల్లోపు సెక్షన్ 19 కింద ప్రకటన |
| అభ్యంతరాల పరిష్కారం | • సెక్షన్ 21 కింద పబ్లిక్ నోటీసు పై లేవనెత్తిన అభ్యంతరాల పరిష్కారం |
| భూసేకరణ అవార్డు | • ప్రకటన తేదీ నుండి 12 నెలల్లోపు సెక్షన్ 25 కింద తుది అవార్డును ఆమోదించడం |

క్రింది పేరాల్లో చర్చించినట్లుగా ప్రకటనలు, భూసేకరణ అవార్డులలో జాప్యాలు, వ్యత్యాసాలను ఆడిట్ గమనించింది.

### 5.3.1 సరైన యాజమాన్య రికార్డులు లేకుండానే భూసేకరణ అవార్డుల ఆమోదం

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 3 ప్రకారం, 'భూ యజమాని' అంటే అసైన్డ్ భూమితో సహా రాష్ట్రంలోని ఏదైనా చట్టం ప్రకారం భూమిపై పట్టా హక్కులు పొందడానికి అర్హత ఉన్న వ్యక్తి. సెక్షన్ 77(1) ప్రకారం, సెక్షన్ 30 క్రింద అవార్డు ఇచ్చిన తర్వాత, జిల్లా కలెక్టర్ అవార్డు ప్రకారం హక్కు ఉన్న వ్యక్తులకు, ఆ మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం ద్వారా చెల్లించాలి.

ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) కొవ్వూరు, ఆమోదించిన భూసేకరణ అవార్డుల పరిశీలనలో, కొండ్రుకోట గ్రామంలో 90.95 ఎకరాల భూమిని కలిగి ఉన్న 79 మంది లబ్ధిదారుల పేర్లు, వారి ఆధీనంలో ఉన్న భూమి విస్తీర్ణం యొక్క సర్వే నంబర్లతో సహా ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ) రాజమహేంద్రవరం ప్రకటించిన భూసేకరణ అవార్డులలో (2010 అక్టోబర్, 2011) చేర్చబడ్డాయని తేలింది (***అనుబంధం 5.4*** లో వివరించబడ్డాయి).

రెవెన్యూ రికార్డుల (ఫెయిర్ అడంగల్, ఆర్ఎస్ఆర్ (రెవెన్యూ సర్వే రికార్డులు))లో పేర్కొన్న సర్వే నంబర్లతో పోలిస్తే 79 మంది లబ్ధిదారుల పేర్లు లేవని ఆడిట్ గమనించింది. అలాగే, సంబంధిత సర్వే నంబర్లలో పేర్కొన్న వ్యక్తుల యాజమాన్య హక్కును నిర్ధారించడానికి పట్టాదారు పాస్ పుస్తకాలు (పిపిబి)తో పాటు మరే ఇతర సహాయక

పత్రాలను శాఖ అందించలేదు. సరైన యాజమాన్య రికార్డులు[208] లేకపోవడం, ఈ లబ్ధిదారులు భూమికి-భూమి బదులుగా నగదును ఎంచుకున్నందున, యాజమాన్య హక్కు వాస్తవికత సందేహాస్పదంగా ఉంది.

కుకునూరు, వేలేరుపాడు మండలాల తహశీల్దార్ వద్ద అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డుల ఆధారంగా అప్పటి భూసేకరణ అధికారి భూసేకరణ అవార్డులను ఆమోదించారని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 నవంబర్). మిగిలిన లబ్ధిదారులు టైటిల్ డీడ్‌లు, పట్టాదారు పాస్ పుస్తకాలు సమర్పించిన తర్వాత అప్పటి భూసేకరణ అధికారి ధ్రువీకరించిన తర్వాత నిజమైన యజమానికి 2008, 2010 సంవత్సరాల్లో పరిహారం చెల్లించబడింది/ఆర్&ఆర్ ప్రయోజనాలు అందించబడ్డాయి.

ఇప్పటికే ఆర్&ఆర్ ప్రయోజనాలు/పరిహారం పొందిన/ఇంకా పొందవల్సిన 79 మంది లబ్ధిదారుల యాజమాన్య హక్కు రికార్డులు/ టైటిల్ డీడ్‌లను సమర్పించడంలో శాఖ విఫలమైనందున సమాధానం ఆమోదయోగ్యం కాదు.

సరైన యాజమాన్య హక్కు రికార్డులు/పత్రాలు పొందకుండా/ధ్రువీకరించకుండా భూసేకరణ అవార్డులను ఆమోదించడం, సేకరించిన భూమి యొక్క యజమానుల ఖచ్చితత్వాన్ని ధ్రువీకరించడానికి అవసరమైన టైటిల్ డీడ్‌లు/యాజమాన్య రికార్డులను సేకరించడంలో భూసేకరణ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని సూచిస్తుంది.

## 5.4 అవార్డు పరిహారం చెల్లింపు

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 38 ప్రకారం, భూసేకరణ అవార్డులను ఆమోదించిన తర్వాత, భూసేకరణ అవార్డు పరిహారం, అవార్డు తేదీ నుండి మూడు నెలల్లోపు సేకరించిన భూమి లేదా భవనానికి అనుబంధంగా ఉన్న భూమి లేదా ఇతర స్థిరాస్తి లేదా ఆస్తులకుగాను ఆస్తులు ఉన్న అన్ని పక్షాలకు చెల్లించబడుతుంది. చెల్లింపుకు సంబంధించి ఏవైనా వివాదాలు తలెత్తితే, ఆ మొత్తాన్ని ఎల్ఏ & ఆర్ఆర్ అథారిటీ[209] ఖాతాలో జమ చేయాలి. ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్లు 26 నుండి 30 వరకు అసైన్డ్ భూ యజమానులతో సహా 'ఆసక్తిగల భూ యజమానులకు' పరిహారం యొక్క క్రింది భాగాలు చెల్లింపును నిర్దేశిస్తాయి.




208 ఫెయిర్ అడంగల్, టైటిల్ డీడ్, పట్టాదారు పాస్‌బుక్‌లు, పన్ను రశీదులు మొదలైనవి

209 ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 51 ప్రకారం, భూ సేకరణ, పునరావాసం & పునరుపాధి కల్పన అథారిటీ ఏర్పాటు చేయబడింది

### 5.4.1 చట్టం నిబంధనలను తప్పుగా వ్యాఖ్యానించడంవల్ల అధికంగా నిర్ణయించబడిన భూ పరిహారం

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 30(3) ప్రకారం, భూమి యొక్క మార్కెట్ విలువకు[210] (సెక్షన్ 26 క్రింద) అదనంగా, జిల్లా కలెక్టర్, ప్రతి సందర్భంలోనూ, సామాజిక ప్రభావ మదింపు అధ్యయనం యొక్క ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి భూసేకరణ అవార్డు వెలువడిన తేదీ లేదా భూమిని స్వాధీనం చేసుకున్న తేదీ, ఏది ముందు అయితే ఆ కాలానికి అటువంటి మార్కెట్ విలువపై సంవత్సరానికి 12 శాతం[211] చొప్పున మొత్తాన్ని మంజూరు చేయాలి.

దేవీపట్నం మండలంలోని తొయ్యేరు, దండంగి గ్రామాలకు, పోలవరం మండలంలోని తూటిగుంట, శివగిరి గ్రామాలకు సంబంధించిన భూమి పరిహార అవార్డు మొత్తాన్ని శాఖ, ***పట్టిక 5.4*** లో చూపిన విధంగా, (2014 సెప్టెంబర్, 2015 మే మధ్య) 'మార్కెట్ విలువ'పై కాకుండా గుణించిన మార్కెట్ విలువపై[212] సంవత్సరానికి 12 శాతం అదనపు మార్కెట్ విలువ (ఏఎంవీ)ను లెక్కించినట్లు ఆడిట్ గమనించింది.

**పట్టిక 5.4: అదనపు మార్కెట్ విలువపై వడ్డీని తప్పుగా లెక్కించడం**

| క్రమ సంఖ్య | ఆవాసం పేరు | అవార్డు సంఖ్య | పిఎన్, అవార్డు మధ్య రోజుల సంఖ్య | భూమి విస్తీర్ణం (ఎకరాల్లో) | ఎకరానికి భూమి మార్కెట్ విలువ (₹ లో) | అదనపు మార్కెట్ విలువ (₹ కోట్లలో) | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | చెల్లించాల్సింది | వాస్తవంగా చెల్లించింది | అధికంగా చెల్లించింది |
| (అ) | (ఆ) | (ఇ) | (ఈ) | (ఉ) | (ఊ) | (ఎ) | (ఏ) | (ఐ)=(ఏ)-(ఎ) |
| 1. | తొయ్యేరు-బ్లాక్-2 | 01/2015 | 1,852 | 223.58 | 1,50,000 | 2.04 | 3.06 | 1.02 |
| 2. | తొయ్యేరు-బ్లాక్-2 | 02/2015 | 1,852 | 77.60 | 1,50,000 | 0.71 | 1.06 | 0.35 |
| 3. | తొయ్యేరు-బ్లాక్-3 | 08/2015 | 1,772 | 175.31 | 2,50,000 | 2.55 | 3.83 | 1.28 |
| 4. | దండంగి-బిట్-4 | 04/2015 | 1,028 | 59.06 | 2,50,000 | 0.50 | 0.75 | 0.25 |
| 5. | దండంగి-బిట్-4 | 03/2015 | 1,028 | 121.76 | 2,50,000 | 1.03 | 1.54 | 0.51 |
| 6. | తూటిగుంట గ్రామం | 189/2012 | 848 | 110.99 | 2,50,000 | 0.77 | 1.16 | 0.39 |
| 7. | శివగిరి | 11/2013 | 538 | 25.88 | 2,50,000 | 0.11 | 0.17 | 0.06 |
| మొత్తం | | | | | | | | 3.86 |

*మూలం: శాఖ అందించిన సమాచారం*

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 30(3)ను తప్పుగా అన్వయించడం వల్ల అదనపు మార్కెట్ విలువను (ఏఎంవీ) తప్పుగా లెక్కించడానికి దారితీసింది, ఫలితంగా ₹3.86 కోట్ల అదనపు పరిహారం చెల్లించాల్సి వచ్చింది.

గుణించిన మార్కెట్ విలువపై కాకుండా మార్కెట్ విలువపై మాత్రమే 12 శాతం అదనపు మార్కెట్ విలువ వర్తింపజేయడం గురించి స్పష్టత జారీ చేయబడిందని (2015 సెప్టెంబర్), అప్పటి నుండి అదనపు మార్కెట్ విలువ గుణించిన మార్కెట్ విలువపై కాకుండా మార్కెట్ విలువపై మాత్రమే లెక్కించబడిందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు).

ముగింపు సమావేశంలో, ప్రభుత్వం పరిశీలనను అంగీకరించింది, దీనికి సంబంధించి వివరణ (2015) జారీ అయ్యే వరకు తప్పుగా అన్వయించడం, చెల్లించడం జరిగాయని పేర్కొంది (2024 నవంబర్).

---

210 భూమి యొక్క మార్కెట్ విలువ అనేది సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే రికార్డుల ప్రకారం భూమి యొక్క అంచనా విలువ.

211 (మార్కెట్ విలువ x 12 శాతం) X (ముసాయిదా ప్రకటన నుండి భూ సేకరణ అవార్డు వరకు గల రోజుల సంఖ్య)/365

212 1.5 యొక్క గుణకార కారకం x భూమి యొక్క మార్కెట్ విలువ

ప్రభుత్వం నుండి స్పష్టత వచ్చే వరకు చట్టంలోని నిబంధనలను శాఖ తప్పుగా అన్వయించడం వల్ల ఖజానాపై అదనపు భారం పడిందని సమాధానం ధృవీకరిస్తుంది. అయితే, చెల్లించిన అదనపు మొత్తాన్ని వసూలు చేయలేదు.

### 5.4.2 పరిహార మొత్తాన్ని అథారిటీ ఖాతాలో జమ చేయడం

ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 77(2) ప్రకారం, పరిహారం పొందడానికి అర్హుడైన వ్యక్తి దానిని స్వీకరించడానికి అంగీకరించకపోతే, లేదా అర్హుడైన వ్యక్తి లేకపోతే, లేదా పరిహారం పొందే హక్కుకు సంబంధించి లేదా దాని విభజనకు సంబంధించి ఏదైనా వివాదం ఉంటే, జిల్లా కలెక్టర్ పరిహారం మొత్తాన్ని భూసేకరణ, ఆర్&ఆర్ అథారిటీ ఖాతాలో జమ చేయాలి. అథారిటీ ఫిర్యాదులను పరిష్కరించి చెల్లింపులు చేసే ఒక పాక్షిక-న్యాయ సంస్థ.

#### 5.4.2.1 అథారిటీ పద్దుల రికార్డులను నిర్వహించకపోవడం

కొవ్వూరు, రాజమహేంద్రవరం, ఏలూరు లోని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) కార్యాలయాలలో, వివాదాస్పద/వ్యాజ్యాస్పదమైన కేసులకు సంబంధించిన ₹27.38 కోట్ల పరిహారం మొత్తాన్ని (2015, 2023 మధ్య) అథారిటీ ఖాతాలో జమ చేశారని, ***పట్టిక 5.5*** లో వివరించిన విధంగా ఎటువంటి పరిష్కారం లేకుండా ఒకటి నుండి ఎనిమిది సంవత్సరాల పాటు (2023 మార్చి నాటికి) ఆ మొత్తాలు ఖాతాలో పడి ఉన్నాయని ఆడిట్ గమనించింది.

**పట్టిక 5.5: సంవత్సరాల వారీగా అథారిటీ ఖాతాలో జమ చేసిన మొత్తం**

| జమ చేసిన సంవత్సరం | అథారిటీ ఖాతాలో జమ చేసిన మొత్తం (₹ లో) |
|---|---|
| 2015 | 19,66,441 |
| 2016 | 20,87,926 |
| 2017 | 80,81,747 |
| 2018 | 1,49,61,996 |
| 2019 | 24,55,11,229 |
| 2022 | 11,54,306 |
| **మొత్తం** | **27,37,63,645** |

*మూలం: స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు (భూసేకరణ) అందించిన సమాచారం.*

ఇంకా, అథారిటీ ఖాతాలో మొత్తాన్ని జమ చేయడానికి గల కారణాలతో పాటు కేసుల వివరాలు శాఖ వద్ద అందుబాటులో లేవు. వివాదాస్పద కేసుల పరిహార మొత్తాలను డ్రా చేయడం, పంపిణీ చేయడానికి సంబంధించిన రికార్డులు/పద్దులను జల వనరుల శాఖ సమర్పించలేదు.

వివరాలు లేనందున, అథారిటీ ఖాతాలో జమ చేయబడిన లబ్ధిదారుల వారీగా మొత్తాల వివరాలను, అర్హత కలిగిన లబ్ధిదారునికి ఆ మొత్తాలను బదిలీ చేయకపోవడానికి గల కారణాలను ఆడిట్ ధ్రువీకరించలేకపోయింది.

చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఎల్ఏ & ఆర్ఆర్ అథారిటీ పరిష్కరించిన కేసులకు సంబంధించి జమ చేసిన మొత్తాన్ని భూ యజమానులకు త్వరితగతిన చెల్లించడానికి తదనంతర ప్రణాళికలు లేకపోవడాన్ని ఇది సూచిస్తుంది.

ఇంతకు ముందు వివాదాస్పద మొత్తాలను మొదట భూసేకరణ అధికారి ఖాతాలో జమ చేశామని, ఆ తర్వాత చెక్కుల ద్వారా ఎల్ఏ & ఆర్ఆర్ అథారిటీ ఖాతాకు బదిలీ చేశామని, కొన్ని అవకతవకలు జరిగినట్లు గుర్తించడంతో వివాదాస్పద మొత్తాలను నేరుగా సంబంధిత ఎల్ఏ & ఆర్ఆర్ అథారిటీ పర్సనల్ డిపాజిట్ ఖాతాలో జమ చేయాలని ఆదేశాలు జారీ చేశామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 నవంబర్). తదనంతరం, సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థలో ఒక ప్రత్యేక మాడ్యూల్ రూపొందించి, దీనిలో వివాదాస్పద కేసులకు సంబంధించి బిల్లులను లేవనెత్తడానికి ముందు వివాదాస్పద మొత్తాలను నేరుగా ఎల్ఏ & ఆర్ఆర్ అథారిటీకి జమ చేశారు, అందువల్ల జాప్యం జరిగిందన్నారు.

అర్హత కలిగిన లబ్ధిదారుల ఖాతాకు మొత్తాలను బదిలీ చేయకపోవడం లేదా ప్రభుత్వ ఖాతాకు మొత్తాన్ని తిరిగి చెల్లించకపోవడం గురించి ప్రభుత్వం సమాధానమివ్వలేదు.

### 5.4.2.2 వివాదాస్పద మొత్తాలను అనర్హులైన భూ యజమానులకు చెల్లించడం

ఇందిరాసాగర్ పోలవరం హెడ్ వర్క్స్ (ఐఎస్ పీహెచ్ డబ్ల్యూ) డివిజన్ -5, సీతానగరం యొక్క కార్యనిర్వాహక ఇంజనీర్, ముంపునకు గురైన 859.68 ఎకరాల[213] భూసేకరణకు భూ ప్రణాళిక షెడ్యూళ్లను సమర్పించారు (2009). అయితే, అప్పటి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, భూసేకరణ, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, 859.68 ఎకరాల భూసేకరణకు అవార్డులను (2015 నుంచి 2017 వరకు వివిధ సందర్భాల్లో) ఆలస్యంగా ఆమోదించి ₹55.87 కోట్ల పరిహారం మంజూరు చేసారు.

ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ,) రాజమహేంద్రవరం ఆదేశాల ప్రకారం, ₹55.87 కోట్లలో ₹33.87 కోట్లు ఇతర సివిల్ అప్పీల్/సెటిల్‌మెంట్ కేసులు, టైటిల్ వివాదాల కారణంగా విశాఖపట్నంలోని అథారిటీ ఖాతాలో జమ చేసారు. భూమి యాజమాన్య విషయంలో గిరిజనులు, గిరిజనేతరుల మధ్య అనేక వివాదాలు ఉన్నందున మిగిలిన ₹22 కోట్లను కూడా అథారిటీ ఖాతాలో జమ చేయాల్సి ఉంది.

ఈ మొత్తాన్ని అథారిటీ ఖాతాలో జమ చేయాలని గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాలు, భూసేకరణ అధికారి ఆమోదించిన అవార్డులోనూ ఆదేశాలు ఉన్నప్పటికీ,

(అ) అప్పటి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), చింతూరు, ఈ మొత్తాన్ని అథారిటీ ఖాతాకు జమ చేయకుండా, టైటిల్ తీర్పు పెండింగ్‌లో ఉన్న భూమికి తొమ్మిది మంది గిరిజనేతర రైతులకు ₹4.81 కోట్లు చెల్లించారు.

(ఆ) ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం యొక్క అదనపు బాధ్యతను నిర్వర్తిస్తున్న అప్పటి ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, అథారిటీ ఖాతాకు జమ చేయవలసిన మొత్తాల నుండి 18 మంది అనర్హులైన (గిరిజనేతర) రైతులకు ₹14.71 కోట్ల చెల్లింపులు చెల్లించటాన్ని ఆడిట్ గుర్తించింది.

ఫలితంగా, అనర్హులైన 27 మంది భూస్వాములకు ₹19.52 కోట్ల[214] అనధికార/అక్రమ చెల్లింపు (2019 జూలై, 2022 జనవరి, ఫిబ్రవరి మధ్య) జరిగింది. ఆయా వ్యక్తుల నుండి ఆ మొత్తాన్ని వసూలు చేసేందుకు ప్రతిపాదించిన చర్యలు, తప్పు చేసిన అధికారులపై తీసుకున్న చర్యలు రికార్డుల్లో లేవు.

ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, వివరణాత్మక విచారణ నివేదికను భూ పరిపాలన ప్రధాన కమీషనర్ (సీసీఎల్ఏ)కు సమర్పించారు (2022 జూలై), ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని నిబంధనల ప్రకారం, అనర్హులైన రైతుల నుండి మొత్తాన్ని వసూలు చేయాలని, తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత జిల్లా కలెక్టర్లను అభ్యర్థించారు. తప్పు చేసిన అధికారులపై, తప్పుడు క్లెయిమ్‌పై డబ్బు అందుకున్న 27 మంది సభ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేయబడింది (2022 ఆగస్టు). 27 మంది సభ్యులలో ఇద్దరు గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కేసు దాఖలు చేశారు (2022 అక్టోబర్/నవంబర్). పిటిషనర్ల అభ్యర్థన మేరకు కఠిన చర్యలను తాత్కాలికంగా నిలిపివేయాలని పేర్కొంటు గౌరవ న్యాయస్థానం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది.

ఆ తరువాత కేసు పరిష్కారానికి, అనర్హుల నుండి ₹19.52 కోట్ల మొత్తాన్ని తిరిగి పొందడానికి శాఖ ఎటువంటి చర్య తీసుకోలేదని ఆడిట్ గమనించింది.

[213] దేవీపట్నం మండలం కొండమొదలు గ్రామంలో సర్వేనెం.1 నుంచి 109 లో గల పట్టా భూములు

[214] తొమ్మిది మంది గిరిజనేతర రైతులకు ₹4.81 కోట్లు, 18 మంది గిరిజనేతర రైతులకు ₹14.71 కోట్లు చెల్లించబడ్డాయి (2019 జూలై)

27 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, రెవెన్యూ రికవరీ చట్టం, 1884లోని నిబంధనలను అమలు చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆదేశించారని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 నవంబర్). ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం, ₹19.52 కోట్ల భూ పరిహార మొత్తాన్ని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఖాతాకు జమ చేయాలని 27 మంది వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు (2022 అక్టోబర్). ఇద్దరు వ్యక్తుల నుంచి ₹0.53 కోట్లు వసూలు చేయగా, మిగిలిన ₹18.99 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇంతలో, 27 మందిలో 14 మంది గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేయగా కఠిన చర్యలను నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి. ప్రతిస్పందనగా, పైన పేర్కొన్న అన్ని కేసులకు కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేసింది.

### 5.4.3 అనర్హమైన భూమికి భూసేకరణ పరిహారం చెల్లింపు

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013లోని సెక్షన్ 38 ప్రకారం, భూసేకరణ అవార్డులను ఆమోదించిన తర్వాత, సేకరించిన భూమి లేదా భవనానికి అనుబంధంగా ఉన్న భూమి లేదా ఇతర స్థిరాస్తి లేదా ఆస్తులకుగాను భూసేకరణ అవార్డు పరిహారం అన్ని పక్షాలకు చెల్లించబడుతుంది.

#### 5.4.3.1 ఖల్సా భూమికి భూసేకరణ అవార్డు పరిహారం చెల్లింపు

ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి సంస్థ జారీ చేసిన గ్రామ రెవెన్యూ పరిపాలన మార్గదర్శకాల ప్రకారం, 'ఖల్సా' అనేది 'ప్రభుత్వ గ్రామం'ని సూచిస్తుంది. ఖల్సా భూములు అంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమి, వీటి ఇనామ్/వతన్ హక్కులు రద్దు చేయబడ్డాయి, వీటిని ఇతరులకు అధీనపరచకూడదు, వీటి యాజమాన్య హక్కులు ప్రభుత్వానికే ఉంటాయి. అటువంటి భూమిని కలిగి ఉన్నవారు ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా ఖల్సా భూమిని అమ్మలేరు. జిల్లా కలెక్టర్ నిర్ణయించిన విధంగా అమ్మకందారు నుండి తగిన విలువను వసూలు చేసిన తరువాత మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం అమ్మకాలను అనుమతిస్తుంది, ఇతరత్రా కాదు. అందువల్ల, ఖల్సా భూమిని సేకరించినందుకుగాను పరిహారం చెల్లించడానికి అనుమతి లేదు.

ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), ఏలూరు కార్యాలయం వారి భూసేకరణ రికార్డులను పరిశీలించగా, ***పట్టిక 5.6*** లో వివరించిన విధంగా, పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాలోని కుకునూరు, వేలేరుపాడు మండలాల్లోని[215] 363.71 ఎకరాల ఖల్సా భూమికి ₹30.96 కోట్ల విలువైన పరిహారం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు చెల్లించబడిందని వెల్లడైంది.

**పట్టిక 5.6: ఖల్సా భూములకు భూసేకరణ పరిహారం**

| ఆవాసం పేరు | మండలం పేరు | సేకరించిన ఖల్సా భూమి (ఎకరాల్లో) | అవార్డు సంఖ్య & తేదీ | చెల్లించిన పరిహారం (₹ కోట్లలో) |
|---|---|---|---|---|
| చీరవల్లి | కుకునూరు | 42.36 | 20/2017-18 తేదీ 29.05.2017 | 4.12 |
| కివ్వాక | కుకునూరు | 44.04 | 22/2017-18 తేదీ 29.05.2017 | 4.18 |
| దామర్చర్ల | కుకునూరు | 54.12 | 19/2017-18 తేదీ 29.05.2017 | 5.55 |
| రేపకగొమ్ము | వేలేరుపాడు | 129.15 | 13/2016-17 తేదీ 06.03.2017 | 9.23 |
| తూట్కూరుగొమ్ము | వేలేరుపాడు | 94.04 | 15/2016-17 తేదీ 06.03.2017 | 7.88 |
| మొత్తం | | **363.71** | | **30.96** |

*మూలం: శాఖ అందించిన సమాచారం*

[215] 2014 మే లో తెలంగాణ నుండి ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన మండలాలు

ఆ భూమిని ఖల్సా భూమిగా వర్గీకరించారు, వీటి హక్కులు ప్రభుత్వానికి ఉన్నాయి కాబట్టి, వీటి భూసేకరణ ప్రక్రియ కూడా ప్రభుత్వ భూమి సేకరణతో సమానంగా ఉండాలి. అందువల్ల, ఖల్సా భూమికి పరిహారం చెల్లింపు సక్రమంగా లేక ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారానికి దారితీసింది. ఇంకా ఖల్సా భూసేకరణ అవార్డుల్లో వ్యక్తుల పేర్లను భూ యజమానులుగా చేర్చడానికి గల కారణాలు ఆడిట్ కు సమర్పించిన రికార్డుల నుంచి లభ్యం కాలేదు.

1948లో నిజాం పాలన ముగిసిన తర్వాత జాగీర్దార్ రద్దు చట్టం, ఎస్టేట్ నిర్మూలన చట్టం, శత్రు ఆస్తుల చట్టం, ఇనాం నిర్మూలన చట్టం అమల్లోకి వచ్చాయని, తెలంగాణ ప్రాంతంలోని మొత్తం భూమి ప్రభుత్వ/ఖల్సా భూమిగా మారిందని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 ఆగస్టు). కాలక్రమేణా హైదరాబాద్ కౌలు, వ్యవసాయ భూముల చట్టం, 1950 లోని సెక్షన్ 38(ఇ) క్రింద నివాసితులకు ఆక్యుపెన్సీ హక్కుల ధ్రువీకరణ పత్రం (ఓఆర్‌సీ) లభించింది. భారత యూనియన్, నిజాం కు వ్యక్తిగత ఉపయోగం కోసం కొన్ని భూములను కేటాయించింది, అవి బ్లూ బుక్‌లో వ్రాయబడ్డాయి. బ్లూ బుక్ లో నమోదు కాని భూములకు, కౌలుదారులు/నివాసితుల ఆధీనములో ఉన్న భూములకు సర్వే, రెవెన్యూ శాఖ, భూములను పరిశీలించి ఓఆర్‌సీ రూపంలో పట్టాదారు హక్కులు మంజూరు చేసింది. అందువల్ల, రెవెన్యూ అధికారులు మంజూరు చేసిన ఆక్యుపెన్సీ, పట్టా హక్కులను పరిశీలించిన తరువాతే, ఖల్సా భూమికి భూసేకరణ పరిహారాన్ని అధికారులు విడుదల చేశారు.

ముగింపు సమావేశంలో ప్రభుత్వం 2024 ఆగస్టులో సమర్పించిన సమాధానానికి సంబంధించిన ఋజువులను సమర్పిస్తామని పేర్కొంది (2024 నవంబర్).

అయితే, నిజమైన లబ్ధిదారులకు భూసేకరణ పరిహారం చెల్లింపు యొక్క ఖచ్చితత్వాన్ని ధృవీకరించడానికి వివాదంలో ఉన్న భూములకు జారీ చేయబడిన ఓఆర్‌సీలు/యాజమాన్య పత్రాలకు సంబంధించిన ఋజువులను ఆడిట్ కు సమర్పించలేదు.

## 5.4.4 అవార్డుల జారీలో జాప్యం కారణంగా నివారించదగ్గ ఆర్థిక భారం

ప్రకటన వెలువడిన తేదీ నుంచి 12 నెలల్లోగా కలెక్టర్ భూసేకరణ అవార్డును జారీ చేయాలని, ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 25 చెబుతోంది. ఒకవేళ విఫలమైతే, భూసేకరణకు సంబంధించిన మొత్తం ప్రక్రియ ముగిసిపోతుంది, అయితే, సంబంధిత ప్రభుత్వం పొడిగించాల్సిన పరిస్థితి ఉన్నట్లయితే, ఆ వ్యవధిని 12 నెలల పాటు పొడిగించే అధికారం కలిగి ఉంటుంది.

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 24 ప్రకారం, భూసేకరణ చట్టం, 1894 క్రింద ప్రారంభించబడిన భూసేకరణ ప్రక్రియలో, పేర్కొన్న భూసేకరణ చట్టంలోని సెక్షన్ 11 క్రింద ఎటువంటి అవార్డు ఇవ్వబడకపోతే, ఆ భూసేకరణ ప్రక్రియ ముగిసినట్లు పరిగణించబడుతుంది, అప్పుడు, పరిహారం నిర్ణయానికి సంబంధించిన ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013లోని అన్ని నిబంధనలు వర్తిస్తాయి.

### 5.4.4.1 వ్యవసాయ భూమితో పాటు గ్రామ కంఠం అవార్డులను ఆమోదించడంలో జాప్యం

భూసేకరణ చట్టం, 1894 లోని సెక్షన్ 23(2) ప్రకారం, భూమి యొక్క మార్కెట్ విలువకు అదనంగా, ప్రతి సందర్భంలోనూ అటువంటి మార్కెట్ విలువపై 30 శాతం మొత్తాన్ని భూమిని సేకరించేందుకు చెల్లించాలి. ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013లోని సెక్షన్ 30 ప్రకారం, భూమి పరిహార విలువకు అదనంగా పరిహార విలువలో 100 శాతం సొలేషియం లబ్ధిదారులకు చెల్లించాలి.

పోలవరం మండలం కొండ్రుకోట గ్రామంలోని ఎనిమిది ఆవాస ప్రాంతాలకు సంబంధించి భూసేకరణ చట్టం, 1894 ప్రకారం ₹8.72 కోట్ల వ్యయంతో 321.58 ఎకరాలకు సంబంధించి భూసేకరణ అవార్డును ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ,) కొవ్వూరు జారీ చేశారు (2012 ఏప్రిల్). అయితే, 2007లో భూ ప్రణాళిక షెడ్యూళ్ళు, 2012 ఏప్రిల్లో వ్యవసాయ భూములకు అవార్డులు వెలువడినప్పటికీ 2016 జనవరిలో గ్రామ కంఠంలోని నిర్మాణాలకు

పరిహారం ఆలస్యంగా ఖరారైంది, గ్రామ కంఠంలోని నిర్మాణాల పరిహారం, ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 ప్రకారం అవార్డు ఆమోదించబడింది (2016 జనవరి).

***పట్టిక 5.7*** లో వివరించిన విధంగా గ్రామ కంఠంకి సంబంధించిన ఎనిమిది అవార్డులను ఆమోదించడంలో నెలకొన్న జాప్యం ఫలితంగా గరిష్టంగా ₹10.99 కోట్ల అనవసర ఆర్థిక భారానికి దారితీసింది.

**పట్టిక 5.7: అదనపు ఆర్థిక భారాన్ని చూపే పట్టిక**

**(మొత్తం ₹లలో)**

| క్రమ సంఖ్య | ఆవాస ప్రాంతం పేరు | ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 28 క్రింద చెల్లించిన సొలాటియం (పరిహార మొత్తంలో 100 శాతం + పంటలకు అనుమతించబడిన మొత్తం + నష్టాలు) |
|---|---|---|
| 1. | తాళ్ళవరం | 4,12,05,115 |
| 2. | కొత్తూరు | 2,05,49,127 |
| 3. | కొత్తూరు కాలనీ | 61,33,996 |
| 4. | వాడపల్లి | 2,35,02,576 |
| 5. | గాజులగొంది | 1,69,06,014 |
| 6. | కొత్తమామిడిగొంది | 65,56,550 |
| 7. | మాధాపురం | 2,11,55,182 |
| 8. | ములగలంపాడు | 2,09,47,211 |
| (అ) | **మొత్తం** | **15,69,55,771** |
| (ఆ) | భూసేకరణ చట్టం, 1894 ప్రకారం అనుమతించదగిన ప్రతిఫలము[216] (₹15,69,55,771లో 30 శాతం) | **4,70,86,731** |
| | అదనపు ఆర్థిక భారం (అ) – (ఆ) | **10,98,69,040** |

*మూలం: శాఖ అందించిన సమాచారం*

జలవనరుల శాఖ నుంచి అందుకున్న భూ ప్రణాళిక షెడ్యూళ్ల ఆధారంగా 2012 ఏప్రిల్లో వ్యవసాయ భూములకు ఈ అవార్డును ఆమోదించినట్లు ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 నవంబర్). అనంతరం గ్రామ కంఠంలోని నిర్మాణాలకు సవరించిన భూ ప్రణాళిక షెడ్యూళ్లను జల వనరుల శాఖ ఆలస్యంగా 2015 ఫిబ్రవరిలో అందించింది. తదనుగుణంగా భూసేకరణ ప్రక్రియను ప్రారంభించి, 2016 జనవరిలో అవార్డును ఆమోదించారు, అందువల్ల ఎటువంటి ఆలస్యం జరగలేదని పేర్కొన్నారు.

2012 ఏప్రిల్ లోనే అవార్డు ఆమోదించబడినప్పుడు, భూ ప్రణాళిక షెడ్యూళ్లను సవరించడానికి గల కారణాలను తెలుపలేదు. ఇంకా, గ్రామ కంఠంలోని నిర్మాణాల కోసం సవరించిన భూ ప్రణాళిక షెడ్యూళ్లను సమర్పించడంలో ఆలస్యానికి గల కారణాలకు ప్రభుత్వం సమాధానమివ్వలేదు.

### 5.4.4.2 కోర్టు కేసుల పరిష్కారం తర్వాత అవార్డుల జారీలో విపరీతమైన జాప్యం

తొయ్యేరు గ్రామంలో 783.52 ఎకరాల[217] ముంపునకు గురయ్యే భూమి కోసం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), రాజమహేంద్రవరంకి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, పీఐపీహెచ్‌డబ్ల్యూ డివిజన్-6, పురుషోత్తపట్నం, (2007

---

216 పాత రేట్లు (2012 ఏప్రిల్) అందుబాటులో లేనందున 30 శాతం సొలేషియంను కొత్త రేట్ల (2016 జనవరి) ఆధారంగా లెక్కించారు

217 రంపచోడవరం డివిజన్, దేవీపట్నం మండలం (సర్వే నంబర్ 1 నుండి 130)

సెప్టెంబర్) భూసేకరణ అభ్యర్థనను సమర్పించారు (2007 సెప్టెంబర్). తొర్రేరు గ్రామ భూసేకరణను మూడు బ్లాకులు [218] గా (బ్లాక్-1 నుంచి బ్లాక్-3 వరకు) విభజించారు.

తొర్రేరు గ్రామంలో 366.53 ఎకరాల (బ్లాక్-2), 176.30 ఎకరాల (బ్లాక్-3) విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వేతర భూములను సేకరించడానికి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), భూసేకరణ చర్యలను ప్రారంభించారు (2009). భూసేకరణ చట్టం, 1894లోని సెక్షన్ 4(1) క్రింద రెండు బ్లాకులకు తగిన ఆమోదం[219] పొందిన తర్వాత ముసాయిదా ప్రకటన (వరుసగా 2009 డిసెంబర్, 2010 జూలై) జారీ చేశారు. తదనంతరం, ఈ రెండు బ్లాకుల భూములను స్వాధీనం చేసుకోవడానికి 2010 డిసెంబర్ లో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), రాజమహేంద్రవరం ముసాయిదా ప్రకటనను ఆమోదించారు[220].

ఈ దశలో, కొంతమంది భూ యజమానులు గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిట్ పిటిషన్లు[221] దాఖలు చేశారు (2011, 2012). ఆ తర్వాత 2013 ఫిబ్రవరిలో అన్ని రిట్ పిటిషన్లను 'వ్యర్థమైనవి'గా కొట్టివేశారు.

అయితే, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), రాజమహేంద్రవరం, బ్లాక్-2 (2015 జనవరి), బ్లాక్-3 (2015 జూన్) లకు భూసేకరణ అవార్డులను కోర్టు కేసుల పరిష్కారమైన తేదీ నుంచి వరుసగా 23, 28 నెలల జాప్యంతో ప్రకటించారని ఆడిట్ గమనించింది. భూసేకరణ అవార్డులను ప్రకటించడంలో జాప్యం కారణంగా, ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 నిబంధనల ప్రకారం భూసేకరణకు పరిహారం చెల్లించారు, ఫలితంగా ***పట్టిక 5.8*** లో వివరించిన విధంగా ₹11.43 కోట్ల అదనపు ఆర్థిక భారం పడింది.

**పట్టిక 5.8: అధిక పరిహారం చెల్లింపును చూపే పట్టిక**

**(మొత్తం ₹లలో)**

| వివరణ | 2వ బ్లాక్ | 3వ బ్లాక్ |
|---|---|---|
| 2013 చట్టం ప్రకారం ఒక ఎకరం కి పరిహారం(అ) | 7,23,995 | 7,12,159 |
| పాత చట్టం ప్రకారం పరిహారం(ఆ) | 4,83,099 | 4,75,201 |
| ఒక ఎకరానికి చెల్లించిన అధిక పరిహారం (అ)-(ఆ) | 2,40,896 | 2,36,958 |
| బ్లాక్-2 లోని 301.17 ఎకరాల[222]కు చెల్లించబడిన అధిక పరిహారం (301.17 ఎకరాలు x ₹2,40,896) (ఇ) | **7,25,50,648** | --- |
| బ్లాక్-3 లోని 176.30 ఎకరాలకు చెల్లించబడిన అధిక పరిహారం (176.30 ఎకరాలు x ₹2,36,958) (ఈ) | --- | **4,17,75,695** |
| 2వ బ్లాక్, 3వ బ్లాక్ లకు చెల్లించిన మొత్తం అధిక పరిహారం (ఇ + ఈ) | **11,43,26,343** | |

*మూలం:శాఖ అందించిన సమాచారం ప్రకారం ఆడిట్ లెక్కించింది*

2013 ఫిబ్రవరిలో కోర్టు కేసులు పరిష్కరించబడ్డాయని, 2014 జనవరి నుండి కొత్త చట్టం అమల్లోకి వచ్చిందని, గౌరవ న్యాయస్థానం ఆదేశాలను ప్రకటించడంలో జాప్యం కారణంగా భూసేకరణ అవార్డులలో జాప్యం జరిగిందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు).

---

218 1వ బ్లాక్: 167.51 ఎకరాలు (సర్వే నం.1 నుండి 21 వరకు) ఇందులో 141.47 ఎకరాల అసైన్డ్ భూమి, 26.04 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నాయి, 2వ బ్లాక్: 439.71 ఎకరాలు (సర్వే నం.22 నుండి 92 వరకు) ఇందులో 366.53 ఎకరాల ప్రభుత్వేతర భూములు, 73.18 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నాయి, 3వ బ్లాక్: 176.30 ఎకరాలు (సర్వే నం.93 నుండి 130 వరకు) ప్రభుత్వేతర భూములు ఉన్నాయి

219 వరుసగా రిఫరెన్స్ సంఖ్య బి1/533/2009 తేదీ 10.12.2009, రిఫరెన్స్ సంఖ్య బి1/534/2009 తేదీ 09.07.2010

220 వరుసగా రిఫరెన్స్ సంఖ్య బి1/533/2009 తేదీ 15.12.2009ల రిఫరెన్స్ సంఖ్య బి1/534/2009 తేదీ 03.12.2010

221 డబ్ల్యూపీ సంఖ్య 5625/2011, డబ్ల్యూపీ సంఖ్య 27333/2012

222 366.53 ఎకరాల భూమిలో, 301.17 ఎకరాలకు నగదు పరిహారం చెల్లించబడింది, మిగిలిన 65.36 ఎకరాలను 'భూమికి-భూమి' క్రింద సేకరించారు

ఈ కేసును 2013 ఫిబ్రవరిలో గౌరవ న్యాయస్థానం కొట్టివేసింది, కొత్త చట్టం అమలుకు ముందు (2014 జనవరి నుండి) భూసేకరణ అవార్డును జారీ చేయడానికి తగినంత సమయం ఉన్నప్పటికీ భూసేకరణ అవార్డుల జారీలో జాప్యం కారణంగా ఖజానాపై ₹11.43 కోట్ల నివారించదగ్గ ఆర్థిక భారం పడినందున ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు.

### 5.4.4.3 అసైన్డ్ భూముల సేకరణలో జాప్యం

భూసేకరణ చట్టం, 1894 ప్రకారం అసైన్డ్ భూములను తిరిగి తీసుకోనే సమయంలో పరిహారం చెల్లింపునకు నిర్దిష్ట నిబంధనలు లేవు. ఇంకా, ప్రజా అవసరాల కోసం అసైన్డ్ భూములను తిరిగి తీసుకుంటే మార్కెట్ విలువకు సమానమైన పరిహారంతో పాటు మార్కెట్ విలువలో అదనంగా 30 *శాతం* చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు[223] జారీ చేసింది (1993 డిసెంబర్). అయితే పట్టా భూములకు చెల్లించే అదనపు మార్కెట్ విలువ అసైన్డ్ భూముల విషయంలో వర్తించదు.

ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) ఏలూరు, వారి భూసేకరణ రికార్డుల పరిశీలనలో వేలేరుపాడు మండలం కట్కూరు ఆవాస ప్రాంతంలో 226.01 ఎకరాల (ప్రభుత్వేతర భూమి: 195.65 ఎకరాలు, ప్రభుత్వ భూమి: 30.36 ఎకరాలు) భూమిని భూ ప్రణాళిక షెడ్యూళ్ల ద్వారా అభ్యర్ధించినట్లు తెలిసింది (2007 జూలై). 195.65 ఎకరాల్లో, 188.04 ఎకరాల పట్టా భూమిని 2008 ఫిబ్రవరిలో సేకరించారు, ఎకరాలు 3.06 గుంటల[224] (3.15 ఎకరాలు) అసైన్డ్ భూమిని 2017 మే లో ఆలస్యంగా సేకరించారు. సేకరించాల్సిన మిగిలిన 4.46 ఎకరాల ప్రభుత్వేతర భూమికి సంబంధించిన వివరాలను ఆడిట్ కు సమర్పించలేదు.

188.04 ఎకరాల పట్టా భూమిని సేకరించే సమయంలో (2008 ఫిబ్రవరి) ఎకరం భూమి ధర ₹1.15 లక్షలు అని ఆడిట్ గమనించింది. ఆ ఆవాస ప్రాంతాల భూముల మార్కెట్ ధరలు 2017 ఫిబ్రవరిలో ఎకరానికి ₹3.50 లక్షలకు సవరించబడ్డాయి. 2007 జూలైలోనే భూ ప్రణాళిక షెడ్యూళ్లు అందుకున్నప్పటికీ, 3.15 ఎకరాలకు సేకరణ ఆలస్యం అయింది మరియు ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 ఆధారంగా పరిహారం చెల్లించబడింది, ఫలితంగా ***పట్టిక 5.9*** లో వివరించిన విధంగా ₹28.37 లక్షల అదనపు భారం పడింది.

**పట్టిక 5.9: అదనపు ఆర్థిక భారం చూపే పట్టిక**

**(మొత్తం ₹లలో)**

| వివరణ | ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 ప్రకారం చెల్లించిన మొత్తం (సొలేషియం: 100 శాతం) | 1993 డిసెంబర్ లో జారీ చేయబడిన ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం చెల్లించిన మొత్తం (సొలేషియం: 30 శాతం) |
|---|---|---|
| భూ విస్తీర్ణం | 3.15 ఎకరాలు | |
| మార్కెట్ విలువ (ఎకరానికి) | 3,50,000 | 1,15,000 |
| మొత్తం మార్కెట్ విలువ (ఎం వి) | 11,02,500 | 3,62,250 |
| మార్కెట్ విలువను 1.5 గుణకార కారకంతో గుణించగా | 16,53,750 | వర్తించదు |
| సొలేషియం కలపగా | 16,53,750 | 1,08,675 |
| చెల్లించాల్సిన మొత్తం భూసేకరణ పరిహారం | **33,07,500** | **4,70,925** |
| నివారించదగిన భారం | **28,36,575** | |

*మూలం:శాఖ అందించిన సమాచారం ప్రకారం ఆడిట్ లెక్కించింది*

223 జీఓఎమ్ఎస్ సంఖ్య 1307, తేదీ 23.12.1993

224 ఎకరాలు 3.06 గుంటలు = 3.15 ఎకరాలు (40 గుంటలు = 100 సెంట్లు/ఒక ఎకరం)

ముంపుకు గురైయ్యే కంటూరు స్థాయి ప్రకారమే భూసేకరణను ప్రారంభించామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 ఆగస్టు). ముంపుకు గురైయ్యే ప్రాంతాల భూసేకరణ పూర్తయిన తర్వాత మాత్రమే భూమికి-భూమి, కేటాయించబడిన కాలనీలకు భూసేకరణను ప్రారంభించాలి. అందువల్ల, భూసేకరణలో జాప్యం ఉండదు.

భూ ప్రణాళిక షెడ్యూల్ల తేదీ నుంచి ముసాయిదా ప్రకటనకు శాఖకు తొమ్మిదేళ్లకు పైగా సమయం పట్టడంతో అసైన్డ్ భూముల సేకరణలో జరిగిన జాప్యంపై సమాధానం లేదు. ఈ ఆలస్యం కారణంగా, భూముల మార్కెట్ విలువ పెరగడంతో ఖజానాపై ₹28.37 లక్షల అదనపు భారం పడింది.

## 5.4.5 ధ్రువీకరించకుండానే భూమి పరిహారం చెల్లింపు

ఆర్ఎఫ్‌సీటీఎల్‌ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క మొదటి షెడ్యూల్‌తో పాటు సెక్షన్ 3, సెక్షన్ 26 నుండి 30 వరకు గల సెక్షన్ల ప్రకారం, చట్టం క్రింద నిర్దేశించిన నిబంధనల ప్రకారం పరిహారం లెక్కించబడుతుంది, సేకరించిన భూమి లేదా భూమికి అనుబంధంగా ఉన్న ఇతర స్థిరాస్తి లేదా ఆస్తులకు లేదా భవనానికి సంబంధించిన అన్ని పక్షాలకు పరిహారం చెల్లించాలి.

### 5.4.5.1 క్లెయిమ్ చేయని భూమికి పరిహారం చెల్లింపు

కుకునూర్ మండలం కండ్రిక గ్రామంలోని రెండు ఎకరాల క్లెయిమ్ చేయని భూమి (సర్వే నం. 15)కి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) ఏలూరు, భూసేకరణ పరిహారంగా ఒక వ్యక్తికి[225] ₹21.25 లక్షల[226] భూసేకరణ పరిహారాన్ని (2020 డిసెంబర్) సబ్-కలెక్టర్, కుకునూర్ ఆమోదించిన భూసేకరణ అవార్డు[227] ఆధారంగా చెల్లించారు (2017 జూన్).

ప్రిలిమినరీ నోటిఫికేషన్, ముసాయిదా ప్రకటన, అవార్డు పరిశీలనలో సబ్ డివిజన్ రికార్డుల్లో సదరు సర్వే నంబరులో రెండు ఎకరాల క్లెయిమ్ చేయని భూమికి ఎదురుగా వ్యక్తి పేరు ప్రస్తావించబడలేదని తేలింది. అయితే, ఆ వ్యక్తికి ఏ ప్రాతిపదికన పరిహారం మంజూరు చేసి, చెల్లించారో ఆ వివరాలు ఆడిట్‌కు సమర్పించలేదు.

భూసేకరణ అవార్డులో సర్వే నంబర్ 15లోని రెండు ఎకరాల భూమిని క్లెయిమ్ చేయని భూమిగా ప్రకటించిందని, తదనంతరం, భూసేకరణ అధికారి & సబ్-కలెక్టర్, కుకునూర్ ప్రొసీడింగ్స్ ప్రకారం, ఆ వ్యక్తి సమర్పించిన ఆన్‌లైన్ అడంగల్ ఆధారంగా పరిహారం చెల్లించబడిందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). అందిన ఫిర్యాదు ఆధారంగా, సబ్-కలెక్టర్ ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించమని వ్యక్తికి నోటీసు జారీ చేశారు (2021 ఏప్రిల్). ఆ వ్యక్తి గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయగా, ఈ విషయంపై కోర్టు స్టే మంజూరు చేసింది.

దీన్నిబట్టి భూమి యాజమాన్యం యొక్క నిజానిజాలను పరిశీలించకుండానే నష్టపరిహారం చెల్లించారని, ఇది కోర్టు వ్యాజ్యానికి దారితీసిందని తెలుస్తోంది.

### 5.4.5.2 యాజమాన్య రికార్డులు లేకుండా పరిహారం చెల్లింపు

కుకునూరు సబ్ కలెక్టర్ ఆమోదించిన భూసేకరణ అవార్డు[228] క్రింద కుకునూర్ మండలం కండ్రిక గ్రామంలో ఐదెకరాల (సర్వే నంబర్ 15) భూమికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ,) ఏలూరు, ₹53.12 లక్షల భూసేకరణ పరిహార మొత్తాన్ని ఒక వ్యక్తికి[229] మంజూరు చేశారు (2017 జూన్).

---

[225] కుకునూరు మండలం ఇబ్రహీంపేటకు చెందిన శ్రీ రాయని శ్రీనివాసరావు, తండ్రి బిక్షమయ్య

[226] సీఎఫ్ఎంఎస్ బిల్లు సంఖ్య 2020-946767, తేదీ 14.12.2020

[227] భూ సేకరణ అవార్డు సంఖ్య 46/2017-18, తేదీ 29.06.2017

[228] భూ సేకరణ అవార్డు సంఖ్య 46/2017-18, తేదీ 29.06.2017

[229] కుకునూరు మండలం ఇబ్రహీంపేటకు చెందిన శ్రీ రాయని శ్రీనివాసరావు, తండ్రి బిక్షమయ్య

ప్రిలిమినరీ నోటిఫికేషన్‌లో, ముసాయిదా ప్రకటనలో కూడా ఆ వ్యక్తి పేరును భూమికి యజమానిగా పేర్కొనలేదని ఆడిట్ గుర్తించింది. ఇంకా, రెవెన్యూ శాఖ యొక్క సబ్-డివిజన్ రికార్డులలో అనుభవిస్తున్న వారి పేరు అవార్డులో పేర్కొన్న దానికి భిన్నంగా[230] ఉంది.

పరిహారం చెల్లించిన వ్యక్తి పేరు మీద భూమి హక్కు ఉందని ధ్రువీకరించడానికి శాఖ ఎలాంటి టైటిల్ డీడ్, పట్టాదారు పాసుపుస్తకం మొదలైనవి ఏవీ ఆడిట్‌కు సమర్పించలేదు. అలాగే, పట్టాదారుకు బదులుగా భూమిని అనుభవిస్తున్న వ్యక్తికి ఏ ప్రాతిపదికన పరిహారం మంజూరు చేశారో రికార్డులలో లేదు. ఆ విధంగా, అనర్హమైన వ్యక్తికి భూమి పరిహారం చెల్లించబడింది.

పరిహారం చెల్లించబడిన వ్యక్తే భూమిని అనుభవించేవాడని, సర్వే నంబర్ 15లోని ఐదు ఎకరాల భూమి యాజమాన్యానికి ఋజువుగా అవసరమైన భూమి రికార్డులను వ్యక్తి సమర్పించాడని, అంతేకాకుండా అవార్డులో వ్యక్తిని చేర్చడానికి వ్యతిరేకంగా అనుభవదారు ఎటువంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు).

అందువల్ల, యాజమాన్యపు వాస్తవికతను నిర్ధారించగలిగే హక్కు పత్రాలు అంటే టైటిల్ డీడ్‌లు, పట్టాదారు పాసుపుస్తకాలు మొదలైన భౌతిక పత్రాల ద్వారా వివరణాత్మక ధ్రువీకరణ లేకుండానే పరిహారం చెల్లించబడింది. ఈ విచక్షణా రాహిత్యమైన చర్య అనవసరమైన వ్యాజ్యం, అనర్హమైన లబ్ధిదారులకు చెల్లింపులకు దారితీసిందని పైన పేర్కొన్న రెండు కేసుల నుండి స్పష్టంగా తెలుస్తుంది.

### 5.4.6 నిర్ణీత పరిమితికి మించి 'భూమికి-భూమి' కేటాయింపులు జరిగాయి

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 రెండో షెడ్యూల్ ప్రకారం ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతంలో ప్రభుత్వం భూమిని సేకరించాలి. నీటిపారుదల ప్రాజెక్టు విషయానికొస్తే, ప్రభావిత ప్రాంతంలో వ్యవసాయ భూమిని కలిగి ఉండి, భూమిని స్వాధీనం కోల్పోయిన ప్రతి బాధిత కుటుంబానికి, భూమిని సేకరించిన ప్రాజెక్టు యొక్క ఆయకట్టులో కనీసం ఒక ఎకరం భూమిని కేటాయించాలి. షెడ్యూల్డ్ కులాలు లేదా షెడ్యూల్డ్ తెగలకు (ఎస్సీ/ఎస్టీ) చెందిన వ్యక్తులు భూమిని కోల్పోతే, సేకరించిన భూమికి సమానమైన భూమి లేదా రెండున్నర ఎకరాల భూమి, ఏది తక్కువైతే అది అందించబడుతుంది.

సరుగుడు (***అనుబంధం 5.5***), యర్రవరం (***అనుబంధం 5.6***), తెల్లదిబ్బలు (***అనుబంధం 5.7***), శివగిరి (***అనుబంధం 5.8***), దండంగి (***అనుబంధం 5.9***) గ్రామాలకు సంబంధించిన ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), రికార్డులను పరిశీలించగా ఎస్సీ, ఎస్టీలకు భూ పంపిణీ చట్టంలో పేర్కొన్న 2.5 ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో భూమికి-భూమి కేటాయింపుని ***పట్టిక 5.10*** లో చూపిన విధంగా గుర్తించడమైంది.

**పట్టిక 5.10: గరిష్టంగా నిర్దేశించిన పరిమితికి మించి 'భూమికి-భూమి' కేటాయింపులు**

| క్రమ సంఖ్య | ఆవాసం/గ్రామం పేరు | లబ్ధిదారుల సంఖ్య | 'భూమికి-భూమి' యొక్క విస్తీర్ణం (ఎకరాల్లో) | | |
|---|---|---|---|---|---|
| | | | ఇవ్వవల్సింది (సి x 2.50 ఎకరాలు) | అవార్డులో కేటాయించబడింది | అధికంగా కేటాయించిన విస్తీర్ణం |
| అ | ఆ | ఇ | ఈ | ఉ | ఊ |
| 1. | సరుగుడు | 15 | 37.50 | 56.74 | 19.24 |
| 2. | యర్రవరం | 40 | 100.00 | 168.23 | 68.23 |
| 3. | తెల్లదిబ్బలు | 2 | 5.00 | 8.72 | 3.72 |
| 4. | శివగిరి | 31 | 77.50 | 131.82 | 54.32 |
| 5. | దండంగి | 4 | 10.00 | 23.48 | 13.48 |
| మొత్తం | | **92** | **230.00** | **388.99** | **158.99** |

*మూలం: సంబంధిత ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కార్యాలయాల రికార్డులు*

[230] శ్రీ వింజమూరి తాతాచార్యులు

ప్రిలిమినరీ నోటిఫికేషన్, ముసాయిదా ప్రకటన, అవార్డు విచారణలు, పాత చట్టం, 1894 ప్రకారం నిర్వహించబడ్డాయని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). లబ్ధిదారులు వ్యవసాయం నుండి ఆదాయ వనరులు కలిగిన షెడ్యూల్ తెగలకు చెందినవారు కాబట్టి, భూమి పరిహారం మొత్తానికి బదులుగా 'భూమికి-భూమి'ని కేటాయించాలని లబ్ధిదారులు అభ్యర్థించారు. కొత్త ఎల్ఏ ఆర్&ఆర్ చట్టం, 2013 ప్రకారం 'భూమికి-భూమి' క్రింద భూమి కొనుగోలుకు ఎకరాకు ₹3.50 లక్షల కనిష్ఠ ధరను కలెక్టర్ నిర్ణయించారు. పై అంశాల దృష్ట్యా, గిరిజన లబ్ధిదారులకు 'భూమికి-భూమి' క్రింద కేటాయింపు కోసం నగదు పరిహారం మంజూరు చేయడం లేదా ఇతర లబ్ధిదారుల నుండి భూమిని కొనుగోలు చేయడం ఒకటే. అందువల్ల, లబ్ధిదారుల అభ్యర్థన మేరకు, అప్పటి భూసేకరణ అధికారి అయిన జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి, 2.50 ఎకరాలకు పైగా 'భూమికి-భూమి' క్రింద పరిహారం మంజూరు చేశారు. అందువల్ల గిరిజన లబ్ధిదారులకు 2.50 ఎకరాల కంటే ఎక్కువ భూమిని కేటాయించడం వల్ల ప్రభుత్వానికి ఎటువంటి ఆర్థిక నష్టం జరగలేదు.

కొత్త చట్టం, 2013 నిబంధనల ప్రకారం, షెడ్యూల్డ్ కులాలు/షెడ్యూల్డ్ తెగల లబ్ధిదారులకు 'భూమికి-భూమి' క్రింద కేటాయింపు, సేకరించిన భూమి పరిమాణంతో సంబంధం లేకుండా గరిష్టంగా 2.50 ఎకరాలకు పరిమితం చేయాలి కాబట్టి సమాధానం ఆమోదయోగ్యం కాదు.

ఆ విధంగా, 2.50 ఎకరాలకు మించి 'భూమికి-భూమి' క్రింద కేటాయింపువల్ల ప్రభుత్వానికి ఆర్థిక నష్టం వాటిల్లింది.

# 6వ అధ్యాయం

## పునరావాసం, పునరుపాధి కల్పన అమలు

# 6వ అధ్యాయం

# పునరావాసం, పునరుపాధి కల్పన అమలు

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టులో 1,06,006 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల (పీడీఎఫ్ ల) పునరావాసం ఇమిడి ఉంది. మార్చి 2014 నాటికి (జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించక ముందు), మొత్తం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలలో 0.67 శాతం కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించబడింది. 17 సంవత్సరాలు గడిచిన తరువాత కూడా, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల పునరావాసం & పునరుపాధి కల్పనలో పురోగతి చాలా తక్కువ, ఎందుకంటే 11 శాతం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు మాత్రమే ఆర్&ఆర్ కాలనీలకు తరలించబడ్డాయి. ప్రతిపాదించబడిన 213 ఆర్&ఆర్ కాలనీలలో, 138 ఆర్&ఆర్ కాలనీల పనులు ఇంకా ప్రారంభించబడలేదు. 213 ఆర్&ఆర్ కాలనీల నిర్మాణానికి మొత్తం 8,581.05 ఎకరాల భూమి అవసరం కాగా, 2,756.72 ఎకరాల భూమిని మాత్రమే సేకరించారు. ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 ప్రవేశపెట్టిన తర్వాత ఆర్&ఆర్ పరిహారం పెరగడం వల్ల లక్ష్యంగా చేసుకున్న ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల పునరావాసం పూర్తి చేయడంలో జాప్యం కారణంగా ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల ఆర్&ఆర్ పై అంచనా వ్యయం ₹19,346.49 కోట్లు పెరిగింది. ప్రతి భూ సేకరణ కేసు యొక్క పని క్రమాన్ని సవివరంగా చూపే విధంగా ఆమోదించబడిన ఆర్&ఆర్ పథకాలు ఏపీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచలేదు.

1,06,006 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు ఆర్&ఆర్ నగదు ప్రయోజనాల చెల్లింపునకు ₹7,270.41 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా, కేవలం 14,500 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు ₹841.34 కోట్లు మాత్రమే చెల్లించారు. ప్రతి ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబానికి ₹10.00 లక్షల ఆర్&ఆర్ ప్యాకేజీ అందేలా చూడటానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంజూరు చేసిన (₹550.00 కోట్లు) అదనపు ఆర్&ఆర్ ప్యాకేజీని ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు విడుదల చేయలేదు. 49 కాలనీల్లో మంజూరైన 13,938 ఇళ్లకు గాను 11,507 యూనిట్లు పూర్తికాగా, 6,216 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను మాత్రమే పూర్తయిన ఇళ్ళకు తరలించారు. పూర్తయిన అనేక ఇళ్ళలో, ప్రాథమిక సౌకర్యాలు అనగా మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయలేదు. ఇళ్లకు, ఇతర నిర్మాణాలకు ప్రహరీ గోడలు పూర్తి కాకపోవడంతో చేసిన ఖర్చు నిష్ఫలమైంది. 'భూమికి-భూమి' కేటాయింపు కింద సాగుకు పనికిరాని భూమిని సేకరించడం, తక్కువ/అధిక భూ కేటాయింపులు, అనర్హులైన లబ్ధిదారులకు భూకేటాయింపులు, అనుమతించిన పరిమితికి మించి భూమిని కేటాయించిన సందర్భాలు ఉన్నాయి. ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 అమల్లోకి వచ్చిన ఆరేళ్ల తర్వాత ఆలస్యంగా, 2020 మేలో ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ను ప్రభుత్వం నియమించింది. ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి సమర్థవంతమైన యంత్రాంగం కొరవడింది. పూర్తయిన ఆర్&ఆర్ కాలనీల్లో ఏ ఒక్కదానిలోనూ అమలు అనంతర సామాజిక తనిఖీ నిర్వహించలేదు.

## 6.1 పరిచయం

ప్రధాన ఆనకట్టలు, కాలువల నిర్మాణం వంటి అభివృద్ధి ప్రాజెక్టులకు భూసేకరణ అవసరం, ఫలితంగా ప్రజలు నిర్వాసితులు అవుతారు. నిర్వాసితమనేది అభివృద్ధి ప్రాజెక్టులకు, ప్రజలు తమ భూమిని, ఇతర ఆస్తులను, వనరులను కోల్పోయేలా చేసే ప్రక్రియ, అంతే కాకుండా బాధాకరమైన, మానసిక, సామాజిక-సాంస్కృతిక పరిణామాలకు దారితీస్తుంది. ఫలితంగా భౌతిక స్థానభ్రంశం, ఆదాయ నష్టం, ఇతర ప్రతికూల ప్రభావాలు సంభవించవచ్చు. నిర్వాసితుల ప్రయోజనాలను కాపాడటానికి, పునరావాసం[231] & పునరుపాధి కల్పన[232] (ఆర్&ఆర్) ప్రక్రియ చేపట్టబడుతుంది. పునరావాసం & పునరుపాధి కల్పన అనేది ప్రతికూలంగా ప్రభావితమైన వారి ఆదాయాలు, జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి లేదా కనీసం పునరుద్ధరించడానికి వారి ప్రయత్నాలలో సహాయం చేసే ప్రక్రియ.


ఛాయా చిత్రం 6.1: ఆర్&ఆర్ కాలనీని చూపుతోంది

భారత ప్రభుత్వం 2013లో భూసేకరణ, పునరావాసం & పునరుపాధి కల్పనలో పారదర్శకత, న్యాయమైన పరిహారం పొందే హక్కు (ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్) చట్టం అమలు చేసే (2014 జనవరి) వరకు ఆర్&ఆర్ ప్రక్రియ భూసేకరణ (ఎల్ఏ) చట్టం, 1894, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పునరావాస, పునరుపాధి కల్పన విధానం, 2005 ప్రకారం నిర్వహించబడేది.

ఆర్&ఆర్ కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలతో పాటు బాధితులకు భూ పరిహారం, ఆర్&ఆర్ ప్రయోజనాలు[233] కల్పించాలని ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 స్పష్టంగా పేర్కొంది. ఆర్&ఆర్ కార్యకలాపాల క్రింద, ఆర్&ఆర్ కాలనీల నిర్మాణానికీ, ప్రాజెక్టు కారణంగా ముంపునకు గురైె భూములను కోల్పోయిన అర్హులైన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు 'భూమికి-భూమి' పంపిణీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూమిని సేకరించాలి.

### 6.1.1 పునరావాసం & పునరుపాధి కల్పన ప్రక్రియ

ఆర్&ఆర్ పథకాల రూపకల్పన, అమలుకు ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ఇంకా కమీషనర్, ఆర్&ఆర్ బాధ్యత వహిస్తారు. తదనుగుణంగా ఆర్&ఆర్ అధికారులు[234] ప్రభావిత/ముంపు ప్రాంతంలో ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను[235] గుర్తించడానికి సర్వే నిర్వహించి, దశలవారీగా ఆర్&ఆర్ కార్యకలాపాల కోసం భూసేకరణకు అవసరమైన భూమిని అంచనా వేస్తారు. కమీషనర్, ఆర్&ఆర్ చే ముసాయిదా ప్రకటన ఆమోదించబడిన తర్వాత జిల్లా కలెక్టర్ ఆర్&ఆర్

231 పునరావాసం అంటే ప్రభావిత ప్రజలను పూర్వ స్థితికి తీసుకురావడం

232 పునరుపాధి కల్పన అంటే కొత్త ప్రాంతంలో మళ్ళీ స్థిరపడే ప్రక్రియ.

233 మొదటి షెడ్యూల్: భూమి పరిహారం, రెండవ షెడ్యూల్: ఆర్&ఆర్ ప్రయోజనాలు, మూడవ షెడ్యూల్: ఆర్&ఆర్ కాలనీలలో మౌళిక సదుపాయాలు

234 ఆర్‌డీఓ జంగారెడ్డిగూడెం, సబ్ కలెక్టర్ రంపచోడవరం, పీఓ (ఐటీడీఏ), కేఆర్ పురం, పీఓ (ఐటీడీఏ), చింతూరు

235 ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013, లోని సెక్షన్ 3 యొక్క నిబంధన ప్రకారం, జీవిత భాగస్వామి లేదా పిల్లలు లేదా ఆధారపడినవారు ఉన్న లేకున్నా 18 సంవత్సరాలు పైబడిన వయోజనులను ప్రత్యేక కుటుంబంగా పరిగణిస్తారు

పథకాన్ని ప్రచురిస్తారు, అవార్డులను ప్రకటిస్తారు. ***పటం 6.1*** లో వివరించిన విధంగా ఆర్&ఆర్ ప్రక్రియకు సమర్థవంతమైన సమన్వయం, కార్యకలాపాల అమలు అవసరం అవుతుంది.

**పటం 6.1: ఆర్&ఆర్ కార్యకలాపాలలో ఉన్న విధానాన్ని వర్ణిస్తుంది**




ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ప్రాజెక్టు పురోగతికి ప్రణాళిక రచించడంలో, పర్యవేక్షించడంలో కీలక పాత్ర పోషిస్తారు. ఇందులో ఖర్చులను గమనించడం, నిర్మాణ పురోగతిని అంచనా వేయడం, కాలపరిమితులకు కట్టుబడి ఉండేలా చూసుకోవడం ఉంటాయి. జిల్లా కలెక్టర్ ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను ప్రచురించిన తర్వాత, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ప్రభావిత కుటుంబాల సర్వే, కుటుంబాల గణనను నిర్వహించి, ముసాయిదా ఆర్&ఆర్ పథకాన్ని సిద్ధం చేసి అమలు చేస్తారు. ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ భూసేకరణ, పునరావాస ప్రయత్నాలు, బాధిత కుటుంబాలకు విశాలమైన భూమిలో ఇళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తారు. పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ప్రణాళిక నుండి అమలు, సామాజిక సంక్షేమం వరకు విజయవంతంగా అమలు కావడంలో ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కీలక పాత్ర పోషిస్తారు.

### 6.1.2 పునరావాసం & పునరుపాధి కల్పన స్థితి

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ లోని పూర్వపు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 222[236] రెవెన్యూ గ్రామాల్లోని 373[237] ఆవాస ప్రాంతాలను ముంపునకు గురిచేసి మొత్తం 1,88,012 జనాభాను ప్రభావితం చేసే బహుళార్థ సాధక ప్రాజెక్టు. మొత్తం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల సంఖ్య 1,06,006 గా అంచనా వేయబడింది, ఇందులో 56,495 గిరిజన కుటుంబాలు (సుమారు 53 శాతం) ఉన్నాయి.

ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల పునరావాసానికి ₹13,262 కోట్ల అంచనా వ్యయంతో మొత్తం 213 ఆర్&ఆర్ కాలనీలను నిర్మించాలని భావించారు.

2021 మార్చి చివరి నాటికి, మొత్తం 26 ఆర్&ఆర్ కాలనీలను ₹131.19 కోట్ల వ్యయంతో పూర్తిచేసి 3,922 పీడీఎఫ్ లను తరలించారు. నిర్మాణ దశలో ఉన్న 49 కాలనీలలో 6,216 పీడీఎఫ్ లను తరలించారు (2023 మార్చి). 2021 నవంబర్ లో పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఆర్&ఆర్ కార్యకలాపాలను రెండు దశలుగా పరిగణనలోకి

[236] పూర్వపు ఖమ్మం జిల్లాలోని (తెలంగాణ రాష్ట్రం) ఏడు మండలాల్లోని గ్రామాలను అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బదిలీ చేశారు

[237] ప్రాజెక్టు క్రింద ముంపుకు 371 ఆవాసాలు, ఎడమ, కుడి ప్రధాన కాలువల క్రింద రెండు ఆవాసాలు చొప్పున (పశ్చిమ గోదావరి జిల్లాలోని రామన్నపాలెం, తూర్పు గోదావరి జిల్లాలోని నెల్కోట) ప్రభావితమయ్యాయి

తీసుకోవాలని నిర్ణయించింది, అవి మొదటి దశ (ఎలివేటెడ్ లెవల్ (+) 41.15 మీ వరకు), రెండవ దశ ((+) 41.15 మీటర్ల పైన). మొదటి దశలో 20,946 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను, రెండవ దశలో 85,060 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించాలని ప్రతిపాదించారు.

రికార్డుల పరిశీలనలో ఈ క్రింది విషయాలు గమనించడమైంది:

(అ) ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ (ఆర్&ఆర్) కార్యాలయ రికార్డుల ప్రకారం, ప్రాజెక్టు ప్రారంభమైనప్పటి నుంచి 2023 మార్చి వరకు మొదటి దశలో, ***పట్టిక 6.1*** లో వివరించబడిన విధంగా, 11,677 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించారు.

**పట్టిక 6.1: సంవత్సరాల వారీగా పునరావాసం కల్పించబడిన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల సంఖ్య**

| సంవత్సరం | ఆవాస ప్రాంతాల సంఖ్య | పునరావాసం కల్పించబడ్డ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల సంఖ్య |
|---|---|---|
| 2013-14 వరకు | 6 | 714 |
| 2014-15 | 3 | 485 |
| 2015-16 | 8 | 2,581 |
| 2016-17 | 0 | 0 |
| 2017-18 | 0 | 0 |
| 2018-19 | 0 | 0 |
| 2019-20 | 0 | 0 |
| 2020-21 | 5 | 503 |
| 2021-22 | 13 | 3,679 |
| 2022-23 | 3 | 3,715 |
| **మొత్తం** | **38** | **11,677** |

*మూలం: ప్రాజెక్టు నిర్వాహకుడు, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, రాజమహేంద్రవరం అందించిన సమాచారం.*

పై పట్టిక నుండి ఈ క్రింది విషయాలు గమనించడమైంది:

(i) పునరావాసం కల్పించాల్సిన మొత్తం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల సంఖ్యలో 2014 మార్చి వరకు పునరావాసం కల్పించిన కుటుంబాలు 0.67 శాతం[238] మాత్రమే.

(ii) ప్రాజెక్టు పనులు ప్రారంభించి (2004లో) 16 సంవత్సరాలు (2020-21 వరకు) గడిచినప్పటికీ, మొదటి దశలో (2015-16 సంవత్సరం తప్ప) ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల యొక్క ఆర్&ఆర్ లో పురోగతి చాలా తక్కువగా ఉంది. 2016-21 మధ్యకాలంలో ఆర్&ఆర్ లో పురోగతి శూన్యం/అతి తక్కువ ఉంది.

(ఆ) ప్రతిపాదించిన 213 ఆర్&ఆర్ కాలనీల్లో ₹11,098.20 కోట్లతో రెండో దశ క్రింద తలపెట్టిన 138 ఆర్&ఆర్ కాలనీల పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

(ఇ) ఆర్&ఆర్ కార్యకలాపాలలో భాగంగా, 1,06,006 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు గృహనిర్మాణ యూనిట్ల ఏర్పాటుకు ఈ క్రింది పేర్కొన్న మూడు వికల్పాలు ఇవ్వబడ్డాయి:

- వికల్పం 1: 0.05 ఎకరాల విస్తీర్ణంలో అన్ని మౌళిక సదుపాయాలతో కూడిన 379.25 చదరపు అడుగులు ప్లింత్ ఏరియా గల గృహనిర్మాణ యూనిట్ ను ప్రభుత్వఖర్చుతో నిర్మించటం.

[238] మొత్తం 1,06,006 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలలో 714 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు

➢ వికల్పం 2: ప్రత్యేక కమిషనరు, ఆర్&ఆర్, ఆదేశాల ప్రకారం (2021 జూలై), షెడ్యూలేతర తెగల ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు ఆర్&ఆర్ కాలనీలో స్వయంగా ఇళ్ళు నిర్మించుకుంటే, ప్రతి కుటుంబానికి ఆర్&ఆర్ కాలనీలో అన్ని ప్రాథమిక మౌళిక సదుపాయాలతో కూడిన 0.05 ఎకరాల ఖాళీ స్థలంతో పాటు నిర్మాణ వ్యయం కోసం ₹2.85 లక్షలు చెల్లించటం.

➢ వికల్పం 3: ఆర్&ఆర్ కాలనీల వెలుపల స్వీయ-నిర్మాణాన్ని ఎంచుకున్న షెడ్యూలేతర తెగల ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు ఆర్&ఆర్ హక్కులతో పాటు ఏక పరిష్కార మొత్తంగా ₹3.85 లక్షలు[239] మంజూరు చేయుటం.

శాఖ రికార్డుల ప్రకారం పునరావాసం పొందిన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల సంఖ్య 11,677. అయితే, 75 ఆర్&ఆర్ కాలనీలకు తరలించబడిన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు (26 పూర్తయ్యాయి (3,922 కుటుంబాలు) + 49 పురోగతిలో ఉన్నాయి (6,216 కుటుంబాలు)) 10,138 మాత్రమే. మిగిలిన 1,539 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు సంబంధించిన, వాస్తవానికి తరలించబడ్డయా లేదా ఇంకా తరలించాలా అనే వివరాలు శాఖ వద్ద అందుబాటులో లేవు.

(ఈ) ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 ప్రవేశపెట్టిన తర్వాత (2014 జనవరి) ఆర్&ఆర్ పరిహారంలో పెరుగుదల కారణంగా లక్షిత ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల పునరావాసం పూర్తి చేయడంలో జాప్యం వలన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల ఆర్&ఆర్ పై అదనపు భారం పడింది. రెండవ ఆర్ సీసీ నివేదిక ప్రకారం, ఆర్&ఆర్ అంచనా వ్యయం ₹20,091.09 కోట్లకు పెరిగింది, ఇది 2005-06 వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక ₹744.60 కోట్లతో పోలిస్తే ₹19,346.49 కోట్లు పెరిగింది. మొత్తం ప్రాజెక్టులో వివిధ ధరల స్థాయిలలో ఆర్&ఆర్ భాగం ఖర్చు ***పటం 6.2*** లో చూపిన విధంగా ఉంది.

**పటం 6.2: వివిధ ధర స్థాయిలలో మొత్తం ప్రాజెక్టు వ్యయంలో ఆర్&ఆర్ భాగం**




పైన పేర్కొన్న దాని ప్రకారం, మొత్తం ప్రాజెక్టు వ్యయంలో ఆర్&ఆర్ అంచనా వ్యయ శాతం 2005-06 ధరల స్థాయిలో 7.33 నుంచి 2017-18 ధరల స్థాయిలో 36.10 కి పెరిగిందని స్పష్టమవుతోంది.

239 ఇంటి నిర్మాణ వ్యయానికి ₹ 2.85 లక్షలు, ఇంటి స్థలానికి ₹ 1.00 లక్ష

(ఉ) 2023 మార్చి నాటికి, (+) 41.15 మీటర్ల కంటూర్ స్థాయి వరకు ఆర్&ఆర్ కార్యకలాపాల కోసం అంచనా వేయబడి, సేకరించిన భూమి విస్తీర్ణం ***పట్టిక 6.2*** లో ఇవ్వడమైనది.

**పట్టిక 6.2: ఆర్&ఆర్ కార్యకలాపాల కోసం అవసరమైన, సేకరించిన భూమి వివరాలు**

**(ఎకరాలలో)**

| ఉద్దేశ్యం | అంచనా వేసిన భూమి విస్తీర్ణం | భూసేకరణ అధికారులను అభ్యర్థించిన భూమి | భూసేకరణ అధికారులు సేకరించి ఆర్&ఆర్ అధికారులకు అప్పగించిన భూమి | సేకరించాల్సిన మిగిలిన భూ విస్తీర్ణం |
|---|---|---|---|---|
| 'భూమికి-భూమి' క్రింద బదలాయింపు | 16,870.95 | 16,870.95 | 9,053.89 | 7,817.06 |
| ఆర్&ఆర్ కాలనీలు | 3,105.94 | 3,105.94 | 2,756.72 | 349.22 |
| మొత్తం | **19,976.89** | **19,976.89** | **11,810.61** | **8,166.28** |

*మూలం: ప్రాజెక్టు నిర్వాహకులు, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, రాజమహేంద్రవరం అందించిన సమాచారం*

ఎనిమిది[240] మండలాల్లోని 6,722 మంది లబ్ధిదారులకు 'భూమికి-భూమి' కేటాయించడానికి 16,870.95 ఎకరాల భూమి అవసరం కాగా, శాఖ 9,053.89 ఎకరాలను మాత్రమే సేకరించగలిగింది (2023 ఆగస్టు), మిగిలిన 7,817.06 ఎకరాలను ఇంకా సేకరించాల్సి ఉంది. 9,053.89 ఎకరాలలో, 3,886 మంది లబ్ధిదారులకు 8,478.85 ఎకరాలను కేటాయించగా, మిగిలిన 575.04 ఎకరాల భూమిని ఇంకా కేటాయించాల్సి ఉంది.

ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 నిబంధనల[241] ప్రకారం, జలాశయంలో నీటిని నిల్వ చేయడానికి ఆరు నెలల ముందే ఆర్&ఆర్ కార్యకలాపాలు పూర్తి చేయాలి. ఈ ప్రాజెక్టు 2026 మార్చి నాటికి పూర్తి కావాల్సి ఉన్నందున, ఆర్&ఆర్ కార్యకలాపాలలో మందకొడి పురోగతి వలన, ప్రధాన ఆనకట్ట పనులు షెడ్యూల్ ప్రకారం పూర్తయినప్పటికీ, జలాశయంలోకి నీటిని నిల్వ చేయలేకపోవచ్చు. ప్రాజెక్టు ప్రారంభం (2004) నుంచి 2023 మార్చి చివరకు ఆర్&ఆర్ పురోగతి 11 శాతం[242] కంటే తక్కువగా ఉన్నందున, మిగిలిన 89 శాతానికి పైగా ఉన్న ఆర్&ఆర్ పనులు 2026 మార్చి నాటికి పూర్తయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి.

ఆనకట్ట ప్రాంతం నుండి ఎగువ కంటూర్ ముంపు ప్రాంతాలకు దశల వారీగా భూసేకరణ చేపట్టామని ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ బదులిచ్చారు (2022 డిసెంబర్). గ్రామసభలు నిర్వహించిన తర్వాత కూడా కొన్ని ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు తమ గుర్తింపును సమర్పించడంలో విఫలం కావడంతో ఆర్&ఆర్ ఖరారులో జాప్యం జరిగింది. ఇంకా, భూసేకరణ 2007లో ప్రారంభించబడి 2011 నాటికి పూర్తయింది, ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 ప్రవేశపెట్టిన తర్వాత ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు కొత్త చట్టం ప్రకారం ఆర్&ఆర్ హక్కులను డిమాండ్ చేశాయి. అప్పటికి తరలించబడని గ్రామాలకు ప్రభుత్వం ఉచిత ఉపశమనం కోసం ఉత్తర్వులు జారీ చేసింది, అవి అందిన తర్వాత ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను తరలించారు. (+) 41.15 మీటర్ల పైన ఉన్న కంటూర్‌కు సంబంధించి, సామాజిక ఆర్థిక సర్వే 2021 నవంబర్ లో పూర్తయింది, ముసాయిదా పథకం రూపకల్పన పురోగతిలో ఉంది. ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల పునరావాస ప్రక్రియను ప్రారంభించి 2023 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. ఆర్&ఆర్ కార్యకలాపాలకు నిర్దేశించుకున్న గడువులను రాబోయే కాలంలో అందజేస్తామన్నారు.

అందువల్ల, 2011 నాటికి భూసేకరణ పూర్తయినప్పటికీ, ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 ప్రవేశపెట్టడానికి ముందు ఆ శాఖ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించలేకపోయింది, ఇది పరిహారం ఖర్చును

240 పోలవరం, కుకునూరు, వేలేరుపాడు, దేవీపట్నం, వీఆర్ పురం, కూనవరం, ఏటపాక, చింతూరు

241 ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 38(1) యొక్క 2వ నిబంధన ప్రకారం

242 పునరావాసం కల్పించబడిన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు/మొత్తం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు (11,677/1,06,006)

పెంచింది. జలాశయంలో నీటిని నిల్వ చేయడానికి ప్రధాన ప్రాజెక్టు పనులు పూర్తయ్యే ముందే ఆర్&ఆర్ కార్యకలాపాలను పూర్తి చేయడానికి ఎటువంటి కాలపరిమితులను రూపొందించలేదని సమాధానం నిర్ధారిస్తుంది.

ముగింపు సమావేశంలో ప్రభుత్వం 26 కాలనీలు పూర్తయ్యాయని, 49 పురోగతిలో ఉన్నాయని, అదనంగా, లైడార్ సర్వే తర్వాత గుర్తించిన 17,500 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల కోసం (20,946 నుండి 38,060కి పెరిగిన) మరో 27 కాలనీలు ప్రణాళిక చేయబడ్డాయని పేర్కొంది (2024 నవంబర్). గడువు ఒక సంవత్సరం పొడిగించుకోవచ్చనే వెసులుబాటుతో, ఈ కాలనీలన్నింటినీ 2026 మార్చి నాటికి పూర్తి చేయాలని యోచిస్తున్నారు. పునరావాసంలో కేవలం 11 శాతం మాత్రమే పూర్తి కావడం గురించి, ఆర్&ఆర్ కాలనీలలో చాలా పనులు 2022 నుండి నిలిచిపోయాయని, 49 కాలనీలలో సౌకర్యాలను కల్పించే ప్రక్రియ ఇప్పుడే ప్రారంభించబడిందని సమాధానమిచ్చారు.

గత 17 సంవత్సరాలలో కేవలం 11,677 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించబడడం వలన, ఆర్&ఆర్ కాలనీల నిర్మాణ వేగాన్ని పరిశీలిస్తే, 2026 మార్చి నాటికి మరో 26,383 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల (38,060 – 11,677) పునరావాసం పూర్తయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నందున సమాధానం ఆమోదయోగ్యం కాదు.

***సిఫార్సు 6.1: రాష్ట్ర ప్రభుత్వం ఆర్&ఆర్ కార్యకలాపాల కోసం భూసేకరణను వేగవంతం చేయాలి, జలాశయంలో నీటిని నిల్వ చేయడానికి ముందే ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను తరలించడానికి ఆర్&ఆర్ కార్యకలాపాలను వేగవంతం చేయాలి.***

## 6.2 ప్రాజెక్టు ప్రభావిత ఆవాస ప్రాంతాలు, నిర్వాసిత కుటుంబాల గుర్తింపు

ఆర్ఎఫ్సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 3 ప్రకారం నిర్వాసిత కుటుంబం అంటే భూసేకరణ వల్ల ప్రభావిత ప్రాంతం నుంచి పునరావాస ప్రాంతానికి తరలించాల్సిన కుటుంబం. అంతేకాక, పై సెక్షన్ లోని నిబంధన ప్రకారం, జీవిత భాగస్వామి లేదా వారి పిల్లలు లేదా వారి పై ఆధారపడినవారు ఉన్నా లేకున్నా, 18 సంవత్సరాలు పైబడిన ప్రతీ ఒక్క వయోజనులను ప్రత్యేక కుటుంబంగా పరిగణిస్తారు.

### 6.2.1 కంటూర్ల మధ్య ఆవాస ప్రాంతాలను తప్పుగా గుర్తించడం

ఆర్&ఆర్ కార్యకలాపాలకు వాస్తవంగా అవసరమైన భూమిని అంచనా వేయడానికి, ప్రాజెక్టు ప్రభావిత ఆవాస ప్రాంతాలు, నిర్వాసిత కుటుంబాల అంచనా చాలా అవసరం. సర్వే, జనాభా లెక్కలు మొదలైన వివిధ పద్ధతులను అనుసరించి దీనిని చేపట్టారు.

శాఖ వివరణాత్మక క్షేత్ర స్థాయి సర్వే నిర్వహించి, పూర్తి జలాశయ స్థాయి కంటూర్ ను నేలపై నుంచి (+) 45.72 మీటర్ల వరకు నిర్ణయించే (2005 జూన్) పనిని ఒక సంస్థకు[243] అప్పగించింది. ఈ సర్వే ఆధారంగా, శాఖ భూమిని సేకరించడం ప్రారంభించి, ఆర్&ఆర్ కార్యకలాపాలను దశల వారీగా లోతట్టు నుంచి ఎగువ వరకు అంటే (+) 35.00 మీటర్ల దిగువకు, (+) 35.00 మీటర్ల నుంచి (+) 41.15 మీటర్ల మధ్య, (+) 41.15 మీటర్ల నుంచి (+) 45.72 మీటర్ల వరకు చేపట్టింది.

గోదావరి నదిలో 2020 లో సంభవించిన వరదల్లో రెండు మండలాల్లో (వేలేరుపాడు, కుకునూరు) (+) 41.15 మీటర్లు, (+) 45.72 మీటర్ల కంటూర్ల మధ్య ఉన్న 74 ఆవాస ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమై ముంపునకు గురయ్యాయి. ఈ మేరకు మొదటి దశలోనే తమ గ్రామాల తరలింపునకూ, ఆర్&ఆర్ కార్యకలాపాలకూ ప్రాధాన్యమివ్వాలని గ్రామస్తులు గతంలో (2014-15 తర్వాత) ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు.

243 మెస్సర్స్ విజన్ ల్యాబ్స్, హైదరాబాద్

వరదల తర్వాత, ముంపునకు గురయ్యే ఆవాస ప్రాంతాల ఖచ్చితమైన ప్రదేశం, ఎత్తును గుర్తించేందుకు లైడార్ (లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్) సర్వే చేపట్టాలని, తద్వారా (+) 41.15 మీటర్ల దిగువన, (+) 41.15 మీటర్లకు ఎగువన ఉన్న ఆవాస ప్రాంతాల సంఖ్యను గుర్తించాలని ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్, కమీషనర్, ఆర్&ఆర్ ప్రభుత్వాన్ని కోరారు. దీని ప్రకారం ₹1.85 కోట్ల వ్యయంతో ఒక సంస్థకు[244] (2021 జూలై) లైడార్ సర్వే నిర్వహించేందుకు ప్రభుత్వం ఆమోదం[245] తెలిపింది (2021 మే).

ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ వారి కార్యాలయ రికార్డులను పరిశీలించినప్పుడు, లైడార్ సర్వే తర్వాత, ప్రభావిత 74 ఆవాస ప్రాంతాలలో 1,038 ప్రాజెక్టు నిర్వాసితులు ఉన్న తొమ్మిది (ఐదు[246] పూర్తిగా + నాలుగు[247] పాక్షికంగా మునిగిపోయాయి) ముంపు ప్రభావిత ప్రాంతాలు 41.15 మీటర్ల కంటూర్ కు దిగువన ఉన్న ఆవాస ప్రాంతాలుగా గుర్తించబడ్డాయి. గ్రామసభలు నిర్వహించడం, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల జాబితాను ప్రచురించడం, ఆర్&ఆర్ కాలనీలను పూర్తి చేయడం ద్వారా ఈ తొమ్మిది ఆవాస ప్రాంతాలలో ఆర్&ఆర్ ప్రక్రియకు ప్రాధాన్యమిచ్చి, ప్రారంభించాలని ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు (2022 అక్టోబర్).

2005లో నిర్వహించిన సర్వే నివేదికను గానీ, 2022 నాటి లైడార్ సర్వే నివేదికను గానీ ఆడిట్ కు అందజేయనందున (+) 41.15 మీటర్ల కాంటూర్‌కు దిగువన, ఎగువన ఉన్న ఆవాస ప్రాంతాల వర్గీకరణలో నిజానిజాలను ధ్రువీకరించడం సాధ్యం కాలేదు.

అందువల్ల లైడార్ సర్వే ద్వారా గుర్తించబడిన (+) 41.15 మీటర్ల కంటూర్‌కు దిగువన ఉన్న తొమ్మిది ఆవాస ప్రాంతాలను మునుపటి సర్వేల ఆధారంగా తప్పుగా (+) 41.15 మీటర్ల కంటూర్‌కు ఎగువన ఉన్నవిగా వర్గీకరించడంవల్ల ఈ ఆవాస ప్రాంతాలకు ఆర్&ఆర్ కార్యకలాపాలు చేపట్టలేదు. ప్రాజెక్టు పనులు ప్రారంభించి 17 ఏళ్లు గడిచినా లైడార్ సర్వే ఆలస్యంగా చేపట్టడం వల్ల, (+) 41.15 మీటర్ల కంటూర్‌కు దిగువ పరిధిలోకి వచ్చే, గతంలో శాఖ గుర్తించని ఈ ఆవాస ప్రాంతాలు వరదలు, ముంపు సమస్యలతో తీవ్రంగా నష్టపోయాయి.

(+) 2 మీటర్ల వరకు తటస్థ ప్రాంతం (బఫర్ జోన్) తో (+) 45.72 మీటర్ల అత్యంత ఖచ్చితమైన, సునిశ్చితమైన (ప్రిసైజ్) కంటూర్‌ను ఏర్పాటు చేయడానికి, వివిధ కంటూర్‌ల వద్ద ముంపుకు గురైయ్యే ఆవాస ప్రాంతాలతో కంటూర్‌లను పరస్పరం అనుసంధానించడానికి లైడార్ సర్వే నిర్వహించబడిందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). లైడార్ సర్వే నివేదిక ఆధారంగా, రెవెన్యూ, జల వనరుల శాఖ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ అధికారుల సంయుక్త తనిఖీ, వాప్కోస్ ద్వారా తృతీయ పక్ష మూల్యాంకనం ఆధారంగా (+) 41.15 మీటర్ల కంటూర్ దిగువ పరిధిలో మరో 48 ఆవాసాలు ప్రభావితమయ్యాయని గుర్తించారు. గతంలో రెండవ దశ క్రింద ఉంచిన ఈ 48 ఆవాసాలను ఇప్పుడు మొదటి దశ ((+) 41.15 మీ కంటే దిగువ) క్రింద ప్రాధాన్యత ఇచ్చారు. ఈ 48 ప్రాధాన్య ఆవాస ప్రాంతాలకు సంబంధించి ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేయబడింది, సామాజిక ఆర్థిక సర్వే (ఎస్ఈఎస్) పూర్తయింది, ప్రస్తుతం ఆర్&ఆర్ ముసాయిదా పథకం తయారీ పురోగతిలో ఉంది.

ముగింపు సమావేశంలో ప్రభుత్వం మునుపటి సర్వేను ఖచ్చితంగా నిర్వహించినప్పటికీ, ప్రవేశ మార్గములు, వంతెనలు మొదలైన అంతః స్థాయిల (ఇంటర్ మిటెంట్ లెవల్స్) ను విస్మరించారని, వీటిని 2019-20 వరదల సమయంలో మాత్రమే గుర్తించారని, అందువల్ల లోపాలన్నింటిని గుర్తించడానికి లైడార్ సర్వేను చేశామని పేర్కొంది (2024 నవంబర్). ఇప్పుడు సర్వే పూర్తయిందని, కొత్తగా గుర్తించిన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల పునరావాసం మొదటి దశ గడువులోగా పూర్తవుతుందన్నారు.

---

244 మెస్సర్స్ ఐఐసి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్

245 జీఓఎంఎస్ సంఖ్య 162 డబ్ల్యుఆర్ (ప్రాజెక్టు.I) శాఖ, తేదీ 27.05.2021

246 కాకిస్నూర్, పెదమానుకొల్లు, టేకూరు, పేరంటాలపల్లి, టేకుపల్లి

247 తూర్పుమెట్ట, కావారం, యర్రమెట్ట, యడవల్లి

2005లో (+) 41.15 మీటర్ల కంటూర్ కంటే దిగువన ఉన్న ఆవాస ప్రాంతాల గుర్తింపు ఖచ్చితమైనది కాదని, ఇది ఆవాస ప్రాంతాల ముంపుకు దారితీసిందని సమాధానం నిర్ధారిస్తుంది.

### 6.2.2 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల సమాచారంలో వైరుధ్యం

ఆర్ఎఫ్‌సిటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 38(2) ప్రకారం, బాధిత కుటుంబాలను తరలించే ముందే ఆర్&ఆర్ ప్రక్రియ అన్ని విధాలుగా పూర్తయ్యేలా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్‌ది. ఇంకా, చట్టంలోని 'రెండవ షెడ్యూల్' నిబంధనల ప్రకారం, భూసేకరణ కారణంగా కోల్పోయిన ఇంటికి బదులుగా ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం అందించిన మూడు వికల్పాలలో (పేరా 6.1.2 (ఇ) చూడండి) ఏదైనా ఒకదాన్ని ఎంచుకోవచ్చు.

కమీషనర్, ఆర్&ఆర్, విజయవాడ, ***పట్టిక 6.3*** లో వివరించిన విధంగా 2017 మార్చి[248] నాటికి పోలవరం నీటిపారుదల ప్రాజెక్టులోని ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు సంబంధించి క్రింది సమాచారాన్ని అందించారు.

**పట్టిక 6.3: 2017 మార్చి నాటికి పునరావాసం కల్పించబడిన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల వివరాలు**

| కంటూర్ స్థాయి (మీటర్లలో) | కంటూర్ స్థాయిలో నిల్వ సామర్థ్యం (టీఎంసీలలో) | పునరావాసం కల్పించాల్సిన మొత్తం పీడీఎఫ్ ల సంఖ్య | | పునరావాసం కల్పించిన పీడీఎఫ్ ల సంఖ్య | | ఇంకా పునరావాసం కల్పించాల్సిన పీడీఎఫ్ ల సంఖ్య | |
|---|---|---|---|---|---|---|---|
| | | గ్రామాల సంఖ్య | పీడీఎఫ్ ల సంఖ్య | గ్రామాల సంఖ్య | పీడీఎఫ్ ల సంఖ్య | గ్రామాల సంఖ్య | పీడీఎఫ్ ల సంఖ్య |
| (+) 35.00 | 30 | 27 | 9,204 | 15 | 4,069 | 12 | 5,135 |
| (+) 41.15 | 120 | 64 | 11,552 | – | Nil | 64 | 11,552 |
| (+) 45.72 | 194 | 280 | 84,845 | – | Nil | 280 | 84,845 |
| **మొత్తం** | | **371** | **1,05,601** | **15** | **4,069** | **356** | **1,01,532** |

*మూలం: భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ వారి 2018 లోని నాల్గవ నివేదిక*

ప్రాజెక్టు నిర్వాహకులవారి రికార్డుల ప్రకారం, 2023 మార్చి నాటికి పునరుద్ధరించబడిన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల తాజా స్థితి ***పట్టిక 6.4*** లో వివరించబడింది.

**పట్టిక 6.4: 2023 మార్చి నాటికి పునరావాసం కల్పించబడిన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు**

| కంటూర్ స్థాయి (మీటర్లలో) | పునరావాసం కల్పించాల్సిన మొత్తం పిడీఎఫ్ ల సంఖ్య | | పునరావాసం కల్పించిన పిడీఎఫ్ ల సంఖ్య | | ఇంకా పునరావాసం కల్పించాల్సిన పిడీఎఫ్ ల సంఖ్య | |
|---|---|---|---|---|---|---|
| | ఆవాస ప్రాంతాల సంఖ్య | పిడీఎఫ్ ల సంఖ్య | ఆవాస ప్రాంతాల సంఖ్య | పిడీఎఫ్ ల సంఖ్య | ఆవాస ప్రాంతాల సంఖ్య | పిడీఎఫ్ ల సంఖ్య |
| (+)35.00 | 58 | 9,612 | 28 | 7,701 | 30 | 1,911 |
| (+)41.15 | 65 | 11,334 | 10 | 3,976 | 55 | 7,358 |
| (+)45.72 | 250 | 85,060 | 0 | 0 | 250 | 85,060 |
| **మొత్తం** | **373** | **1,06,006** | **38** | **11,677** | **335** | **94,329** |

*మూలం: పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, ప్రాజెక్టు నిర్వాహకుల వారి రికార్డులు, రాజమహేంద్రవరం*

[248] భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ వారి ఆడిట్ నివేదిక సంఖ్య 4, 2018 లోని పేరా 2.1.9.2 (ii)

ఆడిట్ ఈ క్రింది విషయాలను గమనించడమైంది:

(i) ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అందించిన సమాచారం ప్రకారం, 2017 మార్చి నాటికి 3,780 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించారు (***పట్టిక 6.1*** చూడండి). అయితే, ఆర్&ఆర్ కమీషనర్ మాత్రం 4,069 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించామని పేర్కొన్నారు. అందువల్ల, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్, ఆర్&ఆర్ కమీషనర్, అందించిన సమాచారంలో వైవిధ్యం ఉంది.

(ii) ఆర్&ఆర్ కమీషనర్ అందించిన సమాచారం ప్రకారం, పూర్తి జలాశయ స్థాయి వరకు మొత్తం 371 ఆవాస ప్రాంతాలు ((+) 41.15 మీటర్ల వరకు 91 ఆవాస ప్రాంతాలు, (+) 41.15 మీటర్ల కంటూర్ పైన 280 ఆవాస ప్రాంతాలు) మునిగిపోతాయి (భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ వారి 2018 లోని నాల్గవ నివేదిక లోని పేరా 2.1.9.2 (ii) పేర్కొన్న విధంగా), 1,05,601 కుటుంబాలు స్థానభ్రంశానికి గురవుతాయి. అయితే, 2023 మార్చి నాటికి, 1,06,006 కుటుంబాలను స్థానభ్రంశం అవుతారని మొత్తం 373 ఆవాస ప్రాంతాలు ((+) 41.15 మీటర్ల వరకు 123 ఆవాస ప్రాంతాలు, (+) 41.15 మీటర్ల కంటూర్ పైన 250 ఆవాస ప్రాంతాలు) ప్రభావితమవుతాయని నివేదించబడింది.

అందువల్ల, కంటూర్ ల మధ్య ఆవాస ప్రాంతాలు, పునరావాసం కల్పించాల్సిన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పొంతన లేదు, దీని కారణంగా చేపట్టిన ఆర్&ఆర్ కార్యకలాపాల యొక్క గణాంకాల అనుగుణ్యతను, అనుకూలతను ఆడిట్ నిర్ధారించలేకపోయింది.

2017 మార్చిలో సమర్పించిన గణాంకాలకు, ఇప్పుడు సమర్పించిన గణాంకాలకు మధ్య వ్యత్యాసాలకు కారణం 2020 లో పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు యొక్క ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ వారి కార్యాలయం ప్రారంభించబడిందని, (+) 41.15 మీటర్ల కంటూర్ స్థాయికి సామాజిక ఆర్థిక సర్వే 2017 డిసెంబర్ లో పూర్తయినందున ఆర్&ఆర్ కమీషనర్, నివేదించిన గణాంకాలు (2017 మార్చి) తాత్కాలికమని, ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). ఇంకా, ముంపునకు గురైన ఆవాస ప్రాంతాలు, నిర్వాసిత కుటుంబాల సంఖ్యల మధ్య తేడాలకు సంబంధించి, పూర్తి జలాశయ స్థాయి వరకు 371 ఆవాస ప్రాంతాలు ముంపునకు గురవుతాయని, కుడి, ఎడమ ప్రధాన కాలువల క్రింద అలైన్‌మెంట్ కారణంగా మరో రెండు ఆవాస ప్రాంతాలు స్థానభ్రంశం చెందుతాయని సమాధానమిచ్చారు. ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల మధ్య వ్యత్యాసం రెండు ఆవాస ప్రాంతాలును జోడించడం వల్ల వచ్చింది. (+) 41.15 మీటర్ల కంటూర్‌కు ఎగువ ఉన్న ఆవాస ప్రాంతాలకు సంబంధించిన సామాజిక ఆర్థిక సర్వే 2022లో పూర్తయిందని, ఆర్&ఆర్ పథకం ముసాయిదాను రూపొందిచటానికి ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013లోని సెక్షన్ 16 క్రింద అభ్యంతరాల విచారణ పురోగతిలో ఉందని కూడా సమాధానమిచ్చారు.

ఆర్&ఆర్ కార్యకలాపాల యొక్క ప్రతి దశలోనూ సమాచారం మారుతూ వచ్చినందున, ఆడిట్ కు సమర్పించిన సమాచారంలో స్థిరత్వం లేనందున ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల ఆర్&ఆర్ కి సంబంధించిన సమాచారం యొక్క ప్రామాణికతను నిర్ధారించడం సాధ్యం కాలేదు.

### 6.2.3 ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత జనాభా గణన పూర్తి చేయడంలో జాప్యం

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 16(1) ప్రకారం, జిల్లా కలెక్టర్ ప్రిలిమినరీ నోటిఫికేషన్ ప్రచురించిన తర్వాత, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ నిర్దేశించిన విధంగా, నిర్దేశిత గడువులోగా ఒక సర్వే[249] నిర్వహించి, ప్రభావిత కుటుంబాల గణనను చేపట్టాలి. సెక్షన్ 19(2) ప్రకారం ప్రిలిమినరీ నోటిఫికేషన్ (పీఎన్) వెలువడిన తేదీ నుంచి 12 నెలల్లోగా జిల్లా కలెక్టర్ డిక్లరేషన్ తోపాటు ఆర్&ఆర్ పథకం సారాంశాన్ని ప్రచురించాలి. ఇంకా, సెక్షన్ 19(7) ప్రకారం ప్రిలిమినరీ నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుంచి 12 నెలల్లోగా డిక్లరేషన్ ఇవ్వకపోతే ఆ

[249] ప్రభావితమైన ప్రతి కుటుంబం నుంచి స్వాధీనం చేసుకుంటున్న భూములు, స్థిరాస్తులు, భూమి కోల్పోయిన వారి జీవనోపాధి, ప్రభావితమైన లేదా ప్రభావితం అయ్యే అవకాశం ఉన్న సౌకర్యాలు, మౌళిక సదుపాయాలు

నోటిఫికేషన్‌ను రద్దు చేసినట్లుగా పరిగణిస్తారు. అలాగే, ఆర్&ఆర్ పథకం ప్రచురణకు ముందే సామాజిక ఆర్థిక సర్వే (ఎస్ఈఎస్) నిర్వహించాలి.

ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ వారి కార్యాలయ రికార్డుల పరిశీలనలో, 77 ఆవాస ప్రాంతాలలోని గ్రామ కంఠాలకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ (2009 జూన్ నుండి 2017 ఆగస్టు మధ్య) ప్రచురించబడిందని, 351 ఆవాస ప్రాంతాలకు సామాజిక ఆర్థిక సర్వే (2017 జనవరి నుండి 2021 నవంబర్ మధ్య) పూర్తయిందని వెల్లడైంది. అయితే, మిగిలిన 296 (373–77) ఆవాస ప్రాంతాలకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ ల వివరాలు, మిగిలిన 22 ఆవాస ప్రాంతాలకు (373–351) సామాజిక ఆర్థిక సర్వే నిర్వహణకు సంబంధించిన సమాచారం ఆడిట్‌కు అందించలేదు.

***పటం 6.3*** లో చూపించిన విధంగా 77 ఆవాస ప్రాంతాలలో, 41 ఆవాస ప్రాంతాల ప్రిలిమినరీ నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి సామాజిక ఆర్థిక సర్వే పూర్తి చేసిన తేదీ 12 నెలల నిర్దేశిత కాలపరిమితిని మించిందని, ఇది ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క నిబంధనలకు విరుద్ధం అని ఆడిట్ గుర్తించింది.

**పటం 6.3: జనాభా లెక్కల నిర్వహణలో జాప్యం**




***అనుబంధం 6.1*** లో వివరించిన విధంగా ప్రిలిమినరీ నోటిఫికేషన్ తేదీ, సామాజిక ఆర్థిక సర్వే తేదీ మధ్య జాప్యం ఒకటి నుండి తొమ్మిది సంవత్సరాల వరకు ఉంది (చట్టంలో అందించిన 12 నెలలను మినహాయించగా). సామాజిక, ఆర్థిక సర్వే గడువులోపు పూర్తి కాకపోవడంతో, ప్రిలిమినరీ నోటిఫికేషన్ తేదీ నుండి 12 నెలల్లోపు డిక్లరేషన్ చేయడానికి ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లో నిర్దేశించిన కాలపరిమితులను పాటించలేదని ఇది సూచిస్తుంది.

ప్రిలిమినరీ నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి ఒక సంవత్సరం లోపు సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహణకు సంబంధించి జాప్యం జరిగిందని ప్రభుత్వం అంగీకరించింది (2024 ఆగస్టు).

నిర్దేశిత కాలపరిమితి పాటించకపోవడం వల్ల లబ్ధిదారులకు చెల్లింపుల్లో అనవసర జాప్యం జరిగి సామాజికంగా ఇబ్బంది కలుగటంతో పాటు ఆర్&ఆర్ ప్రక్రియను ఆలస్యంగా పూర్తిచేయడం వలన ప్రాజెక్టు అమలు సమయం, వ్యయం పెరగడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.

## 6.2.4 ఆర్&ఆర్ పథకం అమలు, వెబ్ ఆధారిత వర్క్ ఫ్లో రూపొందించటానికి కాలపరిమితులు

### 6.2.4.1 కాలపరిమితి లేకుండా ఆర్&ఆర్ పథకాల అమలు

ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 16 (2) & (3) ప్రకారం, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్, సర్వే, జనాభా లెక్కల ఆధారంగా ఒక ముసాయిదా ఆర్&ఆర్ పథకాన్ని సిద్ధం చేయాలి, ఇందులో ప్రతి భూ యజమాని జీవనోపాధి, సేకరించబడుతున్న భూములపై ప్రధానంగా ఆధారపడిన భూమి లేని వారు, ప్రభావిత కుటుంబాల పునరావాసం ఎక్కడ ఉంటుందో వారి ఆర్&ఆర్ హక్కుల వివరాలు ఉంటాయి. ఇంకా, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ రూపొందించిన

ముసాయిదా ఆర్&ఆర్ పథకంలో, పథకం అమలుకు కాలపరిమితిని చేర్చాలి. ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ రూపొందించిన ముసాయిదా పథకాన్ని జిల్లా కలెక్టర్ సమీక్షించి, ఆ తర్వాత ఆమోదం కోసం, ఆర్&ఆర్ కమీషనర్ కు పంపుతారు. 16,967 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు లబ్ధి చేకూర్చే 97 ఆర్&ఆర్ పథకాలకు (2017 అక్టోబర్ నుంచి 2021 ఫిబ్రవరి వరకు) కమీషనర్ ఆమోదం తెలిపినట్లు రికార్డుల పరిశీలనలో వెల్లడైంది. అయితే ఆర్&ఆర్ పథకం అమలు కాలపరిమితిని ఆర్&ఆర్ కమీషనర్ వివరించలేదు.

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 38(1) ప్రకారం ముంపునకు ఆరు నెలల ముందే ఆర్&ఆర్ పనులు పూర్తి చేయాలని, జలాశయంలో నీటిని నిల్వ చేయడానికి ముందే ఆర్&ఆర్ కార్యకలాపాలను పూర్తి చేయడానికి సమర్థవంతమైన చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ పేర్కొంది (2022 సెప్టెంబర్).

2013 చట్టం, పథకాల అమలుకు కాలపరిమితిని ప్రత్యేకంగా నొక్కి చెబుతుంది కాబట్టి సమాధానం ఆమోదయోగ్యం కాదు.

ప్రభుత్వం నుంచి సమాధానం రావాల్సి ఉంది (2024 నవంబర్).

### 6.2.4.2 ఆర్&ఆర్ కార్యకలాపాల కొరకు వెబ్ ఆధారిత వర్క్ ఫ్లో రూపొందించడం

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013లోని సెక్షన్ 18 ప్రకారం, కమీషనర్ ఆమోదించిన ఆర్&ఆర్ పథకాన్ని స్థానిక భాషలో గ్రామీణ/పట్టణ స్థానిక సంస్థలకు అందుబాటులో ఉంచి, ప్రభావిత ప్రాంతాల్లో ప్రచురించాలి. ఇంకా, ఆర్&ఆర్ పథకాన్ని సంబంధిత ప్రభుత్వ వెబ్ సైట్ లో పొందుపరచాలి. ఆంధ్రప్రదేశ్ ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ నియమాలు, 2014 లోని నియమం 16 ప్రకారం, ఆర్&ఆర్ కమీషనర్, ఒక ప్రత్యేకమైన ప్రజా వేదికగా, వినియోగదారు సులభంగా ఉపయోగించగల వెబ్‌సైట్‌ను రూపొందించి, సామాజిక ప్రభావ అంచనా (ఎస్ఐఏ) నోటిఫికేషన్‌తో ప్రారంభించి, నిర్ణయం తీసుకోవడం, అమలు, ఆడిట్ యొక్క ప్రతి దశను పొందుపరచడం ద్వారా ఇది ప్రతీ భూసేకరణ కేసు యొక్క మొత్తం వర్క్‌ఫ్లోను తెలియజేయడానికి ఉపయోగపడుతుంది.

ప్రతి సేకరణ కేసు యొక్క వర్క్‌ఫ్లోను వివరిస్తూ, ఆమోదించబడిన 97 ఆర్&ఆర్ పథకాల్లో ఏపీ పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఆర్&ఆర్ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ యొక్క అధికారిక వెబ్ సైట్‌లో[250] పొందుపరచలేదని ఆడిట్ గుర్తించింది.

ఆర్&ఆర్ పథకాలు, అవార్డులు వెబ్ సైట్‌లో[251] అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 ఆగస్టు).

ఆర్&ఆర్ పథకాలు, ఆమోదించబడిన/ఇవ్వబడిన అవార్డుల గురించి ఎటువంటి వివరాలు పైన పేర్కొన్న వెబ్ సైట్‌లో లేనందున సమాధానం సరైనది కాదు.

### 6.2.5 ఆర్&ఆర్ పథకంలో ప్రాథమిక సమాచారాన్ని చేర్చకపోవడం

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 3(ఎం) ప్రకారం, జీవిత భాగస్వామి లేదా పిల్లలు లేదా ఆధారపడినవారు ఉన్నా లేకున్నా 18 సంవత్సరాలు పైబడిన వయోజనులను, ఆర్&ఆర్ సౌకర్యాలను పొందడానికి ప్రత్యేక కుటుంబంగా పరిగణిస్తారు.

పోలవరం మండలం వాడపల్లి గ్రామంలో 194 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబలకు (షెడ్యూల్డ్ తెగ: 165 పీడీఎఫ్ లు, షెడ్యూలేతర తెగలు: 29) ₹13.52 కోట్ల ఆర్&ఆర్ నగదు ప్రయోజనాలు మంజూరైనట్లు (2020 అక్టోబర్)

250 https://www.polavaramrr.ap.gov.in/

251 https://www.polavaramrr.ap.gov.in/publicinformationtoaccess

రికార్డుల పరిశీలనలో తేలింది. ₹13.52 కోట్లలో ₹10.19 కోట్లు[252] (2022 సెప్టెంబర్) ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు చెల్లించారు.

ఆడిట్ ఈ క్రింది విషయాలను గమనించడమైంది:

(i) రెవెన్యూ అధికారులు అందించిన సమాచారంలో, ఆమోదించబడిన ఆర్&ఆర్ పథకంలో, అవార్డులలో, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల వయస్సుకు సంబంధించిన వివరాలు అందుబాటులో లేనందున, 18 సంవత్సరాలు పైబడిన అర్హత కలిగిన వ్యక్తులకు పరిహారం చెల్లించబడిందా లేదా అని ఆడిట్ నిర్ధారించలేకపోయింది.

(ii) ఆర్&ఆర్ పరిహారం పొందడానికి, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల యొక్క ధ్రువీకరణ/గుర్తింపు కొరకు అన్ని ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు రేషన్ కార్డ్ లేదా ఆధార్ వివరాలను సమర్పించాలి. అయితే, ఆమోదించబడిన ఆర్&ఆర్ పథకంలో, 22 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు సంబంధించి రేషన్ కార్డ్ లేదా ఆధార్ వివరాలు అందుబాటులో లేవని ఆడిట్ గమనించింది. అందువల్ల, పరిహారం మొత్తాలు నిజమైన లబ్ధిదారులకు పంపిణీ చేయబడ్డాయో లేదో ఆడిట్ నిర్ధారించలేకపోయింది.

(iii) ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల, వాటి ఆస్తుల యొక్క వాస్తవికతను ధృవీకరించడం కొరకు నిర్వహించిన సామాజిక ఆర్థిక సర్వేకు సంబంధించిన సమాచారాన్ని కూడా ఆడిట్ కు సమర్పించలేదు. దీని కారణంగా ఆమోదించబడిన ఆర్&ఆర్ పథకంతో, అవార్డులతో సామాజిక ఆర్థిక సర్వే సమాచారాన్ని ఆడిట్ సరిపోల్చలేకపోయింది.

ఆంధ్రప్రదేశ్ ఆర్ఎఫ్‌సిటీఎల్ఏఆర్ఆర్ నియమాలు, 2014, ఆర్ఎఫ్‌సిటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013లో సూచించిన ఫారం–X ప్రకారమే ఆర్&ఆర్ పథకం, అవార్డులు తయారు చేసినట్లు ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 ఆగస్టు). ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల వయస్సుకు సంబంధించిన వివరాలను సామాజిక ఆర్థిక సర్వే సమాచారంలో చూపించబడింది, దాని ఆధారంగా ఆర్&ఆర్ అవార్డులు జారీ చేయబడుతున్నాయి. ఆవాస ప్రాంతాలలో ప్రభావిత కుటుంబాలను ధృవీకరించడానికి/గుర్తించడానికి, ఆధార్ కార్డు, రేషన్ కార్డుల వివరాలను ప్రాథమిక పత్రాలుగా గుర్తించారు. అయితే, ఆధార్, రేషన్ కార్డు లేని/పోగొట్టుకొన్న కొంతమంది ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు సంబంధించి, సంబంధిత తహసీల్దార్, ఆ తర్వాత సంబంధిత ఆర్&ఆర్ అధికారి విచారణ నిర్వహించి అర్హులని తేలితేనే ఆర్&ఆర్ పథకానికి పేర్లను చేర్చారు. ఇంకా, బాధిత కుటుంబాల అర్హత వివరాలను గ్రామసభ ముందు ఉంచి, అభ్యంతరాలను ఆహ్వానిస్తూ, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని, ఆర్&ఆర్ పథకాలను రూపొందిస్తారు.

ఈ వివరాలను సంబంధిత రెవెన్యూ అధికారులు/ఆర్&ఆర్ అధికారులు ధ్రువీకరించి, సంబంధిత గ్రామసభల్లో క్రమబద్ధీకరించారని ప్రభుత్వం సమాధానం ఇచ్చినప్పటికీ, ధ్రువీకరించబడిన సమాచారన్ని అవార్డుతో జతచేయలేదు లేదా ఆడిట్ కు అందుబాటులో ఉంచలేదు. దీని కారణంగా ప్రాథమిక సమాచారం యొక్క ప్రామాణికతను/ నిజమైన లబ్ధిదారులకు పరిహారం పంపిణీని నిర్ధారించడం సాధ్యం కాలేదు.

## 6.3 పునరావాసం & పునరుపాధి కల్పన ప్రయోజనాల అమలు

ఆర్ఎఫ్‌సిటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క రెండవ షెడ్యూల్[253] ప్రకారం అన్ని ప్రభావిత కుటుంబాలకు (భూమి యజమానులు, ప్రధానంగా సేకరించిన భూమిపై జీవనోపాధికి ఆధారపడిన కుటుంబాలు) ఆర్&ఆర్ హక్కుల యొక్క క్రింది అంశాలను అందించాలి.

---

252 బిల్లు సంఖ్య 2021-835875 ద్వారా 100 పీడీఎఫ్ లకు ₹6.75 కోట్లు + బిల్లు సంఖ్య 2021-940626 ద్వారా 28 పీడీఎఫ్ లకు: ₹1.94 కోట్లు, బిల్లు సంఖ్య 2021-1219242 ద్వారా 23 పీడీఎఫ్ లకు: ₹1.51 కోట్లు

253 ఆర్ఎఫ్‌సిటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్లు 31(1), 38(1), 105(3)

| గృహ యూనిట్లు | భూమి | ధన ప్రయోజనాలు | ఇతర ప్రయోజనాలు |
|---|---|---|---|
| ★ ప్రభావితులకు గృహ యూనిట్ల ఏర్పాటు | ★ చట్టం/నిబంధనల ప్రకారం అర్హత ఉన్న మేరకు భూమికి – భూమి<br>★ అభివృద్ధి చేసిన భూమి | ★ వార్షిక చెల్లింపు లేదా ఉపాధి ఎంపిక వంటి నగదు ప్రయోజనాలు<br>★ తరలించిన కుటుంబాలకు ఒక సంవత్సరం పాటు జీవనాధార గ్రాంటు<br>★ తరలించిన కుటుంబాలకు రవాణా ఖర్చు<br>★ పశువుల కొట్టం/చిల్లర దుకాణాల ఖర్చు<br>★ చేతివృత్తి నిపుణులు/చిన్న వ్యాపారులు/ ఇతరులకు ఒకే పర్యాయపు గ్రాంటు<br>★ఒకే పర్యాయపు పునరావాస భత్యం | ★ అర్హత కలిగిన కుటుంబాలకు చేపలు పట్టే హక్కులు<br>★ స్టాంప్ డ్యూటీ మరియు రిజిస్ట్రేషన్ ఫీజు |

కొత్త గ్రామం లేదా కాలనీలో పునరావాసం పొందిన జనాభా సహేతుకమైన సమాజ జీవితాన్ని పొందగలరని నిర్ధారించుకోవడానికి, అభ్యర్థించిన శాఖ యొక్క ఖర్చుతో

ఆర్&ఆర్ కాలనీలలో ఏర్పాటుచేయవలసిన 25 ప్రాథమిక కనీస మౌళిక సదుపాయాలను మూడవ షెడ్యూల్ సూచిస్తుంది. పునరావాస గ్రామాల పరిధిలో అంతర్గత రహదారులు, సమీప పక్కా రోడ్డుకు అనుసంధానంగా అన్ని రకాల వాతావరణాలకు అనుకూలమైన బాహ్య రహదారి, సరైన మురుగునీటి వ్యవస్థ, పారిశుద్ధ్య ప్రణాళికలు, రక్షిత తాగునీరు, పశువులకు తాగునీరు మొదలైన సౌకర్యాలు ఉండాలి.

### 6.3.1 ఆర్&ఆర్ కార్యకలాపాల కోసం భూసేకరణ

#### 6.3.1.1 ఆర్&ఆర్ కాలనీల కోసం ఇంకా చేయవల్సిన భూమి సేకరణ

2017-18 ధరల స్థాయిలో వ్యయ సవరణ కమిటీ (ఆర్‌సీసీ) నివేదిక ప్రకారం ఇవ్వాల్సిన ఆర్&ఆర్ ప్రయోజనాలు ***పట్టిక 6.5*** లో వివరించబడ్డాయి.

**పట్టిక 6.5:2017-18 ధర స్థాయిలలో ఆర్&ఆర్ ప్రయోజనాలు**

**(₹ కోట్లలో)**

| వర్గం | 2017-18 ధర స్థాయి | |
|---|---|---|
| | **పరిమాణం** | **ఖర్చు** |
| గృహాల నిర్మాణం (సంఖ్యలో) | 1,05,505 | 3,275.95 |
| ఆర్ అండ్ ఆర్[254] ప్రయోజనాలు (సంఖ్యలో) | 1,05,505 | 6,735.41 |
| మౌళిక సదుపాయాలు (సంఖ్యలో) | 1,05,505 | 7,235.02 |
| ఆర్అండ్ఆర్ కాలనీలకు భూమి (ఎకరాల్లో) | 8,581.05 | 1,089.38 |
| భూమికి-భూమి (ఎకరాల్లో) | 26,729.92 | 2,939.81 |

*మూలం: 2017-18 ధరల స్థాయి ప్రకారం రివైజ్డ్ కాస్ట్ కమిటీ నివేదిక*

వ్యయ సవరణ కమిటీ నివేదిక ప్రకారం 2017-18 ధరల స్థాయిలో 213 ఆర్&ఆర్ కాలనీల నిర్మాణానికి 8,581.05 ఎకరాల భూమి అవసరమవుతుంది. ఇందులో 2,756.72 ఎకరాలు (32 శాతం) సేకరించగా, మిగిలిన 5,824.33 ఎకరాలు సేకరించాల్సి ఉంది.

---

254 వార్షిక చెల్లింపు ఎంపిక, జీవనాధార గ్రాంటు, నిర్వాసిత కుటుంబాలకు రవాణా ఖర్చు, పశువుల కొట్టం/చిల్లర దుకాణానికి పరిహారం, చేతివృత్తులు, చిరు వ్యాపారులకు ఒకే పర్యాయపు గ్రాంటు మొదలైనవి

ఆర్&ఆర్ కాలనీలకు అవసరమైన మొత్తం భూమిని సేకరించకపోవడం వల్ల, ఆర్&ఆర్ కాలనీలను పూర్తి చేయడంలో, సంబంధిత కాలనీలకు ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల పునరావాసంలోనూ జాప్యం జరిగింది. ఇంకా, ఆర్&ఆర్ కాలనీలకు కావలసిన మిగిలిన భూమిని సేకరించకపోవడానికి గల కారణాలు, దానిని పూర్తి చేయడానికి కాలపరిమితులు ఆడిట్ కు సమర్పించిన రికార్డుల నుండి లభ్యం కాలేదు.

ఆర్&ఆర్ కాలనీల నిర్మాణం కోసం సేకరించాల్సిన 8,872.47 ఎకరాల భూమిలో, 3,102.14 ఎకరాల భూమిని సేకరించామని, మిగిలిన 5,767.26 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). 5,767.26 ఎకరాల్లో, మొదటి దశకి సంబంధించిన 1,443.59 ఎకరాల సేకరణ వివిధ దశలలో[255] ఉంది. 2025 జనవరి నాటికి మొదటి దశకు సంబంధించి ఇంకా సేకరించాల్సిన భూమికి సంబంధించి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని భూసేకరణ అధికారులను ఆదేశించామన్నారు. మొదటి దశ భూసేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత రెండవ దశ కోసం మిగిలిన 4,326.74 ఎకరాల భూసేకరణ ప్రక్రియను ప్రారంభిస్తామని కూడా తెలిపింది.

ప్రభుత్వం ఇచ్చిన సమాధానం ప్రకారం, సేకరించాల్సిన భూమి పరిమాణం 291.42 ఎకరాలు పెరిగిందని స్పష్టమైంది. అయితే, ఆ అవసరం పెరగడానికి గల కారణాన్ని ఆడిట్ కు సమర్పించలేదు.

### 6.3.1.2 సాగుకు పనికిరాని భూమి సేకరణ

దేవీపట్నం మండలంలోని ఐదు గ్రామాలకు సంబంధించి ఆరు భూసేకరణ అవార్డుల[256] క్రింద ప్రకటించిన (2017) అర్హత కలిగిన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు 'భూమికి-భూమి' కేటాయింపు కోసం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), పీఐపీఎల్ఎమ్ సీ[257], యూనిట్-1 రాజమహేంద్రవరం, 69.53 ఎకరాల భూమిని సేకరించినట్లు (2017) ఆడిట్ గమనించింది.

69.53 ఎకరాల్లో 40.47 ఎకరాలను లబ్ధిదారులకు అప్పగించామని, మిగిలిన 29.06 ఎకరాలు సాగుకు పనికిరాదని రంపచోడవరం సర్వే ఇన్స్పెక్టర్ నివేదించారు (2018 ఆగస్టు). సాగుకు పనికిరాని భూమిని గిరిజనులు అంగీకరించలేదు. రంపచోడవరం సబ్ కలెక్టర్, పై సమస్యను సంయుక్త కలెక్టర్ & ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ (ఆర్&ఆర్), పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, కాకినాడకు నివేదిస్తూ[258] తగు చర్యలు తీసుకోవాలని కోరారు (2018 ఆగస్టు).

అవార్డులు ప్రకటించి ఐదు సంవత్సరాలకు పైగా గడిచినప్పటికీ, లబ్ధిదారులకు ప్రత్యామ్నాయ భూమిని కేటాయించడానికి ఎటువంటి ప్రయత్నాలు జరగలేదు. ఇంకా, ***పట్టిక 6.6*** లో వివరించిన విధంగా ₹2.24 కోట్ల వ్యయంతో సేకరించిన సాగుకు యోగ్యం కాని భూమి గత ఐదు సంవత్సరాలుగా నిష్క్రియంగా ఉంది.

[255] పీఎన్ దశ: 1,319.41 ఎకరాలు; డిక్లరేషన్ దశ: 17.24 ఎకరాలు; అవార్డు దశ: 75.54 ఎకరాలు, అవార్డు ఆమోదించబడింది & చెల్లింపు బకాయిగా ఉన్న దశ: 31.40 ఎకరాలు

[256] ఇందుకూరు (అవార్డు నెం. 6/2017, 17/2017), పెదభీమపల్లి (అవార్డు నెం. 3/2017), శరభవరం (అవార్డు నెం. 9/2017), లోతుపాలెం (అవార్డు నం. 14/2017), ఇందుకూరుపేట (అవార్డు నం.75/20)

[257] పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ

[258] ఆర్సీ సంఖ్య జీ/ఆర్&ఆర్/77/2018, తేదీ 16.08.2018

**పట్టిక 6.6: సాగుకు పనికిరాని భూముల వివరాలు**

(భూమి విస్తీర్ణం ఎకరాలలో)

| క్రమ సంఖ్య | గ్రామం పేరు, అవార్డు సంఖ్య | సేకరించిన మొత్తం విస్తీర్ణం | ఇప్పటికే అప్పగించబడింది | సాగుకు అనుకూలం | సాగుకు పనికిరానిది | ఎకరానికి అయ్యే ఖర్చు (₹ లో) | వృధా ఖర్చు (₹ కోట్లలో) |
|---|---|---|---|---|---|---|---|
| (అ) | (ఆ) | (ఇ) | (ఈ) | (ఉ) | (ఊ) | (ఎ) | (ఏ) = (ఊ) X (ఎ) |
| 1. | ఇందుకూరు 06/2017, 17/2017 | 13.68 | 1.57 | 7.89 | 4.22 | 7,70,219 | 0.33 |
| 2. | పెదభీమపల్లి 03/2017 | 9.25 | 2.23 | 1.54 | 5.48 | 7,72,521 | 0.42 |
| 3. | శరభవరం 09/2017 | 12.39 | 0.00 | 0.00 | 12.39 | 7,63,233 | 0.95 |
| 4. | లోతుపాలెం 14/2017 | 20.15 | 12.92 | 1.57 | 5.66 | 7,70,712 | 0.44 |
| 5 | ఇందుకూరుపేట 05/2017 | 14.06 | 12.75 | 0.00 | 1.31 | 7,63,397 | 0.10 |
| | **మొత్తం** | **69.53** | **29.47** | **11.00** | **29.06** | | **2.24** |

*మూలం: శాఖ అందించిన సమాచారం*

డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే నేతృత్వంలోని సంయుక్త తనిఖీ నివేదిక ప్రకారం, 69.53 ఎకరాల్లో 6.05 ఎకరాలు సాగుకు పనికిరానివిగా పరిగణించబడిందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 నవంబర్). కొన్ని ప్రాంతాలలో రాళ్ళు, చెరువు ఉన్నాయని నివేదించారు. పర్యవసానంగా, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద ఈ భూమిని సాగుకు అనువుగా తీర్చిదిద్దేందుకు గాను సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, ఇది పూర్తయిన తర్వాత, భూమిని ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు కేటాయిస్తారన్నారు.

### 6.3.1.3 ఆర్&ఆర్ కాలనీలకు సౌకర్యాలు కల్పించకపోవడం

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆర్&ఆర్ పనులు నిర్వహిస్తున్న కార్యనిర్వాహక ఇంజనీర్లందరూ ప్రస్తుతం కొనసాగుతున్న ఆర్&ఆర్ కాలనీల కోసం సవరించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలో ఆయా వినియోగ శాఖలు సూచించిన సౌకర్యాలను చేర్చాలని, మౌళిక సదుపాయాలను[259] సవరించాలని తూర్పు గోదావరి జిల్లా పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు సంయుక్త కలెక్టర్ & ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ఆదేశించారు (2021 మార్చి).

సవరించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక సమాచారాన్ని పరిశీలించగా తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని కొన్ని ఆర్&ఆర్ కాలనీల్లో మూడో షెడ్యూలులో పేర్కొన్న కనీస మౌళిక సదుపాయాల అంశాలను ***పట్టిక 6.7*** లో వివరించిన విధంగా 'అవసరం లేదు' అని పేర్కొన్నారు.

**పట్టిక 6.7: ఆర్&ఆర్ కాలనీల వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలలో 'అవసరం లేదు' అని పేర్కొన్న సౌకర్యాలు**

| మౌళిక సదుపాయాల అంశాలు | తూర్పు గోదావరి జిల్లా | పశ్చిమ గోదావరి జిల్లా |
|---|---|---|
| | కాలనీల సంఖ్య: 16 | కాలనీల సంఖ్య: 32 |
| | మౌళిక సదుపాయాల అంశం 'అవసరం లేదు' అని పేర్కొనబడిన కాలనీల సంఖ్య | |
| పశువైద్యశాల | 12 | 25 |
| ఎరువులు/ రైతు భరోసా కేంద్రం | 15 | 17 |
| ఆరోగ్య కేంద్రం | 11 | 11 |
| అంగన్‌వాడీ కేంద్రం | 2 | 0 |
| తపాలా కార్యాలయం | 7 | 25 |

259 పశు వైద్యశాల, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రం, అంగన్ వాడీ కేంద్రం, తపాలా కార్యాలయం, పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, శ్మశాన వాటికలు, పారిశుధ్యం, మురుగునీరు, పాఠశాల భవనం

| | | |
|---|---|---|
| పంచాయతీ భవనాలు | 15 | 25 |
| కమ్యూనిటీ హాళ్లు | 2 | 19 |
| శ్మశాన వాటికలు | 3 | 10 |
| పారిశుధ్యం, మురుగునీరు | 14 | 23 |
| పాఠశాల భవనాలు | 1 | 10 |

*మూలం: రాజమహేంద్రవరంలోని ప్రాజెక్టు నిర్వాహకుడి కార్యాలయం యొక్క రికార్డులు*

ఆర్ఎఫ్సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 నిబంధనల ప్రకారం అవసరమైన మౌళిక సదుపాయాలను 'అవసరం లేదు' అని శాఖ ఎందుకు పేర్కొన్నదో, అవసరమైన కనీస సౌకర్యాలను ఎందుకు అందించలేదో ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కార్యాలయ రికార్డుల నుండి లభ్యంకాలేదు.

ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం భర్తీచేసే మొత్తానికి (రీయింబర్స్మెంట్) అంటే గరిష్టంగా నిర్ణయించిన ₹6.52 లక్షల పరిమితి వరకు మాత్రమే ఆర్&ఆర్ కాలనీల్లో మౌళిక సదుపాయాలు, సౌకర్యాలను కల్పించినట్లు, కాలనీలకు సమీపంలో ఏవైనా సౌకర్యాలు ఉంటే అటువంటివాటిని సంబంధిత శాఖలతో సంయుక్త సమావేశం (కన్వర్జెన్స్ మీటింగ్)లో సంప్రదింపులు జరిపిన తరువాత, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ఖరారుచేసిన తరువాత 'అవసరం లేదు' అని పేర్కొంటూ తొలిగించామని ఆ శాఖ సమాధానమిచ్చింది (2022 డిసెంబర్).

ఆర్&ఆర్ కాలనీలలో ఈ సౌకర్యాల అవసరం లేదని నిర్ధారించడానికి, ఆర్&ఆర్ కాలనీల పరిసర ప్రాంతాలలో ఈ సౌకర్యాలు అందుబాటులో ఉన్న ప్రదేశం, దూరాన్ని శాఖ అందించలేదు కాబట్టి సమాధానం ఆమోదయోగ్యం కాదు.

రెవెన్యూ డివిజనల్ అధికారుల నివేదికల ఆధారంగా సౌకర్యాలను 'అవసరం లేదు' అని నిర్ణయించినట్లు ముగింపు సమావేశంలో ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్). ఆడిట్ సూచించిన విధంగా పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటామని, తాజా వైఖరిని తెలియజేస్తామని పేర్కొంది.

'అవసరం లేదు' అనే వాదనకు మద్దతుగా, ఆర్&ఆర్ కాలనీల సమీపంలో ఉన్న సౌకర్యాలకు సంబంధించిన కొన్ని పత్రాలను[260] సమర్పిస్తూ (2024 నవంబర్), ఆయా సౌకర్యాలు ఆర్&ఆర్ కాలనీల నుండి మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయని శాఖ పేర్కొంది.

ఆర్&ఆర్ కాలనీలకు సంబంధించిన భౌగోళిక స్థానాలను విశ్లేషించినప్పుడు, ఆర్&ఆర్ కాలనీల నుండి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు పేర్కొనబడిన కొన్ని సౌకర్యాలు వాస్తవానికి ఆరేడు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉన్నాయని ఆడిట్ గమనించింది.

### 6.3.2 'భూమికి-భూమి' కొరకు భూసేకరణ

ఆర్ఎఫ్సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 రెండో షెడ్యూలు ప్రకారం, సేకరించిన భూమికి చెల్లించాల్సిన పరిహారానికి బదులుగా, ఎవరి భూమినైతే సేకరించారో, ఎవరైతే భూమిని కోల్పోయారో, ఎవరైతే సన్నకారు రైతు లేదా భూమి లేని స్థితికి దిగజారారో, అటువంటి వ్యవసాయ భూమి[261] ఉన్న ప్రతి బాధిత కుటుంబానికి సంబంధించి హక్కుల రికార్డులలో చేర్చబడిన ప్రతి వ్యక్తి పేరు మీద ప్రాజెక్టు ఆయకట్టులో కనీసం ఒక ఎకరం భూమిని కేటాయించాలి. షెడ్యూల్డ్ కులాలు లేదా షెడ్యూల్డ్ తెగలకు (ఎస్సీ/ఎస్టీ) చెందిన వ్యక్తులు భూమిని కోల్పోతే, సేకరించిన భూమికి సమానమైన భూమి లేదా రెండున్నర ఎకరాల భూమి, ఏది తక్కువైతే అది అందించబడుతుంది.

[260] ప్రస్తుత సౌకర్యాల ఛాయా చిత్రాలు, భౌగోళిక స్థానం

[261] ఆర్ఎఫ్సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 3 ప్రకారం, "వ్యవసాయ భూమి" అంటే వ్యవసాయం లేదా ఉద్యానవన పెంపకం, పాడి/కోళ్ల పెంపకం, చేపల పెంపకం, పట్టుపరిశ్రమ, విత్తన పెంపకం, పశువుల పెంపకం లేదా ఔషధ మూలికలను పెంచే నర్సరీ, పంటలు, చెట్లు, తోట ఉత్పత్తులను పెంచడం, పశువుల మేతకు ఉపయోగించే భూమి

### 6.3.2.1 'భూమికి-భూమి' పథకం క్రింద భూమి కేటాయింపు

'భూమికి-భూమి' పథకం క్రింద పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆరు గ్రామాల్లో గుర్తించిన 81 మంది లబ్ధిదారుల[262] కొరకు మొత్తం 192.61 ఎకరాలు[263] సేకరించారు. కేటాయింపు ప్రక్రియలో ఈ క్రింది తేడాలను ఆడిట్ గమనించింది:

(i) 'భూమికి-భూమి' పథకం క్రింద, 16 మంది[264] లబ్ధిదారుల కొరకు 52.45 ఎకరాల భూమిని అభ్యర్థించగా, 65.24 ఎకరాల భూమిని కేటాయించారు (లబ్ధిదారుల వారీగా కేటాయింపు ***అనుబంధం 6.2*** లో వివరించబడింది), తద్వారా ***పట్టిక 6.8*** లో చూపిన విధంగా 12.79 ఎకరాల అధిక కేటాయింపు జరిగింది.

(ii) 'భూమికి-భూమి' పథకం క్రింద 22 మంది[265] లబ్ధిదారులకు 77.24 ఎకరాల భూమిని అభ్యర్థించారు. అయితే కేవలం 37.80 ఎకరాల భూమిని మాత్రమే కేటాయించారు (***అనుబంధం 6.3*** లో వివరించిన విధంగా), తద్వారా ***పట్టిక 6.8*** లో చూపిన విధంగా 39.44 ఎకరాలు తక్కువగా కేటాయించారు.

**పట్టిక 6.8: 'భూమికి-భూమి' పథకం క్రింద సేకరించిన భూమి కంటే ఎక్కువ/తక్కువ భూమిని కేటాయించిన వివరాలు**

(ఎకరాల్లో)

| క్రమ సంఖ్య | ఆవాస ప్రాంతం | లబ్ధిదారుల సంఖ్య | భూసేకరణ అవార్డుల ప్రకారం సేకరించిన భూమి విస్తీర్ణం | 'భూమికి-భూమి' పథకం క్రింద కేటాయించిన విస్తీర్ణం | 'భూమికి-భూమి' పథకం క్రింద కేటాయించిన అధిక/ తక్కువ భూమి విస్తీర్ణం |
|---|---|---|---|---|---|
| 'భూమికి-భూమి' పథకం క్రింద అధిక భూమి కేటాయింపు | | | | | |
| 1. | శివగిరి | 5 | 17.73 | 22.47 | 4.74 |
| 2. | తూటిగుంట (ఎస్టీ తెగ) | 8 | 26.27 | 33.54 | 7.27 |
| 3. | తాళ్ళవరం (ఎస్టీ తెగ) | 2 | 2.57 | 3.07 | 0.50 |
| 4. | వాడపల్లి-(ఎస్టీ తెగ) | 1 | 5.88 | 6.16 | 0.28 |
| మొత్తం | | **16** | **52.45** | **65.24** | **12.79** |
| 'భూమికి-భూమి' పథకం క్రింద/తక్కువ భూమి కేటాయింపు | | | | | |
| 1. | శివగిరి | 18 | 64.57 | 29.68 | 34.89 |
| 2. | తూటిగుంట-ఎస్టీ | 2 | 1.91 | 1.56 | 0.35 |
| 3. | వాడపల్లి-ఎస్టీ | 2 | 10.76 | 6.56 | 4.20 |
| మొత్తం | | **22** | **77.24** | **37.80** | **39.44** |

*మూలం: శాఖ అందించిన సమాచారం*

అందువల్ల, 'భూమికి-భూమి' పథకం క్రింద ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు భూమి కేటాయింపు, భూమి అవసరాల కోసం చేసిన అభ్యర్థన/సేకరణకు అనుగుణంగా లేదు. తేడాలకు గల కారణాలు, భూ కేటాయింపులను సరిదిద్దేందుకు తీసుకున్న చర్యలు రికార్డులో లేవు.

262 శివగిరి (34) + తూటిగుంట, యర్రవరం, సరుగుడు (21) + తాళ్ళవరం, వాడపల్లి (26)

263 తాళ్ళవరం, వాడపల్లి (26 మంది లబ్ధిదారులు, 62.10 ఎకరాల భూమి) + తుటిగుంట, యర్రవరం, సరుగుడు (21 మంది లబ్ధిదారులు, 48.76 ఎకరాల భూమి) + శివగిరి (34 మంది లబ్ధిదారులు, 81.75 ఎకరాలు)

264 శివగిరి (5) + తూటిగుంట, యర్రవరం, సరుగుడు (8) + తాళ్ళవరం, వాడపల్లి (3)

265 శివగిరి (18) + తూటిగుంట, యర్రవరం, సరుగుడు (2) + తాళ్ళవరం, వాడపల్లి (2)

భూసేకరణ చట్టం,1894 ప్రకారం గ్రామాల్లోని కొంతమంది భూమి కోల్పోయిన వారు ఇప్పటికే 2.50 ఎకరాల కంటే ఎక్కువ భూమిని పొందారని ప్రభుత్వం సమాధానమిచ్చింది (ఆగస్టు 2024). కాబట్టి, పోలవరం మండలం శివగిరి గ్రామస్థులు కూడా భూసేకరణలో ఉన్న తమ భూములకు గతంలో ఇచ్చిన విధంగానే 'భూమికి-భూమి' ప్రయోజనాలను ఇవ్వాలని కోరారు. దీంతో 31 మంది లబ్ధిదారుల అభ్యర్థన మేరకు కొవ్వూరులోని పీఐపీఆర్ఎంసీ, యూనిట్-1లో అప్పటి భూసేకరణ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) 'భూమికి-భూమి' పథకం క్రింద 2.50 ఎకరాల కంటే ఎక్కువ పరిహారం ఇచ్చారు.

ఎకరాకు ₹2.5 లక్షల చొప్పున భూమిని సేకరించామని, ఎకరాకు ₹3.5 లక్షల చొప్పున భూ పరిహారం చెల్లించాల్సి ఉన్నందున నగదు పరిహారానికి బదులుగా లబ్ధిదారుల అభ్యర్థన మేరకు అదనపు భూమిని కేటాయించినట్లు, అందువలన ఖజానాపై ఎలాంటి భారం పడలేదని ముగింపు సమావేశంలో ప్రభుత్వం పేర్కొంది (2024 నవంబర్). కొన్ని సందర్భాల్లో లబ్ధిదారులు భూ కేటాయింపులకు బదులు నగదు పరిహారం ఇవ్వాలని కోరారు.

నగదు పరిహారం బదులుగా అదనపు భూమిని కేటాయించడం చట్టం, 2013 నిబంధనకు విరుద్ధం కాబట్టి సమాధానం ఆమోదయోగ్యం కాదు. చెల్లించాల్సిన పరిహారం కంటే భూమి ధర ఎక్కువగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇటువంటి అభ్యర్థనలను అంగీకరించడం వలన భూసేకరణ ప్రక్రియ క్లిష్టతరం కావచ్చు.

### 6.3.2.2 అనర్హులైన లబ్ధిదారులకు 'భూమికి-భూమి' కేటాయింపు

జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి, 'భూమికి-భూమి' పథకం క్రింద భూమిని కేటాయించిన 143 మంది[266] లబ్ధిదారుల్లో, ***పట్టిక 6.9*** లో వివరించిన విధంగా 95 మంది[267] లబ్ధిదారులకు, వారి పేర్లను భూసేకరణ అవార్డుల్లో చేర్చనప్పటికీ 166.52 ఎకరాల భూమిని (***అనుబంధం 6.4*** లో వివరించిన విధంగా) కేటాయించారు.

**పట్టిక 6.9: అనర్హులైన వ్యక్తులకు 'భూమికి-భూమి' పథకం క్రింద భూమి కేటాయింపు**

| క్రమ సంఖ్య | ఆవాస ప్రాంతం పేరు | లబ్ధిదారుల సంఖ్య | 'భూమికి-భూమి' క్రింద ఇచ్చిన భూమి విస్తీర్ణం (ఎకరాల్లో) |
|---|---|---|---|
| 1. | శివగిరి | 22 | 35.55 |
| 2. | తూటిగుంట | 2 | 6.44 |
| 3. | యర్రవరం | 34 | 67.67 |
| 4. | తాళ్ళవరం | 19 | 26.15 |
| 5. | వాడపల్లి | 18 | 30.71 |
| మొత్తం | | **95** | **166.52** |

*మూలం: శాఖ అందించిన సమాచారం*

సంబంధిత నిర్వాసితుడు మరణిస్తే, తగిన విచారణ అనంతరం భూమిని వారి చట్టబద్ధమైన వారసులకు కేటాయించామని, అందువల్ల, 'భూమికి-భూమి' క్రింద కేటాయింపు ఉత్తర్వులలో అవార్డు గ్రహీతల పేర్లకు సంబంధించి ఎటువంటి అసమానతలు లేవని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు).

సమాధానానికి సంబంధించి ఎటువంటి పత్రాలు ఆడిట్‌కు సమర్పించలేదు. ఇంకా, 143 కేటాయింపుదారులలో 95 మంది మరణించిన కేసులు నివేదించబడినందున సమాధానం అనుమానాస్పదంగా ఉంది.

[266] శివగిరి (56) + తూటిగుంట, యర్రవరం, సరుగుడు (87)

[267] శివగిరి (22) + తూటిగుంట, యర్రవరం, సరుగుడు (2+34)+ తాళ్ళవరం, వాడపల్లి (2+35)

### 6.3.2.3 అనుమతించబడిన పరిమితికి మించి భూ కేటాయింపు

రికార్డుల పరిశీలనలో 49 మంది[268] ఎస్టీ లబ్ధిదారులకు సంబంధించి (***అనుబంధం 6.5*** లో వివరించిన విధంగా), ***పట్టిక 6.10*** లో వివరించిన విధంగా నిర్దేశించిన పరిమితి 2.50 ఎకరాల కంటే ఎక్కువ 'భూమికి-భూమి' కేటాయించినట్లు వెల్లడైంది.

**పట్టిక 6.10: అనుమతించబడిన పరిమితికి మించి భూమి కేటాయింపు**

**(ఎకరాల్లో)**

| క్రమ సంఖ్య | ఆవాస ప్రాంతం పేరు | లబ్ధిదారుల సంఖ్య | గరిష్ఠంగా ఇవ్వగల అనుమతించబడిన భూమి విస్తీర్ణం | 'భూమికి-భూమి' క్రింద కేటాయించిన భూ విస్తీర్ణం | అధికంగా కేటాయించిన భూమి విస్తీర్ణం |
|---|---|---|---|---|---|
| అ | ఆ | ఇ | ఈ = (ఇ) x 2.50 ఎకరాలు | ఉ | ఊ |
| 1. | శివగిరి | 12 | 30.00 | 55.12 | 25.12 |
| 2. | తూటిగుంట | 22 | 55.00 | 94.86 | 39.86 |
| 3. | యర్రవరం | 15 | 37.50 | 60.64 | 23.14 |
| | **మొత్తం** | **49** | **122.50** | **210.62** | **88.12** |

*మూలం: శాఖ అందించిన సమాచారం*

పేర్కొన్న గ్రామాల్లో, పాత భూసేకరణ చట్టం, 1894 ప్రకారం ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేయబడిందని, అందువల్ల ఆర్ఆర్ పాలసీ, 2005 ప్రకారం 'భూమికి-భూమి' ని కేటాయించారని, దీనిలో పేరా 6.5 క్రింద 2.5 హెక్టార్ల (6.18 ఎకరాలు) వరకు, భూమిని కోల్పోయిన గిరిజనులకు పరిహారం బదులుగా 'భూమికి-భూమి' క్రింద భూమి ఇవ్వబడుతుందని పేర్కొనబడింది. దీని ప్రకారం, భూమిని కోల్పోయిన గిరిజనులకు ఆర్ఆర్ పాలసీ, 2005 ప్రకారం అనుమతించబడిన విధంగా భూమికి-భూమిని కేటాయించారు, అందువల్ల ఎటువంటి అతిక్రమణ లేదని ప్రభుత్వం ప్రత్యుత్తరం ఇచ్చింది (2024 ఆగస్టు).

కొత్త చట్టం, 2013 అమలులోకి వచ్చిన తర్వాత 2016 నుండి 2021 సంవత్సరాల మధ్య రెవెన్యూ డివిజనల్ అధికారి 'భూమికి-భూమి' కేటాయింపు ఉత్తర్వులు జారీ చేశారు కాబట్టి, సమాధానం ఆమోదయోగ్యం కాదు. అందువల్ల, అధిక భూ కేటాయింపు సక్రమంగా లేదు.

268 తూటిగుంట, యర్రవరం, సరుగుడు (37)

### 6.3.3 పునరావాసం & పునరుపాధి కల్పన నగదు ప్రయోజనాల అమలు

రెండవ షెడ్యూల్ ప్రకారం, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు ఈ క్రింది ఆర్&ఆర్ నగదు ప్రయోజనాలకు అర్హులు:

- ఉద్యోగం/ కుటుంబానికి ₹5.00 లక్షలు వార్షిక చెల్లింపు (యాన్యుటీ) ఎంపిక
- నిర్వాసిత కుటుంబాలకు నెలకు ₹3,000 చొప్పున 12 నెలల కాలానికి ₹36,000 జీవనాధార గ్రాంట్
- ఎస్సీ/ఎస్టీలకు ₹50,000 అదనపు జీవనాధార గ్రాంట్
- రవాణా ఖర్చు ₹50,000
- ఒక్కసారి మాత్రమే చెల్లించే పునరావాస భత్యం ₹50,000
- పశువుల కొట్టం/ చిల్లర దుకాణం/కిరణా దుకాణం/ కళ్ళీ బడ్డీలకు ఒక్కసారి మాత్రమే చెల్లించే ఆర్థిక సహాయం ₹25,000
- చేతివృత్తుల వారికి, చిన్న వ్యాపారులకు లేదా స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులకు ఒక్కసారి మాత్రమే చెల్లించే గ్రాంటు ₹25,000

#### 6.3.3.1 నగదు ప్రయోజనాల చెల్లింపు

ఆర్ఎఫ్సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 38 ప్రకారం పూర్తి పరిహారంతో పాటు ఆర్&ఆర్ హక్కులకు అర్హులైన వ్యక్తులకు, అవార్డు తేదీ నుండి మూడు నెలల్లోగా పరిహారం, రెండో షెడ్యూలులో పేర్కొన్న ఆర్&ఆర్ హక్కులకు సంబధించి ద్రవ్య భాగాన్ని ఆరు నెలల్లోగా పూర్తిగా చెల్లించబడ్డాయని నిర్ధారణ చేసుకున్న తరువాత మాత్రమే జిల్లా కలెక్టర్ భూమిని స్వాధీనం చేసుకోవాలి.

ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కార్యాలయ రికార్డులను పరిశీలించినప్పుడు 1,06,006 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు ఆర్&ఆర్ నగదు ప్రయోజనాల చెల్లింపునకు ₹7,270.41 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా, 2023 మార్చి నాటికి, ***పట్టిక 6.11*** లో వివరించిన విధంగా 14,500 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు ₹841.34 కోట్లు[269] మాత్రమే చెల్లించినట్లు వెల్లడైంది.

**పట్టిక 6.11: కంటూర్ వారీగా ఆర్&ఆర్ నగదు ప్రయోజనాల చెల్లింపు**

**(₹ కోట్లలో)**

| క్రమ సంఖ్య | కంటూర్ స్థాయి (మీటర్లలో) | అంచనా వేసిన ఆర్&ఆర్ నగదు ప్రయోజనాలు | | చెల్లించిన ఆర్&ఆర్ నగదు ప్రయోజనాలు | | చెల్లించాల్సిన ఆర్&ఆర్ నగదు ప్రయోజనాలు | |
|---|---|---|---|---|---|---|---|
| | | పీడీఎఫ్ ల సంఖ్య | మొత్తం | పీడీఎఫ్ ల సంఖ్య | మొత్తం | పీడీఎఫ్ ల సంఖ్య | మొత్తం |
| 1. | (+) 41.15 వరకు | 20,946 | 1,291.39 | 14,181 | 821.51 | 6,765 | 469.88 |
| 2. | (+) 41.15 నుండి (+) 45.72 | 85,060 | 5,979.02 | 319 | 19.83 | 84,741 | 5,959.19 |
| మొత్తం | | **1,06,006** | **7,270.41** | **14,500** | **841.34** | **91,506** | **6,429.07** |

*మూలం: రాజమహేంద్రవరంలోని పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు యొక్క ప్రాజెక్టు నిర్వాహకుల కార్యాలయ రికార్డులు*

[269] (+) 41.15 మీటర్ల కాంటూర్ వరకు 14,181 పిడిఎఫ్‌లకు ₹ 821.51 కోట్లు చెల్లించబడ్డాయి, (+) 41.15 మీటర్ల కాంటూర్‌కు పైన 319 పిడిఎఫ్‌లకు ₹ 19.83 కోట్లు చెల్లించబడ్డాయి

మిగిలిన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు ఆర్&ఆర్ నగదు ప్రయోజనాలను చెల్లించకపోవడానికి గల కారణాలు ఆడిట్ కు సమర్పించిన రికార్డుల నుంచి లభ్యం కాలేదు.

ఇంకా, ఆర్&ఆర్ ప్రయోజనాల చెల్లింపుకు సంబంధించి రెండు ఆర్&ఆర్ కార్యాలయాలలో[270] రికార్డులను పరిశీలించినప్పుడు, పోలవరం (3,198 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు), దేవీపట్నం మండలాలలో (4,209 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు) గుర్తించబడిన 7,407 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలలో, 45 ఆవాస ప్రాంతాలకు చెందిన 972 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను[271] (2023 మార్చి నాటికి) ₹64.88 కోట్ల[272] విలువైన ఆర్&ఆర్ నగదు ప్రయోజనాలను చెల్లించకుండానే ఆర్&ఆర్ కాలనీలకు (***అనుబంధం 6.6*** లో వివరించిన విధంగా) తరలించినట్లు గుర్తించడమైంది.

ఆర్&ఆర్ నగదు పరిహారం చెల్లించక ముందే ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను తరలించడం ఆర్ఎఫ్సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 నిబంధనలకు విరుద్ధం.

ఆర్ఎఫ్సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 షెడ్యూల్ III ప్రకారం, ఆర్&ఆర్ నగదు ప్రయోజనం చెల్లించిన తర్వాత, ఆర్&ఆర్ కాలనీలో సౌకర్యాలతో నిర్మించిన ఇంటిని అప్పగించిన తర్వాతే ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను ముంపుకు గురయ్యే ఆవాస ప్రాంతాల నుంచి తరలించామని, ఇది పూర్తిగా స్వచ్ఛందమని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 ఆగస్టు). అయితే కొన్ని ఆవాస ప్రాంతాలలోని కొన్ని ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు తమ ఇళ్లు పూర్తయి ఆర్&ఆర్ నగదు ప్రయోజనాలు చెల్లించబడనప్పటికీ, గరిష్ఠంగా, తోటి ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు కొత్త కాలనీకి తరలిపోవడం, పాత ఆవాసం ప్రాంతంలో వర్షాకాలంలో వరద ప్రభావం, మంచి సౌకర్యాలు, మౌళిక సదుపాయాలతో కూడిన కొత్త ఆర్&ఆర్ కాలనీకి మారేందుకు ఆసక్తి చూపడం వంటి వివిధ కారణాలతో స్వచ్ఛందంగా కొత్త ఆర్&ఆర్ కాలనీలకు తరలివెళ్లారు. మొదటి దశ క్రింద గుర్తించిన 20,946 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలలో, 14,496 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు ₹841.47 కోట్ల విలువైన ఆర్&ఆర్ నగదు ప్రయోజనాలు చెల్లించబడ్డాయి. మిగిలిన 6,450 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలలో, 5,230 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు సంబంధించిన ₹342.71 కోట్ల విలువైన బిల్లులు సిద్ధం చేయబడ్డాయి, మిగిలిన 1,220 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపు పురోగతిలో ఉందని పేర్కొంది.

ఇప్పటికే తరలించబడిన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు కూడా సక్రమంగా రావలిసిన ఆర్&ఆర్ నగదు ప్రయోజనాన్ని అందించడంలో వైఫల్యం గురించి సమాధానమివ్వలేదు. ఇంకా, ఆర్&ఆర్ నగదు ప్రయోజనాన్ని అందించడంలో జాప్యం, లక్షిత తేదీలోపు పోలవరం నీటిపారుదల ప్రాజెక్టును పూర్తి చేసే మొత్తం ప్రక్రియను ఆలస్యం చేస్తుంది, ఇది ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలలో సామాజిక, ఆర్థిక ఇబ్బందులను కూడా కలిగిస్తుంది.

### 6.3.3.2 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు అదనపు ఆర్&ఆర్ ప్యాకేజీ చెల్లించకపోవడం

ఆర్ఎఫ్సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క రెండో షెడ్యూల్ క్రింద ఇచ్చే నగదు ప్రయోజనాలకు అదనంగా ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు అదనపు ఆర్&ఆర్ ప్యాకేజీ క్రింద ₹550.00 కోట్లు చెల్లించడానికి, ప్రతి ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబానికి ₹10.00 లక్షల ఆర్&ఆర్ ప్యాకేజీ అందేలా చూడటానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదం[273] తెలిపింది (2021 జూన్).

---

270 జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం, రంపచోడవరం సబ్ కలెక్టర్ వారి కార్యాలయం

271 రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం (పోలవరం మండలం లోని 19 ఆవాసాలకు చెందిన 435 పీడీఎఫ్లు) + సబ్ కలెక్టర్ వారి కార్యాలయం (దేవీపట్నం మండలం లోని 26 ఆవాసాలలోని 537 పీడీఎఫ్లు)

272 రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం (₹29.10 కోట్లు, పోలవరం మండలం లోని 19 ఆవాసాలకు చెందిన 435 పీడీఎఫ్లు) + సబ్ కలెక్టర్ వారి కార్యాలయం (₹ 35.58 కోట్లు, దేవీపట్నం మండలం లోని 26 ఆవాసాలకు చెందిన 537 పీడీఎఫ్లు)

273 జీఓఆర్ టీ సంఖ్య 224, జల వనరుల (ఆర్&ఆర్-ఏ2) శాఖ, తేదీ 30.06.2021

ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు అదనపు ఆర్&ఆర్ ప్యాకేజీ చెల్లించలేదని ఆడిట్ గమనించింది, లబ్ధిదారులకు అదనపు ఆర్&ఆర్ ప్యాకేజీ చెల్లించకపోవడానికి గల కారణాలు రికార్డులలో లేవు.

₹10.00 లక్షల ప్యాకేజీ అనేది ప్రభుత్వం ఇచ్చిన హామీ (2021 జూన్) అని, దీనిలో ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 క్రింద లభించే అన్ని నగదు ప్రయోజనాలు కలిసే ఉన్నాయని, అదనపు ఆర్&ఆర్ ప్యాకేజీ క్రింద హామీ ఇచ్చిన విధంగా మిగిలిన చెల్లింపులు బడ్జెట్ లభ్యతను బట్టి ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు చెల్లించబడతాయని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు).

ముగింపు సమావేశంలో, ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ, చెల్లింపుకు సంబంధించిన మార్గదర్శకాలు, నియమాలను ఇంకా ఖరారు చేయలేదని పేర్కొంది (2024 నవంబర్).

దీనినిబట్టి, ₹10.00 లక్షల ఆర్&ఆర్ ప్యాకేజీని ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు అందించలేదని స్పష్టమవుతోంది.

### 6.3.4 గృహ నిర్మాణ యూనిట్ల ఏర్పాటు

ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క రెండవ షెడ్యూల్ ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు కోల్పోతే, ఇందిరా ఆవాస్ యోజన నిర్దేశాల ప్రకారం నిర్మించిన ఇంటిని ఇవ్వాలి. ఇందిరా ఆవాస్ యోజన నిర్దేశాల ప్రకారం, 25 చదరపు మీటర్లకు[274] తగ్గకుండా అంటే 269 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు నిర్మించాలి.

అయితే, ప్రభుత్వం నిర్మించనున్న ఆర్&ఆర్ కాలనీల్లో అన్ని మౌళిక వసతులతో 0.05 ఎకరాల స్థలంలో 379.25 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు ఇవ్వాలని స్పెషల్ కమిషనర్ (ఆర్&ఆర్), విజయవాడ ఆదేశించారు[275]. వికల్పాల వారిగా (పేరా 6.1.2(ఇ)) (+) 41.15 మీటర్ల కంటూరు వరకు లబ్ధిదారులకు చేసిన చెల్లింపుల వివరాలు ***పట్టిక 6.12*** లో వివరించబడ్డాయి.

**పట్టిక 6.12: వికల్పాల వారీగా చేసిన చెల్లింపుల వివరాలు**

**(₹ కోట్లలో)**

| ఎంపిక | ఎంచుకున్న మొత్తం పీడీఎఫ్ ల సంఖ్య | గృహనిర్మాణ యూనిట్‌తో సహా చెల్లించవలసిన ఆర్&ఆర్ ప్రయోజనాలు | స్వీయ నిర్మాణం/ వన్ టైమ్ స్కీమ్ ప్రయోజనం | ప్రయోజనం పొందిన పీడీఎఫ్ ల సంఖ్య | స్వీయ నిర్మాణం కోసం చెల్లించిన మొత్తం |
|---|---|---|---|---|---|
| ఎంపిక -1 | 17,718 | 1,083.97 | ప్రభుత్వ నిర్మాణం | 13,459 | ప్రభుత్వ నిర్మాణం |
| ఎంపిక -2 | 1,476 | 95.87 | 42.07 | 617 | 0.06 |
| ఎంపిక -3 | 1,752 | 111.55 | 67.45 | 105 | -- |
| మొత్తం | **20,946** | **1,291.39** | **109.52** | **14,181** | **0.06** |

*మూలం: జంగారెడ్డిగూడెం ఆర్డీఓ, రంపచోడవరం సబ్-కలెక్టర్ అందించిన సమాచారం.*

#### 6.3.4.1 కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఖాళీగా ఉన్న ఇళ్ళు

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టును 2024 జూన్ నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పూర్తి జలాశయ స్థాయి (+) 45.72 మీటర్ల వరకు గల ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు వసతి కల్పించేందుకు మొత్తం 213 ఆర్&ఆర్ కాలనీలను ఏర్పాటు చేయాలని 2014 మార్చికి ముందే భావించగా, అందులో (+) 41.15 మీటర్ల కంటూరు వరకు 75 కాలనీల నిర్మాణాన్ని చేపట్టారు. ఈ 75 కాలనీల్లో 26 కాలనీలు పూర్తయ్యాయి (2021 మార్చి), 3,922 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు తరలించబడ్డాయి, 49 కాలనీలు పురోగతిలో ఉన్నాయి.

---

[274] 2019కి ముందు ఇది 20 చదరపు మీటర్లుగా ఉండేది

[275] ఆర్‌సి సంఖ్య 1708/సిఆర్ఆర్/బి/2020, తేదీ 18.07.2021

2018, 2020 సంవత్సరాల మధ్య జిల్లా కలెక్టర్లు వివిధ ఏజెన్సీలకు[276] పనులు కేటాయించారని, ఆర్&ఆర్ కాలనీల నిర్మాణానికి స్థలాలను ఆయా ఏజెన్సీలకు అప్పగించారని ఆడిట్ గమనించింది. నిర్మాణంలో ఉన్న 49 కాలనీల్లో మొత్తం 13,938 ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 11,507 యూనిట్ల నిర్మాణాలు పూర్తయ్యాయి (2023 మార్చి నాటికి). 2023 మార్చి వరకు ఈ గృహ యూనిట్లకు తరలించబడిన మొత్తం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు 6,216 మాత్రమే. 49 కాలనీలలో నిర్మించిన గృహాల సంఖ్య, గృహాల యూనిట్లకు అందించిన సౌకర్యాలు ***పటం 6.4*** లో చూపబడ్డాయి.

**పటం 6.4: 49 కాలనీలలో పురోగతిలో ఉన్న అవసరమైన సౌకర్యాలతో కూడిన గృహ యూనిట్లు**




నిర్మాణం పురోగతిలో ఉన్న 49 కాలనీలలో నిర్వాహణ శాఖలు పూర్తి చేసిన ఇళ్లకు సంబంధించిన పనుల స్థితి (2023 మార్చి నాటికి) ***అనుబంధం 6.7*** లో వివరించడమైంది.

ఆడిట్ ఈ క్రింది విషయాలను గమనించడమైంది:

- ప్రతిపాదిత 13,938 గృహ యూనిట్లలో, 11,507 యూనిట్లు పూర్తయ్యాయి (2023 మార్చి), మిగిలిన 2,431 యూనిట్లు పూర్తి కావాల్సి ఉంది. పూర్తయిన 11,507 ఇళ్లలో కేవలం 6,216 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను మాత్రమే తరలించారు. మిగిలిన 5,291 (11,507 యూనిట్లు–6,216 యూనిట్లు) పూర్తయిన యూనిట్లు (46 శాతం) కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో నిరుపయోగంగా పడిఉన్నాయి.
- 517 గృహ యూనిట్లలో (11,507–10,990) మరుగుదొడ్లు, 1,871 గృహ యూనిట్లకు (11,507–9,636) తాగునీటి కనెక్షన్లు, 3,732 గృహ యూనిట్లకు (11,507–7,775) విద్యుత్ కనెక్షన్లు అందించబడలేదు. అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల గృహ యూనిట్లను నిర్మించడంలో లక్షిత ఉద్దేశ్యం నెరవేరలేదు. మిగిలిన 2,431 యూనిట్లు (13,938–11,507) ను ప్రారంభించకపోవడానికి గల కారణాలు, ఇప్పటికే నిర్మించిన యూనిట్లలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడానికి గల కారణాలు రికార్డుల నుంచి లభ్యం కాలేదు.

[276] రోడ్లు & భవనాలు, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ, మౌళిక సదుపాయాల అభివృద్ధి సంస్థ

➢ 2018, 2020 సంవత్సరాల మధ్య ఆర్&ఆర్ కాలనీల నిర్మాణం కోసం భూములను పనులను నిర్వహిస్తున్న సంస్థలకు అప్పగించినప్పటికీ, మూడు నుంచి ఐదేళ్లు గడిచినా ఇంకా 44.22 శాతం పనులు పూర్తికాలేదు.

అప్పగించిన 13,938 గృహ యూనిట్లలో 11,595 యూనిట్లు పూర్తయ్యాయి, ఉపయోగించబడుతున్నాయి. మిగిలిన వాటిలో 2,137 యూనిట్లు పురోగతిలో ఉన్నాయి, 206 యూనిట్లు ఇంకా ప్రారంభించాల్సి ఉందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). 13,799 టాయిలెట్ యూనిట్లలో 11,063 పూర్తయ్యాయి, 1,459 టాయిలెట్లు పురోగతిలో ఉన్నాయి, మిగిలిన 1,277 ప్రారంభించాల్సి ఉంది. 1,852 గృహ యూనిట్లకు తాగునీటి కనెక్షన్లు, 3,496 గృహ యూనిట్లకు విద్యుత్ కనెక్షన్లు పురోగతిలో ఉన్నాయి.

ముగింపు సమావేశంలో, ప్రభుత్వం అసంపూర్ణ మౌలిక సదుపాయాలు, ఆర్&ఆర్ ప్రయోజనాల చెల్లింపు బకాయి ఉన్నందున, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు ఆర్&ఆర్ కాలనీలకు మారడం లేదని పేర్కొంది (2024 నవంబర్). వచ్చే ఆరు నెలల్లో మౌళిక సదుపాయాలు పూర్తవుతాయని, ఇప్పటికే నిర్మించిన ఇళ్లకు ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను తరలిస్తామన్నారు.

### 6.3.4.2 అదనపు ఉమ్మడి సౌకర్యాలు కల్పించకపోవడం

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు పరిధిలోని అన్ని ఆర్&ఆర్ కాలనీల్లో ప్రతి ఇంటికీ ఈ క్రింది ఉమ్మడి, తప్పనిసరి సౌకర్యాలను కల్పించాలని ఆర్&ఆర్ ప్రత్యేక కమీషనర్, అన్ని కార్యనిర్వాహక సంస్థలకు సర్క్యులర్ ఆదేశాలు జారీచేశారు (2021 మార్చి).

- ఇంటి చుట్టూ, అన్ని రీఇన్ఫోర్స్ సిమెంట్ కాంక్రీట్ భవనాలు/నిర్మాణాలు అంటే అంగన్వాడీ కేంద్రం, తపాలా కార్యాలయం, పాఠశాల భవనం, దుకాణాల సముదాయం మొదలైన వాటి పునాదికి రక్షణ.
- ఇళ్ళు, మరుగుదొడ్లు, మౌళిక సదుపాయాల భవనాలకు, అంచున ఇటుకలతో ఉన్న గట్టుతో ఒక మీటర్ వెడల్పు గల మార్గం.
- స్నానాల గదికి ప్రక్కన కడుగుకునే ప్రదేశం (పాత్రలు, బట్టలు శుభ్రం చేయడానికి), దానికి చుట్టూ ఇటుకలతో గట్టు.
- ప్రతి ఇంటికి వంటగది, మరుగుదొడ్లు, కడుగుకునే ప్రదేశం వద్ద మూడు కుళాయిలు.
- పడక గది లో ఒక అలమర (కప్‌బోర్డ్ లో నిర్మించబడింది).
- ఇంటి స్థలాల ఖాళీ ప్రదేశాలలో నాటడానికి, కూరగాయల పెంపకానికి అనువైన మట్టి.

ఇంకా, పైన పేర్కొన్న సౌకర్యాలను వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలో చేర్చాలని పనులను నిర్వహిస్తున్న సంస్థలకు ఆదేశాలు జారీ చేశారు. ఎంపిక చేసిన ఆర్&ఆర్ కాలనీలలో (2022 సెప్టెంబర్ నుండి నవంబర్ వరకు) లబ్ధిదారుల సర్వే సమయంలో, **6.2 నుండి 6.5 చిత్రాలలో** చూపిన విధంగా పైన పేర్కొన్న అదనపు సౌకర్యాలలో చాలా వరకు, అన్ని ఇళ్లకు అందించబడలేదని ఆడిట్ గమనించింది.

**చిత్రం 6.2 నుండి 6.5 వరకు: అదనపు సౌకర్యాలు కల్పించకపోవడానికి సంబంధించిన ఛాయా చిత్రాలు, అంటే, పునాదికి రక్షణ లేకపోవడం, ఇంటికి మార్గం లేకపోవడం, కడుక్కునే ప్రదేశం లేకపోవడం, కుళాయిలు లేకపోవడం.**




**ఇంటికి పునాదికి రక్షణ లేదు, వెళ్లే దారి లేదు (ప్లాట్ సంఖ్య 176)**




**పంచాయతీ కార్యాలయ భవన పునాదికి రక్షణ లేదు (ప్లాట్ సంఖ్య 52)**




**మరుగుదొడ్డిలో కుళాయి కనెక్షను ఇవ్వలేదు**




**వంటగదిలో కుళాయి కనెక్షను ఇవ్వలేదు**

వ్యయ సవరణ కమిటీ ప్రకారం, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబానికి యూనిట్ వ్యయంలో పరిమితుల కారణంగా, అన్ని కాలనీలలో ఇళ్ల నిర్మాణంలో ఏకరూపతను కొనసాగించడానికి, పడకగదిలో ఒక అలమర, వంటగదిలో ఒక అలమర అందించబడ్డాయని, ప్రతి ఇంటికి బట్టలు ఉతకడానికి, శుభ్రం చేయడానికి ప్లాట్‌ఫారమ్‌తో ఒక ట్యాప్ కనెక్షన్ కూడా అందించబడిందని. మిగిలిన సౌకర్యాలను కూడా సకాలంలో అందిస్తామని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు).

తప్పనిసరి అదనపు ఉమ్మడి సౌకర్యాలను అందించాలని అన్ని పనులను నిర్వహిస్తున్న సంస్థలకు ప్రత్యేక కమిషనర్, ఆర్&ఆర్, ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఈ సౌకర్యాలు ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు అందించబడలేదని సమాధానం ధృవీకరిస్తుంది.

## 6.3.5 ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల నిరుపయోగమైన ఖర్చు

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని మూడవ షెడ్యూల్ అవసరమైతే స్థిరనివాసాలకు తగిన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని నిర్దేశిస్తుంది. చాలా పునరావాస కాలనీలు పొలాలలో/సమీపంలో ఉన్నందున, చట్టంలోని నిబంధనల ప్రకారం అందించాల్సిన ప్రాథమిక భద్రతా ఏర్పాట్లలో ప్రహరీ గోడల నిర్మాణం ఒకటి.

పూర్వపు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు ఆర్&ఆర్ కాలనీల అభివృద్ధికి సంబంధించిన పనులను వివిధ అమలు సంస్థలకు[277] అప్పగించారు. వీటిలో తూర్పు గోదావరి జిల్లాలో నాలుగు కాలనీలు[278], పశ్చిమ గోదావరి జిల్లాలో 11 కాలనీల[279] పనులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ లిమిటెడ్‌కు అప్పగించారు. తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ లిమిటెడ్ యొక్క కార్యనిర్వాహక ఇంజనీరు వారి కార్యాలయం రికార్డులను పరిశీలించగా కృష్ణునిపాలెం, ఇందుకూరు-1, ఇందుకూరు-2 ఆర్&ఆర్ కాలనీల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలలో, ***పట్టిక 6.13*** లో వివరించిన విధంగా, ₹4.64 కోట్లు కేటాయించారని వెల్లడైంది.

**పట్టిక 6.13: అసంపూర్తిగా నిర్మించబడిన ప్రహరీ గోడలున్న ఆర్&ఆర్ కాలనీలు**

**(₹ కోట్లలో)**

| క్రమ సంఖ్య | ఆర్&ఆర్ కాలనీ పేరు | డీపీఆర్ లో కేటాయింపు మొత్తం | చేసిన ఖర్చు |
|---|---|---|---|
| 1. | కృష్ణునిపాలెం | 1.81 | 0.92 |
| 2. | ఇందుకూరు-1 | 1.76 | 0.50 |
| 3. | ఇందుకూరు-2 | 1.07 | 0.02 |
| **మొత్తం** | | **4.64** | **1.44** |

పై మూడు కాలనీల్లో ప్రహరీ గోడ నిర్మాణ పనులు (2019-20లో ప్రారంభమయ్యాయి) అసంపూర్తిగా ఉన్నాయని, ₹1.44 కోట్లు ఖర్చు చేసిన తరువాత 2021లో నిర్మాణాన్ని నిలిపివేసినట్లు పై కాలనీల సంయుక్త పరిశీలనలో వెల్లడైంది. పనులు నిలిపివేయడం వల్ల మూడు ఆర్&ఆర్ కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న ప్రహరీ గోడలకు కోసం ₹1.44 కోట్ల నిష్ఫలమైన ఖర్చు జరిగింది.

**చిత్రం-6.6, 6.7: అసంపూర్తిగా ఉన్న ప్రహరీ గోడల యొక్క ఛాయా చిత్రాలు**



**కృష్ణునిపాలెం ఆర్&ఆర్ కాలనీ**



**ఇందుకురు-I ఆర్&ఆర్ కాలనీ**

277 రోడ్లు & భవనాలు, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్ విద్యా సంక్షేమ మౌళిక సదుపాయాల అభివృద్ధి సంస్థ

278 ఇందుకూరు-1 (350), ఇందుకూరు-2 (134), కృష్ణునిపాలెం (1,067), వెలగపల్లి (102)

279 యర్రవరం (95), సరిపల్లి (315), సరుగుడు (60), శివగిరి (128), తాడువాయి (3905), వంకవారిగూడెం (94), బుట్టాయిగూడెం (168), దర్భగూడెం (220), దొరమామిడి (198), రాచన్నగూడెం (153), స్వర్ణవారిగూడెం (444)

ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల యొక్క యూనిట్ వ్యయంలో పరిమితులు, అన్ని ఆర్&ఆర్ కాలనీల నిర్మాణంలో ఏకరూపత పాటించడం వల్ల పాక్షిక నిర్మాణం తర్వాత ప్రహరీ గోడ నిర్మాణాన్ని నిలిపివేసినట్లు ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 ఆగస్టు). అన్ని ఆర్&ఆర్ కాలనీలు పూర్తయిన తరువాత, ఈ కాలనీలు గ్రామ పంచాయితీ యొక్క ఆధీనంలో ఉంచబడతాయి, అందువల్ల ఆర్&ఆర్ కాలనీలలో ప్రభుత్వ ఆస్తుల భద్రత / ఆక్రమణను సంబంధిత గ్రామ పంచాయతీ పరిష్కరిస్తుంది.

స్థల అవసరాల ఆధారంగా సౌకర్యాలు కల్పించాలి. అందువల్ల, ఈ కాలనీలు పొలాలు, అడవులను ఆనుకుని ఉన్నందున ప్రహరీ గోడలు అవసరం. వీటిని అందించకపోవడం వల్ల ఆక్రమణలు, అతిక్రమణ కారణంగా సామాజిక సంఘర్షణలు సంభవించవచ్చు కాబట్టి ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు.

## 6.4 పర్యవేక్షణ యంత్రాంగం, ఇతర సమస్యలు

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 43(2) & (3) ప్రకారం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ప్రత్యేక కాలపరిమితిని అందుకోవడానికి సమర్థవంతంగా పనిచేయాలి. నిర్దేశిత అధికారాలు, విధులు, బాధ్యతలను సంబంధిత ప్రభుత్వం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కు ఇవ్వాలి. సంబంధిత ప్రభుత్వం నిర్ణయించిన విధంగా, కల్పించబడిన కార్యాలయ మౌళిక సదుపాయాలతో తన ఆధీనంలో ఉన్న అధికారులు, ఉద్యోగుల సహాయంతో ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్, ఆర్&ఆర్ కమీషనర్ పర్యవేక్షణ, ఆదేశాలు, నియంత్రణకు లోబడి పని చేస్తారు. ఆర్&ఆర్ పథక రూపకల్పన, అమలు, పర్యవేక్షణ బాధ్యతలు ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కు ఉన్నాయి.

### 6.4.1 ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కార్యాలయం ఏర్పాటులో జాప్యం

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టును, ప్రణాళిక నుండి అమలు, సమాజ సంక్షేమం వరకు విజయవంతంగా అమలు చేయడంలో ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కీలక పాత్ర పోషిస్తారు. ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013, 2014 జనవరి నుండి అమలులోకి వచ్చినప్పటికీ, ఈ ప్రాజెక్టుకు, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ను ప్రభుత్వం 2020 మే[280] లో మాత్రమే నియమించింది[281]. ఆ తరువాత, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కార్యాలయం 2020 జూలై నుండి తన కార్యకలాపాలను ప్రారంభించింది.

తద్వారా, ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 ప్రారంభమైనప్పటి నుండి ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కార్యాలయం ఏర్పాటులో ఆరేళ్ల జాప్యం జరిగింది. భూసేకరణ, పునరావాసం & పునరుపాధి కల్పన అమలులో లోపాలకు ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ నియామకంలో జాప్యం కూడా ఒక కారణం కావచ్చు.

ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కార్యాలయం ఏర్పాటుకు ముందు, పూర్వపు తూర్పు గోదావరి & పశ్చిమ గోదావరి జిల్లాల సంయుక్త కలెక్టర్లు, వారి సంబంధిత అధికార పరిధిలోని పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు యొక్క ఆర్&ఆర్ యూనిట్లను పర్యవేక్షించేవారని, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్లుగా వ్యవహరించేవారని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు).

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల పునరావాసంను సమర్థవంతంగా, సకాలంలో పూర్తి చేయడానికి ఆర్&ఆర్ పథక రూపకల్పన, అమలు, పర్యవేక్షించడానికి ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ నియామకం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించింది, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ నియామకంలో జాప్యం ఆర్&ఆర్ పథకం అమలులో లోపాలకు దారితీసింది కాబట్టి సమాధానం ఆమోదయోగ్యం కాదు.

---

[280] దీనికి ముందు ప్రత్యేక కమిషనర్ (ఆర్&ఆర్), సంబంధిత జిల్లా కలెక్టర్లు ఆర్&ఆర్ కార్యకలాపాలను పర్యవేక్షించారు

[281] జీఓఎంఎస్ సంఖ్య 42, జీఏ (ఎస్‌పిఏ) విభాగం, తేదీ 10.05.2020

### 6.4.2 అరకొర సిబ్బందితో ఆర్&ఆర్ యూనిట్ల నిర్వహణ

ఐదు ఆర్&ఆర్ యూనిట్లలో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్యకు సంబంధించిన రికార్డులను పరిశీలించగా, మంజూరైన 65 తాత్కాలిక పోస్టులలో (పొరుగు సేవల లేదా పదవీ విరమణ చేసిన సిబ్బంది పోస్టులు) 42 పోస్టులు మాత్రమే భర్తీ చేయగా, 23 పోస్టులు (35 శాతం) ఖాళీగా ఉన్నాయని వెల్లడైంది.

65 తాత్కాలిక పోస్టులు మంజూరయ్యాయని, వాటిని పొరుగు సేవల లేదా పదవీ విరమణ చేసిన ఉద్యోగులతో భర్తీ చేశామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 ఆగస్టు). ప్రస్తుతం భర్తీచేసిన 42 పోస్టుల్లో 10 మంది పదవీ విరమణ చేసిన ఉద్యోగులు రాజీనామా చేశారు, మిగిలిన 32 మంది పొరుగు సేవల ఉద్యోగులు పనిచేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న ఆర్&ఆర్ యూనిట్లలో పనిచేసేందుకు అర్హులైన వారు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ముందుకు రావడం లేదు. అయితే ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ముగింపు సమావేశంలో ప్రభుత్వం, గతంలో ఈ యూనిట్లు పనిచేయలేదని, అందువల్ల సిబ్బందిని నియమించలేదని పేర్కొంది (2024 నవంబర్). ఇప్పుడు పనులు ఊపందుకోవడంతో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రతిపాదించామని, ఈ మేరకు జిల్లా కలెక్టర్లను ఆదేశించామని పేర్కొంది.

### 6.4.3 ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి సమర్థవంతమైన యంత్రాంగం లేకపోవడం

ఫిర్యాదుల సరైన పరిష్కారం కోసం ఒక ఫిర్యాదుల పరిష్కార కేంద్రం, వెబ్ పోర్టల్ అభివృద్ధి చేశారు (2019). పరిష్కారం కోసం ఫిర్యాదులను ప్రజలు వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు.

2023 మార్చి చివరి నాటికి, మొత్తం 13,096 ఆర్&ఆర్ సంబంధిత ఫిర్యాదులు 2019-20 నుండి 2021-22 మధ్య కాలంలో వచ్చాయని శాఖ రికార్డుల పరిశీలనలో వెల్లడైంది. ఈ 13,096 ఫిర్యాదులలో 10,920 పరిష్కరించబడ్డాయి, మిగిలిన 2,176 ఫిర్యాదులు (17 శాతం) పరిష్కారించాల్సి ఉందన్నారు. వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయబడిన ఫిర్యాదులలో ఎక్కువ శాతం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబం పేరు, రేషన్ కార్డ్ నంబర్, బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్ నంబర్ మొదలైన వాటిలోని వ్యత్యాసాలకు సంబంధించినవి. సంవత్సరాల వారీగా పరిష్కరించిన, పరిష్కారించాల్సిన కేసుల యొక్క వివరాలు ***పటం 6.5*** లో చూపబడ్డాయి.

**పటం 6.5: 2019-23 కాలంలో ఫిర్యాదుల స్థితి**




స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి కాలపరిమితి నిర్ణయించలేదని ఆడిట్ గమనించింది. ఇంకా, 2019-20కి ముందు స్వీకరించిన, పరిష్కరించిన ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం కార్యాలయం వద్ద అందుబాటులో లేదు, ఇది ప్రాజెక్టు యొక్క అన్ని ఆర్&ఆర్ కార్యకలాపాలను చూసుకునే ఉద్దేశ్యంతో ప్రత్యేకంగా ఒక నియంత్రణ కార్యాలయంగా ఏర్పడిన ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కార్యాలయం, స్వీకరించిన/పరిష్కరించిన ఫిర్యాదులకు చెందిన సంబంధిత మొత్తం సమాచారాన్ని నిర్వహించడం లేదని సూచిస్తుంది.

ఫిర్యాదుల అభ్యర్థనలను పొందుపరచడానికి, పొందుపరచిన/పరిష్కరించబడిన ఫిర్యాదుల ఆన్‌లైన్ రికార్డులను నిర్వహించడానికి ఒక వెబ్ పోర్టల్ (www.polavaram.ap.gov.in) రూపొందించబడిందని ప్రభుత్వం

సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). ప్రతి అభ్యర్థనను తొలుత మండల స్థాయి అధికారి, ఆ తర్వాత ఆర్&ఆర్ అధికారులు, ఆ తర్వాత ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ విచారించి అప్పీల్ అవకాశం కల్పించే యంత్రాంగంతో వెబ్ పోర్టల్ను రూపొందించారు. అలాగే, అన్ని ఫిర్యాదులను సత్వరం, సమర్థవంతంగా పరిష్కరించడానికి, పునరావాసం ప్రక్రియలో పారదర్శకత కోసం, బాధిత వర్గాలకు భరోసా/మద్దతు ఇవ్వడానికి మొత్తం పరిపాలనా సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి స్పష్టమైన, ఖచ్చితమైన కాలపరిమితులతో ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తారు. పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు యొక్క ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కార్యాలయం స్థాపించబడిన తర్వాత, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం బలోపేతం చేయబడింది, క్రమబద్ధీకరించబడిందని పేర్కొంది.

పరిష్కరించాల్సిన కేసులకు సంబంధించి ప్రభుత్వం సమాధానమివ్వలేదు. అంతేకాకుండా, ఈ వెబ్ సైట్ లో స్వీకరించిన, పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను చూపించడం లేదు.

ఆ విధంగా, ఫిర్యాదుల యొక్క నిజసమయ స్థితిని కలిగి ఉండే ఆన్‌లైన్ యంత్రాంగాన్ని అభివృద్ధి చేయలేదు.

### 6.4.4 ఆర్&ఆర్ కాలనీలలో సామాజిక తనిఖీలు నిర్వహించకపోవడం

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం 2013 లోని సెక్షన్ 45, 44 (3) ప్రకారం, సేకరించాలని ప్రతిపాదించిన భూమి 100 ఎకరాలు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే, సంబంధిత ప్రభుత్వం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేయాలి, దీనిని ఆర్&ఆర్ కమిటీ అని పిలుస్తారు. ఈ కమిటీ ఆర్&ఆర్ పథకం అమలులోని పురోగతిని పర్యవేక్షించి సమీక్షిస్తుంది మరియు గ్రామీణ ప్రాంతాలలో గ్రామసభ, పట్టణ ప్రాంతాలలో పురపాలకసంఘంతో సంప్రదించి అమలు అనంతర సామాజిక తనిఖీలను నిర్వహిస్తుంది. అమలు అనంతర సామాజిక తనిఖీలకు ఆర్&ఆర్ కమీషనర్ బాధ్యత వహిస్తారు.

ఆంధ్రప్రదేశ్ ఆర్&ఆర్ పాలసీ, 2005 లోని పేరా 8.2 ప్రకారం ఆర్&ఆర్ పథకం అమలుపై మూడవ పక్షం ఏకకాలిక ఆడిట్ నిర్వహించాలని, అటువంటి ఆడిట్ నివేదికను ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కమిటీ ముందు ఉంచాలని పేర్కొంది.

పూర్తయిన ఏ ఆర్&ఆర్ కాలనీల్లోనూ అమలు అనంతర సామాజిక తనిఖీలను శాఖ నిర్వహించలేదని ఆడిట్ గమనించింది. ఆర్&ఆర్ కాలనీల్లో ఎంపిక చేసిన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల లబ్ధిదారుల సర్వే (7వ అధ్యాయం చూడండి) సందర్భంగా ఆర్&ఆర్ ప్రయోజనాలను అందకపోవడం, ఆర్&ఆర్ కాలనీలలో చేపట్టిన పనుల నాణ్యతలో, కొన్ని సౌకర్యాలు కల్పించకపోవడం, మౌళిక సదుపాయాలు, సౌకర్యాల నిర్వహణ సరిగా లేకపోవడం వంటి అనేక సమస్యలు ఉన్నట్లు గమనించామని చెప్పడం సముచితం.

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 సెక్షన్ 45(1) ప్రకారం, పూర్వపు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ప్రాజెక్టు స్థాయి పర్యవేక్షణ కమిటీలను (పీఎల్ఎంసీ) ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 ఆగస్టు). పూర్వపు తూర్పు గోదావరి జిల్లాలో మూడు (2021 అక్టోబర్, 2022 జూన్ మధ్య), పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాలో ఐదు (2021 సెప్టెంబర్ 2022 ఆగస్టు మధ్య) పీఎల్ఎంసీ సమావేశాలు జరిగాయి. ఇంకా, అన్ని పనులు అన్ని విధాలుగా పూర్తయిన తర్వాత సామాజిక-ఆర్థిక ప్రమాణాలను అంచనా వేయడానికి చట్టబద్ధమైన సామాజిక తనిఖీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పురోగతిలో ఉన్న 49 కాలనీలకు ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను తరలించిన తర్వాత సామాజిక తనిఖీలను చేపడతామని ముగింపు సమావేశంలో ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 నవంబర్).

సమాధానం ఆమోదయోగ్యం కాదు. ఆర్&ఆర్ ప్రణాళిక ఎంత సమర్థవంతంగా అమలు చేయబడుతుందో, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు వారి విలువైన ఆస్తులను, వారి అసలు భూమికి అనుసంధానమైన సామాజిక జీవితాన్ని వదులుకోవడానికి బదులుగా ఇచ్చిన పరిహారంతో ఎంతవరకు సంతృప్తి చెందారో అంచనా వేయడానికి సామాజిక తనిఖీ ఉద్దేశించబడింది.

పూర్తయిన, కుటుంబాలు తరలించబడిన ఆర్&ఆర్ కాలనీలలో సామాజిక తనిఖీ నిర్వహించకపోవడం వల్ల, వారి అభిప్రాయాన్ని పొందే అవకాశాన్ని, కొనసాగుతున్న/మిగిలిన ఆర్&ఆర్ కాలనీలలో దిద్దుబాటు చర్యలు తీసుకునే అవకాశాన్ని శాఖ కోల్పోయింది.

7వ అధ్యాయం

# లబ్ధిదారులు, వసతుల సర్వే

Pages 133 – 155

# 7వ అధ్యాయం

# లబ్ధిదారులు, వసతుల సర్వే

లబ్ధిదారుల సర్వేలో దాదాపు 40 శాతం పీడీఎఫ్‌లకు భూమి అవార్డు, 24 శాతం మంది ఆర్&ఆర్ నగదు పరిహారం అందలేదని తేలింది. గోడలపై పగుళ్లు, పైకప్పు చెమ్మ, ఫ్లోరింగ్ సమస్యలు మొదలైన వాటి కారణంగా దాదాపు 31 శాతం పీడీఎఫ్‌లు గృహ యూనిట్ల అంతర్గత నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పీడీఎఫ్‌లకు ఇచ్చిన గృహ యూనిట్లు పీడీఎఫ్‌ల పేర్లతో నమోదు చేయబడలేదు. అర్హత ఉన్నప్పటికీ 36 శాతం పీడీఎఫ్‌లకు 'భూమికి-భూమి' కేటాయింపు జరగలేదు. అర్హత కలిగిన (95 శాతం) షెడ్యూల్డ్ కుల, షెడ్యూల్డ్ తెగ యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ అందించలేదు.

నమూనాగా సేకరించిన ఆర్&ఆర్ కాలనీల సౌకర్యాల సర్వేలో కాలనీలకు సరైన అంతర్గత (33 శాతం) లేదా బాహ్య రోడ్లు లేవని, 42 శాతం ఆర్&ఆర్ కాలనీలకు పాఠశాలలు లేవని, 43 శాతం ఆర్&ఆర్ కాలనీలలో స్థాపించిన పాఠశాలలు పనిచేయటం లేదని, 83 శాతం ఆర్&ఆర్ కాలనీలలో పిల్లల కోసం ఆట స్థలం లేదని తేలింది. ప్రాథమిక ఆరోగ్య సౌకర్యాలు అంటే, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు/ఉప-ఆరోగ్య కేంద్రాలు 83 శాతం ఆర్&ఆర్ కాలనీలలో స్థాపించలేదు, స్థాపించినవి పనిచేయటం లేదు. ఇంకా, 58 శాతం ఆర్&ఆర్ కాలనీలలో అంగన్‌వాడీ కేంద్రాలు స్థాపించలేదు, 92 శాతం ఆర్&ఆర్ కాలనీలలో బహిరంగ మురుగునీటి కాలువ వ్యవస్థ ఉంది. దాదాపు అన్ని ఆర్&ఆర్ కాలనీలలో పశువైద్య సేవా కేంద్రాలు అందుబాటులో లేవు. అన్ని ఆర్&ఆర్ కాలనీలలో మరుగుదొడ్లకు కుళాయి కనెక్షన్లు అందించబడలేదు. పీడీఎఫ్‌లకు ఉచిత రేషన్ అందించడానికి 67 శాతం ఆర్&ఆర్ కాలనీలలో చౌక ధరల దుకాణాలు అందుబాటులో లేవు.

## 7.1 పరిచయం

భూసేకరణ చట్టం, 1894, భూసేకరణ, పునరావాసం & పునరుపాధి కల్పనలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు (ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్) చట్టం, 2013 ఆర్&ఆర్ కాలనీలలో అందించాల్సిన ప్రాథమిక కనీస మౌళిక సదుపాయాలతో పాటు, ప్రభావిత ప్రజలకు అందజేయాల్సిన భూమి పరిహారం, ఆర్&ఆర్ ప్రయోజనాలను మూడు షెడ్యూల్‌ల క్రింద స్పష్టంగా నిర్దేశించాయి.

| ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క షెడ్యూల్, నిబంధనలు | వివరణ |
|---|---|
| మొదటి షెడ్యూల్ (సెక్షన్ 30(2)) | భూమిని స్వాధీనం చేసుకున్న వారికి కనీస పరిహార ప్యాకేజీ ఇవ్వాలి. **(భూమి పరిహారం)** |

| | |
|---|---|
| రెండవ షెడ్యూల్ (సెక్షన్ 31(1), 38(1), 105(3)) | పునరావాసం & పునరుపాధి కల్పన హక్కులు అంటే, గృహ యూనిట్లు అందించడం, భూమికి-భూమి, ఆర్&ఆర్ నగదు ప్రయోజనాలు[282] మొదలైనవి, భూ యజమానులకు మొదటి షెడ్యూల్ క్రింద అందించిన పరిహారంతో పాటు ప్రభావితమైన అన్ని కుటుంబాలకు (భూ యజమానులు, సేకరించిన భూమిపై ప్రధానంగా జీవనోపాధికి ఆధారపడిన కుటుంబాలు). **(ఆర్&ఆర్ ప్రయోజనాలు)** |
| మూడవ షెడ్యూల్ (సెక్షన్ 32, 38(1), 105(3)) | పునరావాసం పొందిన ప్రాంతంలో మౌళిక సదుపాయాలు, ప్రాథమిక కనీస సౌకర్యాలను రిక్విజిషనింగ్ అథారిటీ ఖర్చుతో అందించాలి. **(మౌళిక వసతులు)** |

373 ఆవాస ప్రాంతాలలోని మొత్తం 1,06,006 'ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల'ను తరలించాలని గుర్తించారు. ఆర్&ఆర్ కార్యకలాపాలను రెండు దశలుగా[283] విభజించారు. మొదటి దశ క్రింద, 20,946 పీడీఎఫ్‌లకు పునరావాసం కల్పించాలని, రెండవ దశ క్రింద 85,060 పీడీఎఫ్‌లకు పునరావాసం కల్పించాలని నిర్ణయించారు. అయితే, 2023 మార్చి చివరి నాటికి, 75 ఆర్&ఆర్ కాలనీలలో (26 పూర్తయినవి, 49 పురోగతిలో ఉన్నవి), 38 ఆవాస ప్రాంతాలలోని మొత్తం 11,677 పీడీఎఫ్‌లు (మొదటి దశ) పునరావాసం పొందాయి.

పనితీరు ఆడిట్‌లో భాగంగా, ఆర్&ఆర్ పథకం క్రింద పొందుతున్న సామాజిక-ఆర్థిక ప్రయోజనాలు, అందించబడిన సౌకర్యాల సమృద్ధి గురించి లబ్ధిదారుల అవగాహనను విశ్లేషించడానికి, ఆడిట్ నిర్మాణాత్మక ప్రశ్నాపత్రం సహాయంతో ఎంచుకున్న ఆవాసాలు, ఆర్&ఆర్ కాలనీలకు సంబంధించి లబ్ధిదారులు, సౌకర్యాల సర్వేను నిర్వహించింది.

### 7.1.1 సమాచార సేకరణ, నమూనా

మొదటి దశ (2017-2022) క్రింద ప్రయోజనం పొందిన పీడీఎఫ్‌లను కవర్ చేస్తూ లబ్ధిదారు, సౌకర్యాల సర్వే నిర్వహించబడింది. సర్వే నిర్వహించడం కోసం, ఆడిట్ మొదటి దశ క్రింద పీడీఎఫ్‌లను రెండు వర్గాలుగా వర్గీకరించింది, అవి 1వ వర్గం: ఆర్&ఆర్ కాలనీలలో పునరావాసం కల్పించబడిన పీడీఎఫ్‌లు, 2వ వర్గం: ఇంకా పునరావాసం పొందని పీడీఎఫ్‌ల ఆవాస ప్రాంతాలు.

లబ్ధిదారు, సౌకర్యాల సర్వే కోసం ఆవాస ప్రాంతాలను (ఇంకా పునరావాసం పొందని పీడీఎఫ్‌ల ప్రదేశాల నుండి), ఆర్&ఆర్ కాలనీలను ఎంచుకోవడానికి, ఆడిట్ కింది ప్రమాణాలతో పునరావృత రహిత సాధారణ యాదృచ్ఛిక నమూనా పద్ధతి[284] (ఎస్ఆర్ఎస్‌డబ్ల్యుఆర్) పద్ధతిని వర్తింపజేసింది.

* పీడీఎఫ్‌లు తరలించిన 25 శాతం ఆర్&ఆర్ కాలనీలలో.
* ఇంకా కొత్త ఆర్&ఆర్ కాలనీలకు తరలించని పీడీఎఫ్‌ల ఆవాస ప్రాంతాలలో 25 శాతం.

### (అ) మొదటి వర్గం: ఆర్&ఆర్ కాలనీలలో పునరావాసం కల్పించబడిన పీడీఎఫ్‌లు

పైన పేర్కొన్న నమూనా పద్ధతితో, 355 పీడీఎఫ్ ల నమూనా పరిమాణం తీసుకొనబడింది (వివరాలు ***అనుబంధం 7.1*** లో ఉన్నాయి). లబ్ధిదారుల సర్వే నిర్వహించే సమయంలో, కొంతమంది లబ్ధిదారులు అందుబాటులో ఉండకపోవచ్చు/ ప్రతిస్పందించకపోవచ్చు అని భావించి, నమూనా పరిమాణాన్ని 20 శాతం అంటే, ***పట్టిక 7.1*** లో చూపిన విధంగా 426కి పెంచారు.

---

282 వార్షిక చెల్లింపు/ఉపాధి ఎంపిక, ఒక సంవత్సరం కాలానికి జీవనాధార గ్రాంట్, రవాణా ఖర్చు, పశువుల కొట్టం/చిన్న దుకాణం ఖర్చు, చేతివృత్తులవారికి ఒకేసారి గ్రాంట్, చేపలు పట్టే హక్కులు, ఒకేసారి పునరావాస భత్యం, కేటాయించిన భూమి లేదా ఇంటి రిజిస్ట్రేషన్ కోసం స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు

283 మొదటి దశ ఈఎల్ (+) 41.15 మీ. వరకు, రెండవ దశ (+) 41.15 మీ. పైన

284 సింపుల్ రాండమ్ శాంప్లింగ్ విత్‌అవుట్ రీప్లేస్‌మెంట్

**పట్టిక 7.1: మొదటి వర్గం (మొదటి దశ) యొక్క ఆర్&ఆర్ కాలనీలు, పీడీఎఫ్‌ల ఎంపికను చూపే పట్టిక**

| క్రమ సంఖ్య | ఆదాయం / అమలు అధికారం | ఆర్&ఆర్ కాలనీల సంఖ్య | ఎంపిక చేసిన ఆర్&ఆర్ కాలనీల సంఖ్య (25 శాతం) | ఎంపిక చేసిన ఆర్&ఆర్ కాలనీలలో మొత్తం పీడీఎఫ్‌ల సంఖ్య | ఎంపిక చేసిన లబ్ధిదారుల సంఖ్య |
|---|---|---|---|---|---|
| 1. | ఆర్‌డీఓ, రంపచోడవరం | 18 | 5 | 1,260 | 193 |
| 2. | ఆర్‌డీఓ, జంగారెడ్డిగూడెం | 11 | 3 | 748 | 209 |
| 3. | ప్రాజెక్టు అధికారి, ఐటీడీఏ, కేఆర్ పురం | 7 | 2 | 101 | 24 |
| | మొత్తం | 36 | 10 | 2,109 | 426 |

*మూలం: రాజమహేంద్రవరంలోని ప్రాజెక్టు నిర్వాహకుల (పీఏపీ) రికార్డులు*

## (ఆ) 2వ వర్గం: ఇంకా పునరావాసం కల్పించని పీడీఎఫ్‌ల ఆవాస ప్రాంతాలు

పైన పేర్కొన్న విధంగా నమూనా సేకరణ పద్ధతిలో, నమూనా పరిమాణం 370గా తీసుకోవడమైనది (వివరాలు ***అనుబంధం 7.1*** లో ఉన్నాయి). లబ్ధిదారుల సర్వే నిర్వహించే సమయంలో, కొంతమంది లబ్ధిదారులు అందుబాటులో లేకపోవచ్చును లేదా ప్రతిస్పందించకపోవచ్చును అని భావించి, నమూనా పరిమాణాన్ని 20 శాతం పెంచడమైంది, అంటే ***పట్టిక 7.2*** లో వివరించిన విధంగా 444కి పెంచారు.

**పట్టిక 7.2: ఇంకా పునరావాసం కల్పించని ఆవాస ప్రాంతాలు, పీడీఎఫ్‌లను చూపే పట్టిక**

| క్రమ సంఖ్య | ఆదాయం/ అమలు అధికారి | ఆవాస ప్రాంతాలు సంఖ్య | ఎంపిక చేసిన ఆవాస ప్రాంతాల సంఖ్య (25 శాతం) | ఆవాస ప్రాంతాలలో లబ్ధిదారుల సంఖ్య | ఆవాస ప్రాంతాలలో ఎంపిక చేసిన లబ్ధిదారుల సంఖ్య |
|---|---|---|---|---|---|
| 1 | ఆర్డీఓ, రంపచోడవరం | 34 | 9 | 521 | 101 |
| 2 | ఆర్డీఓ, జంగారెడ్డిగూడెం | 28 | 7 | 187 | 38 |
| 3 | ప్రాజెక్టు అధికారి, ఐటీడీఏ, కేఆర్ పురం | 25 | 6 | 2,041 | 305 |
| | మొత్తం | 87 | 22 | 2,749 | 444 |

*మూలం: రాజమహేంద్రవరంలోని ప్రాజెక్టు నిర్వాహకుల (పీఏపీ) రికార్డులు*

భూసేకరణ, ఆర్&ఆర్ కార్యకలాపాలను సమగ్రంగా సమీక్షించడానికి, రెవెన్యూ అధికారులు (భూసేకరణ, ఆర్&ఆర్ అవార్డులు), అమలు అధికారులు (ఆర్&ఆర్ కాలనీల నిర్మాణం), పర్యవేక్షణ అధికారులు (పీఏ, పీఏపీ, ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), కమీషనర్ (ఆర్&ఆర్)) ఆడిట్‌లో భాగంగా సమీక్షించబడ్డారు.

### 7.1.2 సర్వే విధానం, నిర్వహణ

ఎంచుకున్న ఆర్&ఆర్ కాలనీలలో సర్వే చేయబడిన మొత్తం లబ్ధిదారుల సంఖ్య ఎంచుకున్న 120 శాతం నమూనాకు వాస్తవంగా అవసరమైన (100 శాతం) నమూనా కంటే తక్కువగా ఉన్నప్పుడు, అందుబాటులో లేని/స్పందించని లబ్ధిదారుల స్థానంలో కొత్త లబ్ధిదారులను (నమూనాలో కాదు) చేర్చడం ద్వారా ఆర్&ఆర్ కాలనీలు, ఆవాస ప్రాంతాలలో, పీడీఎఫ్‌ల సర్వేను ఆడిట్ నిర్వహించింది. ఎంచుకున్న నమూనా, నిర్వహించిన వాస్తవ సర్వే యొక్క సారాంశం ***పట్టిక 7.3*** లో వివరించబడింది.

**పట్టిక 7.3: సర్వే చేయబడిన లబ్ధిదారుల సంఖ్య వివరాలు**

| క్రమ సంఖ్య | రెవెన్యూ/ అమలు అధికారం | వర్గం | ఎంచుకున్న నమూనా ప్రకారం చేయవలసినది | | | వాస్తవానికి సర్వే చేయబడింది | |
|---|---|---|---|---|---|---|---|
| | | | ఆవాస ప్రాంతాల సంఖ్య/ కాలనీలు | సర్వే చేయాల్సిన పీడీఎఫ్ ల నమూనా పరిమాణం | ఎంచుకున్న నమూనా పీడీఎఫ్ లు | కాలనీలు/ ఆవాస ప్రాంతాల సంఖ్య | పీడీఎఫ్ ల సంఖ్య |
| (అ) | (ఆ) | (ఇ) | (ఈ) | (ఉ) | (ఊ) = (1.2 x (ఉ)) | (ఎ) | (ఏ) |
| 1. | ఆర్‌డీఓ, | కాలనీలు | 5 | 174 | 209 | 7 కాలనీలు | 219 |

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | జంగారెడ్డిగూడెం | ఆవాస ప్రాంతాలు | 7 | 32 | 38 | | |
| 2. | ఆర్డీఓ, రంపచోడవరం | కాలనీలు | 3 | 161 | 193 | 3 కాలనీలు | 170 |
| | | ఆవాస ప్రాంతాలు | 9 | 84 | 101 | | |
| 3. | పీఓ, ఐటీడీఏ, కెఆర్ పురం | కాలనీలు | 2 | 20 | 24 | 2 కాలనీలు | 29 |
| | | ఆవాస ప్రాంతాలు | 6 | 254 | 305 | 6 నివాసాలు | 313 |
| | **మొత్తం** | | **10 కాలనీలు** | **725** | **870** | **12 కాలనీలు** | **418** |
| | | | **22 ఆవాస ప్రాంతాలు** | | | **6 ఆవాస ప్రాంతాలు** | **313** |

*మూలం: రాజమహేంద్రవరంలోని ప్రాజెక్టు నిర్వాహకుల (పీఏపీ) రికార్డులు*

12 ఆర్&ఆర్ కాలనీలలో[285] మొత్తం 418 పీడీఎఫ్‌లను, ఆరు[286] ఆవాస ప్రాంతాలలో 313 పీడీఎఫ్‌లను వివరణాత్మక సర్వే కోసం ఎంపిక చేశారు. సౌకర్యాలు, లబ్ధిదారుల సర్వే నిర్వహించడానికి ఆడిట్ ప్రశ్నాపత్ర సర్వే[287] పద్ధతిని[288] అనుసరించింది. సర్వే సమయంలో పీడీఎఫ్‌ల నుండి సంగ్రహించిన ప్రతిస్పందనలను వాస్తవాలు, గణాంకాల యొక్క ఖచ్చితత్వాన్ని నిర్ధారించడానికి భూసేకరణ, ఆర్&ఆర్ అమలు యూనిట్ల రికార్డులతో ఆడిట్ విశ్లేషించి ధ్రువీకరించింది. శాఖ సిబ్బందితో సంయుక్త తనిఖీ ద్వారా ఈ సర్వే 2022 సెప్టెంబర్, నవంబర్ మధ్య జరిగింది.

## 7.2 లబ్ధిదారుల సర్వే పరిశీలనలు

ఎంపిక చేయబడిన ఆర్&ఆర్ కాలనీలు, ఆవాస ప్రాంతాలలో నమూనా పీడీఎఫ్‌లకు చట్టం, 2013లో మొదటి షెడ్యూల్ క్రింద భూమి అవార్డు పరిహారం, రెండవ షెడ్యూల్ క్రింద ఆర్&ఆర్ ప్రయోజనాలను ఇచ్చారా లేదా అని అంచనా వేయడానికి లబ్ధిదారుల సర్వే నిర్వహించబడింది.

### 7.2.1 భూమి అవార్డు పరిహారం

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క మొదటి షెడ్యూల్‌తో (సెక్షన్ 26 నుండి సెక్షన్ 30 వరకు కలిపి) నిర్దేశించిన నిబంధనల ప్రకారం భూమి అవార్డు పరిహారాన్ని లెక్కించాలి. భూమి లేదా భవనంతో జతచేయబడిన భూమి/ఇతర స్థిరాస్తి/ ఆస్తులను స్వాధీనం చేసుకున్న అన్ని పార్టీలకు పరిహారం చెల్లించబడుతుంది. భూ యజమానులకు చెల్లించాల్సిన పరిహారంలో భూమి మార్కెట్ విలువ, 100 శాతం సొలాటియం, 12 శాతం అదనపు మార్కెట్ విలువ మొదలైనవి ఉన్నాయి.

ఎంపిక చేసిన కాలనీలు/ఆవాస ప్రాంతాలలో లబ్ధిదారుల సర్వేలో ఈ క్రింది విషయాలు వెల్లడయ్యాయి:

➢ 418 మంది నమూనా లబ్ధిదారులలో (ఆర్&ఆర్ కాలనీలలో), 44 మంది లబ్ధిదారులు భూమి అవార్డు పరిహార మొత్తాన్ని పూర్తిగా అందుకోలేదని పేర్కొన్నారు. ఇంకా, 418 మంది లబ్ధిదారులలో 69 మంది పరిహార మొత్తాన్ని నిర్ణయించడం పట్ల సంతృప్తి చెందలేదు.

---

285 చల్లవారిగూడెం, కివ్వాక, కృష్ణునిపాలెం, ముసళ్లకుంట, పెదభీమపల్లి-2, పూచికపాడు, రెడ్డి గణపవరం-4, రౌతుగూడెం, సరిపల్లి, సరుగుడు (దొరమామిడి), వంకవారిగూడెం, యర్రవరం (జీలుగుమిల్లి)

286 చిగురుమామిడి, జగన్నాధపురం, కొయిడా, కన్నాయిగుట్ట, నార్లవరం కాలనీ, వేలేరుపాడు

287 జనాభా యొక్క లక్షణాలు, వైఖరులు లేదా చర్యల గురించి గణాంక సమాచారాన్ని నిర్మాణాత్మక ప్రశ్నల సమితి ద్వారా సేకరించే సాంకేతికత.

288 వన్ ఐఏఏడీ వన్ సిస్టమ్‌లో అందించిన టూల్ కిట్‌ను ఉపయోగించడం ద్వారా

➢ ఇంకా తరలించని 313 మంది నమూనా లబ్ధిదారులలో (ఆవాస ప్రాంతాలలో), 264 మంది లబ్ధిదారులు భూమి పరిహారం మొత్తాన్ని పూర్తిగా అందుకోలేదని, పరిహారం నిర్ణయంతో వారు సంతృప్తి చెందలేదని పేర్కొన్నారు.




వాస్తవాలను నిర్ధారించడానికి, ఆడిట్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ), భూసేకరణ కార్యాలయాల రికార్డుల పరిశీలించింది, ఆ పరిశీలనలో 44 మంది లబ్ధిదారులలో 28 మందికి, 313 మంది లబ్ధిదారులలో 264 మందికి పరిహారం మొత్తాన్ని పూర్తిగా అందలేదని వెల్లడైంది. ఈ విధంగా, 731 మంది లబ్ధిదారులలో 292 (40 శాతం) మందికి పూర్తి భూసేకరణ పరిహార మొత్తం అందలేదు.

హక్కు వివరాలను సమర్పించకపోవడం, కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండటం, కుటుంబ వివాదాల కారణంగా, భూసేకరణ పరిహార మొత్తాన్ని విడుదల చేయలేదని, వ్యాజ్యాలు పరిష్కారమయ్యే వరకు, భూసేకరణ మొత్తాన్ని పూర్తిగా విడుదల చేయరని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు).

### 7.2.2 పునరావాసం & పునరుపాధి కల్పన నగదు పరిహారం

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క సెక్షన్ 31, రెండవ షెడ్యూల్ ప్రకారం, జిల్లా కలెక్టర్ రెండవ షెడ్యూల్‌లో అందించిన హక్కుల పరంగా ప్రతి బాధిత కుటుంబానికి ఆర్&ఆర్ అవార్డులను జారీ చేయాలి. ఆర్&ఆర్ నగదు పరిహారం యొక్క భాగాలు ***పట్టిక 7.4*** లో వివరించబడ్డాయి.

**పట్టిక 7.4: ఆర్&ఆర్ నగదు పరిహారం వివరాలు**

| క్రమ సంఖ్య | భాగం | మొత్తం (₹ లో) |
|---|---|---|
| 1. | ప్రతి కుటుంబానికి ఉపాధి/ఎంచుకున్న వార్షిక చెల్లింపు | 5,00,000 |
| 2. | స్థానభ్రంశం చెందిన కుటుంబాలకు నెలకు ₹3,000 చొప్పున 12 నెలల కాలానికి జీవనాధార గ్రాంట్ | 36,000 |
| 3. | రవాణా ఖర్చు | 50,000 |
| 4. | ఒకేసారి పునరావాస భత్యం | 50,000 |
| 5. | ఎస్‌టీ, ఎస్‌సీ లకు అదనపు జీవనాధార గ్రాంట్ | 50,000 |
| 6. | పశువుల కొట్టం/చిన్న దుకాణం/కిరాణా దుకాణం/పాన్ దుకాణం కోసం ఒకేసారి ఆర్థిక సహాయం | 25,000 |
| 7. | కళాకారులు, చిన్న వ్యాపారులు లేదా స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులకు ఒకేసారి గ్రాంట్ | 25,000 |

418 మంది లబ్ధిదారులలో (ఎంపిక చేయబడిన ఆర్&ఆర్ కాలనీలు) 16 మందికి ఆర్&ఆర్ నగదు పరిహారం పూర్తి మొత్తంలో అందుకోలేదని లబ్ధిదారుల సర్వేలో వెల్లడైంది. ఇంకా, తరలించవలసిన 313 మంది లబ్ధిదారులలో 164 మంది (ఎంపిక చేయబడిన ఆవాస ప్రాంతాలలో) ఆర్&ఆర్ నగదు పరిహార మొత్తాన్ని అందుకోలేదని పేర్కొన్నారు.

ఎంపిక చేసిన ఆర్&ఆర్ కాలనీలలో 16 మంది లబ్ధిదారులలో 15 మంది, ఎంపిక చేసిన ఆవాస ప్రాంతాలలో 164 మంది లబ్ధిదారులకు నగదు పరిహారం అందలేదని ఆర్&ఆర్ కార్యాలయాల రికార్డులు కూడా నిర్ధారించాయి. ఆర్&ఆర్ నగదు పరిహారంలోని ప్రతి అంశం యొక్క మరింత విశ్లేషణ ***పట్టిక 7.5*** లో వివరించబడింది.

**పట్టిక 7.5: ఆర్&ఆర్ అంశాల నగదు పరిహారం వివరాలు**

| క్రమ సంఖ్య | ఆర్&ఆర్ నగదు పరిహారం | ఎంచుకున్న ఆర్&ఆర్ కాలనీలు | ఎంచుకున్న ఆవాస ప్రాంతాలు | ఆడిట్ పరిశీలన |
|---|---|---|---|---|
| అ | పశువుల కొట్టం/చిన్న దుకాణం/కిరాణా | 418 మంది లబ్ధిదారులలో, 109 మందికి పశువుల | 313 మంది లబ్ధిదారులలో, 87 మందికి పశువుల కొట్టం/ | ఎస్‌డీసీ రికార్డుల ప్రకారం, ఆర్&ఆర్ కాలనీలలోని ఈ 85 |

| | | | | |
|---|---|---|---|---|
| | దుకాణం/పాన్ షాప్ కోసం ప్రతి పీడీఎఫ్ కి ₹ 25,000 చొప్పున ఏకమొత్తంలో ఆర్థిక సహాయం. | కొట్టం/చిన్న దుకాణం ఉంది. వీరిలో, 85 మంది లబ్ధిదారులు ₹ 25,000 అందలేదని పేర్కొన్నారు. | చిన్న దుకాణం ఉంది. వీరిలో 72 మంది లబ్ధిదారులు ₹25,000 అందలేదని తెలిపారు. | మంది లబ్ధిదారులలో 34 మంది, ఆవాసాల లోని ఈ 72 మంది లబ్ధిదారులలో 36 మంది ఏకమొత్తంలో ఆర్థిక సహాయం పొందలేదు, ఇతరులు అనర్హులు. |
| ఆ | చేతివృత్తులవారు, చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులకు ₹ 25,000 చొప్పున ఒకేసారి గ్రాంట్. | 418 మంది లబ్ధిదారులలో, ఏడుగురు చేతివృత్తులవారు/ చిరు వ్యాపారి/స్వయం ఉపాధి పొందుతున్న వారు, వారికి గ్రాంట్ అందలేదు. | 313 మంది లబ్ధిదారులలో, 27 మంది చేతివృత్తులవారు, చిరు వ్యాపారులు లేదా స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు, వారికి గ్రాంట్ అందలేదు. | రికార్డుల ప్రకారం, నలుగురికి (ఏడుగురిలో ఒకరు, 27 మంది లబ్ధిదారులలో ముగ్గురు), స్వయం ఉపాధి పొందుతున్నందున లబ్ధిదారులకు ఏకమొత్తంలో గ్రాంట్ అందలేదు, మిగిలిన 30 మంది అనర్హులు/ఇప్పటికే చెల్లించబడ్డారు. |

అందువల్ల, అర్హత ఉన్న లబ్ధిదారులందరికీ ఆర్&ఆర్ నగదు పరిహారం మంజూరు చేసే విధంగా శాఖ చర్యలు తీసుకోలేదు.

సంబంధిత ఆవాస ప్రాంతం యొక్క సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించబడుతోందని, పశువుల కొట్టం/చిన్న దుకాణం కలిగి ఉన్నవారు, చేతివృత్తుల వారు/చిన్న వ్యాపారులు మొదలైన బాధిత కుటుంబాల వివరాలను గ్రామసభ నిర్వహించి ప్రచురించామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 ఆగస్టు). ఆర్&ఆర్ పథకం ప్రకారం మంజూరు చేయవలసిన ఆర్&ఆర్ హక్కులను సక్రమంగా చెబుతూ గ్రామసభలో అభ్యంతరాలు స్వీకరించారు. అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత, ఆర్&ఆర్ పథకాలను తయారు చేసి, ఆమోదించబడిన అవార్డులను జారీచేసి, పీడీఎఫ్‌లకు ఆర్&ఆర్ నగదు హక్కులను చెల్లిస్తున్నారని కూడా పేర్కొనబడింది.

సమాధానం, అర్హత కలిగిన లబ్ధిదారులకు ఆర్&ఆర్ నగదు పరిహారం మంజూరు చేయడంలో అనుసరిస్తున్న విధానాన్ని వివరిస్తుంది. ఆడిట్, శాఖ దృష్టికి తీసుకెళ్ళిన విధంగా లబ్ధిదారులకు పరిహారం మంజూరు చేయకపోవడానికి గల కారణాలను ప్రస్తావించలేదు.

### 7.2.3 గృహ యూనిట్ల ఏర్పాటు, నిర్మాణ నాణ్యత

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 31, 2వ షెడ్యూల్ ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు కోల్పోతే, నిర్మించిన ఇల్లు అందించబడుతుంది. నివాస స్థలం లేని, ప్రభావిత ప్రాంతం యొక్క నోటిఫికేషన్ తేదీకి ముందు మూడు సంవత్సరాల కంటే తక్కువ కాకుండా ఆ ప్రాంతంలో నిరంతరం నివసించి ఆ ప్రాంతం నుండి అసంకల్పితంగా స్థానభ్రంశం చెందిన ప్రతి బాధిత కుటుంబానికి కూడా ప్రయోజనాలు విస్తరించబడతాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ఏదైనా ప్రభావిత కుటుంబం ఇష్టపడితే, నిర్మించిన ఇంటికి బదులుగా ఇంటి విలువకు సమానమైన ధరను పొందవచ్చు. ఈ చట్టంలోని నిబంధనల ప్రకారం సేకరణ ద్వారా ప్రభావితమైన ఏ కుటుంబానికీ ఒకటి కంటే ఎక్కువ ఇళ్ళు ఇవ్వకూడదు.

ఎంపిక చేసిన ఆర్&ఆర్ కాలనీలలో 418 మంది లబ్ధిదారులలో ఐదుగురు, ఎంపిక చేసిన ఆవాస ప్రాంతాలలో




చిత్రం 7.1: లబ్ధిదారులకు కేటాయించిన వాటిలో ఫ్లోరింగ్ సమస్యలు ఉన్న ఇళ్ళు




చిత్రం 7.2: పీడీఎఫ్‌లకు కేటాయించిన గృహ యూనిట్లలో సీపేజీలు

(ఇంకా మార్చబడలేదు) 313 మంది లబ్ధిదారులలో 55 మంది తమకు గృహ యూనిట్లు కేటాయించలేదని పేర్కొన్నారు.

ఆర్&ఆర్ కార్యాలయాల రికార్డులను పరిశీలించగా, ఐదుగురు లబ్ధిదారులలో నలుగురికి గృహ యూనిట్/ ప్లాట్ అందలేదని, మిగిలిన ఒక లబ్ధిదారునికి గృహ యూనిట్/ప్లాట్ కేటాయించబడిందని తేలింది. ఆవాస ప్రాంతాలలో మొత్తం 55 మంది లబ్ధిదారులకు గృహ యూనిట్/ప్లాట్ కేటాయించబడింది.

ఇంకా, ఎంపిక చేసిన ఆర్&ఆర్ కాలనీలలో, 418 నమూనా లబ్ధిదారులలో 129 మంది ఇంటి లోపలి నాణ్యత బాగా లేదని, ఎందుకంటే శాఖ నిర్మించిన గృహాలలో గోడ పగుళ్లు, సీపేజ్, ఫ్లోరింగ్ సమస్యలు మొదలైనవి ఉన్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి భౌతిక ధృవీకరణ కూడా దీనిని నిర్ధారించింది.




చిత్రం 7.3: పీడీఎఫ్‌కు కేటాయించిన హౌసింగ్ యూనిట్లలో కిటికీ సరిగా బిగించనివి




చిత్రం 7.4: పీడీఎఫ్‌కు కేటాయించిన గృహ యూనిట్ల గోడలలో పగుళ్లు

ప్రభుత్వం, ఫ్లోరింగ్, సీపేజ్, తలుపులు & కిటికీలు, గోడ పగుళ్ల లోపాలను సరిదిద్దినట్లు సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు).

129 మంది లబ్ధిదారుల ఇళ్లలో జరిగిన లోపాల సవరణ వివరాలను ప్రభుత్వం అందించలేదు

### 7.2.4 కేటాయించిన భూమి లేదా ఇంటికి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుము

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క సెక్షన్ 31, రెండవ షెడ్యూల్ ప్రకారం, ప్రభావిత కుటుంబాలకు కేటాయించిన భూమి లేదా ఇంటి రిజిస్ట్రేషన్ కోసం చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ, ఇతర రుసుములను ఆవశ్యక సంస్థ భరిస్తుంది, కేటాయించిన ఇంటికి భూమి అన్ని భారాల నుండి ఉపశమనం పొందుతుంది. కేటాయించిన భూమి లేదా ఇల్లు ప్రభావిత కుటుంబం యొక్క భార్య మరియు భర్త ఉమ్మడి పేర్లలో ఉండవచ్చు.

లబ్ధిదారుల సర్వే సమయంలో ఎంపిక చేయబడిన ఆర్&ఆర్ కాలనీలలో 418 మంది లబ్ధిదారులలో 34 మంది, ఎంపిక చేయబడిన ఆవాస ప్రాంతాలలో 313 మంది లబ్ధిదారులలో ఒకరు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుమును ప్రభుత్వం భరించిందని పేర్కొన్నారు.

ఆర్&ఆర్ కార్యాలయాల రికార్డుల పరిశీలనలో ఏ ఇళ్ళు పీడీఎఫ్ పేర్లతో నమోదు కాలేదని తేలింది.
పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు క్రింద బాధిత కుటుంబాలకు పీడీఎఫ్ పేరున ఇంటి స్థల రిజిస్ట్రేషన్, భూమికి–భూమి రిజిస్ట్రేషన్‌కు స్టాంప్ డ్యూటీ, ఇతర రుసుములు మినహాయించబడ్డాయి. ఇంకా, పిడిఎఫ్‌లకు పట్టాలు జారీ చేయడానికి నమూనా పట్టా ఫార్మాట్ కూడా ఖరారు చేయబడింది, పీడీఎఫ్‌ల పేర్లతో ఇళ్ళు/ఇంటి స్థల నమోదు ప్రక్రియ పురోగతిలో ఉందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు).

ఆ విధంగా, భూమి యాజమాన్యాన్ని లబ్ధిదారుల పేరు మీద బదిలీ చేయలేదు, తద్వారా వారి ఆస్తి హక్కులను కోల్పోయారు.

### 7.2.5 'భూమికి-భూమి' కేటాయింపు, నీటిపారుదల సౌకర్యాలు

ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 31, రెండవ షెడ్యూల్ ప్రకారం, నీటిపారుదల ప్రాజెక్టు విషయంలో, సేకరించిన వ్యవసాయ భూమికి చెల్లించాల్సిన పరిహారం స్థానంలో, ప్రతి బాధిత కుటుంబానికి, భూమిని సేకరించిన ప్రాజెక్టు యొక్క ఆయకట్టులో కనీసం ఒక ఎకరం భూమిని కేటాయించాలి.

ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013లోని మూడవ షెడ్యూల్ ప్రకారం, నీటిపారుదల ప్రాజెక్టు నుండి కాకపోయినా, పునరావాసం పొందిన కుటుంబాలకు కేటాయించిన వ్యవసాయ భూమికి ప్రాథమిక నీటిపారుదల సౌకర్యాలను అందించడానికి ప్రయత్నాలు చేయాలి, ఆపై సహకార సంస్థను అభివృద్ధి చేయడం ద్వారా లేదా ఏదైనా ప్రభుత్వ పథకం లేదా ప్రత్యేక సహాయం క్రింద అయినా సమకూర్చాలి.




ఎంపిక చేసిన ఆర్&ఆర్ కాలనీలలో, 418 మంది లబ్ధిదారులలో 51 మందికి 'భూమికి-భూమి' కేటాయించబడిందని, 151 మంది లబ్ధిదారులకు 'భూమికి-భూమి' కేటాయింపబడలేదని లబ్ధిదారుల సర్వేలో వెల్లడైంది. అయితే, ఈ 51 మంది లబ్ధిదారులలో 46 మంది 'భూమికి-భూమి' క్రింద నీటిపారుదల సౌకర్యం లేకుండానే కేటాయింపు జరిగిందని పేర్కొన్నారు. మిగిలిన వారు 'భూమికి-భూమి' పథకం క్రింద అర్హులు కారు.

ప్రాజెక్టు క్రింద భూమి ప్రభావితమైన/ కోల్పోయిన ఎస్‌టీ, ఎస్‌సీ పీడీఎఫ్‌లకు మాత్రమే భూమికి-భూమి అందించబడుతుంది. అందువల్ల, ఆర్&ఆర్ కాలనీలలోని అనర్హులైన పీడీఎఫ్‌లకు 'భూమికి-భూమి' అందించలేదు, బదులుగా పరిహారం అందించబడిందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). ఇంకా, ఆర్&ఆర్ కాలనీలలోని ప్రాథమిక నీటిపారుదల సౌకర్యాలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సూక్ష్మ నీటిపారుదల పథకాలు కలిపి అనగా, ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు, ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన మొదలైన వాటితో సంబంధిత సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థల (ఐటీడీఏ) ద్వారా ఏర్పాటు చేస్తారు.

అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రాథమిక నీటిపారుదల సౌకర్యాలతో 'భూమికి-భూమి' పథకం క్రింద భూమిని అందించేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అయినందువల్ల సమాధానం ఆమోదయోగ్యం కాదు.

### 7.2.6 ఫిర్యాదుల పరిష్కారం

ఒక సంస్థ యొక్క ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం ఆ సంస్థ సామర్థ్యం, ప్రభావాన్ని కొలవడానికి ఒక కొలమానం వంటిది, ఎందుకంటే ఇది పరిపాలన పనితీరుపై ముఖ్యమైన అభిప్రాయాన్ని అందిస్తుంది.

ఎంపిక చేయబడిన ఆర్&ఆర్ కాలనీలలో, 418 మంది లబ్ధిదారులలో ఐదుగురు, ఎంపిక చేయబడిన ఆవాస ప్రాంతాలలో 313 మంది లబ్ధిదారులలో 12 మంది సమర్పించిన ఫిర్యాదులు మండల రెవెన్యూ అధికారి (ఎమ్ఆర్ఓ), రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) స్థాయిలలో పరిష్కరించబడలేదని, పెండింగ్‌లో ఉన్నాయని సర్వే సమాచారం వెల్లడించింది.

ప్రతి ఫిర్యాదు పిటిషన్‌ను మొదట మండల స్థాయి అధికారి విచారిస్తారని, ఆ తర్వాత ఆర్&ఆర్ అధికారి, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ దశలవారీగా విచారిస్తారని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). ఫిర్యాదుల పరిష్కారం కోసం డిప్యూటీ తహశీల్దార్, ఇతర సాంకేతిక అధికారుల నేతృత్వంలోని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు, ఏదైనా

అభ్యంతరాలను ఆహ్వానించడానికి గ్రామ సచివాలయం లేదా పంచాయతీ నోటీసు బోర్డులో విచారణ నివేదికలు ప్రచురించబడతాయి.

ఎమ్ఆర్ఓ, ఆర్డీఓ వద్ద పెండింగ్‌లో ఉన్న 17 మంది లబ్ధిదారుల ఫిర్యాదుల పరిష్కారం గురించి సమాధానం ఇవ్వలేదు.

### 7.2.7 షెడ్యూల్డ్ కులం, గిరిజన యువత కోసం నైపుణ్యాభివృద్ధి ప్రణాళిక

ఆంధ్రప్రదేశ్ ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ నియమాలు, 2014 లోని నియమం 24 ప్రకారం, అవసరం ఉన్న సంస్థ తరపున, షెడ్యూల్డ్ కులాలు లేదా షెడ్యూల్డ్ తెగల కుటుంబాల అసంకల్పిత తరలింపుతో కూడిన భూసేకరణకు సంబంధించిన ప్రాజెక్టు చేపట్టిన సందర్భాలలో అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలి. ఎస్‌సీ/ఎస్‌టీలకు చెందిన తరలించిన కుటుంబాల కోసం ఆర్&ఆర్ పథకం క్రింద అభివృద్ధి ప్రణాళికలో వివిధ శిక్షణా కార్యక్రమాల[289] ద్వారా బాధిత కుటుంబంలోని యువత[290] కోసం నైపుణ్యాభివృద్ధి ఉండాలి.

లబ్ధిదారుల సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి:

- ఎంపిక చేసిన ఆర్&ఆర్ కాలనీలలో, 418 నమూనా లబ్ధిదారులలో, 110 మంది 13-35 సంవత్సరాల వయస్సు గల ఎస్‌సీ/ఎస్‌టీ యువకులు ఉన్నారు, వీరిలో 107 మంది లబ్ధిదారులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించలేదు, మిగిలిన ముగ్గురు స్పందించలేదు.
- ఎంపిక చేసిన ఆవాస ప్రాంతాలలో, 313 నమూనా లబ్ధిదారులలో, 53 మంది 13-35 సంవత్సరాల వయస్సు గల ఎస్‌సీ/ఎస్‌టీ యువకులు ఉన్నారు, వీరిలో 48 మంది లబ్ధిదారులకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ అందించలేదు, మిగిలిన ఐదుగురు స్పందించలేదు.

ఆ విధంగా, ఆర్&ఆర్ కాలనీలలోని చాలామంది ఎస్‌సీ/ఎస్‌టీ యువతకు వారి స్వయం అభివృద్ధి, యాజమాన్య అవసరాలకు తగిన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి వీలు కల్పించే అవసరమైన నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించలేదు.

ప్రభుత్వం సమాధానమిస్తూ (2024 ఆగస్టు), ఆర్&ఆర్ కాలనీలలో నిర్మించిన పాఠశాలల్లో 5–18 సంవత్సరాల వయస్సు గల బాల, బాలికలకు ప్రాథమిక స్థాయి నుండి 10వ తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తున్నట్లు తెలిపింది. అంతేకాకుండా, పీడీఎఫ్‌లు/పీఏఎఫ్‌లకు జీవనోపాధి, ఇతర ప్రయోజనాలను అందించడానికి పీడీఎఫ్‌ల నైపుణ్యాన్ని అర్థం చేసుకోవడానికి గ్రామసభలు, ఆర్&ఆర్ కాలనీ కమిటీల ద్వారా విస్తృతమైన సర్వే ద్వారా పీడీఎఫ్‌లను సంప్రదించినట్లు సమాధానమిచ్చారు. జీవనోపాధిని అందించడంలో భాగంగా, పీడీఎఫ్‌ల యువతకు వారి అర్హత, ఆసక్తి ప్రకారం సంబంధిత ప్రాజెక్టు అధికారి, ఐటీడీఏల ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ, తేలికపాటి మోటార్ వాహనాల డ్రైవింగ్ శిక్షణ, కుట్టు యంత్ర శిక్షణ అందించబడతాయి.

155 మంది లబ్ధిదారులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించకపోవడానికి గల కారణాలను సమాధానంలో ప్రస్తావించలేదు. ఇంకా, నైపుణ్య అభివృద్ధిని అందించడానికి యువతను గుర్తించడంలో శాఖ అనుసరిస్తున్న విధానాన్ని సమాధానంలో ప్రస్తావించారు.

## 7.3 వసతుల సర్వే ఫలితాలు

ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క మూడవ షెడ్యూల్ ప్రకారం, కొత్త గ్రామం లేదా కాలనీలో పునరావాసం పొందిన జనాభాకు సహేతుకమైన సమాజ జీవితాన్ని అందించాలి. అపేక్షిత శాఖ ఖర్చుతో ఆర్&ఆర్ కాలనీలలో 25 మౌలిక సదుపాయాలు, కనీస ప్రాథమిక సౌకర్యాలు (***అనుబంధం 7.2*** లో వివరించిన విధంగా) అంటే రోడ్లు, రవాణా సౌకర్యం, మురుగునీటి కాలువలు, పారిశుధ్యం మొదలైన వాటితో సహేతుకమైన

[289] ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎమ్‌కేవీవై), దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డీడీవై-జీకేవై), మొదలైనవి

[290] జాతీయ యువజన విధానం 2003 ప్రకారం, 'యువత' అంటే 13-35 సంవత్సరాల మధ్య వయస్సు గల వ్యక్తిగా నిర్వచించబడింది

నివాసయోగ్యమైన, ప్రణాళికాబద్ధమైన స్థిరనివాసాన్ని అందించాలి. వసతులను అందించడానికి, ఒప్పందం తేదీ నుండి 12 నెలల వ్యవధిలోపు ఈ వసతులను అందించడానికి గుత్తేదారు సంస్థలతో ఒప్పందాలు (2017-19లో) జరిగాయి.

వసతుల సర్వేలో భాగంగా, 12 ఆర్&ఆర్ కాలనీల ఉమ్మడి భౌతిక పరిశీలన (***అనుబంధం 7.3*** లో వివరించిన విధంగా) నిర్వహించబడింది. ప్రతి వసతి కోసం, వసతులను అందించడంలో సాధించిన విజయాన్ని అంచనా వేయడానికి ప్రశ్నలను తయారు చేశారు. నమూనా ఆర్&ఆర్ కాలనీలలో సర్వే నిర్వహించడానికి ప్రశ్నాపత్ర సర్వే పద్ధతిని ఉపయోగించారు. ఎంపిక చేయబడిన ఆర్&ఆర్ కాలనీలలో ఆడిట్ ద్వారా నిర్వహించిన మౌళిక సదుపాయాల సర్వే ఫలితాలను తదుపరి పేరాల్లో చర్చించడమైంది.

### 7.3.1 తగిన రవాణా సౌకర్యంతో రహదారులను ఏర్పాటు చేయడం

పునరావాసం కల్పించిన గ్రామాలలో రహదారులను ఏర్పాటు చేయడం, సమీపంలోని వృద్ధి కేంద్రాలు/పట్టణ ప్రాంతాల వరకు తగిన ప్రజా రవాణా సౌకర్యంతో సమీప పక్కా రహదారికి అన్ని వాతావరణాలకు అనుకూలంగా ఉండే లింక్ రహదారిని ఏర్పాటు చేయాలని ఆర్ఎఫ్‌సిటిఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క మూడవ షెడ్యూల్ నిర్దేశిస్తుంది.

సౌకర్యాల సర్వేలో ఈ క్రింది విషయాలు వెల్లడయ్యాయి:

- 12 ఆర్&ఆర్ కాలనీలలో నాలుగింటిలో[291] అంతర్గత రహదారులు వేయబడలేదు.
- నాలుగు[292] ఆర్&ఆర్ కాలనీలలో, బాహ్య రహదారికి అనుసంధానం అందించలేదు. ఎనిమిది కాలనీలలో బాహ్య రహదారి అనుసంధానాన్ని అందించినప్పటికీ, ఆరు కాలనీలలో మాత్రమే ప్రజా రవాణా సౌకర్యం కల్పించబడింది, మిగిలిన రెండు కాలనీలలో (రెడ్డి గణపవరం-4, కృష్ణునిపాలెం) ప్రజా రవాణా సౌకర్యం లేకుండా పోయింది.

  ఐదు[293] ఆర్&ఆర్ కాలనీలలో అంతర్గత రహదారి పనులు పురోగతిలో ఉన్నాయి. సరిపల్లి ఆర్&ఆర్, రెడ్డి గణపవరం-4 కాలనీలలో బాహ్య రహదారి అనుసంధానాన్ని అందించి పూర్తి చేశారు. చల్లవారిగూడెంలో, బాహ్య అనుసంధాన రహదారి త్వరలో ప్రారంభించబడుతుంది, వంకవారిగూడెంలో బాహ్య రహదారి పనులు పురోగతిలో ఉన్నాయని, రహదారి అనుసంధానం పూర్తయిన తర్వాత రవాణా సౌకర్యాలు కల్పించబడతాయని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు).




**చిత్రం 7.5: ముసళ్ళకుంట కాలనీలో అసంపూర్ణ అంతర్గత రోడ్లు**

291 యర్రవరం, వంకవారిగూడెం, పెదభీమపల్లి-2, చల్లవారిగూడెం

292 వంకవారిగూడెం, సరిపల్లి, ముసల్లకుంట, చల్లవారిగూడెం

293 యర్రవరం, ముసల్లకుంట, వంకవారిగూడెం, చల్లవారిగూడెం, పెదభీమపల్లి-2

### 7.3.2 పిల్లలకు పాఠశాల సదుపాయం

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క మూడవ షెడ్యూల్ ప్రకారం, ఉచిత, నిర్బంధ విద్యకు పిల్లల హక్కు (ఆర్‌సీఎఫ్‌సీఈ) చట్టం, 2009 నిబంధనల ప్రకారం, ఆర్&ఆర్ కాలనీలలో పాఠశాలను ఏర్పాటు చేయాలి. ఆర్‌సీఎఫ్‌సీఈ చట్టం, 2009 ప్రకారం, పాఠశాలలు, నివాస ప్రాంతాల నుండి ప్రాథమిక పాఠశాల ఒక కిలోమీటరు దూరంలో, VI నుండి VIII తరగతులు ఉన్న ప్రాథమికోన్నత/ఉన్నత పాఠశాల మూడు కిలోమీటర్ల దూరంలో సురక్షితమైన నడక దూరంలో ఉండాలి.




చిత్రం 7.6: కివ్వాక ఆర్&ఆర్ కాలనీలో పాఠశాల ఏర్పాటు చేయబడింది కానీ పనిచేయడం లేదు

సౌకర్యాల సర్వేలో వెల్లడైన విషయాలు:

- ఐదు[294] ఆర్&ఆర్ కాలనీలలో, పాఠశాలలు ఏర్పాటు చేయలేదు.
- మిగిలిన ఏడు ఆర్&ఆర్ కాలనీలలో ఏర్పాటుచేసిన పాఠశాలల్లో మూడు[295] కాలనీలలో పాఠశాలలు పనిచేయడం లేదు, మిగిలిన నాలుగు[296] కాలనీలలో పాఠశాలలు పనిచేస్తున్నాయి.

ఎర్రవరం, వంకవారిగూడెం, చల్లవారిగూడెం, సరిపల్లి ఆర్&ఆర్ కాలనీలలో పాఠశాల భవన నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని, ముసళ్ళకుంటలో భవనం పూర్తయి పనిచేస్తోందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). పెదభీమపల్లి–2లో పాఠశాల భవనం పూర్తయింది. కివ్వాక & సరుగుడులో పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయి.

పాఠశాలను ఏర్పాటు చేయకపోవడం, పనిచేయకపోవడం వల్ల, పీడీఎఫ్‌ల పిల్లలు సౌకర్యవంతంగా ఉన్న పాఠశాలలను కోల్పోయి ఆర్&ఆర్ కాలనీలకు దూరంగా ఉన్న పాఠశాలలపై ఆధారపడవలసి వస్తుంది. ఇంకా, పాఠశాలలు ఏర్పాటు చేయబడి, పనిచేయని కాలనీల నుండి నిర్ణీత దూరంలో పచేస్తున్న ఏ ప్రాథమిక/ప్రాథమికోన్నత పాఠశాలను ఆడిట్ నిర్ధారించలేకపోయింది.

### 7.3.3 పిల్లల కోసం ఆట స్థలం

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క మూడవ షెడ్యూల్, ఆర్&ఆర్ కాలనీలలో పిల్లలకు ఆట స్థలం సమకూర్చాలని నిర్దేశిస్తుంది.



చిత్రం 7.7: రౌతుగూడెంలో సమకూర్చిన ఆటస్థలం

12 ఆర్&ఆర్ కాలనీలలో, 10[297] ఆర్&ఆర్ కాలనీలలో ఆట స్థలం సమకూర్చలేదని, రెండు ఆర్&ఆర్ కాలనీలలో ఒక దానిలో (కివ్వాక) ఆట స్థలం వినియోగానికి పనికిరాదని వసతుల సర్వేలో వెల్లడైంది.

---

294 యర్రవరం (జీలుగుమిల్లి), వంకవారిగూడెం, పెదభీమపల్లి–2, చల్లవారిగూడెం, సరిపల్లి

295 కివ్వాక, ముసల్లకుంట, సరుగుడు

296 కృష్ణునిపాలెం, పూచికపాడు, రెడ్డిగణపవరం–4, రౌతుగూడెం

297 కృష్ణునిపాలెం, ముసల్లకుంట, పూచికపాడు, రెడ్డిగణపవరం–4, సరిపల్లి, సరుగుడు, చల్లవారిగూడెం, పెదభీమపల్లి–2, వంకవారిగూడెం, యర్రవరం (జీలుగుమిల్లి)

ఆట స్థలాలకు స్థలం అందుబాటులో లేకపోవడం వల్ల, ఏడు[298] ఆర్&ఆర్ కాలనీల డీపీఆర్‌లలో ఆట స్థలాన్ని చేర్చలేదని, పెదభీమపల్లి-2లో, పాఠశాల ప్రాంగణంలో ఆట స్థలం అందుబాటులో ఉందని, పూచికపాడు ఆర్&ఆర్ కాలనీలో నిర్దేశించిన స్థలంలో ఆట స్థలాన్ని అభివృద్ధి చేస్తారని, రెడ్డి గణపవరం-4 ఆర్&ఆర్ కాలనీలో పనులు పురోగతిలో ఉన్నాయని, కివ్వాక ఆర్&ఆర్ కాలనీలో, ఆట స్థలం కోసం భూమిని కేటాయించి, వీలైనంత త్వరగా వినియోగంలోకి తీసుకువస్తారని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు).

పిల్లలను శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంచడంలో ఆట స్థలాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఆట స్థలాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల పిల్లల శారీరక, మానసిక పెరుగుదలపై ప్రభావం పడుతుంది.

### 7.3.4 అంగన్‌వాడీ కేంద్రం, అనుబంధ పోషక సేవల లభ్యత

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క మూడవ షెడ్యూల్ ప్రకారం, పిల్లలకు, తల్లులకు అనుబంధ పోషక సేవలు (సీఎమ్ఎస్ఎన్ఎస్) అందించే అంగన్‌వాడీలను ఆర్&ఆర్ కాలనీలలో ఏర్పాటు చేయాలి.

ఆడిట్ ద్వారా ఆర్&ఆర్ కాలనీల వసతుల సర్వేలో ఈ క్రింది విషయాలు వెల్లడయ్యాయి:

- ఏడు[299] ఆర్&ఆర్ కాలనీలలో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయబడలేదు.
- అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసిన ఐదు ఆర్&ఆర్ కాలనీలలో ఒక దానిలో (ముసళ్ళకుంట), సీఎమ్ఎస్ఎన్ఎస్ అందుబాటులో లేదు.

వంకవారిగూడెం, యర్రవరం (జీలుగుమిల్లి), సరిపల్లి, చల్లవారిగూడెం ఆర్&ఆర్ కాలనీలలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం పురోగతిలో ఉందని, త్వరలో పూర్తవుతుందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). రెడ్డి గణపవరం-4లో అంగన్‌వాడీ కేంద్రం పనులు పూర్తయి పంచాయతీ కార్యదర్శికి అప్పగించారు. పూచికపాడు ఆర్&ఆర్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం పూర్తయి పనిచేస్తోంది. ముసళ్ళకుంటలో అంగన్‌వాడీ భవనం పూర్తయింది, అంగన్‌వాడీ కేంద్రం పనిచేయడం ప్రారంభించిన తర్వాత సీఎమ్ఎస్ఎన్ఎస్ సేవలు అందించబడతాయని ప్రభుత్వం తెలిపింది.

ఏడు కాలనీలలో నాలుగింటిలో అంగన్‌వాడీ కేంద్ర భవనాలు పూర్తి కాకపోవడం వల్ల లబ్ధిదారులు అంగన్‌వాడీ సౌకర్యాలను పొందలేకపోయారు. ఇంకా, పెదభీమపల్లి-2 వద్ద అంగన్‌వాడీ కేంద్రాల భవనం పూర్తి చేయడంపై ఎటువంటి సమాధానం లేదు.

### 7.3.5 ప్రాథమిక ఆరోగ్య, ఉప-ఆరోగ్య కేంద్రం

భారత ప్రభుత్వం నిర్దేశించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ), ఉప-ఆరోగ్య కేంద్రాలను (ఎస్‌హెచ్‌సీ) ఆర్&ఆర్ కాలనీలలో రెండు కిలోమీటర్ల దూరంలో అందించాలని, ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క మూడవ షెడ్యూల్ నిర్దేశిస్తుంది.

#### (అ) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

10 ఆర్&ఆర్[300] కాలనీలలో పీహెచ్‌సీలు ఏర్పాటు చేయలేదని, మిగిలిన రెండు ఆర్&ఆర్ కాలనీలలో (రెడ్డి గణపవరం -4, సరుగుడు) ఏర్పాటు చేసిన పీహెచ్‌సీలు పనిచేయడం లేదని వసతుల సర్వేలో తేలింది.

ఆరు ఆర్&ఆర్[301] కాలనీలలో పీహెచ్‌సీల నిర్మాణం పురోగతిలో ఉందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). కృష్ణునిపాలెం, పెదభీమపల్లి-2, పూచికపాడులలో, ఆర్&ఆర్ కాలనీల నుండి సుమారు 1.2 నుండి 2.5

---

298 సరిపల్లి, చల్లవారిగూడెం, సరుగుడు, వంకవారిగూడెం, యర్రవరం, పెదభీమపల్లి-2, కృష్ణునిపాలెం

299 పూచికపాడు, రెడ్డిగణపవరం-4, సరిపల్లి, చల్లవారిగూడెం, పెదభీమపల్లి-2, వంకవారిగూడెం, యర్రవరం (జీలుగుమిల్లి)

300 కివ్వాక, కృష్ణునిపాలెం, ముసళ్లకుంట, పూచికపాడు, రౌతుగూడెం, సరిపల్లి, చల్లవారిగూడెం, పెదభీమపల్లి-2, వంకవారిగూడెం, యర్రవరం (జీలుగుమిల్లి)

301 సారిపల్లి, చల్లవారిగూడెం, వంకవారిగూడెం, యర్రవరం, కివ్వాక, రౌతుగూడెం

కి.మీ.ల దూరంలో పీహెచ్‌సీలు ఇప్పటికే అందుబాటులో ఉన్నందున పీహెచ్‌సీలు నిర్మించలేదు. సరుగుడు, రెడ్డి గణపవరం–4 ఆర్&ఆర్ కాలనీలోని పీహెచ్‌సీలు పూర్తయి పనిచేస్తున్నాయి. ముసళ్ళకుంట ఆర్&ఆర్ కాలనీలోని ఎస్‌హెచ్‌సీ భవనం పూర్తయి త్వరలో పనిచేయనుంది.
తమ వాదన సరియైనదని ధ్రువీకరించడానికి మూడు ఆర్&ఆర్ కాలనీలకు దగ్గరగా ఉన్న పీహెచ్‌సీల వివరాలు, వాటి భౌగోళిక స్థానం, రెండు కాలనీలలో పీహెచ్‌సీల నిర్మాణం పూర్తయిన వివరాలను కూడా ప్రభుత్వం అందించలేదు.

### (ఆ) ఉప–ఆరోగ్య కేంద్రం

తొమ్మిది[302] ఆర్&ఆర్ కాలనీలలో ఎస్‌హెచ్‌సీలు నిర్మించలేదని, మూడు[303] ఆర్&ఆర్ కాలనీలలో, ఏర్పాటుచేసిన ఎస్‌హెచ్‌సీలు పనిచేయడం లేదని ఆడిట్ సర్వేలో వెల్లడైంది.

సరిపల్లి, చల్లవారిగూడెం, వంకవారిగూడెం, సరుగుడు, యర్రవరం ఆర్&ఆర్ కాలనీలలో పీహెచ్‌సీ పనులు పురోగతిలో ఉన్నందున పైన పేర్కొన్న ఆర్&ఆర్ కాలనీలలో ఎస్‌హెచ్‌సీలను ప్రతిపాదించలేదని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). సమీప గ్రామాలలో పీహెచ్‌సీ కేంద్రాలు అందుబాటులో ఉన్నందున, కృష్ణునిపాలెం, పూచికపాడు, పెదభీమపల్లి–2 ఆర్&ఆర్ కాలనీలలో ఎస్‌హెచ్‌సీలను ఏర్పాటు చేయలేదు. రౌతుగూడెం, కివ్వాక, ముసళ్ళకుంట ఆర్&ఆర్ కాలనీలలో ఎస్‌హెచ్‌సీ నిర్మాణం చేపట్టి త్వరలో ప్రారంభిస్తామన్నారు.

ప్రభుత్వం తమ వాదనను ధ్రువీకరించడానికి, ఆర్&ఆర్ కాలనీల సమీప గ్రామాలలో అందుబాటులో ఉన్న పీహెచ్‌సీలు, వాటి భౌగోళిక స్థానాల వివరాలను అందించలేదు.

## 7.3.6 సురక్షితమైన త్రాగునీటిని అందించడం

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్[304] చట్టం, ఆర్&ఆర్ కాలనీలలో ప్రతి కుటుంబానికి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సురక్షిత మంచినీటి వనరులను అందించాలని నిర్దేశిస్తుంది. ఆర్&ఆర్ కాలనీల సౌకర్యాల సర్వేలో ఈ విధంగా వెల్లడైంది:

- పెదభీమపల్లి–2 ఆర్&ఆర్ కాలనీలో మినహా అన్ని ఆర్&ఆర్ కాలనీలలో ఓవర్ హెడ్ స్టోరేజీ రిజర్వాయర్ (ఓహెచ్ఎస్ఆర్)తో పాటు వ్యక్తిగత కుళాయి కనెక్షన్‌లు అందించబడ్డాయి, ఇక్కడ మెజారిటీ కుటుంబాలకు వ్యక్తిగత కుళాయి కనెక్షన్‌లు లేకుండా ఓహెచ్ఎస్ఆర్ అందించబడింది.
- 12 ఆర్&ఆర్ కాలనీల్లో నాలుగింటిలో[305] నీటి శుద్ధి వ్యవస్థ అమలు కాలేదు.




చిత్రం 7.8: పెదభీమపల్లి–2 ఆర్&ఆర్ కాలనీలో తాగునీరు అందించలేదు




చిత్రం 7.9: కివ్వాక ఆర్&ఆర్ కాలనీలో ఓహెచ్ఎస్ఆర్

[302] కృష్ణునిపాలెం, పూచికపాడు, రెడ్డిగణపవరం–4, సరిపల్లి, సరుగుడు, చల్లవారిగూడెం, పెదభీమపల్లి–2, వంకవారిగూడెం, యర్రవరం (జీలుగుమిల్లి)

[303] కివ్వాక, ముసళ్లకుంట, రౌతుగూడెం

[304] ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం 2013 యొక్క మూడవ షెడ్యూల్, భారత ప్రభుత్వం సూచించిన నిబంధనలు

[305] పెదభీమపల్లి–2, కృష్ణునిపాలెం, ముసళ్ళకుంట, పూచికపాడు

పెదభీమపల్లి–2 ఆర్&ఆర్ కాలనీలో నీటి పైప్‌లైన్, కుళాయి కనెక్షన్‌ను అన్ని ఇళ్లకు అందించామని, నీటిని పరీక్షించి త్రాగడానికి అనుకూలంగా ఉన్నట్లు గమనించామని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). కృష్ణునిపాలెం ఆర్&ఆర్ కాలనీలో, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం భూగర్భ జలాలను అందించింది. సత్య సాయి తాగునీటి కార్యక్రమం క్రింద 4,000 లీటర్ల సామర్థ్యం గల రిజర్వాయర్‌ను మొత్తం కాలనీకి నీరు అందించేలా నిర్మించాలని ప్రణాళిక వేశారు. ఆ నీటిని పరీక్షించగా తాగడానికి అనుకూలంగా ఉన్నట్లు వెల్లడైంది.

ముసళ్ళకుంట, పూచికపాడులో నీటి శుద్ధీకరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం గురించి సమాధానం లేదు. పెదభీమపల్లి–2లో కుళాయి కనెక్షన్ ఇవ్వడాన్ని ధ్రువీకరించడానికి ఋజువులు సమర్పించలేదు.

### 7.3.7 మురుగునీటిపారుదల వ్యవస్థను ఏర్పాటు చేయడం

కివ్వాక ఆర్&ఆర్ కాలనీలో మురుగునీటిపారుదల వ్యవస్థ లేదని ఆడిట్ సర్వేలో వెల్లడైంది. ఒక ఆర్&ఆర్ కాలనీ (పూచికపాడు) లో మాత్రమే కప్పబడిన మురుగునీటి కాలువ సౌకర్యం కల్పించారు, మిగిలిన 10 నమూనా కాలనీలలో, బహిరంగ మురుగునీటిపారుదల వ్యవస్థను అందించారు. సమర్థవంతమైన మురుగునీటిపారుదల వ్యవస్థ కోసం వ్యర్థాలసేకరణ, శుద్ధి చేయడం, పారవేయడం అవసరం. అన్ని బహిరంగ మురుగునీటి కాలువలను సరిగ్గా మూసి ఉంచాలి, మురుగునీటిపారుదల వ్యవస్థ యొక్క వాలులు నీటి ప్రవాహం కొనసాగడానికి అనుకూలంగా ఉండాలి. అయితే, అన్ని కాలనీలలో బహిరంగ మురుగునీటిపారుదల వ్యవస్థను అనుసరించారు, కాలువలను క్రమానుగతంగా శుభ్రపరచ లేదు.







| చిత్రం 7.10: ఆర్&ఆర్ కాలనీలలో బహిరంగ మురుగునీటిపారుదల వ్యవస్థ | చిత్రం 7.11: సరైన పారిశుధ్య విధానాలు పాటించలేదు |
|---|---|

కివ్వాక ఆర్&ఆర్ కాలనీలో కాలువ పనులు చేపట్టడానికి పరిపాలనా ఆమోదం కోసం గిరిజన సంక్షేమ ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఇఎన్‌సి)కి ప్రతిపాదనలు సమర్పించామని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). సరుగుడు, రెడ్డి గణపవరం-4 ఆర్&ఆర్ కాలనీలో కవర్ స్లాబ్‌లతో మురుగునీటిపారుదల పనులు పూర్తయ్యాయి. పెదభీమపల్లి-2 ఆర్&ఆర్ కాలనీలో అన్ని వాతావరణాలను తట్టుకునేలా సీసీ కాలువలు అందించబడ్డాయి. కృష్ణునిపాలెం ఆర్&ఆర్ కాలనీలో మురుగునీటిపారుదల పనులు పూర్తయ్యాయి.

మిగిలిన కాలనీలలో కప్పబడిన మురుగునీటిపారుదలను ఏర్పాటు చేయడం గురించి ఏ సమాధానం లేదు.

### 7.3.8 వ్యక్తిగత మరుగుదొడ్లకు కుళాయి కనెక్షన్లను అందించడం

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క మూడవ షెడ్యూల్ ఆర్&ఆర్ కాలనీలలో వ్యక్తిగత మరుగుదొడ్డి పాయింట్లను అందించాలని నిర్దేశిస్తుంది. ప్రతి ఇంటికి నీటి కనెక్షన్ అందించాలని కూడా చట్టం పేర్కొంది. ప్రత్యేక కమీషనర్ (ఆర్&ఆర్) అన్ని అమలు సంస్థలకు వంటగది, మరుగుదొడ్డి, కడుక్కునే ప్రాంతం వద్ద మూడు కుళాయి పాయింట్లను అందించాలని ఆదేశించారు (2019 మార్చి).



చిత్రం 7.12: కుళాయి కనెక్షన్లు అందించబడలేదు రెడ్డి గణపవరం-4 ఆర్&ఆర్ కాలనీ

ఆర్&ఆర్ కాలనీలలోని గృహ యూనిట్లలో వ్యక్తిగత మరుగుదొడ్డి పాయింట్లు అందించినప్పటికీ, యాదృచ్ఛికంగా సందర్శించిన ఇళ్లలోని మరుగుదొడ్లకు కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయలేదని వసతుల సర్వే వెల్లడించింది.

పీడీఎఫ్‌కి యూనిట్ ఖర్చులో పరిమితుల కారణంగా, అన్ని కాలనీలలో ఇళ్ల నిర్మాణంలో ఏకరూపతను కొనసాగించడానికి, ప్రతి ఇంటికి పాత్రలు శుభ్రం చేయడానికి, బట్టలు ఉతకడానికి ఒక ప్లాట్‌ఫారమ్‌తో ఒక ట్యాప్ కనెక్షన్ అందించబడుతోంది. మిగిలిన రెండు ట్యాప్ కనెక్షన్‌ల కోసం, అసలు ఒప్పందాలలో అవి చేర్చబడనందున, విడిగా అనుమతి తీసుకోవాలి. వంటగది & స్నానాల గదిలో రెండు కుళాయి కనెక్షన్‌లను చేర్చడానికి చర్య తీసుకోబడుతుందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు).

### 7.3.9 నీటిపారుదల సౌకర్యం కల్పించడం

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క మూడవ షెడ్యూల్ ప్రకారం, పునరావాసం పొందిన కుటుంబాలకు కేటాయించిన వ్యవసాయ భూమికి నీటిపారుదల ప్రాజెక్టు నుండి కాకపోయినా, సహకార సంస్థను అభివృద్ధి చేయడం ద్వారా లేదా ఏదైనా ప్రభుత్వ పథకం లేదా ప్రత్యేక సహాయం క్రింద ప్రాథమిక నీటిపారుదల సౌకర్యాలను అందించడానికి ప్రయత్నాలు జరగాలి.

ఒక (రౌతుగూడెం) ఆర్&ఆర్ కాలనీకి మాత్రమే సరైన నీటిపారుదల సౌకర్యం ఉందని, అన్ని ఇతర కాలనీలకు ఎలాంటి నీటిపారుదల సౌకర్యం కల్పించలేదని వసతుల సర్వేలో వెల్లడైంది.

ఆర్&ఆర్ కాలనీలలో 'భూమికి-భూమి' పొందిన పీడీఎఫ్‌లకు సంబంధించిన ప్రాథమిక నీటిపారుదల సౌకర్యాలను సంబంధిత సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థల (ఐటీడీఏ) ద్వారా ఏర్పాటు చేస్తామని, ఇది ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్టు, ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన వంటి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాలతో కూడి ఉంటుందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు).

నీటిపారుదల సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల లబ్ధిదారుల జీవనోపాధి, సామాజిక భద్రతపై ప్రతికూల ప్రభావం చూపుతుంది, అంతేకాకుండా 'భూమికి-భూమి' నిబంధన యొక్క ఉద్దేశ్యాన్ని కూడా దెబ్బతీస్తుంది.

### 7.3.10 ఆర్&ఆర్ కాలనీలలో మేత కోసం భూమిని అందించడం

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క మూడవ షెడ్యూల్, రాష్ట్రంలో ఆమోదయోగ్యమైన నిష్పత్తి ప్రకారం, మేత కోసం సరైన భూమిని ఆర్&ఆర్ కాలనీలలో అందించాలని నిర్దేశిస్తుంది. ఇంకా, ఆర్&ఆర్ పథకం క్రింద అభివృద్ధి ప్రణాళిక ప్రకారం, భూసేకరణ కారణంగా తరలించబడిన ఎస్‌సీ/ఎస్‌టీ కుటుంబాలకు, ఆంధ్రప్రదేశ్ ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్, నియమాలు, 2014 యొక్క ఫారం VIII ప్రకారం, వ్యవసాయ, ఉద్యానవన, పశువుల మేత కోసం కుటుంబానికి ఒక ఎకరం వరకు భూమిని అందించాలి.

ఏ ఆర్&ఆర్ కాలనీలోనూ పశువుల మేత కోసం భూమి అందించబడలేదని వసతుల సర్వేలో వెల్లడైంది.

ఆర్&ఆర్ కాలనీలలో, చుట్టుపక్కల అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములలో మేత కోసం సామూహిక స్థలాలను గుర్తిస్తామని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు).

మేత కోసం భూమి లేకపోవడం వల్ల పశువులకు మేత అందుబాటులో ఉండదు, ఇది పీడీఎఫ్‌ల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

## 7.3.11 పశువులకు తాగునీటి సదుపాయం

కేవలం రెండు (ముసళ్ళకుంట, రౌతుగూడెం) ఆర్&ఆర్ కాలనీలలో మాత్రమే పశువుల కోసం తొట్టెలు, చిన్న నీటి ట్యాంకుల ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించబడిందని వసతుల సర్వే వెల్లడించింది. మిగిలిన 10 ఆర్&ఆర్ కాలనీలలో[306] పశువులకు తాగునీటి సౌకర్యాలు కల్పించలేదు.







| చిత్రం 7.13: ముసళ్ళకుంట ఆర్&ఆర్ కాలనీ | చిత్రం 7.14: రౌతుగూడెం ఆర్&ఆర్ కాలనీ |
|---|---|

ఆరు[307] ఆర్&ఆర్ కాలనీలలో పశువుల కోసం తొట్టెల పనులు త్వరలో పూర్తవుతాయని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). పెదభీమపల్లి-2, రెడ్డి గణపవరం-4 ఆర్&ఆర్ కాలనీలలో పశువులకు తాగునీటి సౌకర్యం కల్పించబడింది. కృష్ణునిపాలెం, పూచికపాడు ఆర్&ఆర్ కాలనీలలో పశువుల కోసం తొట్టెల ఏర్పాటు అవసరం లేదు, ఎందుకంటే ఈ లేఅవుట్ లో పశువులు లేవు మరియు సహజ చెరువు ఉంది.

## 7.3.12 పశువైద్య సేవా కేంద్ర లభ్యత

ఎనిమిది[308] ఆర్&ఆర్ కాలనీలలో పశువైద్య సేవా కేంద్రాలు (వీఎస్‌సీలు) సమకూర్చబడలేదని, నాలుగు[309] ఆర్&ఆర్ కాలనీలలో, సమకూర్చిన వీఎస్‌సీలు పనిచేయడం లేదని వసతుల సర్వేలో వెల్లడైంది.

కివ్వాక, కృష్ణునిపాలెం, సరుగుడు & రెడ్డి గణపవరం-4 ఆర్&ఆర్ కాలనీలలో, వీఎస్‌సీల నిర్మాణం పూర్తయిందని, త్వరలో అప్పగించబడుతుందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). రౌతుగూడెం ఆర్&ఆర్ కాలనీకి సంబంధించి, రౌతుగూడెం గ్రామానికి రెండు కి.మీ.ల దూరంలో పశువైద్యశాల అందుబాటులో ఉందని, అందువల్ల వీఎస్‌సీ నిర్మాణం అవసరం లేదని సమాధానం ఇచ్చారు.

మిగిలిన కాలనీలలో వీఎస్‌సీలు ఏర్పాటు చేయకపోవడం గురించి సమాధానం ఇవ్వలేదు. రౌతుగూడెం కాలనీకి రెండు కిలోమీటర్ల దూరంలో వీఎస్‌సీ ఉనికికి సంబంధించిన ఋజువులు అందించలేదు.

## 7.3.13 అటవీ హక్కులు

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013లోని సెక్షన్ 42 ప్రకారం, ప్రభావిత ప్రాంతాల్లోని షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ కులాలకు అందుబాటులో ఉన్న అన్ని ప్రయోజనాలు, చట్టబద్ధమైన రక్షణలు పునరావాస ప్రాంతంలో కొనసాగుతాయి. షెడ్యూల్డ్ తెగలు, ఇతర సాంప్రదాయ అటవీ నివాసుల (అటవీ హక్కుల గుర్తింపు చట్టం, 2006)

---

306 కివ్వాక, కృష్ణునిపాలెం, పూచికపాడు, రెడ్డిగణపవరం-4, సరిపల్లి, సరుగుడు, చల్లవారిగూడెం, పెదభీమపల్లి-2, వంకవారిగూడెం, యర్రవరం (జీలుగుమిల్లి)

307 కివ్వాక, సరిపల్లి, సరుగుడు, చల్లవారిగూడెం, వంకవారిగూడెం, యర్రవరం

308 ముసళ్లకుంట, పూచికపాడు, రౌతుగూడెం, సరిపల్లి, చల్లవారిగూడెం, పెదభీమపల్లి-2, వంకవారిగూడెం, యర్రవరం (జీలుగుమిల్లి)

309 కివ్వాక, కృష్ణునిపాలెం, రెడ్డి గణపవరం-4, సరుగుడు

నిబంధనల ప్రకారం స్థిరీకరించిన సమాజిక హక్కులను, అటువంటి సమాజిక హక్కులలో, భూమిని స్వాధీనం చేసుకోవడం వల్ల తరలించబడిన సంబంధిత వ్యక్తికి[310] అతని వాటాకు అనుగుణంగా పరిమాణీకరించి చెల్లించాలి.

ఇంకా, ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క మూడవ షెడ్యూల్ (మౌళిక సదుపాయాలు) ప్రకారం, అటవీ నివాసి కుటుంబాలకు, సాధ్యమైన చోట, కలప లేని అటవీ ఉత్పత్తులు, సామాజిక ఆస్తి వనరులపై వారి అటవీ హక్కులను అందించాలి, కొత్త స్థిరనివాస ప్రదేశానికి దగ్గరగా అందుబాటులో ఉంటే, అలాంటి కుటుంబం ఏదైనా అటువంటి అడవి లేదా సామాజిక ఆస్తిని తరలించే ప్రదేశానికి దగ్గరగా ఉన్న ప్రాంతంలో వారి ప్రాప్యత లేదా ప్రవేశాన్ని కొనసాగించగలిగితే, వారు పైన పేర్కొన్న జీవనోపాధి వనరులపై వారి మునుపటి హక్కులను అనుభవించడం కొనసాగించాలి.

12 ఆర్&ఆర్ కాలనీలలో 10 కాలనీలలో 1,683 ఎస్టీ జనాభా ఉన్నప్పటికీ, ఈ కాలనీలలో ఏ కాలనీలోనూ అటవీ హక్కులను పొందేందుకు వీలుగా సమీపంలోని అటవీ భూమి లేదని వసతుల సర్వేలో వెల్లడైంది. ఇంకా, ప్రభావిత ప్రాంతాలలో అటవీ హక్కులను పరిమాణీకరించి సంబంధిత వారికి చెల్లించారా లేదా అనేది ఆడిట్‌కు సమర్పించిన రికార్డుల నుండి స్పష్టం కాలేదు.

రెవెన్యూ & అటవీ శాఖల సమన్వయంతో అర్హత కలిగిన నిర్వాసిత కుటుంబాలకు అటవీ హక్కులను అందించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (ఆగస్టు 2024).

అటవీ నివాస కుటుంబాలకు అటవీ హక్కులు కల్పించకపోవడం ఆ కుటుంబాల జీవనోపాధిని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

### 7.3.14 సాంప్రదాయ గిరిజన సంస్థలకు కేటాయించబడిన ప్రత్యేక భూమి

ఎంపిక చేయబడిన 12 ఆర్&ఆర్ కాలనీలలో 10 లో షెడ్యూల్డ్ తెగలు నివసిస్తున్నారని సౌకర్యాల సర్వేలో వెల్లడైంది, కానీ సాంప్రదాయ గిరిజన సంస్థలకు కేటాయించాల్సిన ప్రత్యేక భూమిని ఏ ఒక్క ఆర్&ఆర్ కాలనీలోనూ ఏర్పాటు చేయలేదు.

ఆర్&ఆర్ కాలనీలలో ప్రజా ప్రయోజనాల కోసం అందుబాటులో ఉన్న బహిరంగ ప్రదేశాలలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులతో సంప్రదించి సాంప్రదాయ గిరిజన సంస్థను స్థాపించడానికి చర్య తీసుకుంటామని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (ఆగస్టు 2024). పీడీఎఫ్‌లను ఆర్&ఆర్ కాలనీలకు తరలించిన తర్వాత, ఆర్&ఆర్ కాలనీలలో సంస్థ ఏర్పాటు కోసం గ్రామసభలు నిర్వహించబడతాయి.

### 7.3.15 శ్మశానవాటిక లేదా దహన సంస్కార స్థలాల ఏర్పాటు

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క మూడవ షెడ్యూల్ ప్రకారం, కుల-వర్గాలు, వారి పద్ధతులను బట్టి, ఆర్&ఆర్ కాలనీలలో శ్మశాన వాటికలను ఏర్పాటు చేయాలి.

ఆరు[311] ఆర్&ఆర్ కాలనీలలో, శ్మశాన వాటికలను సమకూర్చలేదని వసతుల సర్వేలో వెల్లడైంది. మిగిలిన ఆరు ఆర్&ఆర్ కాలనీలలో రెండింటిలో (ముసళ్ళకుంట, రౌతుగూడెం) సామాజిక వర్గాల వారీగా శ్మశాన వాటికలు సమకూర్చబడ్డాయి, మిగిలిన నాలుగు[312] ఆర్&ఆర్ కాలనీలలో ఉమ్మడి శ్మశాన వాటికలు సమకూర్చబడ్డాయి.

---

310 అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఏ), 2006 అటవీ నివాసి గిరిజన సమాజాలు, ఇతర సాంప్రదాయ అటవీ నివాసుల అటవీ వనరులపై హక్కులను గుర్తిస్తుంది, ఈ సమాజాలు జీవనోపాధి, నివాసం, ఇతర సామాజిక-సాంస్కృతిక అవసరాలతో సహా వివిధ అవసరాలకు ఆధారపడి ఉన్నాయి

311 కృష్ణునిపాలెం, రెడ్డి గణపవరం-4, సరిపల్లి, సరుగుడు, చల్లవారిగూడెం, వంకవారిగూడెం

312 కివ్వాక, పూచికపాడు, పెదభీమపల్లి-2, యర్రవరం (జీలుగుమిల్లి)

ఆరు[313] ఆర్&ఆర్ కాలనీలలో, శ్మశాన వాటికలను త్వరలో సమకూరుస్తామని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). ముసళ్ళకుంట & రౌతుగూడెం ఆర్&ఆర్ కాలనీలలో, అందుబాటులో ఉన్న శ్మశాన వాటికను సంబంధిత పీడీఎఫ్‌లు సామాజిక వర్గాల వారీగా విభజించాయి.

### 7.3.16 సామాజిక కేంద్రాల లభ్యత

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క మూడవ షెడ్యూల్, ఆర్&ఆర్ కాలనీలలో ప్రతి 100 కుటుంబాలకు ఒక సామాజిక కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్దేశిస్తుంది.

ఐదు[314] ఆర్&ఆర్ కాలనీలలో కమ్యూనిటీ సెంటర్లు సమకూర్చలేదని, మిగిలిన ఏడు ఆర్&ఆర్ కాలనీలలో, స్థాపించబడిన సామాజిక కేంద్రాలు పనిచేయడం లేదని వసతుల సర్వేలో వెల్లడైంది.

రౌతుగూడెం, వంకవారిగూడెం, యర్రవరం ఆర్&ఆర్ కాలనీలలో సామాజిక కేంద్రాల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). సరిపల్లి, చల్లవారిగూడెం ఆర్&ఆర్ కాలనీలలో, ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ క్రింద ఉన్న సామాజిక కేంద్ర నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుంది. సరుగుడు, పెదభీమపల్లి-2, రెడ్డి గణపవరం-4, ముసళ్ళకుంట ఆర్&ఆర్ కాలనీలలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయి పంచాయతీ కార్యదర్శికి అప్పగించబడుతుంది.

### 7.3.17 ప్రార్థనా స్థలాలు, చౌపాల్/రచ్చబండ

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క మూడవ షెడ్యూల్, ఆర్&ఆర్ కాలనీలలో ప్రతి 50 కుటుంబాలకు సమాజిక సమావేశానికి ప్రార్థనా స్థలాలు, చౌపాల్/రచ్చబండను అందించాలని నిర్దేశిస్తుంది.

ఎనిమిది[315] ఆర్&ఆర్ కాలనీలలో ప్రార్థనా స్థలం, చౌపాల్/రచ్చబండ సమకూర్చలేదని వసతుల సర్వేలో వెల్లడైంది. మిగిలిన నాలుగు కాలనీలలో (కివ్వాక, పెదభీమపల్లి-2) రెండు కాలనీలకు ప్రతి 50 కుటుంబాలకు ప్రార్థనా స్థలం, రచ్చబండను అందించారు. మిగిలిన రెండు కాలనీలలో, ప్రతి 50 కుటుంబాలకు ప్రార్థనా స్థలాలు, రచ్చబండను తగినంతగా సమకూర్చలేదు.

పూచికపాడు, రెడ్డిగణపవరం-4, రౌతుగూడెం, సరిపల్లి, సరుగుడు, చల్లవారిగూడెం, వనకవారిగూడెం, యర్రవరం (జీలుగుమిల్లి) ఆర్&ఆర్ కాలనీలలో, ఆలయం, చర్చిని ఏర్పాటు చేశామని, రచ్చబండలు/చౌపాల్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). ఇంకా, రెడ్డి గణపవరం-4లో ఆలయం, చర్చి పనులు ముగింపు దశలో ఉన్నాయి, రౌతుగూడెం ఆర్&ఆర్ కాలనీలో ఇది త్వరలో ప్రారంభించబడుతుంది.

### 7.3.18 చౌక ధరల దుకాణాల లభ్యత

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క మూడవ షెడ్యూల్ ప్రకారం, సముచిత సంఖ్యలో చౌక ధరల దుకాణాలు (ఎఫ్‌పీఎస్) ఏర్పాటు చేయాలి.

నాలుగు ఆర్&ఆర్ కాలనీలలో, ఎఫ్‌పీఎస్ పనిచేస్తున్నట్లు, ఏడు[316] ఆర్&ఆర్ కాలనీలలో ఎఫ్‌పీఎస్ ఏర్పాటు చేయలేదని వసుతుల సర్వేలో వెల్లడైంది. ఒక (రౌతుగూడెం) ఆర్&ఆర్ కాలనీలో, చౌక ధరల దుకాణం ఏర్పాటుచేయబడింది కానీ పనిచేయడం లేదు.

313 కృష్ణునిపాలెం, రెడ్డి గణపవరం-4, సరిపల్లి, సరుగుడు, చల్లవారిగూడెం, వంకవారిగూడెం

314 రౌతుగూడెం, సరిపల్లి, చల్లవారిగూడెం, వంకవారిగూడెం, యర్రవరం (జీలుగుమిల్లి)

315 పూచికపాడు, రెడ్డి గణపవరం-4, రౌతుగూడెం, సరిపల్లి, సరుగుడు, చల్లవారిగూడెం, వంకవారిగూడెం, యర్రవరం (జీలుగుమిల్లి)

316 చల్లవారిగూడెం, యర్రవరం (జీలుగుమిల్లి), వంకవారిగూడెం, పెదభీమపల్లి-2, కివ్వాక, కృష్ణునిపాలెం, ముసళ్లకుంట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో, అవసరమైన వస్తువులను ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తామని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). లబ్ధిదారుల ఇంటి వద్ద మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల ద్వారా సరఫరా చేయబడుతుందని, అందువల్ల, చౌక ధరల దుకాణం ఏర్పాటుచేయాల్సిన అవసరం తలెత్తదని తెలిపింది.

నాలుగు ఆర్&ఆర్ కాలనీలలో చౌక ధరల దుకాణాలు ఏర్పాటుచేయబడి పనిచేస్తున్నందున సమాధానం ఆమోదయోగ్యం కాదు.

### 7.3.19 పంచాయతీ కార్యాలయాల స్థాపన

ఆరు[317] ఆర్&ఆర్ కాలనీలలో, పంచాయతీ కార్యాలయాలు ఏర్పాటు చేయలేదని వసతుల సర్వేలో వెల్లడైంది. మిగిలిన ఆరు[318] ఆర్&ఆర్ కాలనీలలో, ఏర్పాటుచేయబడిన పంచాయతీ కార్యాలయాలు పనిచేయడం లేదు. రెండు ఆర్&ఆర్ కాలనీలలో, నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనాలను అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాల మొదలైన ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారు.




చిత్రం 7.15 కృష్ణునిపాలెం ఆర్&ఆర్ కాలనీలో పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రాథమిక పాఠశాలగా ఉపయోగించారు




చిత్రం 7.16: పూచికపాడు ఆర్&ఆర్ కాలనీలో పంచాయతీ కార్యాలయ భవనాన్ని అంగన్‌వాడీ కేంద్రంగా ఉపయోగించారు

సరుగుడు, రెడ్డి గణపవరం-4 ఆర్&ఆర్ కాలనీలలో, పంచాయతీ కార్యాలయ భవనం నిర్మాణం పూర్తయిందని, దానిని పంచాయతీ కార్యదర్శికి అప్పగిస్తామని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). రౌతుగూడెం, కివ్వాక ఆర్&ఆర్ కాలనీలలో, పనులు పురోగతిలో ఉన్నాయి.

ఇతర ఆర్&ఆర్ కాలనీలలో పంచాయతీ భవన నిర్మాణం, ఇప్పటికే నిర్మించిన భవనాలను ప్రణాళికాబద్ధంగా కాకుండా ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగించడానికి గల కారణాల గురించి సమాధానం ఇవ్వలేదు.

### 7.3.20 తపాలా కార్యాలయాల ఏర్పాటు

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క మూడవ షెడ్యూల్ ప్రకారం ఆర్&ఆర్ కాలనీలలో పొదుపు ఖాతాలను తెరవడానికి సౌకర్యాలతో తగిన గ్రామ స్థాయి తపాలా కార్యాలయాలు ఏర్పాటు చేయాలి.

నమూనా ఆర్&ఆర్ కాలనీల సౌకర్యాల సర్వేలో ఏడు[319] ఆర్&ఆర్ కాలనీలలో, తపాలా కార్యాలయాలు ఏర్పాటు చేయలేదని, మిగిలిన ఐదు[320] ఆర్&ఆర్ కాలనీలలో ఏర్పాటుచేసిన తపాలా కార్యాలయాలు పనిచేయడం లేదని తేలింది.

317 సరిపల్లి, చల్లవారిగూడెం, యర్రవరం (జీలుగుమిల్లి), వంకవారిగూడెం, పెదభీమపల్లి-2, ముసళ్లకుంట

318 కృష్ణునిపాలెం, పూచికపాడు, సరుగుడు, రెడ్డి గణపవరం-4, కివ్వాక, రౌతుగూడెం

319 కృష్ణునిపాలెం, పూచికపాడు, సరిపల్లి, చల్లవారిగూడెం, పెదభీమపల్లి-2, వంకవారిగూడెం, యర్రవరం (జీలుగుమిల్లి)

320 కివ్వాక, ముసళ్లకుంట, రెడ్డి గణపవరం-4, రౌతుగూడెం, సరుగుడు

రెడ్డి గణపవరం-4, రౌతుగూడెం ఆర్&ఆర్ కాలనీలలో, తపాలా కార్యాలయ భవనాన్ని నిర్మించి పంచాయతీ కార్యదర్శికి అప్పగించామని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). సరుగుడు & ముసళ్ళకుంటలలో, తపాలా కార్యాలయ భవనాలు పూర్తయ్యాయి, వినియోగదారు ఏజెన్సీకి అప్పగించబడతాయి. కివ్వాక ఆర్&ఆర్ కాలనీలో, తపాలా కార్యాలయం చివరి దశలో ఉంది. కృష్ణునిపాలెం ఆర్&ఆర్ కాలనీకి చాలా దగ్గరగా ఉన్న గోకవరం ప్రధాన గ్రామంలో తపాలా కార్యాలయం అందుబాటులో ఉన్నందున, కృష్ణునిపాలెం ఆర్&ఆర్ కాలనీలోని తపాలా కార్యాలయం భవనం అంగన్‌వాడీ కేంద్రంగా మార్చబడింది.

ఇతర ఆర్&ఆర్ కాలనీలలో తపాలా కార్యాలయం ఏర్పాటు, కార్యాచరణ గురించి సమాధానం ఇవ్వలేదు. ఇంకా, ప్రభుత్వం తన వాదనకు మద్దతుగా ఎటువంటి ఋజువులను అందించలేదు.

### 7.3.21 విత్తనాలు, ఎరువులు నిల్వచేయు సౌకర్యం

తొమ్మిది[321] ఆర్&ఆర్ కాలనీలలో, ఎరువుల దుకాణాలు ఏర్పాటు చేయలేదని, మిగిలిన మూడు కాలనీలలో రెండింటిలో (కివ్వాక, రౌతుగూడెం), ఏర్పాటుచేసిన ఎరువుల దుకాణాలు పనిచేయడం లేదని వసతుల సర్వేలో వెల్లడైంది. కృష్ణునిపాలెంలో మాత్రమే ఎరువుల దుకాణం పనిచేస్తోంది.

ముసళ్ళకుంట, పూచికపాడు, రెడ్డి గణపవరం-4, సరిపల్లి, సరుగుడు, చల్లవారిగూడెం, వంకవారిగూడెం & యర్రవరం ఆర్&ఆర్ కాలనీలలో, ఎరువుల దుకాణాలు ఆర్&ఆర్ కాలనీల నుండి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న సమీప ప్రధాన గ్రామాలలో అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). రౌతుగూడెం, కివ్వాక ఆర్&ఆర్ కాలనీలలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎమ్ఎన్ఆర్ఈజీఎస్) క్రింద నిర్మాణం చేపట్టబడింది.

వాదనలో నిజాన్ని ధృవీకరించడానికి, ఆర్&ఆర్ కాలనీల నుండి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న సమీప గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాల వివరాలను (సమీప గ్రామాల పేర్లు, వాటి భౌగోళిక స్థానాలు) ప్రభుత్వం అందించలేదు.

### 7.3.22 గృహ విద్యుత్ కనెక్షన్

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 యొక్క మూడవ షెడ్యూల్, ఆర్&ఆర్ కాలనీలలో వ్యక్తిగత గృహ సింగిల్ విద్యుత్ కనెక్షన్ (లేదా సౌరశక్తి వంటి పునరుత్పాదక శక్తి వనరుల ద్వారా కనెక్షన్), వీధి దీపాలు ఏర్పాటు చేయాలని నిర్దేశిస్తుంది.

అన్ని ఆర్&ఆర్ కాలనీలలో వ్యక్తిగత సింగిల్ విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయబడ్డాయని సౌకర్యాల సర్వేలో వెల్లడైంది. విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ఆర్&ఆర్ కాలనీలలో పునరుత్పాదక శక్తిని కూడా ఉపయోగించారు.




చిత్రం 7.17: కివ్వాక ఆర్&ఆర్ కాలనీ



చిత్రం 7.18: చల్లవారిగూడెం ఆర్&ఆర్ కాలనీ

321 ముసళ్లకుంట, పూచికపాడు, రెడ్డి గణపవరం-4, సరిపల్లి, సరుగుడు, చల్లవారిగూడెం, పెదభీమపల్లి-2, వంకవారిగూడెం, యర్రవరం (జీలుగుమిల్లి)

### 7.3.23 భద్రతా ఏర్పాట్లు

ఏ ఆర్&ఆర్ కాలనీకి కూడా కంచెలు, ప్రహరీ గోడలు, నియంత్రిత ప్రవేశ మార్గాలు మొదలైన సరైన భద్రతా ఏర్పాట్లు ఏర్పాటు చేయలేదని సౌకర్యాల సర్వేలో వెల్లడైంది.




చిత్రం 7. 19: వంకవారిగూడెం ఆర్&ఆర్ కాలనీ




చిత్రం 7.20: సరుగుడు (దొరమామిడి) ఆర్&ఆర్ కాలనీ

నిధుల పరిమితి, పీడీఎఫ్ ప్రకారం యూనిట్ ఖర్చులో పరిమితుల కారణంగా, ప్రహరీ గోడ నిర్మాణ పనులు నిలిపివేయబడ్డాయని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు). పనులు పూర్తయిన తర్వాత అన్ని ఆర్&ఆర్ కాలనీలను సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అప్పగిస్తారు.

***సిఫార్సు 7.1: రాష్ట్ర ప్రభుత్వం పీడీఎఫ్ ల శ్రేయస్సు కోసం అవసరమైన మౌలిక వసతులు సమకూర్చే ప్రక్రియను వేగవంతం చేయాలి.***

## 7.4 సర్వే పరిధిని దాటి ఇతర పరిశీలనలు

### 7.4.1 నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా లేని అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం

సమగ్ర శిశు అభివృద్ధి పథకానికి సంబంధించి భారత ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, అంగన్‌వాడీ కేంద్రం అన్ని సంబంధిత మౌలిక సదుపాయాలతో పిల్లలకు అనుకూలంగా ఉండాలి. అంగన్‌వాడీ కేంద్రం కనీస వైశాల్యం 600 చదరపు అడుగుల కంటే తక్కువ ఉండకూడదు.

అయితే, ***అనుబంధం 7.4*** లో వివరించిన విధంగా 49 అంగన్‌వాడీ కేంద్రాలలో 22 కేంద్రాలు నిర్దేశించిన కనీస విస్తీర్ణం 600 చదరపు అడుగుల కంటే తక్కువ విస్తీర్ణంలో నిర్మించబడ్డాయని ఆడిట్ గమనించింది.



చిత్రం 7.21: కృష్ణునిపాలెం ఆర్&ఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం-1

గతంలో అంగన్‌వాడీ కేంద్రం, ఆమోదించబడిన ప్రణాళిక ప్రకారం 469 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించబడింది. అయితే, భారత ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, అంగన్‌వాడీ కేంద్రం 600 చదరపు అడుగుల కంటే తక్కువ విస్తీర్ణంలో ఉండ కూడదు. ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ సూచనల

ప్రకారం (2021 మార్చి), పని అంచనాలలో ఒక అదనపు గది (223 చదరపు అడుగులు), మరుగుదొడ్డి ప్రతిపాదించబడ్డాయి, నిర్మాణాన్ని కూడా చేపట్టారు. దీనితో మరుగుదొడ్లు మినహా మొత్తం ప్లింత్ వైశాల్యం 692 చదరపు అడుగులని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు).

అంగన్‌వాడీ కేంద్రాలు నిర్దేశించిన నిబంధనల ప్రకారం నిర్మించబడ్డాయని ధ్రువీకరించడానికి అదనపు గదిని నిర్మించాలని ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ జారీ చేసిన సూచనలకు సంబంధించి ప్రభుత్వం ఋజువులను అందించలేదు.

### 7.4.2 పునరావాసం పొందిన పీడీఎఫ్‌లకు జీవనోపాధి భద్రత కల్పించడం

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్ 31(1) ప్రకారం, రెండవ షెడ్యూల్‌లో కల్పించిన హక్కుల పరంగా ప్రతి పీడీఎఫ్‌కు కలెక్టర్ ఆర్&ఆర్ అవార్డులను జారీ చేయాలి, ఈ అవార్డు, పీడీఎఫ్ సభ్యులకు అందించాల్సిన తప్పనిసరి ఉపాధి వివరాలను కలిగి ఉండాలి.

లబ్ధిదారుల సర్వే సమయంలో, చాలా మంది పీడీఎఫ్‌లు తమ (భారత ప్రభుత్వ[322] ఎమ్‌జీఎన్ఆర్ఈజీఎస్ పోర్టల్) స్థానిక నివాస స్థలంలో (ముంపు ప్రాంతంలో) ఎమ్‌జీఎన్ఆర్ఈజీఎస్ జాబ్ కార్డులు కలిగి ఉన్నారని, వీటిని కొత్తగా తరలించబడిన ఆర్&ఆర్ కాలనీల ప్రాంతానికి బదిలీ చేయలేదని పేర్కొన్నారు. ఫలితంగా, కొత్తగా మారిన గ్రామంలో పీడీఎఫ్‌లు ఎమ్‌జీఎన్ఆర్ఈజీఎస్ క్రింద పనిని పొందలేకపోయారు. ఇది పీడీఎఫ్ లకు ఇబ్బందులను కలిగిస్తోంది.



చిత్రం 7.22: జాబ్ కార్డుతో ఎమ్‌జీఎన్ఆర్‌జీఎస్ లబ్ధిదారుడు

తరలించబడిన పీడీఎఫ్‌లకు ఎమ్‌జీఎన్ఆర్ఈజీఎస్ జాబ్ కార్డులను కొత్త ఆర్&ఆర్ కాలనీలకు మార్చామని, ఈ నాటికి, 2023-24 సంవత్సరానికి ఎమ్‌జీఎన్ఆర్ఈజీఎస్ క్రింద 5,289 పీడీఎఫ్‌లకు 1,79,846 వ్యక్తి రోజుల ఉపాధిని అందించామని ప్రభుత్వం బదులిచ్చింది (2024 ఆగస్టు).

అన్ని పీడీఎఫ్‌ల జాబ్ కార్డులు కొత్త ఆర్&ఆర్ కాలనీలకు బదిలీ చేయబడ్డాయని, పీడీఎఫ్‌లకు ఉపాధి కల్పించబడ్డాయని ధృవీకరించడానికి ప్రభుత్వం ఎటువంటి ఋజువులను అందించలేదు.

### 7.4.3 సంబంధిత స్థానిక సంస్థలకు ఆర్&ఆర్ కాలనీలను అప్పగించడం

ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్ చట్టం, 2013 లోని సెక్షన్లు 32, 38(1), 105(3) ప్రకారం జనాభా పునరావాసం కోసం, మౌళిక వసతులు, ప్రాథమిక కనీస సౌకర్యాలను రిక్విజిషనింగ్ అథారిటీ ఖర్చుతో అందించాలి.

2015 కి ముందు 26 ఆర్&ఆర్ కాలనీలు పూర్తయి, మొత్తం 10,138 పీడీఎఫ్‌లు (3,922 పీడీఎఫ్‌లు పూర్తయిన 26 కాలనీలకు, 6,216 పీడీఎఫ్‌లు పురోగతిలో ఉన్న ఇతర 49 కాలనీలకు తరలించబడ్డాయి) ఇళ్లలో నివాసం ఉంటున్నప్పటికీ, ఆయా ఆర్&ఆర్ కాలనీలను సంబంధిత స్థానిక సంస్థలకు డ్రైనేజీలు, సురక్షితమైన తాగునీటి సరఫరా, వీధి దీపాలు మొదలైన ప్రజా మౌళిక సదుపాయాల నిర్వహణ కోసం అప్పగించలేదని గమనించడమైంది.

[322] https://nrega.nic.in/netnrega/library.aspx

దీని ఫలితంగా మౌళిక వసతులు వాడుకలో లేని/ఉపయోగకరంగా లేని/మరమ్మత్తు చేయలేని పరిస్థితులు ఏర్పడవచ్చు. పూర్తయిన ఆర్&ఆర్ కాలనీలను సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు అప్పగించామని, మిగిలిన ఆర్&ఆర్ కాలనీలను పురోగతిలో ఉన్న చిన్న పనులు పూర్తయిన వెంటనే అప్పగిస్తామని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఆగస్టు).

సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు అప్పగించిన, అప్పగించాల్సిన ఆర్&ఆర్ కాలనీల వివరాలను పేర్కొన్న దాని ఖచ్చితత్వాన్ని ధ్రువీకరించడానికి అందించలేదు.

**విజయవాడ**
11th August 2025

**(శరత్ చతుర్వేది)**
**ప్రధాన మహాగణకులు (తనిఖీ)**
**ఆంధ్రప్రదేశ్**

**ధ్రువీకరించడమైనది**

**న్యూఢిల్లీ**
13th August 2025

**(కె. సంజయ్ మూర్తి)**
**భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్**

# అనుబంధాలు, పదకోశం

పేజీలు 157 – 213

## అనుబంధం 1.1

(పేరా 1.1 & పేజీ 3)

### ప్రాజెక్టు ఉద్దేశ్యం, ప్రయోజనాలను చూపే పట్టిక

| ఉద్దేశం | ప్రయోజనాలు |
|---|---|
| నీటిపారుదల & గృహ నీటి సరఫరా | తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, కృష్ణా జిల్లాల్లోని పంపిణీ వ్యవస్థ ద్వారా సాగునీటి మరియు తాగునీటి అవసరాలను తీర్చడానికి రెండు ప్రధాన కాలువలు, ఎడమ ప్రధాన కాలువ (ఎల్ఎమ్‌సీ) మరియు కుడి ప్రధాన కాలువ (ఆర్ఎమ్‌సీ) రూపొందించబడ్డాయి. కుడి ప్రధాన కాలువ, ఎడమ ప్రధాన కాలువ మార్గంలో ఉన్న 611 గ్రామాలలో 2.91 లక్షల హెక్టార్ల (7.20 లక్షల ఎకరాలు) వ్యవసాయ మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించడానికి, 28.50 లక్షల జనాభాకు తాగునీటిని సరఫరా చేయడానికి ప్రణాళిక చేయబడింది. |
| నదుల అనుసంధానం | ప్రాజెక్టు ఆర్ఎమ్‌సీ ద్వారా 80 టీఎమ్‌సీల గోదావరి నీటిని కృష్ణా నదిలోకి మళ్ళించి కృష్ణా డెల్టాలో సాగునీటి లభ్యతను పెంచడం. కృష్ణా డెల్టాలో ఆదా చేసిన[323] నీటిని కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని కృష్ణా నది ఎగువ ప్రాంతంలోని అవసరమైన ప్రాంతాలకు సాగునీటి కోసం ఉపయోగించబడతాయి. |
| పారిశ్రామికీకరణ | విశాఖపట్నం నగరానికి 23.44 టిఎమ్‌సీల నీటి సరఫరా ఉక్కు కర్మాగారాలు, ఇతర ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థల[324] పారిశ్రామిక అవసరాల కోసం ఉపయోగపడతాయని అంచనా వేయబడింది. ఇది పారిశ్రామిక వృద్ధికి, ఉపాధి కల్పనకు సహాయపడుతుంది. |
| నది నావిగేషన్ | నది ఎగువ భాగం నుండి ధవళేశ్వరం వరకు మట్టి-రాతి (ఈసీఆర్ఎఫ్) ఆనకట్ట నిర్మాణం తర్వాత కూడా నది నావిగేషన్ కొనసాగించాలని ప్రతిపాదించబడింది. ప్రతిపాదిత ప్రవాహ సొరంగం ప్రవేశద్వారం వద్ద నది నావిగేషన్‌ను సులభతరం చేయడానికి హెడ్ రెగ్యులేటర్, నావిగేషన్ లాక్‌తో ఎడమ వైపున రిజర్వాయర్ ముందు ఒడ్డు నుండి బయలుదేరే లీడింగ్ ఛానల్ ప్రతిపాదించబడింది..<br>**చిత్రం 42: నావిగేషన్ ఛానల్**<br><br>నావిగేషన్ కాలువ సాడిల్ డ్యామ్ 'కేఎల్' నుండి మొదలయి, నీటి వాలుని అధిగమించటానికి అవసరమైన ఎత్తైన హెడ్ లాక్‌తో నది ఎడమ ఒడ్డుకు అనుసంధానించబడి ఉంది. |
| విద్యుత్ ఉత్పత్తి | రాష్ట్ర యాజమాన్యంలోని విద్యుత్ ఉత్పత్తి సంస్థ అయిన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి సంస్థ (ఏపీజెన్ కో), ఈసీఆర్ఎఫ్ ఆనకట్టకు ఎడమవైపున 'డీ' కొండస్థానంలో 960 మెగావాట్ల సామర్థ్యంతో పోలవరం జల విద్యుత్ ప్రాజెక్టు (పీహెచ్ఈపీ)ను నిర్మిస్తుంది. పీహెచ్ఈపీలో 80 మెగావాట్ల సామర్థ్యం గల 12 విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల స్థాపన ఉంటుంది. ఈ ప్రాజెక్టు రాష్ట్ర విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానించబడి రాష్ట్రానికి జల విద్యుత్తును అందిస్తుంది. |

323 మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు 35 టీఎమ్‌సీలు, మిగిలిన 45 టీఎమ్‌సీలు ఆంధ్రప్రదేశ్‌కు

324 హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్, గంగవరం పోర్ట్, తూర్పు నావల్ కమాండ్, భారత్ హెవీ ప్లేట్స్ అండ్ వెసల్స్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ రిఫైనరీ, కోరమండల్ ఫెర్టిలైజర్స్, హిందూస్తాన్ జింక్ లిమిటెడ్

## అనుబంధం 1.2

**(పేరా 1.1 & పేజీ 3)**

**ప్రాజెక్టు యొక్క వివిధ అంశాలను చూపే పట్టిక**

| భాగం యొక్క పేరు | వివరణ |
|---|---|
| **హెడ్ వర్క్స్** | |
| (అ) (మట్టి-రాతి) ఆనకట్ట | నీటి నిల్వను సులభతరం చేయడానికి, గోదావరి నదిపై మట్టి రాతి ఆనకట్టను నిర్మించాలని ప్రతిపాదించారు, వరద నీటి విడుదలను నియంత్రించడానికి స్పిల్‌వేతో అప్రోచ్ ఛానెల్‌ను తవ్వడం ద్వారా నీటిని మళ్లించారు |
| (ఆ) డి- వాల్ | మట్టి-రాతి ఆనకట్ట నుండి ప్రధాన నది కాలువలోకి నిల్వ ఉన్న నీరు లీకేజీని నిరోధించడానికి, మట్టి రాతి ఆనకట్ట దిగువన ఒక డి-వాల్ ప్రతిపాదించారు. |
| (ఇ) స్పిల్ వే | ప్రాజెక్టు యొక్క స్పిల్‌వే భాగం ఒక ఓగీ స్పిల్‌వేని కలిగి ఉంది, దీని గరిష్ట ఎత్తు (+)25.72 మీ. తో స్పిల్‌వే ఎగువన 2,310 మీటర్ల పొడవు గల అప్రోచ్ ఛానెల్‌ని కలుపుతూ కుడి ఒడ్డున ఉంది. నీటి ప్రవాహ వేగాన్ని తగ్గించడానికి స్పిల్‌వే కి దిగువన స్టిల్లింగ్ బేసిన్ కట్టబడింది. 2,920 మీటర్ల పొడవు గల స్పిల్ ఛానల్ స్టిల్లింగ్ బేసిన్ నుండి మొదలయి, ఇది పైలట్ ఛానెల్‌కు అనుసంధానించబడి చివరకు నది దిగువకు కలుస్తుంది. ఎడమ, కుడి అబ్యూట్‌మెంట్ పైర్‌లతో సహా స్పిల్‌వే యొక్క మొత్తం వెడల్పు 1,118.40 మీ అయితే స్పిల్‌వే యొక్క వెడల్పు మాత్రం 768 మీ. స్పిల్‌వే 16 మీ (వెడల్పు) x 20 మీ (ఎత్తు) పరిమాణంలో 48 రేడియల్ గేట్‌లతో కట్టబడింది. పూర్తి రిజర్వాయర్ స్థాయి (ఎఫ్ఆర్ఎల్) ఈఎల్ (+)45.72 మీ వద్ద ఉంది. సంభావ్య గరిష్ట వరద (పీఎమ్ఎఫ్) 1,41,535 ఘనపు మీటర్/సెకను (సుమారు 50 లక్షల క్యూసెక్కులు)గా అంచనా వేయబడింది. |
| (ఈ) అనుసంధానాలు | కుడి, ఎడమ వైపు సొరంగాలు, హెడ్ రెగ్యులేటర్లు, సాడిల్ డ్యామ్‌లతో అనుసంధానం చేయడం ద్వారా గ్రావిటీ ద్వారా కాలువలలోకి నిల్వ చేయబడిన నీటిని విడుదల చేయడానికి ప్రతిపాదించబడింది. |
| (ఉ) నావిగేషన్ కాలువ | మట్టి-రాతి ఆనకట్ట, స్పిల్‌వే నిర్మాణం కారణంగా అడ్డంకులు ఏర్పడిన నావిగేషన్‌ను ప్రారంభించడానికి, తగిన లాక్‌లతో కూడిన నావిగేషన్ కాలువను నిర్మించాలని ప్రతిపాదించబడింది. |
| **పవర్‌హౌస్** | |
| | 960 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం కలిగిన పవర్‌హౌస్ ఎడమ వైపున పెన్‌స్టాక్‌ల[325] కోసం సొరంగం నిర్మాణం ఉంటుంది. విద్యుత్ ఉత్పత్తి తర్వాత, నీటిని టెయిల్ రేస్ ఛానల్ ద్వారా దిగువకు నదిలోకి వదులుతారు. |
| **కాలువలు & పంపిణీదారులు** | |
| కాలువలు | రెండు ప్రధాన కాలువలు, ఎడమ ప్రధాన కాలువ, కుడి ప్రధాన కాలువ, ఆనకట్టకు ఇరువైపులా లైనింగ్ చేయబడిన కాలువలు, ఆఫ్-టేక్. రెండు కాలువల యొక్క ప్రధాన భాగాలలో మట్టిపని తవ్వకం, సిమెంట్ కాంక్రీట్ లైనింగ్, సీఎమ్ & సీడీ నిర్మాణాలు ఉన్నాయి. రెండు కాలువలు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, విశాఖపట్నం జిల్లాల నీటిపారుదల, తాగునీటి అవసరాలు, విశాఖపట్నం నగరంలోని పారిశ్రామిక నీటి అవసరాలను తీర్చడానికి రూపొందించబడ్డాయి. |
| (అ) ఎడమ ప్రధాన కాలువ (ఎల్ఎమ్‌సీ) | ఎల్ఎమ్‌సీ, ఒక లైన్డ్ కాలువ, నేలకోట అనుబంధ జలాశయం నుండి బయలుదేరి 211.27 కి.మీ. ప్రవహిస్తుంది. ఈ కాలువ శారద, మామిడివాక గెడ్డ, వరాహ, తాండవ, యెర్రా, బురదకల్వ అనే ఆరు ప్రధాన వాగులను దాటుతుంది. తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాలలో 1.62 లక్షల హెక్టార్ల (నాలుగు లక్షల ఎకరాలు) ఆయకట్టుకు నీటిపారుదల సౌకర్యాలను అందించడానికి |

325 జలాశయం నుండి జల విద్యుత్ కేంద్రంలో ఏర్పాటు చేసిన టర్బైన్లకు ఒత్తిడితో కూడిన నీటిని పంపించే పైపుల సమూహం

| | |
|---|---|
| | ఎల్ఎమ్‌సీ రూపొందించబడింది, అంతేకాకుండా విశాఖపట్నం నగరానికి 23.44 టీఎమ్‌సీల గోదావరి నీటిని పారిశ్రామికంగా, నీటి సరఫరా చేయడానికి కూడా ఇది రూపొందించబడింది. |
| (ఆ) కుడి ప్రధాన కాలువ (ఆర్ఎమ్‌సీ) | ఆర్ఎమ్‌సీ, ఒక లైన్డ్ కాలువ, స్టిల్లింగ్ బేసిన్‌లోని హెడ్ రెగ్యులేటర్ నుండి బయలుదేరి 178.81 కి.మీ. పొడవున ప్రవహిస్తుంది, ఐదు ప్రధాన వాగులు, కొవ్వాడకలవ, యెర్రకలవ, గుండేరు, తమ్మిలేరు, రామిలేరులను దాటుతుంది, తరువాత విజయవాడ నగరానికి సమీపంలోని బుడమేరులో కలుస్తుంది. కృష్ణా నదికి మళ్లించడానికి ఉద్దేశించిన నీరు ప్రస్తుత బుడమేరు మళ్లింపు ఛానల్ ద్వారా ప్రవహించి ప్రకాశం బ్యారేజీకి 8 కి.మీ. ఎగువన కృష్ణా నదిలో కలుస్తుంది. జీడబ్ల్యూడీటీ అవార్డు ప్రకారం పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల ఎగువ ప్రాంతాలలో 1.29 లక్షల హెక్టార్ల (3.20 లక్షల ఎకరాలు) ఆయకట్టుకు నీటిపారుదల సౌకర్యాలను అందించడానికి ఆర్ఎమ్‌సీ రూపొందించబడింది, అంతేకాకుండా విజయవాడ నగరం సమీపంలోని కృష్ణా నదిలోకి 80 టీఎమ్‌సీల గోదావరి నీటిని మళ్లించడం జరుగుతుంది. |
| (ఇ) పంపిణీ వ్యవస్థ | పంపిణీ వ్యవస్థలకు సంబంధించి వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక శాఖచే ఇంకా తయారీ దశలో ఉంది. |
| **భూ సేకరణ** | |
| | భూ సేకరణ (ఎల్ఏ) అంటే ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతంలోని భూమి, భవనాలు లేదా ఇతర ఆస్తులను కోల్పోవడం. పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ప్రధానంగా మూడు రకాల ప్రభావిత ప్రాంతాలను కలిగి ఉంటుంది. అవి, పనుల ప్రాంతం, మునిగిపోయే ప్రాంతం, భూ సేకరణ అవసరమయ్యే ఆర్&ఆర్ కార్యకలాపాల ప్రాంతం. |
| **పునరావాసం, పునరుపాధి కల్పన** | |
| | కొత్త గ్రామం లేదా కాలనీలో పునరావాసం పొందిన జనాభా తమకు తాముగా సహేతుకమైన సమాజ జీవన ప్రమాణాలను పొందగలరని, స్థానభ్రంశంలో కలిగే గాయాన్ని తగ్గించడానికి ప్రయత్నించగలరని నిర్ధారించుకోవడానికి, రిక్విజనింగ్ అథారిటీ ఖర్చుతో ప్రాథమిక కనీస మౌళిక సదుపాయాలతో, స్థానభ్రంశం చెందిన కుటుంబాలకు గృహనిర్మాణ యూనిట్లు, అర్హత కలిగిన పీడీఎఫ్‌లకు భూమికి-భూమి కేటాయింపు, యాన్యుటీ, జీవనాధార గ్రాంట్, రవాణా ఖర్చు వంటి నగదు ప్రయోజనాలను ఆర్&ఆర్ హక్కులు ద్వారా అందించబడతాయి.. |

## అనుబంధం 2.1 (అ)

**(పేరా 2.2.1 & పేజీ 19)**

### హెడ్‌వర్క్స్ అమలులో పాల్గొన్న వివిధ గుత్తేదారు సంస్థలను చూపే పట్టిక

| ప్యాకేజీ సంఖ్య | పనుల భాగాలు | పాత గుత్తేదారు సంస్థ, అప్పగించిన తేదీ | కొత్త గుత్తేదారు సంస్థ పేరు, అప్పగించిన తేదీ | ఎస్ఓఆర్ సవరించబడిందా | మునుపటి ఒప్పందాన్ని ముగించడానికి గల కారణాలు/కొత్త గుత్తేదారు సంస్థకు అప్పగించడం |
|---|---|---|---|---|---|
| ప్రధాన ఆనకట్ట ప్యాకేజీ | | | | | |
| దర్యాప్తు, సర్వే, డిజైన్లు & డ్రాయింగ్‌ల తయారీ, ఎల్.పి. షెడ్యూల్‌లు మొదలైనవి, (బ్యాలెన్స్),<br>(1) మట్టి ఆనకట్ట గ్యాప్‌లు I & III నిర్మాణం, గ్యాప్-II కోసం మట్టి రాతి ఆనకట్ట, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్<br>(2) క్రెస్ట్ లెవల్ (+) 25.72 మీటర్ల స్పిల్‌వే నిర్మాణం, దాని అనుబంధ పనులు,<br>(3) పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, ఓ&ఎమ్ యొక్క 960 మెగావాట్ల హైడ్రో ఎలక్ట్రిక్ పవర్‌హౌస్, అప్రోచ్ ఛానల్, ఇంటేక్ స్ట్రక్చర్, టెయిల్ రేస్ పూల్, టెయిల్ రేస్ ఛానల్ మొదలైన వాటి పునాదుల తవ్వకం, లోపాల బాధ్యత వ్యవధితో సహా ఐదు సంవత్సరాలు. | -భూమి ఆనకట్ట అంతరాలు I & III<br>-మట్టి రాతి ఆనకట్ట అంతరం- II<br>-స్పిల్ వే<br>-ఎగువ మరియు దిగువ కాఫర్ డ్యామ్‌లు<br>-అప్రోచ్ ఛానల్<br>-స్పిల్ ఛానల్<br>-పైలట్ ఛానల్<br>-960 మెగావాట్ల జల విద్యుత్ కేంద్రం యొక్క పునాదుల తవ్వకం, మొదలైనవి. | మెస్సర్స్ ట్రాన్స్‌స్ట్రాయ్ జేవీసీ ఇపి యూఇఎస్-జేవీ, హైదరాబాద్ ఒప్పందం నెం.1/2012-13, తేదీ 02.03.2013 | మెస్సర్స్ నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్, హైదరాబాద్ గంపగుత్త ఒప్పందం నెం. 01/2017-18, తేదీ 27.02.2018 | లేదు | పురోగతి రేటును మెరుగుపరచడానికి. |
| | | | మెస్సర్స్ బెకెమ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్, హైదరాబాద్ ఇపీసీ ఒప్పందం నెం.01/2018-19, తేదీ 10.12.2018 | లేదు | పురోగతి రేటును మెరుగుపరచడానికి. |
| పరిశోధన, సర్వే, డిజైన్లు & డ్రాయింగ్‌ల తయారీ, ఎల్.పి. షెడ్యూల్‌లు మొదలైన వాటి మిగిలిన పనులు.<br>(1) ఎర్త్ డ్యామ్ గ్యాప్‌లు I & III నిర్మాణం, గ్యాప్-II కోసం ఎర్త్-కమ్-రాక్ ఫిల్ డ్యామ్, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్<br>(2) క్రెస్ట్ లెవల్ (+) 25.72 మీటర్ల స్పిల్‌వే నిర్మాణం, దాని అనుబంధ పనులు<br>(3) పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు యొక్క 960 మెగావాట్ల హైడ్రో ఎలక్ట్రిక్ జల విద్యుత్ కేంద్రం, అప్రోచ్ ఛానల్, ఇంటేక్ స్ట్రక్చర్, టెయిల్ రేస్ పూల్, టెయిల్ రేస్ ఛానల్ మొదలైన వాటి పునాదుల తవ్వకం. రెండు సంవత్సరాల లోపాల బాధ్యత వ్యవధితో సహా ఐదు సంవత్సరాలు ఓ & ఎమ్ | - మట్టి ఆనకట్ట గ్యాప్-1 – మట్టి రాతి ఆనకట్ట- II<br>- స్పిల్ వే<br>-రేడియల్ గేట్లు<br>-ఎగువ మరియు దిగువ కాఫర్ డ్యామ్‌లు<br>-అప్రోచ్ ఛానల్<br>-స్పిల్ ఛానల్<br>-పైలట్ ఛానల్<br>-960 ఎమ్‌డబ్ల్యూ హైడ్రో ఎలక్ట్రిక్ జల విద్యుత్ కేంద్రం మొదలైన వాటి పునాదుల తవ్వకం. | 1) మెస్సర్స్ నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్, హైదరాబాద్ గంపగుత్త ఒప్పందం నెం. 01/2017-18, తేదీ 27.02.2018.<br>2) మెస్సర్స్ బెకెమ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్, హైదరాబాద్ ఈపీసీ ఒప్పందం నెం. 01/2018-19, తేదీ 10.12.2018. | మెస్సర్స్ మేఘ ఇంజనీరింగ్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్, హైదరాబాద్ గంపగుత్త ఒప్పందం నెం.01/2019-20, తేదీ 08.11.2019. | లేదు | పురోగతి రేటును మెరుగుపరచడం, ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేయడం. |
| అనుసంధానాల ప్యాకేజీలు | | | | | |
| ప్యాకేజీ నెం.65<br>దాదాపు 919 మీటర్ల పొడవున్న సొరంగం నిర్మాణం కోసం పరిశోధన, నేల అన్వేషణ, | - నీటిపారుదల టన్నెల్<br>-హెడ్ రెగ్యులేటర్<br>-నావిగేషన్ లాక్ | మెస్సర్స్ యూనిటీ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు లిమిటెడ్, రాజమహేంద్రవరం తేదీ | మెస్సర్స్ మాక్స్ ఇన్‌ఫ్రా (ఐ) లిమిటెడ్, హైదరాబాద్ తేదీ 09.03.2019 | అవును 2018-19 | పీఎస్‌లోని నిబంధన 72 క్రింద ఒప్పందాన్ని రద్దు చేయడానికి ప్రభుత్వం ఎపీఎస్ఎస్‌కు అనుమతి |

| | | | | | |
|---|---|---|---|---|---|
| డిజైన్ల తయారీ, డ్రాయింగ్‌లు, వివరణాత్మక అంచనాలు, ఇపీసీ టర్న్‌కీ వ్యవస్థపై ఇందిరా సాగర్ పోలవరం ప్రాజెక్టు యొక్క ఎడమ వైపు అనుసంధానాల కోసం వాటి నిర్మాణంతో సహా ఎడమ పార్శ్వ నియంత్రకం. | -అప్రోచ్ ఛానల్-I & II<br>-ఎగ్జిట్ ఛానల్<br>-నావిగేషన్ ఛానల్. | 16.03.2005 | | | ఇచ్చింది (మెమో నెం. ఐసిడీఓ1-19052/ 22/2018-పీఆర్ఓజే-I-డబ్ల్యూఆర్డీ, తేదీ 4.11.2018). |
| ప్యాకేజీ నెం. 65<br>దాదాపు 919 మీటర్ల పొడవున్న నీటిపారుదల సొరంగం నిర్మాణం, ఎడమ పార్శ్వ హెడ్ రెగ్యులేటర్, నావిగేషన్ లాక్, అప్రోచ్ చానెళ్ల తవ్వకం (I & II), ఎగ్జిట్ చానెల్, నావిగేషన్ చానెల్ (మిగిలిన పని) | - నీటిపారుదల టన్నెల్<br>-హెడ్ రెగ్యులేటర్<br>-నావిగేషన్ లాక్<br>-అప్రోచ్ ఛానల్-I, II<br>-ఎగ్జిట్ ఛానల్<br>-నావిగేషన్ ఛానల్. | మెస్సర్స్ మాక్స్ ఇన్‌ఫ్రా (I) లిమిటెడ్, హైదరాబాద్ తేదీ 09.03.2019 | మెస్సర్స్ మాక్స్ ఇన్‌ఫ్రా (I) లిమిటెడ్, హైదరాబాద్ తేదీ తేదీ:22.11.19 | లేదు | సౌలభ్యం కోసం ఎల్ఎస్ కాంట్రాక్ట్ ఒప్పందం నిబంధన 7.3 ప్రకారం పని ముందస్తుగా మూసివేయబడింది. |
| పీఐపీహెచ్‌డబ్ల్యూ-ప్యాకేజీ నెం.66<br>దర్యాప్తు, నేల అన్వేషణ, ఇపీసీ టర్న్‌కీ వ్యవస్థపై ఇందిరా సాగర్ ప్రాజెక్టు (పోలవరం ప్రాజెక్టు) యొక్క ఎడమ వైపు అనుసంధానాల కోసం దాని నిర్మాణాలతో సహా సుమారు 890 మీటర్ల పొడవు గల నావిగేషన్ టన్నెల్, సాడిల్ డ్యామ్ 'కేఎల్', ఆఫ్ టేక్ రెగ్యులేటర్ నిర్మాణం కోసం డిజైన్లు, డ్రాయింగ్‌లు, వివరణాత్మక అంచనాల తయారీ. అదనపు పరిమాణాలలో సాడిల్ డ్యామ్ కేఎల్, అదనపు వస్తువులు డిస్లిషన్ స్లూయిస్, ఓపెన్ కట్, పుష్కా పైప్‌లైన్‌ల కూల్చివేత. | 1. నావిగేషన్ టన్నెల్<br>2. అప్రోచ్ ఛానల్<br>3. ఎగ్జిట్ ఛానల్<br>4. సాడిల్ డ్యామ్ 'కేఎల్'<br>5. డిస్లెషన్ స్లూయిస్<br>6. ఓపెన్ కట్ | మెస్సర్స్ శ్రీ అవంతిక - సాయి వెంకట (జేవీ), నెల్లూరు. | - | - | - |
| ప్యాకేజీ నెం.67<br>గోదావరి నదికి దారితీసే నావిగేషన్ లాక్ ఎడమ వైపు నిర్మాణం, నావిగేషన్ కెనాల్ నిర్మాణం కోసం దర్యాప్తు, నేల అన్వేషణ, డిజైన్లు, డ్రాయింగ్‌లు, వివరణాత్మక అంచనాల తయారీ, ఇందిరా సాగర్ (పోలవరం) ప్రాజెక్టు యొక్క ఎడమ వైపు అనుసంధానాల కోసం ఇపీసీ టర్న్‌కీ వ్యవస్థపై దాని నిర్మాణంతో సహా. | నావిగేషన్ కెనాల్<br>- హై హెడ్ లాక్స్ | మెస్సర్స్ శ్రీ జయ కె. శివ రావు (జేవీ), హైదరాబాద్ | - | - | - |
| ప్యాకేజీ నెం.62<br>ఇందిరా సాగర్ పోలవరం ప్రాజెక్టు యొక్క కుడి వైపు అనుసంధానాల కోసం ఇపీసి టర్న్‌కీ సిస్టమ్‌పై దాని నిర్మాణంతో సహా కుడి పార్శ్వ నియంత్రకం, ఆఫ్ టేక్ నియంత్రకం, సాడిల్ డ్యామ్ ఇ & ఎఫ్ నిర్మాణం కోసం పరిశోధన, నేల అన్వేషణ, డిజైన్లు, డ్రాయింగ్‌లు, వివరణాత్మక అంచనాల తయారీ. | హెడ్ (పి) రెగ్యులేటర్<br>- సాడిల్ డ్యామ్ ఇ<br>- సాడిల్ డ్యామ్ ఎఫ్<br>- అప్ టేక్ రెగ్యులేటర్ | మెస్సర్స్ హిందుస్తాన్-రత్న (జేవీ), హైదరాబాద్ | - | - | - |
| ప్యాకేజీ నెం..63<br>దాదాపు 900 మీటర్ల పొడవున్న సొరంగం నిర్మాణం కోసం పరిశోధన, నేల అన్వేషణ, డిజైన్ తయారీ, డ్రాయింగ్, వివరణాత్మక అంచనా, ఎంట్రీ & ఎగ్జిట్ ఛానెల్‌ల తవ్వకం, ఆఫ్ టేక్ రెగ్యులేటర్ వద్ద స్టిల్లింగ్ బేసిన్‌ను కట్టడానికి బండ్‌ల ఏర్పాటు, ఇందిరా సాగర్ పోలవరం ప్రాజెక్టు యొక్క కుడి వైపు అనుసంధానాల కోసం ఇపీసీ టర్న్‌కీ సిస్టమ్‌పై దాని నిర్మాణంతో సహా. | 1.ఎంట్రీ ఛానల్<br>2.ట్విన్ టన్నెల్స్<br>3.ఎగ్జిట్ ఛానల్<br>4. కట్టలు I & II | మెస్సర్స్ ఎస్ఎమ్ఎస్ఐఎల్ – యూఏఎన్ఎమ్ఏఎక్స్ (జేవీ), హైదరాబాద్ | - | - | - |

| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్యాకేజీ నెం..64: సుమారు 880 మీటర్ల పొడవు గల సొరంగం నిర్మాణం కోసం దర్యాప్తు, నేల అన్వేషణ, డిజైన్ తయారీ, డ్రాయింగ్, వివరణాత్మక అంచనా, ఇపీసి టర్న్‌కీ వ్యవస్థపై ఇందిరా సాగర్ (పోలవరం) ప్రాజెక్టు యొక్క కుడి వైపు అనుసంధానాల కోసం దాని నిర్మాణంతో సహా ఎంట్రీ & ఎగ్జిట్ చానెళ్ల తవ్వకం. | 1.ఎంట్రీ ఛానల్<br>2.ట్విన్ టన్నెల్స్<br>3.ఎగ్జిట్ ఛానల్<br>4.బండ్స్ I & II | మెస్సర్స్ మాక్స్ (ఐ) ఇన్‌ఫ్రా లిమిటెడ్, హైదరాబాద్) | – | – | – |

## అనుబంధం 2.1 (అ)

(పేరా 2.2.1 & పేజీ 19)

### కాలువల నిర్మాణంలో పాల్గొన్న వివిధ గుత్తేదారు సంస్థలను చూపే పట్టిక

**ఎ. ఎడమ ప్రధాన కాలువ**

| ప్యాకేజీ నెం | పనిలో భాగాలు | పాత గుత్తేదారు సంస్థ, అప్పగించిన తేదీ | కొత్త గుత్తేదారు సంస్థ, అప్పగించిన తేదీ | ఎస్ఓఆర్ సవరించబడిందా | మునుపటి ఒప్పందాన్ని ముగించి కొత్త గుత్తేదారు సంస్థకి అప్పగించడానికి గల కారణాలు |
|---|---|---|---|---|---|
| ప్యాకేజీ–1 | మట్టి తవ్వకం పని, సిమెంట్, కాంక్రీట్ లైనింగ్ & సీఎమ్ & సీడీ పనులు | మెస్సర్స్ ప్రోగ్రెసివ్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్, హైదరాబాద్, ఒప్పందం నెం.75 ఎస్ఇ/ 2004–05, తేదీ 20.03.2005. | మెస్సర్స్ సూర్య కాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం నెం.18/ 2017–18, తేదీ 22.06.2017. | లేదు | పని నెమ్మదిగా సాగుతున్న కారణంగా, పనిలో కొంత భాగాన్ని తొలగించి, నిబంధన 60 (సి) పీఎస్ క్రింద ఏపీడీఎస్ఎస్ కొత్త ఏజెన్సీకి అప్పగించారు. |
| ప్యాకేజీ –2 | మట్టి తవ్వకం పని, సిమెంట్, కాంక్రీట్ లైనింగ్ & సీఎమ్ & సీడీ పనులు | మెస్సర్స్ పటేల్ – సోమ (జేవీ) హైదరాబాద్ ఒప్పందం నెం.72/2004–05, తేదీ 17.03.2005 | -- | అవసరం లేదు | పని పూర్తయింది. తుది బిల్లు చెల్లింపు కోసం పెండింగ్‌లో ఉంది. |
| ప్యాకేజీ –3 | మట్టి పని, లైనింగ్, నిర్మాణాలు | మెస్సర్స్ మైటాస్–ఎన్‌సిసి (జేవీ), హైదరాబాద్ ఒప్పందం నెం. 73/2004–05, తేదీ 19.03.2005 | మెస్సర్స్ కేఎమ్‌వీ ప్రాజెక్ట్స్, హైదరాబాద్ | లేదు | పీఐపీఎల్ ఎమ్‌సీ ప్యాకేజీల పురోగతిపై జీఓఏపీ, జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ 15.03.2016న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు, అసలు గుత్తేదారు సంస్థ పరిధి నుండి పని భాగాన్ని తొలగించి, ఎపీడీఎస్ఎస్‌కు పీఎస్ యొక్క నిబంధన 60(సి) క్రింద అసలు ఒప్పంద రేట్ల వద్ద నామినేషన్ ప్రాతిపదికన ఇతర గుత్తేదారు సంస్థకు పనిని అప్పగించాలని ఆదేశించారు. |
| ప్యాకేజీ –4 | మట్టి పని, లైనింగ్, నిర్మాణాలు | మెస్సర్స్ సాబీర్ కన్‌స్ట్రక్షన్ వర్క్స్, హైదరాబాద్ ఒప్పందం నెం. 79/2004–2005, తేదీ 23.03.2005 | మెస్సర్స్ ఆర్ఎస్ఆర్–సాగిట్టల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, రాజమహేంద్రవరం | లేదు | |
| ప్యాకేజీ –5 | మట్టి పని, లైనింగ్, నిర్మాణాలు | మెస్సర్స్ సాబీర్ డ్యామ్ & వాటర్ వర్క్స్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ, హైదరాబాద్. ఒప్పందం నెం. 80/2004–05, తేదీ 23.03.2005 | మెస్సర్స్ పీఎస్‌కే–హెచ్ఇఎస్ (జేవీ), హైదరాబాద్, తేదీ 28.12.2016 | లేదు | |
| ప్యాకేజీ –6 | మట్టి పని, లైనింగ్, నిర్మాణాలు | మెస్సర్స్ మధుకాన్ సినో హైడ్రో (జేవీ), హైదరాబాద్. పని 23.03.2005న అప్పగించబడింది. | మెస్సర్స్ బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యధిత, తూర్పు గోదావరి జిల్లా. | లేదు | ప్రభుత్వం ముందుగానే పనిని ముగించి వేసింది. |
| ప్యాకేజీ –7 | మట్టి పని, లైనింగ్, నిర్మాణాలు | మెస్సర్స్ కేసీఎల్ –జేసీసీజీ (జేవీ) అహ్మదాబాద్. | -- | లేదు | పని పురోగతిలో ఉంది. |
| ప్యాకేజీ –8 | మట్టి పని, లైనింగ్, నిర్మాణాలు | మెస్సర్స్ ఐవీఆర్‌సీఎల్ – ఎస్ఇడబ్ల్యూ & ప్రసాద్ (జేవీ), హైదరాబాద్ | -- | లేదు | ముందస్తు ముగింపు కోసం వేచి ఉంది. |

| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్యాకేజీ 8 ఏ | మట్టి పని | మెస్సర్స్ ఐవీఆర్‌సీఎల్ – ఎస్ఇడబ్ల్యు & ప్రసాద్ (జేవీ), హైదరాబాద్ | ప్రభుత్వ మెమో నెం:19052/145/2017–పీఆర్‌ఓజే–ఐ–డబ్ల్యూఆర్‌డీ, తేదీ 29.12.2017, ఎస్ఇ/పీఐపీఎల్ఎమ్‌సీ/తుని లెటర్ నెంబర్: 89ఎమ్ తేదీ 29.01.2018 ద్వారా ₹58.11 కోట్లకు హైదరాబాద్‌లోని మెస్సర్స్ ఏసీఎల్–ఆర్‌కేఐసీపీఎల్ (జేవీ) కి అప్పగించబడింది. | లేదు | 2011 నుండి గుత్తేదారు మెస్సర్స్ ఐవీఆర్‌సీఎల్ – ఎస్ఇడబ్ల్యు & ప్రసాద్ (జేవీ), హైదరాబాద్ నుండి ఎటువంటి స్పందన లేదు. ఈ గుత్తేదారు నుండి కొంత పని తొలగించబడింది. మిగిలిన పనులలో కొంత భాగాన్ని ప్రస్తుత గుత్తేదారు నుండి తొలగించి, జీఓఏపీ మెమో ద్వారా మెస్సర్స్ ఏసీఎల్– ఆర్‌కేఐసీపీఎల్ (జేవీ), హైదరాబాద్ & మెస్సర్స్ ఆర్‌కేవీస్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, నెల్లూరుకు అప్పగించారు. నిబంధన 60 (సి) క్రింద 29.12.2017న జారీ చేసిన జీఓఏపీ మెమో. నెం.19502/145/2017–పీఆర్‌ఓజే–I–డబ్ల్యూఆర్‌డీ, ప్రధాన గుత్తేదారుతో కొంత పనిని నిలుపుకుంది. |
| | లైనింగ్ | మెస్సర్స్ ఐవీఆర్‌సీఎల్ – ఎస్ఇడబ్ల్యు & ప్రసాద్ (జేవీ), హైదరాబాద్ | | | |
| | నిర్మాణాలు | మెస్సర్స్ ఐవీఆర్‌సీఎల్ – ఎస్ఇడబ్ల్యు & ప్రసాద్ (జేవీ), హైదరాబాద్ | | | |
| ప్యాకేజీ 8బీ | మట్టి పని | మెస్సర్స్ ఐవీఆర్‌సీఎల్ – ఎస్ఇడబ్ల్యు & ప్రసాద్ (జేవీ), హైదరాబాద్ | ప్రభుత్వ మెమో నెం.19052/ 145/2017–పీఆర్‌ఓజే–ఐ–డబ్ల్యూఆర్‌డీ, తేదీ 29.12.2017, ఎస్ఇ/ పీఐపీఎల్ఎమ్‌సీ/తుని ఎల్ఆర్.నెంబర్.89ఎమ్ తేదీ 29.01.2018 ద్వారా ₹6.58 కోట్లకు మెస్సర్స్ ఆర్‌కేవీస్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, నెల్లూరుకు అప్పగించబడింది. | -- | |
| | లైనింగ్ | మెస్సర్స్ ఐవీఆర్‌సీఎల్ – ఎస్ఇడబ్ల్యు & ప్రసాద్ (జేవీ), హైదరాబాద్ | | | |
| | నిర్మాణాలు | మెస్సర్స్ ఐవీఆర్‌సీఎల్ – ఎస్ఇడబ్ల్యు & ప్రసాద్ (జేవీ), హైదరాబాద్ | | | |

**బి. కుడి ప్రధాన కాలువ**

| ప్యాకేజీ నెం | భాగం పేరు | పాత గుత్తేదారు సంస్థ, అప్పగించిన తేదీ | కొత్త గుత్తేదారు సంస్థ, అప్పగించిన తేదీ | ఎస్ఓఆర్ సవరించబడిందా | మునుపటి ఒప్పందాన్ని ముగించి కొత్త గుత్తేదారు సంస్థకి అప్పగించడానికి గల కారణాలు |
|---|---|---|---|---|---|
| ప్యాకేజీ –1 | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ప్యాకేజీ – 1, దర్యాప్తు, రూపకల్పన, సీఎమ్&సీడీ పనుల నిర్మాణం, అంచనాతో సహా పనులు, 0.000 కి.మీ. నుండి 14.800 + 0.006 కి.మీ. వరకు మట్టి తవ్వకం ద్వారా కట్టను ఏర్పరచడం. | మెస్సర్స్ పటేల్ సోమ (జేవీ), హైదరాబాద్. ఒప్పందం నెం.9 ఎస్ఇ/2004–05 తేదీ 21.10.2004 | -- | అవసరం లేదు | పని పూర్తయింది. |
| ప్యాకేజీ –2 | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ప్యాకేజీ – 2 యొక్క దర్యాప్తు, రూపకల్పన అంచనాతో సహా పనులు, 14.800 కి.మీ. నుండి 38.199 +1.154 కి.మీ. వరకు మట్టి తవ్వకం ద్వారా కట్టను ఏర్పరచడం, సీఎమ్&సీడీ నిర్మాణం. | మెస్సర్స్ ప్రోగ్రెసివ్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్, హైదరాబాద్. 20.10.2004 తేదీ నాటి ఒప్పందం నెం.7/2004–05 | వివిధ గుత్తేదారు సంస్థలకు ముక్కల పద్ధతిలో అప్పగించిన పనులు క్రింద ఇవ్వబడ్డాయి | లేదు | పని నెమ్మదిగా సాగుతున్న కారణంగా పీఎస్ యొక్క నిబంధన 60(సి) క్రింద ఎపీడీఎస్ఎస్ ద్వారా కొన్ని పనులు తొలగించబడ్డాయి, వివిధ గుత్తేదారు సంస్థలకు అప్పగించబడ్డాయి. |
| | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ప్యాకేజీ నెం.2 లో 18.993 కి.మీ. నుండి 19.775 కి.మీ. వరకు మట్టి తవ్వకం, కట్ట ఏర్పాటు. | మెస్సర్స్ మాధవి కన్‌స్ట్రక్షన్స్, ఒంగోలు ఒప్పందం నెం.13 ఎస్ఇ /2016–17 తేదీ 25.05.2016 | -- | అవసరం లేదు | ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాలను చేరుకోవడానికి మిగిలిన పనిని పూర్తి చేయాలని ప్రధాన ఏజెన్సీకి సూచించబడింది. అయితే, |

| | | | | | |
|---|---|---|---|---|---|
| | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ప్యాకేజీ నెం.2 లో 35.000 కి.మీ. నుండి 35.250 కి.మీ. వరకు మట్టి తవ్వకం పని. | మెస్సర్స్ సగ్గిటల్ ఇన్‌ఫ్రా నెం ప్రాజెక్ట్స్, జంగారెడ్డిగూడెం, ఒప్పందం నెం. 6 ఎస్ఇ/ 2016-17 తేదీ 21.05.2016. | -- | | లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన పురోగతిని సాధించడానికి అవసరమైన యంత్రాలు, కూలీలు, సామగ్రిని ఏజెన్సీ సిద్ధం చేయలేకపోయింది. |
| | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ప్యాకేజీ నెం.2 లో 35.500 కి.మీ. నుండి 36.000 కి.మీ. వరకు మట్టి తవ్వకం పని. | శ్రీ కె.సింహాద్రి నాయుడు, ఒప్పందం నెం. 19 ఎస్ఇ/2016-17 తేదీ 27.05.2016 | -- | | అందువల్ల, ఎపిడీఎస్ఎస్ యొక్క నిబంధన 60 (పి) క్రింద ఏజెన్సీ ఒప్పందం పరిధి నుండి దీనిని తొలగించారు, జీఓఎమ్ఎస్ నెం 22, తేదీ 23.02.2015 & జీఓఎమ్ఎస్. నెం.63 తేదీ 12.06.2015 ప్రకారం ఒప్పంద రేట్లకు పనిని అప్పగించాలని ప్రతిపాదించారు. |
| | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ప్యాకేజీ నెం.2 లో 36.000 కి.మీ. నుండి 36.500 కి.మీ. వరకు మట్టి తవ్వకం పని. | మెస్సర్స్ సగ్గిటల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, జంగారెడ్డిగూడెం ఒప్పందం నెం. 7 ఎస్ఇ/ 2016-17 తేదీ 21.05.2016 | -- | లేదు | |
| | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ప్యాకేజీ నెం.2 లో 36.500 కి.మీ. నుండి 37.000 కి.మీ. వరకు మట్టి తవ్వకం పని. | మెస్సర్స్ మాధవి కన్‌స్ట్రక్షన్స్, ఒంగోలు, ఒప్పందం నెం. 12 ఎస్ఇ /2016-17 తేదీ 25.05.2016 | -- | లేదు | |
| | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ప్యాకేజీ నెం.2 లో 37.115 కి.మీ. నుండి 37.400 కి.మీ. వరకు మట్టి తవ్వకం పని. | శ్రీ ఎస్.చైతన్య మురముల్లా (వి), ఒప్పందం నెం. 20 ఎస్ఇ /2016-17 తేదీ 27.05.2016. | -- | లేదు | ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాలను చేరుకోవడానికి మిగిలిన పనిని పూర్తి చేయాలని ప్రధాన ఏజెన్సీకి సూచించబడింది. అయితే, లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన పురోగతిని సాధించడానికి అవసరమైన యంత్రాలు, కూలీలు, సామగ్రిని ఏజెన్సీ సిద్ధం చేయలేకపోయింది. |
| | పిఐపిఆర్ఎమ్‌సీ ప్యాకేజీ నెం.2 యొక్క 37.250 కి.మీ. నుండి 37.500 కి.మీ. వరకు, 38.199 కి.మీ. నుండి 38.199 + 1.154 కి.మీ. వరకు బ్యాలెన్స్ సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పని. | మెస్సర్స్ శ్రీ కృష్ణ ఇంజనీరింగ్, రాజమహేంద్రవరం ఒప్పందం నెం. 29 ఎస్ఇ/2017-18, తేదీ 17.02.2018 | -- | లేదు | ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాలను చేరుకోవడానికి మిగిలిన పనిని పూర్తి చేయాలని ప్రధాన ఏజెన్సీకి సూచించబడింది. అయితే, లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన పురోగతిని సాధించడానికి అవసరమైన యంత్రాలు, కూలీలు, సామగ్రిని ఏజెన్సీ సిద్ధం చేయలేకపోయింది. |
| | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ప్యాకేజీ నెం.2 యొక్క 19.000 కి.మీ. నుండి 19.750 కి.మీ., 36.750 కి.మీ. నుండి 37.250 కి.మీ. వరకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ వేయడం, 16.50 కి.మీ. (63 ఎమ్) & అండర్ టన్నెల్ వద్ద 30.806 కి.మీ. (45 ఎమ్) వద్ద సూపర్ పాసేజ్ వద్ద స్ట్రక్చర్ గ్యాప్ వేయడం. | మెస్సర్స్ శ్రీ కృష్ణ ఇంజనీరింగ్, రాజమహేంద్రవరం ఒప్పందం నెం. 31 ఎస్ఇ/ 2017-18 తేదీ 13-03-2018. | -- | లేదు | - |

| | | | | | |
|---|---|---|---|---|---|
| | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ప్యాకేజీ నెం.2 లోని 35.000 కి.మీ. నుండి 36.750 కి.మీ. వరకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ వేయడం, 17.950 కి.మీ. (51 ఎమ్) & 27.853 కి.మీ. (30 ఎమ్) వద్ద అండర్ టన్నెల్ నిర్మాణ అంతరాలు. | మెస్సర్స్ సగ్గిటల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, జంగారెడ్డిగూడెం ఒప్పందం నెం.30ఎస్ఇ/2017-18, తేదీ 13.3.2018. | -- | లేదు | |
| | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ప్యాకేజీ నెం.2 లోని 14.925 కి.మీ. వద్ద అండర్ టన్నెల్ నిర్మాణం. | మెస్సర్స్ నిపున్ కన్‌స్ట్రక్షన్స్, హైదరాబాద్, ఒప్పందం నెం. 27ఎస్ఇ /2016-17 తేదీ 03.06.2016. | -- | లేదు | ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాలను చేరుకోవడానికి మిగిలిన పనిని పూర్తి చేయాలని ప్రధాన ఏజెన్సీకి సూచించబడింది. అయితే, లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన పురోగతిని సాధించడానికి అవసరమైన యంత్రాలు, కూలీలు, సామగ్రిని ఏజెన్సీ సిద్ధం చేయలేకపోయింది. |
| | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ప్యాకేజీ నెం.2 లోని 17.950 కి.మీ. వద్ద అండర్ టన్నెల్ నిర్మాణం. | మెస్సర్స్ ఆర్ఎస్‌వీ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, ఒప్పందం నెం. 39 ఎస్ఇ/2016-17 తేదీ 28.09.2016. | -- | లేదు | |
| | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ప్యాకేజీ నెం.2 లోని 18.270 కి.మీ. వద్ద సింగిల్ లేన్ రోడ్ వంతెన నిర్మాణం (పాతది). | మెస్సర్స్ ఎవన్ఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, రాజమహేంద్రవరం ఒప్పందం నెం. 5 ఎస్ఇ/ 2016-17 తేదీ 21.05.2016. | -- | లేదు | |
| | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ప్యాకేజీ నెం.2, 60 (సి) క్రింద 18.270 కి.మీ. వద్ద సింగిల్ లేన్ రోడ్ వంతెన నిర్మాణం (కొత్త ఏజెన్సీల వర్క్ ఆర్డర్ జారీ చేయబడింది). | మెస్సర్స్ మాధవి కన్‌స్ట్రక్షన్స్, ఒంగోలు, ఒప్పందం నెం. 9 ఎస్ఇ/2016-17 తేదీ 25.05.2016. | -- | లేదు | |
| | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ప్యాకేజీ నెం.2 లో 18.950 కి.మీ. వద్ద అండర్ టన్నెల్ నిర్మాణం. | మెస్సర్స్ శ్రీ విజేత ఇంజనీర్స్, విజయవాడ, ఒప్పందం నెం. 24 ఎస్ఇ/2017-18 తేదీ 13.11.2017. | -- | లేదు | |
| | 16.500 కి.మీ. వద్ద సూపర్ పాసేజ్. | మెస్సర్స్ మాధవి కన్‌స్ట్రక్షన్స్, ఒంగోలు, ఒప్పందం నెం. 10ఎస్ఇ/2016-17 తేదీ 25.05.2016. | -- | లేదు | |
| | 23.312 కి.మీ. వద్ద సింగిల్ లేన్ రోడ్డు వంతెన నిర్మాణం. | మెస్సర్స్ ఆర్ఎస్‌వీ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, ఒప్పందం నెం.39 ఎస్ఇ/ 2016-17 తేదీ 28.09.2016. | -- | లేదు | |
| | 24.736 కి.మీ. వద్ద సింగిల్ లేన్ రోడ్డు వంతెన నిర్మాణం. | మెస్సర్స్ ఆర్ఎస్‌వీ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, ఒప్పందం నెం. 39ఎస్ఇ/2016-17 తేదీ 28.09.2016 | -- | లేదు | |

| | | | | | |
|---|---|---|---|---|---|
| | 26.100 కి.మీ. వద్ద అండర్ టన్నెల్. | మెస్సర్స్ ఆర్ఎస్‌వీ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, ఒప్పందం నెం.39 ఎస్ఇ/ 2016-17 తేదీ 28.09.2016 | -- | లేదు | |
| | 27.274 కి.మీ. వద్ద సింగిల్ లేన్ రోడ్డు వంతెన నిర్మాణం. | మెస్సర్స్ ఆర్ఎస్‌వీ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, ఒప్పందం నెం. 39ఎస్ఇ/2016-17 తేదీ 28.09.2016 | -- | లేదు | |
| | 29.057 కి.మీ. వద్ద సింగిల్ లేన్ రోడ్డు వంతెన నిర్మాణం. | మెస్సర్స్ శ్రీ విజేత ఇంజనీర్స్, విజయవాడ, ఒప్పందం నెం. 25 ఎస్ఇ/2017-18 తేదీ 13.11.2017 | -- | లేదు | |
| | 30.806 కి.మీ. వద్ద అండర్ టన్నెల్. | మెస్సర్స్ ఆర్ఎస్‌వీ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, ఒప్పందం నెం.39ఎస్ఇ/2016-17 తేదీ 28.09.2016 | -- | ఎన్ఓ | |
| | 27.274 కి.మీ. వద్ద సింగిల్ లేన్ రోడ్డు వంతెన నిర్మాణం (కొత్త). | మెస్సర్స్ ఆర్ఎస్‌వీ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, ఒప్పందం నెం. 39ఎస్ఇ/2016-17 తేదీ 28.09.2016 | -- | లేదు | |
| | 30.806 కి.మీ. వద్ద అండర్ టన్నెల్ (కొత్త). | మెస్సర్స్ శ్రీ కృష్ణ ఇంజనీరింగ్, రాజమహేంద్రవరం, ఒప్పందం నెం. 8 ఎస్ఇ/ 2017-18 తేదీ 03.07.2017 | -- | లేదు | |
| | 31.100 కి.మీ. వద్ద సింగిల్ లేన్ రోడ్డు వంతెన నిర్మాణం. | మెస్సర్స్ మాధవి కన్‌స్ట్రక్షన్స్, ఒంగోలు, ఒప్పందం నెం.11 ఎస్ఇ /2016-17 తేదీ 25.05.2016 | -- | లేదు | |
| | 38.199 + 0.001 కి.మీ. వద్ద సూపర్ పాసేజ్. | శ్రీ ఎన్.చైతన్య మురముల్లా (వీ), ఒప్పందం నెం. 28ఎస్ఇ /2017-18 తేదీ 08.02.2018 | -- | లేదు | |
| | 38.947 కి.మీ. వద్ద సింగిల్ లేన్ రోడ్డు వంతెన నిర్మాణం. | మెస్సర్స్ శ్రీ కృష్ణ ఇంజనీరింగ్, రాజమహేంద్రవరం, ఒప్పందం నెం. 31ఎస్ఇ/ 2016-17 తేదీ 29.06.2016 | -- | లేదు | |

| | | | | | |
|---|---|---|---|---|---|
| | 38.199 + 1.154 కి.మీ. వద్ద అఫ్ టేక్ స్లూయిస్/క్రాస్ రెగ్యులేటర్. | మెస్సర్స్ శ్రీ కృష్ణ ఇంజనీరింగ్, రాజమహేంద్రవరం, ఒప్పందం నెం. 32 ఎస్ఇ / 2016-17 తేదీ 13.03.2018 | -- | లేదు | |
| ప్యాకేజీ -3 | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఆర్ఎమ్సీ ప్యాకేజీ 3 యొక్క దర్యాప్తు, అంచనా రూపకల్పనతో సహా మట్టి తవ్వకం పని, కట్టను ఏర్పరచడం, సీఎమ్&సీడీ పనుల నిర్మాణం. | మెస్సర్స్ హిందుస్తాన్ కన్స్ట్రక్షన్స్ లిమిటెడ్, ముంబై ఒప్పందం నెం. 11ఎస్ఇ/ 2004-05 తేదీ 23.10.2004. | -- | లేదు | లేదు |
| ప్యాకేజీ - 3 అదనపు పని | ప్యాకేజీ నెం. 3 యొక్క 50.450 కి.మీ. వద్ద సర్ప్లస్ ఎస్కేప్ రెగ్యులేటర్ (ఎస్కేప్ రెగ్యులేటర్, వెల్ సిఫోన్ & డ్రాప్, ఎస్కేప్ ఛానల్‌ను కలిగి ఉంటుంది). | మెస్సర్స్ హెచ్ఇఎస్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, హైదరాబాద్, ఒప్పందం నెం.29 ఎస్ఇ/ 2018-19 తేదీ 11.10.2018. | -- | లేదు | ఇది అదనపు నిర్మాణం. (అసలు పని పరిధిలో లేదు) |
| ప్యాకేజీ - 4 | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఆర్ఎమ్సీ ప్యాకేజీ 4 యొక్క దర్యాప్తు, రూపకల్పన అంచనాతో సహా తవ్వకం, కట్టను ఏర్పరచడం, సీఎమ్ & సీడీ పనుల నిర్మాణం, 71.500 కి.మీ. నుండి 105.100 + 2.465 కి.మీ. వరకు. | మెస్సర్స్ జై ప్రకాష్- గాయత్రి (జేపీ), హైదరాబాద్, తేదీ 23.10.2004. | -- | లేదు | |
| పీఐపీఆర్ఎమ్సీ ప్యాకేజీ నెం. 4 – 60 (పీ) | ప్రధాన కాలువ కట్టను ఏర్పరిచే మట్టి తవ్వకం పని 101.700 కి.మీ. నుండి 105.1001.450 కి.మీ. 105.1002.400 కి.మీ. నుండి 105.1002.465 కి.మీ. వరకు పూర్తయింది, 98.200 కి.మీ. నుండి 105.1002.465 కి.మీ. వరకు సిమెంట్ కాంక్రీట్ ఎమ్10తో ప్రధాన కాలువ లైనింగ్, 96.250 కి.మీ. సూపర్ పాసేజ్ 97.125 కి.మీ. నిర్మాణం, పీఐపీ కుడి ప్రధాన కాలువ యొక్క రెండు క్రాస్ రెగ్యులేటర్లు, ఆరు అఫ్ టేక్ స్లూయిస్‌ల మెకానికల్ వస్తువుల నిర్మాణాలు పూర్తయ్యాయి. | మెస్సర్స్ జై ప్రకాష్- గాయత్రి (జేపీ), హైదరాబాద్, తేదీ 23.10.2004. | మెస్సర్స్ జీవీఆర్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్, ఒప్పందం నెం. 34 ఎస్ఇ/2016-17, తేదీ 30.06.2016. | లేదు | 2016 ఖరీఫ్ సమయంలో కృష్ణా డెల్టా ఆయకట్టును కాపాడటానికి పీఐపీఆర్ఎమ్సీ ద్వారా గోదావరి నది నీటిని కృష్ణా నదిలోకి మళ్ళించడానికి ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాన్ని సాధించడానికి పీఎస్ ఏపీడీఎస్ఎస్‌కు యొక్క 60(పీ) క్రింద అసలు ఏజెన్సీ పరిధి నుండి పనిని తొలగించి నామినేషన్ ప్రాతిపదికన ఏజెన్సీకి అప్పగించారు. |
| | పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఆర్ఎమ్సీ ప్యాకేజీ నెం. 4 యొక్క ఎస్కేప్ రెగ్యులేటర్ 98.100 కి.మీ., క్రాస్ రెగ్యులేటర్ 105.100. + 2.465 కి.మీ కోసం హెడ్ రెగ్యులేటర్ గేట్లు, హాయిస్ట్ ఏర్పాట్లు, ఆపరేషన్ ఏర్పాట్లు సరఫరా, ఫిక్సింగ్. | | మెస్సర్స్ హెచ్ఈఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ 33 ఎస్ఇ/2016-17, తేదీ 30.06.2016. | లేదు | |
| పీఐపీఆర్ఎమ్ సి ప్యాకేజీ నెం. 4 – 60 (పీ) | పీఐపీఆర్ఎమ్సీ ప్యాకేజీ నెం. 4, 60 (పీ) యొక్క పనులు 97.920 కి.మీ. | | మెస్సర్స్ హెచ్ఈఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, | లేదు | |

| | | | | | |
|---|---|---|---|---|---|
| | వద్ద అండర్ టన్నెల్ యొక్క మిగిలిన పనుల నిర్మాణం. | | ఒప్పందం నెం.08 ఎస్ఇ/2018-19, తేదీ 12.07.2018. | | |
| | పిఐపిఆర్ఎమ్‌సి ప్యాకేజీ నెం.4 60(పి) పనులు, 105.100 + 2.465 కి.మీ. వద్ద ఆఫ్ టేక్ స్లూయిస్ నిర్మాణం. | | మెస్సర్స్ హెచ్ఈఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్,హైదరాబాద్, ఒప్పందం నెం.01 ఇ ఇ/2018-19, తేదీ 21.07.2018. | లేదు | |
| | పిఐపిఆర్ఎమ్‌సి ప్యాకేజీ నెం.4, 60 (పి) పనులు, 79.362 కి.మీ. వద్ద అండర్ టన్నెల్ యొక్క మిగిలిన పనుల నిర్మాణం. | | మెస్సర్స్ హెచ్ఇఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్,హైదరాబాద్, ఒప్పందం నెం. 35 ఇఇ/2016-17, తేదీ 07.12.2018. | లేదు | |
| | పిఐపిఆర్ఎమ్‌సి ప్యాకేజీ నెం.4, 60 (పి) యొక్క పనులు 88.950 కి.మీ. వద్ద అండర్ టన్నెల్ యొక్క మిగిలిన పనుల నిర్మాణం. | | మెస్సర్స్ హెచ్ఈఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ 36 ఎస్ఇ/2018-19, తేదీ 07.12.2018. | లేదు | |
| | పిఐపిఆర్ఎమ్‌సి ప్యాకేజీ నెం.4, 60 (పి) యొక్క పనులు 103.100 కి.మీ. వద్ద అండర్ టన్నెల్ యొక్క మిగిలిన పనుల నిర్మాణం. | | మెస్సర్స్ హెచ్ఈఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్,హైదరాబాద్, ఒప్పందం నెం.37 ఎస్ఇ/2018-19, తేదీ 07.12.2018. | లేదు | |
